నారాయణరావు



అడివి బాపిరాజు

నారాయణరావు

ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారి బహుమతినందిన నవల

అడివి బాపిరాజు

త్రివేణి పబ్లిషర్సు

మచిలీపట్టణము - మదరాసు 1

ఈ కథా, కథలోని పాత్రలూ
కేవలం కల్పితములు

ఏడవ ముద్రణ, 1963

మూల్యము : రు. 6.00

త్రివేణి ప్రెస్
మచిలీపట్టణము

అర్పణము

పితృపాదులు పూజ్యులు
నా కళాజీవితానికి
మోసులు వెలార్చిన
కీర్తి శేషులు
శ్రీ అడివి కృష్ణయ్యామాత్యులవారి
దివ్యస్మృతికి

అంజలి

ఈ నవల ఉద్భవించడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు కారకులు. వారికి నా కృతజ్ఞతాపూర్వక వందనాలు.

ఈ నవలారచనలో నాకు ఉత్సాహం కలిగించిన నా ప్రాణ మిత్రులు డాక్టరు చెన్నాప్రగడ సుబ్బారావు, ముష్టి లక్ష్మీ నారాయణ, ములుకుట్ల సుబ్బారాయుడు, మంచాళ జగన్నాథ రావు, కాళీపట్నపు శేష శాయిగార్లకు నా ప్రేమాంజలులు.

ఈ కావ్యాన్ని సరిచూచిన ప్రజ్ఞామూర్తి, మిత్రుడు కాటూరి వేంకటేశ్వరునికి నమస్కారాలు.

ఈ నాకృతిని ప్రథమంలో తమ దినపత్రికలో ప్రచురించిన ఆంధ్రపత్రికాధిపతులకు ఎంతయో కృతజ్ఞుణ్ణి.

ఇది అచ్చు వేయించుటలో నాకు వేవిధాల సహాయం చేసిన మిత్రులు, యువకులు పెనుమర్తి కామేశ్వర రాయనికి, తెలికిచర్ల వెంకటరత్నంగారికి, మాధవపెద్దికవికి, మారిన సుబ్బారావుగారికి, కలగర నాగభూషణం చౌదరిగారికి, శ్రీ శివలెంక శంభుప్రసాద్ గారికి నా నమస్సులు,

ఈ నవలను ఒకనాడు పాఠ్యగ్రంథముగా నిర్ణయించిన ఆంధ్ర, చెన్నపురి విశ్వవిద్యాలయాధికారుల ప్రోత్సాహోపకారముల కెంతయు కృతజ్ఞుడను.

అడివి బాపిరాజు

విషయ సూచిక

ప్రథమ భాగము

౧

"నీకు పెండ్లి అయినదా?"

"ఏదియో పడిపోయినట్లు అలపెరుంగని మహావేగమున ఈ లోక మంతయు ఎచటి కిట్లు పరువెత్తిపోవుచున్నది! కనులు మూసికొన్న చో వెనుక కేగుచున్నట్లు తోచు నీ లోకము, నిజముగా ముందుకే పోవుచున్నదా? ఈ ధూమశకట మతిరయమున బరువిడుచుండ, ఆ వృక్షములు, పొదలు వెనుక కేగుట యేమి! ఆ తారకలతోడి, మబ్బులతోడి మహాగగనము కదలకుండుటయేమి! ఇది యంతయు భ్రమయనుకొని నవ్వుదమా, నిజమనుకొని అచ్చెరువందుదమా!"

"అనేక కోటి యోజనముల దవ్వున దీపకళికలవలె మినుకుమినుకుమను నా నక్షత్రములు, ఈ గ్రహగోళములు, ఈ మట్టిముద్దపై ప్రాకులాడు మనుజ కీటకములకొఱకే దివ్వటీలు పట్టుచున్నవా! కోటి సూర్యోజ్జ్వలములగు తారకలు, వాని నాశ్రయించిన గ్రహములు నివియెల్ల ఎవరి నిట్లు వెదకికొనుచు పోవుచున్నవి? ఛందస్సులను దర్శించిన మన మహర్షులు ఈ పరమార్థమును ఎంత చక్కగా గానము చేసిరి!

"ఈ తారకలుకూడ సంగీతము పాడునట. అవి ఏ మహాభావమును గానము చేయుచున్నవో! బెథోవిన్, త్యాగరాజు మొదలైన గాయకులు ఆ మహాభావము నేనా తను గాంధర్వమున ప్రతిఫలింపజేయుచున్నది?"

వ్యక్తావ్యక్తమగు తన యాలోచనముల నుండి మరలి నారాయణరావు రైలు కిటికీ నుండి తల వెనుకకు దీసి, ఆ యింటరుతరగతిలో మైమరచి నిద్రించుచున్న స్నేహితుల పారజూచినాడు. మెయిలు అమిత వేగముతో కృష్ణానది వంతెన దాటి బెజవాడ స్టేషను సమీపించినది.

'ఒరే సుషుప్తి కుమాళ్లు! లెండి! బెజవాడ వచ్చాము. ఒకటే నిద్దరా! లెండర్రా!' అని నారాయణరావు తన స్నేహితుల నిద్దురలేపినాడు. కన్నులు నులుముకొని, చిరునవ్వునవ్వుచు పరమేశ్వరమూర్తి లేచి, ఇటు నటు పరికించి, ఆవులింత లడచుకొనుచు, ఒడలు విరిచికొనుచు 'ఓహో డాక్టరుగారు! లేవరోయి! నిద్ర పారిపోయేందుకు కాఫీఅరఖు, ఇడ్లీమాత్ర సేవిద్దువు గాని' అని రాజారావును ఒక చరపు చరచినాడు.

రాజారావు లేచి, కోపము నభినయించుచు, 'ఓయి బక్కవాడా నీవటోయి!' అని పరమేశ్వరుని ప్రక్కమీద పడవైచి యదిమిపట్టినాడు.

'ఓరి పాపిష్టిగ్రహం! బక్కాళ్లమీదా నీ బాహుబలం!' అని ప్రక్క మీద దొర్లుచున్న రాజేశ్వరుడు లేచి, రాజారావును గబగబ రైలు తలుపు వైపుకు గెంటుకొనిపోయినాడు. 'నారాయణా! అలారం లాగరా! హత్య, హత్య! పోలీసు పోలీసు' అంటూ లక్ష్మీపతి గొలుసును లాగబోయినట్లు నటించినాడు.

'మీరంతా ద్వంద్వయుద్ధాలలో వీరధర్మం నిర్వర్తించండి, నేను ముఖప్రక్షాళనాది ప్రాతఃకాలోచితకృత్యంబుల నిర్వర్తించెదను గాక!' అని నవ్వుచు నారాయణరావు

బిఱ్ఱబిగిసికొని గుఱ్ఱుపెట్టి నిద్రపోవుచున్న మరియొక మిత్రుని 'అరే మహమ్మదు ఇబిన్ ఆలం సుల్తాన్ అబ్దుల్ రజాక్ పాదుషాహ్ సాహెబు వారూ! లెండి. మీకీ వైతాళికులు లేరు! రాజ్యం గీజ్యం బూది అయితున్నాయి జహాఁపనాహ!' అని లేపినాడు.

ఆలం నిద్దుర లేచి 'ఏమి తొందర రా!' అనుచు మొగము కడుగుకొనుటకు సిద్ధమయ్యెను. నారాయణరావు తన పనులు నిర్వర్తించుకొని ఉపహారములు కొనిరా వెడలిపోయి నాడు.

ఆ యువకమండలి అంతయు పక్కలు చుట్టుకొని, సామాను సర్దుకొను లోపల నారాయణ వచ్చి 'ఏమర్రో ఇడ్లీ, ఉపమా, కాఫీ, పూరీ, ఉర్లకళంగ్ ప్రత్యక్షమౌతున్నాయి. సేవించటానికి భక్తులందరూ సిద్ధంగా ఉన్నారా?' అని హెచ్చరించి, అవి తెచ్చిన కూలీకడనుండి అందిపుచ్చుకొని, ఆయా సరకులను బల్లలపై నమరింప ప్రారంభించినాడు.

లక్ష్మి: నాకు 'చా' తెచ్చావురా?

రాజా: లేదు రా; 'చీ' తెచ్చాడు.

ఆలం: తురకవాణ్ణి నాకే 'చా' అక్కర్లేదు, యీడికి ఎందుకోయ్ 'చా'? తుమ్ చీనావాడా ఏమిరా భాయ్?

పక్క బండివారు మెయిలిక్కడ అరగంటవరకు ఆగుననియు, గవర్నరు గారి స్పెషలు చెన్నపట్టణము వెళ్లుచున్నదనియు చెప్పికొనుట విని, 'ఓరి నాయనా! చెట్లు మొలవాలి రా, బాబూ!' అనుకొనుచు మన మిత్రులందరు ఉపాహారముల నారగించి కాఫీ తాగినారు. 'త్రీకాజిల్సు సిగరెట్లడబ్బాలు తీసి, సిగరెట్లు వెలిగించి ధూమపానలోలు లైనారు.

నారాయణ రావు 'పుస్తకాలు ఏవన్నా పట్టుకువస్తానురా? అని హిగిన్ బాదమ్ పుస్తక విక్రయశాలకడకు విసవిస నడచిపోయినాడు. గవర్నరు గారి ప్రయాణసందర్భమున గావలియున్న పోలీసు వారు ఆయుధోపేతులై అన్ని వైపుల పహరా ఇచ్చుచున్నారు. ఫలహారపుశాలకడ వారిబండి ఆగును. కాన అచ్చట నేరును రాకుండ బందోబస్తు చేసినారు. గవర్నరు గారికి స్వాగత మిచ్చుటకు కృష్ణా కలెక్టరుగారు, పురప్రముఖులు, ఉద్యోగస్థులు మొదలగువారు పూలదండలతో, సన్మానపత్రములతో నిరీక్షించుచున్నారు.

నారాయణరా వీదృశ్యమంతయు జూచుచు పుస్తకశాలకడ నాలోచనా నిమగ్నుడై నిలుచుండిపోయినాడు. నారాయణరా వాజానుబాహుడు, అయిదడుగుల పదనొకండంగుళముల పొడవువాడు. బలసంపదకు నెలవైనవాడు. ఉజ్జ్వల శ్యామలుడు, చిన్నవై, తీక్ష్ణమైన లోచనములు. తీరై, సమమై కొంచెము పొడుగైన ముక్కు దూరస్థములగు నా కన్నుల మధ్య ప్రవహించి, ధనుస్సువలె తిరిగిపోయిన పై పెదవికి నాతిదూరమున నాగింది. అతని నోరు సుందరమై పద్మినీజాతి లలనా రత్నమునకు వన్నె తీర్చునట్టిదై యున్నది. ఆ లోపమును ఉత్తమనాయక లక్షణమగు నామ్రచిబుకము దృఢరేఖాచకితమై ధీరత్వము పుంజీభవింప జేయుచు తీర్చివేసినది.

నారాయణరావు కుడి చేతి చూపుడు వ్రేలితో నడుగు పెదవిని నొక్కుకొనుచు, బొమలు ముడిచి, విశాలఫాలము, వీచికల నిండిన పాలసముద్రమట్లయి పోవ, పరధ్యానములో మునిగిపోయినాడు.

ఉన్నట్లుండి తన్ను ఎవరో తీక్ష్ణదృష్టుల చూచుచున్నట్లు కాగా, ఆలోచనలు మరల్చుకొని

ఎదుట నిలుచుండి తన్ను వింత చూపులతో గమనించు నొక పెద్దమనుష్యుని పరికించినాడు. నారాయణరావు తనలో నవ్వుకొనుచు ప్రక్కనున్న పుస్తకముల గమనించుచుండ, ఆ నూతనవ్యక్తి 'ఆగండి' అని చేయి యెత్తినాడు. బంగారపు పొన్ను కర్ర విలాసముగ నాడించుకొనుచు ఆ మూర్తి నారాయణరావుకడకు వచ్చెను.

'మీ పే రేమిటండి?'

'నారాయణరావు.'

'ఇంటి పేరు?'

'తటవర్తి వారు.'

'మీ గోత్రం?'

'కౌండిన్యస.'

'మీకు వివాహమైందాండి?'

'...........'

ఈ సంభాషణమంతయు ఇంగ్లీషులోనే జరిగినది.

'అయ్యా! నారాయణరావుగారూ! నా కీ అనవసరమైన చోద్యం ఎందుకని మీ రనుకుంటున్నా రేమో! మిమ్మల్ని చూడగానే మీకు వివాహం కాలేదని నా అంతరాత్మ చెప్పింది. అందుచేత ఈ వెర్రి ప్రశ్నలు వేసినాను. వీరెవరా అని మీరు అనుకోవచ్చు. గవర్నరుగారి రాకకు వేచిఉన్న బృందంలో నేనొకణ్ణి. నన్ను తల్లాప్రగడ లక్ష్మీసుందర ప్రసాదరావు అంటారు. నేను మిమ్మల్ని అడిగిన ఆఖరి ప్రశ్నకు జవాబు ఇవ్వవలెనని నా మనవి. నా ఊహ సరియైనదా కాదా అని తెలిసికొన కుతూహలపడుతున్నాను.'

'నాకు వివాహం కాలేదండి' అని చిరునవ్వుతో నారాయణరావు జవాబు చెప్పినాడు. ఈయనయేనా విశ్వలాపురం జమీందారుగారు, రాజధాని శాసనసభలో మెంబరు, అనుకున్నాడు నారాయణ రావు.

'గవర్నరుగారి బండి ఇంకా పదిహేను నిముషములవరకూ రాదులెండి. ఇప్పుడెక్కడినుండి వస్తున్నారు?' అని జమిందారుగారు ప్రశ్నించారు.

'చెన్నపట్టణాన్నుంచి స్నేహితులూ నేనూ కలిసివస్తున్నాం. సెలవిప్పిస్తారా?' అని నమస్కరించి, మర్యాదలువెలుగు చూపులు మరలించి పుస్తకశాల చేరినాడు.

స్నేహితులందరును ప్లాటు ఫారంపై తిరుగుచున్నారు. గవర్నరుగారిని చూచుటకు రాజమహేంద్రవరంలో వీలు ఏలలేకపోయినదో వీరికి? ఈయన శాసనసభలో స్వరాజ్యపార్టీలో జేరి, నిపుణతతో ప్రభుత్వతంత్రమును చిందర వందరచేయుచు తనకు తోచినవిధమున దేశసేవ జేయుచున్నాడు. నిజమే కాని ఎవరయినను శాసనసభలకు వెళ్ళి చేయదగిన దేమున్నది? ఈ రాజనీతి నిపుణుడు అంత అప్రౌఢముగా తన్ను ప్రశ్నించినాడేమి? అని అనుకొనుచు నారాయణరా వేవో కొన్ని నవలలు, తదితర గ్రంథములు కొని తన పెట్టె జేరినాడు.

మిత్రు లెవ్వరును పెట్టెలో లేరు. నారాయణునకు మనస్సు పుస్తకముల మీద లగ్నము కాదు. జమీందారుడు, ఆశాకాంతులు వెలుగు ఆతని కన్నులు, దీనమైన అతని ఆఖరిప్రశ్న తలంపుకు వచ్చినవి. ఆయనకడ ఎంత రాజఠీవి యున్నది! స్వార్థపరులై అపహాస్యపు జీవితముల జీవించు అనేకులవలె గాక, ఈయన స్వరాజ్య సముపార్జన మహాయజ్ఞమునందు తానును ఒక ఇంధనమును అప్పుడప్పుడు వేయుచునే యున్నాడు.

'ఏడీ నారాయడు! ఓరి ఇడుగోరా!' అని గబగబ స్నేహితులందరు వచ్చి పెట్టె నెక్కినారు.

౨
రైలు కూడా తథాస్తన్నది?

'ఒరే నారాయడూ! ఏమైపోయినావురా నువ్వు? గవర్నరుగారి నాహ్వానించి సమ్మానపత్రాలు సమర్పించి సాగనంపివచ్చాము మేమంతా. నువ్వు జాతీయవాదివి. అవును. గవర్నరుగారికి దర్శనమివ్వవు. ఆ మాట మరచి పోయినాం' అంటూ రాజేశ్వరరావు నారాయణుని చేతిలోని గ్రంథము అందిపుచ్చుకొని పేర్లు చూచుచు 'అన్నట్లు మా జమీందారుగారు గవర్నర్ని ఇంటర్వ్యూ చేశారిక్కడ. ఆయనకు కనిపించావటగా నీవు!' అని ప్రశ్నించెను.

అంతలో పరమేశ్వరు డందుకొని 'అవును, ఆయన ఏమిటో నీ భోగట్టా తెగ విచారిస్తున్నాడు!?'

నారాయణరావు చిరునవ్వుతో 'మరి నేనేమి సామాన్యుడ ననుకున్నావుటరా! నేను కూడా ఆయనకు ఇంటర్వ్యూ ఇచ్చాను' అనెను.

రాజా: నువ్వు పెటగోనియనువురా బాబూ! సామాన్యుడ వెందుకవుతావు?

రాజే: నీ గోత్రం కూడా అడిగాడు రా! ఎందుకో?

నారా: పెటగోనియనులకు గోత్రము ఉండదనుకున్నాడేమో?

రాజే: లక్ష్మీపతి చెప్పాడు, మీది కౌండిన్యసగోత్రమని.

ఆలం: కాదురా భాయి. ఆయన నీకీ నిఖ్కా సేస్తాడు రా.

నారా: నీ మొఖం, ఆయన సాయిబు గాదురా, మొగాడికి నిఖ్కా చేయడమా!

రాజే: అవునురోయి! ఆయనకో కూతురుందిరా. ఆ పిల్ల కింకా పెళ్ళి కాలేదు. నిజమే.

పర: ఇక నేమి! నారాయుడి రొట్టె నేతిలో పడింది.

రాజా: నారాయుడి రొట్టెకాదు, నాదీని. నేనింక హిజ్ హైనెస్ విశ్వలాపురం జమీందారుగారికి స్టేటు డాక్టర్నవుతాను.

రాజే: ఒరే బాబూ! నారాయుడు! నన్ను కూడా కాస్త కని పెట్టి ఉండాలిరా. మామగారికి సిఫార్సుచేసి నన్నుకూడా స్టేటు ఇంజనీరుగా పారేయించు.

నారా: ఏడిశారులే వెధవల్లారా! మీలో ఒకడూ ఇంకా పరీక్షకైనా కూర్చోలేదు. అప్పుడే ఉద్యోగాలు! మామగారి యెస్టేటులో మిమల్నెవళ్లనీ అడుగైనా పెట్టనివ్వను, ఒక్క పరమేశ్వరుణ్ణిమట్టుకు ఆస్థానకవిని చేస్తాను.

రాజే: సెబాస్! చూస్తావేమిరా ఇంకా, పరమేశ్వరుడూ! ఏదీ రాజ జామాతమీద ఒక కీర్తన పాడరా!

పరమేశ్వరమూర్తి లేచినిలిచి ఆశీర్వచనముద్ర పట్టి గొంతు సవరించు కొంటూవుండగా, రాజేశ్వరరావు 'ఆగరా పరమాయి! మరచిపోయాను. బంగారపు బొమ్మ, పచ్చకర్పూరపు బరిణలాంటి పెళ్ళికూతుర్ని విడిచిపెట్టి, యీ మొరటు నారాయుడిమీద పాటపాడటానికి వల్లగాదు. చేయరా, ముందు వధుకీర్తనం చేయి' అన్నాడు.

'అచ్చా! సభవారి అనుజ్ఞా?' అని అడిగి పరమేశ్వరమూర్తి,

'యెంకివంటి పిల్ల లేదోయి, లేదోయి!

యెంకి నావం కింక రాదోయి, రాదోయి!'

అని పాడునప్పటికి రాజారావు, 'చాల్లేవోయ్, నీ అశుభప్పాటలు' అని వారించినాడు. పరమేశ్వరుడు తెల్లబోయి,

'నీతోటె ఉంటాను నాయుడు బావా!

నీమాటె యింటాను నాయుడు బావా!'

అని అందుకున్నాడు.

'బాగుందిరా. 'మంగళాంతాని కావ్యాని' అన్నారు. తథాస్తు అనండోయి సభవారు' అన్నాడు రాజారావు.

సభవారితోపాటు రైలుబండికూడ 'తథాస్తు' అన్నట్లుగా కూత కూసినది. గార్డుకూడ ఈల వేసి జెండాతోడి చేయెత్తి దీవించినాడు. సమయానికి ఊడిపడినట్లుగా జమీందారుగూడా పరుగుపరుగున వచ్చి బండిలో నెక్కినాడు.

కేకిసలు కొట్టుచున్న మన మిత్రులందఱు నదరుపాటుగ గనులప్పగించి చూచుచుండ, రాజేశ్వరరావు లేచి నిలిచి 'దయ చేయండి, దయ చేయండి' అంటూ చోటు చేసినాడు. జమీందారు గారు కూరుచుండి 'నాబోటి వృద్ధులు చెదలుపట్టకుండా ఉండాలంటే అప్పుడప్పుడు మీవంటి పడుచు వాళ్ళతో సావాసం చెయ్యాలి. మిమ్మందఱిని చూస్తే నాకు తిరిగి యౌవనం వచ్చినట్లుగా ఉంది. మీరంతా ఒక్కసారిగా బయల్దేరారు, అందరూ ఒక కాలేజీలోనే చదువుతున్నారు కాబోలు. రాజేశ్వరరావుగారు మా ఊరివాడు కావడంచేత నే నెఱుగుదును. తక్కిన అందరూకూడా రాజమండ్రికేనా? ఇంకా పైకి పోయేవారా?' అన్నారు.

రాజే: లేదండీ, అందరూ తలో ఊరి వాళ్ళూ, తలో కాలేజీ వాళ్ళూను. ఇదిగో, మా నారాయుడు ఎఫ్. ఎల్. పరీక్షకు వెళ్ళాడు. ఆలంసాహెబు కూడా ఎఫ్. ఎల్. కే వెళ్ళాడు. ఆతడు రాజారావని, వేమూరివారు. వారిది కాకినాడ. ఆతను ఎమ్. బి., బి. ఎస్. నాల్గోయేటి పరీక్షకు హాజరైనాడు. అడుగో అతడు పరమేశ్వరమూర్తి, వాడ్రేవువారి

చిన్నవాడు. ఆయన గ్రాడ్యుయేటు. కవి, చిత్రకారుడు, గాయకుడూను. ఇందాక మీకు కనిపించిన లక్ష్మీపతిది నిడమర్రు. ఇంటిపేరు నిడమర్తి వారే. ఆయన మా నారాయుడి బావగారు. ప్రైవేటుగా ఎఫ్. ఎ. పరీక్షకు హాజరైనారు. ఒక్క లక్ష్మీపతి తప్ప తక్కిన అందరమూ ఒక్కసారే రాజమండ్రిలో ఇంటరు చదివాము.

లక్ష్మి: రాజేశ్వరరావునాయుడు గారు మీకు తెలిసిన వారే కదండి. బి. ఇ. పరీక్షకు హాజరైనాడు. చాల సంపన్న గృహస్థుడూ, సరసుడూనూ.

జమీం: సరి సరి. ఆయన్ని నేను ఇంత నాటినుంచీ యెఱుగుదును. కాలేజీలు మూసి చాలారోజు లైనట్లుంది, ఇంత ఆలస్యంగా బయలుదేరినారేమి?

ఆలం: రాజారావు పరీక్షలు మొన్ననే ఆఖరైనాయండి. అందుకోసం మేమంతా మరి నాల్గుదినాలు నిలిచి ఏవో సినిమాలతో కాలక్షేపంచేసి బయల్దేరాము.

జమీం: తక్కిన పరీక్షల్లో ఎట్లాఉన్నా, మనవాళ్ళు లా కాలేజీలో చాలా మేటిలనిపించుకొంటున్నారు..

రాజే: మా నారాయణ రావు 'లా' ఆత్మవికాసానికి పరమశత్రువంటాడు.

జమీం: ఏమండీ నారాయణరావు గారూ! అయితే మీరు గాంధీ మతస్థులా? నారాయణరావు సంభాషణప్రియుడయ్యు మితభాషి. తన హృదయానికి పులకరాలు కలిగించు చర్చ వచ్చినచో, పట్టుదలతో యుక్తులతో గంభీరమైన విద్యాప్రౌఢితో కవిత్వమువలె, గీతమువలె ఉపన్యసింపగలడు. సంభాషణలో నెదుటి వానిని చెరిగివేయగలడు. అప్పు డాతని సహజవినయసంపద మాయమగుట కూడ నొకచో సంభవించును. కొరడాకొనలవలె చురుక్కుమనిపించును. అపహాస్యరసము నంజుడు చూపును. ఎన్ని విషయములైనను అలంకారములతో, ఉదాహరణలతో, భావనాపథములకు నెత్తి వేయుచు మాట్లాడగలడు. కాని తనకు గౌరవాస్పదులగు పెద్దలన్న యెట్టి వాదములకు బోడు.

లక్ష్మి: మా బావగారి తరఫున నన్ను కొంచెం వాదించనీయండి. అతని అభిప్రాయాల్నే నేను మనవి చేస్తాను. అత ననేది ... ఇప్పుడు దేశంలో విజృంభించియున్న 'లా' ధర్మదూరమంటాడు. సత్యానికి చాలా దూరమంటాడు. అసత్యం కలపందే నిజం కూడా నెగ్గదంటాడు. సాధారణంగా నిజం అసలు నెగ్గదంటాడు. ఇప్పుడుండే సాక్ష్య చట్టము, వ్యావహారిక చట్టాలూ చాలా దోషభూయిష్టాలనీ, అసలు ఆ తప్పు ప్రస్తుత కాలంలో 'లా' యొక్క తత్వం లోనే ఉందనీ, అలా ఉన్నంత కాలం 'లా' సత్యానికి వేలకొలది మైళ్ళ దూరంలో ఉంటుందనీ వాదిస్తాడు.

జమీందారుగారు తన హృదయము గ్రహించి నారాయణరావు సిగ్గుపడుచున్నాడని భావించుకొని, ఆతని మాట్లాడించక, ఇతరులతో ననేక విషయములు సంభాషించినారు.

మెయిలు వాయువేగముతో ఏలూరు వచ్చినది. జమీందారుగారు దిగి పోవుచు అందరితో తాను సెలవుతీసుకొనుచున్నాననియు, ఆనాటి స్నేహము మరల మరల తన కా యువకమండలి ప్రసాదించవలెననియు గోరినాడు.

'నేను మిమ్మల్ని ప్రార్థించేది మీరంతా ఈరోజున మా ఊరిలో మా యింటికడ నా ఆతిథ్యం స్వీకరించాలని.'

ఆలం: అయ్యా, నేను సంతోషముతో వచ్చేదే. మాది ఏలూరు. నేను వస్తున్నానని మా తమ్ముళ్ళు, చిన్న చెల్లెలు స్టేషనుకు వచ్చారదుగో. మా అమ్మ నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. నన్ను క్షమించండి.

జమీం: మిమ్మల్నెవర్నీ నేను బలవంతపెట్టను. ఎవరికి వీలుంటే వారు వస్తే చాలా సంతోషిస్తాను. నాకు ఏ సంగతీ గోదావరిస్టేషనులో చెప్పాలని కోరిక.

అని జమీందారుగారు లేచి, వారందఱు తనకొనర్చిన నమస్కారములకు ప్రతినమస్కారము లిడి, వెడలిపోవుచు, 'లక్ష్మీపతి గారూ, ఒకసారి నాతో వస్తారా, ఒక చిన్న పని ఉంది' అని పిలిచినారు.

లక్ష్మీపతి 'చిత్త' మని ఆయనవెంట వెళ్ళినాడు. దారిలో కనబడిన గార్డును చూచి జమీందారుగారు 'గార్డ్! వీరు నాతో మొదటితరగతిలో వస్తారు. కూడా వచ్చే ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినరుతో టికెట్టు విషయం చూడండి. నమస్కారము' అని లక్ష్మీపతి చేయిపట్టుకొని తన పెట్టెలోనికి గొనిపోయినాడు.

3
జమీందారుడు

విశ్వలాపురం జమీందారుగారైన లక్ష్మీసుందరప్రసాదరావుగారిది పేరెన్నికగన్న ఆఱువేల నియోగి కుటుంబము. హైదరాబాదు నవాబుగారి పరిపాలనలోనికి వచ్చిన రాజమండ్రి సర్కారు దగ్గర వెండి తలందాను, బంగారు పొన్నుకఱ్ఱ, ఇరువదియైదూళ్ళకు వీరమిరాసీలు, నాలుగు సంప్రతులకు బదస్తూలు, దివాణం పొందుతూ, 'నిశ్శంక మహాశంక సింహమాన సకలవిద్వజ్జన ప్రముఖ సంస్థిత' అని బిరుదుపొంది తల్లాప్రగడ నన్నయనాయని పౌత్రులు గౌరవం పొందినారు. ఆ వీరమిరాసీలు క్రమక్రమంగా చిన్న జమీగా పరిణమించినవి.

వారు నవాబులకు పన్ను కట్టుచుండిరి. వారి రాజకార్యనిపుణతకును వేగుదనమునకును, జమీ దక్షతతో పరిపాలించి యైశ్వర్యవంతముగ జేయుచున్నందుకును నవాబులు మెచ్చుకొని బంగారు తలందాను, రవ్వల ఒరగల నిశితకరవాలము, శ్వేతచ్ఛత్రము, బంగారు పల్లకీ, బిరుదునిశానీ లిచ్చి శతాశ్వికదళమునకు దళవాయిగా నొనరించిరి.

విశ్వలాపురం జమీ మొగలితుర్రు పరిపాలన క్రిందికి వచ్చినపిమ్మట నన్నయమంత్రి వంశీకుడైన తల్లాప్రగడ గజపతిరాజు మొగలితుర్రు వారికడ అమాత్యుడై రాజ్యము సర్వవిధముల విజృంభింపజేసెను. కలిదిండి మహాప్రభువు జగపతిరాయని స్వామి కార్యనిర్వహణదక్షతకు, స్వామిభక్తికి మిగుల సంతసించి, 'మహామంత్రి, రాజవంశోద్దీపక' అను బిరుదులు, రెండు గ్రామములతో దయ చేయించినారు.

అట్టి యుత్తమవంశమున జన్మించిన శ్రీ రాజా లక్ష్మీసుందరప్రసాదరావు, స్వకుల దీపకుడయి, సదాచార సంపన్నుడై నూతన విజ్ఞాన ప్రకాశమున తన హృదయమును గాంతిమంతము చేసికొని, పాశ్చాత్య విద్యయందును గడతేరినాడు. సంస్కృతమున బి. ఎ. పరీక్షయం దుత్తీర్ణుడయి ప్రసిద్ధ పండితుల పాదములకడ సంస్కృత భాషామృతము సేవించి, అమరభావ పులకితుడైనాడు. తాను జమీందారుడయ్యు రైతుల కష్టములు పటాపంచలయి, వారు బాగుపడిననే గాని భావిభారత భాగ్యోదయము కాదని నిశ్చయించి, పూర్వపు శాసనసభలకు నూత్న శాసనసభలకునుగూడ అధిక సంఖ్యాకులగు ప్రజలచే

ప్రతినిధిగ వరింపబడి ప్రభుత్వమునకు ప్రక్కలోని బల్లెమయి మెలగినాడు.

రాజనీతిశాస్త్రమున నాతడు న్యాపతి సుబ్బారావుపంతులుగారి ప్రియశిష్యుడు, మోచర్ల రామచంద్రరాయని ప్రియ స్నేహితుడు అయ్యు గాంధిగారి అసహాయోద్యమముచే దేశము విప్లవమున బడిపోవునని ఆయన నమ్మెడు. కావున శాసనసభలో స్వార్థపరులగు ప్రజాద్రోహులకు తన స్థానమయినను చిక్కకుండ చేయగలుగుటయే తాను చేయగల దేశ సేవయని నమ్మిన సత్పురుషు డాతడు.

లక్ష్మీసుందరప్రసాదరావుగారికి గంజాంజిల్లాలో నారికేళవలస జమీందారగు క్రొవ్విడి వీరబసవ రాజవరదేశ్వరలింగము గారు తమ ప్రథమ పుత్రిక వరదాకామేశ్వరీదేవి నిచ్చి వివాహము చేసినారు. వారి గర్భమును నిరువురు పుత్రికలు, నొక పుత్రుడు పవిత్ర మొనర్చినారు. ప్రథమ పుత్రిక శకుంతలా దేవిని నెల్లూరుజిల్లాలో నొక చిన్న జమీకి ప్రభువైన భావనారాయణరావు గారి ప్రథమ పుత్రుడు విశ్వేశ్వరరావుగారి కిచ్చి వివాహము చేసినారు.

కుమారరాజా విశ్వేశ్వరరావు చాల గర్వి. ఇంగ్లండు దేశమునకు బోయి ఆక్సుఫర్డులో ఎం. ఎ. పట్టమునంది, హిందూదేశమునకు వచ్చి, యుద్యోగుల నాశ్రయించి డిప్యూటీ తహసీల్దారు పదవి ప్రథమముననే సముపార్జించి, ప్రాపకముచే డిప్యూటీకలెక్టరుపీఠ మచిరకాలముననే యధివసించినాడు. తాను జమీందారు ననుమాట మరచిపోయి పై యుద్యోగులకడ వినయముగా సంచరించువాడు. బ్రిటిషు ప్రభుత్వము ఇండియాను వీడినచో నొక్క పురుగైన బ్రతుకదనియు, అత్యంత ఫలవంతము, నతి సుందరమునగు భారత భూమండల మెల్ల ఆసేతుహిమాచలము సహారా యెడారి అయిపోవుననియు నాతనికి భయము.

విశ్వేశ్వరరావు మామగారితో హిందూదేశాన నాగరికతయే లే దను చుండును. పాశ్చాత్యులు భారతభూమి మెట్టక పూర్వ మిచటివారెల్ల ఆఫ్రికా వాసులగు నీగ్రోలవలె ఒకరినొకరు చంపికొని తినుచుండిరనియు దన యభిప్రాయము వెలిపుచ్చుచుండును.

కోర్టులో నగ్నివర్షము కురిపించి యభ్యర్థులను న్యాయవాదులనుగూడ దూదివలె నేకి విడుచును. న్యాయ నిపుణములగు వాదముల నాత డర్థము చేసికొనలేక యుక్కిరిబిక్కిరియై తన తీర్పునందు వానిని జారవిడిచి తప్పుదారి బడి పై న్యాయాధికారిచే సన్న సన్నని చీవాట్లు తినుచుండును. అతని తాబేదార్లు అరచేత ప్రాణము లుంచుకొని మసలుచుందురు.

ఇంటిలో భార్యాభర్తలకు చుక్కెదురు. సంతతము ఎట్టి చిన్నవిషయమునకైన ఇరువురకు మాటపట్టింపులు వచ్చి ఒకరితో నొకరు మాటలాడుట మానివేసికొందురు. జమీందారుల బిడ్డలమను నభిమాన మిరువురి మనఃపథముల నెల్లప్పుడు జాగరితమైయుండి సుడిగాడ్పులు రేపెట్టుచుండును.

వారి బిడ్డలు తల్లిదండ్రుల సర్వవిధముల ననుకరించుచు వారిలో వారు, సేవకులతో, తల్లిదండ్రులతో, తోడిపిల్లలతో కలహమాడుచుందురు.

కలహదేవతకు వారిది పుట్టిల్లు. అపశ్రుతిమేళవింపుతో, బహు రాగముల కలయికతో నాదేవి వారింట విచిత్రనృత్యము సలుపుచుండును.

లక్ష్మీసుందరప్రసాదరావు గారి ప్రథమపుత్రికాజామాత లిట్లు తిక్తఫలములైపోయి ఆయన హృదయమును తీరని కోరికలచే బాధాపూర్ణము చేసిరి.

శకుంతలాదేవికి సంగీత సాహిత్యములు నేర్పించినాడు. రాజ్మహేంద్ర పురవాసియగు నొక యమెరికను మిషనరీ భార్యకడ నామె కాంగ్లభాష గరపించినాడు. ఈ విద్య లామెకు గర్వము వృద్ధిచేసినవి. కళాభిజ్ఞతలేని జామాత కవి చీదరజనింపజేయు పిచ్చిపోకడలైనను, జిల్లా జడ్జీల భార్యలకడ, కలెక్టర్ల సతులకడ పాడుమని భార్యను ప్రోత్సహించుచుండెడివాడు. ఆమె విరసముగా తా నవియెల్ల మరచిపోయినానని భర్తతో నప్పడము విరిచెడిది.

రెండవకూతురు శారద చిన్నతనమునుండియు శాంతవర్తన. మూగదేవుని వలె మాటలాడక విశాలనయనములతో, చిత్తరువువలె నన్నియు పరికించునది. ఆమె ఒక్కసారి దేనిని విన్నను మఱి మఱవదు. ఆమె మాటలలో సున్నితమై, తేటయై, మధురమగు చక్కని తెలివి తేటనీటియూటవలె ప్రవహించును. వీణె తీగలు, కోయిల గొంతులు కొండకోనలోని వేణునికుంజముల పాటలుగూడ పేలవము చేయగలిగినది ఆమె కంఠము. గానమూర్తియగు శ్రీరామయ్యగారి పాదములకడ నామె సంగీతము నేర్చికొన్నది. శ్రీరామయ్యగారు గాత్రములో, ఫిడేలు వాద్యములో దక్షిణాపథమున పేరెన్నికగన్న కళాస్వరూపులు. జంత్ర వాద్యములో నాయనను మించువారు ఆనాడు లేరు. తన కమాను కదల్పు లోని విశ్వగీతాస్వనము నాయన శారద కమానులోనికి ప్రవహింపజేసినాడు. శ్రీ త్యాగరాజమూర్తి కన్నులరమూసి శ్రీ సీతారాముని ప్రత్యక్షము జేసికొనిన దివ్యగానములో జనించిన తారకలగు కృతులు, ఆ సంప్రదాయముతోనే శ్రీరామయ్యగారు శారదకు ధారవోసినారు, శారద వీణయు బాగుగా నేర్చికొనుచున్నది, వీణాదక్షుడగు వేరొక యుత్తమ వైణికునికడ.

శారదకు తండ్రియన్న ప్రేముడి యెక్కువ. ఆమె చిన్నతమ్మునొక్క క్షణమైన వదలియుండదు. అచ్చముగా తన తల్లిపోలికయైన శారదను చూచిన జమీందారుగారికి గాఢానురాగము పెనవైచికొనిపోవునది. తన ఆశయముల కీమెయే తగిన కుమారితయని యాయన గర్వపడును. 'చదువులలో చిత్రమెల్ల జదివిన బాలా!' అని ఆనందబాష్పములతో తనయను గాఢాలింగనమొనర్చి యొకనాడు జమీందారుగారు తన స్నేహితులకడ, అప్పటికి బదునొకండేండ్లు ప్రాయముగల శారదచే సంగీతసాహిత్యసభ చేయించినాడు. వృద్ధుడు, శాంతమూర్తి, తేజస్వియగు భాస్కరమూర్తి శాస్తుర్లు బి. ఎ., ఎల్. టి. గా రామెకు నాలుగుభాషలు, ఛప్పన్న విద్యలు నేర్పినారు.

నేడు శారద పదునాల్గుసంవత్సరముల యెలనాగ. అందాలప్రోవు. సుగుణాలనిధి. చదువుల కన్నతల్లి. ఆమెకు తపఃఫలమై జీవితకల్పమగు భర్తను గొనితేవలయు.

సంఘసంస్కరణాభిలాషి యగు జమీందారుగారు శారదకు ఉన్నత విద్యలు చెప్పించవలెనని యెంత కుతూహలపడినను ఆయనహృదయము మాత్రము పూర్వసంప్రదాయ ఘంటాపథము దాటలేకపోయినది. వయసు మీరిపోకుండ శారదకు వరుని తేవలయు. ఇదివరకు జమీందారీ కుటుంబములతో వియ్యమందినాడు. ఆ సరదా తీరినది. తల బొప్పెలు కట్టినది. ఈనా అనుంగుకూతురిని 'జమీందారు రాతుచేతనిడనమ్మ త్రిశుద్ధిగ నమ్ము శారదా!' అని హృదయమున శపథము చేసికొన్నాడు.

భార్యయైన వరదకామేశ్వరీదేవి తన అన్న గారికొమరుడగు శ్రీ క్రొవ్విడి బసవరాజేశ్వర జగన్మోహనరావునకు శారద నిచ్చి యుద్వాహ మొనరింప పట్టుపట్టినది. అన్న గారగు విశ్వేశ్వర ఆనంద సువర్ణేశ్వరలింగం గారు విజయనగర వేశ్యావాటి సముద్రజనిత మాయాప్సరోమణీ నీచశృంగార సమారాధనలో ప్రాణముగూడ ధారపోసి, ఆస్తి అప్పులపాలుచేసి పోయినాడు, 'కోర్ట్ ఆఫ్ వార్డ్సు' వారు వ్యవహరించి అప్పులు

నిశ్శేషముగా దేర్చివేసి, రెండు లక్షల రూపాయల నిలువతో నిరువది రెండేండ్ల వయసున జగన్మోహరావుకు జమీ అప్పగించినారు. ఈ చిన్న జమీందారుని గూర్చి రహస్యములు కథలై దేశ మంతట ప్రాకుచున్నవి.

లక్ష్మీసుందరప్రసాదరావుగా రా సంబంధముమాట భార్య కదిపినప్పుడు జుగుప్సపడినాడు. "అమ్మాయిని నరకకూపంలోకి వేరే తోయనక్కరలేదు! మన హృదయాలు పాషాణాలు చేసుకోవాలి మీ మేనల్లుడి కివ్వాలంటే" అన్నారు.

శీఘ్రముగా వివాహముచేయ సంకల్పించి వరునికై ఆంధ్రదేశము వలలు వేసి వెదకించినారు. అభిజాత్యముగలవాడు, అన్నవస్త్రములకు లోపములేని వాడు, మంచి తెలివైనవాడు, రూపవంతుడు, గుణవంతుడు, చదువుకొన్నవాడు గావలె నల్లుడు. సుప్రసిద్ధ నియోగికుటుంబము లన్నియు వెదకించినారు. వాడ్రేవువారు, మంచిరాజువారు, మారెళ్లవారు, చెన్నాప్రగడవారు__ వేయేల గోత్రములు ఋషులు కలియని ఇంటిపేర్లవారి జాబితా గవర్నమెంటువారి 'నీలపుకాగితము' వంటిది తయారైనది.

తారాచువ్వవలె పైకెగయు బాలురకు ధనముండదు. ధనమున్న వారు విద్యాగర్భదరిద్రతలో మునిగియున్నారు. రెండునుగల బాలకులకు రూప సంపద ఎరువుతీసికొని రావలయును. కొంచెముకొంచెముగా నీ మూడును ఏకీభవించిన నరులు విషకుంభసమానులు. జమీందారుగారికి విసుగు జనించి శారదకు తగిన భర్త దొరకునా యనిపించినది. తన భావవీధిలో నడయాడు జామాత కేమాత్రము తీసిపోయినను అట్టివానికి చూచిచూచి తన ముద్దులపట్టి నొసగుట కాయనకు మనసొప్పినదికాదు.

౪
నారాయణుడు

బెజవాడ ప్లాటుఫారములో నారాయణరావును జూచునప్పటికి, జమీందారు గారికి హృదయ మొక్కసారి యేలోకో ద్రవించిపోయినది. అస్పష్టముగ నొక్క వాక్కు ఇతడే శారదకు వరుడు అని తన హృదయాంతరాళము నుండి నిశ్శబ్దగీతాన ప్రతిధ్వనించినది. నారాయణరావుకు వివాహము కాలేదని ఏల తట్టినదో జమీందారుగా రీనాటికిని చెప్పలేడు.

వ్యవహారములకై వచ్చినవారితోడను, తోటివారితో మాత్రమే సంభాషించు జమీందారుగారు నారాయణరావుకడకేగి 'మీకు వివాహ మైనదా?' యని ప్రశ్నించినారు. పిమ్మట మొగమెరుకగల రాజేశ్వరరావువలన నారాయణుని గూర్చిన వివరములడిగి తెలిసికొన్నారు. ఆయనకంటికి పుస్తకాల దుకాణము కడ దూరముగా నున్నప్పుడే నారాయణరాయని యాజానుబాహువిగ్రహము, పురుషత్వము మూర్తీభవించిన తేజముతో కనుపించినది.

అవయవస్ఫుటత్వము కమ్మెచ్చున దీసినట్లున్నను, అతని కనుబొమలలో, పై పెదవి మెలుపులో, రేఖలు తిరిగిన నిడివిచెవులలో, సమమైన నాసికలో, వనితాలాలిత్యము వెన్నెలవలె ప్రవహించుచుండును. గాఢముష్టిఘాతమున స్తంభమునైన విరుగగొట్టగల యాతని చేతులు దీర్ఘాంగుళులతో, మెత్తని తలములతో నందమైయున్నవి. ఎత్తయి విశాలమైన యాతని ఫాలము, నల్లని దట్టమైన జుట్టు పొదువుకొన, కారుమబ్బు లాక్రమించిన వెన్నెలతులుకవలె విరిసి పోయినది.

నారాయణరాయని యౌవనసుదృఢ దీర్ఘ దేహకాంతి ప్రవాహములో జమీందారుగారు

చిరపిపాసువగు హృదయమును తనివోవ నోలలార్చినారు. తమకు సమీపమందుననే యిన్నినాళ్లు దాగియున్న యీ పురుషరత్నమును తన భాగ్యదేవత నేటికి సాక్షాత్కరింపజేసినదని మురిసిపోయినారు.

లక్ష్మీపతి నారాయణరావునకు మూడవ బావమరదియు, మేనత్త కొడుకును. తలిదండ్రుల కొక్కడే సంతానమగుట సోదర సోదరీ ప్రేమ యెరుగక, తన హృదయమంతయు నత్తవారి కుటుంబమునకు ధారపోసినాడు. చిన్న బావ యగు నారాయణరావును తమ్మునివలె ప్రేమించినాడు. ఆతని భావనాపథముల నారాయణరావు అమర్త్యబాలకుడు.

ఏలూరినుండి తాడేపల్లిగూడెం స్టేషనువరకు లక్ష్మీపతి శ్రవణపేయముగా నారాయణుని గుణగణవర్ణన చేయుచుండ, స్పెన్సరుచుట్ట కాల్చుచు మెత్తని మొదటితరగతి దిండుపై పరచిన బూరుగదూది దిండ్లపై నొరగి, జమీందారు గారు హృదయమార వినుచున్నారు. 'నారాయణ మనస్సు చాలా మెత్తనండి. ఒకళ్ళ బాధ చూళ్ళేడు. చిన్న బాలుడుగా ఉన్నప్పుడు కూడా ఎవరైనా ఏడిస్తే వాడికళ్ళ గౌతమి తిరిగేది. తన అందమైన వస్తువుల్ని వాళ్లకిచ్చి ఊరడించడానికి ప్రయత్నించేవాడు. ఎంతమందో నౌకర్లున్నా చెల్లెళ్ళనీ, అన్న గారి బిడ్డల్ని తనే ఎత్తుకుంటాడు. ఆ పిల్లలు తల్లిదండ్రులకన్న నారాయణంటే చెంగున గంతువేసేవారు. చంటిబిడ్డ తలిదగ్గరకు వెళ్ళడమల్లా పాలకోసమేగాని వాడి ప్రక్కలోనే నిద్ర. మా వాడి గొంతుకలో తేనెల తీయదనం, ఉరుముల గాంభీర్యం పెనచుకొన్నాయి. పాటలుపాడ్తే నాకు కళ్ళనీరు తిరిగేది. సంగీతం నేర్చుకోరా అంటే నేనంత పవిత్రుణ్ణి కానురా అనేవాడు.

'బళ్ళలో చదివేటప్పుడు తోటివాళ్ళొక్కళ్ళూ బాధపడకూడదు కదాండి. పుస్తకాలు బొమ్మలు తినుబండారాలు అందరికీ అస్తమానం పంచుతూ ఉండేవాడు!' తాడేపల్లిగూడెమునుండి నిడదవోలువరకు నారాయణరావు చదువు సంగతి లక్ష్మీపతి జమిందారుగారికి పదముపాడినాడు.

'ఎప్పుడూ ఏ పరీక్షా తప్పలేదు. ప్రతి తరగతిలోనూ మొదటివాడే. ఇంటరు మూడు సబ్జెక్టుల్లో మొదటిమార్కులు, బంగారు పతకాలు సంపాదించాడు. ఇంతలో మహాత్మగాంధీగారి సహాయనిరాకరణం వచ్చింది. రాజమండ్రి కాలేజీ వదలివేసి దేశంకోసం పనిచేశాడు. ఖైదుకు వెళ్ళాడు. ఆరు నెలలు నిర్భయంగా కృష్ణ జన్మస్థానంలో గడిపాడు. వచ్చాడు. స్వరాజ్యపార్టీ అంటే ఇష్టం లేదు. బి. ఎస్ సి. ఆనర్సు చదివాడు. రెండవ వాడుగా నెగ్గాడు. ఎఫ్. ఎల్. లో మొదటిస్థానము తప్పదుకదాండి.'

నిడదవోలు దాటేసరికి లక్ష్మీపతి తన బావగారి ఆస్తి వేదపారాయణము చేసినాడు. 'ఇద్దరన్నదమ్ములు. మూడువందల ఇరవై యకరముల మాగాణి ఉంది. తోటలు ముప్పయి యకరములపైన ఉండవచ్చు. వడ్డీ వ్యాపారంలో లక్షా అరవై వేలవరకు తిరుగుతున్నట్లు జ్ఞాపకం. బ్యాంకులో షేర్లతోపాటు రెండు లక్షల రూపాయలవరకు ఉన్నవి. ఎంత లేదన్నా ఇరవైవేలదాకా నికరాదాయం ఉంటుంది. మా మామ గారు సుబ్బారాయుడు గారు మంచి గుణవంతులు. మా అత్తగారు జానకమ్మగారు పార్వతీదేవి. నలుగురు కొమార్తెలకు వివాహాలయినాయి. మంచి సంబంధాలు చేశారు.'

జమీం: సర్వవిధాలా వరప్రసాదిగా ఉన్నాడు మీ బావమరది. నా సంకల్పానికి దైవమనుకూలిస్తే, మా అమ్మాయి నేనూ కూడా ధన్యులమవుతాము.

లక్ష్మి: అదేమిటండీ! తమరు గొప్పవారు. తమరు తలచుకొంటే జమీందార్ల సంబంధాలే కుదురుతాయి.

జమీం: సరి, జమీందార్ల మాటకేమి గాని మన నియోగులలో సరియైన ఒక్క సంబంధం చెప్పండి. మీరు చిన్నవారు. చదువుకుంటున్నారు. మీ యెఱుకను మంచి సంబంధం చెప్పండి.

లక్ష్మి : (చిరునవ్వుతో) చిత్తం! నాకుమాత్ర మేమి తెలుసునండి!

జమీం: అవునుగదా! నా మనస్సు చివికిపోయేటంత వరకు గాలించి వొదిలేను. ఇంత దగ్గిరలో మహారాజులు ముచ్చటపడిపోయే సంబంధం ఉందని తెలియక పోయింది. కాని భగవంతుని కృపవల్ల ఇప్పటికైనా తెలిసింది. లేక పోతే నా జన్మల్లా దుఃఖపడి ఉందును.

లక్ష్మి: మనస్సులు కలిస్తే అంతా అల్లాకనబడుతుంది. నాకూ, మావాడు మీ అల్లుడు కావడం ఎంతో సంతోషం. కాని మా కుటుంబాలు పల్లెటూరి కుటుంబాలు!

జమీందారు గా రాలోచనాపథములలో నెగయుచు అర్ధనిమీలిత నేత్రులయి కూరుచుండిరి. రైలు కొవ్వూరిలో ఆగి, గోదావరి వంతెన దాటుచున్నది.

సుందరీమణియై, నారాయణరావు పోలికలు గలిగి, ఒక చిన్న బాలునకు తల్లియైన ప్రోయాలోకర్తు కొత్తపేటలో నాపె పుట్టినింట తనకై ఎదురు చూచు చున్నట్లు తోచి, లక్ష్మీపతి, చిరునగవు మెరుములీన, గోదావరి జలముల పార జూచుచుండెను. ఆమె ప్రేమమూర్తి. భర్తకు సదుపాయము లమర్చుచు నామె వేయికనులు, వేయిచేతులతో పరిచర్య చేయును. ఈ నిర్మల గౌతమీనీలజల ములకు నామె హృదయమునకు ఎంత చుట్టరికమున్నది! తమ సర్వస్వము భర్తలకే ధారపోయు హిందూవనితామణులు భర్తలకు పూజింపదగిన వారు. లక్ష్మీపతిరా వా గౌతమీ నిర్మలగంభీరతలో తన ముద్దుబిడ్డ మోమింతలో చూచినాడు. ఆతని మోమున, సంధ్యాకాశమున అరుణరాగమువలె, చిరున వ్వలంక రించినది.

బండి గోదావరి దాటి స్టేషనుకడకు వచ్చి ఆగినది. జమీందారుగారును, లక్ష్మీపతియు బండి దిగినారు. లక్ష్మీపతి 'అయ్యా, సెలవు పుచ్చుకుంటాను. నమస్కారమండి' అని తన స్నేహితులున్న పెట్టెకడకు పోయినాడు. ఆలం ఏలూరిలో నే దిగినాడు. కూలీలు మూడునిముషములలో సామానులు సర్దినారు. రాజేశ్వరరావు, నారాయణ రావు, లక్ష్మీపతి గారలు పరమేశ్వరమూర్తి, రాజారావుల బుజాలమీద తట్టిరి. ప్రీతిపూర్వకముగా కరస్పర్శ గావించి, వారు సెలవు గైకొని టిక్కెట్లు పుచ్చుకొను ద్వారముకడకు వచ్చినారు. ఇంతలో జమీందారు గారును వేరొక పెద్దమనిషియు, నలుగురయిదుగురు జవానులు ముగ్గురు జమీందారీయుద్యోగు లీయువకులకడకు వచ్చినారు.

జమీం: ఈయన నాకు చిన్నతనాన్నుంచి స్నేహితుడు. వేపా శ్రీనివాసరావు గారు, ఈ ఊళ్లో పెద్ద వకీలు.

శ్రీని: చాలా సంతోషంగా ఉందండి మీవంటి పడుచువాళ్లను కలుసు కోవడం. మరేమంటే మీరు భావి ఆంధ్రదేశానికి కీర్తితెచ్చే మణులని మా జమీందారుగారు చాలా చెప్పారు, యీ రెండు నిమిషాల్లోనే.

జమీం: వీరు లక్ష్మీపతిగారు. వారు ఈయన బావమరది నారాయణ రావుగారు.

లక్ష్మి: (జమీందారు గారు పేర్లకై తడుముకొనుట చూచి) ఆతడు రాజేశ్వరరావు నాయుడు.

శ్రీని: చాలా సంతోషంగా ఉందండి. ఈరోజున మీరంతా మా యింటికి అతిథులుగా దయచేయాలి. తప్పదు లక్ష్మీపతి గారూ! మీరు మాట తీసేశారంటే నాకు మనస్సు నొప్పికలిగించారని నష్టానికి దావా తెస్తాను.

లక్ష్మి: (నిముషములో గ్రహించి) రాజేశ్వరుడిమాట నేను చెప్పలేను గానీ, మేమిద్దరం వస్తాము.

రాజే: నేను ఇంటికి వెళ్ళి తర్వాత వస్తాను.

శ్రీని: ఇంటికి వెళ్ళి భోజనానికి రావాలి. లేకపోతే దావా తప్పదు.

రాజే: మీకు మూడు పైసలు డిక్రీ యిస్తాను. ఇప్పుడే చెల్లించమంటే చెల్లిస్తాను.

శ్రీని: రాజేశ్వరరావు గారూ! మీ నాన్న గారు నాకు పూర్వం నుంచి పరిచితులు. నా సరదా తీర్చండి.

రాజే: పదిగంటలకు కలుసుకుంటాను. సెలవు.

అందరును స్టేషనుబయటకు వెళ్ళినారు. సామానులు జమీందారుగారీ గుర్రపు బగ్గీలలో సర్దించి, శ్రీనివాసరావు గారు తన మోటారులో అతిథు లిరువురిని తన ఇంటికి గొనిపోయిరి.

జమీందారుగారు సొంతమోటారు మీద తమ భవనమునకు వేంచేసినారు.

౫
శారద

గౌతమీజల చుంబిత ప్రత్యూష వాయు బాలకులు ఒయారముగా దేలి యాడుచువచ్చి, ఆ వన పుష్ప చేలాంచలములలో దోబూచులాడుచుండిరి. వసంత గాఢ సౌరభములు పొగవోలె సుడులుకట్టి యెల్లెడల వ్యాపించుచున్నవి. బోగైన్ విల్లాలయు, గులాబులయు, వివిధ కుంకుమవర్ణములు, మల్లీమాలతుల స్వచ్ఛ హృదయార్ద్ర శ్వేతవర్ణములు, చంపక కనకాంబరముల సువర్ణరాగములు, నీలాంబర నిర్మలనీలములు కలసి మెలసి చిత్రరూపమై సొబగుమించిన జమీందారుగారి యుపవనములో, శారద ముగ్ధవనలక్ష్మివలె పూలు కోయుచున్నది. శారదకు పూలన్న ప్రాణము (ఏ బాలకు గాదు?). పూల చరిత్రలన్నియు నామె వల్లించినది. పూల మనసులు, పూల బాసలు నామె యెరుగును. ఏ ఋతువుల నే పూ లవతరించునో, ఏ ప్రదేశముల నే కుసుమములు కలకల లాడిపోవునో హాసప్రఫుల్ల వదనయై శారద చెప్పుచుండును.

శారదాకుమారి సౌందర్యమూర్తి. ఆమె నయనములు విస్ఫారితములై, యర్ధనిమీలితములై, దీర్ఘ నీలవర్త్మాంచలములై, విచిత్ర జీవిత నాటకము నాలోకించుచు, నాశ్చర్యహాసముల వెదజల్లుచుండును. నల్లని పాపలు రెప్పలమాటున సగము దాగికొని యామినీ నీలాకాశగంభీరములై తోచును. మేలిమిబంగారు రంగులో తామరయెరుపు కలిపిన శరీరచ్ఛాయ. నవయౌవనపు తొలి వెలుగు లామె ఫాలముపై, నాసికాగ్రముపై,

బుగ్గలపై, పెదవుల యంచులపై, చిబుకముపై, కంటి పైరెప్పలపై, చెవుల తమ్మెలపై నర్తించుచుండును. స్వప్నసీమలగు కనుబొమలు సన్ననై చంద్రవంక వంపులు తిరిగి చెక్కుల మాయమైనవి. బంగారు గన్నేరు మొగ్గవంటి ముక్కు, విలువంపగు సరుణోత్తరోష్ఠముపై పైడిమేడ గట్టినది. మధ్య సుడినొక్కుతో కాశీరత్న పుష్పముల జంటబోలి యామె యధరము స్పష్ట రేఖాంకితమై తేనియలు చెమరించుచున్నది. లేత దానిమ్మపూ వామె చిబుకము. పదునాలుగేండ్ల యెలప్రాయపు మిసిమిరేకలు కర్ణములనుండి యంగుళీయాంచలముల కెత్తిపోతలైనవి. బాహు మూలములనుండి పాదతలములకు సొంపు లెగబోయు ఏటి కెరటాలవంపులు మిలమిల లాడిపోవు కమ్మని చందనవర్ణపు పట్టుపరికిణీమడమలతో మెలివడి పోయినవి, నానాట నానందకిసలయములై మొలకెత్తు ముగ్ధభావములు గులాబి రైక మబ్బుల, నీలిపయ్యెద జిలుగువెలుగుల తొంగి చూడసాగినవి.

ప్రక్క పాపట తీసికొని, ఒత్తై పొడవైన కచభారమును పిరుందులవరకు వ్రేలాడు వాలుజడగా గీలించి, కాళ్ళకు జరీబుటాపూవుల మొఖమల్ లూఢియానా చెప్పులు తొడిగికొని, చెవుల లోలకులలో, కుడిముక్కు పుటమున బేసరిలో, మెడను హారములలో రవ్వలు, నీలాలు, కెంపులు తళుకులీనగా, నెమ్మదిగా పూవుల నరసికొనుచు, నొయ్యారముగా నడుగులిడుచు, తోటలో శారదాదేవి విహారము చేయుచుండగా, "నాన్నగారు వచ్చినా" రని కబురు వచ్చినది.

శారదాదేవి జమీందారు గారి తనయ నన్నమాట మఱవదు. ఆంధ్ర దేశమున తన సుగుణములచే, దాతృత్వదీక్షచే వంశధార నుండి పెన్న వరకు వేనోళ్ళ వినుతింపబడు శారదాంబా జమీందారిణి గారి మనుమరాలగుటచే నామె పోలిక లన్నియు పుణికిపుచ్చుకొన్నది.

'తల్లీ శారదాంబా! ఈ దీపం నువ్వు పెట్టినదమ్మా! ఈ బిడ్డలు నీ వారమ్మా! ఈ వంశము నువ్వు నిలిపినదమ్మా' అని యీ నాటికిని జమీందారు గారి తల్లి నెన్నియో వేలమంది జనులు తలచుకొని మొక్కుచుందురు. జమీందారు గారి తండ్రి జీవించియున్నప్పుడును, ఆయన కీర్తిశేషులైన వెనుకను, జమీందారుగారి చిన్నతనములోను, జమీందారు గారు పెద్దలై రాజ్యభారము వహించిన వెనుకను, శారదాంబాజమీందారిణిగారు బ్రతికినన్నాళ్ళు అహోరాత్రములు అన్ని వర్ణముల వారికి అన్న ప్రదానము గావించినారు. మాలమాదిగలకు వంటలు చేయించి పెట్టించినారు. ఎందరికో పెండ్లి పేరంటములు చేయించినారు. సంగీత సాహిత్య శాస్త్ర, వేదాది విద్యా పారంగతులకు వార్షికము లొసగి, సంభావించినారు. హైదరాబాదు సంస్థానములో వర్తకము చేసి, కోటికి పడగ నెత్తిన గంగరాజు సుజనరంజనరావుగారి కామె ఏక పుత్రిక. సుగుణసంపదయు ధనసంపదయు నామెలో గంగాయమునలవలె సంగమించినవి.

తండ్రిగారు వచ్చిరని తెలియుటతోడనే, శారదమోమున సంతోషము విఱియబార, తలలో తుఱుముకొనుటకు గోసికొన్న పూవులను సజ్జలో నిడికొని, విసవిస నడచి భవనములోనికి బోయినది. మేడమీద తనగదిలో నద్దముల యెదుట నిలుచుండి పూవుల నమరించుకొని, యీ బాలిక నాయనగా రెక్కడ నున్నారో వెంకాయమ్మ నడిగి తెలిసికొని యచ్చటికి బోయినది.

జమీందారు గారు తాను చదువుకొను గదిలో సోఫాపై కూర్చుండి యున్నారు. శారద తల్లిగారు వరదకామేశ్వరీదేవియు నచ్చటనే దిండ్లకుర్చీలో కూర్చుండి భర్తతో మాట్లాడుచున్నది. జమీందారుగారి యక్క సుందరవర్ధనమ్మయు నచట నిలుచుండి 'ఎందుకోయి, పిలిపించినావు?' అని యడిగినది.

సుందరవర్ధనమ్మగారు విగతభర్తృక. హైకోర్టు న్యాయాధిపతిచేసి, లక్షలు సముపార్జించి, న్యాయధర్మములో ప్రఖ్యాతి వహించిన విశ్వనాథంగా రామెభర్త. వేదాంతజ్ఞానోపార్జనాసక్తి యామెకు మిక్కుటము. సంతతము ఆమె పట్టుబట్టలతోనే యుండును. ఆమె కుమారుడు తండ్రిబోలి చెన్నపట్టణములో న్యాయవాదవృత్తిలో పేరును, ధనమును వెనుక వేసికొనుచు దివ్యముగ కాలక్షేపము చేయుచున్నాడు. పుత్రునింట తన యాచారాదికములు సాగమి, ధర్మకర్మపరతంత్రుడగు నామెతమ్మునిఇంటనే యుండి, యాజమాన్యము వహించి, కాలక్షేప మొనర్చుచున్నది.

జమీం: చిన్నమ్మాయికి ఈరోజున పెళ్ళికొడుకు వస్తున్నాడు.

వర్ధనమ్మ, వరదకామేశ్వరి: ఎక్కడనుంచి, ఎవరు?

జమీం: కొత్తసంబంధం.

వర్ధనమ్మ: మన దేశమేనా? మన దేశములో ఇదివరకు మనం చూసి నచ్చవనుకున్న సంబంధాలేగా అన్నీ!

వరద: జమీందారీకుటుంబమేనా ?

జమీం: (నవ్వుచు) నన్ను చెప్పనివ్వండి మఱి. మన దేశమే. జమీందారీ కుటుంబంకాదు గాని పరువైన నియోగులు. చాలా సిరి సంపదా కల వాళ్లు. (భార్యవంక చూచుచూ) జమీందారులకు కూడా అప్పిచ్చేటంత నిల్వవుంది.

వర్ధనమ్మ: పల్లెటూళ్ళలో మెరపకాయ కాల్చుకొని తింటూ డబ్బు నిల్వవేసుకొన్న కోమట్లలాంటి మనవాళ్ళు కొందరున్నారు. అలాంటి వాళ్ళు కాదుకదా?

వరదకామే: బాగా అన్నారు వదినా!

జమీం: మనకన్నా మర్యాదకలవాళ్ళు. జమీందారులకు బుద్ధులు నేర్పగల పరువు ప్రతిష్టలు కలవాళ్ళు.

వర్ధనమ్మ: పెళ్ళికొడుకు ఎల్లాఉంటాడు?

వరద కామే: ముంజేతి కంకణానికి అద్దమెందుకు వదినా! పెళ్ళివారు వస్తున్నారుగా! పల్లెటూరి ఆంబోతు కేమీ తీసిపోడు లెండి.

వర్ధనమ్మ: ఆ! మరచిపోయాను, పెళ్ళికొడుకు ఏం చదివాడు?

జమీం: పెళ్ళికొడుకుది నవమన్మథాకారం. వంట్లో రక్తము లేక పాలిపోయి, అదో మంచి మేలిమిబంగారు రంగని చెప్పుకుంటూ నాల్గడుగులు నడవలేని మన జమీందారి దద్దమ్మ కాడు. అందానికి అర్జునుడు, బలానికి భీముడూ. ఈ సంబంధము కుదిరితే మన శారద అదృష్టవంతురాలు.

వరద: కాకిముక్కుకు దొండపండు. ఇంతకూ మీకు మా వాడు నచ్చ లేదు. వాడి కేమి లోటో, ఎందుకు నచ్చ లేదో నాతో చెప్పారు కాదు. ఖర్చు కొంచెము ఎక్కువ చేస్తే దుర్వ్యయమంటారు. ఓర్వలేనివాళ్ళు కల్పించినవన్నీ నమ్ముతారు. శారద కూడా ఎదుగుతూంది. దాని అభిప్రాయముకూడా అడగడం మంచిది. మీరు నవ నాగరికులు

గాదూ! వీరేశలింగంపంతులుగారితో స్నేహము చేసిన వాళ్ళేగా! ఆడపిల్లకు ఏసంబంధం యిష్టమో అది చేయడమే మంచిది కాదూ?

వర్ధ: ఆ! మరదలు గారు స్వయంవరాలు చేయించమంటారు. శారదను పిలిపించండి.

ఇంతలో మెరపుతీగవలె శారద యచ్చటికి వచ్చినది. తండ్రి గారు చేతులు చాచుటతోడనే యా బాలిక పూలబంతివలె ఆయన కౌగిలింతలోనికి వచ్చి వ్రాలెను. కుమార్తెశిరము మూర్కొని తనప్రక్క సోఫాపై కూర్చుండబెట్టుకొని, జమీందారు గారు 'శారదా, ఎక్కడికి వెళ్ళినావమ్మా' యని ప్రశ్నించిరి.

శా: తోటలో పువ్వులు కోసుకుందామనీ, నీళ్ళు సరీగ్గా తోడాడో లేదో చూద్దామనీ వెళ్ళాను. నాకోసం మీరు చెన్నపట్నం వ్రాసినపుస్తకం వచ్చిందండి బాబయ్యగారూ. నిన్ననే షేక్స్పియరు మొదలు పెట్టింది మా దొరసానమ్మ గారు. 'వెనీసు వర్తకుడు' అనే నాటకం. మనం తెప్పించుకున్న పుస్తకంలో నాటకాలన్నీ ఉన్నాయి. బొమ్మలు కూడా చాలాబాగా ఉన్నాయండి. కాని 'వెరిటీ ఎడిషన్' కావాలట. అది తెప్పించి పెట్టరూ బాబయ్యగారూ?
జమీం: నీ యీడున షేక్సుపియరు పేరే తెలియదమ్మా మాకు. నీకు మంచి గురువు గారు దొరికింది. నాదగ్గర 'ఆర్డెను ఎడిషు' నుంది. అది వెరిటీ కన్న చాలా మంచిది.

తండ్రి కొమార్తెల కిరువురకు సంభాషణ ఇంగ్లీషులోనే జరిగినది. తండ్రి శారద వైపు చిరునవ్వుతో చూచి ఇంగ్లీషులో నిట్లు పలికెను.

'శారదా! జగన్మోహనరావు సంగతి నీకు చాలా వివరించి చెప్పాను. నీకు సర్వవిధములా తగిన వరుణ్ణి ఈ రోజున రప్పిస్తున్నాను. చదువులో మొదటివారిలో మొదటివాడు. రూపసంపదే కాదు, మంచి బలమైనవాడూ, అందమైనవాడూ. ధనంలో మనకెంత ఆస్తి ఉన్నదో అతనికి అందులో సగం ఉన్నది. అతను ఎఫ్. ఎల్. పరీక్షకు వెళ్లినాడు. మొదటివాడుగా నెగ్గుతాడు. పరీక్షలోను, ఆటలలోను నెగ్గిన మెడల్సు కప్పులు కాకివారి షాపంతషాపు పెట్టించవచ్చు నన్నారు.'

శారద సిగ్గుపడి చిగునగవుతో మాట్లాడక తలత్రిప్పి యూరకున్నది.

వర్ధనమ్మ గారు తమ్మునితో 'నీతో చెప్పుటకు సిగ్గుపడుతుందేమోనోయీ' అని యన్నది.

'వారంతా సాయంత్రమునకు అమ్మాయిని చూడడానికి వస్తారు' అని జమీందారు గారు స్నానమునకు లేచినారు.

౬

కొత్తపేట

సుబ్బారాయుడు గారు మంచి సరసుడు, మాటకారి. తేనేలూరు నట్లేవ్యవహారమునైనను, తేట తెల్లముగ వివరింపగలరు. వ్యవహారదక్షులైన సుప్రసిద్ధ న్యాయవాదులే యాయన మాటలు చెవులార వినుచుందురు. అప్పులిచ్చు షాహుకార్ల కందఱకు తప్పనివగు ధనసంబంధ వ్యాజ్యములలోదప్ప నితరముల యెడ నాయనకు సంపర్కమేదియు లేకపోయినను, చక్కని బుద్ధిసూక్ష్మత, పరిశీలనాదక్షత కలవాడగుటచే నేసంబంధమైనను, న్యాయసూత్రాలపట్ల విచిత్రాలోచన చేయగలడు. సలహా చెప్పగలడు. చదువుకొని పట్టాను బొందినచో భాష్యం అయ్యంగారు కాదగిన తెలివి యాయనకు గలదు. హిందూ న్యాయశాస్త్రములో నిదివరకు లేని కొన్ని సూక్ష్మముల వివరించి యాయన యొసంగిన సలహాలవలన, ఒక దత్తతాభియోగము నెగ్గినదనియు, నా వ్యవహారపు దీర్పే దత్తతాన్యాయమును చాలావరకు మార్చినదనియు కోనసీమలోని పండిత పామరు లందరికిని దెలియును.

పచ్చని దబ్బపండుచాయ మానిసి, పొడగరి. ఆజానుబాహుడు. తెల్లగా నచ్చుటచ్చుట నెరసినతల, గడ్డము, మీసము లాయనకు వింతశోభ నిచ్చును. పోలముదిమ్మవంటి వక్షముతో, వట్రువలు తిరిగి కండలూరిన బాహుసంపదతో, కోలనై, బింక మొలుకు మోముతో, విశాలమై లోతైన కాటుక కన్నులతో, విరివియై విశాలమైన ఫాలముతో, తెల్లని యజ్ఞోపవీతముతో నాయన ద్రోణుని దలపించుచుండును.

సుబ్బారాయుడు గారి కెన్ని కథలు వచ్చునో లెక్క లేదు. ఆయన చెప్పు కథలు పెద్దలుగూడ తనివోవ వినుచుందురు. కొంచె మెచ్చుతగ్గుగా ననేక భాషలలోని గ్రంథములన్నియు నాయన పఠించినారు. కథలు సందర్భానుసారముగా నాయన కల్పించవలసి వచ్చిన కల్పించును. ఒక సారి కల్పించిన కథను మరల నెప్పటికిని మఱచిపోడు.

ఆ నాటి సాయంత్ర మేడుగంటలకు, దన నాల్గవ కొమరిత ఊకొట్టు చుండగా కాశీమజిలీలలోని అదృష్ట దీపుని కథ యాయన చెప్పుచుండెను. పెద్దకొమరుడు, నాతని సంతానమగు నిద్దఱు కొమాళ్ళును కొమార్తెయు, సుబ్బారాయుడు గారి భార్య జానకమ్మ గారు, కొందరు రైతులు, ఇరుగు పొరుగు బ్రాహ్మణులు, చుట్టములు, కాళ్లు పట్టుచున్న మంగలి, విసనకఱ్ఱ వీచుచున్న చాకలి యా కథ వినుచుండిరి. ఇంతలో గొన్ని బండ్లు వారి యింటిముం దాగిన చప్పుడైనది.

నారాయణరావు లోనికి వచ్చినాడు. ‘అన్నయ్య వచ్చాడు. అమ్మా! చిన్నన్నయ్యేవ్!’ అంటూ సూర్యకాంతం లేచి పరుగున అన్న గారిదగ్గరకు జేరినది. నారాయణరా వామెను సునాయాసముగ బైకెత్తి తనహృదయమున నదిమికొని ముద్దిడి క్రిందికి దింపినాడు. ‘చిన్న నాన్న గారు! తిన్న నాన్న గాలు! తిన్న నాన్న గాలు!’ అనుచు నారాయణరా వన్న కుమార్తెయు, నిరువురు కొమరులును, లేగదూడలవలె పినతండ్రికడకు పరుగు వారిరి. ముగ్గురి నొక సారిగా నెత్తి వేసికొని యొకరిని భుజముమీద, నిరువురిని జేతులలో నిముడించుకొని, చెల్లెలు తన్ను చేయి చుట్టి నడువ, ముందరి మండువాలోకి బోయినాడు. బండి వాడును, చాకలి, మంగళ్లు, సామానంతయు లోనికి జేర వేసిరి. నారాయణ రా వందులో నొక పెద్ద పెట్టె పై మండువాలో దింపించి, తాళము తీసి, యందులో నుండి బొమ్మ సామానులు, జపాను మర పనులు, చిత్రవిచిత్రములైనవి పుదుచ్చేరీపనులు, విక్టోరియా

చిత్రవస్తుశాలలో కొన్న రాగి, వెండి, దంతపు, గంధపు శిల్పపుంబనులు, కొండపల్లి బొమ్మలు, మచిలీపట్టణపు టద్దకపుదెరలు, ఖద్దరు, పట్టు, నూలు చొక్కాలు, పరికిణీలు, పొందూరు చీరలు, పయ్యెద కండువాలు తీసి తన చుట్టు మూగిన తల్లికి, వదిన గారికి, పిల్లలకు, అన్న గారికి, పెదతల్లికి జూపించినాడు.

'నా గుల్లంబండి బాగా వెలుతోంది' అన్నాడు అన్న గారి చిన్న పిల్లవాడు.

'చిన్నాన్న గారూ! నా మోటారు బాగా లేదుటండీ, తమ్ముడు బండి కంటే!' యని పెద్దవాడు. 'ఒరే తమ్ముడూ! నాకు తెచ్చిన యీ వెండి బొమ్మ సామానంత మంచివి కావురా మీవి?' అన్నది యన్న కొమరిత.

మంచిరంగులు వేసి బొంబాయిలో జరీ పువ్వుల పని చేసిన పొందూరు కండువాలు చూచుకొనుచు, గంధపుబొమ్మలు మొదలైనవి గమనించుకొనుచు, సూర్యకాంతము ముసిముసి నవ్వులతో మురిసిపోయినది.

'నారాయుడు మూడువందల రూపాయలకు తక్కువ ఖర్చు చేసి ఉండడు వీటికోసం. డబ్బంటే మంచినీళ్ళు తాగుతాడు' అనుచు నన్నయగు శ్రీరామమూర్తి విస్తుపోవుచు జూచినాడు.

శ్రీరామమూర్తి కి తమ్ముడన్న నెంత ప్రేమయున్నదో, నారాయణరావుతక్క దక్కినలోక మెఱుగదు. తలిదండ్రులు, శ్రీరామమూర్తి భార్య వరలక్ష్మమ్మయు గొంచెముగా నెఱుంగుదురేమో. శ్రీరామమూర్తి, సుబ్బారాయుడు గారికి, జానకమ్మ గారికి ప్రథమ సంతానము. ముప్పదియేండ్ల యీడు వాడై, బి. ఏ., ప్లీడరుషిప్పు పరీక్షలలో గృతార్థుడై, యమలాపురములో వృత్తి జేయుచు, ధనము బాగుగా సముపార్జించుచు, బేరుగాంచిన న్యాయవాది యతడు. వ్యవహారముల నారి తేరిన బంటు. కోర్టు, ఇల్లు, తనయూరు, తన యాలుబిడ్డలు, తలిదండ్రులు, తమ్ముడు, చెల్లెళ్ళు, ఆలివంక బంధుగులు, దగ్గర బంధుగులు_అదియే యతని ప్రపంచము. సాంఘిక రాజ్యాంగ వ్యవహారములతో నాతనికి నిమిత్తము లేదు. మేనమామ పోలికతో గొంచెము స్థూల మనిపించు చామనచాయ రూపము. అయిదడుగుల ఏడంగుళముల పొడవయ్యు దమ్మునికన్న , దండ్రికన్న నాతడు చాల పొట్టి.

'అన్నయ్యా! నీకోసం యీ మంచిగంధపు ఉత్తరాలపెట్టె పట్టుకు వచ్చాను. బాగుందా? దీని పనితనం చూడు. మూతమీద గోవర్ధనోద్ధరణం, లోపల కైలాసపర్వతం రావణుడు ఎత్తడం చెక్కి ఉన్నది. కింద రాముడు లేడికై పరుగెత్తడం, పక్కల్ని అశోకవనంలో సీత, బృందావనంలో గోపి కృష్ణులను చేశాడు. దీని ఖరీదు డెబ్భై అయిదు రూపాయలు.'

'ఇంత చిన్న దానికే అంత ఖరీ దేమిటి రా!'

'శిల్పపుపని విలువ అది' అన్నది వదిన గారు.

'ఏమమ్మోయి వదినా! నీకు తెచ్చిన పొందూరుచీర యిదిగో.'

'ఎందుకురా పొందూరు కొనడం? మామూలు ఖద్దరులోనే సన్నరకం ఏ డెనిమిది పెడ్తే వస్తాయిగదుట్రా' అన్నా డన్నగారు.

'అదిగా దన్నయ్యా! బండఖద్దరుచీరలు కట్టుకుంటూంది. అసలే కొంచెం బొద్దుమనిషి.

అందులో సాదాఖద్దరు చీరలు కట్టుకుంటుంటే రెండు రెట్లయింది వదిన అని, మూడు పాటినూలువి, ఒక పట్టుశాలీ నూలుది నాల్గా కొనుక్కు చక్కావచ్చాను. అమ్మకి నాల్గు పట్టుకువచ్చాను. నీకు జరీకండువాలు రెండు. ఒకటి పొందూరుది, ఒకటి సేలంది. నాన్న గారికి బందరు పురిటి గడ్డవి, నాల్గు ఎట్టిఅద్దకం పంచెలు పట్టుకువచ్చాను. ఇంకా ఉన్నాయి. అక్కయ్యలకీ, కన్న తల్లికీ, అమ్మడికీ, పిల్లలకీ, నీకూ నాకూను. కన్న తల్లి ఏదట్లా?' 'మందపల్లి మామయ్య గారింటికి వెళ్ళింది. వస్తూఉంటుంది' అన్నాడు శ్రీరామమూర్తి. హృదయము వికసించి, యాతని మోము వెన్నెల వెలుగయినది. తమ్ముని గుణగణములు రోజుకు మూడు నాల్గుసారులు తక్కువ కాకుండ నితరులకడ నాతడు వర్ణన చేయుచుండును.

'మా తమ్ముడున్నాడే వాడి దేహం, ఎంత వజ్రమో, హృదయం అంత నవనీతం సుమండీ! మా నాన్నగారి తెలివి తేటలు దశమి వెన్నెలైతే, మా వాడి జ్ఞానం పున్నమ వెన్నెలండీ! మనకు స్వరాజ్యమంటూ వస్తే మా వాడు ముఖ్యమంత్రి అవవలసిందే. నౌరోజీ, దాసు, నెహ్రూ, రాధాకృష్ణ, పట్టాభి, హాల్డేను మొదలైన వాళ్ళతో సమమైన బుఱ్ఱండీ' అని యనుచుండును.

తాను లోభియయ్యు, దమ్ము డిట్లు ధనము వెచ్చించుటన్న నాతనికి బరమప్రీతి. అతని హృదయాంతరాళమున నణగిమణగియున్న యుత్కృష్ట గుణములన్నియు దమ్ముడగు నారాయణ రావుకడ జాగృతములై ప్రత్యక్షమైనవి.

ఈ సంగతియంతయు సూక్ష్మగ్రాహియగు నారాయణరావున కవగతమే!

'పరమలోభి, గట్టిమనస్సువాడూ ఐన అన్న గారంటే అంత గౌరవం, అంత ప్రేమా ఏమిటా నారాయుడికి' అని యాతని స్నేహితు లెన్ని సారులు గుసగుసలు వోయినారో!

'ఏమిరా చిన్న బాబూ! నాన్న గారు పంపించిన అయిదువందలూ ఖర్చు చేసేశావా' అన్నది తల్లి.

'ఆఁ! ఇంకో నూటయాభై రూపాయల సరకు వీ. పీ. గా వస్తుంది, అమ్మా!'

'కొడుకుసోద్యాలు చూసి సంతోషించడమేనా, మాకు నాల్గు మెతుకు లేవన్నా పారేయించేదున్నదా!' అని యప్పుడే లోనికి లక్ష్మీపతితో వచ్చిన సుబ్బారాయుడు గారు భార్యను నవ్వుచు బ్రశ్నించినారు.

వేళాకోళములు చేయుటలో సుబ్బారాయుడు గారద్వితీయులు. అందులో భార్య నెప్పుడు బరిహాసములతో ముంచివేయుచుండును.

మా అక్కయ్య వంట చేసికొని కూచుంది. ఎనిమిదైనా మీరు లేవక పోతే! రోజూ ఎంత మొత్తుకొన్నా తొమ్మిదింటికైనా భోజనానికి లేచి రాని మీకు ఈ వాళ పట్న వాసాన్నుంచి అబ్బాయి, అల్లుడూ వచ్చారని, ఇంత తొందరగా జఠరాగ్ని కదిలింది!'

గుమ్మం దగ్గర నిలుచుండి నారాయణరావు కొని తెచ్చిన వింతలన్నియు గమనించు చుండిన జానకమ్మ గారి యక్క , లక్ష్మీనరసమ్మ గారు 'మరది గారికి కొత్తటే అమ్మాయీ! ఉన్నదోటీ అనేదోటీ' అని పలికినది. 'అప్పచెల్లెళ్లిద్దరూ వీరసతు లౌతున్నారు. ఆడవాళ్లు తలుచుకుంటే మొగాళ్లు మూలగదుల్లో దాగాలిసిందే' అని సుబ్బారాయుడు గారు నవ్వుకొన్నారు.

పరమేశ్వరమూర్తి

పరమేశ్వరమూర్తి రాజారావును సామర్లకోట స్టేషనులో కాకినాడ బండి నెక్కించి, తానుబోయి మరల మెయిలులో గూర్చుండి నాడు. పరమేశ్వరమూర్తి పలుచని శరీరము, సొగసైన కన్నులు, పసిమిపచ్చరంగున గలియుటకు యత్నించు చామనచాయ, చీలిక గడ్డము, సమఫాలము, సన్నని పెదవులు, లెక్క పెట్టుటకు వీలున్న నల్లని మీసములుగల వాడు. చిన్న చెవులు, సన్నని పొడుగాటి కంఠము, విస్ఫారితము గాని భుజస్కంధము, గుండ్రని నున్నని కరములు, చిన్న చేతులుగల అతని కోమలశరీరమున నాడుదన ముట్టిపడుచుండును. ఈతలో ప్రథమ బహుమానమంది పోటుమానిసి యనిపించుకొను టొక్కటియే యాతని స్త్రీత్వమునకు దీరనికొఱత తెచ్చి పెట్టినది.

సహజ పంచమస్వనమున గంఠము తేనెలూర సంగీతము పాడుకొనును. నిత్య నవీనములై ఆర్ద్రము లైన ప్రకృతి విలాసము లాతని ధ్యానముద్రలో వికసించి మురిపించును.

ప్రకృతి యాతని యాలోచనాశక్తిని ప్రోవిసేయు పెంపుడుతల్లి. ప్రకృతిలో నే మార్పును జూచినను ఆతని హృదయము చలించిపోవును. సృష్టిలో ప్రతిపదార్థమును పరమేశ్వరమూర్తికి మేరుపర్వత సమానమై గోచరించును. దృశ్యమానములగు ప్రకృతివికారము లెల్ల, కాలనాటికారంగములుగా బ్రత్యక్షమై, యాతనిని వివిధ వికారములకు లోనుజేయును.

పరమేశ్వరమూర్తికి ప్రాపంచిక మైన వ్యవహార పథము లపరిచితములు. ఆతని నావరించియున్న సహజపాండిత్యమే యాతనికి బరీక్షలలో జయము గొని తెచ్చి యాతనికే యాశ్చర్యము గొల్పుచుండును.

ప్రాణస్నేహితుడగు నారాయణరావువలె పరమేశ్వరమూర్తి గూడ సౌందర్యోపాసకుడు. అపశ్రుతియన్న యాతని హృదయము తటతట కొట్టుకొని విహ్వాలించును. ఒక నా డాతడు స్నేహితుని ఇంటికి బోయి, చక్కగా నలంకరించియున్న యాతని గదిని చూచెను. తెల్లనిగోడల పైన నచ్చుటచ్చుట ప్రఖ్యాత భారతీయ చిత్ర కారుల ప్రసిద్ధ చిత్రాల ప్రతులు అలంకరింపబడియున్నవి. ద్వారములకు గవాక్షములకు ఖద్దరుపై మనోహరవర్ణములు చిత్రించిన మచిలీపట్టణపు, పంజాబు దేశపు కలంకారీ అద్దకపు దెరలు వ్రేలాడదీసియున్నవి. శోభాయమానమగు నా మందిరములో నొక యెడ దగిలించియుంచిన క్యాలెండరు బొమ్మను గాంచి, పరమేశ్వరుడు వణకిపోయినాడు. అతని కంటిలో రాక్షసి బొగ్గునలక పడినట్లయినది. పంటి క్రింద నిసుక రేణువులు నమలినట్లయినది.

పరమేశ్వరమూర్తికి జిన్నతనములో వివాహమైనది. అతడెంత రసగ్రహణపారీణుడో యాతని భార్య యంత నిష్కళాహృదయ. ఆమెకు సౌందర్యమన్న నేమో తెలియదు. అలంకరించుకొనుట యంతకుమున్నే యెరుగదు. ఆమె యచ్చపుగృహిణి. గృహకృత్యము లవలీలగ నెరవేర్చును. ఉదయమున లేచినది మొదలు రాత్రి భర్తను జేరువరకు నామె యొక క్షణమైన తీరుబడి లేక మధుపమువలె బని చేయుచుండును. వంటయిల్లలికి ముగ్గులు పెట్టును. కూరలు తరగును, బియ్యము కడిగియిచ్చును. రాత్రి తానే మడికట్టుకొనును. ఆడబిడ్డ లెవరైనా వచ్చినచో వారి పిల్లలకు నన్నియు నమర్చును.

రూప రేఖావిలాసముల కామె నోచుకొనకున్నను, ఆమెలో నొక వింత యందము

తొలుకాడుచుండును. ఆమె కన్ను లద్భుతములు. నిష్కపటమై శాంతిపూర్ణమగు నామెహృదయ మాకన్నులలో ప్రతిఫలించును. అవి వెడదలై నల్లనై, దీర్ఘపక్ష్మముల వితానముక్రింద బ్రేమమున నడయాడుచుండును.

ఆమె పతిప్రాణయయ్యు హావభావవిలాసములచే భర్తహృదయమును రంజింపజేయుటకై యత్నింపదు. పరమేశ్వరమూర్తి యామెను ప్రక్క పాపట తీసి కీలుజడ యల్లుకొనుమని కోరును. లేనిచో మధ్యపాపటతీసి బొంబాయిముడి ముడుచుకొమ్మని కోరును. మోమున కంగరాగము లలదుకొమ్మనును. తెల్ల చీరలు ధరింపుమనును. 'వంగపండుచాయ వస్త్రములు రాత్రి వేళ దేహమును విచిత్రముగ శోభింపజేయును' అని భార్యతో వాదించును.

ఆ మాటలకు రుక్మిణి చిరునవ్వు నవ్వుకొనును. అంతమాత్రమే! అతని కోర్కెల పరిపాలించుట నాటక స్త్రీలకు జెల్లును గాని సంసారులకు గాదని యామె యూహ.

పరమేశ్వరమూర్తి పిఠాపురము జేరి యింటి కేగునప్పటికి రుక్మిణి మోము ప్రఫుల్లమయినది. ఆమె నయనముల దివ్యకాంతులు ప్రసరించినవి.

తనతోగూడ గదిలోనికి వచ్చిన భార్యను కౌగిలించుకొని ముద్దిడుకొన్నాడు. అచ్చట నెవ్వరు లేకపోయినను రుక్మిణి సిగ్గుపడి 'అబ్బా, మీ కెప్పడూ ఈలాంటి పను లేనండి' యన్నది.

'నా ప్రేమ నాపలేక అల్లాచేశాను. నేను రాసిన యెనిమిది ఉత్తరాలకూ నువ్వు రెండుత్తరాలు జవాబు రాస్తావు. నీది కటిక హృదయం రుక్మిణీ! మూడు నెల్లు విరహ వేదన పడ్డానే! నీ బొమ్మే నాకు దిక్కా! ఎన్నాళ్లు నీకు ప్రణయ విలాసాన్ని నేర్పినా పూర్వకాలపు పునిస్త్రీవే కదా నువ్వు!'

'నే నేం చేయనండి! అత్తగారికి తెలుస్తుందేమోనన్న భయం. ఆ రెండుత్తరాలేనా పనిదాని చేత రహస్యంగా కవర్లు తెప్పించి రాశాను.'

'పైగా ఆ రాతేమిటి! ఎవరికి రాసిందో తెలీదు. ఏవో రెండుముక్కలు గిలికితే ఉత్తరం అవుతుందా!' ఆమె తెల్లబోయి భర్తవంక జూచినది.

'పోనీలే. ఇదేమిటి? ఈ గది ఇలా ఉంచావు? గదిని అలంకరించడం జన్మ నలంకరించుకోవడమే అని చెప్పలేదూ నేను! మరి ఈ సామాను కొట్టేమిటి?'

'మీరు దూరానఉంటే నా కెందుండీ! ఎల్లాగండీ గది అలంకరించుకొని కూచునేది?'

'పోనీలే' యని పరమేశ్వరుడు రుక్మిణిని మరల తన హృదయమునకు హత్తుకొని 'ఒక ముద్దే' మ్మనియెను. ఆమె లజ్జారుణవదనయై యిటు నటు చూచి నాథుని పెదవుల తన పెదవుల నొక్కి, 'వస్తా' నని యింటిలోనికి మాయమైనది.

పరమేశ్వరమూర్తి శ్రుత్యపశ్రుతులు వెలుగు నీడలవంటివని యెఱుగును. ఎంత విచిత్రమగు శ్రుతి నీ వాపాదించుకొనగలవో యంత యపశ్రుతి వెన్నంటి గోచరించుచునే యుండును. రూపెత్తిన తన యాశయమై, పులకరాలు గలుగ జేయు బాలిక భార్యయైనదని సంతసింతమన్న నామె తన్ను ప్రేమింపకయైన పోవును, లేదా కర్కశహృదయయైన నగును. పరిపూర్ణత యెక్కడి దీ సృష్టిలో!

తల్లిదండ్రులతో ముచ్చటలాడి, పుట్టింటికి బిడ్డలతో వచ్చియున్న చెల్లెలితో మృదూక్తులాడి బిడ్డల నాడించి, పట్టణము నుంచి కొని తెచ్చిన బహుమతు లెవరివి వారికిచ్చి, భోజనమాచరించి, నిదురబోయి లేచి, పరమేశ్వరుడు గది నలంకరించుకొన మొదలిడినాడు.

వచ్చిన నాటి రెండవరోజున పరమేశ్వరునకు నారాయణకడనుండి కమ్మ వచ్చినది.

'ఓరి పరమం! నా హృదయానికి ఎంతో దగ్గిర ఉన్న కవిరాజూ! విను, ఆ బాలిక సౌందర్యం అసలు శారదకు లేదు. నన్నూ, నా హృదయాన్నీ, నా ఆత్మనీ తనలో పెనవేసుకుంది. తనలో ఐక్యం చేసుకుంది. మా చిత్రకార మండలిలో ఆమె బొమ్మ చిత్రించడానికి ఒక్కరికైనా కుంచె నడవదోయి. ఆమె శరీర సౌష్ఠవము విడివడబోయే మల్లెమొగ్గల పోగేరా! ఆమె కళ్ళల్లో కథలు నర్తించాయి. జమిందారుగారితోకూడా వచ్చాడే, ఆయన-శ్రీనివాసరావు గారు ఆ ఊళ్ళోకల్లా మంచి ప్లీడరు. ఆయన ఇంటిదగ్గర నుంచి వెళ్ళాం జమీందారు గారి ఇంటికి. ఆయన 'పిల్ల నచ్చిందా' అని అడిగాడు. నచ్చిందని చెప్పటానికి నేను తగుదునురా పరమం! ఆ బంగారుపోత విగ్రహానికి, ఆ పువ్వుల ప్రోవుకు, ఆ దివ్య బాలికామణికి నేను తగుదునా పల్లెటూరి బండమనిషిని! నువ్వు రైలులోనే జమిందారు గారి ఉద్దేశం గ్రహించావుకదా! మన వాళ్లందరూ అదే గ్రహించారు. నాకూ నిముషంలో అవగాహన అయింది. అప్పటినుండీ నాకు ఒకటే సిగ్గు. వారి అమ్మాయికి ఇంతవరకు పెళ్ళి చేయకుండా ఉంచింది నా యీ కర్కశ పురుషత్వానికి బలియివ్వడాని కేమో! 'తప్పక సంబంధం నిశ్చయం అవుతుంది. నువ్వు వివాహానికి నీ భార్యతో రావాలి. అమ్మ గారినీ నాన్న గారినీ అన్న దమ్ములను బావ గారిని చెల్లెలిని నువ్వు నాకోసం బలవంత పెట్టి తీసుకు రాగలిగితే నీకు నేనేమివ్వగలను రా ? తలుపు దగ్గర పాట నిన్ను పాడనిస్తా.

'సర్వకాలాలా ఆ బాలిక నాకు ప్రత్యక్షమవుతోంది. నన్ను ఒక విచిత్రానందం అలుముకుపోయినట్లుగా ఉన్నదోయి!

'ఇల్లా ఉండగా ఒక భయము నన్ను ఆవేశించింది. మా వ్యాపారములు చాలా బాగానే ఉన్నాయి. మేమూ కొంచెం భాగ్యవంతులమనే చెప్పాలి కదా! అయినప్పటికీ బాలిక జమిందారీ కుటుంబంలో జన్మించింది. రాజ భోగములో పెరిగింది. రాచఠీవి ఆమెలో పుంజీభవించి ఉంటుంది. ఉంటే యీ సామాన్య సంసారంతో ఆమె కలయిక మా జీవితాలకి విషాదాంతం అవుతుందేమో!

'అంటే ఈ వివాహంవల్ల నాకూ నా కుటుంబానికి ఎడబాట్లయ్యే విధి వ్రాత తటస్థిస్తే నాకు జన్మాంతం తీరని వ్యధే కదా! పోనీ మా అన్నయ్యకిమల్లే నేనున్నూ ఉద్యోగంరీత్యా పర దేశంలో ఉంటానుగనుక పరవా లేదు అనుకుందాం (అల్లా అని అనుకోవడం నాకు చాలా కష్టంగా తోచినది). అయినా ఆ బాలిక నన్ను ప్రేమించక రాచపట్టిననే గర్వంలో మునిగి ఉండేందుకు ఎక్కువ సావకాశాలుంటవనుకో! అప్పుడు నా బ్రతుకు శూన్యమవుతుంది. ఆలోచన చేయలేకుండా ఉన్నానురా పరమం.

'ఈ పిచ్చి ఉత్తరాన్ని చూసి నన్ను పిచ్చివాణ్ణి అనుకున్నా సరే! ఈ సందర్భంలో నువ్వు దగ్గర లేకపోవడం, నాలోని చైతన్యం మాయమైనట్టుగా ఉంది. నువ్వా ఇప్పుడే కొత్తగా చేరుకొన్నావు నీ సంసారాన్ని . ఇంతలోనే మళ్ళీ వానప్రస్థాశ్రమం స్వీకరించరా అని ఎట్లా అన్ను? జాగ్రత్తగా ఆలోచించి జవాబురాయి. డాకుదొరకి కాకినాడ రాశాను. మా యిద్దరే నా కేడుగడలు.

'ప్రేమనేది నిజమేననిన్నీ, అది పుస్తకాల్లో మాత్రం ఉండే వట్టి బూటకమనేవారి వాదన అనుభవరహితమనిన్నీ మనం ఇదివరకే అనుకున్నాం. అట్లాంటి ప్రేమ నన్నిప్పు డావరించుకుందోయి. ఆ బాలిక నా హృదయాన్ని కాలుడు సత్యవంతుని జీవాన్ని బొమ్మలో లాగుతున్నట్లు లాగివేసిందిరా! అది నిజమైన ప్రేమకావచ్చును; లేక వట్టి వాంఛేనా కావచ్చును. కాని ఆ బాలికను నేను కరగ్రహణం చేయనినాడు నాజన్మ ఎడారి అని భావించుకుంటున్నా, ఏమో! ఆమెను చూడ్డానికి వెళ్లనిమునుపు పిల్ల తెల్లగా పాలిపోయి ప్రాణం లేకుండ క్షయరోగం పట్టి పీడించేవ్యక్తి లాగు, ఈదురో అంటూ ఉంటుందనిన్నీ, ఏదో కాస్త సంగీతం, కాస్తన్నర ఇంగ్లీషు, అరకాస్త తెలుగు, పరకకాస్త సంస్కృతం బలవంతంగా నేర్చిన చిలకల్లే ఉంటుందనిన్నీ, కన్ను, ముక్కు, గడ్డం విభేదం లేకుండా ఉండే మూర్తి అయివుంటుందనిన్నీ, మా బావా, నేనూ అనుకున్నాం. కాని, ఆమె మానవ బాలిక కాదురా, మన్మథ సృష్టిరా! సరస్వతి సపత్నిరా!

'ఏమి సంగీతం, ఏమి మాధుర్యం! ఆమె మూర్తి దాల్చిన కళాధిదేవతంటే నమ్ము. మేము అక్కడ కరిగిపోయాము. లోకోత్తరుడగు శ్రీరామయ్య గారి ఆంతరంగిక శిష్యురాలనని ఫిడేలు వాయిద్యంలో చాటుకుందిరా.

'మా బావ, భాషలు తదితర పాండిత్యం సానపైపెట్టి ఒరచిచూచాడు.

'ఆ బాలిక హృదయం చూరగొనాలి అని తన్మయుణ్ణయి, మతి చలించిన నాకు తీవ్రావేశం కలిగింది. ఆ బాలిక ఫిడేలు అందుకున్నాను. చెన్నపట్నంలో నేను నేర్చినవిద్య, వెంకటస్వామి నాయని మాధుర్యంతో, దక్షిణా పథాలు తిరిగి గమనించి హృదయస్థం గావించుకొన్న గోవిందస్వామిపిళ్ళే, చౌడయ్యల చమత్కృతులతో గుప్పేశాను సంగీతం వెన్నెల. ఆ రోజున ఎందుకైనా మంచిదని మహా అద్భుతంగా వేషం వేశాను. ఎలాంటి వస్త్రము అలంకరించానో నువ్వు ఊహించి ఉత్తరంలో రాయి.

'మరి ఆ బాల నన్ను విస్తుబోయి చూసిందని నా అభిప్రాయం. మా బావ అభిప్రాయం అదే!

'జవాబుకు ఎదురు చూస్తూ నువ్వు దగ్గర లేవని పరితపించే నీ నారాయుడు.'

౮
'ఔనా, కాదా?'

ఇంతలో లక్ష్మీపతి భార్య రమణమ్మ పిల్లవాని నెత్తుకొని బండి దిగినది. అన్నయ్య వచ్చాడూ! ఎంత సేపయింది అన్నయ్యా నువ్వు బండిదిగి? మందపల్లిలో వెంకట్రాయుడు మామయ్య గారి యింట్లో మాట్లాడుతూఉంటే పొద్దు పోయింది. ఇంతలో బాబు ఏడ్చాడు. నాలుగు వేడి మెతుకులు పెట్టి బయల్దేరాను. అత్తయ్య ఒకటే బలవంతం.'

'బావా, నేనూ వస్తున్నామని అత్తయ్యతో చెప్పడానికి సిగ్గుపడ్డావేమిటి? ఇందాకటినుంచి ఇంకా రాలేదని బావ ఒకటే చూడ్డం గుమ్మం వైపు!'

'నారాయణ గారూ, అల్లా చూసేరోజులు వచ్చాయి. నేను చూసే వాణ్ణో కాదో నీ హృదయానికి తెలవదురా వెఱ్ఱివాడా!'

'ఇలా యివ్వవే బాచిగాణ్ణి! రాడేం? కొత్తవచ్చింది! ఏడుపు మొగం పెట్టాడు. మీ నాన్న వచ్చాడురా. సూరీడూ! బాచిగాడికి తెచ్చిన గిలకలు, బొమ్మలు ఇల్లా తేవే. ఇవిగోరా! ఆరీ నీ!

లంచం యిస్తే వచ్చాడు. బావా వీడు ఓవర్ సీయర్ పని చేసేటట్టున్నాడోయి, అసాధ్యుడు. ఆ బూరా ఇయ్యి, నీ దగ్గరకు వస్తాడు. ఆ! వెళ్ళాడూ! వీడు తప్పకుండా, లంచగొండే! అచ్చా.' బాచిగాడు ఆటలో కెవ్వుమని కేరింతలాడినాడు. తండ్రి చేతుల్లో ఎగురుట ప్రారంభించినాడు. లక్ష్మీపతి తొనలు తిరిగి పండువలె నున్న తన కుమారుని ముద్దిడుకొని సూర్యకాంతం చేతి కిచ్చినాడు.

'బాచిగాణ్ణి నా కియ్యవూ సూరీడత్తయ్యా!' అని శ్రీరామమూర్తి తనయ, జానకి, బాలకు నెత్తుకున్నది.

చాకలివాడును, పనికత్తెయు వేడినీళ్లు తోడగా సుబ్బారాయుడు గారు, లక్ష్మీపతి, శ్రీరామమూర్తి, నారాయణరావు స్నానములకు బోయినారు. సూర్యకాంతం అన్న గార్లకు, బావ గారికి సబ్బుబిళ్ల లందించినది. మంగలివా డొడళ్లు తోమినాడు. రమణమ్మ తెల్లని తువాలుమడత లందీయ, దుడుచుకొని, యామె యందిచ్చిన పట్టు తాపి తాను ధరించి ముప్వురు వంటవసారా నంటియున్న పడమటింటిలో యథాస్థానముల నధివసించిరి. సుబ్బారాయుడు గారు కోడ లందిచ్చిన యంగ వస్త్రము చే దడియార్చికొని, పీట పైనుంచిన మడిపంచెల జతలో నొక దాని గట్టి, సంధ్యావందనము ప్రారంభించినారు.

జపము కొంత యగుటయు, వడ్డన ప్రారంభించవచ్చునని తన మామూలు పద్ధతిని విస్తరివైపు చేయిచూపి తలయూపి నారు. జానకమ్మ గారి యక్క గారు వడ్డన ప్రారంభించి పూర్తి చేయునప్పటికి, 'చతుస్సాగరపర్యంతం' అని ప్రారంభించి గోత్ర ప్రవరులు పఠించి, సంధ్యావందనము ముగించిరి. అందరు నొక్క సారిగా నాపోశనములు గ్రహించినారు. భోజనములు కొంత వరకైనవి. పచ్చడి కలుపుకొనుచు సుబ్బారాయుడు గారు తమ యల్లుని దిక్కు మొగమై 'మీరు ఆలస్యంగా వచ్చారు. బస్సు చెడిపోయిందా యేమిటి, దారిలో!' అని సంభాషణ ప్రారంభించెను.

మామ గారన్న లక్ష్మీపతికి మిక్కిలి గౌరవము, భయము, భక్తి . అల్లుడన పరమ ప్రేమ మామగారికి.

'కాదండి, విశ్వలాపురం జమిందారు గారు తల్లాప్రగడ లక్ష్మీసుందర ప్రసాద రావు గారు రాజమండ్రిలో ఉన్నారు...'

'అవును, ఆయన చాలా మంచివాడు. శాసనసభలో ఎప్పుడూ రైతుల తరఫున మాట్లాడుతూ ఉంటాడు. గాంధి గారి శకం రాక మునుపు, పేరు ప్రతిష్ఠలతో పూజింపబడే ఆంధ్ర నాయకులలో ఆయన ఒకరు. ఆయన్ని బాగా ఎరుగుదును. జమీందారైనా నియోగులలో చాలా గౌరవంగా జీవిస్తున్న నాయకుడు.'

'ఆయనకు వివాహం కావలసిన బాలిక ఒకర్తె ఉన్నది.'

'ఊఁ!'

జానకమ్మ గారు దొడ్డిలో చల్ల గాలికి కూర్చుండియున్నది; యీ మాట విని లోనికి జూచినది.

'మా చిన్న బావకు తమ కుమార్తెనిద్దామని వారికి సంకల్పం కలిగింది. వారూ మేమూ బెజవాడ ప్లాటుఫారంలో తారసిల్లాము. ఆయన నారాయణ బావసంగతి ఎల్లా గ్రహించాడో మమ్మల్ని బలవంతం పెట్టి రాజమండ్రిలో ఆపుజేశారు.'

‘వాళ్ళింట్లోనే!’ అని జానకమ్మ గారు అల్లుణ్ణి పృచ్ఛ జేసినారు.

‘అబ్బా! అప్పుడే జమిందారుల పేరు చెప్పేటప్పటికి ఒక్క గంతేసింది. బంగారపు తాళ్ళేట్టి యీడ్పించుకోవాలి. బంగారపు చీపురుకట్టతో కొట్టించుకోవాలి.’

‘ఊరుకుందురూ! మీ రెప్పుడూ వేళాకోళం చేస్తూనే ఉంటారు.’

‘ఇది వేళాకోళం అంటుందేమిటి? గాదిరాజువారి సంబంధం వచ్చినప్పుడు కట్నాల సంగతి మనం కాదు కాబోలు, నిష్కర్షగా చెప్పి వాళ్ళను ‘వచ్చిందే దారి’ అని అనిపించింది.’

‘అవును. మొదట నగలమాట వారు నిష్కర్షగా అడిగితే నేను లాంఛనాల మాటడిగాను. మీరు బెల్లంకొట్టినట్లు మాట్లాడక ఊరుకుంటే, ఇంత నిష్కర్షగా అడిగే వాళ్ళ సంబంధం ఇష్టం లేక ఆయెత్తు యెత్తాను. అది తప్పుటే అక్కయ్యా?’

‘తప్పనా ఏమి? జమిందారుకు వియ్యపరాల నౌతాననే సంతోషం చేత, కతికితే అతకదని విచారంలో మునిగి ఉన్నావనుకున్నాను’ అని సుబ్బారాయుడు గారు నవ్వగా జానకమ్మ గారు, శ్రీరామమూర్తి, లక్ష్మీనరసమ్మ గారు నవ్వుకున్నారు.

శ్రీరామమూర్తి: ఇంతకూ ఎక్కడోయి మకాం, రాజమండ్రిలో?

లక్ష్మీపతి: శ్రీనివాసరావు గారింట్లో.

శ్రీరా: ప్లీడరు శ్రీనివాసరావు గారేనా? జమీందారుగారూ, ఆయనా జీవికాజీవులే.

సుబ్బారాయుడుగారు: అమ్మయ్యా!

జానకమ్మగారు: మళ్ళీ మొదలెట్టారూ?

సుబ్బా: తర్వాత ఏం జరిగింది?

జన: మీ కిప్పు డాదుర్దా వచ్చిందేమి?

శ్రీరా: ఉండవే అమ్మా! లక్ష్మీపతిని చెప్పనియ్యి.

లక్ష్మీ: నారాయణా, నేనూ వెళ్ళి పిల్లనుచూశాం. అమ్మాయి చాలా అందంగా ఉంది. మంచి తెలివైన పిల్ల. బాగా చదువు చెప్పిస్తున్నారు. సంగీతంలో నిధి.

జన: చిన్న బాబు ఈమధ్య మరీ బాగా నేర్చుకొన్నాడన్నారూ!

లక్ష్మీ: అతనూ ఫిడేలు వాయించాడు.

లక్ష్మీపతి బావమరదివంక జూచినాడు. ఇంతవరకూ హృదయములో నానందరాగములు వినుచున్న నారాయణ రావు, చిరు బొమముడిలో బావగారివంక జవాబు పరపినాడు.

లక్ష్మీ: వారంతా మంచిరోజు చూచి మామ గారితో మాట్లాడ్డానికి వస్తారనుకుంటాను. జమిందారు గారు బావంటే వెఱ్ఱిపడిపోతున్నారు.

జమిందారు గారి యాడంగులు తెరవెనుక నుండి నారాయణ రావును చూచిరనియు, దాను బాలిక నింగ్లీషుభాషలో, తెలుగులో, నితర విషయములలో బరీక్ష జేసితిననియు, లక్ష్మీపతి చెప్పగా నందఱు వినిరి. ఎవరి యాలోచనలు వారి నలముకొన్నవి.

సావిట్లో సుబ్బారాయుడు గారు పెద్ద కుమారునితో సంబంధము విషయమై రాత్రి రెండుజాములవరకు ముచ్చటించి, తమ కా సంబంధము కాకుండుటయే మంచిదని నిశ్చయించినారు. లక్ష్మీపతి దక్షిణపుగదులలో తనగది జేరినాడు. నారాయణ రావు తల్లికడ జేరి జమిందారు గారినిగుఱించి ముచ్చటించి, తండ్రిగారితోపాటు తనకై యారుబయట వేసిన మంచము పై పవ్వళించి నిదుర పోయినాడు.

నాల్గురోజులయిన వెనుక పరమేశ్వరమూర్తి వ్రాసిన లేఖయు, కాకినాడ నుండి రాజారావు వ్రాసిన లేఖయు వచ్చినవి.

'నేను కవిత్వం వ్రాయలేను. అయినా కవిత్వం అంటే నాకు పరమ ప్రీతియన్న సంగతి తెలుసునుగదా. నువ్వు వ్రాసిన ఉత్తరం నాకు గల్గించిన సంతోషం, నేను పద్యాలు వ్రాసేవాణ్ణే అయితే నూరు పద్యాల్లో గుప్పి వేసే వాణ్ణి. లెక్కలవాణ్ణి కాబట్టి రెండుముక్కల్లో నా అభిప్రాయం తెలుపుతాను.

'ఒకటి — జమిందారు గారి కుటుంబానికీ మీ కుటుంబానికీ పొత్తు కలవదని మనం ఊహించడం న్యాయం.

'రెండు—జమిందారీ కుటుంబంలో నిష్కళంక మైనట్టిన్నీ, నిర్మల మైనట్టిన్నీ, ప్రేమపూరితమైన హృదయాలు ఉండడం అరుదు.

'మూడు— పెళ్ళికుమార్తెకు కూడా నువ్వంటే ప్రేమకుదరడం కొంచెం కష్టం.

'నాల్గు.అంత గొప్ప కుటుంబాలలో, నాగరికతలో మునిగి వున్న వాళ్ళలో ఆరోగ్యము చాల హీనముగా ఉంటుంది. నీకున్న బల సంపదకి బలహీనురాలై జన్మపొడుగునా ఏవో రోగాలతో మూల్గే బాలిక భార్య కావడం ప్రశస్తం కాదు.

'అయినా ఈ యాపత్తులకు పూర్వపక్షాలు ఉన్నాయి. అవికూడా చాలా ముఖ్య మైనవే.

'ఒకటి_జమీందారు గారు నీవిషయమై విపరీతమైన ప్రేమతో ఉన్నారు. తక్కినవాళ్ళెట్లా ఉన్నా, ఆయన ఒక్కడుచాలు రెండు కుటుంబాలూ సరీగ్గా ఉండడానికి. మీ కుటుంబము ఎప్పుడూ తప్పుచెయ్యదు. 'రెండు–నువ్వు చక్కని వ్యక్తిత్వము కలవాడివి. అందమైన వాడివి. జ్ఞానము కలిగిన మహారాజు కుమార్తెనైనా వలలో వేసికొనే వ్యక్తిత్వము ఉందని నా అభిప్రాయం.

'మూడు–నీఉత్తరాన్ని బట్టి చూస్తే, బాలిక చాలా ఆరోగ్యవంతురాలని స్పష్టముగా ఉంది. జమిందారు గారు ఆరోగ్యవంతులు.

'కాబట్టి నాకు జమిందారు గారి సంబంధములో ఏమి లోటు కనబడదు. నేను ఉత్తరములో ముఖ్యమైన మూడు విషయాలకన్న, అలంకారములతో అసలే రాయలేను. నా మాటలు కటువుగా ఉంటాయేమో! నేను రెండు రోజులలో బయలుదేరి వస్తాను. ఈలోగా జమిందారు గారి కుటుంబము విషయమై దరియాప్తు చేసి వస్తాను.'

ఇట్లు, నీ ప్రియమైన
జారావు

'ఒకనాడు ఐరోపీయ ప్రపంచాన్ని తన పాదాక్రాంతము నొనర్చిన మహోత్కృష్టుడైన 'క్రిష్టాన్' ఉన్నాడు. నేడు నారాయణు డున్నాడు.

'నీకు పాదములకడ తన సర్వస్వముతో తన్ను ధారపోసుకొనుటకు ఏ బాలయున్నా తగదని నా మనవి.

'నిన్నుద్వాహమై ఆ బాలిక తన బ్రతుకు సువాసనాలహరిలో లీన మొనర్చుకోవాలి.

'చిన్నతనాన్నుంచి నేను కలల్లో తేలియాడేవాణ్ణి. సౌందర్యోపాసనామయమైన నా బ్రతుకు అందానికే దూరమైంది. నా పురుషత్వ సంపద, ఉత్కృష్ట సౌందర్య స్వరూపమైన యోషారత్నము పదముమ్రోల సమర్పింప తలచుకొన్న నా తపస్సు నిర్జలభూమిలో నూయి త్రవ్వినట్లయినది. సర్వకళా స్వరూపమైనటువంటి నా హృదయం చివికిపోయింది.

'కుంచెకొసల్ విచిత్రలత గూర్చి మనోహరవర్ణభంగి మూర్తించి, పరీమళావృత శరీరరుచుల్ పొదివించి కంఠమున్| పంచమరాగ గీతికల పల్కితి, తేనెలు వాకలూర, మాధ్వ్యంచిత దివ్యసుందర సుధామయ భావములల్లు వెట్టుచున్.'

'ఆ భావం భావమాత్రమే అయింది. అల్లాంటి సందర్భములో నీఅదృష్టం గమనించుకో. నీహృదయాశయమైన బాలికామణికై ఎదురు చూడవచ్చును. నువ్వే ధైర్యంగల మగవాడివైతే మహాత్మా గాంధి గారు ఉపదేశ మిచ్చి నట్లు విధవా వివాహం చేసికొని ఉందువు. విగత భర్తృక లైన బాలలు విద్యా సంపన్నులు, సుందరీమణులు పెక్కుమంది ఉన్నారు. నీకు ధైర్యము లేదు. సరేనయ్యా! ఎల్లావచ్చిందో సంబంధరూపంగా వరంలా ఒక బాలిక, విద్యా స్వరూప, కళాకోవిద, అద్భుత సౌందర్యమూర్తి! నువ్వు అదృష్టవంతుడవు. 'ఆలోచించక సంబంధం ఒప్పించు. నేనే దగ్గర ఉంటే! చాలా బాగుండేది.

'షెల్లీ ఏ కోర్కెకై సంఘ బహిష్కారం పొందాడో, కీట్సు ఏ అందరాని ఫలముకై ఆశించి ఆశించి లోకాంతరాలు చేరాడో, డాంటీ ఏ ఉత్కృష్ట భావంతో ఆనందమయమైన కవిత్వం సృష్టించాడో, రొజెటీ ఏ దివ్యపథములో వసించి భగ్నమెన ఆ బ్రతుకులో తన గీతికాగుళుచ్ఛము బలి యిచ్చినాడో, ఆ మహా ప్రణయము నీకు వరమైతే హామ్లెటు లా 'అవునా కాదా?' అన్న సంశయంలో పడబోకు.

'సరే. నేను రెక్కలుకట్టుకుని మా రాణీ గారితో వస్తున్నా. ఒదలి ఉండడం కష్టం గనుక బాబయ్యగారి అనుమతిమీద వచ్చి, పెళ్ళితంతులన్నీ నడిపిస్తాం. సూరీడు, కన్నతల్లి పిల్ల కాయలు నువ్వు వచ్చావని మురిసి మురిసి విరిసిపోతారు.

నేను నీయొక్కే! పరం'

౬

రాయబారం

కలెక్టరుగారు తహసీల్దారు గారు, రాజమహేంద్రనగరము లోని పెద్ద వకీళ్లు, చెన్న పట్టణము నుండి జమీందారు గారి మేనల్లుడు ఆనందరావు గారు, పదిమందిన్నీ కిటకిటలాడుచు నవుకర్లతో, చాకర్లతో, ఒక్కసారిగా సుబ్బారాయుడు గారి ఇంటికి వచ్చినారు.

సుబ్బారాయుడు గారు, చుట్టములకని వేరే కట్టియుంచిన మేడహాలులో పడక కుర్చీలమీద, పేముకుర్చీలమీద, దిండ్లకుర్చీలమీద నందఱు నధివసించినారు. కొత్తపేట డిప్యూటీ తహసీల్ దారుగారప్పుడు 'సుబ్బారాయుడు గారూ! కలెక్టరు గారు, తహసీల్దారు గారు వీరందరూ తమతో ముఖ్యమైన పని ఉండి వచ్చారు. తమ రది కాదనక నిర్వర్తించడం మా కందరికీ చాల సంతోషప్రదమైన సంగతండి.'

సుబ్బా: చిత్తం. తమరు సెలవిస్తే నేను కాదనేవాణ్ణి ఎప్పుడూ కాదండి.

డి. కలె: తొందరపడి మాట యీయకండి. మాటయిస్తే మేము వదలం.

సుబ్బా: చిత్తం.

తహ: సెలవియ్యండి ఆనందరావు గారూ! వారు జమిందారు గారి మేనల్లుడు గారు. చెన్నపట్నంలో పెద్ద న్యాయవాదులు.

సుబ్బా: చిత్తం, నే నెరుగుదునండి.

ఆనం: శ్రీరామమూర్తి గారు మాకు పూర్వ స్నేహితులు. మా కెప్పుడు అప్పీళ్లు పంపిస్తూనే ఉంటారు. వారు పట్నంవస్తే నన్ను చూడకుండా వెళ్లరు. శ్రీరా: ఆనందరావు గారూ నేను 'లా' కాలేజీలో ఒక్కసారే చదువుకున్నాం. ఇన్నాళ్ళకు వారు మా యింటికి విచ్చేసి, మా ఆతిథ్యం అంగీకరించే భాగ్యం మాకు కలిగింది.

డి. త.: అల్లా అనకండి. ముందర మా ఇంటిలోకి ఏర్పాటులన్నీ అయినాయి. వారు మీ యింటికి రావడానికి చాలా అభ్యంతరాలున్నాయండో శ్రీరామమూర్తి గారూ!

ఇంతలో ఊరిలోని పెద్దలు నలుగురు నాహూతులయివచ్చి, యథోచితాసనముల నధివసించిరి.

ఆనం: మా మామయ్య గారు, వారి ద్వితీయ పుత్రిక ను తమ ద్వితీయ పుత్రున కిచ్చి వివాహం చేయ సంకల్పించుకుని మమ్ముల నందరిని తమ్ము ప్రార్థించుటకై పంపినారు. తమరు ఆమోదించవలెనని మేమంతా కోరుతున్నాము. వారి కోర్కెను పాలించవలసిందని మనవి.

సుబ్బా: చిత్తం. ఎంతమాట! వారు జమిందారులు. మేము సామాన్య గృహస్థులం. ఆగర్భ శ్రీమంతుల పిల్లను నా కుఱ్ఱవానికి ఇస్తామని మీరయితే అనుగ్రహించినా నేను చూస్తూ చూస్తూ ఎలా సాహసించను!

ఆన: తమరలా సెలవీయకండి. భాగ్యభోగ్యాల కేమి? వారికున్నది వారికుంది. మీకున్నది మీకుంది.

డి. త.: పేరొక్కటి లోపం గాని మీరుమాత్రం తక్కువవారా? మీ ఐశ్వర్యం ఏ జమిందారీకి తీసిపోతుంది?

సుబ్బా: తమ రదొకటి పెట్టకండి. మా ఐశ్వర్య మెంత? మే మెంత? ఏదో అన్న వస్త్రాదులకు లోపం లేకుండా గుట్టుగా కాలక్షేపం చేయడంతప్ప నే నంతటి వాణ్ణికాను. అందులో జమిందారీ సంబంధాలకు తూగే తాహత్తు ఎంతటి సంసారికయినా ఉండదు.

అందుకనే పెద్దలు 'సమయో రేవశోభతే' అన్నారు.

డి. కలె: మీరు సమానులు కారంటే మేమంతా తెలివిమాలిన వాళ్ళమవుతామే కాని ఇతర మేమి లేదు. ఈ వినయసంపద మిమ్మల్ని సమానులనే కాదు, అధికులను చేస్తూ ఉంది. ఆమాటంటే మళ్ళా మీ మొదటి ఆక్షేపణే సిద్ధిస్తుంది కాబోలు! భేరీ జోకొట్టడమే గాని మేము మాకు మాటలు చెప్పలేము. వారు జమిందారులనే సందేహం మీకు సుతరామూ అక్కర లేదు. వారి యోగ్యతా, ప్రజారాధనతత్పరతా మీరైనా ఎఱుగంది కాదు. అనవలసి అంటారేకాని, జమిందారు గారు ఏలాగైనా మీవంటి సంపన్న గృహస్థులతో వియ్యమందాలని కుతూహలపడుతున్నారు. మేమంతా అందుకు ప్రేరకులం, అనుమోదకులం. మీరు మా మాట తీసివేయరని ఆశపడివచ్చాం .

అంతలో నా యూరి కరణము వెంకటరాజుగా రందుకొని, 'సుబ్బారాయుడు బావగారు! మీరు సందేహించకండి. మీ ఉభయులకు సర్వ విధాలా తగిఉంటుంది సంబంధం. బంధుకోటి కందరికీ వాంఛనీయమైనది కూడాను. జమిందారుగారనగా రత్నాకరుడివంటి వారు. ఆ శ్రీమహాలక్ష్మి మీ అబ్బాయిని వెదకికొంటూ వస్తే కాలొడ్డి అతిలౌక్యం చేయకండి బావగారు. కలెక్టరు గారు, తాసిల్దారుగారుకూడా యింతగా చెబుతూంటే మీరు వెనకాడ కండి' అన్నారు. సుబ్బారాయుడుగారి కీ యనురోధ పరంపరలో ఏమి చేయడానికి తోచక, 'నేను వారిమాట తీసి వేయాలని కాదు. అల్పుడనని జంకుతున్నాను' అనుచు పుత్రునివంక నొక చూపు సారించిరి.

ఇంతలో మరల తహసీల్దారు గారు దొరక బుచ్చుకొని 'మీరు అల్పులో, అధికులో ఆ విషయం మాకు వదలి పెట్టండి. విశ్వలాపురం జమిందారు గారు పేరుకే గాని ఆచార వ్యవహారాల్లో జమిందారులు కారు. కాబట్టి వారితో యెత్తు లెత్తలేమనే సంశయం మీ కక్కఱ లేదు. అయినా మీరు పుచ్చుకొనే వారే గాని, యిచ్చే వారు కానప్పుడు మీ కా భయ మక్కర లేదు' అన్నారు.

సుబ్బా: చిత్తం, పుచ్చుకోడానికికూడా అర్హత ఉండాలి. వారు యేనుగులను, గుఱ్ఱాల్ని , దాసదాసీజనాన్ని యిస్తే వాటిని భరించడానికి కూడా శక్తి ఉండదు మావంటి వాళ్లకు.

వెంక: ఈ పేదరుపుల కేమిగానండి, బావగారు తల యెగర వేయండి. నేను అక్కగారికి చెప్పివస్తాను. రావోయి, అల్లుడూ!

అంటూ శ్రీరామమూర్తితో ఆయన జానకమ్మ గారికడ కేగెను. ఇచట సుబ్బారాయుడుగా రేమియు పాలుపోవక, 'తమవంటివారందరూ యీ స్వల్ప కార్యంమీద నాయింటికి దయ చేయడం, నేను తమ ఆజ్ఞకు అంజాయించడం నా కెంతో కష్టంగా వుంది. జమిందారు గారు మా కుఱ్ఱవానికి తమ అమ్మాయి నిస్తామనడం ఒక యెత్తూ, దిగ్గంతులవంటి తమందఱూ, ఆనాడు సప్తర్షులు హిమవంతుడి దగ్గరకు వెళ్లినట్టుగా రాయబారం రావడం ఒక యెత్తున్నూ. ఇంతకూ, విధిసృజన వాళ్లిద్దరికీ రాసిపెట్టి ఉండడంవల్లనే మీవంటివారు పూనుకోవడం కలిగింది' అంటూ ఉపచారవాక్యాలు చెప్పుచుండగా వెంకట్రాజు గారు తిరిగి వచ్చి, వియ్యపురాలితో బెండ్లికొడుకుతోగూడ మాటలాడి వచ్చితి ననియు, వారందఱకు నంగీకార మేననియు చెప్పి 'ఏమంటున్నారు, మా బావ గారు? ఇక నెలాగూ యిది తప్పేది గాదండోయి, మెడలు విఱిచి అంటగట్టడమేగాని' అనుచు మేలమాడిరి.

సుబ్బా: తథాస్తు. కానివ్వండి. ఉభయత్రా పెద్దలు, మీ అందఱి మాటకు నేనుమాత్రం ఎదురు చెప్పుతానా!

అన్నంతలో అందఱును 'శుభం, శుభం' అనుచు మందహాసము లొనర్చిరి. వెంటనే సీతారామాంజనేయ సోమయాజిగారొక యాశీర్వచన పనస నారంభింప, సభలో నున్న తక్కిన బ్రాహ్మణోత్తము లందుకొనిరి.

పిమ్మట వెంకట్రాజుగారు, డిప్యూటీకలెక్టరుగారితో, 'చిత్తం, యిక నేమున్నది తరవాయి? మంచిరోజుచూచి మనవాళ్లు రాజమండ్రికి ముహూర్త నిశ్చయంకొరకు వెళ్లిరమ్మని సెలవాండి' అనియెను.

శ్రీనివాసరావుగా రంతట 'మరేమిటంటే, మళ్లా యెప్పుడో చూడడ మెందుకు? ఉండవలసిన సిద్ధాంతు లందరు ఇక్కడనే ఉన్నారుగా విచారించండి 'శుభస్య శీఘ్ర' మ్మన్నారు. మొన్న నారాయణరావు గారు రాజమండ్రి వచ్చినప్పుడు, నేను పుట్టిన తారీఖు అడిగితే, పెట్టెలోంచి, మరేమిటంటే, జాతక చక్రం తీసియిచ్చారు. జాతకం చాలా బాగుందన్నాడు మా సిద్ధాంతి గారు. అమ్మాయి జాతకానికి కూడా చాలా బాగా సరిపోయిందన్నాడు. రెండు జాతకాల్ని బట్టి ముహూర్తం రహితం చేయించడం ఉత్తమం. ఏమండీ సిద్ధాంతి గారూ!

సిద్ధాంతి: చిత్తం! అది తమతో మనవి చేయకుండా నేను చూశానండి. రేపు వైశాఖమాసంలోనే ఉంది, సర్వోత్కృష్ట మైన ముహూర్తం. సప్తమ శుద్ధి, గురుశుక్రబలం బాగుంది. కుజుడు ఏవిధంగానున్నా దోషకారిగా లేడు; అన్ని బలాలు బాగున్నాయండి! చాలా జయప్రదంగా వివాహం జరుగుతుంది. దాంపత్యం దివ్యంగా ఉంటుంది.

ఆనంద: తమది పెద్దపూర్ణయ్య గారి మతమా, చిన్న పూర్ణయ్యగారి మతమా అండి?

సిద్ధాంతి: అయ్యా ! నేనుమాత్రం చిన్న పూర్ణయ్య గారిని పూర్తిగా అనుసరిస్తాను. ఏమంటారా, శాస్త్రంలో ఏమన్నా దృక్సిద్ధం లేక పోతే నిజమైన ఉపయోగం లేదండి.

మృత్యుంజయ రావను నొక రాజమహేంద్రవరపు న్యాయవాది: అయ్యా దృక్సిద్ధం అనేది పాశ్చాత్యులు దూరదర్శినీయంత్రాలు చూసి వ్రాసిన వ్రాతల్ని బట్టేకదా! ఇప్పటి కింకా 'హైపీరియా' నని 'ప్లూటో' అనీ కొత్త కొత్త గ్రహాల్ని కని పెట్టుతున్నామంటారు. కొన్ని కొన్ని మార్పులకు శాస్త్రీయమైన జవాబు కన్పించదాయెను. మనవాళ్లు, అంటే మహాఋషులు అతీంద్రియ దృష్టితో చూచి ఏర్పరచిన లెక్కలన్నీ మార్చి, ఇప్పుడు దృక్సిద్ధాంతం కావాలి అంటారు. చివరికి ఈ దృక్సిద్ధాంతం నిలవకుండా ఎగిరిపోయేరోజు వచ్చిందాకా ఈ సిద్ధాంతాన్ని విడవరు కాబోలు.

తహసీల్: అదికాదండి. నేనూ కాస్త ఈమధ్య జ్యోతిషం నేర్చుకోవడం ప్రారంభించాను. మనవాళ్లు ఏర్పరచిన లెక్కలున్నాయి చూశారూ, దృక్సిద్ధాంతం రూపకంగా సరిచూడమనే సెలవిచ్చారు. అల్లా చేయకుండా ఆచారం అనీ సంప్రదాయం. ఆ మాటలకు నిజమైన అర్థం గ్రహించకుండా ఒకటే పంథా, మరీ గుడ్డెద్దు చేనిలో బడ్డట్టు.

మృత్యుం: చిత్తం. తమరు సెలవిచ్చినది నిజమే మరి. కాలాన్ని బట్టి మనం ఆకాశపటంలో ఏమి గమనించాలో, భూమిమీద వాటినిబట్టి ఏమి మార్పులు వస్తున్నాయో అన్నీ చూసుకుంటూ ఉండనక్కర లేకుండా, గానుక యెద్దులాగ తిరగాలి అని సిద్ధాంత శాస్త్రాలు ఘోషించవండి. పాశ్చాత్య సిద్ధాంతాలు రోజుకోమాటు మారుతూ ఉంటాయి ఎందుచేత? అసలు సిద్ధాంత జనానికి ప్రాతిపదికమైన నిజం గోచరంచేసుకోకుండా ప్రత్యక్ష ప్రమాణమనే మాయావాదానికి దాసులై నిజాన్ని రోజుకోసారి, నిమిషానికోసారి మార్చుకోవడం వున్నదే, అది తప్పని నా మనవి. మన వాళ్లు ఆ అసలు నిజమైన తత్వం

పారలౌకికదృష్టి చేత తెలిసికొని, మార్గములు మనకు ఏర్పరిచారు. వాటిలో మనకు కావలసినవి తీసికొని తక్కిన వానిని తీసి వేస్తే ఎట్లాగండీ?

శ్రీని: మీరంతా సిద్ధాంతులు. మేము కొన్ని సంగతులు తెలుసుకోవాలని ఉంది. ఇప్పుడు గ్రహాలకి కారకత్వాలు కొన్ని యిచ్చారు. రాసులకు వేరు వేరు భావాలు నిరూపించారు. అల్లా యివ్వడానికి తగిన ఆధారం ఏమిటి? శుక్రుడు స్త్రీ గ్రహం అని అంటారు. పురాణాల్లో శుక్రుడు పురుషుడుకదా. చంద్రుడు అంతే. మరేమిటంటే, ఇది అంతా నాకో విచిత్రం క్రింద ఉంటుందండి.

డిప్యూటీకలెక్టరు: అయ్యా శ్రీనివాసరావు గారూ! వచ్చిన పని పూర్తి చేసి మీ సిద్ధాంత చర్చలు ప్రారంభిస్తే బాగుంటుందేమో?

ఆనం: అదే నా మనవి.

సుబ్బా: మా సిద్ధాంతి గారికి కబురు పంపాను.

శ్రీరా: భోజనానికి ఇంటికి వస్తారట. గోపాలపురం వెళ్లారట.

సుబ్బా: సరి, ఇక నేమి తమందరూ ఈ పూట నా ఆతిథ్యం స్వీకరించి నన్ను కృతార్థుణ్ణి చేయాలి. ఎన్నడూ రానివారు యీ నిమిత్తాన దయ చేశారు.

డి. త.: నే నందటికి ప్రయత్నం చేయించాను. క్షమించండి' అనుటయు సుబ్బారాయుడు గారికడ వారందఱు సెలవుతీసికొని డిప్యూటీతహసీలు దారుగారింటికి వెడలిపోయినారు.

౧౦
దేశాంతర్గతుడు

రామచంద్రరావు కాకినాడ నుండి రంగూను వెళ్ళినాడని తెలిసి, సుబ్బారాయుడి గారి ఇంట్లో అందరు కంగారుపడిరి. సూర్యకాంతమ్మయు, జానకమ్మ గారును కళ్లనీరు నింపుకొనుచు వాపోవజొచ్చిరి. సుబ్బారాయుడు గారు లోనికి వెళ్లి నాలుగుచీవాట్లు పెట్టిరి. ఆ రోజుననే బయలుదేరి లక్ష్మీపతియు, నారాయణరావును కాకినాడ వెళ్లినారు.

కాకినాడలో రామచంద్రరావు సంగతి యంతయు దేట తెల్లమయ్యెను. రామచంద్రరావు సూర్యకాంతము భర్త. ఇంటరు పరీక్షలో గృతార్థుడు కాలేకపోయినట్లు వార్తాపత్రికలలో బ్రచురింపబడుటతో, రామచంద్రునకు మతిపోయినది. రామచంద్రుడు భౌతిక శాస్త్రాదులలో నుద్దండుడు. అతనికి నింగ్లీషు భాష మాత్రము కొంచెము దూరపుజుట్టమైనది. పదార్థవిజ్ఞాన, రసాయన, వృక్ష శాస్త్రములలో గ్రమముగా దొంబది, యెనుబదియాఱు, నెనుబది యొక్క గుణము లాతడు సంపాదించెను. ఇంగ్లీషులో నూటికి ముప్పది మాత్రమే వచ్చినవట. తెలు గంతయ న్యాయము గా లేదు. నలుబదియైదు గుణములు వచ్చినవి. కాబట్టి తప్పిపోయినను, మొదటితరగతి గుణములు వచ్చినవి. ఒక భాగముననే కృతార్థుడైనాడు.

నారాయణరావు కొత్తపేటలో వినినప్పుడే శాస్త్రపాఠములలో మొదటి గుణములు సముపార్జించి ఇంగ్లీషుభాషలో దప్పిపోవునని యనుమానించి లక్ష్మీపతి కది వెల్లడించినాడు. తుదకట్లే అయినది.

రామచంద్రరావు తండ్రికొక యుత్తరము వ్రాసిపెట్టి యోడ నెక్కినాడు.

'శ్రీ బాబయ్యగారి పాదాలకు వందనాలు. మన దేశంలో నిజమైన విద్యాదీక్షకు తావు లేదు. మన దేశంలో చదువు అంతా గుమాస్తాలను తయారుచేసే చదువు. దానికి తగిన విషయ ప్రణాళికే ఏర్పరచారు పరీక్షలకు. ఇంగ్లీషులో మార్కులు వచ్చితీరాలి అని నిబంధన ఉండడం యొక్క ఉద్దేశం అది. నేను ఇంగ్లీషుపరీక్షలో నెగ్గవలసివస్తే శాస్త్రజ్ఞానానికి నీళ్ళు వదలుకోవాలి. ఈ మీ తనయుని పరిశ్రమకు పాశ్చాత్య దేశాల్లో వచ్చిన ఖ్యాతి మీ రెరిగే ఉన్నారు. మీకు నన్ను పాశ్చాత్య దేశం పంపడానికి ఇష్టము లేదాయెను. కనుక మీ పెట్టె మారుతాళంతోతీసి, అందులో ఉన్న అయిదు వందల రూపాయలనోట్లు తీసికొని ఓడ నెక్కాను. ఈ దొంగతనానికి క్షమించండి. నేను ఎల్లాగో అల్లాగు అమెరికా చేరుకుంటాను. అమెరికా హార్వర్డులో చదువుతాను. అక్కడకు తాము ధనము పంపిస్తే అదృష్టవంతుణ్ణి. లేకపోతే అక్కడ కాయకష్టపడి ఎల్లాగో సంపాదించుకొని చదువు పూర్తి చేసుకుంటా. ఈ జరిగిన విషయం అంతా నేను జాగ్రత్తగా ఆలోచించి చేసినదే. శ్రీ అమ్మ గారి పాదాలకు ఆమెనిద్రపోతుండగా నిన్న రాత్రే నమస్కరించాను. మీ యిరువురి ఆశీర్వచనం నాకుంటే లోకాలుజయించగల్ను .

నమస్కారం
విధేయుడు మీ కుమారుడు,
రామచంద్రం

ఈ యుత్తరం చదువుకొనునప్పుడు మరల కనులలో నీరుతిరిగినది భీమరాజు గారికి. తల్లి మూల బండుకొని యతికరుణముగా నేడ్చుచునే యున్నది.

అప్పుడు నారాయణరావు, లక్ష్మీపతి, భీమరాజు గారు లోనికిబోయి యామె నోదార్పబూనిరి. నారా: అత్తయ్య గారూ! ఏమిటి మీరల్లా అధైర్యపడతారు! పట్నవాసంలో ఉన్నారు. ప్రపంచం సంగతి చూస్తున్నారు. సరోజినీదేవి గారివంటి ఉత్తమ స్త్రీల ఉపన్యాసాలకు వెళ్ళి వింటున్నారు. ఆంధ్రమహిళాసంఘంలో మీరు పేరుపొందిన సభ్యురాలుగా ఉన్నారు. ఎంతమంది మనదేశములో యీనాడు పాశ్చాత్య దేశాలకిపోయి అత్యుత్తమ విద్యల నేర్చుకోవడం లేదు! మీరు వీరమాతలు. మీ అంతట మీరే 'నాయనా పాశ్చాత్య దేశాలకు వెళ్ళవలసివుంటే వెళ్ళిరా' అనవలసింది.

లక్ష్మీ: పిన్ని గారూ! అక్కడకు వెళ్ళి లోక ప్రఖ్యాతి సముపార్జించటానికి నోచుకొన్నాడు, మా తమ్ముడు!

భీమ: (భార్య దుఃఖంవల్ల ఎక్కడ లేని ధైర్యముగలిగి) సరే, మీటింగు ముందరి మాటలూ ధైర్యమూ, కష్టం కలిగినప్పుడే అక్కఱకు రావాలి. ఎందుకు ఏడ్పు? ధైర్యంతో వెళ్ళాడు. శౌర్యంతో వస్తాడు.

రామచంద్రరావు తల్లి దుర్గమాంబ గారు లేచి 'నాయనా నారాయణ రావు, బాబూ లక్ష్మీపతీ! ఏం చెయ్యను. ఒక్కడే కొడుకు, ఒక్కటే కాన్పు. ఆడదాన్ని కబుర్లకయినా అక్కరకు రాను. నా శక్తి స్వభావం అంతే! ఏం చెయ్యను? నాతో రెండు నెల్లనుంచి వాదిస్తున్నాడు. నేనన్నాను, చదువు కోసము పాశ్చాత్య దేశాలకు వెళ్ళాలా! గాంధీగారు 'పాశ్చాత్యవిద్య ఆత్మ వికాసాన్ని చంపుతుంది. రామమోహనరాయివంటి వాడు పాశ్చాత్యవిద్య లేక పోతే ఇంకను వేయి రెట్లు మహాఋషి అవును' అని చెప్పలేదా? అని నేను వాదించాను. వాడు 'నువ్వు చెప్పిందంతా నిజం, అమ్మా! కాని మనం శాస్త్ర పరిశోధనలలో నూతన విషయం కనిపెట్టితే,

ఇంగ్లీషువిద్యలో పెద్దపట్టా పొందితే గాని, ఆ సంగతి లోకం ఒప్పుకోదు. కాబట్టి నేను జర్మనీకి లేక అమెరికాకో వెడతాను' అంటూ వుండేవాడు.

భీమ: ముందు కర్తవ్యం ఆలోచించకుండా ఇలా అన్నాను, అలా అన్నాను అని కూర్చుంటే ఏమి లాభం?

అందఱు కలిసి వారి మేడయింటిలో మధ్యహాలులో కూర్చుండినారు.

బుద్ధవరపు భీమరాజు గారు పూర్వకాలమునుండియు కాకినాడలో వర్తకము చేసి ధనికులైన పెద్ద కుటుంబముల వారిలో నొక కుటుంబమునకు పెద్ద. ఆయన వర్తకమునకు, లౌకికమునకు వీలయిన చదువుమాత్రమే చదువుకొన్నారు. కానీ కుబేరునకు వన్నెదిద్దు వ్యాపారపు సరళి, సులువులు, చాకచక్యము, వ్యాపార యుద్ధనీతి సంపూర్ణముగా నెగిన బ్రాహ్మణ శ్రేష్ఠి. పట్టణములోని వారెల్ల వారి కుటుంబమును బ్రాహ్మణ శ్రేష్ఠు లనే పిలుచుచుందురు.

ఆయనకు లేక లేక రామచంద్రరావు విపరీత మేధాసంపదతో జన్మించినాడు. అతనికి వర్తకమన వైముఖ్యము. దానికి తగినట్లు భీమరాజు గారికి వ్యాపారములో నష్టము తర్వాత నష్టము వచ్చి, మూడులక్షలన్నర రూపాయలు మట్టిపాలయినవి. అప్పటి నుండియు, మంచి గడుసరియైన భీమరాజుగారు వర్తకం, ఎగుమతి దిగుమతులు మానివేసి, చేతికందినంతమట్టుకు ధనము సేకరించుకొని ఇంపీరియల్ బ్యాంకులో రెండులక్షల యిరువది వేలు నిలువ చేసి, ఆ వల్ల వచ్చిన ధనముతో సుఖముగా గాలక్షేపము చేయుచున్నారు. ఆయనకు భూములన్న నమ్మకము లేదు. స్వసౌఖ్యము కొఱకు, కంపెనీ దొరలకు 'సప్లయి' కొఱకు, మామిడి మున్నగు ఫలవృక్షములు గల తోట నొకటి పిఠాపురం దగ్గర సంపాదించినారు.

అట్టి భీమరాజు గారి యేక పుత్రునకు నాల్గువేలరూపాయల కట్నము, రెండువేల రూపాయల లాంఛనములతో నారాయణరావు నాల్గవ చెల్లెలి నిచ్చి వివాహ మొనర్చినారు. సుబ్బారాయుడుగారన్న భీమరాజు గారికి గౌరవము, భీమరాజు గారన్న సుబ్బారాయుడు గారికి గౌరవము.

నారాయణ రావు, లక్ష్మీపతి, భీమరాజుగార లాలోచించి రంగూనులో భీమరాజు గారి స్నేహితున కొకనికి తంతివార్త నిచ్చిరి.

తన కుమారుడు పాశ్చాత్య దేశములకు వెళ్ళి ప్రఖ్యాతిగడించుట భీమరాజు గారికి సంతోషమే, కాని తనకు కావలసినంత యున్నది. వట్టి పేరు ప్రతిష్ఠలవలన కలుగు లాభమేమి? ఒకడే కుమారుడు, కాని దేశాల నుండుట, అక్కడ బాలుని కనిపెట్టి చూచు దిక్కెవ్వరు లేకపోవుట, కొంచెము జబ్బు చేసిన తలిదండ్రు లరచేత ప్రాణములుంచుకొను వారే. ఆ దూరదేశములు కుఱ్ఱవానికి పడునా? ఎట్టి చదువో? వాడు ఎన్ని ఇబ్బందులుపడునో? చలిఎక్కువ. తిండి వేఱు. అన్నిటికన్న పాశ్చాత్యదేశ వనితలు పాల్పడని వైపరీత్య మేది కలదు? భీమరాజుగా రీ భయములు తన బావమరదుల జెవిలో కంఠాన గద్గదిక తో నేకరువు పెట్టినారు.

నారాయణరావునకు గుండె గుభిల్లుమన్నది. పాశ్చాత్య దేశముల కేగిన యువకు లెందరో తెల్లని మేనులకు వలచి, దిగ్భ్రమనొంది, హృదయములు ఆ శ్వేతకాంతల పాదములకడ ధారవోసికొనినారు. అట్టి వారికి ఇంటికడ భార్య బానిసవలె రాక్షసివలె కన్పించును. ఎంతమంది భారతీయులు దీపము కడ శలభములవలె నరించి

పోయినారుకాదు? రామచంద్రుడు చిన్న వాడు, డబ్బుకలవాడు. సంస్కారహీనలు, పురుషుల వలపింప నేర్చిన మాయలాడులు నగు తుచ్ఛవనితలు వేలకు వేలు పాశ్చాత్య దేశమున గలరని యాతని నమ్మకము. వారి వలలలో భారతీయ యువకులెందరో చిక్కినారు. భగవంతు డెట్టి విపరీతముల నొనరింపనున్నాడో యని లక్ష్మీపతి చెవిలో నూదినాడు.

ఆ రాత్రియంతయు బావమరదు లిరువురు గాఢాలోచనలో నిదుర నెఱుగరు.

లక్ష్మీ: నీకు చాలా భయమురా బావా! మానవప్రకృతి యెల్లప్పుడు కుటిలముగా సంచరిస్తుందనా నీ భావము? నారా: కాదోయి! స్థానబలము మనం ముఖ్యంగా గమనించవలసిన విషయం. స్థానబలిమివంటిదే స్థానవైపరీత్యమున్నూ.

లక్ష్మీ: సరి, నువ్వు ఒక్కడవు మదరాసులో ఉంటున్నావు కదా, మదరాసులో కుఱ్ఱవాళ్ళు పాడవ్వాలంటే ఎన్ని మార్గాలు లేవు? మన వారెవ్వరూ అక్కడ లేరు. అయినా ఎందుకు నువ్వు తగలబడి పోలేదురా మఱి?

నారా: నీ వాదన నాకు అర్థమైందోయి. ఒకటిచూడు. భరత దేశంలో ప్రతి వ్యాపారంలో ముఖ్యజీవితాదర్శమైన సత్యమును సాధ్యమైనంత వరకు మరచిపోకుండా గమనించేటట్టుగా మన్ని మన పూర్వ నాగరికత తయారు చేసింది. ఆ నాగరికతయే ఈ నాటికిన్ని ఏదో రకంగా ఏదో రూపంగా సర్వత్రా వ్యాపించి ఉంది. అట్టి సంప్రదాయబలమే మన్ని ఇక్కడ కాపాడుతోంది.

లక్ష్మీ: సరే అదీ ఒప్పుకుంటాను. అయితే, నువ్వు పాశ్చాత్య దేశం వెళ్లే వాళ్ళసంగతి జాగ్రత్తగా ఆలోచించు. వాళ్ళలో మూడురకాల మనుష్యులు. డబ్బుండి, పాశ్చాత్య నాగరికత అనుభవిద్దామని, చదువుపనిమీదో ఆరోగ్యం వంక మీదో లేకపోతే స్వతంత్ర ప్రభువులైన మహారాజులలాగ సరదాగానో వెళ్ళేవాళ్ళు మొదటిరకం.

నారా: అవును బావా ! అటువంటి వాళ్ళు వెళ్ళి చేసేపని ఏముంది? మన దేశంలో ధనం తీసుకుని వెళ్ళి అక్కడ తగల బెట్టడమే! మన దేశం బీద దేశం, పాశ్చాత్య దేశాలు భాగ్యవంతములైనవి. అందులో ఇంగ్లండు, ఫ్రాన్సు, అమెరికాలు మఱీని. వారికి విషయ సౌఖ్యమే ఆదర్శం. అందుకోసం ఎన్ని చిత్రాలో సృజించుకొన్నారు. వాట్లకోసం పది ఖర్చు చేసేచోట వేయి ఖర్చు. కాని పాశ్చాత్యులు మన దేశం వస్తే మన దేశంలో అన్నీ వెట్టి చవుక. వారికి మన దేశంలో ఖర్చు పంటికింద పోక చెక్క.

లక్ష్మీ: ఇంక రెండోరకం. ఉద్యోగం కోరి వీలయిన చదువు కొఱకు వెళ్ళే వాళ్ళు. ఇంగ్లాండులో చదువులన్నీ అట్లాంటివే. మూడోరకం వాళ్ళు పూర్ణమైన జ్ఞాన సముపార్జనమాత్రం కారణంగా పెట్టుకొని వెళ్తారు.

నారా: అలాంటి వాళ్ళు ఆ వ్యామోహంలోపడి పాడయిపోయి జ్ఞానసముపార్జనోద్దేశం మఱచిపోవ రటోయి మఱి? ఆ హాని ఎదురుగా అమ్మ వారిలా నోరు తెరచుకొని లేదూ?

లక్ష్మీ: అల్లా పాడయ్యే వాడికి నిజమయిన విద్యావ్యసనం లేదన్నమాట!

నారా: నువ్వు చెప్పిన కారణాలు గ్రహించక అనటము కాదు. నిజమే! శాస్త్ర జ్ఞానం పూర్ణముగా సంగ్రహించుటే వ్రతంగా పెట్టుకొని వెళ్ళినవాడు ఉత్కృష్టజీవే! మన రామచంద్రుడు ఆ విధమైన తన్మయతలోనే ప్రయాణం సాగించాడు. పాశ్చాత్య దేశాలు

వెళ్ళవలసివస్తే చిన్నతనంలో వెళ్ళడమే మంచిదని ఎరుగుదును. కామశక్తి మాంచి యౌవనంలోనే మనుష్యజీవితాన్ని కదల్చి వేస్తూ ఉంటుంది. ఆ సమయంలో కామపరమైన మాయలకు మనుష్యుడు నిముషంలో లోబడిపోతాడు. చిన్నతనంలో కుర్రవాడు వాని దీక్షలోనే ఐక్యమై యుంటాడు. కాబట్టి వాడికి వాడి విద్యతప్ప వేరాలోచన కించిత్తైనా పుట్టనిమాట నిశ్చయం. పైగా పరిపక్వమగుటకు సిద్ధమవుతూన్న అతని హృదయానికి అపరిచితమైన విషయాలన్నీ భయంకల్పించే నీడలు. వాటిని నిరోధించటానికి అతడు చేసే ప్రయత్నం కృత్రిమము లేని సత్యహృదయంతో చేసేదే. అందుకనే చిన్న తనమే చాలా ఉత్తమం. కాని ఎంత చెప్పినా చెల్లాయి బాధపడుతుందని భయం నన్ను కదల్చివేస్తూంది బావా!

లక్ష్మి: ఓయి వెఱ్ఱి వాడా! యీ భయాలు నీబోటి ఉత్కృష్ట మానవునికి తగవురా!

౧౧

చిన్నవాడు

ఆ రాత్రియంతయు నారాయణరావునకు నిద్రపట్ట లేదు. సూర్యారావు పేటలో భీమరాజు గారి మేడమీద ఆరు బైట వేసిన మంచముమీద వెల్లకిల బరుండి నారాయణరావు అశ్వినీ దేవతలు, బ్రహ్మహృదయము, అనూరాధ, తుల, వృశ్చికము, ధృవుడు మొదలగు తారామండలమునంతయు జొచ్చి చూచు చూపులతో గమనించుచుండెను. నక్షత్రవిరాజితమగు నయ్యాకాశకాండపటములో దన చిన్ననాటి కోర్కెలన్నియు నాతనికి మూర్తములై గోచరించినవి. చిరుత కోర్కెలతో దేశాలు గ్రుమ్మర దానును గోరువాడు. పాశ్చాత్యదేశము లాతని మనోలోచనాలకు దన చుట్టముల గ్రామములరీతి దోచెడివి. సీమ దేశములో రాణి గారు, రాజు గారుందురనియు, నచట నన్నియు బంగారపు మేడలనియు నాత డూహించుకొను వాడు. రాజమహేంద్రవరమునకు దూరమై గోచరించు పాపికొండల వెనుక సీమదేశమని వాదించువాడు తోటి బాలురతో. వీధులలో డబ్బులు, బేడకాసులు, పావలాలు, రూపాయలు చిమ్మియుండునని భావించెడివాడు.

సీమ దేశములోని భాగములే జర్మనీ, ఫ్రాంసు, ఇటలీ మొదలగు దేశములని యెంచెడివాడు. ఆ చిన్న నాటి యూహాప్రపంచమంతయు దాను విన్న కథలలో నల్లిబిల్లిగా నల్లుకొనిపోయి యుండునది. రాములవారి పుష్పక విమానముమీద తానధివసించి ఏకాలమును దేశాటనము చేయుటయే కోరువాడు. ఆనాటి కలలలో రాజకుమారిక రాక్షసులు, రాజులు, రాజ్యాలు కనబడ్డవి. తాను రెక్కలున్న గుఱ్ఱముపై స్వారి చేయుచునో, 'జయ పరమేశ్వరా' యని తాదలంచుకొన్న చోటికి వాయువేగ మనోవేగములతోను దన్ను గొనిపోవు మంత్రపు బాంకోళ్లపై నెగిరిపోవుచునో తన తండ్రి గారి కథలలో రాజకుమారునివలె గత్తి పుచ్చుకొని రాక్షసుల నుక్కడగించుచునో యుండువాడు. రాజకుమారికలను వివాహమాడు వాడు. ఎనిమిది సంవత్సరముల ప్రాయమునాడు, నారాయణరావు కలలో 'దేశము' 'స్వరాజ్యము' వినబడ్డది. తెల్లవారు మన దేశములోని ధనము కొల్లగొనుచున్నారను భావములు చొచ్చిరా నారంభించినవి. బెంగాలులోని యువకులు చేయుచున్న వానికంటె భయంకరమైన బాంబులు తయారుచేసి భరత ఖండము తప్ప, మిగిలిన దేశములను భస్మీపటల మొనరింపవలెనన్న తీవ్రేచ్ఛలతో నాతని హృదయ మావేశపూరితమైపోయినది. ఒకనాడాతడు ముఖముమీద 'వందేమాతరం' అని వ్రాసికొని, తోడి బాలురకుకూడ వ్రాసి, పాఠశాలకు వెళ్ళినాడట ! ఆనాడాతని తరగతి ఉపాధ్యాయుడు, వీరినందరిని బల్లమీద నిలుచుండ బెట్టి యా వ్రాత కడిగివేసికొన యాజ్ఞాపించెను. నారాయణరావు తన్నురిదీయవలెనేగాని మొగముమీద వ్రాత జెరపనన్నాడు. నారాయణుని తెలివి తేటలు, వినయ విధేయతలు, రూపసంపదయు నుపాధ్యాయులంద యనురాగమును జూరగొన్నను, ఆ నాడు నారాయణరావిచ్చు జవాబులచే నుపాధ్యాయులకు వెఱ్ఱియెత్తిపోయినది 'మొదట నోరుముయ్యి! తర్వాత మొఖంమీద రాత చెరిపెయ్యి, లేకపోతే నీ వీపు చితకకొడతా!' అన్నాడు ఉపాధ్యాయుడు.

'మీరున్నూ తెల్లవాళ్ళ స్నేహితులే! మాకు స్వరాజ్యం కావాలి, అందుకని నేను చెరపను. వీళ్లెవ్వరూ చెరపరు' అని జేవురించిన మొగముతో బాలకుడగు నారాయణరావు సింహదమనునివలె గర్జించినాడు.

ఆ ఉపాధ్యాయుడు తెల్లబోయినాడు. పేము బెత్తముదీసి రెండు దెబ్బలు వీపుమీద చురుక్కున జఱచినాడు. నారాయణరావు చెంగున బల్లపై నుండి యురుకుటయు,

నుపాధ్యాయుని చేత నుండి బెత్తము లాగుకొని, ముక్కలు ముక్కలుగా విరిచి పారవేయుటయు, గనుమూసి తెరచునంతలో జరిగినది. బాలకులందరిలో పొడగరియై, చక్కని దేహ సౌష్ఠవముగల నారాయణరావు మోమున నపుడు వెలుగు నపూర్వ తేజము గాంచి ఉపాధ్యాయుల వారు భయకంపిత హృదయులై, మోము వెల్లనైపోవ, మ్రాన్పడిపోయినారు. బాలకులు భయాశ్చర్యములతో, ఏమి జరుగునోయని తేరిపార జూచుచుండిరి..

నారాయణరావు 'రండబ్బా! వందేమాతరం' అని కేక వేసి వీధిలోనికి దారితీయ, బాలకు లాతని వెనుక 'వందేమాతర' మని కేకలు వేయుచు వీధిని బడిరి.

ఆరాత్రి, సుబ్బారాయుడు గారు పుత్త్రుని బిలిచి యంతయు దెలిసికొని కోపగించిరి. ఉపాధ్యాయుడు నారాయణరావును సమీపించి 'నాయనా నేను పిల్లలుగల వాణ్ణి. నీకిట్టిపనులు సేయుట కెవరు బోధించారో నాకు తెలియదు. నా ఉద్యోగ మూడబీకి వేస్తారు. తిండికి గుడ్డకు దూరమై ముష్టి చెంబు చేతికి వస్తుం'దని నీళ్ళు తిరుగు కళ్ళు తుడుచుకొనుచు వక్కాణించినాడు. నారాయణరావుకును గనుల నీరుతిరిగినది. అప్పటినుంచి పాఠశాలలో నాత డెప్పుడట్టిపనులొనరింప లేదు. నారాయణరావు మొదటి ఫారము చదువుచుండగా నైరోపీయ మహాసంగ్రామము ప్రచండోష్ణవాయువువలె విశ్వమెల్ల వీవదొడంగెను. నారాయణరావు లేత హృదయమున నాంగ్లేయుల పైనపుడు జాలిపొడమినది. 'ఈనాడు వారికి రాజ్యవినాశము సంభవించి విపత్తు వచ్చినది. పాపము తెల్లవారి బాలకులెందరో తండ్రులులేని బాలకులైపోదురు. కాన, వారికి మనమంతా సహాయం చేయాలి' అని వాదించాడు తోడిబాలురతో. సరేయన్నారు వారు. చందాలు వసూలు చేసి, తాను తల్లిగారినడిగి పదిరూపాయలు చందావేసి, మొత్తము పదునేను రూకలు పెద్దకలెక్టరుగారు కొత్తపేట మకాము వేసినప్పుడు నిర్భయముగా వారిని దర్శించి 'యుద్ధమునకు మా బాలకుల చందా' యని సమర్పించినాడు. ఆ యాంగ్లోద్యోగి ఆశ్చర్యపూరితహృదయుడై ఈ నూలుపోగు వేయి మడుంగులు శక్తి గల త్రాడగుననియు, ప్రభుత్వము వారి తరఫున నా చిన్నబాలకునకు ననేక నమస్కారము లర్పించుచున్నాననియు, నాంగ్ల సామ్రాజ్యమున కానాడు సంభవించిన యాపత్తునకు భారతదేశము చూపు రాజభక్తి, యనన్యసామాన్య మనియు, నట్టిభక్తికి నీ బాలకుడే నిదర్శనమనియు నిండుసభలో నుపన్యసించుచు, తనకడనున్న లాంబ్ కవి శేఖరుని 'ఎలియా' వ్యాసముల గ్రంథము నారాయణరావునకు బహూకరించెను.

నారాయణరా వీయాలోచనలు తన్నలమికొన, హాయిగా నిదురగూర్కు లక్ష్మీపతిని గమనించి, యేల యిట్లీతనికి సుఖనిద్ర పట్టెనని యాశ్చర్యము జెందినాడు. ఒకరికి గష్టమగు విషయ మింకొకరిని రవంతైన చలింపజేయదు. ఒక్కరిని సంతోషసముద్రమున నోలలాడించువిషయమే వేరొకరిని దుఃఖజలధిని ముంచును. ఏ సందర్భములోనైన హృదయ మావంతయు జెదరనీయని తాను, రామచంద్రరాయని ప్రయాణముచే నిట్లు కలత జెందుచుండ, లక్ష్మీపతి, తన మరదలిభర్త యిట్లు దేశములు తెగించిపోవుట కించుకైన జలింపక, గాటముగా నిదురించుచుండుట గాంచి, సృష్టిలో నొక్కొక్కరి ప్రకృతి యొక్కొక రీతి నుండునుకదా యని నారాయణరా వనుకొనెను. లక్ష్మీపతిని లేపుదామాయని యాతనికి గోర్కె జనించినది. కాని వెంటనే మరల్చుకొని నాడు. వివిధములగు రంగులతో, విచిత్రములగు కలయికలతో మేళవింపై నిగూఢార్థపూరితమగు మానవజీవిత మంతయు జక్కని చిత్రలేఖనమేయని యాత డనుకొన్నాడు.

కావుననే, ప్రకృతిని ప్రాతిపదికగా, నాధారభూతముగ నొనర్చుకొని కళాసృష్టి చేయవలసివచ్చినది. ప్రకృతి ననుసరించుటయు నొక కళాసాంప్రదాయమగుట

సంభవించినదని, యాత డూహించుకొన్నాడు. సర్వదా మన కనులయెదుట నుండి, మనకు జిరపరిచితములగు వస్తువులే ఛాయాచిత్రమగుట తోడనే ఆనందము సమకూర్చుచున్న వని యాతడనుకొనెను.

ప్రక్కయంతయు జల్లబడిపోయి హాయిగ జల్లగాలి వీచుచున్నను, నారాయణరావు తనకు నిదుర పట్టుట లేదని వితర్కించుకొని నాడు. నిదురబోవునపుడు మనఃప్రవృత్తులడగిపోవునా? ఆతురతవలననో, యే గాఢాలోచనా తీవ్రత వలననో మెదడు పనిచేయుటచే నిదురబట్టదు కాబోలు! తన బావమరది ఖండాంతరములకుపోయి యశస్సు గడించివచ్చును. ఇందు విషాదకారణ మేమున్నది? సూర్యకాంతమన్న దనకు నెక్కుడు ప్రేమ. ఆ బాలకు గష్టము కలుగు నేకార్యమైన దనకు విషాదము కలిగించును. కావుననే నేడు తానట్లు గజిబిజిపడిపోవుటకు గారణమైనది.

అహో! యీ నిర్మలాకాశమున మిరుమిట్లుగొలుపు నీ వేలకొలది తారలు నిశ్శబ్దగీతికలు పాడుకొనుచున్నవి. ఈ నిశ్చలత ధ్వనిపూరితమయ్యు నిశ్చలత యెట్లయ్యెను? ఈ నిశ్శబరాగాన, నీ కీచురాళ్ళు నిద్రలోని ఉచ్ఛ్వాస నిశ్వాస స్వనములు, దొడ్డిలోని యావుల కదలికలు, నక్షత్రమండలమునుండి రాలిపడు నుల్కలు, దారినిబోవు బడిగంట, యుదయించు చంద్రకిరణము, నెటనుండియో వినవచ్చు బాలకుని యేడ్పు–నీవియన్నియు, నెట్లు సమన్వయింప బడినవో! ఒక్క రాగములోని స్వరకల్పనమైనవి.

నారాయణరావు హృదయమున నీయఖండసృష్టిపై ప్రేమ పొంగిపొరలి పోయినది. ఆతడు భూమ్యాకాశముల నిండినట్లయినది. నీలగగనము, నిశ్చల తారకలు నాతనిలో లీనమైపోయినవి. తనకు బ్రాణవల్లభగా నిశ్చయింపబడిన శారదాదేవీస్వరూపమై ప్రకృతి తన్ను కౌగిలించుకొన్నది.

శారదాదేవి నిరుపమాన సౌందర్యవతి. తానెంత పుణ్య మొనర్చెనో యా బాలికను భార్యగా బడయుటకు, ఆమెతో దా నోలలాడనున్న స్వర్గ సౌఖ్యము లాతనికి గోచరించినవి.

తన్ను జిరునవ్వుతో, దారానయనములతో, చంద్రకాంతి పుష్పముల బోలు బుగ్గల సుడులతో జేరవచ్చు శారదలో లక్ష్మీపతిని, సూర్యకాంతమును, రామచంద్రుని విడివిడిగా జూచినాడు. వారలలో దనతల్లి గోచరించినది. అందఱు నొక్క సంశ్లేషంబున చంద్రబింబమై గగనవీథిపథముల నెటకో తేలియాడుచు బోవుచున్నారు. తా నేరి యంకముపైననో శిరము వాల్చి, శీతలమై, హంసతూలికాసమమై, మెత్తనగు నా తొడలో కరగిపోయినాడు. ఆ తొడయే చంద్రబింబమైనది.

రెండుగంటలు లోనిహాలులోని గడియారము 'టంగు, టంగు' మని పాడినది. నారాయణరావు నిదురలో మైమఱచినాడు.

౧౨
వివాహము

రాజమహేంద్రవరములో సమస్తవైభవములతో శ్రీ శారదా నారాయణరావుల వివాహమహోత్సవము జరిగినది.

అప్పురిలో జమిందారుగారి మందిరములన్నియు గన్నుల వైకుంఠముగ నలంకరించినారు. రోడ్లు, తోటలు పందిళ్లు వేయించినారు. జమిందారుగారి మేడలకు

నాతిదూరాన రెండు మహాభవనములు మగపెండ్లి వారికి విడిది లేర్పరచిరి. విడిదికడనుండి జమిందారు గారి మందిరములవరకు నొక పందిరి. విడిదిల కడను, జమీందారు గారి మేడలకడను, చాందినీలు, గులోబులు, అగరునూనెల గాజుదీపాలబుడ్లు, తీగెల పండ్ల గెలలు, మెరుపుల పాదరసపుబుడ్లు, బుట్టలు, పూలతోరణములు, కొబ్బరికాయల గెలలతో పందిళ్ళలంకరించినారు.

జమిందారు గారి విశాలభవనములో విశాల సభాస్థలమున వివాహ వేదిక నమర్చినారు. చిత్రాలంకార శోభితమై యా వేదిక దివ్యమై వెలుగొందు చున్నది. వివాహసభామందిర మంతయు జుట్టములచే, సభ్యులచే గ్రిక్కిరిసి పోయినది. న్యాయవాదులు, జిల్లాకలెక్టరు, జమిందారులు, జిల్లా జడ్జి, పోలీసు సూపరింటెండెంటు, ఇంక ననేకులు ఉద్యోగులు, పురప్రముఖులు సభ నలంకరించినారు. ఆంధ్రాది దేశములనుండి పేరెన్నికగన్న వారెల్లరు ఆనాడు సభాభవనమున గ్రిక్కిరిసినారు. అందఱకు బఱపులు, దిండ్లు నమర్చినారు. పెండ్లి వారందఱు నొకయెడ నధివసించినారు.

పొన్నుస్వామి సన్నాయి మేళము వచ్చినది. మంగళ వాయిద్యములు భోరుమనినవి. ‘అయంముహూర్త స్సు ముహూర్తోస్తు’ అనుచు బురోహితులు మంత్రములు చదివిరి.

సభామధ్యమున నయిదువేల తులముల వెండిగంధపుగిన్నెయు, బంగారు పన్నీరుబుడ్డియు, బంగరు అత్తరువులదానును నొక దంతపుబీఠికపై నమర్పబడెను. సభలో నచ్చటచ్చట బీఠములపై సువాసన ధూపముల నెగజిమ్ము బరిణ లమర్చినారు.

పండితోత్తములు సముద్ర గంభీర స్వనముల వేదఘోష సలుపుచున్నారు.

ఆడువారికి వివాహవేది కు సమీపమున తెరలమధ్య నొక స్థల మమరించినారు.

సర్వాలంకార శోభితయై, పాలసముద్రమున జన్మించిన లక్ష్మీబాలవలె నున్న పెండ్లికొమరిత, శారదను గంపలో గొనివచ్చినప్పుడు, పట్టు పీతాంబరముల ధరించి, వెడదయురమున హారములు శోభింప నారాయణరావు నాందీ శ్రాద్ధమునకు లోనికి బోవునప్పుడు, జమిందారుగారు భార్యాసమేతులై సాలంకృత కన్యాదానము చేసి ధన్యులగునప్పుడు, నూతన వస్త్రాలంకార శోభితులై వధూవరు లొండొరుల ప్రక్క నధివసించినప్పుడు, మంగళ వాద్యములు బోరన విప్రాశీర్వాదములు దిశలునిండ నారాయణరావు శారదకు మంగళసూత్రధారణ కావించునప్పుడు, వధూవరులు తలబ్రాలు పోసికొనునప్పుడు జానకమ్మగారును దక్కుంగల చుట్టము లెల్లరు నపరిమిత సంతోషమున నోలలాడిరి.

వివాహ సమయమున జమిందారుగారు భూరిసంభావన లిచ్చినారు. రాజమహేంద్రవరములోని వితంతూద్వాహ మండలివారికి వేయిన్నూటపదాఱు లిచ్చిరి. జమిందారు గారి బంధువులు స్నేహితులు వధువునకు విలువగల బహుమతులు గొనివచ్చినారు. కొందఱు వెండి చెంబులు, కొందఱు కాఫీగిన్నెల దొంతరలు, గంధపుబుడ్లు, వెండి సబ్బు పెట్టెలు, బంగారు నగలు మొదలగు రకరకముల పారితోషికము లొసంగిరి.

పెండ్లికొమరిత చుట్టములందరు నవనాగరికులు. ఆంధ్రదేశములోని సంపన్న గృహస్థులు, ఎల్లప్పుడు పట్టుచొక్కాలు ధరింతురు. జుట్టు నున్నగా దువ్వుకొందురు. కంటి యద్దములజోళ్ళు వారికి సార్వకాలిక భూషణములే. ఆడువారికే కంటియద్దము లున్నవట. వారెప్పుడు నూరేగింపులకు రారు. సభల నలంకరింపరు. వారందరకు సేవకులు, సేవకురాండ్రు పెక్కు రుందురు. తమ బిడ్డలకు పాలిచ్చుకొను ముత్తయిదువులు వారిలోలేరు.

కొందఱు బాలికలు కాళ్ళకు జరీ పువ్వుల మొఖమల్ జోళ్ళు సంతతము తొడిగికొని యుండుటచే పాదములకు బారాణిపూయుటకు వీలులేకపోయినదట.

మగవారు మగపెండ్లివారితో బంక్తిభోజనమునకు రాలేదు. అచటి గాయకుల గానసభలు వారి హృదయము లాకర్షింప లేదు. స్వంత బ్రాహ్మణులు దారిచూప వారికి వేరుగా నేర్పరచియున్న భోజనశాల కరిగి భోజనము చేయుట, వార్తాపత్రికలు, 'నావెలు' గ్రంథములు చదువుకొనుట, సిగరెట్లు కాల్చుకొనుట వారి దినచర్యయైయుండెను.

మగపెళ్ళివారు పల్లెటూరి వారు. ఆచారాదికములు వారికి మెండు. ఊరేగింపునకు వారుసిద్ధము. వెలగల బనారసు చీరలు ధరించుట, దేహమెల్ల బంగారు నగలు ధరించుట, పాదముల బసుపుపారాణులు పూయించుకొనుట, పేరంటములకు దండ తండములుగా వచ్చుట, పెండ్లిపాటలు పాడించుట, పాడుకొనుట మున్నగు బెండ్లితంతులెల్ల మగపెండ్లి వారి యాడంగులే గుత్తకు గైకొనిరి. వియ్యపురాలికి, నాడుబిడ్డలకు నయిదురోజులు మొగములు కడిగించుట మొదలగు తంతులన్నియు క్రమముగా జరుగవలెను గాన, ఇష్టము లేకపోయినను వరదకామేశ్వరీదేవి ప్రతివేడుకకు రావలసివచ్చినది.

మగపెళ్ళివారిలో మగవారు అన్ని సభలకు హాజరు. వారి సంగీత ప్రీతియు, దలలాడించుటయు, జేతులతో తాళము వేయుటయు వింతగా జెప్పుకొనిరి.

జమీందారిఫాయాలో జేరిన ఆడపెండ్లివారికి మగ పెండ్లివారి ఆడువారు కాళ్లకు నగలతో పసుపు బారాణులతో ముత్తయిదువులవలె కనిపించిరట. గజ్జలగుఱ్ఱములవలె దోచినారట!

'ఇంత పల్లెటూరివాళ్లని మనం అనుకున్నామటమ్మా. వట్టి మోటు అడవి మనుష్యులవలె ఉన్నారు. ఈ సంబంధం ఎక్కడ తెచ్చారండీ అత్తయ్య గారూ!' అని వరదకామేశ్వరీ దేవితో నొక దగ్గరిచుట్టము, సరోజని, యనినది. 'అమ్మా, శారదను తీసుకు వెళ్ళి పల్లెటూళ్ళ పేడదొడ్లలో పడవేశారేమమ్మా?' అని శకుంతలాదేవి చిన్నవోయిన మోముతో ననినది.

'వదినా! మీ అమ్మాయికి మా అబ్బాయికన్న చాలగొప్ప సంబంధం తెచ్చారనుకొన్నాము. చూడ ముచ్చట వేస్తోంది. మా వైపు పనిచేసేవాళ్లు ఇంతకన్న చాలా నాజూకుగా ఉండిపోతారే' అని జగన్మోహనరావు జమిందారుగారి తల్లి శివకామసుందరీదేవిగా రనిరి.

'అవునండీ పిన్నీ, వాళ్ళ బట్టలు వాళ్లే ఉదుక్కుంటారట. పిడకలు చేసుకుంటారట. నీళ్లు తెచ్చుకుంటారట. పొలాలు వెళ్ళి గడ్డీగడ్డీ కోసుకు మోపులుకట్టి తెచ్చుకుంటారట' అని జమిందారు గారి వేలువిడిచిన మేన కోడలు లలితకుమారిదేవి యనినది.

'ఆ నగలేమిటి? ఆ బొట్లేమిటి? ఆ చీరలేమిటి? గాడిదలకు దిగబోసి నట్లే! కోరి కోరి వేదికి వెదికి తెచ్చారే!' అని మఱియొక శ్రీమతి ముక్కుపై వేలు వైచుకొనినది.

అందఱు వెడవెడ నవ్వులు విరగబడి నవ్వుకొని నారు. వియ్యపురాలు జానకమ్మ గారు గూడ వారి హేళనకు గురియైనది.

'ఆవిడేనా వియ్యపురాలు! కూడా వచ్చిన పేరంటాలనుకున్నాను!' అని హైకోర్టు న్యాయవాది ఆనందరావుగారి భార్య ప్రమీలా దేవి యనినది.

'ఇంతకూ మా శారద అదృష్టం యిలా అయింది' అని వరదకామేశ్వరీదేవి కన్నుల నీరునింపుకొంది.

ఆ ప్రక్కనే సోఫాపై నధివసించి యీ సంభాషణ లాలకించు శారద హృదయము పరిపరివిధముల బోయినది.

ఆమె తోటిబాలిక యోకర్తామెకడనే వసించి యున్నది. ఆ బాలిక కేలనో నారాయణరావు చక్కనివాడని తోచినది. ఆ బాలకు మొన్న మొన్ననే వివాహమైనది. ఆమెవరుడుగూడ శ్రీమంతుడు. విద్యావంతుడే! అయినను తేజస్సుతో నిండిన నారాయణరావు మొగము, అతని రూపసంపద ఆ బాలికకు జూడముచ్చటయైనది. ఆ బాలిక శారద పినతండ్రి కుమారితె. ఆమె పేరు నిరుపమా దేవి. ఆ బాలిక జనకుడు చెన్నపట్టణములో న్యాయవాదిగా నున్నాడు. శారదకు, నా బాలికకు మిక్కిలి స్నేహము. 'శారద! నీ భర్త ఇంగ్లీషు భాషలో చాల గొప్పవాడే!'

'ఎల్లా తెలిసిందే నీకు?' క్రొత్తక్రొత్త ప్రపంచములో గన్నులువిప్పు నీ బాలికకు సిగ్గులుండరాదని వారి మతము. సిగ్గుపడువారిని గాంచి పల్లెటూరి వారని వారిలో వారే నవ్వుకొందురు.

సంబంధము తండ్రి తెచ్చినాడు. బాబయ్య గారు తెచ్చిన సంబంధము నందు లోపము లుండగూడదు. పెళ్ళి వారందరూ పల్లెటూరివారే. పల్లెటూరివా రగుటయే లోపమైనచో బాబయ్యగారి కది గొప్ప సంబంధమని యెట్లుతోచినది? బాబయ్య గారికి తనపై చాల ప్రేమ. ఎందు కిట్టి సంబంధము తెచ్చినారు? లోన సిగ్గుపడుచు... పెండ్లి ... చాల అందంగా ఉండెననియా అనుకొనినది. అంతలో ఆమె త్రపాహృదయయై ఆ యాలోచన మానికొన్నది. ఆమె మోము చిరునవ్వున ప్రఫుల్లమైనది.

'ఏమిటే శారదా! చిరునవ్వు నవ్వుతున్నావు' అని నిరుపమాదేవి యన్న ది.

'ఏమి లేదే?'

'వూరక నే నవ్వుకుంటారటే!'

'ఏదో ఆలోచన తట్టి నవ్వు వచ్చింది.'

'ఏమిటా ఆలోచన! మీ ఆయనమీదేనా?'

'నువ్వు నన్ను వేళాకోళం చేస్తావేమిటే? వరసా తెలవదు వావీ తెలవదు!'

'నువ్వు వరస కాకపోవచ్చును. కాని బావగారు కాదా ఏమిటి?'

నిరుపమకు బావగారా! నిరుపమ తనకన్న కొంచెము పెద్దదిగా! నిరుపమ యా యాలోచన గ్రహించి 'బావగారని ఎందుకన్నా నంటావు? మనం ఇద్దరం కొంచె మెచ్చుతగ్గు ఒకేయీడు. అందుకని బావగారన్నా తప్పులేదే!'

నిరుపమ నారాయణరావును సంతతము మేలమాడునది. నిరుపమ ఆడు పిల్లల పాఠశాలలో నయిదవ ఫారము చదువుకొనుచున్నది. నారాయణరావా బాల హృదయము చూరగొనినాడోయన నిమేషమేని నాతని వదలక ఇంగ్లీషులో సమస్త విషయముల గురించి

మాట్లాడునది.

శారద యిది యంతయు జూచి యించుక యక్కజమందినది. నిరుపమ శారదను జూచి—

'మీ ఆయన చాలా తెలివైనవాడే. ఏ సంగతైనా నేనడిగేటప్పటికి, అతివిపులంగా తెలిసేటట్లుగా మంచి కథలా చెప్తాడే. ఎన్ని సంగతులు! ఎంత బాగా తెలుసును! మా మాష్టరుగారు పుస్తకము చదువుకొనివచ్చి మా కందరకూ చెప్పితే నిద్రవస్తుంది. నాకు ఇంటిదగ్గర చెప్పే మా మాష్టరు గారు చెప్పిన దానివల్లను పాఠం అర్థంకాకపోవడమూ ఉన్నది. కాని మీ ఆయన అద్భుతంగా పాఠం చెప్పగలడు. ఆయనదగ్గిర పాఠాలన్నీ చెప్పించుకుంటూంటే చాలా బాగా ఉండును' అని పంచమస్వనంతో పలికింది.

'చెన్న పట్నంలోనే ఉంటావు! అక్కడ అన్నీ చెప్పించుకోవచ్చును.'

'అదిగో అప్పుడే ఉడుకుపోతుతనం! ఎక్కడ వీలవుతుంది? మా నాన్న గారితో చెప్తాను. మీ ఆయనకు చాలా బాగా సంగీతం వచ్చునట. పెండ్లి కూతురు చూపులకు వచ్చినప్పుడు ఫిడేలుమీద ఆద్భుతంగా వాయిస్తూ పాడినారట కాదూ! అమ్మ దొంగా! చెప్పావుకాదు. బొమ్మలు వేయడంకూడా బాగా వచ్చునట!'

'ఏమో నాకేమి తెలుసునే నిరుపం! నువ్వు అవ్వికూడా నేర్చుకోవచ్చునులే!'

ఆ దినమెల్ల శారద తాను వినిన మాటలు, నిరుపమా దేవి పొగడ్తమాటలు దలచుకొనుచు నేయున్నది. ఆయన పల్లెటూరి అనాగరికులలో నొక వ్యక్తియా కాదా యని యామె తర్కించుకొనినది. ఆతని యుత్కృష్ట వ్యక్తిత్వమును ఆమెకు గోచరించినది. అంతకన్న నా బాల యాలోచింపలేదు. ఆలోచించుట కామె హృదయమునకు బరిపక్వస్థితి రాలేదు. నిరుపమ నగరవాసిని. అట్టి బాల కన్ని సంగతులు తెలియును. తనవా రెల్ల నట్టులనిరేమి? నిరుపమ యీరీతి బల్కినదేమి? ఆ రోజున ఆయన వాయించిన ఫిడేలు వాద్యము ఎంత అద్భుతమైనది!

పెండ్లి రెండవరోజు మధ్యాహ్నము జగన్మోహనరావు జమిందారు పెండ్లికుమారిత శారదకడకు వచ్చి, ప్రక్కనే సోఫాపై అధివసించినాడు. శారద ఎంత యందకత్తె! సినిమానటియగు సులోచనవలె యున్నది. శారదకీ యంద మెక్కడనుండి వచ్చినది? ఆమె తన కౌగిలిలో లతవలె నిమిడి పోవును. తన కిచ్చెదరనుకొన్న యీ బాలిక నే డింకొకని భార్య యైనదా? ఎవడీ నారాయణరావు ? ఈ సంబంధ మెట్లు తీసికొనివచ్చినారు? పందికిని బాలలక్ష్మికిని పాణిగ్రహణమట!

'శారదా! ఏమిటా గర్వము? మాట్లాడుట మాని వేసినావు? మంచి పోతరించిన గిత్తలావున్న మొగుణ్ణి తెచ్చుకున్నానని గర్వమా ఏమిటి? ఎక్కడ నుంచి తెచ్చారు నీ కీ మొగుణ్ణి? కాకిముక్కుకి దొండపండు కట్టినట్లు నిన్ను తీసుకెళ్ళి వట్టి బండాడికి కట్టిపెట్టారు. మామగారికి ఎల్లా నచ్చిందీ సంబంధం? అత్తకు నచ్చలేదుటగా? ఈ నీ బంగారు విగ్రహాన్ని తీసుకెళ్ళి ఆ రాక్షసుడి వొళ్ళో పారవేసినారేమిటి?'

శారద యాతని పలుకులకు ప్రతిమాట చెప్పినది కాదు. ఆమె గుండె మాత్రము దడదడ కొట్టుకొనినది.

'మాట్లాడవేం? ఆ! నీ మొగంచూస్తే నీకు వీడంటే అసహ్యమనే తోస్తుంది. కాదు మరీ!

కాస్తడబ్బు కాస్త చదువు వుంటే పెద్ద కుటుంబం వాడవుతాడా? నాజూకు వాడవుతాడా? ఈ పందిని చూసుకొని నువ్వు కులక బోతావాయేం! అట్లా ఒక్క నాటికి నీ మనస్సు పోతుందా!'

శారద కొక్కసారి కన్నుల నీరుతిరిగినది. అచ్చటనుండి లేచి, విసవిస నడిచి, మేడమీదికి పోయినది.

౧౩

ముచ్చట్లు

వివాహము మంగళాంతమైనది. ఆ నాలుగురోజులు సుబ్బారాయుడు గారు సేలం సుందరి, వెంకటస్వామి నాయుడు, టైగరు వరదాచారి, చౌడప్ప, బలరామయ్య, హరినాగభూషణం మొదలగు గొప్ప గాంధర్వ గాయకుల రప్పించినారు. ఆడుపెండ్లి వారు సంజీవరావు పిల్లనగ్రోవిపాట, సంగమేశ్వర శాస్త్రి వీణపాట పెట్టించినారు. ప్రసిద్ధి కెక్కిన భాగవతులచే రాత్రులందు విడిదికడ హరికథలు చెప్పించిరి.

సదస్యమున కాంధ్ర దేశములో పెన్న నుండి తెలివాహా నదివరకుగల ఘనపాఠులు, కావ్యవ్యాకరణ తీర్థులు, ధర్మశాస్త్ర కోవిదులు, తార్కికులు, మహాపండితు లెందఱో విచ్చేసినారు. కవులు గాయకులు విద్వత్ బృందములు క్రిక్కిరిసిపోయినారు. సుబ్బారాయుడుగారు కాసుతో మొదలిడి నూటపదహార్ల వఱకు సంభావన లిచ్చినారు. జమిందారు గారుకూడ భూరిసంభావన లిచ్చినారు. ఆ వివాహవృత్తాంతము లాంధ్రదేశ మంతటా గథలుగా జెప్పికొనిరి.

రెండువందల యేబదిమంది బ్రాహ్మణులు వంటలకు, నీరు తెచ్చుటకు, వడ్డనలకు నేర్పాటు చేయబడిరి. వంట సుబ్బయ్య గారి నలభీమపాకము జగత్ప్రసిద్ధము. ఆయన స్వయముగా మహానసాధిపత్యము వహించిరి. సమస్త పాకములలో షడ్రుచులలో నాయనిది అందెవేసిన చేయి. ఆయన వంకాయ కూర వండి పోక పొత్తిలో తొమ్మిదిరోజులు నిలువయుంచి, పదవరోజున దీసినచో నప్పటికప్పుడు వండిన కూరవలె బొగ లెగయుచు రుచికరమై, చెక్కు చెదరక యుండునట. అన్నమునకు, గూరలకు చారు పులుసులకు వేఱు వేఱుశాలలు. పిండివంటల పందిరి వేఱు. పిండివంటలకు పాలఘాటు బ్రాహ్మణుల జట్టు వచ్చినది.

స్త్రీలకు, బురుషులకు వేర్వేరు భోజనశాలలు, వడ్డనకై వేరు వేరు జట్టు లుండెను. సంబారములు జతనచేయుట కిరువదిమంది జమాజెట్టీ లేర్పరుపబడి నారు. ఇదికాక ఘనబంధువులకు వేరు వేరు వంటలు విడిగా బచనము చేయబడును.

పెరుగు బానలు నిలువ చేయుటకు గొన్ని గదులు. కూరగాయలకు గొన్ని గదులు, ప్రసిద్ధులు పదునైదుగురు తమలపాకు బీడాలు కట్టుచుండిరి.

ఐదురోజులు రెండుపూటల మూడు నాల్గు పిండివంటలు, వేపుడుగూరలు, కలగల్పులు, పప్పులు, పచ్చళ్ళు, దప్పళములు– చేసిన రకములు చేయకుండ సమారాధనలు దివ్యముగ జరిగినవి.

పెండ్లికి వచ్చిన చుట్టములకు, స్నేహితులకు, బండితులకు, నాశ్రితులకు సమస్త జనులకు నెచ్చట నేమియు కొఱత రాకుండ జమీందారుగారు వేయి కనులతో గనిపెట్టియుండిరి.

నాల్గవనాటి రాత్రి పట్టణమంతయు నూరేగింపుటుత్సవము మహావైభవముగ జరిగినది.

జమీందారుగారి ఊరేగింపు టేనుగుపై బంగారపుటంబారీ నమర్చి వధూవరుల నం దాసీనులజేసి యూరేగించినారు. అలంకృతములగు నాలుగు మదగజములు, ఒంటెలు, ఒయ్యారపునడకల తురగములు నాలుగు రణడోలు మేళములు, మైసూరుబ్యాండు, నౌబత్తు మేళములు, మోటారుకార్లు, చిత్ర విచిత్రములగు వేషములు, ఓడలు, బండ్లు మొదలగు వాహనములు, నయిదు వందల గ్యాసుదీపాలు, కొబ్బరికురిడీ దివ్విటీలు రెండువందలు, పూలచెట్లు, కాగితపుబుడ్ల దీపాల వరుసలతో, అఖండ వైభవముతో గనులపండువుగ నూరేగింపుటుత్సవము నడచినది. ఊరంతయు నూరేగింపులో నున్నది. మగపెండ్లి వారందరు మోటారుబండ్లమీద నూరేగిరి. ఆడపెండ్లివా రెవ్వరును రాలేదు.

వివాహమునకు నారాయణరావు స్నేహితులందఱు నరుదెంచిరి. చాల మందికి రాకపోకలకు ఖర్చులు నారాయణరావు పంపినాడు. ఆ యువకమండలి యంతయు పేకాటలతో, సిగరెట్ల కాల్పులతో, వివిధ వాదములతో, నవ్య కవిత్వపు సభలతో, బెండ్లి యైదుదినములు వినోదించిరి. జమీందారుగారు వారి విషయమై యపరిమిత శ్రద్ధవహించి, వారి కెప్పు డేమి కావలయునో అరయుచుండుటలో, సిగరెట్లడబ్బా అందుబాటు చేయుటలో నేమరకయుండెను. నారాయణరావు తనమిత్రుల యవసరములకని పరమేశ్వరమూర్తి చేతిలోనిడిన నూరురూకలతో బనిలేకపోయినది. రాజారావు, పరమేశ్వరుడు, ఆలం, ఇంకను చాలామంది ఆంతరంగిక మిత్రులు కుటుంబములతో వచ్చిరి. స్నేహమండలికి వలయు సౌకర్యము లొనగూర్చుపని లక్ష్మీపతి వహించవలసి వచ్చినది. లక్ష్మీపతి యతిశ్రద్ధాళువై స్నేహబృందముచే లోటేమియు లేదనిపించినాడు.

ప్రాణస్నేహితులు, కొంచెము దూరపుమిత్రులు, మరీ దూరపుహితులు, లోనగువారికి నారాయణరాయ లక్ష్మీపతులు దలలోని నాలుకవలె మెలంగిరి.

ఒక స్నేహితుడు: పెండ్లికూతురు అప్సరసవలె వుందిరా!

ఇంకొకడు: చాలా తెలివైన అమ్మాయటరా! ఇంగ్లీషు, సంస్కృతం, తెలుగు క్షుణ్ణంగా వచ్చునట. ఫిడేలు, వీణపాటల్లో అపరశారదాదేవే అన్నారు.

రాజా: అది గాదోయి, నారాయణరావు అదృష్టవంతుడని అనవచ్చు నన్నమాట.

పర: చాలా అదృష్టవంతుడని ఈ సభలో ఉపపాదన చేస్తున్నాను, సభవారు ఆమోదిస్తే ప్రకటనార్థము పత్రికలకు పంపుతాను. లక్ష్మీ: జమిందారుగారి శ్రద్ధ చాలా విపరీతంగా వుందోయి.

ఆలం: అరే లక్ష్మీపతీ! మనకి రైల్లోకనబడ్డప్పుడు ఇంత మంచివాడు అనుకోలేదు.

రాజే: ఒరేయి నారాయణా! జమిందారు గారు నిన్ను పూర్తిగా ప్రేమించడం ప్రారంభించారు. ఆయనకళ్ళు నిన్ను తనివితీరా క్రోలుతున్నట్లు నీమీదే వుంటాయి.

ఓ స్నేహితుడు: అసలు ప్రథమదృష్టి ప్రేమవ్యాపారంలా కనబడుతూ వున్నదిరా !

వేరొక మిత్రుడు: జమిందారు శాసనసభలో ఎప్పుడూ స్వరాజ్య పార్టీ తరఫున పని చేస్తాడు. కాని ఆయనకు అసహాయోద్యమం ఇష్టం లేదంటారు.

లక్ష్మి: ఇష్టం లేకేమి ఆయన జైలుకు వెళ్ళకపోయినా, 1922 సంవత్సరంలో అందరూ జైలుకు వెళ్ళినపుడు శాసనసభలో అస్తమానం గవర్నమెంటును ఖైదీల విషయం ప్రశ్నలు వేస్తూనే వుండేవారు. ఒరే రాజేశ్వరుడు! మీ జస్టిసుపార్టీ పక్కలో బల్లెమై పానగల్లును డేకించేసేవాడు.

నారా: బావా! పానగల్లును డేకించగల మగవాడు ఇంతవరకూ పుట్టలేదు. ఇక పుట్టబోడు. అతనికి అతనే సాటి. ఆంధ్ర విశ్వవిద్యాలయం విషయంలో ఆంధ్ర రాజధాని విషయంలో అతనికి ఉన్న పట్టుదల, దీక్ష ఇంకోడికి లేదు. ఆంధ్రాభిమానం ఇంతా, అంతా అని కాదు. పైగా తనకు పార్టీ మాటలేదు. పైకి ఏమన్నా, క్రియలో అందరియందూ బ్రాహ్మణుడయ్యేది, బ్రాహ్మణేతరుడయ్యేది సమానప్రేమ ఆయనకు.

రాజే: నారాయణ రావుకూ జై! మా పార్టీ మర్యాదంతా కాపాడావురా.

నారా: అవునురా, స్వరాజ్య పార్టీ వాళ్లు శాసనసభలకు వెళ్ళి చేసినపని యేమిటి రా?

పర: ఒరే అల్లాంటే నేను ఒప్పుకోను. గవర్నమెంటు వారి మానస పుత్రుల మనుకొని, దేశద్రోహులై దేశం కోసం మనవాళ్ళు ఖైదులకు వెళ్ళి పడరాని పాట్లు పడుతోంటే చీమైనా కుట్టకుండా, లొల్లాయికబుర్లు చెప్పుతూ, ఉద్యోగాల కోసం ఏడ్చి నిద్రపోతూ, కాంగ్రెసును చండాలపు తిట్లు తిట్టిన మహానుభావులు కాదూ ఈ జస్టిసుపార్టీ సమరథులు?

నారా: నువ్వు చెప్పింది నిజం కాదనను. కాని, ఆ దృష్టి స్వరాజ్య పార్టీ వైపు మరల్చరా. తాము శాసనసభల్లోకి వెళ్ళి వెలగబెట్టేది ఏమి లేదని తెలుసును. వట్టి ప్రశ్నలు అడగడం తప్ప వీరు చేసిన మహత్కార్యం లేదు. వీరు సలిపిన గడబిడ అంతా వృధాయని తెలుసును. కాంగ్రెసులో వుండి ఖైదుకు వెళ్లలేరు, కష్టపడలేరు. శాసనసభలలో సభ్యులమని విఱ్ఱవీగడంతప్ప ఏమున్నది? సరియైనమార్గం చెప్పి దీక్షతో నడచుకోండర్రా అన్న ఆ మహాత్ముణ్ణి మూలకు తోశారు. ఆయన యేర్పరచిన బాటను నడిచే శక్తి లేక ఆక్షేపిస్తారూ? శాసన సభల్లో యుద్ధాలు చేసి, శాసనసభలు ముక్కలు చేస్తారా? దేశంలో పోనీ, అసంతుష్టయినా కలుగ జేశారా? ఒక్కగాటిని నడవవలసిన దేశం భిన్న భిన్నమై ఎవరికి వారే యమునాతీరే అయిందీ! ఏమిటోయి స్వరాజ్యపార్టీ వారు చేసిన అద్భుతకృత్యాలు?

పర: ఒరేయి! నీకు అసలు నిరాకరణ వాదం అంటే ప్రాణంగదా, పోనీ, మీబోటిగాళ్ళేమి చేశారు? ఖైదుకు వెళ్ళివచ్చి ఏ మొహం పెట్టుకొని మళ్ళా కళాశాలల్లో చేరారు?

నారా: నేను చేసినపని సరియైందని వాదించానటరా? ఆరు నూరైనా, నూరు ఆరైనా, ఒకటే మార్గాన్ని నమ్ముకువుండలేక పోయిన హృదయదౌర్బల్యానికి తలవంచుకుంటున్నాను. అంతే.

పర: కాని తీవ్రవాదనంటే నీ కెంత ఇష్టమైనా స్వరాజ్య పార్టీ వారు చేసిన కార్యాలు కొంచెమయినా గమనించకపోతే ధర్మదూరం కాదురా!

నారా: వాళ్ళు అసలు చేయలేదని అన్ను. బార్డోలీ తీర్మానం తప్పనీ, గాంధీ గారికి మెదడు లేదనిన్నీ, రీడింగు ప్రభువు రాజీకి వచ్చినప్పుడు 'ఫత్వా ఖైదీలు' అంటూ తాము బట్టిన కుందేటికి మూడేకాళ్ళని కూచున్నాడనిన్నీ మనమహానుభావులు చేసిన హేళణ – ఏ కొద్దో కాంగ్రెసు దేశానికి అర్పించిన పనిని మంటగల్పడమే కాకుండా, దేశానికి విషమైందని నా వాదన.

ఈ సంభాషణ స్నేహితులందఱు వినుచున్నారు. కొందరు విసుగుతో దూరముగాబోయి పేకాట మొదలుపెట్టిరి. కొందరు తాము సంభాషణలో బాల్గొనిరి.

స్నేహితులందఱకు ఆ అయిదురోజులు త్రుటిలో వెళ్ళిపోయినవి. పరమేశ్వరమూర్తి గృహప్రవేశమునకై కొత్త పేట వెళ్ళినాడు. తక్కుంగల మిత్రులు, రాజమహేంద్రవరమునుండియే పనివినినారు.

జానకమ్మ గారు కోడలిని జూచి మురిసిపోయినది. ఆమె పెద్దవియ్యపురా లామెను జూచి 'ఏవమ్మా వదినా! సుఖపడాలని పెద్దకోడల్ని తెచ్చుకున్నావే, ఈవాళే పెద్దమనిషి అయ్యేలాగుంది' అని నది.

'ఇదివరకు కోడలు వచ్చి సుఖపెట్టింది, ఇప్పుడు ఈవిడ వచ్చి సుఖ పెట్టుంది! వాళ్ళ భార్యాభర్తలు కులాసాగా ఉంటే అదే పది వేలు' అనినది జానకమ్మ గారు.

ఒక ఆవిడ: మీ కోడలు చాలా నాజూకుమంతురాలు. జమీందారు గారి అమ్మాయి పనేమి చేస్తుంది? మీకు కోడళ్ళు పని చెయ్యాలిటమ్మా అక్కా!

ఇంకోవనిత: ఏమమ్మా అత్తా! పెళ్ళి వారు అతి నాజూకు వారు. ఒక్కరూ వచ్చి కూచోరు. పలకరించరు. ఇంత గర్వాలేమిటమ్మా? మన వాళ్ళని చూచి ఒకటే మూతులు ముడుచుకోవడము. జానకమ్మ: అందుకోసమే ఈ సంబంధము మా వారికి ఇష్టము లేకపోయింది. మెడలువంచి వొప్పించినారు.

వెంకాయమ్మ (నారాయణరావు అక్కగారు, శ్రీరామమూర్తి చెల్లెలు): అమ్మా, అదేమిటే అల్లాంటావు! నిక్షేపంవంటి సంబంధము. తమ్ముడికి మరదలంటే చాలా ఆపేక్ష. కోరుకొని చేసుకొన్న పెళ్ళికూతురాయెను.

సత్యవతి: (నారాయణ రావు రెండవ అక్కగారు) అక్కయ్యా! భార్యాభర్తలకు మనస్సు కుదిరిన సంబంధము చేసుకోవాలి. లేకపోతే వాళ్ళిద్దరి బ్రతుకూ యమలోకము.

వెంకాయమ్మ: నా తల్లీ, నీ ఖర్మం అల్లా కాలిపోయింది కాని, అన్ని సంబంధాలు భార్యాభర్తల ఇష్టంమీదే చేస్తున్నారటే?

జానకమ్మ: మగవాడు గౌరవముచేయని ఆడదాని బ్రతుకు అధమాధమం. డబ్బక్కర లేదు, పిల్లలక్కర్లేదు! మొగుడు ఆడదికూడా ఒక ప్రాణి అని తలపే లేక కుక్కకన్నా కనాకష్టంగా చూస్తే దానిబతుకు పేడలో దొర్లే పురుగుకైనా వద్దు.

సత్యవతి భర్త పరమకోపి; వట్టి అనుమానపుమనసువాడు. తన నీడను చూచి తాను భ్రమిసే పిచ్చిమనిషి. ఏదో వంక మీద భార్యను చావకొట్టును. బావగారితో మాట్లాడినావనును. మరిదివంక జూచినావనును. ఒక రోజంతయు తిండి పెట్టవద్దని తన తల్లికి నాజ్ఞ యిడి, గదిలో బెట్టి తాళము వేసినాడు. ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాలకుడు, ఒక బాలిక చిన్నతనములో నే జబ్బులుచేసి పోయినారు. పెద్దపిల్ల పదేళ్ళది. సత్యవతి స్ఫురద్రూపి, తీర్చిన కనుముక్కు సొబగుగల బంగారుశలాక వంటిది. వెన్నెలకిరణము, అందకత్తె యయిన భార్యను జూచినప్పుడు వీరభద్రరావు, వీరభద్రుడై నిష్కారణముగ జావగొట్టును. సుబ్బారాయుడుగారికి జానకమ్మ గారికి సత్యవతి చరిత్ర సంతతము మహావిషాదము కలుగ జేయుచుండును. వారి జీవితయానములో సత్యవతీ చరిత్రయే నీటిక్రింద నణగియున్న భయంకరమగు శిలయైనది. పుత్రిక కొరకై జానకమ్మగా రెన్ని

గంగాయమునా ప్రవాహములు కన్నుల బ్రవహింపజేసినదో!

సూర్యకాంతము: (నారాయణ రావు రెండవ చెల్లెలు) అక్కయ్యోయి! నేనూ చిట్టక్కయ్యా చిన్న వదినదగ్గర ఉన్నాము నిన్నల్లాను. మొట్టమొదట ఏమి మాట్లాడింది కాదే! మేమే తెగ పలకరించాము. అప్పుడు మాట్లాడిందే. తన చదువుసంగతులు, సంగీతం సంగతి, వాళ్ళచుట్టాల సంగతి అన్నీ చెప్పింది. మా యిద్దరికీ స్నేహం కలిసిపోయింది.

రమణమ్మ: (నారాయణ రావు పెద్ద చెల్లెలు) ఒసేవు అక్కయ్యా, నాతో రెండు మాటలేవో చెప్పింది. అంతే. సూరీడుతో ఒకటే కబుర్లు. వాళ్ళిద్దరికీ ప్రాణ స్నేహం కలిసిపోయింది. వెంకాయమ్మ: ఏమి కబుర్లు చెప్పిందేమిటే సూరీడూ!

ఇంతలో జానకమ్మ గారి రెండవ వియ్యపురాలు, వెంకాయమ్మ అత్తగారు, వచ్చి 'ఏమండీ వదినా, ఈ రోజున యింకా పెళ్లికూతుర్ని తల దువ్వటానికి తీసుకు రాలేదు. ఊరిలో వార్నందర్నీ , బంతులాడించటమునకు పిలిచాము. మేమంతా ముస్తాబయ్యాము. మీరూ, మీ అమ్మాయిలు సోది పెట్టుకు కూచున్నారు అన్నది.

జాన: మా పెద్దమ్మాయి, సూరీడూ వెళ్లి పెళ్ళికూతుర్ని తీసుకువస్తారు. సత్యవతీ మాణిక్యం మీరంతానున్ను పెళ్ళి వార్నందర్నీ పేరంటానికి పిలవండి. సావిత్రీబాయి సంగీతపు కచ్చేరట! ఆడవాళ్ళకి ప్రత్యేకం. ఇది పెళ్ళికొడుకు గారి అరణ్యామెంటు. లెండత్తా, ఎవరిపనులు వారు చెయ్యండి మూడయ్యింది అప్పుడే.

ఆ నాల్గవ నాటి సాయంత్రం ఊరిలో ఆడవారికిమాత్రము అచ్చుకార్డులు పంపినారు. ఈ పద్ధతి అంతయూ నారాయణరావు పరమేశ్వరమూర్తి లక్ష్మీపతులు చేసిన ఆలోచన. దగ్గరచుట్టాలను, పెద్దలఇండ్లలో నాడంగులను మూడు మోటారుకార్లమీద జానకమ్మగారు, శ్రీరామమూర్తి భార్య, సూర్యకాంతము, మాణిక్యాంబ, శ్రీరామమూర్తిఅత్త గారు, వెంకాయమ్మ అత్తగారు వెళ్ళి పిలిచివచ్చినారు.

విడిదిలో మధ్యహా లతి సౌందర్యముగ పెళ్ళికొడుకు, బరమేశ్వరుడు నలంకరింపించినారు. వచ్చిన స్త్రీమండలి వీలుగా కూర్చుండుటకు విచిత్రముగా నాసనము లమర్పించినారు. విసనకఱ్ఱలతో విసరుటకు పనికత్తెల నేర్పాటు చేయించినారు.

వేరేగదులలో వచ్చిన వారందఱకు నుపాహారములు, కాఫీ, పండ్లు నిచ్చిరి. తాంబూలములు, కర్పూరపు దండలు, చక్కని పూవులద్దిన ఖద్దరు రవికలు, వెండికుంకుమబరిణెలు, పూవులగుత్తులు బొట్టుపెట్టి స్త్రీమండలికి నర్పించినారు. జడ్జీ భార్య, ఆంగ్ల సబుకలెక్టరుభార్య, మొదలగు గొప్పవారందరును వచ్చిరి. ఈ పద్ధతి నవీనముగా నుండుటచే, ఆడపెండ్లివారి వనితామణులందరు విచ్చేసిరి. వచ్చిన బాలబాలికలందరకు చక్కని వెండి బొమ్మ లర్పింపబడినవి. సెంటుబుడ్లు అందరకు నిచ్చినారు. జేబురుమాళ్ళిచ్చినారు. సావిత్రి ఆరోజున తన గానవిద్యాప్రౌఢిమ నానంద ప్రవాహముల బరపినది. ఆమెకంఠము వీణతీగయినది. ఆ మధుర దివ్యగాంధర్వములో వధూవరు లిర్వురు లీనమైపోయినారు. సంగీత కళాపాసకులగు నీ నూత్న దంపతుల యానందములో దివ్యత్వము జూరగొన్నది సావిత్రి.

౧౪
ఇతర దినాలు

ఈ వివాహపుతంతునం దేమి విచిత్రమున్నదో కాని, యా మూడుముళ్లు పడునప్పటికి సముద్రపుటుప్పు నడవి యుసిరిక వంటి రెండుజీవితాలు మిళితమైపోవును. ఏ కొండలలో పుట్టినవో ఏ లోయలలో ప్రవహించి వచ్చినవో, ఏ మెట్ట లెక్కినవో, ఏ పల్లముల నింపినవో, రెండు జీవిత ప్రవాహాలు చేరి యొక దారి నరుదెంచి, యీ పుణ్య వివాహవేదికకడ సంగమించి ప్రయాగ తీర్థమై పరిణమించునుకదా యనుకొని నారాయణరావు అక్కజపడెను.

తన్ను పెండ్లికొమరుని చేసినప్పుడు తాను స్నాతకపు బీటలపై తలిదండ్రులతో గూర్చుండినయప్పుడు మంగళ స్నానము లాచరించి, పట్టుపీతాంబరముల ధరించి, వివాహ వేదికపై పెండ్లిపీటపై నధివసించినప్పుడు, మంగళసూత్రద్వయము శారదకంఠమున మూడుముళ్లు వైచినప్పుడు వర్ణింపరాని భావవేగములో దేలిపోయినాడు. మంగళసూత్రధారణ మైనపిమ్మట ఎదురుగా గూర్చుండినంతనే శారద యనిన నంతప్రేమ తన్నేల యావరించినది? తాను మాతృమూర్తియు, శారద చిన్న బిడ్డయువలె నాతనికి గోచరించినది. శారదయు తాను వేలకొలది జన్మముల స్నేహితులై, గాఢానురాగమున గలసి సంచరించినట్లు తోచినది. శారదాదేవి మహారాజ్ఞియై రాజ్యమేలుచున్నట్లు తాను సేవకుడై యామెకు బరిచర్య చేయుచున్నట్టులు భావము జనించినది. శారదయు దాను నక్కచెల్లెండ్రయి యుగాల వెనుక నొక్క మేఘశకలములో నుండి విడివడిన కవలపిల్లలై యాడుకున్న ట్లూహావేశము కలిగినది. తాను పురుషుడట, శారద ప్రకృతియట; తాను పురుషోత్తముడట, శారద మహాసృష్టియట.

ఆతని కన్నులు చెమర్చినవి. తనివిదీర నా బాలికను జూడవలె ననుకొని నాడు కాని, యక్కడ ఈ వింతజూడ జేరిన యాప్రజాలోక మేమనుకొనునో యని సిగ్గుపడిపోయినాడు. ఆతని హృదయము ద్రవించిపోయినది. అతని బ్రతుకును బుష్పసౌరభము లావరించుకొనినవి. ఆ బాలికను దనకడకు జేర్చుకొని తన హృదయమున హత్తుకొనుకోర్కె పొలిమేరలు దాటినది.

'ఒరే పరం! ఆ భావాల కంతులేకపోయినదిరా! నాకేనా, లేక ప్రతి పెండ్లికొడుక్కూ అటువంటి యావేశము కలుగునా? ఆ పిల్లకూ నాకూ మానవుడు విడబర్చజాలని బంధము ఏర్పడ్డట్టేనా? ఆ మంత్రములలో నెట్టి మాహాత్మ్యమున్నదోరా! కొంచెం కొంచెం అర్థమయ్యాయి. ఆ మంత్రోచ్చారణ విడివడి ఉన్నట్టి రెండుజీవితాలను ఏకం చేస్తున్నట్లు తోచింది. ఆ బ్రాహ్మణులు ఋషులైనట్టు, జటావల్కలాజినధారులైనట్లు నాకు కనిపించినదిరా, మా జీవితాలు రెంటికి అంటుగట్టి ఏకవృక్షం చేస్తున్న తోటమాలి లనిపించిందిరా.' 'ఔనురా! ప్రేమోదయమైన తర్వాత వివాహం చేసుకోగానే యూరపియను దాంపత్యంకంటె, మన దాంపత్యాలే ప్రేమసౌఖ్యాల కెక్కువ నిలయంగా వుంటవి. ఎవరిమాటో ఎందుకు? వివాహం నాటికి నేను వయసువచ్చిన వాణ్ణే అయినా వివాహాత్పూర్వం నేను నా భార్యను చూచుకోలేదు. అదివరకెంతోమంది బాలికలను నాకు యిస్తామని వచ్చినారు. సరే అని నేను చూచుకోడానికి వెళ్ళేవాణ్ణి. చూడగా చూడగా ఒక అమ్మాయి నాకు నచ్చింది. ఆపిల్ల చక్కని చుక్క. ఆ రూపసంపద అలౌకికమనుకో. అందం సంగతలా వుండగా ఆ పిల్ల సంగీతం పాడింది. ఓరీ! రాలు కరిగిపోయి నాకు కన్నులనీరు తిరిగిందంటేనమ్ము. ఈ అమ్మాయి నా భార్యఐతే నాజన్మం సార్థకం అవుతుందనుకొన్నా. తీరా వారు కట్నం తక్కువ ఇస్తామన్నారు. మా తండ్రి గారు ఎక్కువ ఇమ్మన్నారు. దానితో అది చెడిపోయింది. నేను మా అమ్మ చేత, మా నాన్నగారి స్నేహితుల చేత మా నాన్నగారికి చెప్పించినా లాభం లేకపోయింది, నా గుండె ముక్కలయింది. నేను నిర్మించుకొన్న ఆనందధామం కుప్పగూలిపోయింది. తర్వాత వచ్చిన సంబంధాలలో ఇంకో పిల్లకూడా ఆ అమ్మాయి అంత అందం కాదుగాని మొత్తంమీద చక్కదనం, సంగీతం అదీ వున్న పిల్లే. వాళ్లు గొప్ప సంబంధంకోసం వల పన్నుకొని, ఆ చేప

వలలో పడితే మాసంబంధం వదలివేద్దామనీ, లేకపోతే, రెండోరకం క్రింద మాబేరానికి వద్దామనీ అనుకున్నారు. ఆ పిల్ల నా గుండెలో రాగాలు పాడింది. నా నేత్రాలు నిమీలితాలయ్యాయి. కాని వారి కా సంబంధందొరికింది. నా కా బాలిక దూరమయింది. ఆ దెబ్బతో నేనింక ఏ పెళ్ళికూతుర్నీ చూడనని ఒట్టు పెట్టుకున్నా. చివరకు చూడకుండానే సంబంధము నిశ్చయ మయింది. మంగళసూత్రం కట్టేటప్పుడు పిల్ల అంత బాగుండలేదని గ్రహించి చిన్నబుచ్చుకున్నాను. ఆనాటి యిద్దరు బాలికలూ అప్పుడు జ్ఞాపకం వచ్చారు. నిట్టూర్పు వదిలా. కాని ఒరే నువ్వు చెప్పినట్లు మంగళసూత్రధారణంలో ఏమిమహిమ వుందో, అది మొదలు నాభార్య అంటే పరమప్రేమ జనించింది రా!'

పరమేశ్వరుడు చెమరించే కన్నులతో నారాయణుని కనుగొని అతనివీపు నిమిరినాడు, నారాయణుడు విషయం మార్చుటకు నుద్దేశించి 'మన పెళ్ళిళ్ళకు, మహమ్మదీయుల వివాహాలకు చాలా తేడావుంది రా!' అని నాడు.

'మహమ్మదీయుల వివాహాలు మత సంబంధం ఏమీ లేని కంట్రాక్టులు కావడం చేతనేమో, వాటిని రద్దు చేసుకోడం సులభంగా భావిస్తారు మహమ్మదీయ సోదరులు.'

'అవును. మహమ్మదీయ వివాహం సంపూర్ణంగా కంట్రాక్టు. క్రిస్టియను చర్చి పెళ్ళి సగము మత సంబంధం. మన సంఘంలో మాత్రం వివాహం పూర్తిగా ధర్మసాధనమైన కర్మ. స్త్రీ, పురుష సంబంధం ఇంత పవిత్రం కావడానికి యెన్ని యుగాలు పట్టిందో! మానవుడు వట్టిజంతువులా, ఆ అతిపురాతన కాలంలో జీవితం ప్రారంభించి అడవుల్లో సంచరించే రోజుల్నుంచీ మానవ జీవితం ఎంత విచిత్రంగా మారిపోయింది యీ పవిత్ర వివాహసంస్థవల్ల!'

'నిజం. భర్త ఏరకంవాడయితే భార్య కూడా ఆరకంలో కలిసిపోతుంది గదా. వకీలు భార్య అయిందనుకో 'లా' మాటలు వింటూ వుంటుంది. క్లయింటు రావటం, భర్త కేసుల్లో వాదించడం, గెలవడం, ఓడటం అనే భావాలలో ఐక్యం అవుతుంది. అదే డాక్టరు భార్య అయితే, రోగులు, రోగాలు, మందులు, ఇంజెక్షన్లు రాత్రీ పగలూ పని ఉండడం అనే ప్రపంచానికి రాణీ అవుతుంది. అలాగే ఉద్యోగస్తుని భార్య అయితే ఆవిడకు ఉద్యోగ ఛాయాలన్నీ అలవాటవుతాయి. అవును గాని, నాకు మొదటి నుంచీ ఒక్క ప్రశ్నకు సరిఅయిన జవాబు దొరకడం లేదురా! ఏమిటంటే, మగ వాడి జీవితంవల్ల ఆడదాని జీవితం ఎక్కువ మార్పు చెందుతుందా, లేక ఆడదాని జీవితంవల్ల మగవాడి జీవితమా?'

'అది మంచి ప్రశ్నే! నా అభిప్రాయం ఏమిటంటే, ఆడదాని జీవితం దర్పణంమీద స్వచ్ఛమైంది. మగవాడి జీవితపు రంగు తనమీద పడగానే, దానితో ఆమె నిండిపోతుంది. గృహనిర్వహణానికి సంబంధించిన సంసారవిషయాల్లో మాత్రం ఆడదాని వ్యక్తిత్వమే అధికంగా గోచరిస్తుంది. కాబట్టే ఇల్లుచూచి ఇల్లాలిని చూడమన్నారు. మగవాడు మృదుస్వభావం కలవాడైతే ఒక్కొక్కప్పుడు ఆడదాని స్వభావం పైచేయికావడం, వాడి జీవితంలో ఆ ఛాయలు విశేషించి కనిపించడం కూడా తటస్థిస్తుంది.

సుబ్బారాయుడు గారు తన రెండవ కుమారుని వివాహమును గూర్చిఎన్నియో విచిత్రాలోచనలలో తేలిపోయినాడు. ఆయన నలుగురు కొమార్తెలకు, పెద్ద కొమరునకు, మంచి గౌరవముగల కుటుంబములుగా జూచి వారితో వియ్యమంది నాడు. సంబంధములన్నియు ధన ధాన్య సంపదలతో దులగూగుచున్నవే. చుట్టములలో ననేక వివాహములకు దాను బెద్దరికముదాల్చి చక్కగా జరిపించినాడు. అవియన్నియు నొక యెత్తు. నేడు నారాయణ వివాహమొక యెత్తు. ధనమా చాల వ్యయమైనది.

వ్యయమయినదని కాదు. అంతకు మూడు రెట్లయినను ఆయన లెక్క చేయడు. ఆవల వియ్యంకునకు గూడ వివాహవ్యయమొక లకారము దాటి యుండును. ఆయన జమీందారు గావున ఆయనకు లెక్క లేదు. జమీందారు గదాయని తన యెడల ప్రపత్తులలో నేమైన లోటు చేసినారా? ఒక పెద్ద మహారాజును గౌరవించినట్లు గౌరవించినారు. ఇంతకు దన వియ్యంకుడు నిషధ యోగ్యుడు. కాని వియ్యపురాలు సరియైన మర్యాదతో సంచరించలేదని ఆడువాండ్రు ఒకటే గోల. అది ఆమె స్వభావము కాబోలు. క్రొత్తలో నించుకంత పొరపున్నను, గాలక్రమమున వియ్యపురాం డ్రిద్దరకు నెయ్యము కుదురవచ్చును.

ఆగర్భ శ్రీమంతురాలై పెరిగిన కోడలు, తనయింటికి వచ్చి కష్టపడునేమో? కుఱ్ఱవాడు ఎక్కడో ఉద్యోగమో, న్యాయవాదిపనియో చేసికొనును. వాడు సంపాదించుకొనకున్నను భగవంతుని కృపచేత వానికి అన్న వస్త్రములకు లోటు లేదు. దాసదాసీజనమును బెట్టి చేయించుకొను శక్తియున్నది. నారాయణ దుర్వ్యయములకు లోనుగాకున్న జాలును. ఎట్టికొఱతయు నుండదు. బుద్ధికి బృహస్పతియయిన తన కుమారుడు, కుటుంబమునకు విఖ్యాతి తెచ్చుచున్న తన నారాయణుడు సంపాదింపలేని అప్రయోజకుడగునాయేమి? ఈ రోజులలో బ్రాహ్మణులకు ఉద్యోగములు దొరకనిమాట నిజమే. సంపాదన కుద్యోగమే కావలయు నాయేమి? చెన్నపట్టణములో న్యాయవాదియైన లక్ష లార్జింపవచ్చును. కుమారునకు మొదటినుండియు 'లా' యన్న యసహ్య మనుట నిజమే. తన ప్రోద్బలమువలననే కుమారుడు ఎంత ఇష్టము లేకున్నను న్యాయకళాశాలలో ఏది ఎట్లయినను ఆ విషయముల దాను తర్కింప బనిలేదు. గాంధీతత్వపూర్ణుడైన నారాయణుడు, ఏదియు వలదని యన్నను సరియే. ఆలోచింపవలసినది కోడలివిషయమే.

ఆ బాలిక ఎట్టిది యగునో? సర్వసాధారణముగ నీ జమిందారీ కుటుంబములలో గర్వమెక్కుడు. జమిందారుల యింటి యాడుబిడ్డ తనవంటి సంసారి యింట నతుకుట కష్టమే. నీటి నుండి తీసిన చేపవలె తనయింట బాధపడునేమో? కాని బుద్ధి తెలిసినపిల్ల గావున ఆమె అభిప్రాయము తెలిసికొనక వియ్యంకుడు తన కుమారుని అల్లుని గా నిశ్చయించియుండడు. కోడలికి నారాయణపై ఆపేక్ష కుదిరియుండును. అందును నారాయణు డెట్టివారి హృదయము నైనను చూరగొనగల గుణసంపత్తిగల వాడు. బాలికలు వీనిని భర్తగా బడయుట తమ జన్మములకు సార్థకతయని సంతసించునంతటి రూపవంతుడు. ఇంతకు ఈ రాజ సంబంధము మంచికి వచ్చినదో, చెడ్డకు వచ్చినదో? అంతయు దైవాధీనము. ఎవరి ప్రారబ్ధ మెట్లున్నదో? ఆ పరమేశ్వరుని విలాసము లెవరికి దెలియును! నేటివఱకు దానుపట్టిన దెల్ల బంగారమగుటయే గాని ఒక్క కార్యముగూడ గలసిరాకపోవుట యన్నది లేదు. ఏనాటి కే విచిత్రములు జరుగనున్నవో!

సుబ్బారాయుడు గారు గంభీరహృదయుడు. ధైర్యస్థైర్యము లాయన సొమ్ములే. చిన్ననాటనే తండ్రిపోయినను మనస్సు చెదరనీక నడిసంద్రమున నల్లాడు సంసారనౌకను చుక్కాని చేబూని చెక్కు చెదరకుండ గట్టున జేర్చినాడు. ఇతరుల డెందములు నొవ్వకుండ న్యాయమార్గమున తన పితృస్వమును వేయిరెట్లు వృద్ధి చేసి పిల్లజమీందారు డనిపించుకొనినాడు. 'గోదావరికి అద్దరిని ఇద్దరిని సుబ్బారాయిడు గారి మాటయు భీష్ముని మాటయు నొకటే' యని పించుకొనినాడు. నేల మాళిగలో నసంఖ్యామై మూలుగుచున్న నగదులో నిరువదియైదు వేల రూప్యములు కొమరుని పెండ్లికి వెచ్చించినాడు. తనయంతవాడైన పెద్దకొమరుని మనస్సేమనుకొనునో యని సందేహించనైన లేదు.

శ్రీరాముమూర్తికి వెచ్చపెట్టుటన్న దలనొప్పియే కాని, అవసరము వచ్చినప్పుడు మాత్రము వెనుదీయడు. తన నల్గురు చెల్లెళ్ళ వివాహములకు ముప్వారు చెల్లెళ్ళ

పునస్సంధానమహోత్సవములకు, బండుగలకు పబ్బములకు సుబ్బా రాయుడు గారు లెక్క తెలియనిఖర్చు చేయుచున్నను శ్రీరామమూర్తి అడ్డుపెట్ట లేదు సరికదా, తండ్రి మరచిపోయినచో దానే జ్ఞప్తి చేసి ఖర్చు పెట్టించెడివాడు.

సుబ్బారాయుడు గారు తాను వరశుల్కము గ్రహింపనని తొలుతనే స్పష్ట మొనర్చుటచే, జమిందా రల్లునికి నలువది యకరముల ఈనాముభూమి, తన జమిందారీలోనిదిగాక, తన కున్న రైతువారీ భూములలోని సుక్షేత్రము, తణుకు తాలూకాలో తన గ్రామమునకు దగ్గర నున్న గ్రామములోనిది అరణ మొసంగి నాడు. తన కుమార్తెకు నిరువది యకరముల భూమి వ్రాసియిచ్చినాడు. మఱియు నిచ్చిన వస్తువాహనములకు లెక్కయే లేదు. ఆమె పేరున బ్యాంకిలో ఏబదివేలు రొక్కము నుంచినాడు.

సుబ్బారాయుడుగారుగూడ పెద్దకోడలి కిచ్చినట్లు పదివేలరూప్యములు చిన్నకోడలి కాభరణముల నిమిత్త మిచ్చినారు.

౧౫

గృహప్రవేశము

గృహప్రవేశమునకు బెండ్లికొమార్తెతో శకుంతలాదేవియు, జమిందారు గారి వేలువిడిచిన మేనకోడలు లలితయూ, వరదకామేశ్వరీ దేవి పుట్టినింటి చుట్టము సరోజినియు, జమీందారు గారి కుమారుడు కేశవచంద్రుడును వెళ్లినారు. సుబ్బారాయుడు గారు తన చుట్టములందరిని పదునాఱు రోజుల పండుగ వఱకు నుండుడని కోరినారు. సుబ్బారాయుడు గారు బంధుసముద్రుడు. మర్యాదలు సలుపుటలో జనకమహారాజు. ఆయన బందుగులు, జానకమ్మ గారి బందుగులు, బిడ్డల చుట్టములు గలపి మూడువందలమంది వివాహమునకై చేరినారు. వారిలో బెక్కురు రాజమహేంద్రవరము నుండియే వెళ్ళిపోయినారు. కొన్ని కుటుంబముల వారు కొత్తపేట వెళ్ళినారు. కొత్తపేటలో ఎనమండుగురు తెలుగు వంటబ్రాహ్మణులను ఇరువురు దాక్షిణాత్య బ్రాహ్మణుల నియమించి సుబ్బారాయుడు గారు వధూవరుల గృహప్రవేశ మహోత్సవము పెండ్లివలె జరిపినారు. ఒక నాడు కోనసీమలోని పెద్దలందఱు విందుకు ఆహ్వానింపబడిరి. వధువుతో నరుదెంచిన బంధువులకు రాజభోగము లర్పింపబడినవి.

వివాహమున నన్నియు ఖద్దరు వస్త్రములే యుపయోగించినారు మగ పెండ్లివారు. తప్పని సరియైనప్పుడు స్వదేశీవస్త్రములు, పట్టువస్త్రములు నిచ్చినారు. ఆడపెండ్లి వారు పెండ్లికుమారునికి, ఇతర మగవారికి ఖద్దరు వస్త్రముల నిచ్చినారు. ఆడువారికి వారికి దోచినట్లు పట్టుచీరలు, రవికలు, విదేశీ చీరలు మొదలగునవి యొసంగినారు.

శారద కత్త వారి యిల్లు విచిత్రముగానే యున్నది. తన తండ్రి గారి మేడలో నున్న సోఫాలు, మరదిండ్లకుర్చీలు లేవు. ఒకటి రెండు తివాసీలు చిన్నవి యచ్చట నున్నవేమో! తన మేడలో అన్నియు తివాసీలే. గోడల కెన్నో చిత్రములైన బొమ్మలు అచ్చట తగిలించి యున్నవి. చిత్రవిచిత్రముగా నగిషీలు చెక్కిన బల్లలు, మేజాలు, కుర్చీలు, బీరువాలు, అలమారులు, పనితనముగల వెండి, ఇత్తడి, రాగి బొమ్మలు చీనా దేశపువి, ఆగ్రా, అజిమీరు, లక్నో ప్రాంతములవి, బర్మా కఱ్ఱ చెక్కడపు బొమ్మలు, లక్కబరిణలు, రవివర్మ బొమ్మలు, పాశ్చాత్య తైలవర్ణ చిత్రములు తమ పెద్ద మేడనిండ నున్నవి. తన తండ్రిగారిది, తాతగారిది, తల్లిది, బామ్మగారిది ఇంకను బూర్వికుల బొమ్మలు దమ గదులనిండ నలంకరింపబడియున్నది. ఇచ్చటనో తన భర్తగది యొకటి మాత్రము చాల అందముగా నున్నది. ఇల్లంతయు సూర్యకాంతము చూపించినది. భోషాణములట! తంజావూరి

బొమ్మలట! మామూలు కుర్చీలు, పేము పడక కర్చీలు, ఆ కుర్చీల పై మామూలు పరుపుదిండ్లు. తమ మేడయంతటట తండ్రి గారు స్వంతముగా విద్యుచ్ఛక్తి దీపములు, వీవనలు పెట్టించినారు. అత్తవారింట లష్టరు దీపాలట, పెట్రోమాక్సు దీపాలట! చీచీ! ఇది ఏమిటమ్మా!

శకుంతలా దేవి చెల్లెలిని జూచి 'ఒసే శారదా! మా అత్తవారి మేడలో మన మేడలోనున్నన్ని వింతలు విచిత్రాలు లేకపోయినా అదీ జమీందారీకోట లాగే ఉంటుందే. కాని ఇల్లాంటి పల్లెటూరు కొంపలో పడ్డావేమిటే? వంద మంచాలూ, పరుపులూ ఉంటేమాత్రం జమీందారీ దర్జా వస్తుందటే? వచ్చి వచ్చి ఒక పల్లెటూరి వెంకయ్య గారి ఇంట్లో పడ్డావేమిటే? ఎంతో డబ్బుందట. చాలాభూమి ఉందట. ఏమి భాగ్యం? దర్జా పుట్టుకతో రావాలి గాని, తెచ్చిపెట్టుకుందామంటే వస్తుందటే?

'వీళ్ళ కట్లు, బొట్లు, మాటలు అన్నీ చాదస్తంగా ఉన్నాయి, అక్కయ్యా.'

'మీ పెద్దాడుబిడ్డ ఒకటే వడవడ వాగుతూవుంటుం దేమిటే! నన్నూ, లలితనూ, సరోజినినీ కూచోబెట్టి వేదాంతం బోధించడం మొదలుపెట్టింది. రెండో ఆవిడ మనకుటుంబం సంగతులు అన్నీ అడగడం మొదలుపెట్టింది. అస్తమానం ఈ చెవినుంచి ఆ చెవికి నవ్వుతోనేవుంది ఆవిడ.

లలిత: వాళ్లు చిన్నబుచ్చుకునేటట్లుగా మనం గబుక్కునలేచేవచ్చాంగా!

సరోజిని: ఏమే శకుంతలా! నీకు వేళాకోళాలు వెక్కిరింతలూను. వాళ్ళూ మనమల్లేనే గౌరవం సాంప్రదాయం కలిగిన కుటుంబాలు. అందరికీ జమీందారీలు ఉంటాయా యేమిటే? దేశమంతా గాలించినా గుడిగుడి గుంచంలా ఒక పది జమీందారీకుటుంబాలు న్నాయి. మీ నాన్నగారికి పదిమంది కూతుళ్లు పుట్టితే అందరికీ జమీందారీ సంబంధాలు ఎక్కడ తీసుకువస్తారే?

శకుంతల: నువ్వెప్పుడూ అందర్నీ హాస్యం చేస్తూనేవుంటావు. జమీందారీలు వుండకపోవచ్చును గాని ఎక్కడో పల్లెటూళ్ళపద్ధతిలావుంది అనరుటే.

ఇంతలో సూర్యకాంతం అక్కడకు వచ్చుటచే వారి సంభాషణ ఆగిపోయినది. సూర్యకాంతం చిన్నన్న గారిని వెర్రిప్రేమతో ప్రేమించినది. తల్లి దండ్రులు, అక్కలు, పెద్దయన్నయు నెందరున్నను నారాయణ క్షణము కన్పించకున్న సూర్యకాంతము బెంగపెట్టుకొనును. చిన్ననాటినుండియు సూర్యకాంతమును నారాయణరావే పెంచినాడన్న నిసుమంతయు నసత్యము లేదు. ఆమె కించుకంత దెబ్బతగిలిన 'చిన్నన్నయ్యా' అని యేడ్చునది. అన్నగారిదగ్గరనే పండుకొనును. అన్నగారితోనే భోజనము చేయును. ఆమెకు రామస్మరణ 'చిన్నన్నయ్య! చిన్నన్నయ్య!' చిన్నన్నగారు చదువులకై అమలాపురం, రాజమహేంద్రవరము, చెన్నపట్టణము వెళ్ళినప్పుడు, జైలుకు పోయినప్పుడు సర్వదా గ్రుడ్లనీరు బెట్టుకొనునది. రాజమహేంద్రవరము జైలునకన్న గారిని చూచుటకు వెళ్ళినప్పుడు నారాయణరావు జైలరు ననుమతి నడిగి చెల్లెలిని దగ్గరకు దీసికొని చెవిలో దేశభక్తినిగూర్చియు, ధైర్యమును గూర్చియు చిన్న యుపన్యాసము నిచ్చినాడు. ఆమె విచారించినచో శ్రీ మహాత్మాగాంధీ గారి హృదయము బాధ నొందుననియు, దన ముద్దు చెల్లెలు బెంగ పెట్టుకొని యింటిదగ్గర కండ్ల నీరు నింపుచున్నదని తెలిసినచో దన మనస్సు వికలమైపోయి జైలు భరించుట కడు దుర్భరమగుననియు, దన ముద్దు చెల్లెలు తనను దేశద్రోహి వలె జైలువదలి రమ్మని కోరునంతటి దేశభక్తి లేనిది కాదనియు జెప్పి,

యూరడించినాడు. అప్పుడు సూర్యకాంతము కళ్ళనీళ్ళతో చిరునవ్వు నవ్వింది. ఆమె వదనము వాన కురిసి వెలిసి మబ్బులుమాయమైన పూర్ణిమాకాశమువలె సౌందర్యశోభితమైనది.

అట్టి ప్రేమపూర్ణమగు నామె హృదయము తన చిన్నన్న గారి పెండ్లి కొమరితను జూచినప్పుడెల్ల బరవశత్వములో నుప్పొంగిపోవును. తన చిన్న వదిన గారెంత యందగత్తె! ఏమి యా సొగసు! అంత సంగీత పాటకురాలెక్కడైనా యున్నదా? చిన్నవదినను కౌగలించుకో బుద్ధిపుట్టిన దా బాలకు. పెండ్లి అయిదురోజులు వీలయిన వేళలలో నొక్క నిమేషమైన కొత్తవదిన గారిని విడిచి యామె యుండలేదు. ఆమెకు దాను తలదువ్వును. ఆమె తలలో పూవులు ముడుచును. ఆమె నగలు సర్దును. ఆమె యొడిలో దనతల నుంచును. ఆమె దగ్గరగా గూర్చుండును. 'వదినా! నువ్వు చాలా అందకత్తె' వనును. శారద కిదియంతయు వెఱ్ఱిగా గనుపించినది. సూర్యకాంతమును వెఱ్ఱిపిల్ల యని యనుకొన్నది. కాని సూర్యకాంతము ప్రేమప్రవాహవేగమున శారద యుపేక్షా భావము చెదరగొట్టబడి కరిగిపోయినది. భర్తృ బంధుకోటిలో సూర్యకాంత మొక్కరితయే యామె హృదయములో బ్రవేశించినది.

సూర్యకాంతము వదిన గారికడ కరుదెంచి 'చిన్నవదినా! మా గుమ్మడిపండావును జూపిస్తానన్నానుకదూ? నువ్వు దాని అందం చూస్తే వదలలేవు సుమా. రా! అప్పుడే పొలాల నుంచి మా ఆవులు, గేదెలు, బండి యెద్దులు వచ్చాయి. తక్కిన పశువులన్నింటినీ మా తోటలో పశువులశాలల్లోనే కట్టేసారు. వస్తావా?' అని యడిగినది. ఆ సాయంత్రము చల్లని గాలులు వీచుచు మల్లెమొగ్గల సౌరభ మెల్ల యెడల జల్లుచుండెను. నిన్ననే సూర్యకాంతం వదిన గారికి దమ యింటి వెనుక తోట జూపించినది. మల్లెజాతులు, సన్న జాజులు, గులాబుల కుటుంబములు, సంపంగెలు, జాజులు, మందారముల రకములు, ఏవేవో కొత్తరకముల పూవులు దొడ్డియంతయు నావరించి బారులుతీర్చి గీతములు పాడుకొనుచున్నవి. నారాయణ రావుకు దోటపనియన్న బ్రాణము. తాను సెలవలకు వచ్చినప్పుడు కొత్తకొత్త రకముల పూలచెట్లు నాటుచుండును. అంట్లు కట్టుట చిగురుల నంటుకట్టుట, కొమ్మలు కత్తిరించి వానికి జీవముపోయుట, మొక్కలలో క్రొత్త జాతులను సృజించుట మున్నగు పను లాత డవలీలగ జేయగలడు. అతనికి స్నేహితులు తోటమాలి యనికూడ బేరుపెట్టినారు.

అతడు మొక్కలతో మాట్లాడుకొనును. అతని హస్తస్పర్శకు, జల్లని మాటలకు జెట్లు సంతోషమున బొంగిపోవును. 'బోసు చెప్పినదానిలో ఇంతైనా అతిశయోక్తి లేదురా' అని స్నేహితులతో ననువాడు నారాయణరావు. గ్రాండిఫ్లోరా పూలచెట్లొక వరుసయును, చామంతి జాతు లొక బారును లెజిస్ట్రోమియాలు వివిధవర్ణముల పూలతో నొకవంక ను గలకలలాడిపోవుచున్నవి. ఇంకను నేవేవో రకముల పూలట! భరత ఖండములో నెక్కడ పెరుగునదియైన నారాయణరావు దాని నెంత ఖరీదునకైన తెప్పించి తోటలో పెంచుచుండును.

సింహాచలము సంపెంగలు_పచ్చ, తెలుపు జాతులవి కలవు. కనంగ సంపెంగ, కర్పూర సంపెంగ, సకలగుణ సంపెంగ, తీగ సంపెంగ యాతని ముద్దుబిడ్డలు. ఎడ్వర్డు, కార్లైన్ డిఆర్డెను, ధవళమగు నమెరికా సుందరి, పాలెనీరాను మొదలగు నెనుబది రకముల గులాబుల ప్రాణప్రదముగా బెంచినాడు. బొడ్డుమల్లె, జంటమల్లె, పొదమల్లె, పందిరిమల్లె, చిరుమల్లె, కాకినాడమల్లెలు నక్షత్రము వలె విరిసి యాతని కన్నుల నార్ద్రములు సేయును. చెన్నపట్టణపు బొడ్డు చేమంతి, తెల్లచేమంతి చిన్నది, సాదారకము బొత్తాము చేమంతి, నీలపు చేమంతి, ఎఱ్ఱ చేమంతి, అరచేతి పెద్ద జాతి చేమంతులు నాతని జీవితమున

దీపులూరజేయును. కదంబము కలదు, పన్నీరు వృక్షము లున్నవి, దేవపారిజాతము లున్నవి, పూవుదానిమ్మ లున్నవి.

సూర్యకాంతము చిన్నన్న గారి యుత్సాహములో తానును మునిగిపోవును. అన్నగారు చదువునకు పోయినప్పుడు తోటమాలితనము తన్నావరించినట్లు భావించుకొనును. తోటమాలులచే నీరు బోయించును. ఇవక పట్టనీయక కాపాడునట్లు చేయును. ఉద్యానవన బాలికయై యన్న గారి యాజ్ఞ పాలింపు చుంటినని గర్వమునొందును. ఆమె వనదేవతయే యయిపోవును.

శారద యా వనము చూచి ఆశ్చర్యమందెను. కొంచె మసూయ ఆమె లేత హృదయము నలమినది. ఆనాడు బాలికలిద్దరు వనసంచార మొనర్చునప్పుడు నారాయణరావు చూచినాడు. ఆతని బ్రతు కప్పుడు సువాసనాలహరీస్నాతయైన ట్లయినది. ఆ యిరువురు బాలికలను దన యిరుసేతుల నెత్తి ముద్దాడ నువ్విళులూరినాడు. ప్రపంచమంతయు నాతనికి ప్రేమస్నాతమయినట్లు తోచినది.

చల్లని యడుగులతో వారిరువుర నాతడు డాసి 'సూరీడూ! ఈతోటంతా చూపిస్తున్నావుటే' అని పలకరించినాడు. పలుకరించి, తన చొరవకు దానే యక్కజంపడినాడు.

కులుకుమిటారియగు తన శారదతో మాటలాడవలెనని పెండ్లి రెండవనాడే యాతనికి గోర్కె వొడమినది. కాని సిగ్గుపెంపున మాటలాడింపలేడయ్యెను. ఎట్టి సభలోనైన పులకలు పుట్టించు గంభీర స్వరమున నుపన్యాసము లిచ్చు నారాయణరావా ముహూర్తమున త్రపావశుడైనాడు. మఱునాడుదయమున మోటారులో భార్యాసమేతుడై యూరేగునప్పుడు 'నీకు కాలేజీలో చేరి చదవాలని ఉన్నదా' యని యెట్లో ప్రశ్నించినాడు.

శారద యాశ్చర్యపూరితయైనది. ఆమెకు నాగరిక మర్యాదలన్న నెంతయు నిష్టమే. తానంతకుమున్ను చూడబోయిన వివాహములందు నూతన వధూవరులు మాటలాడుకొనుట చూచినది. సంతోషము నొందినది. అటులనే తానును మాటలాడగలనని తలంచి లజ్జాకవోష్ణమై మోము కెంపెక్క జిరునవ్వు పెదవులు దాటకుండ నప్పలించుకొన్నది. నేడు భర్త తన్నట్లు మాట్లాడించునని యామె కలనైన తలపోయలేదు. తొలినాడు తన్ను జూడ వచ్చిన నారాయణ రావును నిర్భయముగ జూచినది. అపుడపుడే పరిమళమలముకొను హృదయమున నారాయణరావును మెచ్చుకొన్నది. అతని రూపసంపద శారద మనస్సును గలకలలాడించినది. నారాయణరావు ఫిడేలుపై మధురముగా గానము చేసినప్పు డాశ్చర్యము, నానందము నామె నలముకొనియెను.

సంబంధము నిశ్చయమైనదని తెలిసినప్పటి నుండియు దల్లియగు వరదకామేశ్వరీ దేవి శారద చెవికడ నిల్లుగట్టుకొని విచారించినది. పల్లెటూరి సంబంధము ఘటించిన భగవంతుని తీవ్రముగా దూలనాడినది. తనకును శారదకును గ్రహచారమున్నట్లున్నదని కంటనీరు పెట్టుకొనినది. చుట్టములలో స్త్రీలు ఒకరిరువురు తప్ప మిగిలిన వారట్టి సంబంధము నిశ్చయమైనందుల కక్కజమందుచు వరదకామేశ్వరీ దేవితోపాటు విచారించినారు. ఆ సంబంధమును నిందించినారు.

శారద లేత హృదయమున నామాటలెల గాటముగ నాటికొని ప్రత్యక్షమైన స్వామియెడ నిరసన భావమును, వైముఖ్యమును మొలకెత్తించినవి. అట్టి మనస్థితిలో నున్న శారదను నారాయణరావు పలుకరించినప్పుడామె యించుక యులికిపడినదనిన వింత యేమి! ఆమె

భర్తకు బదులుపలుకక మోమువంచికొన్నది. నారాయణరావు చిన్నబుచ్చుకొనియు, బాలిక సిగ్గుపడియుండబోలు నని సమాధానపడినాడు.

''శారదా! నీ కింగ్లీషు బాగా వచ్చునట కాదూ? ఇంగ్లీషు చదువుకొన్న బాలికలు సిగ్గుపడరటగా! నువ్వీయేడు స్కూలు ఫైనలు పరీక్షకు వెళ్ళుతావను కొన్నారే. అట్లాంటప్పుడు నాతో మాట్లాడడాని కీ సంకోచం ఏమిటి?' నారాయణరా వింగ్లీషులోనే యామె నడిగినాడు.

శారద మారుపలుక లేదు. ఆమె నలముకొన్న ఆశ్చర్యపుదెర ఇంకను అలమినట్లే యున్నది. ఆమె మౌనముద్ర వహించియే యుండెను.

'ఈ యేడు గవర్నమెంటు పరీక్షలో మొదటి తరగతి మార్కులు వస్తాయని మీ దొరసాని గారన్నది. నువ్వు చదువుకోని బాలికవలె సిగ్గుపడవని ఆమె చెప్పిందే? సిగ్గెందుకు నీకు? ఆమెమాటే నిజం అయితే, ఏదీ మాట్లాడు చూద్దాం.' (ఇంకను ఇంగ్లీషు భాషలో నే...)

శారదకు బౌరుషము వచ్చినది. మద్రాసు యూనివర్సిటీ వారి మెట్రిక్యులేషను పరీక్షకు దరఖాస్తు పెట్టున్నాను. స్కూలు ఫైనలు పరీక్షకు పాఠశాలలో జేరాలికదా!' అనిన దింగ్లీషులోనే.

'అదీ! అల్లాగు జవాబు చెప్పాలి. ఫిడేలంటే యిష్టమా, లేక వీణంటేనా?'

'రెండూనూ.'

'ఆ రెండింటిలోను ఏది మంచిది?'

'దేని కదే!'

'అల్లాంటే ఎల్లాగుమరి? వీణమీది తానం ఫిడేలుమీద రాదు. ఫిడేలు మీది సంగతి వీణకు రాదు. వీణ ఒదుగు ఫిడేలులో లేదు. వీణలో ధ్వని ఫిడేలులో లేదు. ఫిడేలు...'

'అందుకనే దేని అందం దానిది. దాని అందం దీనికి, దీని అందం దానికి రాదు.'

'నీవు సంగమయ్య గారి కచేరీ చూశావా?'

'మా మేడకివచ్చి ప్రతియేడూ పదిహేనురోజులు మకాం చేస్తూవుంటారు. ఆయన అద్భుత వాద్యము నాకు వినిపించి నావీణపాటకు మెరుగులుదిద్దేవారు.'

'ఏమిటీ! సంగమయ్య గారికే శిష్యురాలివా! ఎంత అదృష్టవంతురాలివి!'

ఇంతలో నూరేగింపు విడిదికడకు వచ్చుటచే నా నూతనవధూవరుల సంభాషణ యాగిపోయినది. నారాయణరా వట్టులనే మూడు నాలుగు సారులు భార్యతో మాటాడి ఆనందధామములో విహరించినాడు.

ఈనాడు తోటలో, భర్త సూర్యకాంతము నట్లు బలుకరించినప్పుడు, శారద కించుక రోత పుట్టినది. కనురెప్పమూత కాలములో జనించి మాయమయిన యా భావమును గ్రహించిన నారాయణరావు మనస్సు చివుక్కుమన్నది. సోదర ప్రాణయగు సూర్యకాంతము నును లేతయెదకు వారిరువురి భావములు స్పష్టమై తోచినవి. అన్నా వదినెల మనోమాలిన్యము

తుడిచివేయుటకో యన నా బాల 'గుమ్మడిపం డావును చూతము రం'డని తన చిన్నారిచేతులు సాచి వారిరువురి హస్తములు గ్రహించి బిరబిర గొనిపోయినది.

గృహమేధి

సుబ్బారాయుడు గారింటి వెనుక పెరటిలో నొక తూర్పువెలమల కుటుంబము, రెండు బీదకాపుల కుటుంబములు, అయిదు తూర్పుగొల్లల కుటుంబములు కాపురమున్నవి. వారందరు సుబ్బారాయుడుగారి పాలేరులే. కాపులలో కుంకట్ల సోమయ్య యనునతడు పెద్దపాలేరు. సుబ్బారాయుడు గారు పాలేండ్ర కాపురమునకై శుభ్రమగు నిండ్లు కట్టించి యిచ్చిరి. సోమయ్య యిల్లు తక్కిన వానికన్న బెద్దది. సోమయ్య బహుకుటుంబీకుడు. వృద్ధుడయ్యు జబ్బుసత్తువయు చక్కని కంటిచూపును గల్గి వ్యవసాయము చేయించుటలో పేరుగన్న కాపు. సోమయ్య తండ్రి నాటనుండియు సుబ్బారాయుడు గారి తండ్రికడ వారు పాలేరులుగా బ్రవేశించినారు. సంసారము బొత్తుగా జితికిపోయి, కడు పేదరికమున సోమయ్యతండ్రి వీరయ్య సుబ్బారాయుడుగారి తండ్రి శ్రీరామమూర్తి గారి నాశ్రయించి పాలేరుగా జేరి, తన తెలివి తేటలచే, విశ్వాసముచే గ్రమముగా బెద్దపాలేరైనాడు. అప్పటికే సిగ యెగగట్ట నేర్చిన సోమయ్య, తండ్రికి కుడి భుజమై ఆతనికి దగిన కుమారు డనిపించుకొనుచు శ్రీరామమూర్తి గారికడ జీతము గొనుచుండెను.

ప్రథమమున సంవత్సరమునకు బదునెనిమిది బస్తాల ధాన్యమునకు బ్రవేశించిన వీరయ్య పోనుపోను ఇరువదియైదు బస్తాలు, నేబది రూపాయల రొక్కముగూడ జీతముగా బుచ్చుకొని, తొంబదియేళ్ళ వృద్ధుడై చనిపోయినాడు. సోమయ్య నేడు పెద్దపాలేరు. సుబ్బారాయుడుగా రాతనికి పాలేరని పేరు మార్చివేసి గుమాస్తాయని పేరుపెట్టి నెలకు బదునేను రూప్యముల జీతము, బస్తాగింజలు చొప్పన నిచ్చుచుండెను.

తక్కిన పాలేళ్ళందరకు కూడ మంచిజీతములే యిచ్చుచు, సుబ్బారాయుడు గారు వాండ్రకు శౌచాదిక ము నలవరచిరి. దొడ్డిలో నున్నవారు గాక మాలలు, గౌడులు నలుగు రితరపాలేళ్ళుండిరి. ఇంటిలో అంట్లుతోముటకు, నీరు తోడుటకు, బిడకలు చేయుటకు దొడ్డిలో గాపురమున్న కుటుంబములలోని స్త్రీలనే నియమించిరి. వారికిని సంబళము నేర్పరచిరి. సోమన్న కోడలు ఇంటిలో నాడు వారికి వలయుపనులన్నియు చేయుట, బియ్యము బాగు చేయుట, పిండిని విసరుట, బట్టలు సర్దుట, ఎక్కడివస్తువు లక్కడ నుండునట్లు చూచుట మొదలగు పనులను జేయుచుండును. గొల్లవారిలో నచ్చమ్మ నమ్మకమగు బంటు. దాని తల్లిదండ్రులు సుబ్బారాయుడి గారి యింటనే యుండువారు. అచ్చమ్మ తండ్రి గతించినాడు. తల్లి వృద్ధురాలై యింటిపనులను జేయుచుండును. అచ్చమ్మ వివాహము చేసికొని భర్త నిల్లరికము తెచ్చుకున్నది. అచ్చమ్మ యిద్దరు చెల్లెండ్రు నటులనే భర్తల నిల్లరికము తెచ్చుకొని సుబ్బారాయుడు గారింటనే కాపురముండి నారు.

వారి భర్తలు సుబ్బారాయుడు గారి పాలేళ్ళు. వారి పిల్లలు గొడ్ల కాపరులు, వారు పనికత్తెలు.

సుబ్బారాయుడి గారి దొడ్డిలో గాపురమున్న రెండవ కాపుకుటుంబము సోమన్న యల్లునిది. సోమన్నకు ముగ్గురు కొమరితలు నలుగురు కుమారులు. సోమన్న కొమరితలు కుమారులుగూడ నాల్గవతరగతివరకు జదువుకొన్నవారే. సోమన్న తన పెద్దయల్లుని సుబ్బారాయుడు గారి దగ్గర పాలేరుగా ప్రవేశపెట్టి తన యింటి ప్రక్కయింటిలో గాపురముంచినాడు. తక్కిన యిరువురు కొమరితలను దొడ్డిపట్లలో నొకరికి, గోపాలపురములో నొకరికినిచ్చి పెండ్లి చేసినాడు. వారందరు కడుపులు ఫలించి సుఖముగా కాపురములు చేయుచున్నారు. సోమన్న కు ముగ్గురు కొమార్తెలు వరుసగా బుట్టుటచే, నిక

కొడుకు పుట్టడని నిరాశ చెంది, బీదకుటుంబపు బాలునికి పెద్ద కూతురునిచ్చి యిల్లరికము తెచ్చుకున్నాడు. ఇప్పుడు సోమన్న పెద్ద కుమారుడు సత్తెయ్య ఇరువదిరెండేండ్ల వాడు. చిన్నతనమున నారాయణరావుతో నాడుకొన్నాడు. నారాయణరావు రాజకుమారుడు, సత్తెయ్య బంట్రోతు. నారాయణ రావు కలెక్టరు, సత్తెయ్య డఫేదారు.

సుబ్బారాయుడి గారి దొడ్డిలో కాపురమున్న వెలమలు పదియేండ్ల క్రితము సుబ్బారాయుడు గారి పనిలో చేరి వొళ్ళువంచి పని చేయుచుండుట చేతను, వారు కడియములో మంచి పేరుగన్న పూదోటలో పని చేసియుండుట చేతను, సుబ్బారాయుడు గారు వారిని పూలతోటపనికి నియోగించిరి. ఆలమండ గ్రామంలో మామిడితోటలో బని చేసిన కుటుంబమును కొత్తపేట కనతిదూరమున నున్న తన ముప్పది యకరములతోటలో గాపురముంచినారు.

సుబ్బారాయుడి గారిదొడ్డిలో కాపురమున్న అయిదు గొల్ల కుటుంబములలో ఒక గొల్ల దూడల బెంచుటలో బేరుగన్న వాడు. ఆతని చేయి తగిలిన పశువుల దరికి రోగములు సేరవు. ఈతలుడిగిన పశువులు, అట్టుగడిగిన యెద్దులు వారి దొడ్డిలో పింఛనుద్యోగులవలె, వార్ధకమున సుఖించుచుండును.

సుబ్బారాయుడి గారికి బశువులన్న బరమ ప్రాణము. మానవులకన్న వాని నెక్కుడు ప్రేమతో జూడవలెనని యాయన మతము. దొడ్డిలోని దూడల నన్నిటిని బేరులు పెట్టి ముద్దుగా బిలుచుచు గోముగా బెంచుచుందురు. ఏ దూడకైన నించుక కాలు నొచ్చినచో నాయన ప్రాణము విలవిల లాడిపోవును.

సుబ్బారాయుడు గారికి ఎనిమిదికాండ్ల స్వంత వ్యవసాయమున్నది. అయిదు ఒంగోలు జతలు, రెండు మైసూరుజతలు, సింధీజత యొకటియు, కేవలము సవారి బండ్ల కుపయోగించునవి కలవు. రెండుజతల బొబ్బిలిపోతులు, మూడు జతల బండిపోతులు, సంతతము వారికడ నుండవలెను. దొడ్డిలో గాపురమున్న వాని పిల్లలే పసుల కాపరులు.

మనుష్యులు పస్తుండినను, దూడలకు మేత తప్పగూడదని సుబ్బారాయుడు గారి మతము. వట్టిగడ్డి, జనుము దంటు, జొన్న చొప్ప, చిట్టు, తవుడు, ఉలవలు, సమస్తము సుబ్బారాయుడు గారి యింటిలో బుష్కలముగా నుండవలెను. పచ్చగడ్డి మేతకై పదియెకరములభూమిలో బిల్లిపెసర పెంచెదరు. బీటి నేలకూడ బుష్కలముగా నుండుటచే వారికి బశుగ్రాసలోపమెన్నడు నుండెడిది కాదు.

సుబ్బారాయుడు గారికి బాడిపశువులు విస్తారమున్నవి. ఒంగోలు ఆవులు ఎనిమిది, దేశవాళీ ఆవులు పన్నెండు గలవు. అయిదు పెద్ద గేదెలున్నవి. కొన్ని పాడిపశువులు, కొన్ని చూడివి, కొన్ని వట్టిపోయినవి. వారింట సర్వకాలముల పాడి పుష్కలముగా నుండవలెను. పాడిదూడలు గాక, వారింట గుమ్మడిపండావులని యొక జాతి కలదు. సుబ్బారాయుడు గారి తాతగా రాజాతి నేక్కడనుండి సముపార్జించిరో? ఆవు రెండడుగులన్నరయెత్తు, చిన్న తల, లేడికళ్ళు, పాల సముద్రమువంటి తెల్లని యొడలు, రేపు శేరు మాపు శేరు పాలిచ్చు కుండ పొదుగుతో గామధేనువువలె ముచ్చటగా నుండును. ఆ గుమ్మడిపండావు దూడ కడుచిన్నదియై బొమ్మదూడవలె ముద్దులు మూటగట్టుచుండును.

వనలక్ష్ములవలె నున్న శారదా, సూర్యకాంతములతో నేగు నారాయణ రావు త్రోవలోని మొక్కలను వర్ణించి చెప్పుచు, బాడి పశువుల పాకయున్న దొడ్డిలోని కేగెను. ఆ పెద్దపాకలో నొక ప్రక్క గుమ్మడిపండావులు రెండున్నవి. ఒకటి పాలిచ్చుచున్నది; రెండవది

వట్టిపోయినది. తన్ను చూడగానే చెంగు చెంగున గంతులిడుచు చేరవచ్చిన దూడను నారాయణరావు ముద్దులాడ దొడగెను. పనుల త్రొక్కిడిచే రొచ్చు గానున్న యాదొడ్డిని గాంచి ఏవగించు కొనుచున్న శారదకు, భర్త దూడనెత్తి ముద్దులాడుట మీదు మిక్కిలియై —'వదినా యింటిలోకి వెళ్ళిపోదాం రావమ్మా' యని వెనుకకు తిరిగి, మగని యెడ్డెతనమును గూర్చిన తలపులతో నింటిదెసకు నడువసాగెను. శారదాచిత్తవృత్తి యెరుంగని సూర్యకాంతము ఆమె వెనుకనే పరువిడి, యామెకడ్డముగ నిలువబడి 'ఏవమ్మా వదినా, ఏమిటి! గుమ్మడిపండు దూడనుజూడకుండగనే వెళ్ళిపోతున్నా వేమిటి? రా!' అని పిలిచినది. 'చూస్తూ నేవున్నా గదా' యన్నది శారద.

అంతకుమున్నే వికలమనస్కుడైయున్న నారాయణరావు శారద వింతవర్తనమున కింకను నొచ్చుకొనుచు, ఆమెను వెనుకకు గొని తెచ్చుటకు నిర్బంధించు చెల్లెలితో 'సూర్యం! నువ్వు ఇల్లారా! ఇది కబురులు చెపుతోంది చూశావా! దీనికి 'వరబాల' అని నాన్న గారు పేరు పెట్టారా?' అనినాడు. సూర్యకాంతము తలవంచికొనియున్న వదిన దెస కొకపరియు, లేని వికాసము దెచ్చుకొను అన్నదెస కొకపరియు జూడ్కి ప్రసరించి నిట్టూర్పువదలి యన్న గారి దగ్గరకు వెడలిపోయెను. శారద యేమనుకొన్నదో యక్కడనే యాగి, 'వదినా ఆ చిట్టిదూడ నిట్లాతీసుకు రావమ్మా' యన్న ది. ఆ మాటకు సూరీడు మొగమింతయై దంతపుబొమ్మవలెనున్న యా పెయ్యదూడను సునాయాసముగ నెత్తికొని వదినగారికడకు గొనిపోయినది. నారాయణరావు నిట్టూర్చుచు నక్కడనుండి నెమ్మదిగా వెడలిపోయినాడు.

ఆసాయంత్రమే సుబ్బారాయుడు గారితోట జూచుటకు నాడు పెండ్లివారందరును మోటారుమీద బయలుదేరినారు. సూర్యకాంతము, సత్యవతి, పరమేశ్వరమూర్తి భార్య రుక్మిణియు వారితో వెళ్ళినారు.

తోటలో మామిడి జాతులు, బత్తాయిలు, పనసలు, పోకలు, కొబ్బరులు, జామలు, దబ్బలు, నారింజ, ఉసిరి, సపోటాలు, జంబుమలాకా, గులాబి జామ, పంపరపనాసలు, నిమ్మలు మొదలయిన వివిధ ఫలవృక్షజాతు లున్నవి. తోటలో రెండుమూడు కుటుంబముల వారు కాపురమున్నారు. తోట కన్నుల పండువై సువాసనలతో నిండియున్నది. చెట్టున బండిన కాశీజామపళ్ళు, నారాయణరావు బెంగుళూరునుండి తెప్పించిన గింజ లేని జామపళ్లు, పిండిగింజ జామపళ్ళు, సపోటాపళ్ళు, తోటమాలులు కోసి వారికెల్ల నర్పించినారు. దీపాలవేళకు మోటారింటికి దిరిగివచ్చినది.

నారాయణరావున కేదియో వ్యక్తము గానిభయ మొండు హృదయమున బ్రవేశించినది. శారదవర్తనమునం దేదియో విశేషభావ ముండునని యాతడనుకొనెను. ఛీ! తప్పు. అది భారతీయ నారీమణులకు సహజమగులజ్జ యని మనస్సును సమాధాన పరచుకొనెను.

నారా: పరం! మన స్త్రీ లెంత పాశ్చాత్యవిద్యావంతులైనా, వారికి పాశ్చాత్య నాగరికతా వాసన లెంత యలముకొన్నా, భారతీయ సంప్రదాయ వాసన వారిజీవితాన్ని వదలి పెట్టదురా!

పరం: ఏం, ఆ ఆలోచన కల్గింది? ఎవరైనా కనపడ్డారా ఏమిటిరా పెద్దచదువు చదివి భారతీయ సంప్రదాయాలున్న వాళ్ళు, ఇవాళ?

నారా: ఒక ఆలోచన్లోంచి ఇంకోటితట్టిన వరుసలో ఆఖరుఆలోచనఇది.

పరం: ఆ గొలుసుకు మొదటిలంకె ఎక్కడ మొదలెట్టిందేమిటి?

నారా: అదేముంటుంది లే, ఏదో చిన్న ఆలోచన!

పరం: అయినా, మనస్తత్వ పరిశోధనకోసం అడుగుతున్నాను.

నారా: నేను చెప్పింది తప్పా?

ఇంతలో లక్ష్మీపతి అక్కడకు వచ్చినాడు.

లక్ష్మీ: ఏమిట్రా వాదించుకుంటున్నారు?

పరం: చూడరా, వీడు ఒక పెద్ద సిద్ధాంతం చేశాడు. నువ్వు వప్పుకుంటావా, వప్పుకోవా? అంటాడు. సరేరా, నీ సిద్ధాంతానికి ఉపపత్తులైన మొదటి ఆలోచన లేమిటిరా అంటే, వీడు ఇవీ అవీ చెప్పి తప్పించుకుంటాడు. లక్ష్మీ: అసలు వీడి సిద్ధాంతం చెప్పవోయి.

పరం: ఈరోజుల్లో పాశ్చాత్యవిద్య చదువుకున్న ఆడవాళ్ళ అంతరాంతరాల్లో భారతీయ సంప్రదాయ వాసన ఉండనే ఉంటుందట.

లక్ష్మీ: అదా! అదెప్పుడూ మావాడి వాదనలో ఒహటి.

పరం: ఒరే! నువ్వు గాంధిగారి భావాలన్నీ అద్భుతం, నిజం అంటావు. ఆయన ఏవన్నారూ, 'పాశ్చాత్యవిద్య లేకపోతే రామమోహనరాయ లింకా చాల గొప్పవాడయి ఉండును' అని. దానిమీదేగా మోడరన్ రివ్యూ మొదలైన వాటికి కోపాలొచ్చాయి. అల్లాఅంటే అర్థం ఏమిటిరా లక్ష్మీపతీ? పాశ్చాత్య విద్యవల్ల నిజమైన భారతీయ నాగరికత నశించిపోతుందనేనా?

లక్ష్మీ: అవును. నిజమే!

నారా: 'పాశ్చాత్యవిద్య వచ్చినా', అని నేను అననే అన్నాను. అంటే మన వనితాలోకం విషయంలో గాంధిమహాత్ముని సిద్ధాంతం పూర్తిగా అన్వయించుననే నా అభిప్రాయం. అంతే గాని అది తప్పుఅని కాదుగదా. అంటే మన దేశంలో కాస్త తెలిసో తెలియకో సంప్రదాయం బ్రతికించి వున్నది ఆడవాళ్ళే అని.

పరం: ఏమిటి బ్రతికించిఉన్నది? పక్కపాపిళ్ళు, సినిమా ముస్తాబులు, విడాకులరంధీ_వీటినేనా?

నారా: అన్నీ ఒప్పుకున్నా. కాని యీ పై పై మోజులతో పాశ్చాత్య తత్వం పూర్తి అయిందంటావా?

పరం: ఇంత వరకూ వచ్చిన తరువాత పూర్తికాక మానుతుందా? వాళ్ళ చదువు పూర్తిగా ఎక్కినకొద్దీ తక్కిన ముచ్చట్లు కూడా తీరవూ? తొందర పడతావేం?

నారా: కావచ్చును. కాని నేను ప్రస్తుత స్థితిని గురించే చెప్పుతున్నా.

లక్ష్మీ: సరే ఇద్దరి వాదనా ఒక్కటే. ఇక పదండి.

మనుగుడుపులు

జమీందారు గారు వ్రాసిన యుత్తరమువల్లను, తీసికొని వెళ్ళుటకు వచ్చిన జమీందారు గారి చుట్టము గంగరాజు రంగారావు దేశముఖు గారి పట్టువల్లను, నారాయణరావుతో మనుగుడుపులకు నాతని యప్పచెల్లెండ్రు నలువురు, వదిన గారు, సూర్యకాంతము అత్తగారును తరలి వెళ్ళినారు.

సుబ్బారాయుడుగారు వధువువెంట వచ్చిన ఆడపెళ్ళివారి కందఱుకు, రంగారావు దేశముఖు గారికి వెలపొడుగు వస్త్రములు వెండిపళ్ళెములు ఫలములు మొదలగు బహుమతు లర్పించి పంపిరి. వారి నౌకరులకుగూడ దలకు మొలకు గట్ట నిచ్చిరి.

అల్లుని చూడగానే జమిందారుగారి వదనము ప్రఫుల్లమయ్యెను. మధ్యహాలులో శ్రీనివాసరావు గారు, మృత్యుంజయరావుగారు, సీతారామాంజనేయ సోమయాజులుగారు, ఆనందరావుగారు, భాస్కరమూర్తి శాస్త్రిగారు, బసవ రాజరాజేశ్వర శ్రీ జగన్మోహనరావు జమిందారుగారు, రంగారావు దేశముఖు గారు, నారాయణరావు, జమిందారుగారు, నారాయణరావు రెండవ బావ మఱది వీరభద్రరావు మొదలగు వారందఱు సోఫాలపై నధివసించి కొంతతడవు ఇష్టాగోష్ఠి సల్పిరి. నారాయణరావు మాటలాడక యన్నియు వినుచుండెను. శ్రీనివాసరావుగారు తన వైపు తిరిగి తన్ను ప్రత్యేక మప్పుడప్పుడు ప్రశ్నించుచుండుటచే నారాయణరావు గంభీరములు, నాలోచనాపూరితములునగు సమాధానములు చెప్పుచుండెను. నారాయణరావు స్నేహితుడగు రాజేశ్వరరావు నాయుడుగూడ నప్పడేవచ్చి యందఱకు నమస్కృతు లొనరించి యచ్చట గూర్చుండెను.

రైళ్ళవిషయమై సంభాషణ నడచుచుండెను.

శ్రీనివాసరావుగారు నారాయణరావును జూచి,

శ్రీని: ఏవండీ నారాయణరావు గారూ, చూశారూ! మరేమంటే మన దేశంలో రైళ్ళు కంపెనీల క్రింద వుండడం లాభమా, ప్రభుత్వం క్రిందఉండడం లాభమా?

నారా: ప్రభుత్వం క్రింద ఉండడమే లాభం.

శ్రీని: ప్రయివేటు కంపెనీలకు వుండే లాభాపేక్ష ప్రభుత్వానికి ఉండదనా మీ యభిప్రాయం?

నారా: ఆశ ఉండక పోవడమే కాదు. గవర్నమెంటు సాలీనా వచ్చే నికరాదాయం వృద్ధి చేసుకొని తద్వారా ప్రజలకు ఇతర సదుపాయాలు చేయవచ్చు.

మృత్యు: అయితే రైల్వేలుకూడ గవర్నమెంటు డిపార్టుమెంటై, ఎఖ్టిటేపు పద్ధతి అమలులోకి వస్తే లాభాలనేవి వుంటాయా అని.

జమీ: ఆబుకారీ డిపార్టుమెంటు లాభసాటిగా లేదుటండీ?

శ్రీని: రైల్వేలు ప్రభుత్వం చేతిలోవుంటే చూశారూ, పెద్ద ఉద్యోగాలన్నీ ఇంగ్లీషువాళ్లకే కట్టబెట్టి వాళ్లందరికీ జీతాలు విపరీతంగా యిస్తారు. మరేమంటే ఆ సొమ్ము ఐ. సి. ఎస్. వాళ్ల జీతాలలాగ అంతా ఇంగ్లండే చేరుతుంది.

రాజే: కంపెనీ అయితేమాత్రం ఇప్పుడూ ఆ పనే జరుగుతోంది కాదా అండీ. నారా: వారి ఉద్దేశం ఏమిటంటే, బ్రిటిషు ప్రభుత్వం చేతిలో రైల్వేలు ఉండడం లాభమా లేక హిందూదేశపు ప్రయివేటు కంపెనీ చేతిలో ఉండడం లాభమా అని.

శ్రీని: అవును.

నారా: బ్రిటిషు ప్రభుత్వం హిందూదేశంలో వున్నన్నాళ్లు రైల్వేలు హిందూ దేశంలో కంపెనీలకు యివ్వరు. ప్రస్తుతం హిందూ దేశంలో అంత పెద్ద పెట్టుబడి పెట్టి రైల్వేలు కొనే కంపెనీలు తయారుగా లేవు. ఇంక రైల్వేలు వెనుకటి షరతుల ప్రకారం ప్రభుత్వం చేతిలోకి ఎప్పటికైనా వస్తాయి. కొన్ని వచ్చాయి అప్పుడే.

జమీం: రైళ్ల విషయం లెక్కలన్నీ నాదగ్గర వున్నాయి. ఇంతవరకు హిందూదేశంలో వేసిన రైళ్ల వలన ప్రయివేటు ఇంగ్లీషు కంపెనీలకు, హామీ రూపంగానున్న ప్రభుత్వం వేసిన రైల్వేలకు, వడ్డీనష్టం వగైరాలమీదనున్ను గవర్నమెంటుకు చాలానష్టం వచ్చింది. (నారాయణరావు వైపుకు తిరిగి) ఆనక ఒకసారి నా స్వంతగదిలోకివస్తే ఆ లెక్కలన్నీ చూడవచ్చును.

నారా: అలాగేనండి. నాకూ ఈమధ్య ఆ లెక్కలన్నీ కావలసే వచ్చాయి.

జమీ: ఆక్సువర్తు కమిషను సంగతి ఎరుగుదువు కాదూ?

నారా: అవును ఆ రిపోర్టులు చూడాలి.

మృత్యు: ఏమిటండీ ఆ కమిషను?

జమీం: రైల్వేలు గవర్నమెంటు చేతిలో వుంటే ఎక్కువ లాభమా, కంపెనీల చేతుల్లో ఉంటే ఎక్కువ లాభమా అన్న ఈ ప్రశ్నే.

నారా: ఇతర దేశాలు ప్రస్తుతం భాగ్యవంతమైన దేశాలు. మన దేశం చాలా బీదది. పైగా పాశ్చాత్య దేశాల్లోనే ఇప్పుడు రైల్వేలు గవర్నమెంటుకు ఇచ్చి ప్రజాధీనం చెయ్యాలని రభస చేస్తున్నారు.

శ్రీని: గవర్నమెంటు స్వాధీనం అయితే లాభాల సంగతి వేరే చెప్పాలా!

నారా: చిత్తం, వస్తున్నాను. ముందు రైల్వేలు లాభదాయకాలైనవి అనే సంగతి మనం ఒప్పుకుంటే.

శ్రీని: ఒప్పుకున్నాను ప్రస్తుతం.

నారా: అయితే, దేశంలో ఏకొద్దిమందికో కంపెనీరూపంగా వచ్చే లాభం గవర్నమెంటుకు వస్తే ఆ రాబడి విలువ ఇతర పన్నులలో తగ్గించవచ్చు కదా? మఱి ప్రస్తుత ప్రభుత్వం అలా తగ్గిస్తుందాంటే, ఇది కేవలం లాభసాటి గవర్నమెంటు గనుక, యిప్పుడు ప్రజలకి ఉపయోగం లేదు. అయితే రేపు ప్రజాప్రభుత్వం, అనగా కెనడా మొదలయిన దేశాలలో ఉన్నటువంటి డొమినియను ప్రభుత్వం, వచ్చినా లేక సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినా ఆ లాభం అంతా ప్రజలకే గాదండీ? శ్రీజగ: ఇంగ్లీషు వాళ్లు కోట్లకొద్దీ డబ్బు పెట్టి మన దేశంలో రైళ్ళు వేస్తే మన ప్రజలు లాభంపొందాలీ! ఇది సబబేనా?

నారా: వాళ్లు పెట్టిన పెట్టుబడి తీరగా ఏటేటా బోలెడు లాభాలను వాళ్ళెలాగూ గుంజుకుపోతున్నారు. ఇంక మనం కోరేదానిలో అన్యాయం ఏం ఉంది?

జమీం: గవర్నమెంటు, కంపెనీదగ్గిర నుంచి రైల్వేలను పుచ్చుకోవాలంటే ఉన్న యావత్తు సరకులకు రోడ్లకు పట్టాలకు ఖరీదు ఇవ్వనక్కరలేదా? ఆ డబ్బు ఇప్పుడు మనదగ్గర లేదే! ఆ డబ్బు మళ్ళీ ఇంగ్లాండే పెట్టుబడి పెట్టాలే.

నారా: డెబ్బదిఅయిదు సాలుసరి వాయిదాలమీద తీర్చడానికి ఏర్పాటు చేసికొని కదాండి?

జమీం: అవును. తిరిగి పుచ్చుకున్న తేదీకిముందు మూడుసంవత్సరాలు వచ్చిన లాభం కంపెనీ వాటాలకు పంచి, సగటుధరనుబట్టి అనగా నూరు కాసుల షేరుకు ఏ నూటయిరవయ్యానో అంచనా వేసి నూటికి నాలుగున్నర వడ్డీతో డెబ్బదిఅయిదు వాయిదాలలో తీర్చడానికే ఒప్పందం చేసుకున్నారని జ్ఞాపకం.

శ్రీజగ: ఈ రైళ్లు మనవాళ్ళు సరిగా నడపగలరండీ? మనవాళ్లే నడపడం వచ్చిందంటే రోజుకు రెండుసార్లు బోల్తాలో ఢీకొట్టటమో జరగదా!

భాస్క: అదేవిటండీ రాజాగారూ! అట్లా సెలవిస్తారు? ఎంతమంది గొప్ప ఇంజినీయర్లు, గార్డులు, డ్రైవర్లు మన వాళ్లు లేరు? స్టేషను మాస్టర్లంతా మనవాళ్లే. పోనీ ఇంగ్లీషువాళ్ళు పై ఉద్యోగాలు చేస్తున్నారా?

శ్రీజగ: ఇంగ్లీషు వాళ్లకు ఏమాత్రం తీసిపోని యూరేషియన్లు.

భాస్క: వాళ్ళుమాత్రం మన వాళ్ళు కాదండీ? మన చేతికిందికి వస్తే మాత్రం వాళ్ల, ఉద్యోగాలు తీసి వెయ్యాలని ఉందాండి?

సీతా: అయ్యో! ఈ తెలుపూ నలుపూ గాని దొరలున్నారు బాబూ, అసాధ్యులు. అసలుదొరలు నయమండీ! వీళ్ల ముందర ఆగలేం.

ఆనంద: మీరు చెప్పింది నిజమే కాని ఇప్పుడు చాలా నయమండీ శాస్త్రులు గారూ. వాళ్ళూ తాము హిందూ దేశస్థులమనీ మునిగినా తేలినా మనతోపాటేననీ గ్రహించారు.

సీతా: వాళ్లని తెల్లదొరలు రానిస్తారాండీ బాబూ?

మృత్యుం: తెల్ల దొరలు వీళ్ళు కంత్రీలు, మా కక్కర లేదు, మాకేం సంబంధం లేదంటారు. మనవాళ్లు కాదంటారు.

నారా: అలాఅనకండి. భారతీయులు ఎప్పుడూ వాళ్లని తమలో ఐక్యం చేసుకోడానికి సిద్ధంగానే ఉన్నారు, వాళ్ళే మేం తెల్లవాళ్లమని. వాళ్లదేశం హోము అంటే ఇంగ్లండని అంటూవచ్చారు. గాంధీజీ ఎప్పుడూ వాళ్లని సంపూర్ణ ఐక్యభావంతో మనలో జేరమనే కోరినారు.

సీతా: వాళ్లు గబ్బిలాలన్న మాట!

శ్రీజగ: అదేమిటండీ తెలివితక్కువమాటంటారు? తెలియక పోతే ఊరుకోవాలి. గబ్బిలాలూ! యూరేషియను స్త్రీలకి ఉండే అందం ఒక్క ఇంగ్లీషు అమ్మాయికి ఉందీ! మీ

ఛాందసపు బ్రాహ్మణ ముత్తైదువులకు ఉందా పోనీ?

నారా: అందచందాల విషయం ప్రస్తుతం కాదు; పోనీండి.

శ్రీని: అదేమిటండీ రాజా గారూ, కోపంవచ్చిందీ! చూశారూ, సోమయాజులు గారు వట్టి అమాయక బ్రాహ్మణుడు. మరేమంటే చూశారూ మీరు ఆ సంగతులూ, ప్రపంచం ఎరిగున్న వారు గనుక తెలుస్తుంది. చూశారూ!

జమీం: ఏదో ఛలోక్తికన్నారు. అంతే!

సీతా: చిత్తం చిత్తం. అంతేనండి మహాప్రభూ, క్షంతవ్యుణ్ణి.

ఇంతలో ఫలహారములకని కబురువచ్చినది. జమీందారు గారు శాస్త్రి గారిని సోమయాజులు గారినీ లోనికంపి తామంద రచ్చట నే యుపాహారముల గైకొందుమని వాక్రుచ్చినారు. తక్కిన వారందరికడ బంట్రోతులు పాలరాలు పరచిన బల్లల నుంచినారు. వంట బ్రాహ్మణులు నేతిలో వేయించిన జీడిపప్పు, ఆవు పెరుగులో వైచిన ఆవడలు, మైసూరుపాకము, గపుచిప్పుమిఠాయి, జిలేబి యుండలు, పనసతొనలు, చక్రకేళి అరటిపండ్లు, అనాసముక్కలు వెండి పళ్లెములతో అందరికడ నుంచినారు. స్పెన్సర్ కంపెనీ వెండిగళాసులలో మంచువైచిన మంచినీళ్లుంచినారు. చేతులు కడుగుకొనుటకు తళతళలాడు కంచుతట్టలు ఎవరికి వారికి వేరుగా నౌకరు తెచ్చియుంచగా వంటబ్రాహ్మణులు నీళ్ళు పోయుటయు, చేతులు కడుగుకొనిరి. అపురూపమైన చీనా దేశపు గిన్నెల సెట్టులలో తేనీరు, కాఫీ, ఏది కావలసిన వారి కది యిచ్చినారు.

నారాయణరావు రాజేశ్వరరావును దీసికొని మేడమీద తనగదికి వెళ్ళెను. అచట స్నేహితులిరువురు తనివితీరునట్లు సాయంత్రమువరకు మాట్లాడుచునే యుండిరి.

పల్లెటూరి మోటుమానిసి యనుకొన్న నారాయణరావు తెలివితేటలలో, మాట నేర్పులో నతిశయించుటగాంచి శ్రీ జగన్మోహనరావు జమిందారుగారికి తల కంటగింపు కలిగినది. జమిందారుల యింట బుట్టిన తనవంటి వానికున్నచో శోభించునే గాని, ఈ పల్లెటూరి బడుగు తెలివి కెవరు సంతసింతురు? ఒకరి సంతసముతో తన కేమిపని? శారద మాత్రము సంతసింపదనుట ముమ్మాటికి నిశ్చయం. ఆంగ్లో ఇండియను వనితలను దాను వెనుక వైచికొని మాటలాడిన మాట లా ప్రక్కగదులలో నెచటనైన శారదయుండి వినలేదుకదా!

౧౮
వీణ

ఆ సాయంత్రము విహారము సలిపివచ్చి నారాయణరా వత్తవారి మేడ చేరునప్పటికి దివ్యానాదపూరితమగు విమలగాంధర్వమున దిశల నింపుచున్న దొక బాలిక. రాజేశ్వరుడా పాట విని 'ఎవరురా, అంత అద్భుతంగా పాడుతున్నారు' అని అడిగినాడు.

'ఆ! శ్రీరామయ్యగా రీమధ్య ఊళ్ళో లేరు. నేడే వచ్చారు. వారు ఫిడేలుతో పక్క వాయిద్యం వాయిస్తూ శిష్యురాలిని ఎంత విచిత్రంగా పాడిస్తారనుకొన్నావు!'

'మీ ఆవిడే నేమిట్రా!'

'ఆమాత్రం కనిపెట్టలేవురా! ఉండు. శ్యామ ఆలాపన జేస్తున్నారు. విను, విను.

మాట్లాడకు.'

'నాకు సంగీతమం టే తలనొప్పి.'

'అప్పుడే నీవు 'ఆస్పిరిను' అంశకు వచ్చావుట్రా?' గదిముందరి వరండాలో దీపాలు ఆర్పివేసి రాజేశ్వరరావును, తానును పడక కుర్చీలపై కూర్చుండి నారు.

తారకాకాంతులే 'శాంతమూ లేక సౌఖ్యమూ లేదు' అని పాడుచున్నట్లయినది. చీకటిలో గనబడని పూవుల సౌరభమే సంగీతమై విశ్వమంతయు నావరించిపోయినది. గులాబిపూల పాలగొంతుక నుండి వెడలు నా పవిత్రస్వనముతో బోల్చుటకు నారాయణరావు కీ ప్రకృతిలో నేదియు తలపునకు రాలేదు. వేణువనస్వనములా, సెలయేటి గానములా, తుమ్మెద ఝుంకారములా ఇవి యేవియు దగవని యాతడు తలయూచినాడు. కోకిల గొంతులు కావచ్చు ననిపించినది.

నారాయణరావు హృదయము ఆనందపూరితమై ప్రేమపూర్ణమైనది.

'నను పాలింపా, నడచివచ్చితీవో !'

చిట్టి శ్రీరాముడు, నీల మేఘశ్యాముడై తొనలు తిరిగిన చిఱుచేతులతో చిన్న బంగారువిల్లు పట్టుకొని, నవ్వులు వెదజల్లుచు, నడచివచ్చిన ట్లాతనికి గోచరించినది. అతని కన్నుల నీరుతిరిగినది. ఆ గొంతులో చిన్ని శ్రీరాముడే కలడు. శ్రీరామయ్య గారి కంఠములో దుష్టరాక్షస సంహారుడగు రఘువీరుడే కోదండపాణియై అనుజ సౌమిత్రులతో సాక్షాత్కరించుచున్నాడు. ప్రశాంతమగు నా సంధ్యారాగములో మిళితమగు శ్రీరామయ్యగారి కమాను కదుపులోక శారదాదేవి గళమునుండి తొలుతాడు కలికి చెలువంపు తీయ సవ్వడులు గలసి, లత్తుకతీర్చిన చిన్నారి పాదాలపై పరికిణి యంచులు చిందులాడ, కనక కింకిణీనూపుర ఘల్లులారవముతో శీతనగ స్వచ్ఛహిమశకలముపై నృత్యమొనర్చు సుమాబాల విశ్వమోహనమగు కంఠ కుహూకారములు విరియించిన ట్లయినది నారాయణరావునకు.

'ఎటులా బ్రోతువో తెలియా
ఏకాంత రామయ్యా...!'

ఆర్తరక్షకుడగు నా శ్రీరామచంద్రమూర్తి ఎంత చక్కని ప్రభువు! ప్రోచిన నాతడే ప్రోవవలయు. శ్రీరామ నీలమేఘము భక్తమనః కేదారముల బూర్ణసస్యముల బండించుగదా ! పరాప్రకృతియగు సీతమ్మ తల్లియు, పరమాత్మయగు శ్రీరామచంద్రుడును నవ్యయులు, సత్యచేతన ప్రదాతలు 'ప్రోచినను కబళించినను నీదే భారము ప్రభూ! రామరామా! యని రంజిల్ల నావంతు, నియతిమై రక్షింప నీది వంతు' అని కనులు మోడ్చినాడు నారాయణరావు.

రాజేశ్వరుడు చెలికానివంక తిరిగి 'ఏమి నారాయుడూ! నే నిన్నాళ్ళూ పెళ్ళిచేసుకోనని మానివేశాను. ఏదో సంబంధము మా నాయన తీసుకువస్తే ఆ పిల్లకూ, నాకూ ప్రేమ కుదురుతుందని నమ్మకం లేదు. మా నాయనతో ఏదో సాకులు చెప్పి తప్పించుకున్నా. మా నాయన పోయినతర్వాత నేటికి మా అమ్మ వెట్టిబలవంతం పెట్టింది. గొంతుక్కు వెలక్కాయ పడినట్లయి తర్వాత చెప్తానులే అని పారిపోయివచ్చాను' అని పడకకుర్చీలో జేరగిలబడి కనులుమూసుకొని నారాయణరావు నడిగెను.

రాజేశ్వర రావుది పచ్చని దబ్బపండుచాయ. తెలగబిడ్డయైన నతని నందఱు బ్రాహ్మణుడే యని తలంతురు. అతడు శాకాహారి. స్వచ్ఛమగు పలుకు, మధ్యమోన్నతమై కండ పుష్టి కలిగిన శరీరము, వంకర తిరిగిన ముక్కు, సమమైన నుదురు, కామపురుషార్థపరతాస్ఫోరకములగు దీర్ఘ చక్రవాకలోచనములు. ఫ్రెంచి పద్ధతిని సగము మిగుల్చుకొన్న నల్లని మీసములు. చుట్టును జవ్వ లేని సులోచనములు ధరించి, ముంగురులు నున్నగ వెనుకకు దువ్వుకొనును. ప్రసిద్ధ సినిమా నటకు డగు రుడోల్ఫు వాలంటీనో పద్ధతి నాతడు పొడువుగా బెంచుకొను మొగచెంపలును, తీర్చినట్లున్న నల్లని కనుబొమలు నాతని మోమునకు గాంభీర్యమును పుణికియిచ్చును. ఆతడు ధరించునవి చిక్కని మీగడ తరక వంటి ఫ్రెంచిపట్టు చొక్కాలు, తెల్లటి లాగులను తొడుగును. కాళ్ళకి ఖరీదుగల లూథియానా జరీచడావు లుండును.

నారాయణరా వాతని నఖశిఖపర్యంతము జూచి చిరునవ్వునవ్వి, తన ముదుక ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ, ఖద్దరు సేలం కండువాలను జూచుకొని నవ్వుచునే పెదవి విరుచుకొని ‘ఒరే రాజీ! నువ్వెపుడైనా అలంకారముతో లేని సమయం ఉందిరా?’ అని ప్రశ్నించెను.

‘ఇంటిదగ్గిర లబ్బీలుంగీ కట్టానురా!’ ‘అది పట్టుదేనా?’

‘ఆ.’

‘నిద్దట్లో నీ జుట్టు చెరుగుతుందిరా!’

‘పాపము శమించు గాక!’

‘ఏదీ చెయ్యి? పారాహుషార్!’

‘నామీద ఒక వ్యాసం రాయరా! ఒక కథ అల్లరా!’

‘నీ వొక్కడిమీదనేనా, ఆ పరకీయను కూడా కలపనా?’

‘సెబాష్! కలిపితే యిక మజా అడిగావూ!’

‘మఱి దశావస్థల్లో ప్రస్తుతావస్థయేదో చెప్పు?’

‘మీ కవిత్వాల్లో విరహావస్థ లన్నింటిమాటా నాకు తెలియదుగాని ‘ప్రళయం’ మట్టుకు తప్పేటట్లు లేదు.’

‘ఎవరికి? నాయికకా, నాయకునకా? ఆ పూర్ క్రీచరుకా? మీ మోహప్రవాహాన్ని ఆ భర్త అరికట్టడనీ, పైపెచ్చు సంతోషంతో ఓలలాడతాడనీ చెప్పావుగా! నీ వానాడు చెప్పినమాటలు తలచుకుంటే నా కిప్పటికి ఒళ్ళు జలదరిస్తున్నది. ఎంత అమానుషపు టూహ చేశావురా!’

‘ఒరేయి! ఈ విషయములో మనం యిద్దరం ఏకాభిప్రాయులం కామనిన్నీ, ఆ భావాలు మనం చర్చించుకోవడం మానివేద్దామనిన్నీ అనుకున్నాంగా?’

‘అవును. అందుకనే ఆయనమాట తలపెట్టవద్దన్నాను. కాని ఇప్పుడు నీ పెళ్ళిమాట ఎత్తావు కాబట్టి ఇప్పటికైనా ఈ హేయశృంగార ప్రబంధానికి స్వస్తి చెప్పి, పెళ్ళిమాట ఆలోచించడం ఉత్తమం.’

'నారాయుడూ! నువ్వు చెప్పే ముసలమ్మల సిద్ధాంతాలు నాకు గిట్టవు. ఎప్పుడో ఇక్ష్వాకులనాడు పుట్టిన వివాహాచారాన్ని యీ ఇరవయ్యో శతాబ్దంలో కూడా పట్టుకు వేళ్ళాడమంటావునువ్వు. వివాహాలు లేని కాలం కూడా ఒకటి ఉండేదన్న మాట మరచిపోకు. ఏదో ప్రయోజనం కొరకు మధ్యలో కల్పించిన యీ ఆచారంతో ప్రయోజనం లేదనుకుని యిప్పుడు దాన్ని విడిచిపెట్టే వాళ్ళకు ఆక్షేపణ ఏముంది? స్త్రీ, పురుషుల ప్రేమసంబంధానికి ఇంత తంతెందుకు?

'పెళ్ళిలేని కాలం ఒకటి ఉండేది అన్నావు. ఆ కాలం పాశ్చాత్యశాస్త్రజ్ఞుల వాదన ప్రకారం, మానవులు జంతువులలా సంచరించే రోజులు. కనక ఇప్పటి జంతువుల సంగతి విచారిస్తే ఆనాటివారి స్థితి మనకు గోచరిస్తుంది.'

'అది సరే. నా వాదానికే వస్తున్నాను.'

'తొందరపడకు. ఆ కాలంలో మానవజాతి అంతా ఇష్టంవచ్చిన మగవాడూ, ఇష్టమువచ్చిన ఆడదీ వాంఛ తీర్చుకోవడం, తర్వాత వాళ్ళకీ వీళ్ళకీ సంబంధం లేకుండా ఉండడం అనికదా నీ వాదన? నువ్వు అనుకునే జంతుత్వం జంతువులలో లేదు. మానవ సంబంధంలేని జంతువులలో ముఖ్యంగా లేదు. భగవంతునివల్లనో, లేక ప్రకృతివల్లనో వచ్చిన 'ఇన్‌స్టిన్‌క్ట్' (జంతుజ్ఞానం) వల్ల జంతువులు బ్రతకడం జాతి వృద్ధిపొందడం అనేవి మాత్రమే అవి ఎరుగును. ఆ జంతుజ్ఞానంవల్ల ఇష్టమువచ్చిన తిండితినవు. ఇష్టమువచ్చినట్లు కామం తీర్చుకోవు. దేహం కాపాడుకోడానికి తిండి, జాతి వృద్ధిపొందడానికి కామం అని ఆ జంతుజ్ఞానమే వాటికి చెప్పింది. ఇష్టమువచ్చినట్లు తిండితిన్నా, కామం తీర్చుకున్నా జాతి నశిస్తుందని ఆ జంతుజ్ఞానమే చెప్పింది. అందుకనే సాధారణపు కోతులలో ఒక మగకోతి కొన్ని ఆడకోతులు ఉంటవి. లేక ఉరాంగు ఉటాంగు మొద లైనవైతే, గొరిల్లా లాంటివి అయితే, ఒక మగది ఆడది నీతిగా ఉంటవి. అలాగే సింహం, పులి, తోడేలు, ఎలుగు. అదీ కాకుండా జంతువులకు ఋతుకాలం అంటూ ఒకటి ఉన్నది. ఆ కాలంలోనే కామక్రియా నిర్వహణం జరుగుతుంది. ఇదే జంతువులలో పెళ్ళివంటిది.'

'అయితే మన ఆవుల సంగతి, కుక్కల సంగతి ఏమిటి? ఆంబోతుకు ఈ ఆవు ఆ ఆవు అని లేదు. ఎప్పుడు ఏ ఆవు ఎదపోయి సిద్ధంగావుంటే, ఆ ఆవుతో పొర్లడానికి ఆంబోతు సిద్ధం. ఆ ఆవుకైనా ఏ ఆంబోతైనా సరే. కుక్కలలో ఒక్కొక్క ఋతుకాలంలోనే ఆడకుక్క రెండు మూడు మగ కుక్కలతో సంబంధానికి సిద్ధం. చూలు నిలవగానే మానుకుంటుంది. తన పిల్ల అయిన మగకుక్క అయినా సరే! గాడిదెలు అంతే, పందులు అంతే. ఇప్పు డే మంటావు?'

'నువ్వు 'మన' అనడంలో నే జవాబంతా వచ్చింది. అయినా విపులం చేస్తాను. మనుష్యుని జీవితాల్తో కలిసిపోయినవి ఆల జాతులు, కుక్క, గాడిద, పంది, పిల్లి జాతులు. అందువల్ల చాలాభాగ౦ వాటికి జంతుజ్ఞానము నశించి పోయింది. మనుష్యునికున్న మనస్సున్నూ లేదు. అయినా అవికూడా ఋతుకాలాన్ని మాత్రం అనుసరిస్తాయా, అనుసరించవా?'

'సరేరా! పెళ్ళి అనే సంస్థ సంగతి కానీ.'

జంతు జీవితంలోంచి నెమ్మదిగా మనుష్యుడు తన మనోబలంవల్ల పైకి రాసాగాడు. మనస్సంబంధమైన జ్ఞానము వృద్ధిఅయినకొద్దీ జంతుజ్ఞానము నశించినది. భోజన నిద్రామైథునములు మాత్రమేకాక అనేక వాంఛలు, వాటిని సంపాదించుకోడం పెట్టుకున్నాడు.

కళలన్నాడు, లలితకళ లన్నాడు, కృషి వాణిజ్యాలు, యుద్ధాలు రాజ్యాంగాలు పరసాధన యిటువంటి వ్యాపారా లనేకం కల్పించుకున్నాడు. ఆయా వ్యాపారాలలో నిరంతరసాధన చేస్తూ, అద్భుతమైన నాగరికత నిర్మించుకున్నాడు. ఆహారనిద్రా మైథునాలు తప్ప వేఱే పని లేనివాళ్లు అప్పటికీ యిప్పటికీ నువ్వనుకోగానే పశుతుల్యులుగానే వుంటారు. తన మానవత్వం సార్థకపరుచుకోడానికి ధర్మార్థాలు సాధింపదలచుకొన్న వాళ్లు పశుప్రవృత్తయిన కామానికి ఒక హద్దు ఏర్పరచుకొన్నారు. నిరంతర కామసేవ కోసం, ఉదరపూజకోసం ఆలోచిస్తూకూర్చోడానికి వాళ్లకు వీలుపడదు. నిద్రహారాలు కూడా మాని, దీక్షతో పనిచేసే మానవుడికి కామవిషయం కలలోకి గూడ రాదుగదా! అయితే ప్రజోత్పత్తిమూలకమైన కామం కూడా పురుషార్థమే కనక, దాన్ని బొత్తిగా వదలి పెట్టనక్కరలేని సామాన్యగృహస్థులంతా, ఒక స్త్రీతోనే కామనిర్వహణం చేస్తూ, యితరపనులు చేసుకోడానికి మనశ్శాంతీ, తీరికా సంపాదించుకుంటారు. అంతే కాని స్త్రీ, పురుషులు స్వేచ్ఛాచారపరులయి నిరంతరం సంఘసుస్థితికి భంగంకల్గించే కొట్లాటలు తెచ్చి పెట్టుకోగోరరు'

'ఒక స్త్రీతో వుండాలని నేను వొప్పుకుంటాగాని వివాహ కర్మకాండంతా ఎందుకు?'

'ఆ మాటన్నావు, బాగుంది. జాతి క్షేమానికి, సంఘ సుస్థితికీ ఒక పురుషుడూ ఒక స్త్రీయే కూడివుండడం అవసరమని ఒప్పుకుంటే నాకు చాలు. వివాహకర్మ మానుకొన్నా నాకు సమ్మతమే.

'మఱి ఎందుకు చేస్తున్నారందరూ యీ కర్మను?'

'అది వేఱే సంగతి. వివాహం అర్థకామాలకే కాకండా, ధర్మమోక్షాలకు గూడా సాధనమని నమ్మేవారు ఆ పని చేస్తారు. వాళ్ల జోలి నీకెందుకు? తానుతప్ప యితరం లేదంటూ, ఆత్మాభిమానంతో మ్రగ్గేవాడికి గృహస్థాశ్రమం ఆత్మసాధన. తన చుట్టూ తాను కట్టుకొన్న గిరిని ఆలుబిడ్డలద్వారా విస్తరింప జేసుకొని, క్రమంగా విశ్వంతో ఐక్యభావం సాధించుకొంటాడు. గృహ్యా సూత్రోక్తమైన కర్మలు సర్వభూత దయాళుత్వం మొదలైన ఉన్నత భావాలకు మెట్లవంటివి. ఇది అంతా మతానికీ, దేవుడికీ సంబంధించిన విషయం. నువ్విదంతా వేదాంతమంటావు. కాబట్టి ఆ సంగతి మనకు వద్దు.'

'వివాహకర్మ అక్కరలేదంటే మనకిక తగాదా లేదు.'

'లేకేమి? మీ స్వేచ్ఛాచారులు ఒక స్త్రీ, ఒక పురుషుడు అనే నిబంధన ఒప్పుకోరుగా? మోజు తీరిపోగానే యెవరిదారి వారు చూచుకోవలసిందనేగా మీ మతం?'

'అవును గాని, స్త్రీకిగూడ స్వతంత్రం అనేది వుంటే మేము చెప్పేస్థితి వస్తుందా, రాదా?'

'ఆ స్థితికి కారణం స్త్రీ, స్వాతంత్ర్యం అవునో కాదోగాని, ఆ స్థితి మాత్రం అధోగతికి కారణమవుతుంది. జడ్జి లిండ్ సే అమెరికా స్థితి వ్రాశాడు. చూడలేదూ? విడాకులు పుచ్చుకోడానికి స్త్రీ కీ పురుషుడికీ సమానస్వాతంత్ర్యం వున్న సోవియట్ రష్యాలో, అమెరికాకంటే తక్కువ విడాకుల సంఖ్య. విన్నావో, లేదో? కాబట్టి స్త్రీ, స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నీతి నియమాలనేవి వుంటే ధర్మరతి అనేది వుంటే నువ్వనుకొనేస్థితి యెన్నడూ సంభవించదు. ఆహారనిద్రామైథునాలకొఱకే మనం బ్రతుకుతున్నామనుకొంటే మాత్రం ఆ స్థితి తప్పకుండా వస్తుంది. అప్పుడు మన కీ రాజ్యాలూ అక్కర లేదు. కళలూ అక్కర లేదు.'

'ఒరే నారాయుడూ! నీ కీ ప్లీడరీ ఎందుకుగాని, సనాతనమత ప్రచార పీఠం ఒకటి

పెట్టరా!’ అనుచు రాజేశ్వరరావు నారాయణుని వీపుతట్టి వెడలి పోయెను.

౧౯
ప్రేమస్వాతంత్ర్యము

రాజేశ్వరరావు చిన్నతనమునుండియు తిరుపతిరావు గారి శిష్యకోటిలోని వాడు. తిరుపతిరావుగా రే విషయమును గూర్చి సంఘముతో దాము పోరాడుచున్నారో, స్త్రీ, పురుషు లేవిధమున సంచరించవలెనని వాదించుచున్నారో అట్లే తాము సంచరించి అకల్మష హృదయులనియు, దృఢవ్రతులనియు, ధీరచరిత్రులనియు బేరుపొందినారు. వారి యభిప్రాయములతో నేకీభవింపనివారు గూడ వారి త్రికరణశుద్ధిని మెచ్చుకొనువారే. ఆ తిరుపతిరాయునికి రాజేశ్వరుడు నమ్మిన శిష్యుడు.

తల్లిదండ్రులు వివాహము చేసికొమ్మని యెంత పోరినను, ఆతడు యెన్నో సాకులు చెప్పుచు తప్పుకొనుచుండెడి వాడు. తిరుపతిరావు గారు ఎవ్వరితోడ నబద్ధము లాడవలదనియు, ఉత్కృష్టధర్మమగు స్వతంత్ర మసత్యముచే గలుషిత మగుననియు రాజేశ్వరున కనేక విధముల బోధించినాడు.

రాజేశ్వరుడు రాజమహేంద్రవరము చదువుటకు వచ్చినపుడు నారాయణునితో ప్రాణస్నేహ మేర్పడినది. నారాయణరావు రాజేశ్వరున కెన్ని సారులో తిరుపతిరావు గారి శుశ్రూష వలదని బోధించినాడు. పరమేశ్వరరావుమాత్రము తిరుపతిరావు గారి విధానము స్త్రీ, పురుష సంబంధపు జిక్కు చక్కగా విడదీయ రాజపథము కావచ్చుననియు, కొందరి జీవితము లా విధానమునకు సమర్పితములు గావలెననియు రాజేశ్వరు డట్లేల చేయరాదనియు నారాయణరావుతో వాదించువాడు. ఆది ఆత్మహననమార్గమని మనకు తెలిసివచ్చినప్పుడు, ఆ జ్ఞానమును రెండుచేతుల ద్రోసివైచి, కళ్ళకు గంతలు కట్టుకొని, మహావిషోరగ భయంకర జీవములు గడపి, విష వాయుపూర్ణమును, నగాథము నగు నరక కూపాన నేలబడవలయునని నారాయణరావు వాదించువాడు.

తిరుపతిరావుగారి స్నేహము చేయుచుండినచో రాజేశ్వరుని మోము చూడనని నారాయణుడు అదలించినను ‘నీకు ఉడుకుబోతుతన మెందుకు? నువ్వు కూడా మాజట్టు చేరు. నువ్వా ఘోటక బ్రహ్మచారివేగా’ అని రాజేశ్వరుడు వికటముగా జవాబిచ్చెను . తిరుపతిరావు గారిచుట్టును పాశ్చాత్యవిద్యా దక్షులగు (విద్యాదగ్ధులా?) పెక్కండ్రు చేరినారు. ఒకరి భార్యల నొకరు పొందవచ్చును. స్త్రీ, స్వాతంత్ర్య సంపాదనము, శిక్షాస్మృతిలో పరభార్యా సంభోగమునకు, గర్భవిచ్ఛిత్తికి నేర్పడిన శిక్షలు తొలగించుట, విడాకుల చట్టము, అన్నదమ్ములతోపాటు స్త్రీలకు బిత్రుస్వమున భాగమొసగు చట్టము నిర్మింప జేయుట మొదలగునవి వారికి ముఖ్యాశయములు.

పరస్త్రీ సంగమము దోషమని తలంచుట యజ్ఞానవిలసితమని వారి యభిప్రాయము.

ఆ బృందముతో తిరుగు రాజేశ్వరుడు పవిత్రుడు గాడని యెవరు చెప్పగలరు? ఆత డందగాండ్రలో లెక్కగావున ఆ సమాజములోని బాలికల కతనిపై మరలు జనించుట వింతకాదు.

కాని యా సంఘములోగూడ పెక్కు వత్సరముల నుండి పరస్పరము ప్రేమించుకొనిన స్త్రీ పురుష యుగ్మము లెన్నియో కలవు. ఆ సంఘములో పూర్వసంప్రదాయానుసరణి వివాహమైనవారిలో తిరుపతిరాయడు గారొకరు. ఆయన భార్య విద్వాంసురాలు, పతిప్రాణ.

భర్తగారి యాశయములు, బోధలు, చర్యలు తన కేమియు నచ్చకపోయినను సత్యవర్తనమే పరమధర్మమని తలచి, పతియానతి కెదురు చెప్పక, స్వేచ్ఛాచార సంఘములో గాఢ దీక్షాపరురాలివలె చరించుచు, ఆయన కామసంబంధము చేసికొమ్మనిన వారితో నిష్టము లేకున్నను అటులనే చేయుచుండెను.

తిరుపతిరావు గారికి వనితామానాపహరణమే పరమవ్రతము. 'స్త్రీ', భోగముకొరకే జనించినదని యాతని వాదము. నతివిచిత్రమైన ప్రాణియట వనిత. ఆమె కన్నులలో నీలిమబ్బులు తేలియాడునట. ఆమె పెదవులలో తేనెవాక లున్నవట. ఆమె వక్షములో ప్రేమ యతి గంభీరమై యాకాశమువలె నగమ్యసుందరమై యుండునట. ఆమె దేహము కౌగిలింతల గోరునట. ఆమె చెక్కిళ్ళు నీరసనిదాఘతప్తున కుపశమనోషధీ కుసుమములట. ఆమె మెడ, బాహువులు, కటిప్రదేశ మూరువులు, జంఘులు, పాదములు చుంబనసౌభాగ్యమునకై పరితపించు పరమకళాప్రదేశములట.

రాజేశ్వరుని కా బృందములో నొక స్నేహితుని భార్య సౌందర్యము అయస్కాంతమైనది. ఆమె రాజమహేంద్రవరములో నొకవకీలు భార్య. సుబ్బయ్యశాస్త్రి గారు నలుబదియేండ్లయీడువాడు. ఆయనకు ముప్పది రెండవ యేట రెండవ వివాహమైనది. వివాహమైన రెండు నెలలకు భార్య కాపురమునకు వచ్చినది. ఇప్పుడామె కిరువది రెండవయేడు. ఆమె పేరు వివాహము కాక పూర్వము పుల్లమ్మయైనను, సుబ్బయ్య శాస్త్రి, గారు పుష్పశీలయని నామకరణము జేసినారు. ఆ సుగాత్రి పుట్టిల్లు రాజమహేంద్రవరమే. ఆ విద్యావతి వీరేశలింగము పాఠశాలలో అయిదవ ఫారము చదువుచుండగా వివాహమైనది. అప్పటివర కామెతలిదండ్రు లామె కింకను ఈడు రాలేదనియే చెప్పుచుండిరి. వివాహమైనపిమ్మట బుష్పవతి యైనదని యుత్సవము జేసినారు. తక్కిన వేడుక లన్నియు జరిగి భర్తయింటి కా శోభనాంగి రెండు నెలలలో వెలుగువలె, సువాసనాలహరివలె ప్రత్యక్షమైనది.

పుష్పశీల పుష్పమే. ఆమెయందము నాగుబాము, చిరుతపులి, వజ్రముల యందమువంటిది. శిరోజములుంగరములై, దీర్ఘములై, నీలముకన్న నీలములై కటిభాగమున పచారుసేయును. వెడదలై, సోగలై పెద్దకనీనికలతో గాఢభావములొలుకు నాపె కన్నులు సమ్మోహనమంత్రములే. ఆమె సమనాసికాగ్ర మించుక పైకి తిరిగినట్లుండి వలపుదలపులు పట్టియిచ్చు చుండును. పూర్ణోష్టసుందరమగు నామెముఖ మించుక వెడదయై కాముకులకు నోరూరజేయుచుండును.

వనితాలోలుడగు సుబ్బయ్యశాస్త్రికి తిరుపతిరాయని స్వేచ్ఛాచారి సంఘమున బద్ధుగైకొనుట తప్పనిసరియైనది. ఆ వనితా పుష్పవనములో బంభరుడు కాగోరినాడు. ఆత డందగాడు గాకపోయినను న్యాయస్థానమున పేర్వడిన యాతని వాదనాపటిమ కొందఱు యువతులమనసుల నాకర్షించినది.

స్వేచ్ఛాచారు లపుడప్డు సుబ్బయ్యశాస్త్రియింట నాతిథేయులగుట కలదు. కాని సుబ్బయ్యశాస్త్రి భార్యనుమాత్ర మా మూకకంట నెన్నడు బడనిచ్చినాడుకాడు. కావున నా సంఘ సభ్యురాండ్రగు వనితామణులు సుబ్బయ్య శాస్త్రిని 'మీ పుష్పశీలకు గాలి వెలుతురు పడవు కాబోలు' నని యెత్తిపొడిచెడివారు.

రాజేశ్వరుని మాటలును, మంచితనమును, మృదుస్వభావమును ఆతనిని సుబ్బయ్యశాస్త్రికి ప్రాణస్నేహితు నొనర్చెను. ఇంటిలో నించుక చనవు దొరకుటచే ఒకటి రెండుసారులు సుబ్బయ్య శాస్త్రి భార్య రాజేశ్వరరావుకంట బడినది. 'పుర్దనాషీన్' అగు

పుష్పశీల ఏముహూర్త ఘటనాచమత్కృతినో యాతని కన్నులబడినది. పుల్లమ్మ గారు అద్భుత సౌందర్యవతియన్న ప్రతీతి మున్నాతడు విన్నాడు. కాని నేడు కన్నులలో తళుక్కుమని మాయమైన యా త్రిజగన్మోహినీమధురమూర్తియే ఆ పుల్లమ్మయని నమ్మజాలడయ్యెను. పుల్లమ్మ శరశ్చంద్రచంద్రికా ఖండము. తక్కు సుందరులెల్ల మిణుగురులు అతనిగుండె బ్యాండుస్వరము వాయించినది. తన భాగ్యదేవతాసాక్షాత్కార వృత్తాంతము నాతడు సుబ్బయ్య శాస్త్రి కెరుక పడనీక హృదయమున నిక్షేపించుకొన్నాడు.

సుబ్బయ్యశాస్త్రి గారియింట్లో వంటలక్క ముసలియామె. ఆయనతల్లి వేయికండ్లతో గోడలి ఘోషాను కాపాడుచుండును. ఆడవాళ్లుమాత్ర మామెను జూచుటకు బోవచ్చును. సుబ్బయ్యశాస్త్రి భార్యను బేరంటములకు పంపునపుడు గూడ ఘోషాను రక్షింపగల 'సెడాను' జాతి కారులో నంపును. మోటారు తోలువాడొక పెద్దకాలపు వీరాస్వామి. వీరాస్వామికి దన మోటారుబండి తప్ప నితరమేమియు గనపడదు. పుష్పశీల ప్రపంచము చూడవలెనను గాఢవాంఛగలది. తనయందము, తన నగలు, తన చదువు నితరులముందు, ముఖ్యముగా బురుషులముందు, మెఱపించుట కామె ముచ్చటపడుచుండును. కాబట్టి యత్తగారు గృహకృత్యము లొనరించుకొను నప్పుడు, మధ్యాహ్న భోజనానంతరము కునుకుదీయునప్పుడు, మేడమీదనుండి సమస్తాభరణభూషితురాలై యాకాశమునుండి తొంగిచూచు తిలోత్తమవలె ఇన్నీసుపేట వీధిలోనికి జూచుచు, ఆ దారి నేను పడుచువాండ్రకు ఎదురువచ్చు బండ్లరాకయు కాలము పోకయు దెలియనిచ్చెడిదికాదు.

ఎంతకాలమునుండియో ముదుకమేనితో బ్రాణములకు లకెవైచికొనియున్న సుబ్బయ్యశాస్త్రి తల్లి పుష్పశీల పుణ్యము పండియో, ఆపె ఘోష కొట్టియో యుండియుండి యొక్కనాడు 'కృష్ణ కృష్ణా!' యనుచు, నెవరికి దెలియకుండ, నే ముదుకలోకమునకో యెగిరిపోయినది. సుబ్బయ్యశాస్త్రి తన కుడిభుజము కూలిపోయినట్లు తన భార్యకు సాయముండువా రెవ్వరూ లేకుండిరని వాపోయెను. గూటిలో చిలుక కొదమవలెనున్న పుష్పశీల కొక్కసారి రెక్కలు విప్పుకొన్నట్లయినది. సుబ్బయ్యశాస్త్రికి గడియవైచిన తన యింటి తలుపులన్నియు విప్పుకొన్నట్లయినది. గంపంత యింటిని జూచుకొని, వయసులో నొంటరిగా నున్న తన భార్యను జూచుకొని, తన కోర్టుపని దలచుకొని సుబ్బయ్య శాస్త్రి, నిలువునా నీరైపోయినాడు.

పుష్పశీలకు భర్తపై గాఢనురక్తి లేకున్నను అసహ్యముమాత్రము లేదు. భర్తతో నీ యేడేండ్ల కాపురము లోకముతో పాటుగానే వెళ్లబుచ్చినది. నేడామెకు నెత్తిమీద బరువు దింపినట్లయినది. హృదయమునుండి కత్తిమొన పెరికివేసినట్లయినది. కళ్ల గంతలు విప్పినట్లయినది.

సుబ్బయ్య శాస్త్రికి భార్యయన్న వెఱ్ఱిమమకారము. ఇతర స్త్రీలపై నుబలాటము. ఇతర వనితల కెప్పుడు నాతడు మాటయిచ్చి తప్పినది లేదు. పుష్పశీల మాట కడుగుదాటినదియు లేదు. భార్య యాతనికి తుష్టి గూర్చు షడ్రసోపేత భోజనము. పరకాంత లాతనిచపలజిహ్వకు ఫలహారములు.

పుష్పశీల గర్భమింతవరకు ఫలించలేదు. ఆమె బ్రతుకున నిండియున్న కామపరిమళము పూర్ణముగా నింక నెవ్వరిని జుట్టుకొనలేదు. ఆమెతో యౌవన మాధుర్యము నరమూతకనులతో గ్రోలి చరితార్థ మొనరించు మధువ్రతుని కొఱకామె తపియించుచున్నది. తన మంజులాంగ సౌకుమార్యసరసతావిలాసముల నెమ్మేన పెనవేసుకొని మునుకలిడి, తెప్పదేల్చు పురుషవర్యు డామెకు బ్రత్యక్షము కాలేదు.

చెన్నపట్టణమునుండి వచ్చినప్పటినుండియు రాజేశ్వరునకు బుష్పశీలను జూడవలెనను వాంఛ వేయిమడుంగులైనది. అది యాతనికి దపస్సయినది. సుబ్బయ్యశాస్త్రి యింటి కాతడెన్ని సారులు వెళ్ళెనో! కాని యాతనికంటి కామె తళుక్కుమన లేదు. పుష్పశీలకు గావలియుండు బ్రహ్మరాక్షసి యిప్పుడు సుబ్బయ్య శాస్త్రి వేలువిడిచిన మేనత్త. ఒకనాడు సుబ్బయ్య శాస్త్రి మేనత్తకు జ్వరము వచ్చినది. ఆ యాదివారము నాటి సాయంసమయమున రాజేశ్వరుడు మిత్రునింటికి టీ వేళ కరుదెంచి తేనీరు గ్రోలుచుండ సుబ్బయ్య శాస్త్రి మేనత్తజ్వరముచే దనకు బెంగగా నున్నదని చెప్పినాడు. రాజేశ్వరు డదివిని తనదగ్గర నద్భుతమగు జ్వరనారాయణాస్త్రమువంటి పాశ్చాత్యౌషధ మొండు కలదనియు, నది రెండుమూడు మోతాదులతో గుదుర్చుననియు జెప్పి, తానెక్కి వచ్చిన సైకిలుమీద నతివేగమున నింటికరిగి యా మందు పట్టుకొనివచ్చి యిచ్చెను.

సుబ్బయ్య శాస్త్రి, చీకటిపడువరకు రాజేశ్వరు నచ్చటనే యుంచి మాట్లాడుచుండగ, లోననుండి పనిచేయుమనిషి వేగముగావచ్చి చెల్లమ్మ గారికి చెమటలు జడివానలా పోస్తున్నాయండి' యని చెప్పెను.

స్నేహితు లిరువురు గుభాలున లేచి లోనికి బోయినారు. వారిరువు రచ్చటకు బోవునప్పటికి పుష్పశీలమ్మ యొక తెల్లని వస్త్రముచే నా రోగి ముఖము తుడుచుచుండెను. ఆమె తలయెత్తి రాజేశ్వరరావును జూచెను. రాజేశ్వరు డామెను జూచెను. చెల్లమ్మ గారికి జ్వరమును తగ్గెను.

అది మొదలుకొని పుష్పశీలాదేవి తప్ప ప్రపంచమున నేవస్తువు గోచరించుట లేదు. మనమున నింకొక భావము ప్రసరించుట లేదు. ఆతని జీవితసూత్ర మా బాలికారూపసంపదను బెనవేసుకొని పోయినది. భోజనము రుచించుట లేదు. నిద్రపట్టుట లేదు. గ్రంథములపై మనసుపోదు. టెన్నిసు మొదలగు నాటలాడ నిచ్ఛలేదు. స్నేహితుల సమావేశములు వెగటైపోయినవి.

రాజేశ్వరుని జూచినప్పటినుండియు, పిపాసార్థితునకు జల్లని మంచినీళ్లు కనులబడినట్లయినది పుష్పశీలకు. ఠీవియైన నడకతో, ఫ్రెంచిమీసముతో, పురుషత్వము వెలిగిపోవు రూపసంపదతో, రాజేశ్వరు డామెకు జయంతునివలె బొడగట్టినాడు. దూరదూరాననే నాగరికతాసముజ్వలులగు యువకులజూచి సంతసించు నాయోషారత్నమునకు రాజేశ్వరుడు అతిలోక సుందరుడై, ముంగిటి పెన్నిధానమై తోచెను.

ప్రౌఢయగు పుష్పశీల నాటినుండి రాజేశ్వరు డనేక మిషలతో దన యింటికి వచ్చినప్పుడు భర్తకు దెలియ రాకుండ దర్శన మొసగుచుండును. నర్మగర్భములగు చూపులతోడనే వారిరువురు నించుకించుక హృదయతాపోపశమన మొనర్చుకొనుచుండిరి.

భర్త కోర్టులో నొక గట్టి వ్యాజ్యములో మునిగియున్న రోజున రాజేశ్వరుని కేరీతినో చీటివచ్చినది. ముసలమ్మకు జ్వరము మరల వచ్చునట్లున్న దనియు దామిదివరకు ఇప్పించినమందు పట్టుకొని రావలసినది అనియు నా చీటి చెప్పినది. రాజేశ్వరుడు రెక్కలు గట్టుకొని యచ్చట వాలినాడు. కాని యతని తోడనే వచ్చినట్లు సుబ్బయ్యశాస్త్రియు నూడిపడినాడు. రాజేశ్వరుడు హృదయములో శాస్త్రిని నూరుహత్య లొనరించినాడు.

రాజారావు త్వరలోనే చెన్నపట్టణము వెళ్లి కాలేజిలో జేరదలచినాడు. విక్టోరియా హాస్టలులో నుండుట కతని కాయేడు వీలులేదు. విశ్వవిద్యాలయము వారు నెలకొల్పిన వసతిగృహములో నాతడు విధిగా జేరవలసిన చ్చెను. ఆ యేటితో నాతని చదువుగూడ బూర్తియగును.

రాజారావు వైదిక సాంప్రదాయము సంపూర్ణముగ నెఱపు వెలనాటి బ్రాహ్మణుడు. చిన్నతనములో నాతనితండ్రి వసుదేవశాస్త్రి గారు సంధ్యావందనము, పురుషసూక్తము, శ్రీసూక్తము, నమకము, చమకము నాతనికి నేర్పినాడు. వేదములో కొన్ని సూక్తములు పఠింపించినాడు. కాని రాజారావున కా చదువు నచ్చమి దండ్రిగారితో జెప్పకయే మోడేకుఱ్ఱునుండి పారిపోయి కాకినాడ జేరుకొని, కొందరు సంపన్న గృహస్థులయింట వారములు కుదుర్చుకొని, దయాహృదయుడు, విజ్ఞానసముద్రుడు, భగవద్భక్తుడు, బ్రాహ్మమతాలంకారుడు, కళాశాలాధ్యక్షుడునగు శ్రీ వెంకటరత్నంనాయుడు గారి దయకు బాత్రుడై విద్యార్థి వేతనమును సముపార్జించుకొన్నాడు.

తనయు డెచ్చటికి బోయినదియు దెలియక యాతని తల్లిదండ్రులు బెంగగొనిపోయిరి. అతని తల్లి పేరమ్మగారికి మతిబోయి మూర్ఛజనించినది. పిమ్మట నెలదినములకు మూడవ ఫారములో తాను జేరినాననియు, బాగుగా జదువుకొనుచున్నాననియు, రాజారావు ఉత్తరము వ్రాసెను. దానితో తల్లిదండ్రు లిరువురు కాకినాడపోయి కుమారునిజూచి, కనుల నీరునింపుకొని, కుర్రవానిని వదిలి యుండలేక తాము సకుటుంబముగా వచ్చి కాకినాడలోనే వసింప నిశ్చయించుకొనిరి.

రాజారావంత అద్భుతమైన తెలివితేటలుగలవాడు కాడు. ఎట్టులో కష్టించి పరీక్షలలో గృతార్థుడగుటకు వలయు తెలివితేట లాతనికడ నున్నవి. కాబట్టి ఏపరీక్షయు దప్పకుండ నెగ్గుచుండెను. తుద కింటరుపరీక్షలో రెండవ తరగతిలో గృతార్థుడై మదరాసు వైద్యకళాశాలలో బ్రవేశము సముపార్జించెను. కాకినాడలో నాతని తండ్రి తన తెలివి తేటలచే కుటుంబవ్యయమునకు సరిపడ సంపాదించుకొనుచు, భూమివలన వచ్చు రాబడిని నిలువ వేసుకొనుచు, చిన్న చిన్న పద్దులమీద వడ్డీవ్యాపారము సలుపుకొనుచు కాలము బుచ్చినాడు. నేడు తన కొమరునకు మదరాసు వైద్యకళాశాలలో బ్రవేశము దొరకుట యాయనకు జాల సంతోషముగా నుండెను. రాజారావు స్కూలు ఫైనలు పరీక్ష చదువుచుండినప్పుడే మంచిసంబంధ మొకటి వచ్చినది. పెండ్లి వైభవముగ జరిగినది. రాజారా వింటరుపరీక్షకు బోవుటకు ముందే యాతనికి బునస్సంధానము జరిగినది. వైద్యవిద్యార్థియైన ప్రథమ సంవత్సరములో నే యుభయవంశపావనియగు కూతురు పెన్నిధివలె జనించెను.

రాజారావునకు నారాయణరావునకు చెన్నపట్టణములో స్నేహ మేర్పడినది. చిన్నతనములో రాజన్నశాస్త్రియగు నేటి రాజారావు సహజపాత్ర శీలుడు. పదిమందితో స్నేహము చేయలేడు. క్రొత్తవారితో మాటలాడలేడు. చిన్నతనమున కాకినాడలో పెద్దలతో నెట్లు మాట్లాడెనో యెట్లు వేతనము సంపాదించుకొనెనో, పెద్దవాడైన రాజారావునకు గ్రాహ్యము కాలేదు. నారాయణరావు సహజధీర స్వభావుడు గాన సభాకంప మెఱుగడు. రాజారావు పిరికివాడు. సభలో నోరెత్తలేడు.

అట్టి రాజారావును, నారాయణరావు కోమలవిలాస కాఫీహోటలులో జూచినప్పుడు పలుకరించెను. ఆనాటి నుండి స్నేహసముద్రుడైన నారాయణరావు రాజారావుగదికి వెళ్లుట ప్రారంభించియు, సినిమాలకు దీసికొని వెళ్ళియు, కాఫీహోటలులో దన స్నేహితులకు విందులిచ్చినప్పుడు రాజారావును గూడ లాగుకొని యేగియు, నాతని హృదయమును

జూరగొని యించుకించుక బెదరుదీర్చినాడు.

రాజారావునకు దెలుగుకవితయందలి నేటి క్రొత్త పోకడలు రుచింపవు. స్వయ మాత డెద్దియు రచింపనేరడు గాని పురాణములు చదువుకొనుట యన బరమప్రీతి. వేదాంతగ్రంథములన్న ప్రాణమే. వివేకానంద, రామతీర్థులు, అరవిందఘోషు, జ్ఞానానంద ప్రేమానంద రాధాకృష్ణులు మొదలగు తత్వజ్ఞులు వ్రాసిన గ్రంథము లన్నియు బూర్తిగ జదివినాడు. చైతన్యుడు, రామకృష్ణ పరమహంస, హరనాథబాబా, రాధాస్వామి సత్సంగ గురువు మొదలగు వారి చరిత్రములు, బోధలు చదివినాడు.

నారాయణరావుగూడ వేదాంతవిచారమున నత్యంత ప్రీతి గలవాడు. అతడు మన పురాణేతిహాసములే గాక, వేదములు, బ్రహ్మసూత్రములు, గీత సాధు నిశ్చలదాస యోగీంద్రుని విచారసాగరము, వృత్తి ప్రభాకరముగూడ పఠించినాడు. యోగవాసిష్ఠము, జ్ఞానవాసిష్ఠము, సీతారామాంజనేయ సంవాదము, అధ్యాత్మ రామాయణము, ఉపనిషత్తులు, శంకర భాష్యము, పంచదశి మున్నగు తత్వవిచారగ్రంథముల సారమెఱింగిన వాడు. మధ్వరామానుజమతముల పరిచయము సంపాదించినాడు. బుద్ధపీఠకములు, జాతక కథలు, ధర్మపథము పరికించినాడు. జెండవిష్ణా, ఖురాను, బైబిలు, జైన సాంప్రదాయములు నవగతము చేసికొన్నాడు. కారలుమార్క్సు, నీషీ, షోపన్ హోరు, బెర్కిలీ, ఎమరుసన్ , బేకను, హాల్డేను, ఎడ్వర్డు కార్పెంటరు, టాల్ స్టాయి, రోలండు, బెర్నార్డు షా, ఎయిన్ స్టీన్, ఎడింగ్టన్, ప్లాటో, అరిస్టాటిల్ మొదలగు పాశ్చాత్యవేత్తల భావములు హృదయస్థము చేసికొనెను.

నారాయణరావు రాజారావుతో నెల్లప్పుడు వేదాంత విషయముల జర్చ చేయుచు నానందమునొందును. రాజారావు తన జన్మమున నా నిమేషములే శుభ ముహూర్తములని తలచి నారాయణుని రాక కెదురుచూచుచుండును.

'మన ఆర్షవిజ్ఞానంముందు డార్విన్ సిద్ధాంతాలు బాలశిక్ష వంటివోయి! ఆతని పరిణామవాదం కేవలం భౌతికం. వినికీ, చూపుకూడా లేని కీటకాలుండేవట ఆదిలో. పిమ్మట దృష్టి శ్రవణాది జ్ఞానంగల సరీసృపాలు ఏర్పడినవట. ఆపైన పాలిచ్చే జంతువులేర్పడి, క్రమంగా కొంచెం మెదడు సంపాదించుకొని కోతులై, చివరకు మనుష్యులుగా పరిణమించినవట. జంతుకోటిలో యీ మెట్లన్నీ కనబడుతూనే వున్నాయట. ఈమాత్రం కనిపెట్టినందుకు డార్విన్ వాళ్ళకొక ఋషి అయిపోయినాడు' అని రాజారావు.

'నిజమే. కాని, అనంతంగా కనబడే యీ సృష్టిలో ఒక క్రమవిధానాన్నీ, వికాసాన్నీ, పరిణామధర్మాన్నీ దర్శించి చెప్పగలగడం కూడా సామాన్య విషయం కాదు. పురాణాల్లో చెప్పబడ్డ సర్గ విధానాన్ని విచారణ చేసి, అంతరార్థం గ్రహించకుండా గుడ్డిగా ఆ ముసలమ్మ కథలనే నమ్మడంకన్న, ఆ కథల్నీ కార్యకారణ సమన్వయాలతో ప్రమాణీకరించడం మంచిదంటావా, అనవా? అతీంద్రియజ్ఞానంగల మన ఋషులు చెప్పిన గంభీర సత్యాలకు, వాళ్లు పరిశోధనాపూర్వకంగా ప్రత్యక్ష ప్రమాణాలతో వ్యాఖ్యానం చేస్తున్నారు' అని నారాయణ రావు.

రాజా: కావచ్చును. కాని కేవల ప్రత్యక్ష ప్రమాణం ఎంత వరకు ఉపయోగిస్తుందంటావు?

నారా: అలాకాదు. వాళ్ళు కూడా ప్రత్యక్షం నుంచి అనుమానాన్నీ సాధిస్తున్నారు గాని ప్రత్యక్షంతో ఆగిపోవడం లేదుగదా.

రాజా: నిజమే. ప్రకృతివిషయం ఇంద్రియ గ్రాహ్యం, బుద్ధిగ్రాహ్యమూ గనక, ఆ రహస్యం సాధిస్తారనుకో. బుద్ధి కూడా మొదటి మెట్టులోనే వుంటుంది గాని పైకి దాటిపోలేదు. బుద్ధికిగూడా గ్రాహ్యంకాని ఆత్మానుభవైక వేద్యమైన పరతత్వం మాట ఏమంటావు?

నారా: ప్రత్యక్షనుమానాలని కూడా గ్రహించని అంధవిశ్వాసం, శుష్క తర్కమూకంటె వాళ్ళబుద్ధివ్యవసాయం ఉత్తమమంటాను. వాళ్లు నిరంతర పరిశోధనవల్ల ఆటం అనే మూలపదార్థాన్ని పట్టుకొన్నారు. ఇంకా లోతుకుపోయి ఆటంకూడా ఎలెక్ట్రాన్ల సంఘాతమని గ్రహించారు. అయితే నువ్వనేది, ఈ యెలక్ట్రాన్లు కూడా అనిత్యపదార్థాలే కాని నిత్యాలు కావుగదా. ఈ అనిత్యాలను పట్టుకొని ఎన్నాళ్ళు ప్రాకులాడినా నిత్యమైన సత్యపదార్థాన్ని చేరలేదంటావు. సరే; బుద్ధిమార్గాన పోగలిగినంతదూరం పోయినతర్వాత అక్కడ దారిదొరక్కపోతే ఇదికాదురా అని వాళ్ళూ మనదారికే వస్తారు. పరమాత్మసాధనలో వాళ్లు ప్రతిదినమూ అనుభవసిద్ధం చేసుకొంటున్నారు. ఇప్పుడిప్పుడే వాళ్ళు కూడా ఇది బుద్ధిగ్రాహ్యం కాదురా అని తెలుసుకొని, దూరదూరాన అఖండజ్యోతిని దర్శిస్తున్నారు. అప్పుడే ఎయిన్‌స్టీన్, ఎడింగ్టను వంటి సాధకులు బయలుదేరారు. పూర్వం మనవాళ్లెప్పుడో ఆ నిత్యపదార్థాన్ని యోగసాధనల చేత చేరారు. ఇప్పుడా మార్గాలన్నీ చీకటితోనిండి దుర్భేద్యాలుగా వున్నాయి. పాశ్చాత్య సాధకులు తిరిగి విజ్ఞానదీపం వెలిగించి ఆదారి కోసం వెదుకుతున్నారు. వాళ్లు సంపాదించిన విజ్ఞానమార్గంలో దానికి రాచబాట వేస్తున్నారు. అంతేకాని మావాళ్ళకు ఇవన్నీ పూర్వమే తెలుసునంటూ మనం చంకలు కొట్టుకుంటూ కూచుంటే మనం యిక్కడేవుంటాం. వాళ్లు పురుషకారపరులు, మనం పండితమ్మన్యత్వం చేత తమస్సులో పడివున్నాము.’

ఇట్టి చర్చలు తరచు జరుగుచు, రాజారావు నారాయణరావుల మైత్రికి దోహదము సల్పుచుండెడివి.

రాజారావు ప్రపంచములో దిరుగనేర్చినవాడుకాడు. మిత్రులతో గలసి మెలసి తిరుగక వేఱుగా నుండును. సహాధ్యాయినులగు యువతులను మోమెత్తి చూడడు. జుట్టు కట్టు మున్నగు వేష భాషలలో నాతడు శుద్ధ శ్రోత్రియుడు. వేషధారులగు తోడి నాగరిక విద్యార్థు లాతని గాంచి పల్లెటూరి సరుకనియు, ఛాందసుడనియు లోలోన నవ్వుకొనుచున్నను, సహాధ్యాయినులాతని వింతమృగమువలె జూచుచున్నను, రాజారా వా పెదవి విరుపులను, అవహేళనములను సరకుగొనక సంచరించెడివాడు.

అతనితో గాఢపరిచయమున్న కతిపయమిత్రులుమాత్ర మాతని సరళహృదయము, వినయశీలము, మధుర స్వభావము, గార్యదీక్షయు నెఱింగి యాతని నెంతయు ప్రీతిమై మన్నించుచుందురు.

౨౧
నౌకావిహారము

నారాయణరా వత్తవారింట మనుగుడుపులు గుడుచు మూడవరోజున నాతని యుత్తరముల ప్రకారము రాజారావు, పరమేశ్వరమూర్తి, లక్ష్మీపతి వచ్చినారు. జమీందారుగారు, నాడు తాను రైలులో చూచిన మిత్రులందరినీ యల్లునితోబాటు మనుగుడుపులన్నినాళ్లు తనయింట విందులకు రండని ఆదరపూర్వకముగ నాహ్వానించెను. ఆ విధమున నల్లునిచేగూడ వారికి వ్రాయించెను.

ఆ రోజంతయు రాజేశ్వరరావుగూడ వారితోగడిపెను. చిత్రలేఖనవిద్య పూర్తిగావించి

నిరుద్యోగియై కాలముగడపు పరమేశ్వరమూర్తి తనకు గురువగు అవనీంద్రుడు పంపిన యుత్తరము స్నేహితులకు జూపించెను. 'పొట్టకై ఎవరికో మమ్ముకొని కళారాధన మొనర్పనెంచిన వారికి కళాసరస్వతి సాక్షాత్కరింపదు. కళాధిదేవతనే నమ్ముకొన్నచో పొట్టగడవకపోదు. నీ కష్టమంతయు కళకే ధారబోసిననాడే నీవు కళాప్రతిష్టలతో పేరుగాంతువు. ఉద్యోగము లేకపోయెనని చింతింపకుము. నీవు అదృష్టవంతుడవు. కావుననే యీ విధముగా నీకు గళారాధనకు గావలసినంత సావకాశము లభించినది. కళాస్రష్టవగుట కిదియే సమయము. కళారాధకుడవై లోకారాధ్యత గడించుకొనుము.

'నీకు సహాయ మొనరించుపట్ల నే నేమాత్రము శక్తివంచన చేయనని యెఱుగుదువు, ఒక్కసారి దేశసంచారము చేసి ప్రకృతిలోని బాహ్యాభ్యంతర సౌందర్యముల దిలకించిరమ్ము. ప్రకృతికంటె మంచి గురువు నీకెచ్చటను లభింపదు. విశ్వస్రష్ట కళానైపుణితో మానవ కళావిలాసము పోల్చి చూచుకొనుము. అంతియే కాని విషాదయోగము పాల్పడకుము. ధీరుడవుకమ్ము. నీవు నా దగ్గర దిగవిడిచి వెళ్ళిన చిత్రములు రెంటిని నా స్నేహితులు చూచి సంతోషించి, కొనిపోయినారు. వారు సొమ్మిచ్చిన వెంటనే నీకు పంపుదును.'

ఈ యుత్తరము నారాయణరావుచూచి యాలోచనా నిమగ్నుడయ్యెను. ఆంధ్రదేశమునం దే లలితకళయు వృద్ధియగు నుపపత్తులు కానరావు. ఏనాడు చక్రవర్తులు, మహారాజులు కాలగతులై మాయమైరో యానాటితో నాంధ్రదేశ సౌభాగ్యము మన్నయినది యని యాతడనుకొనెను.

రాజే: ఒరే పరం! ఏదో స్నేహితుడవు. వేస్తున్నావు. నువ్వు చెప్పిన ముక్కల్లా సరేనని ఊరుకున్నాము. నా కెపుడు తిన్నగా అర్థం అవలేదు. ఏమిట్రా మీ బొమ్మలవిషయం? ఆ వంకరటింకర మనుష్యులేమిటి, ఆ విపరీతపు రంగులేమిటి? ఏమిటీ బెంగాలు సాంప్రదాయం?

పరం: అయితే చిత్రలేఖన ఎల్లా ఉండాలంటావు?

రాజే: ప్రకృతి ననుసరించి ఉండనక్కరలేదట్రా?

నారా: అంటే నీ ఉద్దేశం ఏదో విపులంగా చెప్పరా?

రాజే: రవివర్మ బొమ్మలు తీసుకో, వాటిల్లో మనుష్యులు మన మనుష్యుల్లా ఉన్నారు.

లక్ష్మీపతి: కళ సృష్టే కాని అనుకరణంకాదు, అని కాదూ మీ యిద్దరూ అనేది నారాయణా?

నారా: అవును బావా. రవివర్మ మహావిష్ణువుకు శివుడికి నాలుగు చేతులు వున్నట్లు చిత్రించాడుగదా, అల్లా ప్రకృతిలో ఉన్నాయా? లేవు. మఱి ఎందుకు వేశాడు? పోనీ పాశ్చాత్య చిత్రలేఖకుణ్ణి తీసుకో. రాఫెలు రెక్కలతో ఎగిరివచ్చే దేవమూర్తుల్ని చిత్రించాడు. మనుష్యులకు ఎక్కడైనా రెక్కలుంటాయా? పరం: రవివర్మ వేసిన కృష్ణుడు, చెట్లు, రాళ్ళు, యమునానదీ నిజంగా సృష్టికి అనుకరణాలు కావు.

రాజే: ఆయన ఊహ చేశాడు.

లక్ష్మీ: ఓరి వెర్రివాడా! అదేరా సృష్టి!

రాజే: మఱికొందరు చిత్రకారులు దృశ్యచిత్రాలంటూ, ఏ పాపికొండలలో, గోదావరో, కృష్ణానదో చూచి అదేరకంగా వేస్తారుగదా అని సృష్టా, అనుకరణమా?

పరం: అవి ఏవీ కావు రా.

నారా: ఎందుకంటే, ఒకడు గోదావరి మధ్యకు వెళ్ళి చూస్తే ఎటు చూచినా నీరే కనబడుతుంది. అందుకని ఆ నీరే పటంనిండా చిత్రిస్తాడు. అది గోదావరవుతుందా? అలాగే ఒక పర్వత పాదాన ఎదురుగా నిలుచుండి తన కళ్లయెదుటనున్న ఆ రాతిగోడనే చిత్రిస్తే పర్వతమవుతుందా? కాదు. కాబట్టి దృశ్యచిత్రాల్లో కూడా దేశ కాల పాత్రల్ని వర్ణించాలి.

రాజే: సరే. బొమ్మ వేయాలంటే ఏం జేస్తాడురా చిత్ర కారుడు?

నారా: ఏ చిత్రంలోనైనా ప్రధానంగా భావపూర్ణత ఉండాలి.

పరం: ఆ భావం రమణీయంగా ఉండాలి.

లక్ష్మి: అందుకనేగా 'సౌందర్య మే ఆనందము' అని గానం చేశాడు కీట్సు?

రాజారావు: లక్ష్మీపతీ! ఉండు. వాళ్ళిద్దరూ ఏదో చెప్తున్నారు, ఒక మోస్తరుగా ఇంతవరకూ వాళ్ల వాదన శాస్త్రపద్ధతిగానే ఉంది.

రాజే: నీకు ఎన్ని చెప్పినా, మన బ్రతుకు వేళాకోళం కాదోయి బాబూ అంటే, ఏమి తెలియ దేమిటి నాయనా!

లక్ష్మి: నేను వేళాకోళంగా బతుకుని చూస్తున్నానురా రాజేశ్వరుడా! చాలా తీక్ష్ణంగానూ తీవ్రంగానున్నూ చూస్తున్నాను. కాని ఆ బ్రతుకెక్కడా నాకు కనపడదు.

రాజే: నువ్వుకూడా మా సంఘంలో చేరరా మరి.

నారా: మీ సంఘం, ఒక బౌద్ధ సంఘారామంవంటిదిరా మరి. భిక్కులు, భిక్కిణీలు, జీవితం ఆనందం బాగుందోయి.

రాజే : అసలు నేనడిగిన విషయానికి మీరిద్దరూ జవాబియ్యలేదేవిటిరా?

పరం: కళ మనుష్యసృష్టి అనేగా ఇంగ్లీషులో అర్థం?

నారా: అవును. ఇంతలో జమిందారుగా రా ప్రదేశమునకు వచ్చి నారు. ఆయన స్నేహితులందరిని తన చిన్న లాంచిలో గౌతమీ విహారమునకు దీసికొని వెళ్లినారు. ఆంధ్రులకు బ్రత్యేకరాష్ట్ర మావశ్యకమా కాదా యను చర్చ వచ్చినది. రాజేశ్వరరావు, లక్ష్మీపతియు నాంధ్రదేశమునకు బ్రత్యేకరాష్ట్ర మావశ్యకమని వాక్రుచ్చి నారు. రాజారావామోదించినాడు.

నారా: దేశమునకంతా స్వరాజ్యం తెచ్చే ప్రయత్నాలుమాని, ఆంధ్రరాష్ట్రంమాత్రం తెచ్చే ప్రయత్నం నేను ఆమోదించను. ఎందుకంటారా, యావద్దేశ బంధమోక్షానికి పాటుపడవలసిన ఉత్కృష్టవ్యక్తులకు ఆంధ్రసమస్య సైంధవుడులాగ అడ్డు అవుతుంది. దేశపరిపాలన చేతికివచ్చినతరువాత మీ చిత్తము వచ్చినట్లు భాషనుబట్టో మరొక దాన్ని బట్టో రాష్ట్రవిభజన చేయడం సులభం. అనవసరపు ఖర్చులతో నెత్తి బరువెక్కిన యీ రోజులలో రాష్ట్ర విభజన చేస్తే ఖర్చుకు డబ్బుండక భాగింపబడ్డ రాష్ట్రాలన్నీ దివాళా రాష్ట్రాలయితే

ఏమిలాభం?

జమిందారు గారు: స్వరాజ్యము అంటే నీ ఉద్దేశం సంపూర్ణ స్వాతంత్ర్యమనేనా?

నారా: ఏద్దైనా సరేనండి. సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినాసరే, లేదా, ఆస్ట్రేలియా కెనడాలవలె డొమినియను ప్రభుత్వం వచ్చినాసరే. ఏదివచ్చినా ఆదాయవ్యయాలు సంపూర్ణంగా మన చేతుల్లోకివస్తే రాష్ట్ర జనలు మనకు సులువుగా అవుతవని ఉద్దేశం.

జమీ: కాని ఈ లోపుగా మనవాళ్లకి జరిగే అపరిమితమైన నష్టం సంగతి ఆలోచించు. అరవవాళ్ళవే గొప్ప ఉద్యోగాలన్నీ. అరవ దేశంకోసం డబ్బు ఖర్చయినంత తెలుగు దేశ లాభానికి ఖర్చగుట లేదు.

నారా: కాని రామారాయణం గారు మొదలగు తెలుగువారే మంత్రిత్వాలు నడుపుతున్నారు. నెమ్మది నెమ్మదిగా పెద్ద ఉద్యోగాలలోకూడా మన వాళ్ళు చేరుతున్నారు. ఒక పదిసంవత్సరాల పాటు మనం తొందరపడ కుండా స్వతంత్ర సంపాదన దీక్ష వహిస్తే, స్వతంత్రంతో అన్ని చిక్కులు మంచువిడిపోయినట్లు విడిపోతాయని నా ఉద్దేశం అండి.

జమీం: నే ననేది మన దేశానికి ప్రస్తుతం సంపూర్ణ స్వాతంత్ర్యము రాదని; వచ్చినా మనకు చాలా నష్టం. సంపూర్ణ స్వాతంత్ర్యము రాకుండా డొమినియను ప్రభుత్వం వచ్చేటట్లయితే మనం రాష్ట్ర విభజనకోసంచేసే ప్రయత్నాలన్నీ డొమినియను ప్రభుత్వం వచ్చేందుకు ప్రయత్నాలవుతవి. పైగా కాంగ్రెసు తరఫున గాంధీగారి ననుసరించి పని చేసేవాళ్లు ఏ కారణం వల్లను ఇతర వెఱ్ఱిలలో పడరు. వాళ్లమార్గం రాజమార్గమే. ఇక నాబోటి వాళ్లా, మాకు గోఖ్లేగారి మార్గమే. మీ పద్ధతులు మాకు నచ్చవు. నచ్చక ఇక ఏమి చేయము? ఈ పనులు మేము చేస్తాము. నారా: చిత్తం.

లక్ష్మీ: మావాడు మనకు ఆంధ్రరాష్ట్రం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆంధ్ర హైకోర్టు అన్నీ కావాలనే రకమేనండి. ఆంధ్రప్రతిభ, ఆంధ్ర పౌరుషము, ఆంధ్రవిజ్ఞానము తలుచుకు తలుచుకు పరవశుడౌతాడు. నేడు ఆంధ్రదేశ దురదృష్టం వల్ల ఆంధ్రులెవ్వరూ ఏ విషయంలోనూ ఆంధ్రదేశంలో ఉన్నంత కాలం పేరు ప్రతిష్టలు తెచ్చుకోవడంలేదని విచారిస్తాడు.

పరం: ఆ! ఆంధ్రదేశానికి కుజుడో శనో రాజ్యం చేస్తూ ఉన్నాడు, లేకపోతే, పూర్వకాలంలో కోటీశ్వరులున్న దేశంలో నేడు పదిలక్షలున్న సాహుకార్లరుదు. మహారాజులు కవితాపోషకులై కృతులు గొన్న కాలం పోయి కవిత్వం పేరు చెప్పితే నిరసించే దిక్కుమాలిన కాలం వచ్చింది. అమరావతిలో నాగార్జున మెట్టలో, ఒరంగల్లులో, హంపిలో, మహాబలేశ్వరంలో విరిసిపోయిన శిల్పం నేడు నామమాత్రావశిష్టం అయింది. ఇంక ఎవరికైనా పేరొచ్చింది అంటే దేశం విడిచి వెళ్లారుగనుక. విశ్వదాత నాగేశ్వరరావు గారు, ఆచార్య రాధాకృష్ణ గారు, నాగపురంలో లక్ష్మీ నారాయణ గారు, నియోగి గారు, చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి గారు దేశాలు విడిచి వెళ్లి మహోన్నత పదవులకు వెళ్లారు. బొంబాయి కామాఠీలని, రంగూనులో గౌడ రెడ్లనీ, నాగపురంలో నాయుళ్లనీ ప్రఖ్యాతిగన్న వారంతా యిలా తెలుగుగడ్డ విడిచి వెళ్లిన వారే.

రాజేశ్వర రావు: జిడ్డు కృష్ణమూర్తి గారో?

పరం: అవును. ప్రపంచవిఖ్యాతిగన్న మహాజ్ఞాని.

రాజే: తర్వాత వారిలో పండిత వంగల శివరాము, పున్నయ్య గారు. ఇంకా ముఖ్యులు ఇంజనీరు విశ్వేశ్వరయ్య, దివాను నాగుమయ్య . పరం: అదేనండి ! చిన్న చిన్న వాళ్లె కూడా దేశం విడిచిపోతే మన ఆంధ్రులు బయటికి వస్తారండి. దామెర్ల రామారావును చూడండీ!

లక్ష్మీపతి: ఆంధ్రదేశం వదిలితే అరవగ్రహ బాధ వదిలి పైకి వస్తారోయి పరమేశ్వరం.

జమీం: పరమేశ్వరమూర్తి గారూ! మీరు చెప్పినదానిలో సత్యం ఉన్నట్లే తోస్తున్నది. కారణం మీరు చెప్పింది కాకపోవచ్చును. యశం సంపాదించుకోవాలంటే మనం మన దేశమేకాదు మద్రాసు రాష్ట్రం విడిచిపోవాలండీ! అయితే పరమేశ్వరమూర్తి గారు! మీరు కలకత్తాలో ఎన్నాళ్లు అవనీంద్రుని దగ్గిర చిత్ర లేఖన నేర్చుకున్నారు?

పరమేశ్వర: బి. ఏ. కలకత్తాలో చదవడానికి వెళ్లాను. పాలీ, సంస్కృతం పుచ్చుకొని ఆర్కియాలజీ శాఖలో చేరుదామని ఉద్దేశం. అప్పటికి నాకు ఇష్టమైనది రామారావు గారి సంప్రదాయమే. నేను ఇంటరు తరగతిలో చదివిన రెండేళ్లు ఆయన దగ్గర చిత్ర లేఖనం నేర్చుకున్నాను. నా బొమ్మలు రెండు బొంబాయిలోను, ఒకటి చెన్నపట్టణంలోను అమ్ముడైనాయండి. తర్వాత కలకత్తా వెళ్ళి, బి. ఏ. చదువుతూ, అవనీంద్రబాబు పాదాలకడ చిత్రలేఖనానికి దీక్ష వహించాను.

లక్ష్మీ: అప్పుడు వేసిన కొన్ని చిత్రలేఖనాలకు ఇంగ్లండు, వెంబ్లీలో కూడా ప్రఖ్యాతి వచ్చిందండి మా పరమేశ్వరునికి. ఆస్ట్రేలియాకు వెళ్ళినది ఒక బొమ్మ. ఆ రోజుల్లో పరమేశ్వరుని బొమ్మలెన్నో కలకత్తా ప్రదర్శనములో అమ్ముడయ్యాయి.

జమీం: మీ రిప్పుడు వేసిన బొమ్మ లేవేనాఉంటే నాకో బొమ్మ ఖరీదు వేసి పంపించండి. ఖరీదుకు వెరవకుండా మంచి పెద్దరకమే పంపండి. మరీ చిన్న రకము పంపకండి. నా గ్రంథాలయం గదిలో కొన్ని బొమ్మలుకొని పెట్టవలెనని వున్నది. నారాయణరావూ, మీరూ ఆలోచించి పంపించండి.

రాజే: నారాయణ రావు పరమేశ్వరుని బొమ్మలు నాలుగు కొన్నాడు. అతనికడ గొప్ప చిత్రాలు ఉత్తమ చిత్రకారులవి యిరవై ఉన్నాయండి.

ఇంతలో కూడవచ్చిన గుమాస్తా 'బాబు గారు! ఏడుగంటలయింది, పడవ తిప్పమని సెలవా?' అని వినయముగా జమీందారు గారి నడిగెను. రాజేశ్వర రావు 'ఓహో యీగాలి! గోదావరి సముద్రంలో ఉన్నదే కెరటాలతో, అని పాదములు నీటిలోనికి వ్రేలవైచెను.

౨౨
గౌతమి

"శీతే సుఖోష్ణ సర్వాంగీ, గ్రీష్మేతు సుఖశీతలా, భర్తృయుక్తాచయా నారీసా భవేద్వదవర్ణినీ." నిజముగ నీ గౌతమీ స్రవంతి వరవర్ణినియె. గౌతమి మాతవలె, సోదరివలె, ప్రియభామినివలె తనకు జల్లనై, స్నిగ్ధమై, అనురక్తయై తోచుచుండు టేలనో! ఆ నిర్మలవినీలనీరములలో నురికి, దేహమెల్ల నామె గౌగిలింప దన హృదయమూలములకు నామె ప్రేమ చొచ్చుకొనిపోవ, నీటి లోని మత్స్యమై యా నీలజలములోనికణమై యైక్యమైపోయి తేలియాడుచు, మునుగుచు, బాహువులు సారించి యీదుచు, నీ గౌతమి బాలికతో నాతడాడుకొన్నాడు. ఆమె కెరటాలతో పందెము వేచినాడు. లోతులలో మునిగి కన్నులు తెరచి, సూర్యకిరణములు చొచ్చుటచే గరుడపచ్చలయిన యాగాంభీర్యమున

విస్తుపోయినాడు. ఆమె హృదయమున దన సర్వాంగ చైతన్యము నుపసంహరించి తరుశాఖవలె తేలినాడు. ఉబికిపోవు నామె వక్షములతో ఎన్ని సారులో చంటిపిల్లవానివలె నాడుకొన్నాడు. గౌతమిదేవిలోని యనిర్వచనీయమగు నానందము తన యంత రాయముల జొరబాఱ నామెలో లీనమైనాడు. నారాయణరా వీ యాలోచనతో గన్ను లరమూతలైపోవ నానంద మయుడైనాడు. వారి లాంచి కొవ్వూరు లంకకడ నాగినది. వారందరు లంకలోదిగి, యా యిసుక తిన్నెలలో నధివసించి మంతనములు సలుపుకొనుచుండిరి. నారాయణరావు గౌతమీ సమాహూతుడై బిరబిర లాల్చీవిప్పి, యద్దానిని, యుత్తరీయమును సేవకున కందిచ్చి, కట్టినవస్త్రము వెనుకకు విరిచికట్టి నీటిలోనికి బరుగిడినాడు. 'లోతులుండును, జాగ్రత్త సుమీ' యని జమీందారు గారు హెచ్చరింప, స్నేహితులందఱు 'నారాయణ రావు గజయీత గా' డని ధైర్యము చెప్పి తాముగూడ నీటిలోనికి దిగిరి. ఒక్క రాజారావునకు మాత్రము ఈత రాదు. ఆత డొడ్డుననే చంటిపిల్లనివలె నీటిలో చేతులు తట్టుచు వినోదించుచుండెను.

గౌతమీమాత కింకను వరదలు రాలేదు. నిర్మల వినీలజలములతో నామె యొక మహాసరస్సువలె నున్నది. గోపీచందనపు బూతల వలె నిసుక తిప్ప లచ్చ టచ్చట తలలెత్తికొనియున్నవి. దూరాన పాపికొండలు స్పష్ట నీలలోహితములగు తమ శిఖరముల నా సంధ్యారుణరాగార్ద్ర గగనము లోనికి జొనిపి యానందించుచున్నవి. పశ్చిమమున లోహిత హరిద్రావర్ణ వికాసమై, మధ్య కర్బురరాగపూరితమై, దిశాంచలముల నవ్యక్తారుణచ్ఛవీ సుందరమై యాకాశము హృదయమును ద్రవింప జేయుచున్నది. కెరటముల హోరు షడ్జమమై, వాయు ప్రసారము రిషభమై, పక్షుల కలకలారావములు పంచమమైపోవ బ్రకృతిమాత మధుర సంగీతమున జొక్కుచున్నది.

పరమేశ్వరమూర్తి నెమ్మదిగా తేలియాడుకొనుచు రాజారావుకడకువచ్చి, 'ఓ ముగ్ధ బాలుడా! చూడవోయి యీ ప్రకృతి అందం! నీలో నిద్రాణమైయున్న కవితాశక్తి మేల్కొలుపవోయి! అందులో కరిగి మరిగి లీనమై పోవోయి! నారాయుడు అడుగో శివమెత్తి ఆడుతున్నాడు. వేయితీపులు నాలో ఒక్కసారిగా తలలెత్తుతున్నాయోయి' అనుచు హృదయము వొలుకవోసికొనియెను.

జమీందారుగారి చూపులన్నియు నీటిలోనుంచివచ్చు సుందరమంజుశ్రీమూర్తియగు నల్లునిమీదనే యున్నవి. విశాలాంసలుడై విపులవక్షుడై గోమూర్ధకటి సుందరుడై, అల్పమధ్యముడై, గంభీర వదనుడై, ఉన్నతశరీరుడై జలక్లిన్న ప్రకాశోజ్వల హరిద్రరోహితవర్ణుడై, నీటి చుక్కలు ముత్యములవలె రాలుచుండ గట్టునకువచ్చి తడియార్పుకొనుచుండిన యల్లుని చూచిన యాయన కన్నులు చెమర్చినవి. ఈ బాలకు డవతారమూర్తియని యుబ్బిపోయినాడు. యమునాతీరము, బృందావనము, శ్యామసుందరుడు నాయన మనోవీధి దళుక్కున మెఱసి గోపికాభావ మాయన నావహించినట్లయినది.

రాత్రి యెనిమిది గంటలకు వారంద రింటికి జేరినారు.

వారు గృహమధ్యశాలకు వచ్చునప్పటికి, అచ్చటి సోఫాలపై జగన్మో హనరావును శారదయు దగ్గరగా గూర్చుండి మాట్లాడుకొనుచుండిరి. శారద కిలకిల నవ్వుచుండెను. జగన్మోహనరావు మోము దరహాస ప్రఫుల్లమైయున్నది. వీరు లోన నడుగిడగనే శారద త్వరితముగ లేచి లోనికి జివ్వున పారిపోయినది. జగన్మోహనరావు మోమున గ్రోధచ్ఛాయ లించుక పొలసి తొలగిపోయినవి. శారద లేచిపోవుట ముందువచ్చిన జమీందారుగారికి నారాయణరావుకు మాత్రమే కనబడెను. జమీందారు గారి హృదయమునం దొకవిధమగు

జుగుప్స జనించెను. మెరుపువలె మెరసి మాయమయిన శారదా బాలిక నారాయణరావు గుండియలో బాటపాడినది.

శారదపై నారాయణరాయని ప్రేమ నానాటికి గట్టులొరసి యఖండ గౌతమివలె పొరలిపోవుచున్నది. అత డందు మునకలిడుచు దేలియాడుచున్నాడు. వెడదలై, అర్ధనిమీలితములగు శారదానయనము లాతని గలంచి వైచుచున్నవి. ఇతని ఇరువది రెండేండ్ల వయసు ముమ్మరము సలసల వెరలియాడుచున్నది.

వయసులోనున్న స్త్రీ, పురుషుల కొండొరులపై జనించు నీ వలపున కర్థమేమో? చిన్నతనమున నొకచో బెరిగి యాటలాడుకొను బాలికా బాలకులకు మాత్రము ప్రేమలేదా? అవ్యక్తమధురము, సరళము నగు నా ప్రేమకూడ వియోగమును సహింపదు. ఆ బాలికా బాలకు లిర్వురు నెపుడు గలసియుండగోరుదురు. ఒండొరులు భుజములపై చేతులిడుకొని తిరుగుచుందురు. ఆ యాట పాటలందే, ఒకరినొకరు 'ఏమోయి' యని నోరార బిలుచుకొనుటయందే వారికి దృప్తి. వారికి బరస్పర సౌందర్యముతో బనిలేదు. వారిరువురకు యౌవనోదయ మగుటతోడనే ఆ స్నేహము వలపుగా బరిణమించుటేలనో ? వారి పల్కులు, చూపులు, చేతలుగూడ నూత్నవికారమును బొంది క్రొత్తతలపులు రేకెత్తించు టేలనో ? అట్టి చిన్ననాటి మిత్రుల యౌవన మొండొరుల యందు వివాహముచే జరితార్థము కానినాడు వారి జీవితములు దుఃఖభాజనము లైపోవుట వినుచుందుము.

అవ్యాజమధురమగు నా చిననాటి స్వచ్ఛ ప్రేమమే తారుణ్యోదయమున కామావతార మెత్తనేల? ప్రాణిధర్మమగు నీ కామమునకుదోడు సౌందర్య లాలస యేటికో? అట్లని సుందరియగు ప్రతియువతిని ప్రతిపురుషుడును కామించునా? రతీచ్ఛవినా దేహసంశ్లేష మాత్రమున దృప్తిచెందు కామముండునా? తా నింతకుము న్నెందరు సౌందర్యవతులను గాంచియుండలేదు? అట్టి వారెల్ల తన హృదయమును జూరగొనరై రేల? ప్రథమదర్శనమాత్రముననే శారదపై దనకు జనించినది ప్రేమమా, కామమా? అపరిచితయు, నజ్ఞాతయౌవనయు నగు నీ శారద తనకు భార్యయైనంతమాత్రమున తన దేహ మనఃప్రాణము లామెకై యిట్లు తహ తహ జెందనేల? దీనిని జననాంతర సౌహృద మందునా? లేక దాంపత్యమే యనవలయునా? నా యీ చిన్న శారదయు నేనును జన్మజన్మ ముల నొకరి నొకరిట్లు వెదకికొనుచు నేకమగుచున్నామా? ఈ సంయోగ వియోగముల కంతమెక్కడ? చరితార్థత యెక్కడ?

ఆలోచనాధీనుడగు నారాయణరావు భోజనము చేసి, యొంటిమై తాంబూలము వేసికొను శారద నల్లన జేరి, 'నాకు రెండాకులు రాసియిస్తావా?' యని యాచించెను. ఆమె యులికిపడి భర్తవంక నొక నిముషముచూచి, మారుమాటాడక యా లేత తమలంపుటాకులు చిలుకలుచుట్ట నారంభించెను. నారాయణ సంతసము మై జిఱునవ్వునవ్వుచు నచ్చటనే వేఱొక యాసనముపై నధివసించెను.

నారాయణరావురూప మానాడు శారద కేలనో సుందరతరమై కన్పించినది. వివిధవర్ణ విద్యుద్దీపికల ప్రసన్నకాంతిలో నాతనిరూపము మఱింత మోహనమై కాన్పించినది. అవ్యక్తమధురములగు నూతనానుభవము లామెలో జాగరితములుగానోపు లజ్జచే నామె కపోలము లించుక చెమర్చినవి. ఆమె పెదవులలో జ్యోత్స్నలు నాట్యమాడినవి. తల వంచియే దీర్ఘములగు కంటిరెప్పల నెత్తి యా బాలిక భర్తను మరల గనుగొన్నది. తెల్లని పొందూరుపట్టు శాలీ ఖదరులాల్చీలోనుండి ముడులువడు నాతని దేహసుభగత్వము వెలిగిపోవుచున్నది. ఉబికి విస్తరించియున్న యాతని మెడకండరములు తొనలవలె తిరిగియున్నవి. గంభీరమగు నాతని ముఖము, విశాల ఫాలము, తీరైన ముక్కు, చెవులు

నాతనికి దేవసేనానియగు కుమారస్వామి సౌందర్యమును ప్రసాదించినవి. శారదాదేవి స్తోకవక్షము లుప్పొంగినవి. విభ్రమవతియైనది. సానురాగయై భర్త చేతిలో సుగంధ ద్రవ్యములు గూర్చిన వక్కపొడియు, దమలపాకు చిల్కలు పెట్టుచు స్పర్శసుఖ మనుభవించినది. ఆ వ్రీడావతి శరీరము పుల్కరించినది. 'హాయి' యనుచు నామె హృదయ మానందపూరితమైనది.

నారాయణరావు మృదులమ్రుదులమగు నా కరతలము గ్రహించి, 'నీ చేతి రేఖలు చూడవలె'నని యామెపాణి చూడ నారంభించెను. మెత్తని గులాబి మొగ్గవలెనున్న యామె చేతిలో రేఖలు స్పష్టములై యున్నవి. దీర్ఘములై లలితములగు నా వేళ్ళు తీగెలే. గోళ్ళు ఎరుపులై సంధ్యారాగ తప్తములగు నక్షత్రములవలె ప్రకాశించినవి. నీలము పొదివిన తన చిటికనవ్రేలి యుంగరము తీసి యాత డామె యనామికకు దోడిగి 'ఎంతవదులో!' యనుచు చిరునవ్వు నవ్వెను. ఆమె వజ్రపుటుంగరము తన కనిష్ఠికాంగుళికి దొడిగి 'జూచితివా, బిగు'వని మేలమాడుచు, దీపికాకాంతిలో నద్దాని గాంచుచు నిది నా ప్రాణప్రదమని ముద్దాడుకొనినాడు. 'చెన్నపట్టణము నుండి చక్కని యుంగర మొకటి తెచ్చి, యా చిట్టివ్రేలికి దొడిగికొందు'నని ప్రేమపూర్వకముగా ననుజ్ఞ వేడికొన్నాడు.

శారద నెమ్మదిగా జేయి లాగికొన్నది. ఆమె గుండియలు దడ దడ కొట్టుకొన్నవి. 'ఇంత మెత్తని వేళ్ళకు వీణతీగెల నొక్కులు బాధకాదూ శారదా?' యని నారాయణరావు ప్రశ్నించెను. 'కుడి బొటనవ్రేలికి గోణము తగిలించుకొంటాను. ఎడమచేతివేళ్లు నొక్కులుపడ్డాయి'యని యాబాల వామహస్తము భర్తకు జూపించినది. అతడా పాణిని గ్రహించి 'హృదయవచశ్శరీరముల సౌందర్యాన్ని బలియిస్తే కాని ఆనందాన్ని సృష్టించలేము కాదూ? ఎన్ని గంటులో! పాపము, ఈ చిన్న వేళ్ళకు ఎంత శ్రమో' యని యామె చేయి తన పెదవులతో నల్లన స్పృశించి కన్నుల కద్దుకొనెను.

శారద యపరిమిత త్రపామూర్తియై చేయి లాగికొని, చిరునవ్వు మోమును రాగరంజితము చేయ, మెరపువలె నా మేడమీద నింకొక గదిలోనికి మాయమైనది.

నారాయణరావు హర్ష ప్రఫుల్లములగు నయనములతో దన చిన్నారి భార్య పోయిన దెస చూచుచుండెను.

ఇంతలో జమీందారు గారు లోనికివచ్చి యాలోచనామగ్నుడైయున్న యల్లుని వీపుపై చేయి నిడెను. నారాయణరావు ఉలికిపడి తలయెత్తి మామగారిని జూచి, చివాలున లేచెను. 'కూర్చోవోయి! నీ స్నేహితులంతా నీకోసం కాబోలు చూస్తున్నారు. మా జగన్మోహనుణ్ణి ఆడిస్తునట్లున్నారు. అతడో వెఱ్ఱివాడు. గర్వి. దుష్టహృదయం కలవాడు. నీవు ఎఫ్. ఎల్. లో మొదటివాడవుగా మొదటితరగతిలో నెగ్గినందుకు నాకు చాలా సంతోషంఅయింది. నువ్వు వెళ్లేటప్పుడే నేనూ చెన్నపట్టణం వస్తాను. నువ్వు హాస్టలులోవుండడం మానివేసి కీల్ పాకులో నా బంగాళావుంది అందులోనే ఉండు. అద్దెకున్న వారిని ఖాళీ చేయవలసిందని వ్రాశాను. వారున్నూ రేపు జూలై నెలలో వెడుతున్నారు. నీ యిష్టంవచ్చిన కారొకటి చూడు. మా దివానుగా రదికొని, నీకు ఇస్తారు. 'చ్యాపుయరు' (మోటారునడుపువాడు) నొకణ్ణి చూచి ఉంచారు. ఆకారు నీకు బహుమతి.'

'నేనే ఒక చిన్నరకం కారు కొనుక్కోడానికి ఏర్పాటులు చేసుకున్నానండి.'

'నా ముచ్చటకు నువ్వు అడ్డం చెప్పవద్దు.'

'చిత్తం.'

‘శారదా!’

పక్కగదిలోనున్న శారద ‘ఎందుకు నాన్నగారూ?’ అని పలికినది.

‘ఈలా రా అమ్మా!’

శారద గుమ్మము కడకు వచ్చినది.

‘కొంచెముసేపు క్రిందికివచ్చి వీణ వాయిస్తావా? నీ సంగీతగదిలో నే కూచో.’

‘ఇపుడు వాయించలేనండి.’

‘పోనీలే.’ ‘కాదు, ఇక్కడే నాగదిలో కూచుండి వాయిస్తానండి.’

‘సరేలే, నీకు కులాసా లేకపోతే ఇబ్బంది లేదులే.’

‘ఇష్టం లేక కాదండి! క్రింది గదిలోకి ఎందుకని.’

శారద పరిచారికను బిలిచి సంగీతపుగదిలోనున్న వీణియ తెమ్మని యాజ్ఞ యిచ్చినది. జమిందారు గా రల్లుని జూచి ‘సంగీతపుగది ధ్వనిశాస్త్రవేత్త నొకణ్ణి కలకత్తానుండి రప్పించి తయారు చేయించినాను. చాలా చక్కగా కుదిరింది. పొడుగాటి హాలులా వుండటంవల్ల పదిమంది కూచొని వినుటకు వీలుగా ఉంటుంది. నీ స్నేహితులను పైకి తీసికొని రావోయి’ యని యనెను.

‘చిత్త’ మని నారాయణ రావు స్నేహితులను మేడమీదికి బిలిచికొని రాబోయెను.

శారద వీణియ సారెలు బిగించి, శ్రుతి మేళవించి, కలస్వనమున పాడనారంభించినది.

నారాయణ రావు, స్నేహితులువచ్చి, మేడమీద మధ్యశాలలో నాసనములపై నధివసించిరి. జగన్మోహన రావు మాత్రము శారద శయనగృహము లోనికిపోయి, యచ్చట శారద కెదురుగ నొక దిండ్లున్న సోఫాపై నుపవిష్టుడై శారదను దేరిచూడ సాగెను.

జగన్మోహనుని కుర్కురహృదయమునకు శారదా సౌందర్య మద్దముల పెట్టెలోని పలలఖండమై కలచి వేయుచుండెను.

జగన్మోహనుడు లోనికి బోవుట జూచి రాజేశ్వరరావు భ్రూయుగ్మము ముడిచినాడు.

నారాయణరావు, పరమేశ్వరుడు సంగీతలోలురై యా యానందలహరీ వేగములో దేలిపోయిరి.

అహో, విమల గాంధర్వమా! నీ వానందమూర్తివి! నిర్మలకళారూపమవు. సాక్షాత్కరించిన పరదేవతవు. నీ దర్శనమాత్రమున పవిత్రత నొందని చేత నా చేతనము లున్నయవియే! పరమశివుని డమరుక కింకిణీద్వయి నుండి జనించిన నీయం దాత్మస్వరూపమే వ్యక్తమగును. ప్రాణదుగమునిచ్చు సురభీ మతల్లివి నీవు!

ఆ సంగీతము దిశల నావరించి ప్రణవస్వరూపమయినది.

ద్వితీయ భాగము

౧

మంగళగౌరి

శ్రావణమాసము. గోదావరి గాలులతో, వర్షపాతములతో, ముసురులతో, సూర్యనారాయణుని దాగుడుమూతలతో, సర్వత్ర పొడచూపు శాద్వలహరితవర్ణముతో వరదల బురదనీటి జేగురువర్ణముతో, నీలిమబ్బులతో మంగళవారము నాడు వీధుల తేలియాడు మందగమనల కౌశేయ వివిధ వర్ణములతో బ్రత్యక్ష మగును.

ఆడువారి మంగళవారములనోము లీ మాసమున ఏల ఏర్పడెను? వివాహమైన వెనుక నైదుసంవత్సరము లీ నోము నోచుకొనవలెనట. నోముపట్టిన పిమ్మట నే వత్సరముననైన నుద్యాపన చేయవచ్చునట. పెళ్ళిలో 'సప్తపది' నాడు ఉద్యాపన చేసికొనవలెను. ఆ వధువునకు మంగళసూత్రము మెడనుగట్టి, కాళ్లకు మట్టియలు దొడిగి, పాదాంగుళులపై మిఠాయి నుంచి, పదమూడు జతల యరిసెలు గిన్నెలోనుంచి, రవికెలగుడ్డ వాసినెగట్టి, పసుపు కుంకుమలతో వాయనమిచ్చి, యుద్యాపన చేసికొనవలెనట. శ్రావణ మంగళవారమునా డుదయమున నభ్యంగన మొనరించి, మడితో మంగళగౌరీదేవి నారాధించి కథచెప్పుకొని, యక్షతల శిరస్సున నిడుకొని, చలిమిడిగురుగులందు నావునేతితో దీపాలు వెలిగించి, యా పొగతో కాటుకబట్టి నేత్రముల నలంకరించి, మహానైవేద్యము, సెనగలు నైవేద్యము సమర్పణజేసి ముత్తయిదువులకు బసుపురాచి, బొట్టుపెట్టి, కాటుకనిచ్చి, గంధమలది, తాంబూలములతో సెనగల వాయన మీయవలెను.

శ్రావణ మంగళవారముల నూరిలోనున్న వనితామణు లొకరిపరిచయ మొకరు సంపాదించుకొని కుశలప్రశ్నము లొనర్చుకొనుచు, విడ్డూరముల నాడుకొనుచు, లోకాభిరామాయణము చెప్పికొనుచు, వీరిని వారిని ఆడి పోసుకొనుచు, నగల విషయ మడుగుకొనుచు గాలక్షేప మొనర్తురు. తమకున్న చీని చీనాంబరముల, బనారసు, బెంగుళూరు, మధుర చీరల ధరించి, రవికల తొడుగుకొని, యత్తరవు లలంది, పూవుల ధరించి, నగల గైసేసికొని, జట్టులుగా మందగమనములతో వోయారముతో దారిలో క్రీగంటి చూపులతో దేవతా స్త్రీలవలె పేరంటములకు బోవుదురు. చేతనున్న రుమాళ్ళయందు సెనగలు మూటగట్టుకొందురు. మాతలు శిశువుల నెత్తికొనియే బయలు దేరుదురు. విలాసవతుల హావభావముల గమనించి యువ్విళులూరుటకు వేషములు దాల్చిన కోడెగాండ్రు పనియున్న వారివలె నూరంతయు దిరుగుదురు. ఇంతలో నొక జడివచ్చిన బరుగిడలేక యెట్లో నొకపంచ జేరి వాల్గంటులజూచి దరహాసవదను లగుదురు. కొత్తపేటలో సూర్యకాంతమును, ఒక వత్సరము మానివేసినందున, మాణిక్యమును నోముబట్టిరి. తమయింట నాచారమున్నది గాన గోడలిచే నోము పట్టింపవలయునని సుబ్బారాయుడుగారు వియ్యంకునకు వ్రాసినారు.

పూర్ణిమ ముందు శుక్రవారమునాడు జమీందారుగారి యింట వరలక్ష్మీ వ్రతము జరిగినప్పుడు జానకమ్మగారు పూర్ణాభరణభూషితురాలై వరలక్ష్మివలెనే వియ్యాలవారింటికి వెళ్ళినది. కోడలికి నిరువది కాసులును, వియ్యపురాలికి గోడలికి వెలగల చీరలును, బంగారు కుంకుమబరణియు నన్నూరురూపాయల వెండి బొమ్మసామాను మొదలగునవి శ్రావణపట్టి పట్టుకు వెళ్ళినది. జమీందారు గారు సోదరితో నాలోచించి యల్లునికి వేయిరూపాయల సరుకు లాషాఢపట్టీ పంపించినారు. కోడలిచే నోము నోపించి జానకమ్మగారు కోడలితోపాటు చారుమతీదేవీ కథ విని మూడవ వారమువరకు అచ్చటనే

యుండుడని సుందరవర్ధనమ్మ గారు కోరుటచే నాగిపోయెను.

రాజమహేంద్రవరములో శారదతో నామె పెద్ద పెద్దవా రింఢ్లకు కారుమీద వెళ్ళివచ్చినది.

మంగళ గౌరీదేవికథ వినినప్పుడు శారద మేనత్తను కథార్థము విపులముగా నడిగినది. బిడ్డలులేని భార్యాభర్తల తపస్సు, పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్ష మగుట, 'అయిదవతనము లేని బాలికయా, ఆయుస్సులేని బాలుడా వర' మన్న ప్రశ్న. బాలుడు కావలెనని కోరుటయు, బాలుడు జనించుటయు, కుమారుని గొనిపోవ యమునిదర్శనము, పదునారవ యేట పదునారవరోజు గొనిపోయెద నని యముని వాగ్దానము (పండ్రెండవయేట, పండ్రెండవమాసాన, పండ్రెండవ దినాన నని కొందరిమతము), ఆదినము వచ్చుముందు కుమారుడు మాతులునితో మృత్యువును దప్పించుకొను మార్గము దొరకదాయని దేశములపాలగుట, వారట్లు పోవుచుండ, నొక నగర బాహ్యోద్యానవనమున గొందరు బాలికలు పూలు గోసుకొనుచుండ రాచవారి బాలయొక్క పూలు ఒలికిపోయి యెప్పటియట్ల చెట్లపై జేరుకొనుట, అది కనుంగొని మాతులు డా బాలను ఒప్పించి తన మేనయల్లునకు వివాహము చేయుట, ఆ బాలిక యింటికిపోయి, తల్లిదండ్రుల ఇచ్చచే నా బాలకునికి సరియైన కర్మకాండతో నతివైభవముగ పెండ్లి చేయుట మున్నగు వివరముల నెఱిగికొన్నది. ఆ బాలకుని మృత్యుదినంబునాటి రాత్రి, మృత్యువు పండ్రెండుతలల యాదిశేషుడై వచ్చి నిదురబోవు యువకుని కాటు వేయబోవుచుండ నచ్చట నా రాజకుమారి మిఠాయియుండ నునిచెనట. శేషు డా యుండపై కాటువేసెనట. ఆ బాలిక యొక యరిసెల పాత్రను జూపుటయు నాసర్ప మందు దూరెనట. తన కంచుక మూడ్చి యా పాత్రపై వాసెన గట్టినదట. అటువెనుక భర్త దేశాలు తిరుగబోయెనట. భర్త దేశాలు తిరిగివచ్చునప్పటికి ఆ పాము బంగారుపామై యుండెనట.

జానకమ్మ గారు సర్వ సౌందర్యాలు వెలిగిపోవు కోడలినిజూచి ఆనందపర వశురాలైనది. అటు నవమన్మథుడగు కుమారుడు, ఇటు సౌందర్యోజ్జ్వలయగు కోడలు, సాక్షాత్కరించిన రతీబాల. ఒకరికొర కొకరు జన్మించినారా!

ఆ రాత్రి జానకమ్మగారు కోడలికి ఉప్పు మిరపకాయలను, పారాణినీళ్ళు దృష్టితీసి, పారాణినీళ్ళు దొడ్డిలో దూరముగాను, ఉప్పు మిరపకాయలను నిప్ప లోను వేసినది. యెంత దృష్టితగిలెనో కాని ఘాటేమియు రాలేదట. ఈవింతను వరదకామేశ్వరీదేవి చూచి వెడనవ్వు నవ్వుకొన్నది.

శారద కివియన్నియు జిత్రముగా నుండెను. అత్తవారింటివారు బూర్వ సంప్రదాయములతో, బూర్వాచారములతో మెలగుదురు. తన పెద్దత్తగారు నిప్పులు కడుగును. మైలపడితి నేమోయన్న భయముచే బదిసారులు స్నానము చేయును. ఏ పర్వదినము వచ్చినను గోదావరికి స్నానమునకు బోవును. వంట వండుటకు వలయు జలమంతయు దానే తోడుకొనును. తక్కినవారి కొక నీళ్ళ బ్రాహ్మణుడు నీళ్ళుపోయును.

ఆ మరునాడు జానకమ్మగారు కొత్తపేట వచ్చి వేసినది.

జానకమ్మగారి కంత చేదస్తము లేకపోయినను ఆమెయు బూర్వాచారవతియనియే యెన్నవలెను.

వంటయింటిలోనికి బిల్లలెవ్వరు వెళ్ళగూడదు. వారి భోజనాలగది వేఱు. ఉదయము వారి వంటజేయవలసిన దచ్చటనే.

లక్ష్మీనరసమ్మ గారు భోజనము వేళ మంచినీరు త్రాగిన చెంబులోని నీటితో జేయికడుగనీయదు. పట్టుబట్టలగాని, మడిబట్టలగాని కట్టుకొనకుండ భోజనము చేయరాదు. బొట్టులేకుండ నుండరాదు. ఆమె మోమోటము లేకుండ నెట్టి వారిని లెక్కచేయకుండ నాచారము గమనించుడని బోధించుచుండును. శారద యత్తవారింట నున్న గృహప్రవేశపు రోజులలో ఆమె కాచారవిషయికములగు నీతు లెన్నియో పెద్దత్తగారు కఱపినది. తాంబూలము నమలుచు శారద పంటిలో దూరిన నలుసును చేతితో దీసికొని రుమాలతో దుడుచుకొనుచుండ లక్ష్మీనరసమ్మగారు చూచి 'అయ్యయ్యో! యెంగిలమ్మా, తల్లీ! చేయికడుక్కోవమ్మా. ఆ రుమాలును పనిచేసేది తడిపి ఆరేసేగుడ్డలో వెయ్యి' అని కోడలిచే నాపనులు చేయించినది.

'ఏమే అక్కా! ఇంత చాదస్తం నీ కెప్పుడు తగ్గుతుందే?' యని జానకమ్మ పాటపాడుచునే యుండును. అయిన నేమి లాభము?

లక్ష్మీనరసమ్మ వేదాంతురాలు. ఎప్పుడును వేదాంత గ్రంథాలు చదువు చుండును, చదివించుకొనుచుండును. ఆమెకు జుట్టముల గ్రామములందు పలువురు శిష్యురాండ్రున్నారు. వారందరు గురువుగారిని దర్శించుటకు వచ్చుచునే యుందురు. అప్పుడు గురువుగారి పాదాలకు నమస్కరించి, ఫలములు, రూపాయలు, వెండిగిన్నెలు దక్షిణలిచ్చి వేదాంతపు ముక్కలు చెవిలో వేసికొని యానందించుచుందురు. నోరూర జక్కగా వేదాంతోపన్యాసాలు చేయగలదామె.

'జన్మం రజ్జు సర్పభ్రాంతి వంటిది. దారు పురుష భ్రాంతి, ఎండమావులు నీరను భ్రాంతి. కామక్రోధ లోభమోహ మదమాత్సర్యాలనే అరిషడ్వర్గాలు చంపుకోవాలి. లేకపోతే ఎరుకలోబడి తనబిడ్డ, తనమగడు, తనయిల్లు తన నగలు, తన సంసారము అని జీవుడు భ్రమించి పుట్టుటా గిట్టుటా అనే మాయలోబడి, మూత్ర పురీషాదుల్లో దొర్లి, అచలతత్త్వం గ్రహించలేక, ముక్తి పొందలేక ఉంటుంది. శుద్ధనిర్గుణమైన అచలతత్త్వం గ్రహించాలి. పంచాక్షరి జపిస్తూ ఉండాలి' అని లక్ష్మీనరసమ్మగారు శిష్యురాండ్రకు బోధించుచుండును.

ఆమెకు బంచీకరణము కంఠస్థము. పండ్రెండు రాజులకథలు, ఇంద్రజాలపుగథలు క్షుణ్ణముగా వచ్చును. సీతారామాంజనేయము మంచినీళ్ళ ప్రాయము, శుద్ధనిర్గుణతత్త్వ కందార్థదరువులు ఎల్లప్పుడు పాడుకొనుచునే యుండును.

శారద కివియన్నియు పల్లెటూరి గొడవలని తోచినది. తనతల్లి కెప్పుడిట్టి ఛాందసములు లేవు. పట్టణవాసస్థులువచ్చి పల్లెటూళ్లలో నెట్లు జీవింపగలరో యని యామె తలపోసినది. అత్తవారింటి కథలన్నియు దల్లితో మేనత్తతో దనయింట నున్న యితర స్త్రీలతో జెప్పి నవ్వించినది.

అత్తగారు వెడలిపోయిన నాలుగురోజులలో శారద యుక్తవయస్కురాలైనది. జమీందారుగారింట మూడురోజు లుత్సవములు విందులు జరిగినవి. దినదినము పేరంటాండ్రు విచ్చేసినారు. పంచదారతో జిమ్మిలిగొట్టి పంచినారు. బ్యాండుమేళము వచ్చినది. పంక్తినాడు సూర్యకాంతము, మాణిక్యాంబ జమీందారు గారింటికి వచ్చి పంక్తిజరిపి వెలగల బహుమతులు, చీనిచీనాంబరముల నిచ్చి వెడలిపోయిరి. నగరమునందున్న వారి నెందరినో స్త్రీ, పురుషులను భోజనములకు బిలిచినారు.

నవనాగరికుడై వీరేశలింగాఖ్యుని ప్రియశిష్యుడైన జమీందారుగారు నేడు పల్లెటూరివారితో వియ్యమంది ఛాందసపు పూర్వాచార పిశాచగ్రస్తులైనారని పలువురు

విచారించిరి.

యజ్ఞోపవీతముగూడ దీసివేసి అనుష్ఠానిక బ్రాహ్మసామాజికుడైన శ్రీనివాసరావుగారు మిత్రుని జూచి 'ఆడపిల్లకీడురావడమనేది శరీరంలో జరిగే ఒక మార్పుకు చిహ్నం. దానిని లోకానికి టాంటాంజేయడ మంత మొరకుదనం ఇంకోటుందా' యని ప్రశ్నించిరి.

'అది నాకు ఇష్టంలేదు కాని, అది మొరకుతనమని మనం గ్రహించింది పాశ్చాత్యుల సంపర్కం చేతనేనా! మనవాళ్ళ పూర్వాచారాలు అనేకం ఈ నాటికి మూఢత్వము అని అనుకుంటున్నాము. ఇదివరదాకా మోటుతనము అని అనుకునేవి నేడు నాజూకువి అయ్యాయి. మనవాళ్లు స్త్రీ, పురుష సంబంధ విషయములయిన చర్యలన్నీ వెల్లడిగా ఉంచారా లేదా!'

'అదేగా నేను పనికిరాదు అనేది!'

'ఉండవోయ్! కాని ఇప్పుడింగ్లీషువాళ్ళు ఆడవాళ్ళ మోకాళ్ళపైకి గౌన్లు తొడిగి వక్షోజములు సగం కనపడేటట్టుగా కట్టి తిరగడము, బట్ట ఉందా లేదా అన్నట్లుగా లంగోటీలు కట్టి మగవాళ్ళతో ఈత లీదడము, ఈ రకముగా ఉన్నారు. వాళ్ళనుబట్టి మన వాళ్లుకూడా దుస్తులు అనుకరిస్తున్నారు. కాని అటువంటి దుస్తులు ధరించిన ఆడవాళ్ళను కౌగలించుకొని వందలకొలది జట్టులుగా నాట్యమాడుతూ తిరిగే పురుషులు, స్త్రీలదగ్గిర స్త్రీ రహస్య విషయాల్ని సూచనగా నైనా అనకూడదు. డాక్టర్లుమాత్రం వచ్చి రహస్యాలు మాట్లాడవచ్చును. మొగవాళ్ళే పురుళ్ళు బోయవచ్చును. మనవాళ్లో? కాస్త ఒళ్లు కనబడితే సిగ్గు లేని రట్టుమనిషి అంటారు. ఆడ డాక్టర్లు తప్ప ఎవ్వరూ రహస్యభాగాలు పరీక్ష చేయగూడదు. విడిగా మగవానితో ఉండకూడదు. స్నానాలకుకూడా గోదావరిలో పురుషులుండ గూడదు. కాని సమర్తలని గర్భాదానాలని ఉత్సవాలు చేస్తారు. ఇదంతా నీ దృష్టిపథంలో ఉంది. ఒకటి మొరకుతనం, ఒకటి నాజూకుతనం అని వాటి నుదుటిమీద రాసిలేదోయి శ్రీనివాసు!'

'అలాగా?'

౨
అమెరికాయాత్ర

రామచంద్రరావు జపాను చేరుకున్నాడు. జపాను దేశములో నొక నెల యాగి, యాదేశమునందున్న వింతలన్నియు దిలకించి, యానందించి మఱి యమెరికా వెళ్ళవలెనని సంకల్పము. రంగూనులో నుండగానే అతడు జపాను వెళ్ళుటకు, అమెరికా వెళ్లుటకు నారాయణరావు చేసిన కృషి వల్ల 'అనుమతి పత్రములు' రంగూనులోనున్న ఆంధ్రులలో గొప్ప షాహుకారగు పుల్లంరెడ్డిగా రిప్పించినారు.

రామచంద్రరావు తండ్రి భీమరాజుగారి స్నేహితుడగు అమరచందు గిరిధారిలాలను గుజరాతీ వర్తకుడు రామచంద్రరా వోడ దిగుటతోడనే యెదుర్కొని యాతని తనఇంటికి తీసికొనిపోయెను. గిరిధారిలాలుకు అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాను, ఫ్రాంసు, ఇటలీ, ఇంగ్లండు, రష్యా, చీనా మొదలగు దేశములతో వర్తకసంబంధ మున్నది. అతడు వివిధ దేశములకు జాలసారులు ప్రయాణము చేసియున్నాడు. కాబట్టి ఆయన మనస్సులో రామచంద్రుని వెనుకకు బొమ్మని చెప్పుట కిష్టము లేకుండెను. అయినను మిత్రునియాదేశము చొప్పన రామచంద్రుని జూచి భోజనమైన వెనుక నిట్లనెను.

‘రామచందర్! మీకు ముక్కుపచ్చులారింది లేదు. మీరు చిన్నవాళ్లు! దేశం కొత్తది. చాలా మాయకోరులుంటార్. మీరు ఎనక్కిపోయి కాశీలో లక్నోలో కలకత్తాలో చద్వవచ్చును కాదుఅండి? అక్డకూడా చాలా ఎక్వ చద్వు చెప్తార్ కాదా?’

‘మీకూ, మా తండ్రిగారికీ ఉండే స్నేహాన్నిబట్టి అల్లా చెప్తారు కాని, నా మనస్సు నిశ్చయం అయిపోయింది. ఇంక ఎంతమాత్రము నా సంకల్పము మార్చుకోలేను, మార్చను. మీరు పెద్దలు, నాతండ్రితో సమానులు. మీరు చెప్పడం, నేను వద్దనడం బాగుండదు.’

‘సరే! సరే! మీయిష్టం, పర్వాలేదు. నేను అంతా జాగ్రత్త కనుక్కుంటాను. మాచుట్టం ఒకాయన లాల్ చంద్ జీవన్ లాలు న్యూయార్కు పట్నములో మకాం. ఆయనకు ఉత్తరం రాస్తా. మీకూ ఒక ఉత్తరం ఇస్తాం.’

‘చిత్తం. మీ మేలు ఎప్పటికీ మరిచిపోను.’

‘మీ నాయన గారు నాకు, మీకు యివ్వమని, డబ్బుపంపినారు. అది మీకు ఇస్తాను. జాగ్రత్తగా ఉండండి. చాలా చిన్న వాళ్ళు.’

‘చిత్తం. చిత్తం.’

మరునాడు పుల్లంరెడ్డిగారు అమృతలాలు గారి హర్మ్యమునకు విచ్చేసి రామచంద్రుని గూర్చి వాకబు చేసెను. పుల్లంరెడ్డిగారు, ఆమృతలాలుగారు చాలాకాలమునుండి స్నేహితులు, ఒకరన్న నొకరికి గౌరవము.

పుల్లంరెడ్డిగారు అమలాపురం తాలూకా పేరూరు గ్రామవాసులు. చిన్నతనములో కూలికై రంగూనుపట్నమువచ్చి సహజమేధాసంపన్ను డగుటచే త్వరలో మేస్త్రీ అయి, ధనము నిలువచేసికొనెను. తాను గూలికి కుదిరిన గుజరాతీ షాహుకా రొక వ్యాపారమునకై తన్ను సింగపూరు పంపినప్పుడు, పుల్లంరెడ్డి తనకడ నున్న ధనమునంతయు నొడ్డి స్వయముగా వ్యాపారము చేసి సింగపూరునుండి వచ్చులోపల నిరువదియైదు వేలు లాభము నొందెను. తన షాహుకారుపనిగూడ చాల శ్రద్ధమై, లాభకరముగ నెరవేర్చి రంగూను వచ్చి వేసెను. చదువురాని పుల్లన్న అంతటనుండి పుల్లంరెడ్డియై, షాహుకారు తనకొక యణా భాగమీయ, నాయన వర్తకములో భాగస్వామియయ్యెను. నాటి నుండియు పుల్లంరెడ్డి పట్టినది బంగారమై, యాతని ధనము నాలుగు లక్షల వరకు బెరిగినది. నలుబదవయేట తన షాహుకారనుమతీయ దాను వేరుగా వ్యాపారముచేసి పదియేళ్లలో నిరువదిలక్షల సంసారియు, ‘రావుబహదూరు’ నై పాశ్చాత్యులచే ‘పులియన్ రెడ్డి’ యని వాకొనబడుచు, దానకర్ణుడై రంగూను నాగేశ్వరరాయుడని ప్రఖ్యాతి వహించినాడు.

రంగూన్ లో నాంధ్రులందరును గూలిచేయువారలే. కొంతమందిమాత్ర ముద్యోగములు చేయుచుండిరి. వర్తకము చేయువారు మరియు తక్కువ. వారిలో గొలదిమందియే భాగ్యవంతులు. రంగూన్, మోల్ మేన్ మొదలగు ప్రదేశములలో నెక్కువగాను, దక్కిన దేశమునం దచ్చటచ్చట చాలదక్కువ గాను, ఆంధ్రులు బర్మాదేశమునకు వలసపోయినారు. సముద్రములుదాటి, దూర దేశములకు వర్తక మొనర్చుటకు, మత ప్రచారమునకు, రాజ్యస్థాపనకు పోయిన తొల్లిటి మనయాంధ్రుల సాహసోత్సాహముల దలంచుకొని, నేటిమనభీరుత్వమును అలసతను, పురుషార్థ శూన్యతను చూచుకొన్నచో సిగ్గగునుగదా! నేటికిని పొట్టలు చేత బట్టుకొని బర్మా, నేటాలు, మలేద్వీపము, అస్సాములకు బోవుచున్న కూలీలుతక్క మనలో పురుషకారపరులు కానరారు. బర్మాలో తెలంగులను నొక జాతి వారున్నారట. వారేపల్లవుల కాలములోనో, చాళుక్యుల కాలములోనో, లేక కాకతీయుల

కాలములోనో ఆ సువర్ణ ద్వీపము జేరియుందురు. తన పదియవ యేటనే ఆంధ్రులచరిత్ర చదివి వినిపించుకొనియున్న పుల్లంరెడ్డిగారు, రామచంద్రరావు సాహసమున కెంతయు మెచ్చుకొనిరి. రెడ్డిగారు నలువదియవ యేట చదువను వ్రాయను నేర్చుకొన్నారు. అయినను తనకు భారతరామాయణాదులగు పూర్వకాలపు టాంధ్రగ్రంథములను, ఆంధ్రులచరిత్ర మొదలగు నూతనయుగపు గ్రంథములను జదివి వినిపించుటకు విద్యాధికు నొకని నేర్పరచుకొన్నారు.

వెంకటరత్నం నాయుడు గారు మొదలగు మువ్వురు ముఖ్యులచే రెడ్డిగారికి నుత్తరములు వ్రాయించి పుచ్చుకొని, తన బావమరది బాలకుడనియు, నాతనికి వలయు సహాయమొనర్చి తన కుటుంబపు కృతజ్ఞతకు బాత్రులు గావలయుననియు వ్రాయుచు గమ్మలన్నియు నారాయణరావు రెడ్డిగారికి బంపించెను. రంగూనులో నుండి వార్తాపత్రిక నెలకొల్పి యనేక విధముల నాంధ్రులకు సహాయ మొనరించు ఆవటపల్లి నారాయణరావు గారికిగూడ నారాయణరా వుత్తరములు వ్రాయించినాడు.

రెడ్డిగారివలన, నమ్మృతచందువలన, నారాయణరావుగారివలన పెక్కు విధములగు సలహాలనొంది రామచంద్రరావు జపాను వెళ్ళినాడు. టోకియో, యోకొహామా మొదలగు నగరములు, ధ్యానబుద్ధుని, ఫ్యూజియామాపర్వతమును రామచంద్రరావు దర్శించెను. జపాను విశ్వవిద్యాలయములను రసవిహారి బోసు గారి సహాయమున దర్శించెను. బోసుగా రనేక పరిశ్రమాగారములనుగూడ జూచుటకు సౌకర్యములు సమకూర్చినారు. బొమ్మలు, కాగితములు, గ్లాసు సామానులు, కత్తులు, సూదులు మొదలగు లోహపుసరుకులు, బొత్తాములు, పూసలు, దువ్వెనలు, వస్త్రములు, రబ్బరు సరుకులు, మందులు, నింక నెన్నియో వస్తువులను జపానుదేశము భారతదేశమున కెగుమతి జేయుచున్నది. ఆ కర్మాగారములలో బెక్కింటిని రామచంద్రరావు కనుగొనెను.

హిందూదేశము తన్నావరించిన దౌర్భాగ్యపిశాచమును వదల్చుకొని మరల సర్వతోముఖముగ నెప్పటికి విజృంభించగలదో యని రామచంద్రరావు నిట్టూర్పు నించెను. నారాయణరావునకు గొన్ని కుంచెలు రంగులు కొని రామచంద్రరావు పంపించెను.

రామచంద్రరావు అమెరికాకు వెడలుదినము సమీపించినది. రాజకీయ కారణమువలన జన్మభూమిని విసర్జించి జపాను దేశమును బెంపుడుతల్లి నొనరించుకొని, కలలలో, జాగ్రదావస్థలో గంగానదిని, కాళీఘట్టమును, హిమాలయ పర్వత శ్రేణిని స్వప్నములగాంచు రసవిహారుడు రామచంద్రరావును గవుంగి లించుకొని 'బాబూ! అప్పుడప్పుడీ దేశము వచ్చు భారతీయులే నాకు భారత దేశము సుమా! వారి మూర్ధములందు హస్తతలములందు నా వంగదేశపు పంట భూములను, శేఫాలికా జపాకుసుమములను నాఘ్రాణించుచు వారి కన్నుల కాంతిలో నా గంగానదీ పావనోదకముల దర్శించుచు, వారి నుదుటిలో నా దేశపు నీల గగనాల ప్రత్యక్షించుకొందును.

'పంజాబ్ సింధు గుజరాత మరాటా ద్రావిడ ఉత్కల వంగా

వింధ్యహిమాచల యమునాగంగా ఉచ్చలజలధితరంగా'

'నువ్వు బాలుడవు. నా దేశమాత ముద్దుబిడ్డను. నా సోదరుడవు. అహో రామచంద్ర! నువ్వు నాలుగేళ్లకయిన మనతల్లికొడిలో నాడుకొందువు. మన తల్లి మట్టిలో దొర్లుదువు. మనమాత యిచ్చిన ఆటవస్తువులతో గేరింతలాడుదువు. ఆ పవిత్ర వాయువులు పీల్చెదవు. ఆ యమ్మ చనుబాలు గోదావరి పావనోదకాలు త్రాగుదువు. పో! పో! ఒక్కసారి నన్ను

కౌగిలించుకో. మరల నింటిదారి నిటు వచ్చిన సంతోషించెదను. అమెరికా జేరిన వెంటనే నాకు జాబు వ్రాయి' అని యాతని నా తరణిలో దిగవిడిచి గట్టునకు విసవిస వెడలిపోయినాడు.

టంగ్ టంగ్ మని గంట మ్రోగి తుదికూత నుచ్చైస్స్వనమునగూసి యా యోడ పెద్ద చప్పుడుతో యోకొహామారేవు వదలినది. రామచంద్రుడు రసవిహారిబాబు మొదలగు భారతీయుల సలహాచే మొదటితరగతి టికెట్టు పుచ్చుకొన్నాడు.

అమెరికా దేశము బీదలను రానీయదు. డబ్బుగల వారిని గౌరవించును. విద్య నేర్చుకొనుటకు వచ్చినను సరియే, నిర్భాగ్యుడు అమెరికా దేశమున ఉపజీవి క్రిమి (ప్యారాశైట్) వలె సంచరించుటకు వీలులేదు. భరతభూమి కన్న పెద్దదియైనను నచ్చట పదికోటులజనులుమాత్ర మున్నారు. వారికి అమెరికా చాలదట. అమెరికనులు రంగుజనులను తమ కుక్కలు, పిల్లులు, గుఱ్ఱములకన్న హీనముగ జూతురు. నల్ల నీగ్రోలు, చైనా జపాను దేశముల పసుపుపచ్చని మంగోలియనులు, ఆదిమనివాసులగు ఎఱ్ఱఇండియనులు, వివిధ వర్ణములు కలవారైన హిందూ దేశస్థులు వారిదేశములో నివసించి అమెరికనులు కాగూడదట. తాత్కాలికముగ కొలది సంవత్సరములుమాత్రము నివసించి పోవలయునట. నీగ్రోజాతివా డేదైన తప్పు చేసినచో, న్యాయస్థానములకు గొనిపోయి విచారించకుండగనే ప్రజలు వాని నురిదీయుదురు. లేదా స్తంభమునకుగట్టి కిరసను నూనెలో తడిపిన కఱ్ఱలను బేర్చి కాల్చుదురు. వానిని గుఱ్ఱములకుగట్టి, చచ్చునంతవరకు రాళ్లమీద నా గుఱ్ఱమును పరుగెత్తింతురు.

హిందూదేశ మమెరికనుల దృష్టిలో నొక చిత్రభూమి. భారతీయులకు మతములేదు. రాళ్లను రప్పలను గొలిచి రౌరవాది నరకమునబడు మూర్ఖులతో భరతభూమి నిండియున్నదట. కాన కోటీశ్వరభూమియగు నమెరికా, భారతభూమికి క్రైస్తవ మతప్రచారకుల బంపుచుండును. భారతభూమిలోని రాజాధిరాజులైనను, అమెరికాలోని గొప్ప హోటళ్ళలో బస చేయుటకు వీలులేదు. అమెరికా రైళ్ళలో 'పుల్ మాను' అను నుత్తమతరగతి బండ్లలో ప్రయాణము సలుపకూడదు.

ఉత్తుంగములై లేచు సముద్రవీచికల గమనించు చూపులతో రామచంద్రు డమెరికానుగూర్చి యాడిపోసిన పంజాబీయుడగు నొక సిక్కు సోదరుని మాటలను దలపోయుచు నౌకా ముఖ్యోపరిభాగమున నడ్డముగా గట్టిన యినుపగొట్టపుకడ్డీల నానుకొని నిలుచుండి యుండెను.

జపాను దేశము నిన్ననే కొన్ని వందలమైళ్ళదూరాన మాయమై పోయినది. రాత్రియంతయు వివిధాలోచనలతో నిదురరాక, పన్నెండుగంటలకు గొంచెము కన్నుమూసి, తఱువాత నావికులు మ్రోయించిన నాలుగు గంటల చప్పుడువిని మోము కడుగుకొని, శుభవస్త్రముల ధరించి, యాబాలకుడు ఓడ పైతట్టునకుబోయి సముద్రమున సూర్యోదయాద్భుతము కనుంగొనవలెనని వేచియుండెను.

ఎటు చూచినను సముద్రమే. ఆ కనుచీకటిలో ఆకసము, నీరధి ఏకమై పోయినవి. ఊయెలవలె నా మహాతరణి యిటునటు నూగుచు పోవుచున్నది. ఓడలోని యంత్రముల పెనుమ్రోతలు రామచంద్రుడున్న తావునకు మద్దెల మ్రోతవలె మాత్రము వినవచ్చుచున్నవి. ఆ శ్రుతిమేళవింపులో ఓడను ముందునకుద్రోయు ఆకుచక్రములు నీటిలో నపరిమిత వేగమున తిరుగు కవ్వపు మ్రోతయు, ఓడ ముందుభాగమున ఉక్కు (కీల్) బద్దియ నీటిలో మహావేగముగ గోయుచు బోవు గంభీర నాదమును లీనమై ఉత్కృష్ట గీతికయై యాతని

హృదయమును రంజించినవి.

కలలలో, కథలలో, గ్రంథములలో, వార్తాపత్రికలలో వినబడిన విదేశకంఠములు, విదేశశబ్దములు నేడు వినిపించినప్పుడు, నూతనవర్ణములు, నూతన రేఖాప్రవాహములు, నవీన వస్తుసంబంధములు నేడు గోచరించునప్పుడు రామచంద్రుని కంఠయు విచిత్రమై, విస్మయమై మాయాపూర్ణమై కనంబడి యాతడు నిస్తబ్ధుడైపోయినాడు. తాను మున్నెన్నడు విననివియు, నూహింపనివియు నగు నద్భుత సందర్భము లచట సర్వసామాన్యములై తోచి యాతనికి గనులు మూయని కలలైపోయినవి.

ఇంతలో నెవరో యాతని భుజముపై తట్టినారు.

3
జపాను

రామచంద్రరా వులికిపడి వెనుదిరిగి చూచెను. జపానులో రసవిహారుని గృహమునందు దనకు స్నేహితుడై ఆ యోడలోనే అమెరికా పోవుచున్న సర్దారు ఆర్జునసింగుగారును, చెంతనొక యమెరికాదేశీయుడును, ఒక అమెరికా బాలికయును నిలిచియున్నారు.

'అయ్యా! ఈ బాలుడు మా హిందూదేశములో దక్షిణాపథమందున్న ఆంధ్రదేశస్థుడు. ఉత్తమబ్రాహ్మణుడు. బుద్ధవరపు రామచంద్రరావు. మీ దేశము చదువునకు వచ్చుచున్నాడు. రామచంద్రరావ్ జీ! వీరు న్యూయార్కు పట్టణ వాసస్థులు. రౌనాల్డుసన్ గారు. సుప్రసిద్ధ డాక్టర్లు, వడ్డీ వ్యాపారస్థులున్ను, అనేక కంపెనీలలో పెద్ద షేర్లున్న వారునుకూడ వీరికి దాసానుదాసులు. ఆమె వారి తనయ, ఆమె బి.ఏ ఆనర్సు హార్వర్డులో జదువుచున్న లియోనారాకన్య.'

డా. రౌనా: రామచంద్రరావుగారు! మాకు మిమ్ములను చూడడం చాల సంతోషం.

లియో: నమస్కారములు రామచంద్రరావు గారూ!

రామచంద్రునకు జాల సిగ్గువేసినది. పరదేశయాత్ర ప్రారంభించినది మొదలు రామచంద్రుడు విదేశీయులతో ననవసర సంభాషణ నెన్నడు చేయలేదు. ఇంగ్లీషు భాషతప్ప మరేవిదేశీయభాషయు రామచంద్రునికి రాదు. పెద్దవారితో జనువుగా మాట్లాడుట చిన్నతనమునుండియు నెరుంగడు. తండ్రికడకూడ భయభక్తులతో సంచరించువాడు. కాబట్టి రామచంద్రుడు నమస్కారమని మిన్నక నిలిచెను.

అర్జున సింగ్: రామచంద్రరావుగారు మెత్తనిహృదయము కలవాడు. మా దేశములో గొంచెము తలయెత్తుకొని తిరుగు కుటుంబములోనివాడు. అమెరికా దేశమునందు జ్ఞానము సరస్సులుకట్టియున్నదని యాయన నమ్మకము. ఆ జ్ఞానము మనసార గ్రోలవలెనని తలంపు.

డా. రౌనా: రామచంద్రరావు గారూ! బ్రాహ్మిన్సు మీ దేశం వదలి వెడితే నరకములో పడతారటకాదా! మీ రేల వచ్చారు?

రామ: ఇప్పుడంత పట్టింపులు లేవండి.

లియో: కులము తేడాలు పుట్టుకతోనే వుంటాయటకాదూ? వారు వీరిని, వీరు వారిని వివాహము చేసుకోకూడదట, భోజన ప్రతిభోజనము లుండవట?

రామ: అవునండి. మ ... మ....

డా. రౌనా: మీ సిక్కులుగూడా హిందువులేనా అర్జునసింగుగారూ? అర్జున: హిందూదేశములో వున్న క్రైస్తవులూ హిందువులే.

లియో: ఏలాగు?

అర్జున: అమెరికా దేశములో జ్యూమతస్థులున్నారు. మహమ్మదీయులున్నారు. బౌద్ధులున్నారు. వీరందరూ అమెరికనులే. హిందూదేశములోని వారంతా హైందవులు.

డా. రౌనా: (నవ్వుచు) అలాగా! అయితే క్రైస్తవులూ, మీరూ హిందూమతస్థులు కారన్నమాట.

అర్జున: మామతం సర్వమత సమ్మతము. అన్ని మతాలను తల్లివలె హిందూమతం కడుపులో పెట్టుకుంటుంది. హిందూమతంలో ఉన్న లోటును తీర్చుడమునకు శ్రీ నానకు సింగు గురుమహారాజ్ సిక్కుమతము ఉద్భవింప జేశారు. కాబట్టి సంఘసంస్కరణరూపమైనది మా మతం. అలాంటి అంతర్మతాలే బౌద్ధ జైనమతములున్ను, ఇప్పటి బ్రాహ్మసమాజము, ఆర్యసమాజము, సత్సంగసమాజము మొదలైనవిన్నీ.

లియో: ఈ సంఘసంస్కరణ మతాలలో బ్రాహ్మణు లున్నారా?

అర్జున: లేరు. ఈ మతాల్లో చేరిన వారికి వర్ణ భేదము ఉండదు.

డా. రౌనా: ఒక సంఘమువారికీ ఇంకో సంఘంవారికీ వివాహాలున్నవా?

అర్జున: లేవు. కాని ఏ పిల్లనైనా వారు చేసుకొనుట కభ్యంతర పెట్టరు. దానినిబట్టి వెలితప్పులేదు.

లియో: ఆంధ్రదేశం అన్నారు. అదేమిటి?

అర్జున: హిందూదేశములో పదిహేనో పదహారో పెద్దభాష లున్నవి. అందులో ఆంధ్రభాష లేక తెలుగుభాష ఒకటి. ఆ భాష మాట్లాడే జనులు మూడుకోట్లపైన ఉన్నారు.

లియో: అమెరికాలో ఏమి చదువుకొనుటకు వచ్చుచున్నారండి రామచంద్రరావు గారూ?

రామ: ఆః... ఉః... లెక్క లండి.

లియో: ఏ విశ్వవిద్యాలయములో?

రామ: జపానులో స్నేహితులు యేల్ విశ్వవిద్యాలయములోనో లేక హార్వర్డులోనో చేరమన్నారు.

లియో : మీ దగ్గిర శిఫారసు ఉత్తరా లున్నాయా ?

రామ : నాలుగైదున్నాయండి.

లియో : హార్వర్డులో చేరండి. నేను ఎమ్. ఏ. చదువుచున్నాను, విద్యుచ్ఛక్తి అభిమానశాస్త్రంగా. తర్వాత అమెరికాకు శాస్త్ర పరిశోధనములో తండ్రి, మహావిద్వాంసుడు, విద్యుచ్ఛక్తిచే పూడిగంచేయిస్తున్న మంత్రవేత్త థామస్ ఎడిసన్ గారి విద్యుచ్ఛక్తి కర్మాగారాలలో కృషి చేయవలెననియూహ.

రామ: అలాగాండి. హార్వర్డు బాగుంటే అక్కడే చేరుతాను.

డా. రౌనా: మీ దేశంలో వైద్యసహాయం చాల తక్కువట కాదా?

అర్జున: అవునండి. మీ మిషనరీలు మా దేశ దౌర్భాగ్యములన్నీ గ్రంథములలో వ్రాసినారు. పాపం మిషనరీలే లేకపోతే మాదేశం ఈపాటికి నీగ్రో దేశంవలె అయిపోయియుండును.

రామచంద్రుని వినయసంపదయు జ్ఞానసముపార్జనా తీవ్రోత్కంఠతయు డాక్టరు రౌనాల్డుసన్ గారి హృదయమును జూరగొన్నది. రామచంద్రుడు చక్కని ఇంగ్లీషుభాషలో తన దేశస్థులు, తన మతము, తన దేశములోని రాజకీయాందోళన, గాంధిగారి వర్తమాన కార్యక్రమము మొదలైనవానిని గూర్చి ఆయనకు దెలిపినాడు. గాంధీమహాత్ముని యుపదేశములు ప్రజా సామాన్యమునకు బాగుగా నచ్చినవనియు, నుద్యోగ వాంఛాపరులగు విద్యాధికులకు మాత్రము పదవులపై నాశ వదలలేదనియు తెలిపినాడు.

డాక్టరు రోనాల్డుసన్ అమెరికాకు ప్రథమమున వలసపోయిన పిలిగ్రిం ఫాదర్సు (యాత్రిక వృద్ధులు) సంతతివాడు. 'నీలిరక్తము' (అచ్చరక్తము) ప్రవహించు ఉత్తమకుటుంబములోనివాడు. కష్టపడి చదువుకొని అమెరికాలోని గొప్పవైద్యులలో నొకడై భాగ్యవంతుడై గౌరవము సంపాదించుకొన్నాడు. సదయహృదయుడు, నీగ్రోల బానిసత్వము సంపూర్ణనాశనము చేయవలెనని వాదించు నానుష్ఠానిక క్రైస్తవుడు. క్రైస్తవమతము చర్చిమత మైనదనియు, యేసుక్రీస్తు బోధించిన మతము మహోత్కృష్టమైనదనియు అందలి పరమార్థమును గ్రహించినవారు కొలదిమందియే యనియు రౌనాల్డుసన్ వాదించును. హోల్మ్సు మతగురువు బోధ రౌనాల్డుసన్ మహాశయునకు బూర్తిగా నచ్చినది. అన్ని శక్తులలో బ్రేమశక్తి దొడ్డది. ప్రేమయే భగవత్స్వరూపము. సూర్యుడు మంచును కరగించునట్లు, పేమ పాషాణ హృదయమునైన ద్రవింపజేయును. ప్రేమ జగమును వెలిగించు దివ్యజ్యోతి. ప్రేమ లేనినాడే క్రోధము, హింస, స్వలాభము, మాయ, అహంభావము, అసత్యము విజృంభించును. లోకమునందలి యుద్ధములు, దొంగతనములు, వర్తక కౌటిల్యము మొదలగు దుర్గుణములకు గారణము ప్రేమలేమియే యని యాయన స్నేహితులతో వాదించుచుండును.

పరదేశ స్వాతంత్ర్యత, యుద్ధరాహిత్యము, వర్ణభేదవిచ్ఛేదనము మున్నగు నాశయములతో పనిచేయుట కమెరికా దేశములో నెవ్వరు ప్రయత్నించుచున్నను వారికి రౌనాల్డుసన్ తన చేతనైన సహాయము జేయుచుండును. సన్‌డర్ లాండు, హోల్మ్సు, శాసనసభికుడు బోరా మొదలగువారాయన స్నేహితులు. 'రామచంద్రగారు! అమెరికా దేశ ప్రజలు విచిత్రభావములు కలవారు. స్వాతంత్ర్యతకై ప్రయత్నించు ప్రజలకు జయము గోరుదురు. జయము గాంచినచో మిక్కిలి సంతసించెదరు. కాని ఫిలిప్పైనుదీవులను వారు వదలరు. వారి క్రైస్తవ మతము సర్వ దేశముల వ్యాపింప కోట్లకొలది డాలర్లు ఖర్చుచేసెదరు. తమ దేశస్తులకు క్రీస్తు ఉపదేశవాక్యముల నేర్పుటకైనను రాగిడబ్బు ఖర్చుచేయరు. తాము

ఆంగ్లదేశముపై శరించి విడిపోయి స్వతంత్రత సముపార్జించుకొన్నారు. హిందూదేశము స్వతంత్రతకై సర్వస్వము ధారపోయుచుండ, క్రైస్తు అవతారమనదగు మహాత్ముని గూర్చియు, హిందూదేశమును గూర్చియు నీలి వార్తలు ప్రకటించెదరు. కాని ఎన్ని చెప్పినను చదువుకొన్న ప్రతి అమెరికనునకు హిందూదేశము మాయాసంపూర్ణము, సర్వమతజనని, సర్వకళాశ్రయము, సర్వాద్భుతనిలయము. ప్రతిహిందువుడు కవి, వేదాంతి, భక్తుడు. ఊహా ప్రపంచ సంచారి. కాబట్టియే, ప్రతి ఏట అనేకులు అమెరికనులు హిందూదేశ యాత్ర గావించెదరు. కోట్లకొలది ధనము ఖర్చు చేసెదరు. క్రిందటి సంవత్సరము నుండియే నేను, మా అమ్మాయి ఆసియాను దర్శించ ప్రారంభించినాము. అదివర కమెరికాఖండములలోని దేశము లొకవత్సరము, యూరోపియను దేశము లొకవత్సరము చూచినాము.'

లియొనారాకన్య తల్లి ఇటాలియను. అప్పటికే ప్రసిద్ధికెక్కి, సంపూర్ణ యౌవనములోనున్న డాక్టరు రౌనాల్డుసన్ గారికడ చికిత్స బడయుట కామె విచ్చేసినప్పుడు వైద్యుడు రోగియు ఒకరినొకరు ప్రేమించుకొన్నారు. మ్యారియానా, కౌంట్ గ్యాలెటీ ఫెబియానో గారి కుమార్తె. తండ్రి ఇటలీదేశము తరఫున రాయబారియై వాషింగ్టన్ పట్టణములో నున్నప్పుడు బాలిక యగు మ్యారియానాప్రభుకుమారికి హృదయరోగము సంభవించి హృదయరోగ చికిత్సాదక్షుడగు రౌనాల్డుసన్ గారి వైద్యమునకై గొనిపోబడినది. దేహసంబంధ మగు హృదయరోగమును మాన్పి, మనస్సంబంధమగు కామరోగమును గల్పించినాడు ధన్వంతరి రౌనాల్డుసన్. తమ కుమార్తెను అపరిమితముగ బ్రేమించు ఫెబియానో బ్రభుదంపతులు తుదకు వారిరువురి వివాహమునకు సమ్మతింపవలసి వచ్చినది.

ఆ రౌనాల్డుసన్ దంపతుల గర్భమున చంద్రకిరణమువలె లియోనారా జనించినది.

లియోనారా స్వప్నకుమారి. మధుర మధురముగ సంగీతము పాడగలదు. లాటినుదేశస్థుల బ్రునెటీ (నల్లజుట్టు కలవారు) యందము, నార్డుజాతివారి స్వర్ణకేశసంపద, నిర్మలనీలదృష్టి, స్నిగ్ధశరీర ధావళ్యము నామెలో బ్రతిఫలించి, లియొనారాను అమెరికా బాలికలలో ఆనాటి అందగత్తెలలో రాణిని జేసినవి, ఆధ్యాత్మికానుభవ విషయములన్నియు నామె హృదయమును చలింపజేయును. హిందూదేశము, చీనా, జపాను, బర్మా, జావా, బలి, సింహళ దేశముల చరిత్రలు, కథలు, కవిత్వము ఆ బాలిక బ్రతుకు మూలమంట గదలించి వేయును.

తండ్రి కుమార్తె లిరువురు భారతీయులతో స్నేహ మొనరింప ముచ్చట పడుచుందురు. ప్రసిద్ధ భారతీయు లమెరికా వచ్చినపుడు వారిని తమయింటి కతిథిగా బిల్చుచుందురు. రవీంద్రనాథుడు, మెహర్ బాబా, ప్రేమానందస్వామి, కృష్ణాజీ మొదలగువా రాయన భవనమున కతిథులుగా వచ్చినారు. తారకనాథ దాసు, సుధీంద్రబోసు, లజపతిరాయి వారియింటికి తరచు వచ్చుచుండువారు.

రామచంద్రు డొక యుత్తమ బ్రాహ్మణకుమారుడు, భారతీయుడని వినినంతనె తండ్రి కుమార్తె లిరువురు నాతని స్నేహ మొనరించి తమగృహమునకు దీసికొనిపోయి ప్రసిద్ధినొందిన హార్వర్డు విశ్వవిద్యాలయములో బ్రవేశ పెట్టింప దలపోసినారు.

౪
హార్వర్డు

శాంతమహాసముద్రము మహాసముద్రములలోనెల్ల విచిత్రమైనది. ఇందున్న దీవులు పెక్కులు. దీవులలోని పంట అద్భుతము. ఇచ్చటనే బొప్పాయి, టొమాటో, పొటాటో,

పొగాకు, సదాపనస, పంపర, అనాస, జీడిమామిడి మొదలగు జాతులు ప్రథమమున నుద్భవించినవి. నిర్మల శర్వరీగగనముల మినుకాడు నక్షత్రకాంతులు సముద్రపు నీటిమెరపులలో బ్రతిబింబము లైనవి. ఉబుకు తరంగముల గీతికలలో జ్యోత్స్నారేఖలు పొదిగింపబడినవి. ఆ మహానౌక యపరిమిత వేగమున నడుచుచున్నది.

రామచంద్రునకు రౌనాల్డుసన్ తన స్నేహితులందరితో పరిచయము కలిగించినాడు. రామచంద్రుని విజ్ఞానమునకు వారందరపరిమితానందము నొందుచుండిరి. ఎంతటి చిక్కులనైన నాతడిట్టె విప్పి చెప్పగలడు. పదార్థ విజ్ఞానశాస్త్ర రహస్యములన్నియు వానికి గరతలామలకములు. కావున నాతడు విద్యుచ్ఛక్తి విషయికమగు జ్ఞానమునెల్ల సముపార్జించుట యుత్తమ మనియు, దనదేశమునకు, దనకు ఖ్యాతితెచ్చుట కింతకన్న వీలింకొకటి లేదనియు లియోనారా యాతనికి జెప్పి యొప్పించెను.

ఓడలోనుండియే రౌనాల్డుసన్ హార్వర్డు విశ్వవిద్యాలయమునకు వాయు వార్త బంపి రామచంద్రుని ప్రవేశమున కంగీకారము సంపాదించెను.

అర్జునసింగు శాంతనుహానీరధీ తీరములనున్న పట్టణములలో వర్తకముజేయు నొక చీనా కోటీశ్వరుని యుద్యోగి. అతడును స్వంతముగా గొంత వర్తకము జేయుచుండును. అర్జునసింగు నివాసము శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరము. కతిపయదినములకు నౌక శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరము వచ్చి చేరినది. ఆ మహాపట్టణము అమెరికా పడమటితీరముననున్న గొప్ప నౌకాశ్రయస్థలము. ప్రసిద్ధికెక్కిన రేవుపట్టణము. పశ్చిమతీరమున నిది మహాపట్టణ మగుటవలన ఇక్కడనే చీనావారివి, జపాను వారివి అనేకవేల కుటుంబములున్నవి. శాంత మహాసముద్రమున దిరుగు నౌకలు శాన్‌ఫ్రాన్సిస్‌కో వచ్చి యచ్చటనుండి పెనామాకాలువ దాటి అట్లాంటిక్ మహాసముద్రోపశాఖయగు మెక్సికో సముద్రమునుండి న్యూయార్కు, బోస్టన్, ఫిలెడెల్ ఫియా మొదలగు పట్టణములకు బోవును.

రామచంద్రరావు, అర్జున సింగు, రౌనాల్డుసన్, ఆయన కుమార్తె యందరు ఓడదిగి 'ది గేట్ వెస్టర్న్' అను భోజనహర్మ్యమునకు బోయిరి. హిందూ దేశ వాసస్థుల ఆచారవ్యవహారాదులకంటె జపాను దేశస్థుల ఆచారవ్యవహారాదులు వేఱు. ఈ రెంటికీ, నమెరికా సంప్రదాయములకు నెంతయో భేదమున్నది. అడుగడుగునకు నాయాభేదములు గాంచుచు రామచంద్రరావు విస్మయము పడుచుండెను. రెండురోజుల కర్జునసింగు రామచంద్రుని హాలీవుడ్ అను సినిమా పట్టణమునకు దీసికొనిపోయెను. నెలకు లక్షలకొలది డాలర్లు జీతములు గలవారు, సంవత్సరమున కొకసారి వివాహవిచ్ఛేదమును జేసికొని మరల నితరుల వివాహమాడువారు, మిక్కిలి బలసంపన్నులు, సాహసవంతులు, అందమైన వారు, నాట్యకళావేత్తలు, హాస్యరసచూడామణులగు ప్రసిద్ధ నటీనటుల సమూహము లచట నున్నవి. ఆ పట్టణవీధులలో, నుద్యానవనములలో, కర్మాగారములలో పట్టణములు, ఎడార్లు, మహాసముద్రములు, కొండలు, నదులు, గాలి వానలు, ఎండలు, చీకటులు, మంచుప్రదేశములు, వేలకొలది సంవత్సరముల నాటివి, వందలకొలది సంవత్సరముల నాటివి, నేటివి ప్రతిదినము పుట్టుచు మాయమైపోవుచుండును. సృష్టిమాయాతత్వమెల్ల నచ్చట ననుక్షణము కన్నుల గట్టుచుండును.

అచ్చటనుండి మోటారులో, రైలులో ననేకవేలమైళ్లు పయన మొనర్చి న్యూయార్కు పట్టణమునకు మన యాత్రికులందరు విచ్చేసినారు. రామచంద్రరావు మూడుదినములు రౌనాల్డుసన్ వైద్యశేఖరుని కతిథియై మర్యాదలు చూరగొనినాడు. రౌనాల్డుసన్ గారి వైద్యాలయమునకు వారి జనపదావాసమునకు లియోనారాకన్యయు, నిటలీనుండి తండ్రి కుమార్తెలకన్న ముందుగా వచ్చిన రౌనాల్డుసన్ సతియు, రామచంద్రుని గొనిపోయిరి. వారి

భవనములన్నియు స్వర్గలోకతుల్యములైయుండెను. రౌనాల్డుసన్ భారతీయ విగ్రహములను, జిత్ర లేఖనములను, లక్కబొమ్మలను, దెరలను అలంకరించిన యొక శాలకు 'భారతీయ మందిర' మను నామకరణముంచెను. వేరొక మందిరము 'చీనా మందిర' మట. వేరొకటి 'గ్రీకుమందిర' మట. ఇంకనొకటి 'ఈజిప్టుమందిర' మట. వీని యన్నిటియం దలంకరించిన విగ్రహములకు, చిత్రములకు, బంగారు, వెండి, రాగి సామానులకు, గంథము, దంతము, పింగాణీ చెక్కడములకు, దెరలకు గొన్ని లక్షల డాలర్లు రౌనాల్డుసన్ వెచ్చబెట్టియుండును. తన తండ్రియు, నారాయణరావు ప్రోత్సాహముచే తన మామగారును బంపిన పదివేల రూప్యములకు సరియగు డాలర్లను రౌనాల్డుసన్ రామచంద్రుని పేర మంచి బ్యాంకిలో వేయించెను.

రామచంద్రరావు బి. ఎస్‌సి. తరగతిలో చేరుటకు వలయు సౌకర్యముల నన్నియు జూచుకొని హార్వర్డు విశ్వవిద్యాలయమునకు లియొనారా కన్యతో రౌనాల్డుసన్ సతీమణితో గలసివెళ్ళి విశ్వవిద్యాలయములో చేరినాడు.

విద్యార్థులనేకులు త్రోవబత్తెమువూత్ర మెట్లో సముపార్జించుకొని, అమెరికాకుబోయి విద్యాలయములలో ప్రవేశించెదరట. అమెరికా ధనవంతుల కాటపట్టగుటచే, ఇంగ్లండు దేశమునకన్న నక్కడ నన్నివస్తువులును మిగుల గిరాకిగా నుండును. తక్కిన యూరపియను రాజ్యములకన్న ఇంగ్లండులో వస్తువుల విలువ ఎక్కువ. భారతదేశమునకన్న యూరపియను దేశములలో వెల అధికము. కావున అచటికేగిన విద్యార్థులు హోటళ్లలో వడ్డించియో, సినిమాలలో ప్రేక్షకులకు దారిచూపియో, ఇంచుకించుక సంపాదించుకొందురు. కొందరు సెలవులకు పల్లెటూళ్లకు బోయి, యచట రైతులకడ గూలిపనిచేసి ధనము సేకరించెదరట. బీదవిద్యార్థి లిట్లెన్నియో యగచాట్లుబడి చదువు కొందురు. కొందరు బాలురకు శ్రీరామతీర్థ వివేకానందులేర్పరచిన యుచిత వేతనములు దొరుకునట. అమెరికాలోని భారతీయులను అమెరికనులు చాల గౌరవము చేయుచుందురు. భారతీయులు అమెరికా ప్రజలగుటకు మాత్రము అమెరికను లొప్పరు. తమతో వర్తకము జేయుటకు, తమదేశపు విచిత్రములు జూచుటకు వేదాంతములగూర్చి ఉపన్యసించుటకు, తమ విద్యాలయములలో జదువుకొనుటకు భారతీయులు విచ్చేయుట అమెరికనుల కెంతయు నిష్టము.

అమెరికాదేశమునకు బోయిన యాంధ్రులసంఖ్య చాల స్వల్పము, వంగల శివరాముగారు పి.హెచ్.డి. రాజ్యతంత్రజ్ఞానమునందు పట్టమునంది, భరతదేశమున, కలకత్తా విశ్వవిద్యాలయములో, నటుతర్వాత లక్నో విశ్వవిద్యాలయములో పండితులుగాజేరి ప్రఖ్యాతిబడసియున్నారు. బాపినీడుగారు ఎమ్.ఏ. వ్యవసాయశాస్త్రమున పట్టమునంది, భారతదేశమునందు వ్యవసాయమున నూతనమార్గముల నెలకొల్ప దీక్షతో నున్నారు.

ఎలాప్రగడ సుబ్బారావుగారిని రామచంద్రరావుగారు హార్వర్డు లోనే సందర్శించినారు. చెన్నపట్టణములో నాయన వైద్యవిద్యలో ఎల్.ఎమ్.ఎస్. పట్టమునంది, హార్వర్డు విశ్వవిద్యాలయములో ఉన్నత వైద్యవిద్య బడయుటకు సంకల్పించి, యా విద్యాకృషిలో దన్మయులై, యుత్తమ పరీక్షలలో గృతార్థులై, వైద్యవిద్యలో సత్యానూత్రార్జన తపస్సులో లీనమైపోయినారు. ఆయన విద్యయే యాయనకు భార్యయట, తల్లియట, బిడ్డలట. మరల భారతదేశమున కెప్పుడు రాగలడో? తన గురువు గారితో నేకమై బయోకెమిస్ట్రీ విద్యలో ననేక నూతనపథములు కనుగొని నూతన విషయముల ప్రపంచమున కర్పించుచున్నాడు.

రామచంద్రరావుయొక్క యుత్కృష్టధీశక్తి గాంచి హార్వర్డువిశ్వవిద్యాలయ పండితోత్తము

లాశ్చర్యపూరితులైనారు. గణిత శాస్త్రమున బ్రపంచ ప్రఖ్యాతిగాంచిన కమింగ్సు పండితుడు రామచంద్రుని మేధాసంపన్నతకు మెచ్చి, యాతని దనయండ జేర్చుకొని వేయికనులతో గాపాడుచుండెను.

౨౫

గాఢస్నేహము

నారాయణరావు మదరాసులో బి.ఎల్. తరగతిలో జేరినాడు. టెన్నిసు, కాలిబంతి, క్రికెట్టు ఆటలలో నాతడు మొనగాడు. న్యాయకళాశాలలో నాంధ్ర విద్యార్థులందరు నారాయణరావును విద్యార్థి సంఘ కార్యదర్శిగా నెన్నుకొని ధన్యులైనారు. పరమేశ్వరుని తనకడ కొన్ని నాళ్లుండు మని నారాయణ కోరుటచే నా యువకుడును వచ్చి చెన్నపట్టణములో నాతని చెంతనే నివసించెను. ఆలం నారాయణుని వదలడు.

పరమేశ్వరునకు చిత్రవిద్యా సంబంధమగు ఉద్యోగమేదైన దొరకు వరకు, విశ్వదాత యగు నాగేశ్వరరాయలు ఆంధ్రపత్రికా కార్యాలయమున నాతనికి బ్రవేశము ప్రసాదించిరి. కావున 'భారతి'కి కథలను బద్యములను వ్రాసి యిచ్చుచు, దినమునకు రెండుగంటలు చిత్రవిద్యాపరిశ్రమము సల్పుమని నారాయణరావు బోధించెను. తానును బరమేశ్వరునకు వేవిధంబుల సహాయము చేయుచుండెదనని నెమ్మదిగా దెలిపినాడు. నారాయణుడు తీరికయైన వేళలందు పరమేశ్వరునితోగలసి, మహదానందరూపములై అద్భుత లేఖనా మూర్తిమంతములగు చిత్రములు చిత్రించువాడు. పరమేశ్వరు డాంధ్రపత్రికా కార్యాలయమున బ్రవేశించినాడు.

పరమేశ్వరున కయిదుగు రన్నదమ్ములు. పరమేశ్వరమూర్తి తండ్రియగు వెంకటరమణమూర్తిగారు మునసబీ చేసి యుపకారవేతనము (ఫించను) బుచ్చుకొన్నారు. బహుకుటుంబి యగుటచే నాయన ధనమేమియు వెనుక వైచుకొన లేదు. కుమార్తె వివాహమున కాఱువేలు ఖర్చుచేసినాడు. లంచములమాట వినబడినచో నగ్నివలె మండిపోవువాడు. నేడు ప్రభుత్వమువారిచ్చు వేతనము తప్ప నాయన కితరాధారము లేదు. ఆరుగురు కుమారులకు జదువులు చెప్పించెను. నెలకువచ్చు మూడువందల రూపాయలు తిండికి, కడగొట్టు బాలుర చదువులకు, వృద్ధురాలగు తల్లి వైద్యమున కాయనకు బప్పువలె ఖర్చయి పోవును. పెద్దకొడుకులు ముగ్గు రుద్యోగములలో నున్నను వారు తెచ్చు జీతములు వారి కుటుంబములకే సరిపోవును, అప్పుచేయుట యన్నచో నాయనకు దేహము కంపించిపోవును. ధనము లేనిచో పస్తుండును గాని ఒక కాని పద్దువ్రాయడు, నోటు వ్రాయడు.

పెద్దకుమారుడు విశాఖపట్టణము కాలేజీలోనున్న ఉన్నత పాఠశాలలో చరిత్ర పాఠముల చెప్పు నుపాధ్యాయుడు, వరదరాజులు బి. ఎ., ఎల్. టి. గారు. రెండవ కుమారుడు శ్రీరంగనాయకరావు. ఎటులనో స్కూలు ఫైనలు పరీక్ష పూర్తిచేసి, పెద్దాపురము మునసబు న్యాయస్థానములో లేఖరి యుద్యోగము తండ్రిగారి ప్రాపకముచే బొంది, తగులంచములుగొనుచు భార్యాబిడ్డలతో గాలక్షేపము చేయుచుండెను. మూడవయాతడు బి. ఎ.,బి. ఎల్. పరీక్షలలో గృతార్థత నొంది అప్రెన్‌టిస్‌అయి, హైకోర్టు వకీలయి, అనకాపల్లిలో న్యాయవాదివృత్తి సలుపుచు, బదిరాళ్ళయిన నింటికి దేలేక, తండ్రిగారి ప్రాపకముచే నెప్పుడు మునసబీపని యగునా యని గడియలు యుగములుగా లెక్కపెట్టుచుండెను. పరమేశ్వరమూర్తి నాల్గవవాడు. పరమేశ్వరమూర్తి వెనుక నొక బాలిక ఉమ, ఆమె వెనుక నిరువురు కవలలు, రామారావు, లక్ష్మణరావులు. వేంకటరమణమూర్తిగారి జన్మమును దరింపజేయ నుద్భవించిరి. వారిరువురు

నాల్గవఫారము చదువుచుండిరి. ఇట్టి చిక్కులలో నుండుటవలననే వెంకటరమణమూర్తిగారు, పరమేశ్వరునికి అనేక విధములగు సహాయము తామొనరింపజాలమనియు, కుమారుడు అందరితోబాటు తనకడనున్న ఎట్టులో కలో గంజో పోయగలననియు, నితరస్థలములకు బోయినచో, పరమేశ్వరుడు తన కుటుంబమును దానే భరించుకొనవలయుననియు మొగమాటము విడిచి జెప్పినారు.

పరమేశ్వరుడు నారాయణకన్న రెండేండ్లు పెద్ద, పందొమ్మిది వందల ఇరువది రెండవ సంవత్సరము గాంధీమహాత్ముడు భరతదేశ దాస్యశృంఖలా విమోచనమునకని ప్రారంభించిన అసహాయోద్యమములోజేరి, పరమేశ్వరుడొక సంవత్సరము కారాగారవాస మనుభవించెను. అప్పటి కాతని వయస్సు పందొమ్మిది. బి. ఏ. చదువుచుండెను. నారాయణరావునకు పరమేశ్వరునకు చెఱసాలయందు గాఢస్నేహము కుదిరినది. చెఱ వదలి వచ్చిన వెనుక వారిరువురి మైత్రి తీగవలె నల్లుకొనిపోయి వారిరువురి యాత్మలొకటి, దేహములు మాత్రము వేరైనవి. పరమేశ్వరుడు 1924 లో బి.ఏ. పూర్తి చేసెను.

నారాయణరావు పరమేశ్వరులిర్వురు సర్వకళోపాసకులు. నారాయణరావపరిమిత మేధాసంపన్నుడు. పరమేశ్వరునికి జ్ఞాపకశక్తికన్న సృజనాశక్తి మెండు. నారాయణరావునకు కళాసృష్టి శక్తికన్న, ధీశక్తిమిన్న. నారాయణరావు చూపుమాత్రాన నెట్టివిషయమును సర్వార్థములతో గ్రహింపగలడు. ఏ జటిలవిషయమునైన సులువుగ బోధపడురీత నుపదేశింపగలడు. ఉపన్యాస మీయగలడు. నారాయణునకు జ్ఞాపకశక్తి యత్యద్భుతము. శాస్త్రజ్ఞానములో ఎయిన్ స్టెయిన్ మొదలగు పండితోత్తముల గ్రంథము లాతనికి మంచినీళ్ళ ప్రాయములు. అర్థమయిన విషయములు తలచినంతమాత్రాన నాతని మనోముకు రమున ప్రత్యక్షములగును. నారాయణ జ్ఞానపిపాసకు, ఈశాస్త్రమాశాస్త్ర మని హద్దులేదు. అతని ధీకిరణము సర్వశాస్త్రములపై ప్రసరించును. రామన్ గారి 'కిరణ' విషయజ్ఞానమన నెంత ప్రేమయో ఆంధ్రేతిహాస విషయమునందు నంత ప్రేమయే. న్యూటను, ఎయిన్ స్టెయిన్, ఆడిసన్, గౌతమ కణ్వాదులు, నాగార్జునులు అతనికి చిరపరిచితులు. మహాపండితుల సిద్ధాంతము లెంతశ్రద్ధమై గ్రహించునో, శోణానదిపైని వంతెన పొడవును, చీనా కుడ్యచరిత్రను, ఆర్మీనియనుజాతివారి చరిత్రమును, సముద్రమీన భేదములను, అవి యివి యన నేల సమస్త వస్తుజ్ఞానమును ఆతడంత యాస్థమే గ్రహించును.

పరమేశ్వరుని జ్ఞానశక్తి నారాయణరావు మేధాశక్తి యంత యగాధము కాదు. ఇరువురి హృదయములు రసార్ద్రములే యగును కాని, పరమేశ్వరుని యందు లలితకళాశక్తి యెక్కువ విజృంభించియున్నది. ఇరువురు సౌందర్యోపాసకులే. ఇరువురు జ్ఞానప్రియులే కాని పరమేశ్వరుడు తుమ్మెద, నారాయణుడు తేనెటీగ. జ్ఞానామృత సంపాదనమున నిదియే వారికిగల భేదము.

నారాయణరావు గంభీరహృదయుడు. పరమేశ్వరుడు దర్పణప్రతిమాన హృదయుడు. ఒక రహస్యము దాచలేడు. ఒక భావము గుప్తపరచుకొనలేడు. అయినను అతని జ్ఞానము సర్వతోముఖము. అతని జన్మలగ్నమున బుధు డున్నాడు.

పరమేశ్వరుడు లతవలె నెల్లకాలము నెవరో యొక ధీశాలియగు స్నేహితుని జుట్టియుండును. స్నేహితులేనినా డాతడు ప్రపంచమున నొంటియై యుంటినని భావించును. కాని పెక్కుఘంటిక లాత డొక్కరుడు ధ్యాన స్థిమితుడై యుండగలడు. ధీరత్వమునగూడ పరమేశ్వరుడు తక్కువవాడు కాడు. కారాగృహవాసమన్న వెనుకంజ నిడలేదు. ఒక్కడు గోదావరిలో బాతువలె నీదుకొనుచు మైళ్ళకొలది పోగలడు.

పరమేశ్వరుని హృదయము వెన్న వంటిది. స్త్రీలలో స్త్రీవలె మెలగగలడు. ఆడువారికున్న నాజూకులన్నిటిలోను నాతడు నిధి. అన్నిరకముల పాటలు పాడగలడు. అభినయము చేయగలడు. ఆడువేషము వేసినచో సుందర స్త్రీమూర్తియై, వనితలనే భ్రమింపజేయగలడు.

అతని మనస్సు మైనమువంటిది. ప్రాపంచిక సాధకబాధకము లాతని మనస్సు నెక్కువ కలత బెట్టినను, అవి తాత్కాలికములై, క్షణభంగురములై మఱునిమేషమున నంతరించిపోవును. అతని మనము యథాసంతోషస్థితి నందును.

నారాయణరావు తన హృదయమునకు నచ్చినవారితోడ స్నేహ మొనరించును; పరమేశ్వరు డందరకు స్నేహితుడే. కాని పరమేశ్వరుడు కొలది మందికే తన సంపూర్ణహృదయము ధారపోయును. ఇరువురును గాఢముగ ప్రేమింపగలరు. నారాయణరావు ప్రేమ యాతని బ్రతుకును మూలమంట గదల్చి యాజన్మాంతము దివ్యజ్యోతివలె వెలుగుచుండవలసినదే. పరమేశ్వరుడు స్నేహితు డొకసారి తన్ను మరచినచో తానును మరచిపోగలడు.

నారాయణరావు స్నేహము తనకు లభించినందులకు బరమేశ్వరుడు సంతతము భగవంతునికి కృతజ్ఞత తెల్పుచుండును; ఆనందము నొందును. కన్నులరమోసి తన్మయుడగును. నారాయణుడు నిజమా కాదా యన్న ప్రేమచే నాతని యొడలంటును, ఆతని యొడిలో దలనుంచి యంతర్దృష్టి వహించును. 'మీకు నారాయణరావు అన్నగారు భర్తగారా, భార్యగారా?' యని రుక్మిణి పతిని మేలమాడును.

౬

కవిత్వము

పరమేశ్వరునకు భారతి పత్రికలో నేబది రూపాయల జీతమును గరుణార్ద్రహృదయుడగు నాగేశ్వరరాయ డేర్పరచెను. తన భార్యను దీసికొని వచ్చి, పరమేశ్వరమూర్తి మాంబళంలో గాపురము పెట్టెను. మంచి నెయ్యి రాజమహేంద్రవరము నుండి వచ్చినదని, తనతండ్రిగారు కొత్తపేట నుండి కమ్మని పప్పునూనెయు, గొబ్బరినూనెయు బంపించినారని, నారాయణరావు పరమేశ్వరున కెన్నియో వస్తువులందించుచుండును. రుక్మిణమ్మకు పట్టణము చూపించమని, సినిమాకని నారాయణరావు తన మోటారును పరమేశ్వరునికి నాతని సెలవుదినములలో బంపుచుండును. పరమేశ్వరుని మంచిగృహము నద్దెకు తీసుకొనుమని బ్రేరేపించి నారాయణు డా గృహమున వారికి వలయు మంచములు పీఠములు వంట సామానులు మొదలగునవి కొనియిచ్చినాడు.

రాజారావు తనకున్న కొద్ది తీరుబడికాలములో నారాయణరావుతోడనో, పరమేశ్వరునింటనో, పరమేశ్వరునితో నారాయణరావింటిలోనో, స్నేహితులతో నానందము ననుభవించువాడు. ఏ స్నేహితుడు కావలయునన్నను నారాయణరావు తన మోటారులో బోయి యాతని గొనివచ్చువాడు. ఆలం నారాయణరావును కలిసికొనని దినమే లేదు. రాజారావు, ఆలం, పరమేశ్వరమూర్తి, నారాయణరావులు ఒకరి కొకరు గాఢమిత్రులైనారు.

పరమేశ్వరుడు ఆనాటి యువకవులు రచించిన పాటలు, పద్యములు కలకంఠముతో మధురముగ బాడుచుండెను. అత డెన్ని సభలలోనో పాటలు పాడువాడు. తాను పాటలను పద్యములను రచించును. చిన్న కథలను వ్రాయుచుండును. తనరచనముల 'భారతి' లో బ్రకటించుచుండును.

ఒకనాడు పాట నొకదాని రచియించి పరమేశ్వరుడు నారాయణరావు కడకు గొనివచ్చెను.

'ఓహో తాతా నీ దేవూరు?
నీ వేడపోతవోయ్?

ఊరులేదు వాడలేదు
దేశమంతా నీదే వూరు
ఊరిబైట చెరువుకాడ
చేరుతోనే పాదుకొంటవ్.

తాతా నీ దేవూరు
నీ వేడపోతవోయ్?

గిత్త పైన యిల్లుచుట్టావ్
ఇంటి సామానంతా కట్టావ్
బిడ్డాపాపలు కూడా నడుస్తే
యిడ్డూరాలే రాజ్యాలన్నీ.

తాతా నీ దేవూరు
నీ వేడపోతవోయ్?

బిచ్చమేసేతల్లి ఉంటే
విచ్చిపోయిన పూవే బతుకు
యేసాలేసి బైరాగవుతవు
సేతులు సూసి సుద్దులు సెపుతావు.

తాతా నీ దేవూరు
నీ వేడపోతవోయ్?'

పరమేశ్వరుడు పాట పాడుచుండగనే రాజారావక్కడకు వచ్చినాడు. ఆలము పాట ముగిసినవెనుక వచ్చినాడు. ఆతడు పరమేశ్వరుని మరల పాడుమన్నాడు. పరమేశ్వరుడు మరల పాడినాడు. సంధ్యారుణమధురిమలో పరమేశ్వరుని గొంతుక తారాశ్రుతిలో విరిసిపోయినది. పల్లెటూళ్ళలో వివిధ వేషాల తీరుగాడు బిచ్చగాండ్ర గుంపును వారి కనులయెదుట నిలిచినట్లయినవి. బిచ్చమెత్తుకొను జాతు లెన్ని శతాబ్దములనుండియో బిచ్చము లెత్తుకొనుచునే యున్నవి. జంగములు, బుడబుక్కలవారు, బైరాగులు, గంగిరెడ్ల దాసరి వారు, కొమ్మదాసరులు, కోయవారు, ఎరుకలవారు, పగటివేషగాండ్రు, విప్రవినోదులు, మంత్రగాండ్లు, అడవిచెంచులు, యానాది భాగవతులు, రామదాసులు, నూనెగుడ్డల వారు, అమ్మవారి దేవరలు, దాసులు, తోలుబొమ్మలవారు, దొమ్మరివాండ్లు రుంజలవారు, కాశీపటములవారు, భటరాజులు, బీబీనాంచారి వారలు, గంగానమ్మ భక్తులు, జంగాలు మొదలైన బిచ్చగాండ్రు వారి మనస్సీమలో జట్టు జట్టులుగా బ్రయాణము చేయుచు తోచినారు.

రాజా: నారాయణరావు! మన దేశానికి ఈ బిచ్చగాళ్లు చెదపురుగులురా! నారా: అది నేను ఒప్పుకోనోయి.

ఆలం: నేనూను.

నారా: ఎందుకంటావా? అసలు వీళ్ళలో పూర్వం నుంచీ మనస్సులకు వినోదము కలిగించేవారు కొందరు, కొందరు దేశదిమ్మరిజాతులు, అడవిజాతులు. వారివల్ల భూతవైద్యం ఎరుక చెప్పించుకోవడం మొదలయిన లాభాలు పొందుతున్నాం మనం.

రాజా: అయితే ఆ భూతవైద్యం, ఎరుకచెప్పడం నీ కిప్పుడు నమ్మకమేనా?

నారా: నేను బిచ్చగాళ్ళ చరిత్ర చెప్పుతున్నానేగాని నాకు నమ్మకం అన్నానామరి. విను! వీళ్ళంతా మనకు ఏదో లాభం కలుగజేసి, మనవల్ల లాభము పొందేవాళ్లు. రానురాను మనకు పాశ్చాత్యనాగరికతవచ్చి ఈ బిచ్చగాళ్ళ జాతులలో ఉండే కళాసౌందర్యము అనుభవించడము రూపుమాసింది. జంగాలు పాడే బొబ్బిలిపాట, దేశింగురాజుకథ, సర్వాయిపాపడుకథ, బాలనాగమ్మకథ, మరాటీకథ, చెన్నప్ప రెడ్డికథ, కామమ్మకథ మనము వింటున్నామా? ఆ కథలలో చమత్కృతీ కళాధిక్యత గమనిస్తున్నామా? పాటక జనం మాత్రం నేటికీ ఆ కథలు విని ఒక అనిర్వచనీయానందం పొందుతూ, వారికి తోచిన బహుమతులు యిస్తున్నారు.

ఆలం: మా మతం ఎప్పుడూ ధర్మం చేయమంటుందిరా !

రాజా: అసలే మనదేశం బీదదేశం. ఇప్పటికైనా వీళ్ళు వదలక పోవడం ఏమిటని?

పరం: వాళ్లెలా వదలుతారోయి? వాళ్లకి ఆధారం యేదయినా చూపించూ. వాళ్లకీ వృత్తి మహాసౌఖ్యమా ఏమిటి? వాళ్ళపాట వినో, ఆట చూసో, మాటకు ఆనందించో ప్రతిఫలంక్రింద గుప్పెడు గింజలిస్తున్నాం. అంతేనా?

రాజా: అలా మనకు నువ్వు చెప్పే ప్రతిఫలం ఇవ్వకపోతే?

పరం: ప్రతిఫలం ఇవ్వకుండా ఉట్టి ముష్టి ఎత్తుకునేవాళ్లు చాలాతక్కువ కాదటోయి. వాళ్లయినా ప్రప్రథమంలో ఏదో ప్రతిఫలం యివ్వకుండా ఉండిఉండరు.

రాజా: నేను చెప్పేవిషయం యిద్దరూ గ్రహించలేదు.

నారా: ఉండరా పరమం! నువ్వనేది, రాజారావు! వాళ్ళిచ్చే ప్రతిఫలం ఇవ్వనిదానితో సమం. కాబట్టి బీదదేశమయిన మన దేశానికి వీళ్లు బరువు చేటు. కనుక యా ముష్టియెత్తడం మానిపించి వెయ్యాలని. అదేనా నీవాదన?

రాజా: అవును.

నారా: సరే, బిచ్చగాళ్ళకు నువ్విప్పుడేదైనా పని చూపిస్తావా? రాజా: పని చూపించే, వాళ్ళని మాన్పించివెయ్యాలని.

నారా: అదేదోషం. పిచ్చి కుదిరితేగాని పెళ్ళి కుదరదు, పెళ్ళి కుదిరితేనేగాని పిచ్చి కుదరదు. ఇప్పుడు వ్యవసాయంలోనూ, గోడకట్టు బండి తోలడం మొదలైన చిన్న చిన్న కూలిపనులలోనూ, పట్టణవాసంలో ఫ్యాక్టరీ కూలిమోత మొదలైన పనులలోనూ కావలసినంతమంది జనం ఉన్నారు. కాబట్టి ఇప్పుడు ముష్టియెత్తుకునేవాళ్లకి పనులిచ్చేందుకు పనులులేవు. అదికాకుండా ఇదివరకు పనులుచేసే సర్వవిధములైన పాటకజనములోనే అందరికీ కడుపునింపే పనిలేక, పోటీలతో ఏదోరకంగా ఒక విధమైన సగటుకూలి అందరికీ దక్కుతోంది. ఆ సగటు కూలీవల్ల పాటకపుమనిషికి ఏడాదిలో ఆరోవంతు రోజులకు పూర్తియైన తిండి, అనగా రోజుకు ఆరోవంతుతిండి దక్కుతోంది. ఇంక ఈ బిచ్చగాళ్లుకూడా పనికిదిగితే, మనిషికి ఒక నెల తిండే సగటున వస్తుంది. ఎందుకంటే కూలిజనం ఎంతమంది ఉన్నారో అంతమంది బిచ్చగాళ్ల జనం ఉన్నారు.

రాజా: అదంతా నేనూ ఒప్పుకున్నాను. కాని మన దేశంలో ఇంకా వ్యవసాయానికి రావలసిన భూమెంత ఉన్నది?

నారా: సుమారు ఇప్పుడున్న దానిలో నాలుగుపాళ్లలో మూడువంతులు వ్యవసాయానికి వచ్చేటందుకు వీలైనభూమి మిగిలింది. అల్లా వీలులేని కొండా, అడవి, ఎడారిభూమిన్నీ.

రాజా: మూడు పాళ్లైనా ఉందా లేదా?

నారా: ఉంది. కానీ ఆ భూమిని వ్యవసాయానికి తీసుకువచ్చేటందుకు కొన్ని వందలకోట్లు ఖర్చవుతాయి. అది ఎక్కడ? ఇప్పటి గవర్నమెంటు యివ్వలేదు. లక్షాధికారులు తక్కువ, వారూ ఇవ్వడం కష్టం. దేశం మొత్తంలో డబ్బు హుళక్కి.

రాజా: నువ్వు చెప్పింది, పాటకజనమే వీళ్ల కళాఉత్కృష్టత కానందిస్తున్నారు అన్నావు. వాళ్లు ముష్టివేసి వాళ్ల రాబడి సగం చేసుకుంటున్నారుగా ఎల్లాగూనూ.

నారా: కాని ఆ బిచ్చగాళ్లు పాటకజనం దగ్గిరపొందే బిచ్చం ఉన్నదే, అది డబ్బుగలవాళ్ల దగ్గిర సంపాదించే బిచ్చంలో మూటిలో ఒకపాలే ఉంటుంది.

రాజా: మన స్త్రీలు పాశ్చాత్య విద్యాధికులు కానంతకాలం బిచ్చగాళ్లకు భయం లేదు. పాశ్చాత్యవిద్యకూడా మన యీ పూర్వసంప్రదాయ వాసనను మార్చలే దెప్పుడును.

పరం: మీరిద్ద రేమన్నా సరేగాని, బిచ్చగాళ్లు కళాభాగం. వాళ్లలో ఉన్న రసాభిజ్ఞత మనలోలేదు. తోలుబొమ్మలవాళ్లలో చిత్రకారులున్నారు, రామదాసులలో పాటగాళ్లున్నారు, జంగాలలో కథకులున్నారు. టిక్కెట్లు పెట్టి గారడీ చేసి డబ్బు సంపాదిస్తే మాంత్రికుడు, వీధిలో డోలువాయిస్తూ బుట్టలో మనిషిని మాయం చేయిస్తే బిచ్చగాడూనా? నా ఉద్దేశమునకు స్వరాజ్యము వచ్చి దేశం బాగుపడ్డాక ఈ బిచ్చగాళ్లని బాగుచేసి, వాళ్ల కళా సంబంధమైన వృత్తులలోకి ప్రవేశించిన దోషాలు మాయముచేసి, ఆ వృత్తులు వృద్ధిపొందేందుకు కళాశాలలు ఏర్పరచాలని. ఆ ఆశయము నన్ను పులకరాలతో నింపుతూ ఉంటుంది.

రాజా: మన పరమేశ్వరుడు ఏదో కలలుకంటూ ఉంటాడు.

నారాయణరావు బిచ్చగాళ్లను తలచుకొని మనవారి ధార్మికత సార్వజనీనముగ దేశములోని ధనము పంచుచున్న విధము ఊహించెను. హిందూదేశములో రష్యారాజ్యపద్ధతి యవసరములేదు. అది ప్రాపంచిక సంబంధమైనది. మనదేశ మాత్మోపలబ్ధికై పాటుపడినది. కావున రష్యా పద్ధతి నవలంబింప జాలదు. రెండు రాజ్యములూ ముఖ్యముగా వ్యవసాయ దేశములేయైనను మనుష్యుని యాత్మవికాసమునకు దోడుపడని పద్ధతు లేవియును భారతవర్షమునకు బనికిరావు. ఏ దేశమునకును పనికిరావు. భరతఖండము సర్వప్రపంచమునకును ధారబోయు బోధన మిదియే. జపానుదేశము నిమేషమాత్రమున పాశ్చాత్య మార్గ మవలంబించినది. టర్కీ అనుకరించుచున్నది. పెరిసియా యా మార్గము వెంట నడువనున్నది. కాని నూటయేబది సంవత్సరములనుండి పాశ్చాత్య నాగరికతాసారము మన రక్త నాళములలోనికి ఇంజెక్షను చేయబడుచుండినను, మనలోనున్న పూర్వసంప్రదాయవాసనల నది నశింపజేయలేకున్నది. ‘అయ్యో, నాతల్లీ! నీకీ పాశ్చాత్యనాగరికతా విమోచన మెప్పుడోగదా’ అనుకొనుచు నారాయణరావు నిమీలితలోచనుడైనాడు.

పరమేశ్వరుడు ‘ఏమర్రా! మీరిద్దరూ ఆలోచనలలో పడ్డారు. ఆలం మాట్లాడడు. నాపాటను గురించి మంచీ చెడ్డా చెప్పారుకారు. కష్టపడి తయారు చేశాను. కోకిల్లా పాడాను’ అని మిత్రుల నిరువురిని బ్రశ్నించెను. ఆలం నవ్వుచు ‘నిన్ను మా పారశీకకవి ఒమారు ఖయ్యాముతో పోల్చానురా, పో’ అన్నాడు.

నారాయణరావు ‘కారువాడికి కబురుపంపినాను. వాడు కారుపట్టుకు వస్తాడు. కాస్త కాఫీ పుచ్చుకోండి. రాజారావు సిగరెట్లు కాల్చడు. మనకు త్రీకాజీల్సు ఉన్నాయి. పదండిరా సినీమాకు, డగ్లాసు ఫిలుము ‘త్రీమస్కెటీర్లు’ వచ్చిందిరా పదండి. సుబ్బయ్యా కాఫీపట్టుకురా!’ యని కేక వేసెను.

ఆలం: నాకు పరాటాలు, కోడిగుడ్లు కావాలిరా.

పరం: ఈ కుంకాయికి ఒక జందెం తగిలించరా నారాయుడూ.

ఆలం: మీ కందరికీ ముస్లీముమతం ఇద్దామని చూస్తూంటే!

నారా: తెలుగు తురకలకు, అరవ తురకలకు హిందువులతో దెబ్బలాట లేనేలేదుకాదట్రా! మీ కందరికి హిందూమతం ఇద్దామని మేము చూస్తున్నాం.

౭

జగన్మోహనరావు

శ్రీ రాజా క్రొవ్విడి బసవరాజ రాజేశ్వర శ్రీ జగన్మోహనరావు బహద్దరుగారు గంజాంజిల్లాలోని నారికేళివలస జమీందారుగారు. నారికేళివలస బరంపురమునకు గొలదిమైళ్ళదూరములో నున్నది. జమీయంతయు బది గ్రామములు. సాలుకు ముప్పదివేలు రాబడి.

కాని జగన్మోహనరావు బహద్దరుగారు మహోదారపురుషులు. ధనమొకచోట కూడియుండుట వారికి బడదు. ఏరీతినైననేమి ధనము ప్రపంచములోనికి బంపుట లోకకల్యాణప్రదము. భోగకాంతలు, బ్రాందీషాపు యజమానులు, జూదరులైన స్నేహితులు మొదలగువారు ధూమశకటములవంటివారు. ధనమును దేశములో వెదజల్లుటలో వారు ప్రసిద్ధులు. వారి సహాయము లేనిచో, నొకచోటనే పాదుకొని పనికిమాలినదగును. ఇదీ వారి అర్థనీతి. పరదేశముల నుండి వచ్చు చాంపేను బోర్డియా, ఎక్షాబ్రాంది, విస్కీలు సేవించితిమేని మనకు విశ్వసౌందర్యమలవడును. సిగరెట్లు మెదడును శుభ్రపరచి జ్ఞానాభివృద్ధిని జేయును. నాట్యస్త్రీలను బ్రోత్సహించుట లలితకళాభివృద్ధికే.

జమీలలో జమీరైతుల క్షేమము ముఖ్యము అని వారిముందు ఎవరయిన పలికిరేని ఆయన పకాలున నవ్వును. అట్లయినచో ప్రభుత్వమువారేల జమీందారీ పద్ధతి ప్రవేశపెట్టెదరు? రైతు వారీపద్ధతినే యుంచియుందురు. కాబట్టి జమీధనము చిత్తమువచ్చినట్లు జమిందా రుపయోగపరచుకొనవలయును. అప్పులు చేసిన జమీ పాడగుట యేల సంభవించును? జమీలు జమీందారుల పాలినుండి తప్పింపకూడదట! జమీందారులు శాశ్వతబ్రహ్మకల్పముగ జమీల గట్టుకొని యూరేగెదరా? బ్రతికియున్ననాళ్లు ననుభవించవలెను. తరువాత వేరొకనికి బోవుగాక! ఈ సంపద ఎల్లకాలము నొక్కరే యేల అనుభవింపవలెను? జమీ లమ్మకూడదని శాసన మెందుకయ్యా? అని జగన్మోహనరావు వాదించుకొని తన్ను తాను సమాధాన పెట్టుకొనుచుండును. ‘ధనము ననుభవించుట నెఱుగని కాశ్మీరగార్దభములు, అనుభవించు నాబోట్లను భోగలాలసులనియు, విలాస పురుషులనియు నిందింతురు. దూషణ భూషణ తిరస్కారములు దేహమునకు గాని యాత్మకు గావు. నేను బహుసహస్రనారీ పరివేష్టితుడగు గోపాలకృష్ణుడను’ అని యనుకొనుచు జగన్మోహనరావు విశాఖపట్టణములోని తన మేడనుండి దిగి, వీథిలో వేచియున్న కారులోనికి నెక్కెను. వారు వేగముతో నా శకటము సముద్రతీరమున ‘డాల్ఫినుముక్కు’ వైపుననున్న మాక్లిన్ జేమ్సు ఆను నొక యూరేషియను గృహస్థునింటికడ నాగెను. జగన్మోహనరావు పాలిపోయిన తెలుపునగలియు పసిమివర్ణమువాడు. సున్నితమగు పలుచని మేనివాడు. కోలనగు మోము, కొంచెము బుర్రముక్కు, ఫ్రెంచి మీసములు, పెద్దనోరు, చిన్నచెవులు, సూదివలెనున్న గడ్డము, ఉంగరములు చుట్టియున్న తుమ్మెదరెక్కలవంటి జుట్టు, విపరీతముగా నెత్తైన ఫాలము నా యువకునకు వింతసొబగు సమకూర్చినవి. ఆతనికడ జమీందారీఠీవి యున్నది. జమీందారీహృదయ మున్నది. ఇంగ్లండు దేశములోనున్న ప్రభువుల వలె దా నుండవలయునని యాతనికోర్కె. డైమ్లరుకారు, పియానో వాద్యము, గిండీ పోటీపందెములకు నొక యరబ్బీగుఱ్ఱము, నెలకు డెబ్బది రూపికలకొక యాంతరంగిక మంత్రి, వేసవికాలములో ఊటీ ప్రయాణము, గోల్ఫుఆట,

ఇంగ్లీషు నాట్యము, పాశ్చాత్య వేషము ...... ఇది వారి రాచఠీవి.

విశాఖపట్టణములో ఆగస్టు నెలలో ఆనాటి సాయంవేళ తన డ్రైవ్లరు కారునుండి మార్క్లిన్ జేమ్సుగారి ఇంటిలోనికి బోవగనె, యాతని సహోదరి డయానా జేమ్సు జగన్మోహను నెదుర్కొని తన రెండుచేతు లాతని కందీయ జగన్మోహను డా యువతిని బిగియార కవుగిలించి తనివోవ ముద్దుగొనెను.

'మోహన్! కొంచెం ఆలస్యం అయిందే! నువ్వు సరిగా వేళకు వచ్చే వాడవు, ప్రాణప్రియా?'

'ఒక చిన్న వ్యాపారం వల్ల ఆలస్యం అయింది. ప్రియతమమైన డయన్! క్షమించు. ఎప్పుడు నీ పెదవుల ద్రాక్షసుధారసము త్రాగుదామా అని ఉవ్విళ్ళూరుతూ నిముషానికొక యుగంగా లెక్క చూసుకుంటూ చెన్నపట్నాన్నుంచి వచ్చాను. రెక్కలు కట్టుకొని నీ దగ్గర వాలా!'

'నీ గుఱ్ఱం బొబ్బిలిపందెములో మూడవదిగా వచ్చినందుకు చాలా సంతోషం అయింది. నీకప్పుడే తంతినిచ్చా! ముందుసంవత్సరం 'గవర్నరు' పందెములో మొదటిదిగా వస్తుంది.'

'ఆ! ఈయేడు గవర్నరు పందెంలో మొదటిదిగావచ్చిన 'హ్యాపీ వారియర్' గుఱ్ఱాన్ని స్వారీచేసిన బ్రౌను కిప్పుడే కంట్రాక్టు ఇచ్చాను. ప్రసిద్ధి కెక్కిన రెయినాల్డ్సుకు గుఱ్ఱాన్ని తయారుచేయుటకు అప్పజెప్పివచ్చాను షికారు రా! డయన్.'

మరల నామె నాతడు గ్రుచ్చి గౌగిలించుకొని, గబగబ పెదవి, కన్నులు, మెడ, చెవులు ముద్దిడుకొనెను.

వారిరువురు కారులోనికిబోయి కూర్చుండబోవుచుండ జేమ్సుతల్లి లోపలి నుండివచ్చి త్వరితముగ దిరిగిరండని చెప్పిపంపినది. జేమ్సింకను వివాహము చేసికొనలేదు. తల్లిదే ఇంటి పెత్తనము. ఆమెయే డయానా జగన్మోహనులకు సంబంధము కలిపి యద్దాని నానాటికీ వృద్ధిచేసినది. జగన్మోహనుడు డయానాకు నెలకు రెండువందలు జీతమిచ్చును. అప్పుడప్పు డాతడిచ్చు బహుమతులు మొత్తము సాలుకు మూడు నాలుగువేల రూపాయల ఖరీదుండును. డయానాకన్య సుందరి. ఆమె దేహకాంతి దంతమువలె స్నిగ్ధమైన తెలిపసిమి కలది. ఆమె పెదవులు రంగులేకయే ప్రవాళములవలె నెఱ్ఱనై తేనె లూరుచుండును. పొట్టియైనను, మంచి యవయవస్ఫుటత కలిగి 'చక్కని జంతువు' అని యూరేషియను యువకులచే బొగడ్తలందినదామె. ఈతలో, టెన్నిసుబంతి ఆటలో, నాట్యములో నామెదే ముందంజ. పియానో అద్భుతముగ వాయించగలదు. ఆమె గొంతు ---మగు 'సొప్రానో' స్వరము కలదియట. వాల్టేరులో జరుగు క్రిస్మస్ వేడుకలలో నామెయే నాయకురాలి వేషము వేయును. సంగీత ప్రదర్శనములో నామెదే ముందంజ. వాల్టేరు విశాఖపట్టణముల పాశ్చాత్యులలో యూరేషియనులలో నవనాగరికులలో నామె నాసించని పురుషుడొక్కడును లేడు. అట్టి తరుణమున నామె శ్రీమంతుడగు జగన్మోహనుని వరించినది.

వారి కారు సింహాచలము రాచబాటపై నలమండ మొదలగు గ్రామములు దాటి భీమునిపట్టణము వెళ్ళినది. వారు బండి దిగి సముద్రతీరమున నడుచుచూ ఏకాంత ప్రదేశమునకు జని యా సైకతముపై నధివసించిరి. వారపరిమిత మోహావేశులై యా చీకటిలో తారకాకాంతులలో సముద్రము గంభీర సంగీతము పాడుకొనుచుండునప్పుడు సర్వము మరచిపోయిరి.

కొంతసేపటికి వారు నర్మసంభాషణము లాడుకొనుచు మందహాసముతో మరల బండినెక్కి యెనిమిది గంటలకు విశాఖపట్టణమువచ్చి చేరుచు, వాల్టేరులో రొజారియొ యను గార్డు గృహముకడ నాగి గార్డు దంపతులను వారి బాలికను కనుగొనివచ్చిరి. ఆ రోజున జేమ్సు ఇంటికడ జగన్మోహనునకు విందు. జగన్మోహనునకు గొడ్డుమాంసముతప్ప తక్కిన మాంసాహారము భక్షించు నలవాటు లేదు. మాక్లీను దన హృదయము చూరగొన్న రొజరియో కూతురు, ఆమె తల్లిదండ్రులను వాల్టేరునుండి విందుకు బిలిచినాడు. వారికై మాక్లీను నాతని తల్లియు నుచిత వేషములతో నెదురుచూచుచుండిరి.

జేమ్సు మాక్లీను ఇంటి ముందరి వసారాలో గోడలకు నీటిరంగు చిత్రములు, పెద్దపులి తలలు, బల్లెములు, బాణములు తగిలించియున్నవి. పరుపు, కుర్చీలు, బల్లలు, బల్లలపై చీనాదేశపు ఇత్తడి కూజాలు, కూజాలలో పుష్పములున్న కొమ్మలు అలంకరింపబడి యున్నవి. గుమ్మములకు డమాస్కును తెరలు వేలాడదీయబడియున్నవి. దూరముగా నా వసారాలో బల్లలపై దీపము లిరు ప్రక్కల వెలుగుచున్నవి. మనవా రందఱు కుర్చీలపై నధివసించిరి. ఆ రోజు మెయిలులో జరిగిన యొక వింతనుగూర్చి మిస్టర్ రొజారియొ చిరునవ్వుతో డయానావైపు తిరిగి చెప్పుచుండెను. డయానా తల్లియు, మిసెస్ రొజారియొ యు దక్కినవారికి వినబడకుండ నేదియో చెప్పుకొనుచుండిరి. జేమ్సు తన బాలిక ఫ్రాన్సిస్‌ను దీసికొని తోటలోనికి నాలుగడుగులు పచారు చేయుటకు వెళ్లి యా నడకలో నామె చెవిలో ‘నా హృదయం నీ కర్పించాను. ఏమి చేసినా నీదే భార’మని యస్పష్టముగ గాఢవాంఛాగద్గదికమైన స్వరమున జెప్పుచుండెను. జగన్మోహనుడు డయానా యందము కన్నులార గ్రోలుచు తన్మయు డగుచుండెను.

ఇంతలో దేశవాళీ క్రిస్టియను బట్లరు వచ్చి యందరకు షెర్రీద్రాక్షాపానీయము గాజుగ్లాసులలో నందిచ్చెను. అందరు నది నెమ్మదిగా త్రాగినారు.

డయానా దుస్తులుమార్చి భోజన సమయోచితమగు గౌను ధరించుటకు లోనికి బోయినది. జగన్మోహనుడు, సేవకుడు తన దుస్తు లొక తోలు పెట్టెలో కొనిరా, నవి ధరించుటకు లోనికి బోయెను.

తొమ్మిదిగంటల కందరు విశాలమగు భోజనమందిరమునకు బోయి యచ్చట మందిరమధ్యమున నమర్చియున్న మేజాబల్ల చుట్టు నధివసించినారు. బల్లపై తెల్లటి దుప్పటి పరచి, యందు పదికొవ్వువత్తి దీపపుబుడ్లు వెలిగించినారు. బల్ల పెద్ద కోడిగుడ్డాకారమున నున్నది. ఒడిలో నేపదార్థము పడినను దుస్తులు పాడయిపోకుండ కప్పుకొనుట కై మడతలిడి యుంచిన తెల్లని రుమాళ్ళు తీసికొని యందరు నొడులపై నడ్డముగా బరచుకొనిరి. ప్రథమమున వారందరు ద్రవ పదార్థము పుచ్చుకొందురు. అయ్యది యెముకల రసములో బోపు వేసినది. తర్వాత కోడిపిల్లవంటకము, కాబేజీ మధురము మొదలగు రుచ్యములైన పదార్థము లొకటివెనుక నొకటి తీసికొనివచ్చుటయు వారందరవి పుచ్చుకొను నుండిరి. మధ్యమధ్య చాంపేనుపానము సోడాతో కలిపి త్రాగుచుండిరి.

పదిగంటలన్నర యగునప్పటికి భోజనములు పూర్తియైనవి. పిమ్మట వారు చిత్రవిచిత్రములుగ తయారు చేసిన చాంపేనుబ్రాంది, విస్కీ బోర్డియో ద్రాక్షాది పానములు త్రాగి యానందించినారు.

డయానాను పియానో వాయింపుమని జగన్మోహనుడు ప్రార్థించెను. వారందరు సంగీతపు గదిలోనికి బోవుటయు, డయానా పియానో వాయించుచు నతిశ్రావ్యముగ బాడినది.

పిమ్మట డయానా వాయించుచుండ ఫ్రాన్సిస్‌కన్య కొంతసేపు పాడినది. పాశ్చాత్య సంగీతము పాడుటలో వాయించుటలో యూరేషియను జాతివారు చాల ప్రసిద్ధి చెందినవారు. యూరపియనుల సభలలో, వీరు పోయి మధురముగ బాడి వారిహృదయముల రంజింపుచుందురు.

పాశ్చాత్య సంగీతమునకు భారతీయ సంగీతమునకు మూల మొక్కటియే యైనను భారతీయ సంగీతసంప్రదాయ మొకమార్గమున ప్రవహించి మహాద్భుతముగ విజృంభించినది. ఆ మార్గముననే కొంతవరకు నడచిన పాశ్చాత్య గానవిద్యా సంప్రదాయ మంతటితో నాగిపోవ, నూతన సాంప్రదాయమును నిర్మించి జర్మనుజాతి యా గానమునకు క్రొత్త జీవము పోసినది.

భారతీయ సాంప్రదాయము రాగతాళముల ననేకరీతుల వృద్ధిచేసినది. పాశ్చాత్య సంప్రదాయము శ్రుతిని వివిధమార్గముల బెంపొందించినది. వారికి శ్రుతి ముఖ్యము, శ్రుతి సర్వము. దానికై వారు రెండుమూడు రాగములనే తీసికొన్నారు. భారతీయ సంప్రదాయము రాగము లెన్నియేని సృజించు కొన్నది. తాళభేదముల వృద్ధి చేసినది.

౮
యూరేషియను సాంగత్యము

జగన్మోహనుడు భారతీయ గానసాంప్రదాయము విని యానందించలేడు. పాశ్చాత్య గాంధర్వమేనియు నాతని హృదయము గరిగింపలేదు. బడాయి కొరకు, గౌరవము కొరకు మర్యాదకొరకు నాతడు వినినట్లు నటించును. కాని మనస్సులో దన యాలోచనలలో నాతడు మునిగిపోవును. ఆడువారు, అందులో పడుచువారు కచ్చేరీ చేయునపుడుతక్క, నాతడు గానసభలకేగడు. పాడునట్టి యామె కన్నుల దిలకించును. కంఠము, పెదవులు, వక్షము గమనించుచు వివిధభావపథముల విషయలోలుడై యానందించును. లోకముమాత్రము జగన్మోహనరావుగారికి సంగీతమన్న పరమప్రీతియని ముచ్చటించుకొను చుండును.

డయానా పాడుచున్నంతసేపు నామె గంభీర నిషాదకంఠము నాలకించుట మాని యామె కంఠసౌందర్యము, గిరజాలవలె కత్తిరించియున్న యామె జుట్టు మెలికలు గమనించుచు, నా ప్రోఢ తనకు ప్రియురాలగుటకు తానెంతటి యదృష్టశాలియో యని తన్ను దా మెచ్చుకొనుచుండెను. ఈమెను పెండ్లి యాడుటయే ధన్యత యనుకొనెను. తనకన్న రెండేడులు పెద్దయైన నేమి, అట్లెన్ని వివాహములు పాశ్చాత్య దేశములలో జరుగుట లేదు? నిజమైన నాగరికత వారికడనే యున్నది. వారివలె జీవించుటకన్న మానవుని బ్రతుకున కింక నేమి సౌందర్యము కావలెను? ఈమె యూరేషియను బాలికయని కొందరు తన్ను నిరసించవచ్చును. ఇంగ్లీషు బాలికలకన్న నీమె మిన్న యైనపుడు ఈ స్త్రీరత్నము నేల గ్రహింపరాదు? చెన్నపట్టణములో జదువుకున్న ఈ బాలిక విద్యావంతురాలు. తన తల్లి యొప్పుకొనక కొంచెము గడబిడ చేయు మాట నిజమే. ఆమె యెంతసేపు జమీందారీయెత్తుగల సంబంధము కావలయునని కోరును. ఇంగ్లండు దేశములో గూలివా డీ దేశములోని జమీందారులతో సమానము. వారితో సమానమగువారే యూరేషియనులు. అట్టిచో తల్లి యెట్లభ్యంతర పెట్టగలదు? ఇక జాతి మతముల మాటయా? బ్రాహ్మణులకన్న యూరేషియను అన్ని విధముల గొప్పవారే కద! డయానా యెంత సంతసించును? ఆ సుకుమార శరీర, యా దివ్య సుందర విగ్రహ తనకు బ్రియతమయగు భార్యయై, తన జమీకి రాణియై, తన భవనములో జక్రవర్తినియై సంచరించుచుండ చూచిన వారు పరమపవిత్రులైపోదురు. తన మేనత్త కూతురు ముద్దుల

మిటారి, శారదను తాను పెండ్లియాడక పోవుటచే ఆ పల్లెటూరి పందకు, ఒరాంగు ఉటాంగుకోతి కీయవలసిన యగత్యము సంభవించినది యని మేనత్తకు కోపము గావున, తానీ భూలోకరంభను పెండ్లిచేసుకొన్నచో మొదట నీసు చెందినను తన్నతి ప్రేమచే జూచు మేనత్త చివరకు నొప్పుకొని తీరును. ఇంక నామె భర్తయా? ఆయన యనుమతి యెవరికి గావలయును? తన బాలికను తనకిచ్చుట కిష్టములేక పోయినదట. ఆయనకు యిష్టములేక, తుదకు పొలముదున్ను దున్నపోతు కిచ్చి వివాహము చేసినాడు. అట్టివాని యంగీకారముతో దనకు నిమిత్తములేదు.

సంగీతము పూర్తియైనది. పన్నెండు గంటలయినది. డయానా గ్రామ ఫోను తీసి 'హావైను' నాట్యగీత మొకటి తగిలించి జగన్మోహనుని నాట్యమునకు రమ్మని పిలిచెను. జేమ్సు ఫ్రాన్సిసుకన్య నడిగెను. ఆ పడుచుజంటలు పాశ్చాత్య 'జాజు' నాట్యానందములో మునిగిపోయినారు. పదునేను నిముషము లట్లు పరమ సంతోషపూరితులై నాట్యమాడి తక్కినవారితోబాటు వచ్చి కూర్చుండిరి. 'జాజు' 'వాల్టుజు' మొదలగు నాట్యములం దొక పురుషుడు నొక వనితయు గలసి నాట్యమాడవలెను. పురుషుడు వనిత నడుముచుట్టు గుడిచేయినుంచి కవుగిలించుకొని ఎడమచేతితో నామె కుడిచేయి పట్టుకొనును. పల్లవాధరియు పురుషుని భుజముపై ఎడమచేయి నుంచవలెను. ఆ సంశ్లేషముతో తాళమునకు సరిపోవునటు లడుగులు గలుపుచు చిత్రగతుల నాట్య మాడెదరు.

జగన్మోహనుడు యూరేషియనులుకూడ మెచ్చునటుల నాట్యమాడ గలడు. అతనితో నాట్యమాడుటయన్న యూరేషియను సుందరీమణులకు నెంతయో ప్రీతి.

వారందరు కూర్చుండిన వెనుక యూరేషియనుల దుస్థితిగూర్చి యావద్భారత యూరేషియను సంఘనాయకుడగు కాల్నెల్ గిడ్నీగారు కలకత్తాలో నిచ్చిన యుపన్యాసమునుగూర్చి చర్చవచ్చినది. 'ప్రపంచములో నెవ్వరి స్థితియైన విచారకరముగ నున్నదన్న నది భరతదేశపు మన యూరేషియనుల స్థితి. మనల భారతీయులు దరికి జేరనీయరు. పాశ్చాత్యులదృష్టిలో మనము సంకరులము. శుద్ధయైరోపీయ రక్తము మనవారి నాడుల బ్రవహించుటలేదట. ఇటుల నీ రెండుజాతులచే నిరసింపబడిన మనము తీవ్రముగా మన కర్తవ్యము, మన భావిభాగ్యోదయమును గురించి యాలోచింపవలయును. హిందూ దేశములో మన జనసంఖ్య చాలాతక్కువ. మనమును కొలదికొలదిగ దేశమెల్లడ నున్నాము. కావున మనవోట్లెవరికి నుపయోగములేదు. మనకు స్థానిక సంస్థలలోగాని శాసనసభలలోగాని సరియైన ప్రాతినిధ్యము లేదు. మనవా రెందరో రైలు కంపెనీలలో బండినడుపువారుగా, గార్డులుగా, టిక్కెట్టు పరీక్షచేయు వారుగా, స్టేషనుమాస్టర్లుగా, ఇంజను పారిశ్రామిక స్థానములలో పనివారలుగా నియమింపబడియున్నారు. రైలుమార్గము లింగ్లీషు కంపెనీల చేతులలో నున్నంతకాలము మనవారి యుద్యోగముల కంత భయములేదు. అవియన్నియు బ్రభుత్వమువారిచేతికి వచ్చి ప్రభుత్వము ప్రజారాజ్యమైనచో మన గతియేమి? ఇప్పటికి రైళ్ళకంపెనీలలో భారతీయు లెక్కువగా నియమింపబడవలయునని సంచలనము కలిగినది' అని చెప్పినాడు గిడ్నీ జ్ఞాపకమున్నదా?' యని రొజారియో వాక్రుచ్చినారు.

జగన్మోహనుడు: అవునండి. కాని యూరేషియనులు సర్వవిధముల యూరపియనులతో సమానము. వారి సంతతియే అయినప్పు డేల యూరేషియనులకు భయముండవలయునో నాకు గ్రాహ్యమగుట లేదు.

రోజారియోసతి: మన దేశ మింగ్లాండుదేశము. ఎప్పటికైనా మన మక్కడకు వెళ్ళవలసిన వారమే. పాపం! ఇంగ్లీషు ప్రముఖుడొకడు సెలవిచ్చిన సంగతి నీవు వినలేదు.

'అటు ఇంగ్లీషువారికి, ఇటు హిందూ దేశస్థులకు గూడ కాక యూరేషియనులు రెంటికీ చెడిన రేవడలైపోయినారు' అని.

జగ: మీరంత యనవసరముగా భయపడుటకు నాకు గారణము కనబడుట లేదని ఇదివరకే చెప్పినాను. ఈ బ్రిటిషు ప్రభుత్వము పోదు. ఈ ప్రభుత్వ మున్నంతకాలము మనకు భయములేదు.

జేమ్సు: ఆలాగున మనం అనుకొనుటకు వీలులేదులే, రాజబహదూరూ! ఏనాటికైనా మనము భారతీయుల మనుకోవాలి.

ఫ్రాన్సిసు: భారతీయులు మనల జేరనీయరని అంటున్నారుగాదా!

జేమ్సు: అవును. అందుకనే మనం ఇంగ్లీషువారి ప్రియశిశువులముగాన భారతీయులకన్న గొప్పవాళ్ళము; మనల కూరుచుండబెట్టి వారందరు మనల బోషించవలయునన్న పిచ్చియాలోచన లిక మనం మానివేయవలయును. భారతీయులు వారి యభివృద్ధికై సలుపు నన్ని ప్రయత్నములలో మనము పొల్గొనవలయును. ఆ యుద్దేశముతోడనే రైలులో నుద్యోగములు చేయు మనవారందరు తక్కిన భారతీయులతో గలసి పనివారి సంఘము లేర్పరచినారు. సమ్మెలు మొదలైన వాటిలో వారితోబాటు మనవారును కష్టపడి పనిచేయుచున్నారు.

కొజా: జేమ్సు చెప్పినది బాగున్నది. మనం ఈ దేశములో బుట్టినాము. ఈ దేశములో ప్రాణాలర్పించి, ఈ మట్టిలో గలిసిపోవుచున్నాము. ఇంగ్లీషు వారుకాని, ఫ్రెంచి జర్మను వారలుగానీ మనల వారి యింటికి భోజనమునకు బిలుచుచున్నారా? మనతో సంబంధ బాంధవ్యముల నెరపుచున్నారా? మన కిత రాధారములు లేవు. రెక్కలే యాధారములు. అయినప్పడు మనము భారతీయులు సలుపు స్వరాజ్యాందోళనములలో వారికి వ్యతిరేకముగ బనిచేయకుండ, మన నాయకులతో మన సాధకబాధకములు చెప్పుకొని వారి ప్రేమ సంపాదించుకొనవలయును. ప్రభుత్వమువారికి మన కృతజ్ఞత, మన రాజభక్తి వెల్లడించి వారిదయకు బాత్రులమును గావలయును.

డయానా: మీరు చెప్పినది బాగున్నదండీ. కాని తీరా కాలం సమీపించే సరికి వీరూ మనల ద్రోసిరాజనెదరేమో? రొజా: ఆ చిక్కు రాకుండగ తప్పుకొనుమార్గమే నేను చెప్పునది.

డయానాకు వీరి సంభాషణచే విసుగు జనించి తాను సీతాకోకచిలుక నాట్యమాడెదనని తెలిపి ఫిడేలువాద్యము వాయించగల తన యన్నగారిని ఫిడేలును, తన తల్లిని పియానోను వాయింప నియమించి, గెరార్డుబ్లాండెల్లో రచించిన 'సీతాకోకచిలుక' గీతముయొక్క స్వర ప్రస్తారము గుర్తుగల కాగితములు తెచ్చియిచ్చెను.

వారిరువురు వాయించుచుండ డయానా సీతాకోక చిలుక రంగుగల సన్న శాలువ రెక్కలుగబట్టి విచిత్రనాట్య మొనరించినది. ఆ నృత్యమున వారందరు తన్మయులై యుండ టింగ్ మని యొంటిగంట కొట్టినది. నాట్య మాగినది.

జగన్మోహనుని మోటారుశకటముపై రొజారియో దంపతులు, ఫ్రాన్సిస్ కన్య వెడలిపోయిరి.

జగన్మోహనుడు డయానాకన్యతో మేడమీద గదులలోనికి బోయినాడు.

జేమ్సు ఆ చీకటిలో సోఫాపైన కూర్చుండి స్పెన్సరుచుట్ట కాల్చుచు నేదో యాలోచనలో మునిగిపోయినాడు.

౬
పొలం

సత్తెయ్యకు భార్య కొత్తగా గాపురమునకు వచ్చినది. పదునేడేండ్ల వయసుకత్తె. చామనచాయ. బిగువయిన యవయవములు, సోగచూపులు, స్ఫుట రేఖలుగల మోము, నవనవలాడు నూత్నయౌవనములోనున్న యామె పంట లక్ష్మివలె నవతరించినది. సోమయ్య ఇల్లు పావనమైనది. ఆతడా పేదయింటి పడుచు రూపు రేఖలకు వలచి కోడలుగా వరించి తెచ్చుకొనెను.

'ఒక నూరురూపాయలు కట్నం తేస్తే నిండిపోతాదా? మన అదురుట్టం బాగుండాలి గాని, అదురుట్టం లేకపోతే కోడలు యెయ్యిరూపాయలు కట్నం తెచ్చినా అత్తింటిలో అడుగెట్టిందా అన్నీ భగ్గున మండిపోవడమే. మాకోడలు మాలచ్చే; చూస్తుండండి. మావోడి జల్మ పావనం అయిపోతాది!' అని సోమయ్య తన చుట్టాలతో జెప్పికొన్నాడు. వెండివడ్డాణం, దండకడియాలు, పిల్లకాసులపేరు పెట్టుకొని చిరునవ్వు నవ్వుచు 'పల్లెటూరి కాపుబాలయైనదా లక్ష్మి' యని అనిపించునట్లు సూరమ్మ సుబ్బారాయుడిగారి దొడ్డిలో బ్రత్యక్షమైంది.

జానకమ్మగారికి, సుబ్బారాయుడుగారికి నూత్నవధూవరులచే నమస్కారములు చేయించుటకు దీసికొనివచ్చినప్పుడు, సుబ్బారాయుడుగారు నూరురూపాయలు వారికిచ్చి, సంసారమునందలి కష్టసుఖములు వారికిబోధించి, భార్య మనస్సు నొవ్వకుండా పువ్వులలోనుంచి కాపాడుకొనుచుండవలయును అని సత్తెయ్యతో జెప్పుచు 'దీర్ఘాయురారోగ్యాభివృద్ధిరస్తు, దీర్ఘసుమంగళీభవ, పుత్రపౌత్రాభివృద్ధిరస్తు' అని దీవించినారు. 'అమ్మాయీ, అత్తగారికి, మామగారికి, మగనికీ మనస్సు నొవ్వకుండా సంచరించుకుంటూ ఉండు. వారికి సేవచేసి మెప్పుపొందు. ఈ రూపాయలు పెట్టి వీరికి నగలు చేయించి పెట్టరా సత్తెయ్యా! నీ తల్లికడుపు చల్లగా నీ అత్తకడుపు చల్లగా పిల్లల్నీ మనుమల్నీ యెత్తి వేయికాలాలకు మీరంతా చల్లగా ఉండండి' అని ఆశీర్వదించి జానకమ్మగా రొక చీరెయు రవికెలగుడ్డయు పసుపు కుంకుమ పళ్ళు కొబ్బరిబొండములు పెండ్లిగూతునకు నిచ్చినారు.

మరునాడు సోమయ్య యుదయముననే యూడ్పు పొలముల కలుపు తీయించుటకు వెళ్ళినాడు. బుడమ, కొణామణి, ఆట్రగడా, అక్కుళ్ళు, కృష్ణ కాటుకలు సుబ్బారాయుడుగారి ఇంటిఖర్చుకై పాలాట్రగడము నూడ్చినారు. చేలన్నియు బాగుగా పెరిగినవి. ఇదివరకే యెనుబది ఎకరములకు కలుపు తీయించినారు. తక్కిన యిరువది యకరములలో పదిమంది మాలవాండ్రు నితరులు కలుపు తీయుచుండిరి. సోమయ్య తాటియాకుల గొడుగు వేసికొని గట్టుమీద కూర్చుండి పని చూచుచుండెను.

మాలపెద్ద ముసలినాగడు 'యీ రోజులలో కుఱ్ఱోళ్లు పని చేయగలరంట్రా! ఆడు సూడు, యెదవనాయాలు. కబుర్లేగాని, పనిలేదు. వంగండఱ్ఱా వంగండి? యని కేక వేసెను.

సోమయ్య: ఒరేయి! పోతుగోయ్! ఏవిట్రా అదీ! కలుపు తెంపుతున్నావా, మేస్తున్నావా? వెదవబద్ధకాలా? యేళ్లలోంచి లాగరా! మళ్ళీ పెరగవంట్రా! ఓరే నాగన్నా ఆడిపని సూడరా. సరీగ్గా చెయ్యకపోతే ఈ వాళ కూలి సున్నే. ఆ ఆడపిల్లల్ని చూసి బుద్ధి తెచ్చుకోరా కుంకన్నా,

యీా పిరగేస్తాను.

నాగన్న: బాబూ! యీాళ్ల పని మజాఅయిపోతోందండా! పెద్దోళ్ళ మాట యింటారా యావన్నానా?

సోమన్న: ఒరే పెద్దమాలా మంచికథ చెప్పరా! అది వింటూ పని సురుగ్గా చేస్తారు. మట్టగిడసల్లా ఉన్నారు. పనంటే తొంగుంటారు.

నాగన్న: మరి రాగంతో సెప్పేత్తాబాబూ! ఆళ్లందరిని కలిసి ఊకొట్టమనండీ!

అందరు: తప్పక, ఆ! ఆ.........! (అని కూనిరాగంతో ఊకోట్టుచుండిరి.)

నాగన్న కథ దీర్ఘంగా చెప్ప నారంభించెను.

'అనగనగా ఓ దేచంలో ఓపట్టణముందా' 'ఆ పట్టణానికి పరుగుదూరంలో పెద్ద మాలపల్లి! ఆ పల్లెలో రెండు వందల గుడిసెలు, ఓదాని పైన ఓటెక్కి, ఉక్కిరి బిక్కిరిగా ఉన్నాయా.'

'ఆ:....!'

'ఓ మాలపల్లి పెద్దమాలోడు! ఆడు పూర్వం రాజులనుంచీ ఆరికి కాపలా కాసుకుంటూ సాకిరీ చేసుకుంటూ, నమ్మకంగా పెబువువోరి మణుసొచ్చిన బంటై ఉన్నాడా.'

'ఆ:...!'

'ఓ రా పెద్దమాల యెంకటిదాసుకు భూమి, బుట్ర, పశువులు, పెంకుటిల్లు, సిరి సంపద యేసీ యెయకుండా ఉన్నా ఓడు ఎల్లిబణాతుగోచెట్టి, ఎండి పొన్నుకర్ర సేతబట్టి, యీాదెంట యెల్తావుంటే యెలాగుండేది! అతగాడికి మాబగితి, పొద్దత్తమానం బజినేలు, సదువుకోడం, పాడుకోడమున్నూ. అతగాడికి దైభముగొంతెమ్మల్లాగో, పాండవులోరిలాగో కిట్టమూతిలాగో కనబడే వోడంట. అతగాడిమాట నిజమైపోవాల. అతగాడు యిగిబూతి పెడితే దెయ్యాలు గియ్యాలు పారిపొయ్యేవి. సెయ్యెత్తితే రోగాలు సెదిరిపొయ్యేవి. అమ్మవోరిని పలకరిస్తే 'వూ' అంటదంటా...'

'ఆ:...!'

'అతగాడికి ఓకొడుకు, ఆడికి దేముడు దయ్యం గియ్యం బయం లేదు. ఆడికి దెయ్యాలకంటె బలం! రాక్షసుడులాంటిశగితి, బల్లూకం_అంటే ఎలుగుబంటిలాంటి పట్టు! ఆణ్ణిసూత్తే అందరికి బయమంటా!'

'ఆ:...!'

'మరిగంటే ఆడిపేరు మరకడు! మరకడికి ఆడపిల్లలంటే మణుసు. పయిటంటె పక్క లెగరేస్తాడు. రైక అంటే రంకెలేస్తాడు. ఇంతకొప్పెట్టి ఇంత కుంకుమెట్టి, చెవిలో తురాయిపూవు, మెళ్ళో గందం అలంకరించుకొని, చీర ఎనక్కుకట్టి, సంకకింద తట్టెట్టి, సంతలో కోమటాయనతో యేళాకోళాలాడి, కొబ్బరిచిప్పలో కొబ్బరినూనె యేయించి తలకు రాసుకొని, నవ్వుకొంటోయెళ్ళే నల్లపిల్లని సూసినాడంటే ఆడంతే ఆగిపోతాడు. పాణమైన యిచ్చేస్తుడా ...'

'ఆఁ...!'

'అయ్యబత్తిమాట తలచడూ, ఆడి మరియాద తలచడూ, ఆ పిల్ల యెనక బడి లంచమిత్తానంటాడూ, రయికలిత్తానంటాడూ, సీరలిత్తానంటాడూ, ముద్దెట్టే నాపిల్లా, నేనందంగా లేనంటే అని మిణకరిస్తాడు, మీసం తిప్ప కొంటాడు.'

'ఊఁ...!'

'కాలవరేవుకీ, పొలంలోకి, గడ్డికోతకాడికీ యెళ్ళే పిల్లల్ని చూస్తే, ఆంబోతు ఆవుల్ని చూసినట్లే. ఒంటిపిల్ల యెల్లిందంటే ఆడి మొగతనానికి కొండచిలవకి లేడిలా అయిపోతదే, నక్కపోతుకు కోడిపెట్టలా అయిపోతదే!' 'ఊఁ ...'

'ఆ మరకదాసు తండ్రి సెప్పినమాట యినడు, దర్మ పెబువులు సెప్పిన మాట యినడు, తలారి సెప్పినమాట యినడు, తన దాచ్చిణ్ణెం సెప్పినమాట యినడూ.'

'ఊఁ...!'

'ఆ పల్లెలో పెద్దోళ్ళు, సిన్నోళ్ళు, ఆడోళ్ళు, మొగోళ్ళు ఆ ముసలి మాలపెద్దతో మరకాయి సేసే దురంతాలు సెబుతుంటే, ముసలోడు పెద్దూపిరిడిసి కళ్లు సగం మూతలైపోగా, 'యీయాళ కాకపోతే రేపు, ఇంటికాడ కాకపోతే పొలంలో, మొగోడి సేత కాకపోతే ఆడదానిసేతే ఆడికి బుద్దొత్తది. ఆడు నా కొడుకుగాడు, మనిసిగాడు, ఆడిసేటు ఆణ్ణి కొట్టేస్తది' అని సెప్పినాడురా.'

'ఆఁ...!'

'మరకడే దున్నపోతంటే. ఆడికి సేగితులు, దురిబోదనుడికి శకుని గాడు కరుణాడులాగ! రాబణాసుడికి కడగరోముడు, కుక్కతలోడు కుంబ కరుణాడులాగ! పది పిచ్చి కుక్కల్లాంటి బలగం ఉందిరా.'

'ఆఁ!'

'ఆ మాలగూడేనికి పెద్ద యీరమ్మ సెరువుపక్క, యెట్టి యీరన్న గుడిసుంది. ఓరందులో నీలాలు ఆడి కన్న కూతురుంది. అది గ0టే గంగన్న బారియంట. గంగన్న మరింకో మాలపల్లికి యెట్టివోడంట. దాన్ని సూత్తే మైనంగోరువంక సిగ్గుపడాలి. బేతాళుడు గుడిలో నున్నగా తోయిన బాకులా తళ తళ లాడేటి వొళ్లు, లేత రావాకు అరసేతులు, సెంగలువకాడ సేతులు, సెందురుడులాంటి మొగమూ, నగచత్రాల్లాంటి పళ్లు, పిల్ల రెపరెపలాడిపోతూ గున్నమాయిడి సెట్టులా ఉండేదంటా!'

'ఆఁ!'

'ఒరే దాని మొగుడు ఒంగోలు కారాంబోతు; గోదావరి కాలవలాగ మాసోకైన మనిసంట. నీలాలుపిల్లా దాని బరత గంగన్నా రాయిసెట్టు యేపసెట్టు, తాడిసెట్టూ నల్లేరుతీగ, జంట పావురాలులో ఒకళ్లొకళ్ళు యిడవకుండా మా ఆపేచ్చంగా, మోగంగా ఉండేవోరు.'

'ఊఁ!'

'మొగుడు పనిమీద ఐదరాబాదెళ్ళితే, పుట్టింటికొచ్చింది. పెద్దపులికి ఆవు

కనపబడ్డట్టు, బెమ్మరాచ్చసికి మనిసి కనపడ్డట్టుగా, సక్కనైన నీలాలు మరకన్న కంట పడిందంటరా!'

'ఆఁ!'

'ఎప్పుడైతే నీలాలు పిల్లదాన్ని సూసినాడో ఆడిమనసు మనసులో లేదు. దీన్ని అనుబయించకపోతే జల్మం ఎందుకు, బలం ఎందుకు, పాణం ఎందుకు? అని అనుకున్నాడు. నీలాలు పిల్లదాని బాబుకి మాయిడిపళ్లు, సెకరకేళీలు, సీరలు, రైకలు పంపించేవోడు. నీలాలుతండ్రి అవన్నీ పట్టుకుపోయి కోపంతో ఆళ్లింటిలోనే పారేసి, యెంకటదాసుతో 'నీ కొడుకు సేసే దురన్యాయాలుకి మితుండటంలేదు. ఆడికి నువ్వు బుద్ధి సెప్పుకుంటే మాం అంతా సంతోషిస్తాము' అన్నాడు...!'

'ఊఁ ... !'

'ఓరోజున మరకడు, సెరువుకు నీరుకోసం ఒంటిగా ఎడుతూన్న ఆ సక్కనిపిల్ల నీలాలుదానిసూసి 'ఒలే నీకంటిమిద నామణను, నీ వొంటిమీద నా సూపు, నీ సేతులు, నీ నడుము, నీ అందం నన్ను నీ కుక్కను సేసినై. నువ్వూ నేనూ మారుమనువు సేసుకొందం, నీ మొగుణ్ణి తోలెయ్యే. ఆడికి ఎంత సొమ్మయినా తప్పు ఇచ్చేస్కుంటాను, నేనంతగా దేన్నీ బతిమాలలేదే. నీకు దాసుణ్ణి. నీ ముందర నా బలం అంతా నీరయిపోయింది. నన్ను రచ్చించుకో' అని దణ్ణం బెట్టాడు. నీలాలు బయపడి గజగజ లాడిపొయ్యింది. 'ఓరన్నా, నీ తోడుబుట్టిందాన్ని, నాయనా నువ్వల్లా అనవచ్చునంటరా ' అన్నాదుండి.'

'ఈలా ఒక సారికి రెండుసార్లు, మూడుసార్లు దాన్ని రెట్టించినాడంటా... లొట్టలేసినాడంట సివాల్న సీరకొంగు యిసిరిపట్టి సేయిపట్టుకొన్నాడంట.'

'ఆ ... !'

'సెయ్యి యిదిలించుకోని సెలపెయ్యలాగా పోతూన్న నీలాల్ని, యిడిపొయ్యేదాని కొప్పుసూసి ఒళ్ళు బిగి వొదిలేసినాడు. 'ఇది మామూలుగా లొంగదు, దీన్ని బలవొంతం సెయ్యాల్సినదే. మామూలుగా లొంగేది కాదురా మా గెట్టి మణసు. దీని పొంకవైన ఒళ్ళు నా ఒళ్లు నొక్కేస్కోవాల; దీన్ని ముద్దెట్టుకున్న వోడిజల్మమే జల్మం' అనుకున్నాట్ట.'

'ఆఁ ... !'

'ఆరి! ఓ రోజు సీకటడేయాల కుప్ప నూరుస్తుండే అయ్యకి కూడిచ్చేందుకు ఒంటిగా పొలం ఎల్లే నీలాల్ని సూశాడు. ఆడివొళ్లుప్పొంగిపోయింది. ఆడి కళ్ళెఱ్ఱబడినై. ఆడి గుండె జల్లుమందిరా నాయనా, పుంత దారిలో బైరాగుల సింతకాడ, ఆడు తన జట్టుతో దాంకోని ఉన్నాడు. దారికడ్డంగా నిలుస్సోని 'ఓసీ! నాదాన! నీ కన్నులు కరిగిపోను, నీ గుండె మరిగిపోను, నా సేతుల్లోకి రాయే!' అంటూ దానిమీదపడ్డాడు. ఆ సిన్నది లేడిలా ఒణికిపోయింది, బతిమాలింది, బయ మెట్టినాది. ఎలా తప్పించుకొందో, 'ఓలమ్మో, ఓలిబాబో, రచ్చించండో అన్నల్లారా!' అంటూ ఒకటే పరుగు, ముందు నీలాలు యెనక మరకడు ఆడి సేగితులు! మరీ యెల్లావచ్చిందో యెంకటదాసింటిలోకి వచ్చిపడ్డాదంటరా.'

'ఆఁ ... !' "యెంకటదాసు 'ఏటినాతలి! నీకు బయం లేదులే!' అంటూ గువ్వపచ్చిలా ఒణికిపోయే పిల్లను అదిమిపట్టుకొని, సల్లసల్ల కబురులు సెపుతూ ఇంటి తలుపు యెయ్యబోతూ ఉంటే మరకడుగాడు తలుపు తోసేస్కోని లోపలపడ్డాడు. ఆడు

దెయ్యంపట్టిన రాక్షసిలా ఉన్నాడు. అయ్యను సూసి ఆగిపొయ్యేడు. ఆడిసేగితులంతా గుమ్మందగ్గర నిలబడ్డారంటజ్జా!"

'ఆఁ...!'

'ఓ రప్ప డెంకటదాసు రామా! రామా! అంటూ 'ఓరి యెదవన్నా రాచ్చసీ, ఇంటిలోకి వచ్చావుంటే నీ పాణం పోతాది. నీ సేటుకాలం నీకింత తెస్తాఉంది. నా కడుపుకు సెడపుట్టినావురా! నాబగితికి యేరుపురుగువురా!' అంటూ రెండు సేతులూ సాసి మరకడి కడ్డంగా నిలబడిపోయాడు.'

'ఊఁ...!'

'తండ్రనిలేదు, దైభమని లేదు, బయమని లేదు, బగితని లేదు; తండ్రిని తప్పించుకొని, గజగజలాడిపోతూ మూలనుంచోని ఉన్న నీలాలుమీద పడ్డాడు. తండ్రి లాగబొయ్యాడు, తప్పించ పొయ్యాడు; తండ్రిని ఒక తోపుతో మూలకు పడేసేప్పటికి యెంకటదాసు గోనెబస్తాలాగు కూలబడిపోయినా డంట్రా!.'

'ఆఁ...!'

'మరకడు పిశాచంలా అయిపొయ్యాడు. నీలాలుదాని కోక యిప్పి పారేసి మూలకిసిరాడు. తళతళ లాడిపోయే దానివళ్ళు ముడుసుకుపోయింది. ఒరే మరకడు పందయ్యాడు, యాగ్రము అయ్యాడు, అడవిదున్నపోతు అయిపోయాడు. తనబట్ట యిప్పిపారేసికొన్నాడు. తండ్రి సూత్తున్నాడని లేకుండా, రాక్షసిముండకొడుకుల్లాంటి సేగితులు సూత్తున్నారని లేకుండా ఆ సిన్నదాన్ని కింద పండబారేసి మీదడిపొయ్యాడు...'

'ఊఁ...!'

'మూల సినిగిపోయిన గుడ్డలా, సీపురుగట్టలాపడి 'రామా! రామా! రామా! రామా! మహప్పెబూ రచ్చించు, రచ్చించు' అంటూ కళ్ళుమూసుకొని ఉన్న యెంకటదాసు కళ్లు తెరిసి చూసినాడు మరకడు దానిమీదడ్డము, ఆ పిల్ల సాయాశక్తులా 'ఓరిబాబో! యెంకడదాసూ! తండీ రచ్చించో!' అంటు ఆడికిలొంగకుండా తిరిగిపోడమున్నూ.'

'ఊఁ...!'

'హుమ్మని ఉగ్రుడై లేచాడురా యెంకటదాసు! ఆడికి యెయ్యి యేనుగుల బలము వొచ్చినట్లయిందిరా! అమ్మవోరి జాతరకు యేటపోతుల్ని తెగేసే యేటకత్తి గోడమీదెట్టిందాన్ని తీశాడు. 'అల్లల్లాభైరాహూం! ఆకాశ భైరాహుం అలలలలా! లలా! లలా!" అంటూ కత్తి మూడుసార్లుతిప్పి ఒక్క యేటుతో కొడుకు తలకాయ యేట యేసేసరికి తాటి సెట్టుమీంచి పండ డ్డట్టూ, తలకాయ మూల్నబడింది. మొండెము గిజగిజ కొట్టుకుంది. 'హుమ్ము! అలా! అలా!' అంటూ యెంకటదాసు ఆ రగతము ఒళ్లంతా రాసుకోనీ 'నేను భైరవుణ్ణి! నేను ఆంజనేయుణ్ణి! హుం!' అంటూ యాదిని బడ్డాడు. యొక్కళ్ళేని బలము, యెక్కళ్ళేని శగితి, పెద్దపులిలా, మరకడిగాడి సేగితుల్ని యెంటాడించి, దపా, తపా, ధం అంటూ పారిపొయ్యేవోళ్లని తరిమీ, తరిమీ యిద్దర్ని సంపేసినాడు. తక్కినాళ్లు 'ఓలమ్మో ఓఓ' అంటూ తలో దారిమీదా పారిపొయ్యేరు.'

'ఊఁ...!'

'ఆ ఉగ్గరం తగ్గలేదు. పెజలు యేనకుయేలు మూగారు. పొగలేశారు, కొబ్బరికాయలు కొట్టినోరు, కోళ్లనుజంపినోర్లు, రగతం మొగం మీద జల్లినోళ్ళు. అప్పుడు యెంకటదాసుకు పూనిన యారబద్ధుడు చల్లారాడు. అప్పుడు యెంకటదాసుకు మెలకూ వచ్చింది. కొడుకుని, ఆడి సేగితుల్ని సంపినానని తెలుసుకొని యెంకటదాసు 'శ్రీ రామా సీతారామా నీ కరుణా!' అంటు మంచమెక్కి రెండు రోజుల్లో ఆ భగవంతుడిలో ఐక్యమైపొయ్యాడు. నీలాలు మరకడెప్పుడు తన సీరిప్పేసి నాడో అప్పుడే మూరసపోయింది. ఆ మూరసలోంచి తెలివిరాలేదు, పేణం పోయిందిరా.'

'ఆ॒...!'

'ఓరి నీలాలు పాణం ఒదిలేసింది అని నీలాలు తండ్రికి తెలిసిందోలేదో ఆడుకత్తిపుచ్చుకొని బయలుదేరి, దారికాసి పుంతకాసి మరకడు సేగితుల్ని యావన్మందిని సంపేసి తాను నదిలోపడి నీళ్ళలో కలసిపోయినాడురా!!

'ఆ॒...!'

౧౦
పాలేర్లు

శంనోమిత్రః శంవరుణః శంనోభవత్వర్యమా
శంనఇంద్రో బృహస్పతిః శంనో విష్ణురురుక్రమః

భరత ఖండము పంటభూమి. చరిత్రయను మాయాపటమును తొలగించి చూడగలిగితిమేని యీగడ్డపై బుట్టిన ప్రజలు తొలినాళ్ళనుండియు కర్షక వృత్తినే ప్రధానముగ నమ్మియున్నారని తేట తెల్లము కాకమానదని సుబ్బారాయుడుగా రాలోచించుచు కూర్చుండినారు. 'ఓ వరుణదేవుడా! మా నాగేటిచాళ్ళను మేఘములను గొనివచ్చి తడుపుమా. ఓ ఇంద్రుడా! నీ సప్తవర్ణముల ధనువు మా మనముల కానంద మొనరింపుచుండ, మా పొలములను ఫలవంతము చేయుము' అను ఆర్యఋషుల సూక్తము లాయన హృదయమున ప్రతిధ్వనించినవి. సుబ్బారాయుడు గారు దేశమున జరుగు విషయముల నన్నింటి నప్పటి కప్పుడు కనుగొనుచునే యుండిరి. ఆంధ్ర, కృష్ణాప్రత్రికల నాయన చదివెడు వారు. ఆంధ్రదేశమున నేపత్రిక వెల్వడినను, దానిని సుబ్బారాయుడు గారు తెప్పించవలసినదే. ఆంధ్రప్రకాశిక తెప్పించినారు, మనోరమ తెప్పించినారు. ఆంధ్రభాషాభివర్ధనీ సమాజమునకు, విజ్ఞానచంద్రికా మండలికి నింక ననేక గ్రంథ ప్రచురణ సంఘములకు సుబ్బారాయుడుగారు చందాదారు. అన్ని గ్రంథములను బరిశీలనాపూర్వకముగ జదివి ఆయన మనన మొనర్చుచుండును, ఆయన సేకరించిన గ్రంథాలు బదివేలవరకు నున్నవి. ఆవి తనగుమాస్తాచే వరుస నేర్పరిచి సంఖ్య నియమించి గ్రంథాలయము చేసినారు. ప్రపంచమున యేయే దేశముల నేయే పంటలు పండునో వాని కనువగు పరిస్థితులేవో తెలిసికొనుటకు, ఆయన భూగోళ పాఠ్యగ్రంథములు పరిశీలించినారు. కావుననే పాశ్చాత్య విద్యలో గడిదేరిన నారాయణరావు, శ్రీరామమూర్తులుగూడ సుబ్బారాయుడు గారు తమలో జర్చచేయుచు చూపు వివిధ విషయజ్ఞానమునకు నచ్చెరువందు వారు. నారాయణరావుచే నాయన ఇంగ్లీషులోనున్న అర్థశాస్త్ర గ్రంథముల జదివించుకొని యర్థము చెప్పించుకొని అతనితో నాయావిషయములు విపులముగ చర్చించి యర్థముజేసికొన్నారు. ఆయా దేశములందు భూములపై రాబడి యెంత యైనది, పన్నుల మొత్త మెంతయైనది, పన్నులకు రాబడికి గల సంబంధమేమో విపులముగ జర్చచేసినారు.

భరతదేశమున నన్నిటి ఖరీదులతోపాటు భూమి ఖరీదులును బాగుగానున్నవి. యుద్ధము మొదలిడిన నాటినుండి ఖరీదులు మఱియు పెరిగిపోయినవి. భూమి ఖరీదులు బాగుగా నున్నవని ప్రజలు అధికవ్యయము సేయ నారంభించినారు. అధికవ్యయ కారణమున నప్పులు పెరిగిపోతున్నవి. సుబ్బారాయుడుగారు దేశ మెక్కడకు బోవుచున్నదో యని యనుకొన్నారు. వడ్డీ విపరీతము, మారువాడీలు, దేశములోని షాహుకార్లు, నూటికి నెలకు మూడు నాలుగు రూపాయల వడ్డీ పుచ్చుకొనుచుండిరి. అర్ధరూపాయి, తప్పిన బదియణాలుకన్న నెక్కువ పుచ్చుకొననని యాయన ప్రతిజ్ఞ. అప్పు పుచ్చుకొనునప్పుడే షాహుకారు కమిషనట. నూరురూపాయలు పుచ్చుకొనువాడు నిజముగా పుచ్చుకొన్నది తొంబదియైదే. తక్కిన యయిదు కమిషను. అదిగాక గుమాస్తాలకు మామూలు, దేవుడికి ధర్మానికి మామూలు. పుచ్చుకొన్న నిముషమునుంచీ వడ్డీ పంజాబు మెయిలు వేగముతో, వాయువేగముతో, మనోవేగముతో పెరిగిపోవు చుండును.

'అబ్బాయి, యీధరలున్నాయా! యీ దేశానికి తగ్గనిధరలు. మాయ యుద్ధం ఎక్కడనుంచి వచ్చిందో ప్రపంచం అంతటా ధరలు పెంచేసింది. పోనీ మనవాళ్లు యీ పదేళ్ళు కాస్త జాగ్రత్తపడి ఋణాలు పణాలు తీర్చుకొని వెనకటివలెనే జీవనం చేసుకుంటూవుంటే రైతుకు పదిరాళ్లు వెనకబడి ఉండేవి. నువ్వు నాదగ్గరకు అప్పుకువచ్చావు. నువ్వు ఈధరలలో అప్పుతీర్చడం ఉత్తమమాట. ఇక భూమి అమ్మాలి. ఎవరైనా ఉద్యోగం చేసి డబ్బు సంపాదించిన వాళ్లు కొనాలి. అల్లాంటి వాళ్ళు ఎప్పుడూ దొరుకుతారా? ఎక్కడ కావలిస్తే అక్కడ దొరుకుతారా? ఏమోయి వసంతయ్యా!' అని సుబ్బారాయుడు గారు తన్ను బదులడుగుటకు వచ్చిన వసంతయ్య అను గోపాలపురం పెద్దకాపును పృచ్ఛచేసెను. వసంతయ్యకు నారువేలప్పు భూమితాకట్టుమీద కావలయునట.

'స్వంత కమతం ఎప్పుడైనా లాభమిచ్చిందోయి? మాతండ్రి నాటి నుంచీ మేమూ స్వంతకమతం చేయిస్తూనే ఉన్నామా, పల్లంసాగుపై ఒక్క సంవత్సర మైనా లాభించింది కనబడదు. ఎంతపంటయినా ఈ పన్నులు మింగేస్తున్నాయయ్యా. అదీ కాకుండా ధనం దేశంలోంచి ప్రతినిమిషము పోతోంది. దానితోటి మనకొంపలు మునిగిపోతున్నాయి.'

'అదేమిటండీ బావయ్య గారూ! 'వాడికేం పచ్చగాఉన్నాడు' అని మనం అనుకునే ప్రతివాడు లోపల లొఠారమే కదాండి.'

'ఏమిటంటావు దానికి కారణం?'

'అప్పులండి మరి.'

'ఎందుకా అప్పు అయిందీ అంట?'

'తమరిందాకటినుంచి అన్న కారణమేనండి బావయ్య గారూ. ఒళ్ళు తెలియకుండా అప్పులు చేశాము. నా చిన్నతనంలో వెండినగలేకాదండీ! ఎట్లా వచ్చిందండి బంగారం, అప్పులు చెయ్యకపోతే? యుద్ధం వచ్చినదగ్గర నుంచీ బంగారం కొనడం మొదలెట్టాము. మాకప్పులే, ఆడోళ్లకిమాత్రం ఒళ్ళంతా బంగారం.'

'దానికేమిలే బంగారమైనా కనబడుతూంది. తక్కిన ఖర్చులమాట?'

'అవును బావయ్య గారు! కుఱ్ఱాళ్ళకి చదువుఖర్చులు, మావోళ్ళిద్దరూ రాజమండ్రిలో కాలేజీలో ఓడు, పెద్దస్కూల్లో ఓడు. వాళ్ళు డబ్బు మింగేస్తున్నారండీ బావయ్య గారూ.'

‘చదువు చెప్పించడం తప్పననుగాని, మనం చదువులికి కుఱ్ఱాళ్ళను ఎందుకు పంపిస్తున్నాము? యుద్ధము రాక పూర్వం దేశంలో పైచదువులు చదువుకున్న వాళ్లు తక్కువ. చదువుకున్నవాళ్లు నలుగురే. వాళ్లందరికీ తలాఒక ఉద్యోగం అయింది. వాళ్ళు కాస్త పచ్చగావుండడం, నెలకి తప్పకుండా నాలుగురాళ్లు వస్తూవుండడం. మన రైతులదగ్గిర ధాన్యంరోజులలోనేగా నాలుగు రాళ్లు కనబడడం?’

‘చిత్తం.’

‘కాబట్టి మనవాళ్ళేంజేశారు? ఉద్యోగాలు మన్ని పోషించాలికాని భూములు కాదనుకున్నారు. ఇక అసలే లేవలేనమ్మ అట కెక్కుతానందని, చదువుల్లో తగలడి చక్కాపోయ్యాము. మనదేశంలో చదువంత ఖరీదుగల వస్తు వింకోటి లేకుండావుంది. పూర్వం చదువు యొక్క లోపలివిలువ ఎక్కువ. ఇప్పుడు పైవిలువ ఇంటిని గుండం వేసి గోదావరిలో కలిపి దిబ్బ చేసే ఖరీదు. జీతాలునాతాలు, పుస్తకాలు, హోటళ్లు, కాఫీహోటళ్లు ఇంటి నుంచి కుఱ్ఱాడు చదువుకునే ఊరికి డబ్బు కాల్వకట్టాలిసిందే. ఈ చదువుకి ఇంతా తగలేసి దానికి వడ్డీ తీసుకురాగలడా? ఇక ముందూ? ఇంకా కొంచెం మీ బ్రాహ్మణేతరులలో ప్రస్తుతం చదువులవల్ల లాభం ఉండవచ్చులే. కానీ ముందుముందు ఈ చదువులు మన కొంపలు తీసే చదువులనీ, ఉద్యోగంకోసం చదివించడం అంత తెలివితక్కువ ఇంకోటి లేదనిన్నీ మనకు పూర్తిగా తెలుస్తుంది. అందుకని వ్యవసాయాన్నే నమ్ముకుందామా అంటే నష్టం నష్టం నష్టం.’

‘నామట్టుకు నేను ముప్పయి యకరములభూమి వ్యవసాయం చేస్తున్నాను. నాలుగువందల ఏబది పైచిలుకు వస్తాయి బస్తాలు. పన్నులకు మామూళ్లకి ఎనభై బస్తాలు పోతాయి. పాలేళ్లకు, దూళ్లకి, కూలికి, విత్తనాలకి అన్నిటికి ఇంకోనూరు బస్తాలు పోతే యింక మిగిలే రెండువందల ఎనభై బస్తాలలో తిండికి మాకుటుంబానికి ధాన్యంమట్టుకు యాభైబస్తాలు పోతాయండి. ఇంకున్న రెండు వందల ముప్పయి బస్తాలకువచ్చే పదమూడువందల ఎనభైరూపాయలూ ఏడాదికి గడవాలి. దీంట్లోనే చదువులు, దీంట్లోనే గుడ్డలు. రామ రామా! బావయ్య గారు, ఆడవాళ్ళ గుడ్డలకి చాలవండీ మనపంటలు.’

‘అంతటితో అయింది! మఱి వ్యాజ్యాలు వల్లకాళ్ళు, కక్షలతో క్రిమినలు కేసులు, కౌళ్లుకదపాలకు రిజిష్టర్లు, అమ్మకాలకు రిజిష్టర్లు, రిజిష్టరీఖర్చులు, లంచాలు, పురుళ్ళు పుణ్యాలు, రైళ్లు, మోటార్లు - ఎన్నని? ఈ లోపుగా ఏ పెళ్ళో వచ్చిందా, యిక దానితో ముంపేకదా.’

‘బావయ్యగారు అదేనండి. మా మూడోఅమ్మాయి పెళ్ళిఖర్చువచ్చి నెత్తిన కూర్చుందండి. ఇదివరకు చేసిన పెళ్ళిళ్ళకి వాటికి కష్టపడితీర్చానండి. మీకివ్వవలసిన నోటు బాకీ పదిహేను వందలు, ఈ పెళ్లికి కట్నంవగైరా ఖర్చులు, అంతా నలభై వందలు కావాలండి.’

‘సంబంధం ఎక్కడిదోయి?’

‘పూళ్ళండి. డబ్బు నిలవవుందండి, కొండ్రా ఉందిట కొంచెం. కుఱ్ఱవాడు మా వాడితోపాటు రాజమహేంద్రవరంలో చదువుతున్నాట్టండి. కట్నం నాలుగు వేలు, లాంఛనాలు పదిహేనువందలు.’

‘పెళ్ళిఖర్చులు రెండువేలు. నాలుగువేల అయిదువంద లేమి సరిపోతాయోయి?’

‘ఇంటిదగ్గర బాకీ తీర్చడానికి ఉంచిన పదిహేనువంద లున్నాయండి. మా యింటావిడ వెయ్యిరూపాయ లిచ్చింది.’

‘పెద్ద రైతువు. నీకున్న ముప్పై యకరాలు నాకు తనఖా అక్కర లేదు. ఇరవైచాలు, వాయిదాలు పది. వడ్డీ మామూలు అర్థరూపాయి. కావలిస్తే యింకో పదిహేనువందలు పుచ్చుకో.'

‘వద్దండి బావయ్య గారు, నేను చేసిన అప్పు నేనే తీర్చివెయ్యాలండి. మీ అప్పుతప్ప నేనింకో అప్పు చెయ్యలేదు. మీ దగ్గిరతప్ప నే నింకోళ్ళదగ్గిర తేను.’

తనఖాపత్రము వ్రాయుటకు ముహూర్త మేర్పరచుకొని వసంతయ్య వెళ్ళిపోయినాడు.

సుబ్బారాయుడు గారు దినదినము ఏ పొలమునకోపోవు నలవాటు కావున నా సాయంతనము వసంతయ్యను బంపి, లోనికేగి కండువా వేసికొని, మంచి లంకాకుచుట్ట వెలిగించుకొని, చేత వెండిపొన్ను కఱ్ఱ బుచ్చుకొని, కిఱ్ఱు చెప్పుల జోళ్లు కిఱ్ఱుమని చప్పడు చేయుచుండ గొందరు పాలేళ్లు, కొలగాండ్రు, నిరువురు కాపు స్నేహితులు, ఒక క్షత్రియరైతు కూడరా, గాలువ యవ్వలి పొలము జూచుకొనబోయెను.

సుబ్బారాయుడు గారి కనుదినము పొలము లొకసారి తొక్కివచ్చుట యలవాటు. ఒకప్పుడు తోటల జూచుటకై పోవును. ఏ పొల మెట్లున్న దనియు గమనించుచుండును. వంగతోటలు, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మిర్చి, పసుపు వారి మెరకపొలములలో విరిగా బండును.

చీకటిపడువరకు నాయన బొలముల దిరిగిదిరిగి దీపములు పెట్టిన వెనుక నింటికేగును. ఇంటికి వచ్చుతోడనే మంగలి కాళ్ళుబట్టును. అటు వెనుక చలికాలమయిన వేడినీళ్లు, తదిర కాలములలో జన్నీళ్లు నింటిలో నెవరో యొకరు తోడిపెట్ట స్నానమాడి, సంధ్యావందన మాచరించుకొనును.

సుబ్బారాయుడి గారి హృదయమున రషియను బోల్షివిక్కుల రాజ్యతత్త్వము మెరుపువలె తోచినది. ప్రపంచమున నెంతకాలము ‘ఆస్తులు’ నా డబ్బు, నా పొలము అని అనుకోగలరు? డబ్బు లేని వాళ్ళు, ఆస్తిలేనివాళ్ళు ఎక్కువమంది ఉన్నారుకదా! వాళ్ళు తలుచుకుంటే డబ్బుగలవాళ్లు ఎక్కడ ఉంటారు? ఈ సైన్యాలన్నీ అడ్డుపడాలికాని, మనుష్యుడెంత విచిత్రమైన హృదయం కలవాడు. ఒక్క రష్యాలో తప్ప ఎక్కడైనా సైన్యం, ప్రజలూ తిరగబడ్డారా? తక్కిన రాజ్యాలలో రాజుల్ని తీసి వేసినప్పుడు తిరగబడ్డవాళ్లు రాజు క్రింద రాజుని ఆడించే ప్రభువులో, లేకపోతే కోటీశ్వరులో కాని, సైన్యాలు అనగా తక్కువ జీతం పుచ్చుకొనేవాళ్లు తిరగబడలేదు. అంటే ఇంతకూ డబ్బులో ఒక విధమైన సమ్మోహన శక్తి ఉంది. డబ్బుగలవాణ్ణి చూస్తే మామూలు మనుష్యుడెంతో భయపడిపోతాడు, కాలూ చేయీ కదపలేడు. రష్యాలో మరీ విపరీతమైన స్థితి ఉండాలి. లేకపోతే అల్లా ప్రజలు అంటే బీదవాళ్ళు తిరగబడివుండరు అని యాలోచనాపథగామియై సుబ్బారాయుడు గారు భోజనము చేయుచుండెను. నారాయుడూ వాళ్ళూ చెప్పడం పూర్వం హిందూదేశములో బోల్షివిజము లాంటి ఉత్కృష్ట రాజ్యపద్ధతి ఉండేదిట. ఎంతవరకు నిజమోకాని ఈరోజున డబ్బువదిలే మహానుభావుడెవరు, గాంధీమహాత్ముడంటివాళ్లు ఏ పదిమందో?

౧౧

విషబీజములు

శారద దినదిన ప్రవర్ధమానయగుచున్నది. ఆమె సౌందర్యము ఇంకను సౌందర్యముల బ్రోవుచేయుచు జగన్మోహనమగుచున్నది.

తన యంద మామె యెఱుగును. ఇంక అందగత్తెనగుదునని యామె గ్రహించినది. అందము తన్ను వీడియుండకూడదు. ఉదయమున నిదుర లేచినది మొదలు మరల రాత్రి నిదురగూరువర కామెకు దాను సౌందర్యవతినన్న చైతన్యముండును. సంగీతము నేర్చుకొనునప్పుడు, పాఠములు చదువుకొనునప్పుడు, బజారులో కారుమీద పోవునప్పుడు, భోజనమప్పు డామె యితరులు తనయంద మెటుల చూచుచున్నారోయని పరికించుచుండును. ఏమనుష్యుడైన తన్ను తేరిపారజూచిన నామె హృదయము హాయియనును.

'పరపురుషుడు, శీలము' అను వాక్యములయర్థ మా బాల కింకను గోచరింపలేదు. ఆ వయస్సులో నేబాలకును వానియర్థము తెలియదు. వారి హృదయముల నింకను స్త్రీ, పురుషుల పరమరహస్యవర్తనపుం బులకరము లొదవవు. వారి హృదయములో కోర్కె, విరియు మొగ్గలో ప్రత్యక్షమగు చిరుపరిమళము బోలియుండును. రానున్న స్త్రీత్వ మా వయస్సులో సౌందర్య బోధమాత్రమై యుండును.

దసరా పండుగలకు నత్తవారందరు వచ్చెదరని యామె విన్నది. అత్తవారిట్లు మాటిమాటికి వచ్చుచుండుట యామెకు సమ్మతముగా లేదు, డబ్బులేక వచ్చుచున్నారని కాదు గాని, యేదో వంక బెట్టి జమీందారులయింటికి దఱచు వచ్చుచున్నారా? అయినచో దన యత్తగా రొక్కపర్యాయమే దమయింటికి వచ్చినది. తన మామగారు అసలు రాలేదు. తన యత్తవారింటి లోను దర్జాగానే యున్నది. తమ తోటకన్న వారితోట బాగున్నది.

ఏది యెట్లున్నను శారద కత్తింటివారిపై ప్రేమ కుదరలేదు. కావుననే చెన్నపట్నము వెళ్ళుచు రాజమహేంద్రవరములో దిగిన జగన్మోహనరావుతో శారద విరగబడి నవ్వుచు, గృహప్రవేశమునకు దాను వెళ్లినప్పుడు కొత్తపేటలో నడచిన యపహాస్యపు బనులెల్ల వర్ణించి చెప్పినది.

జగన్మోహనుడు సౌందర్యరాశియగు మేనమరదలిని జూచినాడు, విస్తుపోయినాడు. పెద్దమనిషి అయినదని విన్నాడు. 'యౌవనోదయమాత్రమున నాడువారిలో నెట్టి విచిత్రమైన మార్పులు వచ్చును' అని యాతడనుకొన్నాడు. ఈ బాలిక , యీ జగన్మోహిని, తన రాణి కావలసిన యీ శారద, నొక పందికి నంటగట్టినారు. ఈ బాలికయే తన భార్య యైయుండిన దా నింగ్లండు దీసికొని వెళ్ళియుండును. ఆమెను పువ్వులలో బెట్టికొని పూజించువాడే. జమీందారిణియన్న నీమెయే. ఇంత అందకత్తె యగునని యెఱిగియున్నచో, నీ వివాహము చెడగొట్టియుందునే! అనేక మార్గము లున్నవే! అప్పుడు తన మేనత్త భర్త యేమిచేయును? తుదకు దనకీయక తప్పేడిదికాదు. తన స్నేహితురాండ్రగు యూరేషియను బాలికలు, వేశ్యాసుందరులు శారద ముందర గ్యాస్ దీపం ముందర, హరికేన్ దీపాలే.

ఆమెను జూచి లోలో గుటకలు మ్రింగినాడు. అనతిస్ఫుటమైన స్నిగ్ధమైన యామె యవయవ విలాసము నా వలిపపు పయ్యెద పావడలలో నాలోకించి మురిసినాడు. ఏదియో వంకతో శారదతో మాట్లాడును. ఆమెతో గూర్చుండి యుండును. యామెను

ముట్టుకొనుచుండును.

అతని యాందోళనమునకు శాంతి యాతని మేనత్త సమకూర్చినది. వరదకామేశ్వరీదేవికి మేనల్లుడన పరమప్రీతి. హృదయాంతరాళమున తన బిడ్డలపై నెంత ప్రేమ యున్నను తన కుమారునికన్న, తన కుమార్తెలకన్న మేనల్లునామె యాదరముమై గాంచును.

'ఏమయ్యా మోహనం! వదినగారు విశాఖపట్టణంలో యున్నారా? నువ్వు చెన్నపట్టణం వెడుతున్నావా? అత్తయ్య అంటే ప్రేమగనుక పాపం, యిక్కడ దిగావు. ఎన్ని సారులు చెన్నపట్నం వెడుతూ ఇక్కడ దిగకుండా వెళ్లలేదు?'

'ఏమిటో అత్తా! పనితొందరలు. నేనూ మామయ్యగారికిమల్లే మా జిల్లానుంచి శాసనసభ సభ్యుడుగా వెడదామని ప్రయత్నం. ఏమవుతుందో! అందుకనే ఇప్పుడు చెన్నపట్నం వెడుతున్నాను. అయినా నిన్నూ శారదను చూడాలని దిగాను. శారద అందాలరాశి అవుతూంది అత్తయ్యా.'

వరదకామేశ్వరీదేవి: ఏమిటో! ఇంతకూ నీ భార్య కావలసిన బంగారు తల్లికి యిలారాసిపెట్టి ఉంది. మీ యిద్దరికీ ఎంత యీడూ జోడుగా ఉండేది! సర్వవిధాలా మీ ఇద్దరూ తగివుందురు. నాకన్నులున్నూ ఆనందం పొందుతూ ఉండును. నీ అందానికి మా శారద సాటి. మా శారద అందానికి నీ అందం సాటి. మన్మథుడూ, రతీదేవిలా వెలిగిపోతూ ఉండేవారు. ఒకరి తాహత్తు కొకరు సరిపోతారు. మీ మామయ్యగారి ఉద్దేశం నాకు బోధపడలేదు. కాకి ముక్కుకు దొండపండు కట్టారు. మా అల్లుణ్ణి చూస్తే నాకు ....

జగ: అల్లా అనకు అత్తా! అతగా డేం తక్కువ అందమైనవాడా యేమిటి!

వర: ఆ! ఆ అందం! పెద్ద రాక్షసుడు.

జగ: శారద దేవకన్యలా ఉంటుంది. వర: అవును. ఈ నా గారాలకూచిని ఆ ఆత్తవారింటికి చేతులారా యెలా పంపింతునా అని తపించిపోతున్నాను.

జగ: అయితే అల్లుణ్ణి ఇల్లరికం తీసుకొని వస్తావమ్మా అత్తా?

వర: ఇల్లరికం! అతన్ని చూస్తేనే నాకు భయం. ఇంక రోజూ ఇంట్లో ఉంటే, నా ప్రాణాలు అప్పుడే పోతాయి.

తల్లికి జగన్మోహనునకు జరుగు సంభాషణయంతయు శారద వినుచున్నది. ఆమెలో సంభాషణ మించుకయు విడ్డూరముగా కన్పింపలేదు. ఆమె వినుచుండ తల్లి యెన్ని సారు లల్లుని తిట్టినదో! హేళన చేసినదో! ఆమె హృదయమున నత్తవారన్న నొకవిధమగు నసహ్యము జనింప నారంభించినది. సూర్యకాంతమన్న కరుణయు నున్నది. తాను గొప్పకుటుంబములో జనించినందుకు నెక్కువయని తలంచుచు తన హృదయమును జూరగొన్న సూర్యకాంతమును దలపోసికొని 'పాపము' అని జాలిపడుచుండును.

తన భర్త! మరి? తండ్రి కంత యిష్టమేమో? అందరును తెలివుందని చెప్పుకొనెదరు. ఈ రోజులలో తాను చదివే నవలలలో నాయికా నాయకులు ఒకరి నొకరు ప్రేమించునట్లు తానెవరిని ప్రేమించుచున్నదో? అందరు తా నపరిమిత సౌందర్యవతి యని చెప్పెదరు. ఇంత యందకత్తెయగు తనకు, తగిన అందగా డెవరో యని ఆమె పలుమారు తలపోసుకొన్నది.

'ఏమిటి శారదా ఆలోచిస్తున్నావు?' అని జగన్మోహను డా బాలికను ప్రశ్నించినాడు.

'ఏమి లేదయ్యా బావా!'

వారిరువురి నచట వదలి వరదకామేశ్వరీదేవి లోనికి వెళ్ళిపోయినది.

'భర్తను గురించి ఆలోచిస్తున్నావు?'

'ఛీ!'

'ఛీ, ఏమిటి? ఎందుకు ఛీ? పోనీ నా కెందుకుగాని, నువ్వింత అందం ఎక్కడనుంచి సంపాదించావు? నేను చాలా సినిమాలు వెళ్ళిచూశాను. జీనెట్ మాగ్డనాల్డు, మారియన్ డేవీస్, మేరియాస్టరు, నార్మాటాల్మిడ్జీ, మిర్నాలోయ్ వీళ్ళెవరూ నీముందర నిలవగలరాంట?'

'నువ్వెప్పుడూ పొగడ్తూనే ఉంటావు.'

'నాది పొగడ్తా? నేను నిజంగా చెపుతున్నాను. శారదా! ఇప్పుడు ప్రపంచానికంతా సుందరిని యెన్నుకుంటే నిన్నే 'మిస్ యూనివర్సు' అనగా విశ్వసుందరిని చెయ్యాలన్నమాట. నేను ప్రపంచం చాలా చూశాను. అనేక మంది దొరసానుల్ని, ఇతరదేశం స్త్రీలనీ, జమీందారిణీలను, ఉద్యోగస్థుల భార్యల్నీ ఎందర్నో చూచాను. ఎవ్వరు నీసాటిరారు శారదా.'

'అయితే నువ్వు నాన్నగారికిమల్లే శాసనసభలో సభ్యుడవు అవుతావా?' 'ఆ'

జగన్మోహనుడు శారదదగ్గిరకు జేరి యామె నడుముచుట్టూ తన ఎడమ చేయి చుట్టి 'శారదా మనం యిద్దరం ఒకరొకరికి బాగా సరిపోయాము. ఈ పాపపు దేవుడు ఇల్లా చేస్తూవుంటాడేమిటో! ఇంగ్లండు దేశంలో ఇష్టంకాని పెళ్ళిళ్ళు రద్దుచెయ్యవచ్చును. ఇక్కడ అల్లాలేదు. పెళ్ళి రద్దయితే మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చును ... ఆ దేశాల్లో.'

శారద మాట్లాడక మొగము చిట్లించుకుంది.

'శారదా నువ్వీయేడు స్కూలు ఫైనలు పరీక్షకు వెళతావటకాదూ? అయితే మన జమీందారులకు పరీక్ష లెందుకు? చదువులు, ఉద్యోగాల కోసం కాదూ?'

'మా నాన్నగారు ఏ ఉద్యోగంకోసం చదివారోయి బావా మరి?'

'మీ నాన్నగారు జమీందారుగారు. ఆయన చదువుకోవడం ఒక గొప్పే. కాని సాధారణంగా ప్రజలంతా ఎందుకు చదువుతారు, ఉద్యోగంకోసం గాకపోతే మరి?'

'డబ్బుగల వాళ్ళూ గొప్పకోసమేగా చదివేది బావా?'

'వాళ్ళ మొగం! కోమట్లు చదివితే గొప్పకోసమా ఏమిటీ?'

'మరెందుకు?'

'బడాయికోసం!'

'కాని మనబోటి జమీందారులు చదవడం సరదా. ఆ సరదా లేక చదవకపోయినా ఇబ్బందిలేదుగా.'

'సరేగాని నీకు చెన్నపట్నం నుంచి యేమిటి తీసుకురమ్మన్నావు నన్నూ. శారదా?'

'ఏమి అక్కర్లేదు బావా.'

'శారదా, నేనంటే నీకు ప్రేమేనా?'

శారదాదేవి మాటాడలేదు. చిరునవ్వు నవ్వినది. 'నాకేమి తెలవదు బావా.'

'ఇంగ్లీషువాడు 'మాటాడకపోతే సగం ఒప్పుకున్న' ట్లన్నాడు. మరి ఏమంటావు? ఏదో చెప్పాలి.'

శారదాదేవి నవ్వుట మాని యేదేని యాలోచనల్లో మునిగినది.

'శారదా! నిన్ను చూసి మోహించని మగవాడు వట్టిదద్దమ్మ! నిన్ను చూసి ఋషులే ప్రేమిస్తారు. నాబోటి మేనబావ సంగతి వేరే ఆలోచించి చెప్పాలి!'

ఇంతలో శారద తమ్ముడు శ్రీ కుమారరాజా కేశవచంద్రరావు, అయిదేండ్ల బాలుడు, విసవిస పరుగెత్తుకొని యచ్చటకువచ్చి, 'చిన్నక్కా! ఇవ్వాళ నా కుక్క మొన్న మనం చూసిన సర్కసులో కుక్క కన్న బాగా మొగ్గవేసిందే!'

'ఏమోయి చిన్నబావా! నువ్వు సర్కసు పెట్తావా యేమిటి?'

'పెద్ద సర్కసు పెట్తాను. మా నాన్నగారికి గుట్టాలున్నాయా! రెండు ఏనుగులు మూడు సింహాలు కొంటాను ...?'

'ఎంతపెట్టి కొంటావు తమ్ముడూ?'

'నూరు రూపాయలు... కాదు, లక్ష రూపాయలు పెట్టి కొంటాను.'

౧౨
కేశవచంద్రరావు

శ్రీ కుమారరాజా కేశవచంద్రరావు శారద తర్వాత ముగ్గురు పుట్టి పోయిన వెనుక జనించినాడు. ఆడపిల్లలవంటి యందముగల బాలకుడు. పనసతొనలవలె వెన్నముద్దవలె మెత్తని బొద్దైన అవయవములుగల బంగారుబాబు. అల్లారుముద్దుగా పెరిగినాడు. పెద్దక్క పైకన్న చిన్నక్కపై నాతనికి బ్రీతి ఎక్కుడు. తల్లి వరదకామేశ్వరీదేవి చేయు గారాబము విపరీతము. నేలపై అడుగుపెట్టనీయ దామె. అస్తమానము డాక్టర్లకు కబురులపై కబురులు; ఆ బాలుడు చిట్టున జీదరాదు. కొంచెము దేహము వెచ్చబడినచో నిదురబోవదు, వరదకామేశ్వరీదేవి ప్రాణము లన్నియు నా బాలకునిమీదనే యుండును.

తండ్రిగారు కుమారునిజూచుకొని యానందముతో మునిగిపోవుచుందురు. ఆయన బిడ్డలను దరికి చేరదీసి ముద్దులాడుట తక్కువ. ఒక్కొక్కప్పుడు, ప్రేమవివశులై ఏకాంతమున, బిడ్డలనట్టే బిగియార కవుగిలించుకొని, తనివార మూర్ధాఘ్రాణ

మొనర్చుటయు కలదు.

కేశవచంద్రరావు మాటలు ముద్దుల మూటలే. ఆ బాలకుడు కొందరన్న దరికి జేరును, గొందరన్న దగ్గరకు రానేరాడు. అతనికి నారాయణరావుపై శారద పెండ్లిచూపులకు వచ్చిననాటినుండియు బ్రేమ జనించినది. పెండ్లిలో బావగారి నొక్క నిమేషము వదలియుండలేదు. నారాయణరావు తన బావ మరదిని దగ్గరకు తీసికొని యాతడడుగు విపరీతపు బ్రశ్నల కోపికగా జవాబులు చెప్పచుండువాడు. చిన్న చిన్న కథలు చెప్పువాడు.

నారాయణరా వెప్పుడు వచ్చిన నప్పుడు కేశవచంద్రుడు దగ్గరకు జేరుట జమీందారునకు పరమహర్ష కారణమైనది. కాని వరదకామేశ్వరీదేవికి బొమముడి తెప్పించినది. ఆ బండచేతులలో బిల్లవాడు నలిగిపోవునేమోయని యామెకు భయము కలిగెను. ఆ బాలకునితో రహస్యముగా దల్లి, నారాయణరావు బండవాడనియు అస్తమాన మాతని కడకు వెళ్లవద్దనియు, నాతని బండతనమే యా బాలకుని కంటుకొనుననియు జెప్పినది. 'బావ బండవాడుకాడు! మంచివాడు. నాకు కథలు చెప్తాడు, ఇంకా ఎన్నో సంగతులు చెప్తాడు. బావ అక్కయ్యకన్న బాగా సంగీతము వాయిస్తాడు ఫిడేలుమీద.'

తల్లి తెల్లబోయి కుమారునికి జవాబు చెప్పకుండ వెళ్ళిపోయినది.

అతని చిన్న హృదయములో, దన బావగారిని దండ్రిదక్క తక్కిన యందరు హేళనజేయుచున్నారని యస్పష్టముగా దోచినది. నే డా బాలకుడు, శారదయు జగన్మోహనరావు మాట్లాడుట చూడగనే, అతని హృదయమున జిరుకోపము వచ్చినది. జగన్మోహను డాతని జూచి 'ఏమండో కుమారరాజా బావగారు! నీ పుస్తకాలన్నీ ఏవోయి?'

'లేవు. ఎక్కడో ఉన్నాయి.'

'కోపం వచ్చిందా బావా?'

'రాలేదు.'

'మరి కోపంగా ఉన్నట్లున్నావే బావా?'

'అబ్బా! నాకు పనివుంది. ఒరే రాముడూ!'

'బాబు!' అని నౌకరు రాముడు లోనికివచ్చినాడు. ఎత్తుకోమని కేశవచంద్రుడు చేతులు జాచుటయు, సేవకుడు రాముడా బాలు నెత్తుకొని బయటికి వెళ్ళెను. శారదయు లోనికిబోయినది.

జగన్మోహనుడట్లే యాసోఫాపై నధివసించియుండి, శారదావిగ్రహమును తలపోసికొనుచు కూరుచుండెను. ఇంకను జిన్నపిల్ల. శారద వైఖరిజూడ భర్తను ప్రేమించుటలేదని తోచుచున్నది. తన మేనత్తయు నల్లుని పూర్తిగా రోయుచున్నది. తెలిసియో తెలియకయో తనకు మేనత్త సహాయము చేయునట్లే యున్నది. కొంచెము బాగుగా పాచిక పారించినచో శారద యవలీలగ దన గౌగిలింతకు జేరును. ఈ సంగతి యితరులకు దెలిసినచో నెవరేమిచేయగలరు?

శారద యింటిలోనికిబోయి, సంగీతపు గదిలో తన గురువుగారు శ్రీరామయ్యా గారు వచ్చియుండుటచే, ఫిడేలు తీసి సవరించుకొని కమానుకు రజను రాచి తీగలపై 'ససరిరి'

యని ప్రసరింపజేసెను.

శారదాదేవి ఫిడేలును, తండ్రిగారు తమ స్నేహితుడొకడు యూరపు ఖండముపోవుచుండ, హాలండునుంచి తెప్పించినారు. ఫిడేలువాద్య మరబ్బులది. అది సారంగికి సంబంధించినది. అచ్చటనుండి యరబ్బుల ప్రభుత్వము పాశ్చాత్య దేశములకు దన తేజస్సును బరపినపుడు ఫిడేలును ఫ్రాన్సు సృజించినది. పాశ్చాత్యదేశమే దాని జన్మభూమి యనునంతవరకు బెంపొందింపబడినది. ముఖ్యముగా ఫ్రాన్సు, ఇటలీ, జర్మనీ, హాలండు దేశములలో ఫిడేళ్ళ నద్భుతముగ నిర్మించెదరు. కొన్ని కొన్ని ఫిడేళ్లు యేబదివేల రూప్యములు ఖరీదుగలవి యున్నవి. వానిలోని శ్రుతిధ్వను లతిసున్నితములు, నపరిమితమధురములు, నత్యంత గంభీరములై అతి సూక్ష్మములై యుండునట. సారంగి భరతదేశమునకు ప్రథమమున క్రీ.వె. నయిదాఱు శతాబ్దులలో వచ్చినది. పదునెనిమిదవ శతాబ్దిలో ఫ్రాన్సు వర్తకులు ఫిడేలు తీసికొనివచ్చినారు. పందొమ్మిదవ శతాబ్ది కది భారతదేశమున ముఖ్యములగు సంగీతవాద్యము లలో నొక్కటియైనది. ఆనాటినుండియు నీ వాద్యము తన వాద్యముగా, గాత్రమునకు వీణకు అనుకరణవాద్యముగా, విజృంభించి, యార్యసంప్రదాయ వాద్యమై పురాతనమైన వేణు వీణావాద్యముల కనుంగు చెలియలైనది.

ఆంధ్రదేశమున నీ వాద్యము నెక్కువ నాట్యవిద్యాపారంగతులగు గణికల నాట్యమున కనుకరణముగా నుపయోగించినారు. పండితులును దీనిని మహావాద్యములలో నొకదానిగా నంగీకరించిన నాటినుండియు దక్షిణాపథమున గోవిందస్వామి పిళ్లయు, చౌడప్పయు, నాంధ్రమున కోటయ్యగారు, వారణాసి బ్రహ్మయ్య, బలరామయ్యగారలు, హరి నాగభూషణముగారు, ద్వారం వెంకటస్వామినాయుడుగారు నీ వాద్యమున కుత్కృష్టత సముపార్జించి పేరెన్నికనొందిరి. ఇంకను దక్షిణాపథమున, వాద్యముగ ఫిడేలు నానాటికి విజృంభించిపోవుచు, పాశ్చాత్య విద్వాంసులగు సొనానిని మొదలగు వారి వాద్యముతో దులదూగుటకు సిద్ధులగు పండితుల గననున్నది. జపాను దేశమునను నీ వాద్యము పరమవాద్యమైనది. హాలండు మొదలగు పాశ్చాత్య దేశములతో సమానమై, ప్రపంచమునకెల్ల నుత్కృష్టమగు నొకటి రెండు ఫిడేళ్లతో సమానమగు నైదో, యారో ఫిడేళ్లను జపాను సృజించుకొనినది.

శ్రీరామయ్యగారు ఫిడేలులో నసాధారణ ప్రజ్ఞ కలవారు. గాత్రము నందును బండితుడు. సంగీతపాఠములు శిష్యురాండ్రకు జెప్పి వారిని బ్రజ్ఞావంతుల జేయుటలో నమిత చాతుర్యముగలవారు. గానవిద్యాప్రవీణులగు పండితులందరు నధ్యాపనమున సమర్థులుగారు. ఉపాధ్యాయునకు బూర్ణ హృదయ ముండవలయును. దీక్షమగు మనస్సుండవలయును. శిష్యుని హృదయము, మనస్సు గ్రహించు తేజశ్శక్తి యుండవలయును. లేనిచో గురువెంత విద్యాపారంగతుడైనను శిష్యునికి విద్య రానేరదు. అతని విద్య లోహపేటికాంతర్నిగూఢ గుప్తధనమువంటిదే. ఎమ్. ఎస్ సి., డి. ఎస్ సి. మొదలగు మహోన్నత పరీక్షలలో నుత్తములుగా గృతార్థులైన మహానుభావులు కొందరు శిష్యులకడ నోరు విప్పలేరు.

శ్రీరామయ్యగారు పవిత్రహృదయుడగుటచే గొందరివలెగాక, తన విద్య పూర్ణముగా, శక్తిగల శిష్యుల కీయ సంకల్పించినారు. అట్టి మహానుభావునికడ విద్య నేర్చుకొనుటకు శారద యేమినోము నోచుకొన్నదో యని జమీందారుగారు పరమానందము నందుచుందురు.

ఆ రోజున శ్రీరామయ్యగారు శిష్యురాలికి 'ఎందరో మహానుభావు' లను త్యాగరాజకృతి నేర్ప సంకల్పించినారు. కుమారరాజా కేశవచంద్రరావునకు సంగీతమన్న చిన్నతనమునుండియు నిష్టమే. శారదకు పాఠము పూర్తిగా వచ్చినరోజున మరల

నాఖరుపరీక్ష చేయునప్పు డాడింభకు డెట్లు గ్రహించునో సంగీతపు గదిలోనికి చల్లగావచ్చి కూర్చుండును. పాటయంతయు నగువర కచ్చటనుండి యమందానంద మొందును. తరువాత నొక్కనిముసమైన నచ్చట నుండడు.

ఆ రోజున నదివరకు బూర్తిగావచ్చిన కృతి బాడునప్పు డా గదిలో కూర్చుండి, క్రొత్తపాఠము మొదలుపెట్టుటతోడనే యచ్చటినుండి కేశవ చంద్రుడు విసవిస వెడలిపోయి 'రాముడూ!' అని కేక వేసెను.

'చిన్నబాబుగారు పిలుస్తున్నారు!' అని కేశవచంద్రు నాడించు సేవకుడు పరువిడివచ్చినాడు.

బ్రాహ్మణ జమీందారు నింట నెవ్వరైనసరే సేవకులుగా నియమింపబడుదురు. కాని వెలమ, క్షత్రియ, కాపు, కమ్మ జమీందారుల యిండ్ల దాసీలు, కాసాలు వంశపారంపర్యముగా సేవజేయుచునుందురు. జమీందారులను వారి సేవకులు 'బాబు' లనియు గుమారరాజులను 'చిన్న బాబు' లనియు బిలుచుచుందురు.

జమీందారు బిడ్డలగుటయే గారాము, అందులో లేక లేక జనించిన బిడ్డడగుటచే సేవకులందరు నాతని కనుసన్నల మెలగుచుందురు. బాలకుని యేడువనీయకూడదు. బాలకు డాడుకొనుటకు వలయు సామాను లనేకము లున్నవి. నడుపుటకు రైళ్ళు, మోటార్లు, ట్రాములు, ఇంజనులు, బొమ్మలు మొదలగు నాటవస్తువు లెన్నియేని యున్నవి.

కేశవచంద్రుడు బాలకుడయ్యు మితభాషి, పలికిన రెండు పలుకులు ముద్దు లొలుకును. ఒకసారి యాడుకుంమించిన గాంభీర్యము వహించి మిన్నకుండును.

తల్లి యాతని కొకప్పుడు శ్రీకృష్ణునివలె వేషమువేయును, ఒకనాడు అక్బరుపాదుషావలె వేషమువేయును, ఒకనాడు జార్జిచక్రవర్తి వేషము వేయును.

౧౩
శాసనసభ

జమీందారుగారు చెన్నపట్టణము శాసనసభ సమావేశమునకై వెడలినారు. రైలుకడ కెదురువచ్చిన యల్లుని గుశలమడిగి యేదియేని విషయముల మాట్లాడుకొనుచు నింటికి బోయినారు. లా కాలేజీ యొంటిగంటకు మూసివేసెదరు కాన పీలయినచో దానొక పర్యాయము సమావేశమునకు వచ్చెదనని నారాయణరావు మామగారితో జెప్పినాడు.
సభికులందరు రెండుభాగములుగా కూర్చుందురు. ప్రభుత్వపక్షమువా రధ్యక్షుని కుడిచేతివైపునను, ఎదిరిపక్షమువా రెడమభాగమునను పీఠములపై నధివసించెదరు. ప్రభుత్వపక్షమున మంత్రులు, గవర్నరు, కార్యనిర్వాహక సభాసభ్యులు, మంత్రులపక్షము వారు శాసనసభకు ప్రభుత్వముచే నియమితులైన సభ్యులు నుందురు. ప్రభుత్వవిధానములో జరిగిన పొరపాట్లు, తప్పులు, మాయలు ప్రపంచమున కెరిగించుటకు, ప్రభుత్వము వారి బడాయిని పటాపంచలు చేయుటకు, కష్టనిష్ఠురములు చెప్పుకొనుటకు, ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గము వారిని మంత్రులను ఎదిరిపక్షము వారు ప్రశ్నలడిగెదరు.

ఆయా ప్రశ్నల నడిగెదమని సభ్యులు ముందుగానే తెలియజేయవలను. ప్రశ్నకాలము వచ్చినప్పుడా ప్రశ్నకు సంబంధించు నితర ప్రశ్నలనుగూడ నడుగవచ్చును. ఇట్టి ప్రశ్న వేయుచున్నానని సభ్యుడు తెలియజేయుటతోడనే యాజిల్లాలో నా శాఖముఖ్యోద్యోగికి ఆ

విషయమును గూర్చి వివరములకొరకు వ్రాసెదరు. వా రేజవాబిచ్చెదరో యాజవాబే శాసనసభలో ప్రభుత్వసభ్యుడు వినిపించును. ఒక్కొక్క ముఖ్యవిషయము వచ్చునప్పుడు ప్రభుత్వ వ్యతిరేక పక్ష సభ్యులు ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గసభ్యులను ప్రశ్నలచే గజిబిజి చేయుదురు. ప్రభుత్వ సభ్యులుమాత్ర మీ తాటియాకు జప్పుళ్లకు వెఱవరు.

చెన్న రాజధానిలో బ్రాహ్మణ బ్రాహ్మణేతర సమస్య తీవ్రముగా నున్నది. చెన్నరాజధానికన్న కొంచెము తక్కువగా బొంబాయి రాజధానిలో నున్నది. చెన్నరాజధానిలో బ్రిటిషు ప్రభుత్వము వచ్చినప్పటి నుండియు బ్రాహ్మణులు ప్రభుత్వోద్యోగములు సముపార్జించియుండిరి. అందు అరవ దేశపు టయ్యర్లు, నయ్యంగార్లు నుత్తమోద్యోగము లన్నియు తమ కాణాచిగా జేసికొనిరి. మరియు దక్షిణాపథమున బ్రాహ్మణేతరులను బ్రాహ్మణులతి నీచముగ జూచుచుండిరి. బ్రాహ్మణాగ్రహారవీథుల బ్రాహ్మణేతరులు వెళ్లుట యెంతయో కష్టతమమై యుండునది. బ్రాహ్మణునకు బ్రాహ్మణేతరునకు నెంతస్నేహమున్న నా బ్రాహ్మణేతరుడు బ్రాహ్మణుని యింటికి భోజనమునకు వచ్చినప్పు డింటిలో నందరు భోజనము చేసినవెనుక, వీథిసావడిలో భోజనము వడ్డించెదరు. కాఫీ దుకాణములలో బ్రాహ్మణులకు వేఱు, బ్రాహ్మణేతరులకు వేఱు.

రాను రాను బ్రాహ్మణేతరులకు బ్రాహ్మణులన్న కోపము, ఉడుకు బోతుతనము, తమస్థితి వృద్ధిచేసికొనవలెనన్న యిచ్ఛయు జనించినవి. వైద్యశిఖామణి యగు డాక్టరు నాయరు యాజమాన్యమున బ్రాహ్మణేతర సమావేశములు జరిగినవి. ఉపన్యాసములు, వ్యాసములు, కొరడా చురుకువలె కత్తిపోటుల వలె తీవ్రముగ ప్రబలినవి. బ్రాహ్మణేతర సమస్య యాంధ్రదేశమున కెగబాకినది. త్యాగరాజశెట్టి, కూర్మా వెంకటరెడ్డినాయుడు, రాజా పానగల్లు, రామస్వామి మొదలియారు మొదలగువారు నాయకులై విజృంభించినారు. ఉద్యమ స్థాపకుడగు డాక్టరు నాయరు చనిపోయినారు. ఇంతలో మహాత్మాగాంధి గారు దేశమోక్షమునకై సహాయ నిరాకరణోద్యమము మొదలుపెట్టిరి. బ్రాహ్మణేతర నాయకులు ప్రభుత్వపక్షము జేరిరి. మాంటేగు చెమ్సుఫర్డు రాజ్యవిధానము వచ్చుటతోడనే శాసనసభలో నెన్నుకొన్న సభ్యులలో నుండి మంత్రుల నియమించవలసివచ్చినది. బ్రాహ్మణేతర నాయకులు తమ్ము మంత్రుల జేయవలయు ననియు లేనిచో మహాత్మాగాంధిగారి యుద్యమమునందు జేరెదమనియు బెదరించిరట. అప్పుడు వెల్లింగ్టన్ ప్రభువు పానగల్లురాజాను ముఖ్యమంత్రిగా, వెంకటరెడ్డినాయుడు, పరుశురాము పాత్రోల నుపమంత్రులుగా నియమించెను.

మహాత్మాగాంధీ బార్డోలీలో సత్యాగ్రహోద్యమమును చౌరీచౌరా దౌర్జన్యము కారణముగా మానివేసినయపుడు దేశబంధుదాసు, పండిత నెహ్రూ గారలు స్వరాజ్యపార్టీ నేర్పాటుజేయ దేశమంతట నాపార్టీ వ్యాపించి శాసనసభలలో బ్రవేశించెను. కాని నిరాకరణవాదులే భరతదేశమున నెక్కువగా నుండుటచే స్వరాజ్యపార్టీ వారొక్క నాగపురములోను, బెంగాలులోను మాత్రము శక్తిసంపన్నులు కాగలిగిరి. చెన్నరాజధానిలోగూడ నా పార్టీ విజృంభించు చిహ్నములున్నవి. వారు ముఖ్యపక్షముగా మదరాసు శాసనసభలో ప్రభుత్వమువారి నెదుర్కొనుచుండిరి. జాతీయవాదులనువారు కొందరొక చిన్నపార్టీ గట్టి స్వరాజ్యపార్టీ వెనుక మద్దత్తుగా నుండిరి. అట్టి జాతీయ పక్షమునకు మన జమీందారుగారు నాయకుడు.

ఆరోజు సభలో జమీందారుగారు కృష్ణా గోదావరిజిల్లాలలో రైతుల కష్టములగూర్చి పెక్కు ప్రశ్నలడిగిరి. స్వామి వెంకటాచలసెట్టి మొదలగువారు మన జమీందారుగారికి బలము గలుగచేసిరి. అరగంటవరకు ప్రభుత్వమువారు ముళ్ళపై నడిచినట్లయినది.

ఇంతలో జమీందారుగారు నాంధ్రజిల్లాలను ప్రత్యేక రాష్ట్రముగా విడదీయవలయునను తీర్మాన ముపపాదించిరి.

'అయ్యా అగ్రసనాధిపా! నేనీ యుపపాదన చేయుట రెండవసారి. అప్పుడప్పుడాంధ్రనాయకు లనేకు లీ యుద్యమము నీ సభలో ప్రకటించియే యున్నారు. ఆంధ్రోద్యమమిప్పటికి బదిపదేను సంవత్సరముల నుండియు దేశమున వ్యాపించి ఆంధ్రులనుత్సాహశీలుర నొనర్చుచున్నది. అఖిల భారత జాతీయ మహా సభవారు దానినామోదించి యా ప్రకారము వారి సంఘముల యేర్పాటుతో ఆంధ్రరాష్ట్రమును ప్రత్యేకముగా విభజించిరి.'

'ఆంధ్రరాష్ట్రము చెన్నరాజధానిలో కొంచె మెచ్చుతగ్గుగా సగమున్నది. పదునొకండు తెలుగుజిల్లాలు, నేజన్సీయు నున్నవి. రెండుకోట్ల పైచిల్లర జనమున్నారు. రాష్ట్రాదాయము సగము తెలుగుజిల్లాల నుండి వచ్చుచున్నది. ఆంధ్రదేశము అస్సాముకన్న, మధ్య రాష్ట్రముకన్న, పంజాబుకన్న పెద్దరాష్ట్రము. ఇప్పుడే చెన్నరాష్ట్రీయ పరిపాలనము రెండు రాష్ట్రపరిపాలనములవలె జరుగుచున్నది. పోలీసు, ఎక్సయిజు, రెవిన్యూ, విద్య, డి.పి.డబ్ల్యు, అటవి, గృహములు మొదలగు నన్నిశాఖలపై రాష్ట్రాధికారులున్నను, రాష్ట్రాధికారులకు జిల్లాయధికారులకు మధ్య రాష్ట్రాధికారులతో సమానులను నిరువురు ముప్వు రధికారు లుండియున్నారు. అఖిల భారతీయ ప్రభుత్వ సంబంధమగు పోస్టలు, తంతులు, రాబడి ఆదాయము, ఉప్పుపన్ను మొదలగు శాఖలును రెండు రాష్ట్రముల కేర్పరచినట్లే రాష్ట్రమున రాష్ట్రాధికారి చేతిక్రింద నిరువురు ముప్వు రధికారుల నేర్పరచినారు.

'న్యాయస్థానముల విషయములో మదరాసు ఉన్నత న్యాయస్థానమున సరిగా పని జరుపవలెనన్న నిప్పుడున్న న్యాయాధికారులకు రెట్టింపుమంది నింకను నేర్పరుపవలయును. ఒక్కొక్క వ్యాజ్యము పరిష్కరింపబడవలె నన్న పెక్కు సంవత్సరములు పట్టుచున్నది. అట్టియప్పుడు రెండు ఉన్నత న్యాయస్థానముల నేర్పరుపవచ్చును. నేను వేసి చూపించిన లెక్కల ప్రకారము రెండు రాష్ట్రములు చేసినచో ఖర్చెక్కువ యేమాత్రము కాదు.

'కలిసియుండుటచే నుద్యోగములకని, సౌకర్యములకని ఆంధ్రులను తమిళసోదరు లణగద్రొక్కి వేయుచున్నారని గోల యెక్కుడగుచున్నది. ఈ రెండుజాతులును విడిపోయినచో నిరువురు నపరిమిత స్నేహముతో సౌహార్ద్రముతో నుండుటకు వీలున్నది.'

ఈ విధముగా జమీందారుగా రొకగంటన్నర మాట్లాడినారు. కొందరిటు కొందరటు మాట్లాడినపిమ్మట కాలముదాటిపోవుటచే ఓట్లుగైకొనుట ఆగిపోయినది.

మధ్య ఫలహారములకు లేచునప్పుడు జమీందారుగారు, శాసనసభా ఫలహారశాలనుండి యుపాహారములు దెప్పింప తన యల్లుని, నాతనితో వచ్చిన ముగ్గురు స్నేహితులను బిలిచి విందొనర్చెను. తన స్నేహితుల కనేకుల కల్లుని, యాతని స్నేహితులను బరిచయ మొనరించెను. వారందరు రెండు కారులలో వారి గృహములకు వెడలిపోవుచుండ ఆంధ్రపత్రిక తరఫున శాసనసభా కార్యక్రమము బత్రికకు నివేదింప వచ్చిన పరమేశ్వరునితో జమీందారుగా రిట్లనిరి :

'చూశారూ, పరమేశ్వరమూర్తి గారూ! ఇల్లాగ ఉంటుంది. మా అకాండతాండవం. ప్రభుత్వము వారు సూత్రధారులై తమ యిచ్చవచ్చినట్లు మమ్ము కీలుబొమ్మలను జేసి ఆడిస్తూ తమ పబ్బం గడుపుకొనిపోతూవుంటారు, మా అంతట మే మొక్క వ్యాపారంకూడా

చేయలేము. ఎన్నిక సభ్యులు ప్రభుత్వపక్షము వారికన్న అధికంగా వున్నారనుకొందాం. మావారొక విషయము శాసనము చేయించాలనుకుంటే గవర్నరు, వైసురాయిగారల అనుమతి కావాలి. తర్వాత దేశంఅంతా ప్రచురణము చెయ్యాలి; తర్వాత ప్రత్యేక సంఘంవా రా విషయం తర్జనభర్జన చేసి నివేదిక తయారుచేస్తే, దానికి శాసనసభలో ఎక్కువమంది ఒప్పుకొని నడిపిస్తే గవర్నరుగారు, గవర్నరుజనరలుగారు ఇండియా కార్యదర్శిగారు అనుమతులిచ్చి దస్కతులు చేస్తే అప్పటికది 'లా' అవుతుంది. ఎన్నిచోట్ల పురిటిలో సంధికొట్టవచ్చునో ఆలోచించుకోవయ్యా!'

పర: అందుకనేనండీ మా నారాయుడంటాడు సరియైన స్వరాజ్యం రానంతకాలం ఈ ఫార్సు జరుగుతూనే ఉంటుంది. నిజమైన ప్రజాపరిపాలన కవకాశంగల స్వతంత్రం ఉంటే చాలు. దాన్ని మనం ప్రజాస్వామికం (రిపబ్లికు) అన్నాసరే, వలసరాజ్య పరిపాలనావిధానము (డొమినియన్ స్టేటస్) అన్నా సరేనటండి.

జమీందారు: అంతవరకు మనం ఏమి మాట్లాడకుండా ఊరుకుంటే ప్రభుత్వం పెచ్చుమీరిపోదండీ? కాబట్టి గడబిడ చేస్తుంటే కొంతవరకయినా లాభం ఉంటుందా ఉండదా?

నారా: ఉండదని కాదండి; ఆ లాభం, అసలు భూమిరావలసి వ్యాజ్యాలు జరుగుతూంటే వరి ఊడ్చలేదు, వరిలో కిచిడీసాంబా ఊడ్చలేదు అని దెబ్బలాడితే వచ్చేలాభంలా ఉంటుందండి. వ్యాజ్యదార్లకు వాజ్యం ఆలస్యమయినకొద్దీ ఫలసాయం నష్టం. ఒకవేళ ఫలసాయానికి ఖర్చులకు డిక్రీ అయినా అవి వసూలు అవుతాయని వ్యాజ్యదారుకు ధైర్యం ఎల్లా ఉండకూడదో అంతే మనస్థితి అవుతుంది. దేశం అప్పులు ఎక్కువవుతున్నాయంటున్నాము. ప్రభుత్వంవా రిదివరకు చేసిన అప్పులకు వడ్డీ పెరుగుతూ వుంది. కొత్తఋణాలు చేస్తున్నారు. మనం ప్రభుత్వంతో ఇప్పుడైనా రాజీపడితే ఈ పన్నులన్నీ బ్రిటిషు ప్రభుత్వంపైన రుద్దడానికి, ధర్మం ఎల్లా వున్నా, వ్యవహారంవల్ల వీల్లేకుండా చేస్తున్న వీ సభలు. అప్పుడు మనకు నష్టం కాబట్టే యావన్మందీకలిసి యేదో ఒక స్వతంత్రతకు, ఏక తాటిమిద పని చేస్తే నిమిషంలో ప్రభుత్వంవారు రాజీకి చక్కా వస్తారు, అంటుంది కాంగ్రెసు.

జమీం: అవును, మన ఆశయాలు చాలా గొప్పగానే ఉంటాయి, నారాయణరావూ! కాని మానవప్రకృతికూడా మనం ఆలోచించాలి. ఒక్క చిన్న కుటుంబంలో నలుగు రన్నదమ్ములకు నాలుగు భావాలుండి నాల్గుమార్గాల వెళ్తారుగదా? అటువంటప్పుడు ముప్పదిమూడుకోట్ల జనంవున్న మనరాజ్యంలో మూడుకోట్ల భావాలైనా వుంటాయి. అందుకని దారులు రకరకాలుగావున్నా 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అన్నట్లుగా అందరూ కలిసి ఒక చోటికే వెడుతున్నాం గనుక మన గమ్యస్థానం చేరుకోవచ్చును. అట్లాకాక ఒక పక్షంవారు తదితరులు అంతా తమపక్షమే చేరాలని మూర్ఖపు పట్టుపట్టి కూచుంటే అసలు మనప్రయాణానికి అడ్డంరాదా అని నేననేది.

నారా: చిత్తం. మీరు చెప్పింది నేను కాదనను. మహాత్మాగాంధిగారు మూర్ఖపుపట్టు పట్టినాడని మనం అనుకోడానికి సావకాశం లేదని నా మనవి. ఎందుకంటారా, పెద్ద జబ్బులకు పెద్దరకం మందులు, గట్టిరకం వైద్యం కావాలి. సర్వతోముఖం అయిన జ్ఞానం కలిగిన గొప్ప వైద్యుడు జబ్బుకు తగిన వైద్యం సమకట్టుతాడు. మహాత్మాగాంధి, అట్టి వైద్యుడనే నిర్ధారణలున్నవి. కాబట్టి ఆయనమార్గము పూర్తిగా తొక్కక తలోవైద్యం చేస్తే దేశం యొక్క జబ్బు ఎల్లా కుదుర్తుందండి?

జమీందారు: దేశబంధుదాసుగారి పద్ధతికూడ మనం ప్రయత్నంచేసి చూస్తే

మంచిదికాదా?

పర: దానికి గాంధీగా రడ్డుపడకుండా తప్పుకొని దాసుగారు మొదలగు వారితో రాజీనామా చేసుకొని తాను ఖద్దరు, పంచమోద్ధరణ నెరవేర్చెదనని సంకల్పించుకొన్నారు గాదండీ?

జమీం: నిశ్చయమే కాని ప్రజలందరు స్వరాజ్యవాదులకు సహాయము చేయుటలేదు. అందువల్ల స్వరాజ్యపార్టీ వారి బలం రెంటికిచెడిన రేవడిలా ఉన్నది. కాంగ్రెసు తమ చేతులలో లేదని ప్రజాదరణం చూరగొన్న నిరాకరణవాదులు, గడ్డితట్టలో పడుకున్న కుక్కల్లా తాము తినకుండా ఇతరులను తిననీయకుండా చేస్తున్నారు. తాము శాసనసభలకు సభ్యులుగా వచ్చి జాతీయపక్షాన్ని బలపరచి ప్రభుత్వము చేతబూని, ప్రజలకు అనుగుణమైన ప్రభుత్వం చేయడం మంచిదికాదటయ్యా పరమేశ్వరరావుగారూ?

పర: అల్లా ప్రభుత్వం ఒప్పకపోతేనండీ?

జమీం: ఒప్పరూ, ఒప్పకుంటే గవర్నరు శాసనసభను రద్దుచేసి, కొత్త ఎన్నికలు ప్రచురించాలి. అందులో మనవాళ్ళే తిరిగి ఎన్నుకోబడతారు. మళ్ళీ మనవాళ్లే ప్రజలపక్షమై మంత్రులై మరల యుద్ధంచేసి విజయం పొందవచ్చు కాదా?

పర: అప్పుడు గవర్నరుగారు ఒప్పుకోకపోతేనండి?

జమీం: ఈ ప్రభుత్వవిధానం రద్దుచేసి తాను, తన కార్యనిర్వాహక వర్గపు మంత్రులు రాజ్యం చేసుకోనీండి. శాసనసభ వట్టి నాటకం అని ప్రజలకు తెలుస్తుంది.

నారా: అదేనండి, అట్టినాటకము అని గాంధీగారు గ్రహించి, ఆ రోగము మూలానికే తగుచికిత్స చేయవలె నంటున్నారు! టైఫాయిడు జ్వరం వచ్చిన రోగిని డాక్టరొకరు మలేరియా కాదని తెలిసియు, ప్రపంచమునకిది టైఫాయిడు అని నిర్ధారణచేయుటకు క్వయినా యిచ్చి యిచ్చి జ్వరం తగ్గలేదండి అని చూపించి, అప్పుడు టైఫాయిడు అని చికిత్స చేయదలచుకొన్నట్లు వుంటుంది కదాండి. ఈ ఆలస్యంవల్ల రోగికి ప్రాణాపాయంకూడా రావచ్చుకదాండీ?

జమీం: మలేరియా యని నిజంగా అనుకుంటే!

నారా: చిత్తం. అలా అనుకునే, ముప్పదియైదు సంవత్సరములు చికిత్స చేసినారు. ఇంకెంత కాలమండీ?

పర: మనదేశం దివ్యమైనది. నాలుగురోజులు ఆలస్యం చేస్తే ఏమిరా?

నారా: అవును, మన ఆత్మలు ఆద్యంతరహితములు. వైద్యమెందుకు?

౧౪
శ్యామసుందరీ దేవి

నారాయణ మరునాడు హైకోర్టులో శ్రీయుత అల్లాడి కృష్ణస్వామి అయ్యరును, శ్రీయుత ఎస్. శ్రీనివాసఅయ్యంగారును సంపూర్ణ న్యాయాధికార సభలో హిందూధర్మశాస్త్రవిషయమై సలుపువాదన వినుటకై యేగి, సాయంత్రము నాల్గింటివరకు విని యానందించి

రామకృష్ణలంచిహో మను ఉపాహార శాలకుబోయి యచ్చట పూర్ణముగ మెసవి, తన కారునెక్కి తిన్నగ కీలుపాకు లోని మామగారి భవనమునకు బోవునప్పటి కచ్చట సహాధ్యాయుడగు యరవ స్నేహితుడొకడు వేచియుండుట జూచెను. మామగా రప్పటివరకు నింటికి వచ్చియుండ లేదు.

నవ్వు మోముతో స్నేహితుని రెండుచేతులపట్టి యూపుచు, 'ఎంతసేపయిందండీ, సాంబారయ్యరుగారూ?' యని ప్రశ్నించెను.

'నారాయణ్ నీ వరగంట లేటండిదా.'

'తలవనితలంపుగా రెండుత్తరాలు వ్రాయవలసి వచ్చింది. అందుచేత ఆలస్యం అయింది క్షమించు.'

'ఆ ఫరవాలేదుదా.'

'ఒక పదినిమిషాల్లో వస్తున్నాను. కొంచెం కాఫీ, పళ్లు పుచ్చుకోండిమీ. మణీ! నా ఫలహారం అయింది, మణీ!'

'వరాం సార్!'

'అవసరందా లేదయ్యా ఆవకాయరావుగారూ.'

'పనికిరాదు సాంబారు అయ్యరూ!'

నారాయణ త్వరత్వరగా క్షురకర్మ చేసికొని లోనికిపోయి దుస్తులుతీసి స్నానజలముల నిర్వాణయను సువాసనాద్రవ్యమును గలపి స్వదేశీ లవండెరు సబ్బు రుద్దుకొని జలకమాడి, తన దుస్తులగదిలోనికిపోయి, ఖద్దరుపంచెయు ఖద్దరులాల్చీయు ధరించి, ముందుజుట్టులో యూడికోలోను పూసికొని నున్నగా వెనుకకు దువ్వి, సీతానగరం ఆశ్రమం అత్తాకోడలంచుల జరీఖద్దరు ఉత్తరీయం దక్షిణాది మడతలు బెట్టినదానిని భుజమున వేసికొని కాళ్లకు లూథియానా చెప్పులుతొడిగి, చేత నొక చక్కని బెత్తముధరించి, యవయవములన్ని ఛలఛల మన, రెండవ యర్జునునివలె స్నేహితుడు కూర్చుండు మధ్య మందిరములోనికి విచ్చేసినాడు. అంతకుముందే ఉపాహారపుగదిలో ఉపాహారము మెసవి, కాఫీత్రావి యా యరవ స్నేహితుడును గనిపెట్టుకొనియుండెను.

మామగారి పెద్దకారును డ్రైవరు తీసికొనివచ్చి ప్రాంగణము ముందుంచుట తోడనే మన స్నేహితు లిరువురు నెక్కి యందు గూర్చుండిరి, దేహముకదలని కదలికతో, కారు బొంయి, బొంయి మనుచు పున్నమల్లై రోడ్డు, ఎగ్మోరు, హారిస్ వంతెన, రౌండుఠానా, మౌంటురోడ్డు, తిరువల్లిక్కేణి పోయి యచ్చట అక్బరుసాహెబు వీథిలో నొక చిన్న మేడకడ నాగినది.

అరవస్నేహితుడు: నారాయణ్! వీళ్ళు ఇక్కడనుంచి ఇంకోచోటి కిదా మార్తురు. ఈ మేడ ఒక మోస్తరుగా ఉండును.

నారా: అవును. ఈ ప్రాంతాలు అంత ఆరోగ్యంగా ఉండవు. వీళ్ళేమన్నా డబ్బుగలవాళ్ళేనా?

అర: అంత పరవాలేదు. తండ్రి జిల్లా ముఖ్య వైద్యుడుగా ఉద్యోగం చేసి పింఛను తీసిదా చచ్చిపోయినాడు. ఇప్పుడు తల్లి, నలుగురు కూతుళ్ళు, నలుగురు కొడుకులు. ఏభైవేలు మణీ యిచ్చిపోయినాడు తండ్రి.

నారా: వీళ్లు సరీగా మంగుళూరు దేశస్థులేనా?

అర: వీళ్లు తెలుగు మైసూరు కలియక. అందరికీ ఇంగ్లీషు, తెలుగు అన్ని భాషలు వచ్చునుదా. మంగుళూరు తల్లి గారిది. తండ్రి మైసూరు.

ఇట్లు మాటలాడుచు మన స్నేహితు లిరువురు లోనికి బోయిరి. లోనికి బోవునప్పటికి మధ్యమందిర మంతయు కన్నుల వైకుంఠముగ నలంకరించి యున్నది. అచ్చట పేము సోఫాలపై రకరకములగు చక్కని తెరదుప్పట్లు పరచివున్నవి. మధ్య నొక గుండ్రని బల్లయు, బల్లమీద అల్లికరుమాలును, అందుపై చీనాబుడ్లు, అలీఘరు కూజాలు వానిలో వివిధజాతి పుష్పములు నున్నవి. అచ్చట నొక కుర్చీపై మేలు పసిడిపచ్చని పదునెనిమిదేండ్ల యీడు బాలకుం డాసీనుడై యుండెను. వీరిరువురును వచ్చుటతోడనే ఆ బాలకుడు లేచి 'నటరాజన్! వచ్చినారా?' అని ఇంగ్లీషున ప్రశ్నించుచు దయచేయండి యనెను.

నట: ఈయన మా తెలుగు స్నేహితుడు నారాయణరావుగారు. ఫిడేలులో నిధి. నారాయణరావు! ఈ బాలకుడు మంగేశ్వరరావుదా. ఇక్కడే బి.ఎ. జూనియరుదా చదువుచున్నారు.

నారాయణరావు మంగేశ్వరరావులు హస్తస్పర్శ గావించుకొనిరి.

మంగే: నేను లోనికి బోయి మా యక్కగార్లను చెల్లెళ్లను బిలుచుకు వచ్చెదను. ఇచ్చట గూర్చుండుడు.

అని యాతడు లోనికిబోయెను. నారాయణరావు చదువుకున్న బాలికల సమీపించి వారితో మాట్లాడుట కిదే ప్రథమము. స్త్రీలు విద్యాధికులగుట, నారాయణరావుకున్న ఉత్కృష్టాశయములలో నొకటి. స్త్రీ విద్య జాతీయముగా నుండవలయును. లేనిచో పాశ్చాత్య విద్య నయమేమోకాని, ఏవిద్యయు లేక మూర్ఖత లోనుంచుట మంచిదికాదని యాత డూహించినాడు. 'విద్యలేకుండా స్వచ్ఛహృదయులై యుండినచో స్వరాజ్య పవిత్రముహూర్తము వచ్చినప్పుడు, వారికి నిజమైన పూర్వసాంప్రదాయవిద్య గరపుటకు వీలేమో' అని యాతని తండ్రి యనును.

ఇంతలో నలువురు బాలికలతో మంగేశ్వరరావు లోపలినుండి మందిరములోనికి వచ్చినాడు.

నలువురు బాలికలు మెరపుతీగెలు, నలువురు బాలికలు గౌతమీనదీ చిరు కెరటాలు.

వారి సౌందర్యమున ఆర్యత్వము నిండియున్నది.

'నారాయణరావు! వీరు శ్యామసుందరీదేవిగారు, వీరు రోహిణీదేవిగారు, ఈమె సరళాదేవిగారు, ఈమె నళినీదేవిగారు, వీరు నారాయణరావుగారు' అని నటరాజన్ స్నేహితునకు నా బాలికలకు పరిచయము గలుగచేసెను. అందరు ఒకరి కొకరు నమస్కృతులిడి, నాసనములపై నధివసించిరి.

‘నారాయణ్! శ్యామసుందరీదేవిఫిడేలును; రోహిణీదేవి వీణను; సరళాదేవి జలతరంగము పియానో, యిస్ రాజ్ చిరతారు, సారంగి మొదలయినవెన్నో వాద్యాలను; నళిని మురళిని అద్భుతముగా వాయించగలరుదా. వీరి తండ్రిగారు చూస్తివా పింఛను పుచ్చుకొన్నవెనక మైసూరులో జాలకాలముండిరి. అక్కడ ఆస్థానవిద్వాంసులుదా కుమార్తెలకు నేర్పినారూ చూస్తిరా? శ్యామసుందరీదేవిగారూ, ఈ నారాయణరావుదా చాల జాగ్రత్తగా, దీక్షగా విద్య అభ్యసించాడు. చిన్నతనాన్నుంచి రామస్వామి అయ్యరికిదా నూరురూపాయలిచ్చి యీ ఊరిలో నెలలు నెలలు విద్య నేర్చుకున్నాడు. ఇట్టి మీ రిద్దరుదా కూడపలుక్కుంటే, ఇద్దరివిద్యా చాలా బాగుగా వృద్ధి అవునుదా నా ఆశయం’ అని నటరాజన్ సంతోషమున జేతులు నులుముకొనుచు పలికెను.

శ్యామసుందరి యిరువదిరెండేండ్ల మిసిమిపసందుల చంపకీసువర్ణగాత్రి. నారాయణరావును చూచి ‘కొంచెమాలస్యం కావడం చూచి మీరీ రోజున వచ్చుటకు వీలుకాదేమో అనుకున్నాము’ అన్నది.

నారా: నేనే మా ఆలస్యానికి గారణము. క్షమించండి. మంగేశ్వరరావుగా రేవాద్యమన్నా వాయించగలరా?

నట: వాయించకేమి! అత నెప్పుడున్నూ నేర్చుకోలేదు కాని, అప్పచెల్లెళ్లు నలుగురూ నేర్చుకొనేవి వినికిడివల్ల చూస్తిరా, అవి పట్టుకొని అన్ని వాద్యాలమీదా వాయించగలడుదా.

నారా: అలాగా! బాగుంది. మీరు చాలా అదృష్టవంతులండీ, మంగేశ్వరరావు గారూ!

మంగే: మా నటరాజన్ ఏదో ఒకటి అంటూ ఉంటాడులెండి. రోహి: నారాయణరావుగారు! వాద్యాలన్నిటిలో ఏది మంచిదంటారు?

నారా: నా ఉద్దేశం వీణా, ఫిడేలు రెండూను.

శ్యామ: ఆ రెంటిలో ఏదని మీ అభిప్రాయం?

నారా: మీ రడిగింది చాలా చిక్కు ప్రశ్న. పురాతనచరిత్రప్రియులకు వీణ యెక్కువ ప్రీతికరము. సంప్రదాయబద్ధులనుగూడ ఫిడేలు ప్రీతివంతుల చేస్తున్నది. వీణలోని చమత్కారాలు ఫిడేలులో లేవు. ఫిడేలులోనీ అద్భుతాలు కొన్ని వీణలో రావు. హృదయంలో నానంద మిమిడియున్న వారి కేదయినా పరమప్రియం. అయినా నామనస్సు వీణతో నెక్కువ కలసి పోయింది. నేనింకా వీణ నేర్చుకోవాలన్న ఊహ మానలేదు.

నళిని: (నవ్వుతూ) నారాయణరావుగారు కోమటిసాక్ష్యమిచ్చినారు. అందరు ఘొల్లుమని నవ్వినారు.

నారా: (హృదయపూర్వకముగ నవ్వుచు) అవును ‘గాంధిగారా, మాలవియా?’ అని అడిగితే ఏమి చెప్పమన్నారు? నేనా ప్రశ్నకు తగు సమాధానమీయలేను; కాని వీణంటే నా మనస్సు పొంగినట్లు ఫిడేలన్న పొంగదు. వెంకటస్వామినాయుడు, బలరామయ్యా, గోవిందస్వామిపిళ్ళలు మాత్రము నన్ను కరిగించి వేస్తూవుంటారు.

నళిని: ఫ్లూటు?

నారా: వేణాండి? వేణువు దివ్యగానమే, కాని వేణువు పైరెండు వాద్యాలకు విద్వత్తులో

తక్కువ కాదాండి? సంజీవరావువంటి అపరవేణు బ్రహ్మ వీణ, ఫిడేళ్ళతో దానిని తుల్యము జేయవచ్చును. నళినీదేవిగారి పాట యెల్లా ఉంటుందో వినాలి.

శ్యామ: నారాయణరావుగారు! మీ ఫిడేలు పట్టుకువచ్చారా?

నట: ఆ! కారులో ఉంది. తెప్పిస్తా.

నారా: మీరంతా ముందువాయిస్తే వింటాను; నా పాట ఎంతలెండి!

శ్యామ: అల్లాకాదు.

నట: మా అక్క చెల్లెళ్లుముందరదా పాడవలసిందని నేనుదా మునవి.

శ్యామ: సరే.

మంగేశ్వరరావును, నళినియు, సరళయు లోనికి బోయి తంబూరా, వీణ, ఫిడేలు, వేణు, చితారు పట్టుకువచ్చినారు. రోహిణి తంబూరాను ధరించినది. ఫిడేలును శ్యామసుందరి తీసికొనినది. ఇరువురును శ్రుతి సరిచూచుకొన, శ్యామసుందరి పల్లవి నాలపించి, వాయించ నారంభించినది.

౧౨

అక్కచెల్లెండ్రు

ఆ నలువు రక్క చెల్లెళ్ళ యందమునం దెక్కువ తక్కువలు నిర్ణయించుట దుస్తరము. నలువురు నొకేయచ్చున పోతపోసిన విగ్రహములు, చటుక్కున జూచినచో బోలికలలో నేమియు వ్యత్యాసమున్నట్లు సాధారణులు గ్రహింపనేరరు. పరిశీలనాదృష్టిగలవారు ఆ నలుగురు బాలికలకు ముక్కులు, అడుగు పెదవులు, గడ్డములలో భేదమున్నదనియు, గన్నులలోని పాపల రంగులు వివిధములుగా నున్నవనియును, నుదురుకొలతలు రెండవ నాల్గవ బాలికల కొకతీరు నను, మొదటి మూడవ బాలల కొకతీరున నున్నవనియు, మొదటి యిద్దరి బాలలకు నుంగరముల జుట్టనియు, చివరి యిద్దరి బాలలకు నున్నని సమకేశములనియు, పెద్దయామెయు ఆఖరి బాలయు నిద్దరు పొట్టివారనియు, మధ్య వారిరువురు పొడగరులనియు గ్రహింపగలరు.

శ్యామసుందరి కంఠము కిన్నెర కంఠము, కలస్వనము, పంచమస్వర పూరితము.

రోహిణీదేవి గళమున కాకలీస్వనము, నిషాదస్వరశ్రుతి గలది.

సరళాదేవి గొంతు ధైవతస్వరశ్రుతి, వేణునాదపూరితము.

నళినీదేవి గళ మింక నేర్పడలేదు. కాని మధురమైనదగునని స్పష్టము.

శ్యామసుందరీదేవి వైద్యవిద్యయందు మూడవతరగతి చదువుచున్నది. ఆమె చెల్లెలు రోహిణి రాజధాని కళాశాలలో బి. ఎస్. సి. ఆనర్సు మూడవ సంవత్సరము చదువుచున్నది. మూడవ బాలిక ఇంటరు ప్రథమతరగతి. నాలుగవ బాలిక అయిదవ ఫారము.

శ్యామసుందరీదేవి కుటుంబము సంగతి నారాయణరావునకు నటరాజను చెప్పినాడు.

రాజారావు తరగతిలో శ్యామతో మాటాడుచుండెనే గాని లజ్జా శీలుడగుటచే నామెతో దక్కినవారందరు స్నేహముగా నున్నట్లుండలేదు. నటరాజన్ కూడ వైద్యవిద్యార్థి, అతడు శ్యామతో, నామె కుటుంబముతో బాగుగా స్నేహమొనర్చెను. శ్యామాసహోదరీబృందము సంగీతలోలమని నారాయణరావు పరమేశ్వరులకు దెలిసినప్పటినుండియు వారచ్చటకు బోయి ఈ సంగీతము విని యానందింపవలయునని యనుకొనుచుండిరి.

పరమేశ్వరుడు స్త్రీలతో నంతలో స్నేహము చేయగలడు. నారాయణరావు తమంత తాము స్నేహము కోరివచ్చినవారితో గలసి మెలసి యుండగలడు. ఒక్క రాజారావునకే స్త్రీలనిన తగని సిగ్గు.

నారాయణరావు నటరాజనులు వచ్చిన గంటకు గాని పరమేశ్వర రాజారావులకు శ్యామఇంటికి వెళ్ళుటకు వీలు చిక్కినదికాదు. మన మిత్రులారోజున శ్యామ ఇంటికి వచ్చి సంగీతము వినుటకును, నారాయణరావు తన సంగీతము వినిపించుటకును నటరాజనే ఏర్పాటు చేసినాడు.

ఇంతలో రాజారావును బరమేశ్వరుడు నక్కడికి వచ్చిరి. ఈతడు కవి, చిత్రకారకుడు, విమలగానవిలోలుడు. అభినయమునం దారితేరిన కళాహృదయుడు. చిత్రచిత్రమగు విషయముల పాటలుగా గూర్పగలడు. అని పరమేశ్వరుని గూర్చి యెఱింగించిరి. రాజారావు నందరు నెఱింగిన వారే.

సభ యంతట పూర్ణమై పరిమళించినది. నారాయణరావు ఫిడేలు వాయించినాడు. పరమేశ్వరు డభినయముతో, తీపియైన కంఠముతో బాటల బాడినాడు. నటరాజన్ అరవపాటల మధురముగ వినిపించినాడు. శ్యామ, రోహిణి, సరళ, నళిని యందరు వారి వారి కళాచమత్కృతి గనబరచినారు. రాచప్పను, కిట్టప్పను, బాలగంధర్వుని, ఫండేర్కరును అనుకరించుచు మంగేశ్వరరావు తియ్యనిపాట పాడినాడు.

విమలగాంధర్వము వియద్గంగాఝురియై సుళ్లుకట్టుచు, కరుళ్లు వోవుచు, ఫెళ్లున విరుగుచు, పతనములై తూలుచు ఉప్పొంగుచు, ఊగుచు ప్రవహించినది. చిరువాగు లందు కలిసినవి. ఉపనదీనదంబు లందుజేరి త్రివేణులైనవి. శాఖా నదు లందుండి వీడ్వడి వేరుదారుల శాలికేదారముల దడుపబోయినవి.

గానకళారహస్యము లావేళ పూలదోటలైనవి, నక్షత్రకాంతులైనవి, చంటిబిడ్డలనవ్వులైనవి. చక్కని లేబెయ్యగంతులైనవి, సంధ్యాసమయ శ్రీనటేశ్వర పాదకింకిణీతాళములైనవి.

ఒకరినొకరు మెచ్చుకొన్నారు. ఎవరికివారు పరవశులైనారు. ఒకరినొక రానందపరవశుల గావించినారు. లయగతులజూపు వేడుకమై లయావిష్టుడై లయబ్రహ్మను ప్రత్యక్షముచేసినా డానాడు నారాయణుడు. కమాను వేగములో 'తానం తానం తానం ఆనంతా, నంతాననన, ననాం ననాం నాంనా అనంతా' యన్న తోడిరాగములోని తానం శ్రీ బాలకృష్ణ పాదనూపుర ఘలం ఘలిత మధురతర మధుగతీవేగమై వారి నందరిని ముంచెత్తినది. అస్పష్ట మధుర సూక్ష్మ స్వరధ్వనులలోనికి గొనిపోయి యణుమాత్రము జేసి, రానురాను విజృంభింపజేసి, బ్రహ్మాండము నావరింపజేసి సమస్తసృష్టిలయముజేసి కమాను ఆపి వేసినాడు. శ్యామసుందరీదేవి పరవశయై చటుక్కునలేచి నారాయణరావునకు నమస్కరించి, 'అయ్యా! విద్వత్తుమాట యటుండనిండు, ఈ పోకడలు, ఈ స్వకపోలకల్పనాప్రవాహము అద్భుతమైయున్నది. ఈ పద్ధతి ఎక్కడ నేర్చుకున్నారండీ' యని యడిగినది.

‘అమ్మా! నే నెల్లప్పుడు ఫిడేలు వాయించుకొనుచునే ఉంటాను. మన దేశమున ఒక్కొక్క యుత్కృష్టవ్యక్తి జన్మించి, సంగీతాది కళలలో పురాతన సంప్రదాయజనితమగు నొక నూతన సంప్రదాయము నప్పటికి నెలకొల్పి, భవతారకమగునట్లు చేయుచున్నాడు. నేటివరకు త్యాగరాజు ననంతరమున మరియొక వ్యక్తి జన్మింపలేదు. నేను బాశ్చాత్య గానవిశారదుడగు నొక ఫిడేలు వాదనాకుశలునికడ పాశ్చాత్యుల పోకడలు నేర్చుకొన్నాను. జపాను సంగీతము, బర్మా, సయాము, పెరిశియా, రషియా మొదలగు వివిధదేశముల వాద్య విశేషములు జాగ్రత్తగా విని స్వరముకూర్పు, వేగము, రాగము, తాళము పరిశీలించి కొత్త కొత్త పద్ధతులు రాగములలోనికి, తాళములోనికి, కూర్పులోనికి జొప్పించినాను’ అని నారాయణ ఇంగ్లీషున అన్నాడు.

‘యెనిమిదిగంట లయినది. మనము సెలవుపుచ్చుకొందమా’ యని రాజారావు లేచినాడు. తక్కినవారందరు లేచుటయు, నౌకరి కొకరు వందనము లాచరించుకొనిరి. నారాయణరావు, రాజారావు, పరమేశ్వరుడు, నటరాజన్ అందరు కారుమీద నెక్కి నెమ్మదిగా సముద్రతీరముననే ప్రయాణము చేయుచు నటనుండి వీధులు తిరిగినారు.

ఎవరింఢ్ల వారిని దిగవిడచి నారాయణు డింటికి చేరినాడు. ఆతని హృదయము శ్యామసుందరీదేవిని గనుగొన్నప్పటినుండియు ద్రవించిపోయినది. శ్యామసుందరి తన చెలియలైనట్లు హృదయమున ప్రత్యక్షమైనది. తన కారుగురు చెల్లెళ్ళనుకొన్నాడు. శ్యామసుందరిలో సూర్యకాంతమును జూచినాడు. సూర్యకాంతము తన యప్పచెల్లెళ్ళలో కడుగూర్చు చెలియలు. ఆమె యనిన ప్రాణమే తనకు. సూర్యకాంతము తనలో నొకయంశ, ఈ శ్యామసుందరి తనకు కొంచెము దూరపు చెల్లెలా? అవును, తన యిరువురు చెల్లెళ్ళ వెనుక చెల్లెలు. తన వాత్సల్యమును జూరగొన్నది సూర్యకాంతము. శ్యామకుకూడ నా వాత్సల్యమున నేడు చోటుదొరికినది.

కాని ఎక్కడ దీ సంబంధము! ఏజననాంతర సౌహృదమో ప్రత్యక్షమైనది. తాను తన చిన్నారి భార్యయగు శారదను బ్రేమించుకొన్నాడు. శారద తనదైవము. తన్ను బ్రోవ చనుదెంచిన దివ్యభామిని. ఆమె తన ప్రాణమునకు బ్రాణము. ఆమెను జూచినప్పుడు తన పురుషత్వముప్పొంగినది. తనలోని దివ్యత్వము ప్రస్ఫుటితమైనది. ఆమెను కౌగిలించుకొనవలె, ఆమెను బిగియార తనలో జేర్చుకొనవలె. ఆమె పెదవులు అమృతంపు సోనలని తాను కవనమల్లుకొన్నాడు. శారదను జూచినప్పుడు ప్రేమ, దయ, హృదయమున సంగీతము, కపోలముల వేడి, దేహమున మత్తు, ఆత్మకు ఆనందము కలుగును. ఏ స్త్రీయైన దన్నట్లు పులకరమున ఓలలాడించగలదా? తన్నట్లు పొంగింపచేయగలదా? అదియ ప్రేమ కాబోలు, అదియే ప్రణయ మహిమ!

శ్యామసుందరిపై గలిగిన ప్రీతిలో ఆమె దేహము తనకు స్ఫురించదు. ఆమె తనకు చెల్లెలు.

పరమేశ్వరుడు దీర్ఘాలోచనాపరుడై ఇంటిదగ్గర కా రాగినసంగతియు గ్రహించలేదు. ‘ఓ కవీ! కలలోంచి మెలకువ తెచ్చుకోరా’యని నారాయణుడన్నాడు. ‘ఒరే, నేను కలకంటుంటే నువ్వింందాకటినుంచి తెగ మెలకువగా ఉన్నావుకాబోలు, పక్కనే ఉన్నావుగాని ఒక్కమాట లేదే?’

‘నువ్వేదో ఆలోచిస్తున్నావని!’

‘నామీద పాపం దయతలచి నన్నుకూడా కాస్త ఆలోచించుకోనిచ్చా వన్నమాట. వహ్వా!’

'ఏమిటిరా నువ్వాలోచించేది? నేనూ ఆలోచిస్తూనే ఉన్నానులే!'

'అలాగా! ఈవాళ మా ఆవిడ నాపై అనుమానం పడుతుంది. నా హృదయాన్ని అద్దంలోని బొమ్మలా గ్రహిస్తుందిరా!'

'ఆ ఉపద్రవం ఎందుకు? నీ మదిని యీవాళ కదిపి కదిపి మథించి ప్రేమ అనే విషమునో, అమృతాన్నో ఉద్భవింపజేసుకున్నావా?'

'ఒరే, వాళ్లు అప్సరసలురా. వాళ్లమధ్యవుంటే ఋషులైనా నిష్కల్మష హృదయులై ఉండగలరట్రా! రోహిణీదేవి చెంత నేను చంద్రుణ్ణనుకున్నా!'

'పరమేశ్వర మూర్ధాభరణమ వనుకొన్నావు, పరమేశ్వరమూర్తివికాక!'

'అహో అవునురా! నాకళ్ళు ఆమె కళ్ళు ఏకమయినవి. ఆమె వాయించినంతసేపు నావైపు చూస్తూ పాడిందిరా. ఆమె కళ్ళు సోగలా, వాగులా!'

'ఆమె అంత అందకత్తెటరా?'

'ఒరే, నువ్వా కవివి, చిత్రకళయందు నీకున్నా ప్రేమ. ప్రకృతి చిత్రాలు చాలా వేస్తావు. గానహృదయం కలవాడివి. గానమే జీవితం అంటావు. నీకు తెలియదురా!'

'అరే పరమేశ్వరం! మనము మన జీవితాలు సార్థకపరుచుకోవాలంటే మనలో ఇదివరదాకా లోటయిన స్త్రీ హృదయసందర్శనం పూజనమ్రహృదయంతో జేసుకోవాలిరా. మనకిదివరదాక స్త్రీ అంటే ఒక వస్తువో, ఏదో మనది అనే భావమే కాదుట్రా?'

'అవునోయి! నువ్వు ఇదివరదాకా అంటూనేవున్నావు. మనది త్రిశంకు స్వర్గం. మనం ఉత్కృష్టమైన పూర్వసాంప్రదాయకాలంలో అంటే వేదకాలంలోనూ లేము, నవనాగరికులమూ కాము.'

'అయితే వీళ్ళెలాంటి వాళ్ళంటావు?'

'ఇప్పుడు మనం చూస్తున్నాం. పాశ్చాత్యనాగరికతావ్యామోహంలో పడి, రెంటికీ చెడ్డవాళ్ళయితే, బడాయి, టక్కులు, ప్రాపంచికదృష్టి కలవాళ్ళవుతారు. కాదూ...'

'కాదురా మరి! అందంగాఉన్న చక్కని జంతువులూ అవుతారు. తమ్ము ఇతర్లు చూచి ఆనందిస్తున్నారా లేదా అనేజాతి అలాంటిరకం అవునా కాదా అన్న సంగతి రాజేశ్వరుడికే తెలియాలి. రేపు మనవాడు వస్తున్నాడు. మాట్లాడితే రాజమండ్రి పరుగెత్తుతాడు. వాడిసంగతి బాగాలేదు.'

౧౬

పుష్పశీల

రాజేశ్వరరావు బి. ఇ. మూడవతరగతి చదువుచున్నాడు. ఈ యేడాతని చదువు తిన్నని మార్గమున నడుచుటలేదు. తల్లికి జబ్బుచేసినదని వంకబెట్టి రాజమహేంద్రవరము పరుగెత్తిపోయి యచ్చట పుష్పశీల సాంగత్య మెప్పుడు దొరుకునాయని యనేక మార్గముల నన్వేషించుచుండెను. పుష్పశీలయు ననేక చిత్రవిచిత్రమార్గముల దన ప్రియుని గలసికొను నేర్పాటులు సేయుచు నావేళ పరవశురాలై యున్నది. ఆ రోజులలో బుష్పశీల భర్తపై చూపు ననురాగమునకు మితిలేదు. సుబ్బయ్యశాస్త్రిగారును దనరసికతకును భార్యచూపు నపరిమితానురాగమునకును మురిసిపోవుచుండెను.

మిత్రుడగు నొక వైద్యునిచే దన తల్లికి చాల జబ్బుగానున్నట్లు పత్రము నంది, యయ్యది తన కళాశాలాధ్యక్షునకు బంపి, రాజేశ్వరరావు మరి పది రోజులు రాజమండ్రిలో మకాము వేసినాడు. పుష్పశీలాదేవి నొంటిగా గలిసి కొనుటకు వీలు కుదరలేదు. సుబ్బయ్యశాస్త్రిగారి యింటిలోనివారు నమ్మకమైన బంట్లు, యజమాని నిధినిక్షేపములను, వస్తువులను, భార్యను నితరులు తస్కరింపకుండా వేయికన్నుల కాపాడుచుందురు, లంచములకు లొంగరు. మాయమాటలకు కరిగిపోరు.

పుష్పశీల తన హృదయ మితరులకు దెలియనీయకూడదు. ఆమె తన యింటిలోనైన ఏకాంతము సంఘటించవలయును; లేదా, యొంటిగా బయట కెక్కడికైన వెళ్లుటకు వీలుచేసికొనవలయును.

రాజేశ్వరుని కౌగిలింత యొకనాడు రుచిచూచి, ఆనాటి ముద్దుల సువాసనల రుచుల తన పెదవులపై నింకను ఆఘ్రాణించుచున్న దామే. తనయీడు వాడగు రాజి తనకు భర్తయైయున్నచో తన జన్మము తరించియుండును. అహో! తన యౌవన మానాడు రాజేశ్వరుని కౌగిలింతలో రాగాలుపాడుకొన్నది. భర్త తనకెప్పుడు నంత తీపి యీయలేదే; ప్రేమయన నదియే. తాను కూడ నొక నవలలోని కథానాయికవలె నున్నది. తాను రాజేశ్వరుని నిక నెన్నటికి నెడబాయకుండుట ఘటింపదా? రాజేశ్వరుని కలుసుకొనుమార్గమే దొరకదాయె. పదిరోజులు పుట్టింటికేని పంపడు తనభర్త. అయినప్పటికిని పుట్టిల్లు రాజమహేంద్రవరమే కావున నప్పుడప్పుడచటికేగి యచ్చట రాజేశ్వరు నేల కలసికొనగూడదు? అది బాగుగా నున్నది.

ఆ రోజున తన హావభావవిలాసముతో పుష్పశీల భర్తను ప్రేమసాగర లీనుని జేసినది. సుబ్బయ్యశాస్త్రి గారికి బ్రపంచకమంతయు గాఢమధురమై తోచినది... ఆడవాళ్లంత యానంద మియగలరా? వారి జన్మయే యానందము, వారులేని పురుషుని జన్మము మరుభూమియే. 'నీకింత ప్రేముందా, పుష్పం?'

'నా బ్రతుకంతా ప్రేమేనండీ!'

'నువ్వు పుష్పంలా దివ్యమైన చరిత్రగలదానివిసుమా ప్రణయసుందరీ.'

'మీ మిద కవిత్వం రాయాలి. ఇంతవరకూ అందరూ మగవాళ్లే కవులు. నేను మీమీద పాటలు పద్యాలు రాస్తాను. మారుపేరు పెట్టుకొంటాను. పత్రికకు పంపించనా?'

'తప్పకుండా పంపించు. నువ్వు పంపించబోయేముందర నాకుచూపిస్తూ ఉండు. నాకు

కవిత్వం రాదు. లేకపోతే నేనును నీమీద వందలకొలది పాటలు రాస్తూ ఉందును.'

'ఓ సామి నిను జూసి
నాయెడద తీపినై
నిలువెల్ల ప్రవహిస్తు.
మంచుకొండై నువ్వు
మబ్బు బాలిక నేను,
నీపై ననవరతము
నృత్యాన సోలెదను'

'ఈపాట బాగుందండీ?'

'నువ్వు రాసిం దేదిబాగుండదు! నాకు ఏది మంచిదో ఏది చెడ్డదో తెలియదు. కాని, ఇప్పుడు భారతి మొదలైన పత్రికల్లో ప్రచురింపబడే భావకవిత్వంకన్న తక్కువగా ఉన్నదా యేమిటి!'

మరునాడు భర్త కోర్టుకు వెళ్ళినప్పుడు, తన్ననవరతము కాపాడుచుండు పనిమనిషి నెట్లయిన వదలించుకొనదలచి భర్తకొక యుత్తరము వ్రాసి పంపించినది. పనిమనిషి యా యుత్తరము పట్టుకొని జడ్జీకోర్టుకనిపోయినది. వీథిలోని బాలకునిచే రాజేశ్వరున కొక యుత్తర మంపినది. రాజేశ్వరుడువచ్చి దొడ్డి గుమ్మమున దొడ్డిలోనికి ప్రవేశించినాడు. వంటచేయు చుట్టపుమేనత్త ముసలమ్మ కేదియో వంకబెట్టి పని కల్పించినది. వసారా గుమ్మమున లోనికి రప్పించి రాజేశ్వరుని మేడమీద గదిలోనికి పంపినది. తల నొప్పిగా నున్న దనియు, కొంచెమునేపు గదిలోనికిబోయి పరుండెదననియు జెప్పి, మేడమీద గదిలోనికిబోయి తలుపు వేసికొన్నది.

కొందరు స్త్రీలు తమకోర్కెను దెలిపియు దెలుపని కటాక్షవీక్షణాదులచే దెలుపుచు, పురుషహృదయములు జూరగొని మనోభీష్టము తీర్చుకొందురు. కొందఱు తమ కోర్కెను భయముచే, లజ్జచే బ్రియునకు దెలియనీయక, అపరిమితమగు బలవంతముచేవలె బ్రియుని యాశ్లేషములో నణంగుదురు. తామై బయల్పడి, కోర్కె నెరింగించుకొని బ్రియునకు వశలగు వనిత లరుదు. అట్టి వారి ప్రేమము గట్లుతెంచుకొని పాఱుచుండ దాని నెవరడ్డగలరు?

పుష్పశీలకు రాజేశ్వరునిపై నట్టి వెఱ్ఱి జనించినది. ఎట్లయినసరే తన కోర్కె తీర్చుకొనవలెను. ఆమెకు సతతము రాజేశ్వరుడే ప్రత్యక్షమగుచున్నాడు. రాజేశ్వరుని నవ్వులు, రాజేశ్వరుని వట్రువలుతిరిగిన ఛాతీదండలు మనోనేత్రమున దోచి యొడలు ఝుల్లుమనుచుండెను.

నిముషముల నలంకరించుకొన్నది. మోము కడిగికొని సుగంధ మలది కొన్నది. సువాసనపొడిచే మొగము కైసేసినది. సన్నని చీరకట్టి, సన్నని రైక తొడిగి గదిలోనికి వెడలిపోయినది. తలుపు వేసికొన్నది.

రాజేశ్వరుడు నిముషమొక యుగముగా వేచియున్నాడు.

'నీవు రావనుకొన్నాను. ఆనాడు మీ ముసలమ్మకు జబ్బు చేసినప్పుడు వస్తే సమయానికి నీ భర్త వచ్చాడు. ఈ రోజున ఏమి అడ్డమో అనుకున్నాను.'

‘మీరు పరపురుషులు. నేనిల్లా రాకూడదు. పొరపాటు. నే వెళ్ళిపోతా.’

‘అయితే, నన్నెందుకు రప్పించావు?’

‘ఎందుకో? ప్రతిరోజూ మాయింటికిరావడం, మాయింటిముందర యింటి అరుగుమీద మధ్యాహ్నము స్నేహితులతో మాట్లాడుతూ కూర్చుండడము, కారణం నాకు తెలియక ఏమిటో కనుక్కుందామని అనుకున్నాను.’

‘అల్లాగా’ అని రాజేశ్వరుడు డా బాలికను పొదిగిట నదుముకొన్నాడు. పెదవులపై ఫాలముపై ముద్దులిడినాడు. ఆ బాలిక తప్పించుకొని పారిపోయి రోజుచు, చిరునవ్వు నవ్వుచు, నురస్థలమెగుర మంచముపై పడిపోయినది. రాజేశ్వరుడు నవ్వుచు మంచముపై నా బాలిక నదిమిపట్టి మెడ ముద్దుకొన్నాడు.

కాలేజి కేగుటకింక నాలస్యము చేసినచో జాల నష్టమువచ్చునని సహాధ్యాయు లిరువురు ముప్వురు వ్రాయుటతోడనే రాజేశ్వరుడు రాజమహేంద్రవరము నుండి కదలివచ్చుచు, తన్ను గిండీకి బోవుదారిలో గలియుమని నారాయణరావుకు తంతి నిచ్చినాడు. ఆ మాట పరమేశ్వరునకు దెలిపెను నారాయణరావు.

ఉదయమున మెయిలు వచ్చునప్పటికి తనకారుమీద నారాయణరావు సెంట్రల్ స్టేషన్ చేరునప్పటికి మెయిలుబండియు వచ్చినది.

సెలవులు పుచ్చుకొని స్వస్థలముల కేగుచున్న రెండు మూడు తమిళయ్యారు కుటుంబములు తప్ప తక్కినవారందరు తెలుగువారే. వర్తకమునకు, హైకోర్టు పనికి, యాత్రలకు, వైద్యములకు వచ్చువార లాబండి మూడవ తరగతుల నిండియుండిరి.

బండి యాగుటతోడనే వందలకొలది కూలీలు బండిలోనికిబోయి ‘వద్దు వద్దు’ అనుచుండగనే చేతిమూటలు లాగువారు, ‘సామాను దించినతర్వాత బేర మాడవచ్చు’ ననువారు, ‘మీరుదా బేర మేమిసామి! నాను బీదవాడుదా, నువ్వు యిచ్చే కూలిదా నాకుపొట్ట, సామి!’ అనువారు నైయుండిరి. చుట్టములను, స్నేహితులను కలుసుకొన వచ్చినవారు, భోజన వసతిగృహముల తరఫు మనుష్యులు, వీరియందరి రణగుణధ్వనితో నాప్లాటుఫారము బోరుకలుగుచుండెను. నారాయణరావు విసవిస మధ్యతరగతి బండికడకు బోవుటయు నందుండు రాజేశ్వరుడు చిరునవ్వు నవ్వుచు దిగినాడు.

‘ఏమిరా వచ్చావు? మీ అమ్మగారి జబ్బు ఎల్లావుందిరా?’

‘నిమ్మదిగావుంది. అందుకనే వచ్చాను.’

‘కళ్ళు గుంటలడ్డాయి, మీ అమ్మగారికి రాత్రింబగలు పరిచర్యకాబోలు. వెట్టికాయా! దిగు నీపనిచెపుతా.’

‘చిత్తం సామి!’

‘సామాను కారుకు పట్టుకురారా!’

‘ఏవిస్తురు సామి?’

‘నీ మెడ విరుస్తురుగాని రారా!’

కూలివాడు సామానుతో రా, మిత్రు లిరువురు నారాయణ కారుకడకు బోయి కారు వెనుక సామాను కట్టినారు. ఆకా రిరువురికే సరిపోవును. బండిని బాగుచేయుటకు, నవసరమైన నడుపుటకు నొక యువకుడు బండి వెనుకతట్టున నున్న యాసనముపై గూర్చుండును. నారాయణరావు కారునడుపుచు, గవర్నరుగారి భవనముదారిని సైదాపేట మీదుగా గిండీదారి పట్టించెను.

దారిలో రాజేశ్వరుడు తన యదృష్టమును వర్ణించినాడు. 'వెళ్ళినందుకు పని సఫలమయినది. నాజన్మ తరించిందిరా. ఒరే, నారాయుడూ! ఆ పిల్ల అందం నువ్వు కనివిని యెరగవురా. అందమైన స్త్రీతో చెలిమిచేయని మగవాడి జన్మ వ్యర్థంరా!'

'నీ ప్రేమతత్వంతో నాకు మతిపోతూవుంది, రాజీ!'

'నువ్వు వట్టి పిరికిపందవురా నారాయణా! నీపిరికితత్వాన్ని నువ్వు 'ధర్మం' అని పేరుపెట్టున్నావు.'

'ఒరే దద్దమ్మా! నిన్ను ముక్కలు ముక్కలుకింద విరగగొట్టేస్తా. విను. వాదన సరీగాచెయ్యడం నేర్చుకో. 'నేను చేసింది తప్పు, నా దేహాన్ని నా మనస్సును ఆపుకోలేకుండా ఉన్నాను. అది నా దౌర్బల్యం' అని ఒప్పుకోక మమ్మల్ని పిరికివాళ్ళంటావు. ఇంతకీ నువ్వంటే నాకుండే ప్రేమ చేత చెపుతున్నాను. నువ్వెలాంటివాడవైనా నాకు స్నేహితుడవే. పరస్త్రీ, పరునిభార్యను నువ్వు గంగలోకి దింపావు. ఇప్పుడైనా ఒడ్డుకు చేర్చు; లేదూ, నీయిష్టం. నేను చెప్పేది యింతే,'

౧౭
రాజేశ్వరరావు

నారాయణరావు, పరమేశ్వరుడు, రాజేశ్వరునితో నొక రాత్రియైన గడపుటకు సాయంకాలము గిండీ హాస్టలుకు బోయినారు. రాజేశ్వరుడు స్నేహితు లిరువురితో బుష్పశీలకు దనకుగల స్నేహము పూర్ణముగా వివరించి తెల్పెను. ఆమెలేని జన్మము తనకు దుఃఖభాజనమని తెల్పెను. ఎట్లయినను దన కామె కావలె. తనకు జదువు వలదు, ఆస్తి వలదు, చుట్టములు స్నేహితులు వలదు, పుష్పశీలయే కావలెను. ఆమె తనదగ్గర నున్న జాలును.

భర్తకడ నామెయుండ దాను రహస్యముగా రాకపోకలొనర్చుట దుర్భరము. ఆమె పూర్తిగా దనది కావలె. ఎట్లయిన ప్రపంచము తలక్రిందులుచేసియైన సరియె, యామెను గొనివచ్చెదనని యాత డుత్సుకుడై స్నేహితులతో నాడినాడు.

నారాయణుడు నిర్ఘాంతపోయినాడు. పరమేశ్వరుడు నిస్తబ్ధుడైనాడు.

నారా: ఒరే! నీపైన క్రిమినల్‌కేసు పెట్టి ఖైదులో వేయించ వచ్చురా భర్త!

రాజే: ఇంతకంటే ఆ ఖైదే మెరుగురా.

పర: ఖైదుకు వెడితే నీకేమి సౌఖ్యం? పుష్పశీల రాదుగా నీతో ఖైదుకు?

రాజే: ఒరే నారాయుడూ! నువ్వు గాంధిమహాత్ముని శిష్యుడవు, దేశంకోసం ఖైదుకు వెళ్ళావు. నువ్వూ నీవంటి పవిత్రులు ఎల్లాగైతే ధర్మం కోసం, దేశంకోసం పదేపదే ఖైదుకు

వెళ్ళడానికి సిద్ధమో, అల్లాగే నేనున్నూ నాకు ధర్మం అని తోచిన యీ పవిత్రకార్యంకోసం జైలుకు వెళ్తాను. అప్పటికి దేశంలో దీన్ని గురించి ఆందోళనపుట్టి, చట్టం మార్పుచేస్తారు. ఇతర దేశాల్లో ఇంకోళ్ళ భార్యను లేవదీసుకువెళితే శిక్షిస్తారా?'

నారా: ఇతర దేశాలలో పెళ్ళి సంపూర్ణ మతసంబంధమైన ముఖ్య ధర్మంకాదు. వ్యక్తీ వ్యక్తీ ఏర్పరచుకొన్న షరతులతో కూడుకున్న ఒక ఏర్పాటు కాబట్టి, ఒకని భార్యను ఇంకోడు తీసుకుపోతే, వాడిచేత భర్తకు నష్టపరిహారం ఇప్పిస్తారు. భర్త కోరితే వాడి పెళ్ళి రద్దుచేస్తారు. నీచజాతులకు మన దేశంలోనూ కులతప్పులూ, మారుమనువులూ ఉన్నవి. ఆర్యవివాహం మోక్షసంబంధమైన మతంతో కూడుకొన్నది. నాలుగాశ్రమాలు మానవు డాత్మతత్వం తెలుసుకోడానికై చేసేయాత్రలో మజిలీలవంటివి. అందుచేతనే ఒకసారి అయిన పెళ్ళి రద్దుకాదు, మతసంబంధమైన దోషాలన్నీ శిక్షాస్మృతిలో చేర్చారు. రాజే: నువ్వు న్యాయం చెప్పరా! మనం ఇప్పుడు జీవితాన్ని ధర్మ దృష్టితో చూస్తున్నామా? మనం ఉదయం లేస్తే సాయంత్రం వరకు చేసే పనులు మతదృష్టితో చేస్తున్నామా! వట్టి అల్పభావాలతో సూపర్‌స్టిషన్‌తో చేస్తున్నాము. అల్లాంటప్పుడు పెళ్ళి రద్దుచేసుకునేందుకు వీలుండే శాసనం, పరపురుషుడితో విహరించడానికి స్త్రీకి స్వేచ్ఛయిచ్చే శాసనం. ఇవన్నీ ఉండవద్దూ?

నారా: అవునులే! ప్రభుత్వం తన యిష్టంవచ్చినవి శిక్షాస్మృతిలో జేర్చి ఇష్టంలేనివి వ్యాపారసంబంధం చేసిపెట్టిన స్మృతే యిప్పుడు మనకు అది పోయినా నా------------ కాని ... వివాహం రద్దుశాసనం... నాకు ఏమీ ఇష్టం...... లేదు.

పర: ఏమిటిరా ఆ నసగడం! విను మరి. ఇప్పుడన్నీ ప్రభుత్వంవాళ్ళు లాలు చేశారు. ఇదివరకు ధర్మాలిప్పుడు అమల్లోలేవు. ఇక ఎన్ని లాలు చేస్తే ఏమిభయం అంట.

నారా: (కోపంతో) అసలే మండిపోతోంది. మన దౌర్భాగ్యతవల్ల మనదేశం పరులపాలయింది. అందువల్ల వచ్చిన కష్టాలు, దోషాలు తప్పనిసరిగా వచ్చినవే మన్ని వేపుకుతింటోంటే, మన్ని మనం బాగుచేసుకోని, శాసనాల చేతుల్లో బడని ధర్మాలనన్నా కాపాడుకోకుండా, యింకా తగులడాలీ? నేను పూర్వాచారపరాయణుణ్ణి, సనాతనవాదిని అనిచెప్పి మూర్ఖపు పట్టులు పట్టే దద్దమ్మను కాను. కాని అత్యుత్తమ ఉదారహృదయంతో, మతదృష్టితో, ఆత్మసామ్రాజ్య దృష్టితో వివేకానంద, మహాత్మగాంధి మొదలగు అవతార పురుషులు మన కిచ్చిన ఆదేశాల్ని ఆధారంచేసుకొని సంఘం బాగుచేసుకుంటే అభ్యుదయ మంటాను. కాదా?

రాజే: కోపం మాని ఇప్పుడు నా విషయం నువ్విచ్చే సలహా ఏమిటో చెప్పు. పరమం ఇచ్చే సలహా ఏమిటి? చెప్పండి. నేను ఉడికిపోతున్నా. చదువుమీదికి దృష్టిపోదు, నిద్రలేదు, ఆహారం సహించడం లేదు. చెప్పండి. లేక పోతే... ఏరోజునో హిందూపత్రికలో 'ఒక యువకుని మరణము.... ఎస్. ఐ. ఆర్. రైలుపట్టాలమీద శవము, ఆత్మహత్య!' అని వింటారు.

పర: ఛీ! ఛీ! నావళ్ళు జలదరిస్తోంది. నాకు గుండె దడదడమంటూంది.

రాజే: గుండెకాయ గంతులేసి నోట్లోంచి ఊడిపడలేదుకదా! ఆడంగి కానా!

నారా: కుంకాయి! వాడిజోలికి వెళ్ళకు. ఆదివారంనాడు నేనూ, రాజూ, పరమం వస్తాము. ఆరోజున నీ సంగతి ఆలోచిద్దాం, మరి పడుకుందాం.

రాజే: నారాయుడూ! నాకు నిద్దర పట్టదు, మీకుమాత్రం నేను ఎందుకు పట్టనివ్వాలిరా!

నారా: ఒరే! నీ బుర్ర చిదకకొట్టి నిద్దరోగొట్టుతా!

రాజే: ఒరే! నువ్వు చెన్నపట్టణంలో వున్న విద్యార్థిమండలాలన్నిటిలో బలవంతుడవైతే కావచ్చును. త్రోవలో అడ్డంవచ్చిన చంటిపిల్లవాడిమీద పడి సైకిలుమీదనుంచి దిగి, కుఱ్ఱాణ్ణి బెత్తం పుచ్చుకొని చావగొట్టిన యూరోపియను సోల్జరును మెడనొక్కి, గుడ్లు తేలవేయించి, దెబ్బలాటకు రమ్మంటే, వాడు తెల్లబోయి నీకు దండం పెట్టి, క్షమార్పణ అడిగితే అడగవచ్చును. కాని నీ దెబ్బ నాకు నిద్దర తెప్పించగలదురా?

అందరు నవ్వుకొనిరి. నారాయణుడు పండుకొనగనే నిదురపోయెను. పరమేశ్వరుడును, రాజేశ్వరుడును మాట్లాడుచునే యుండిరి. భళ్ళున తెల్లవారినది.

మృదుహృదయుడగు పరమేశ్వరు డనేక సాంత్వనోక్తులతో రాజేశ్వరుని హృదయమునకు శాంతి నొనగూర్చెను.

ప్రేమ ఎవరెఱుంగగలరు? ప్రేమతత్త్వములో నెన్ని ఛాయలున్నవో? చిత్త కార్తిలో కుక్కలకు కలిగే యిచ్ఛ ప్రేమపదార్థములో నొక కళయే. అందమైన వస్తువు నాసించుట ప్రేమయే. సౌందర్యపిపాసయు ప్రేమలో అంశమే; కరుణ ప్రేమజనితమే. ఆత్మలు రెండు నేకమైపోవుట ప్రేమయొక్క ఉత్తమదశ. ఆత్మనెరిగి పరమాత్మనెరుంగుటకు ప్రేమయొక్క పరమావధి.

'ఒరే! సర్వవిధాలా నా హృదయం ఆకర్షించి, నాజన్మం సువాసనా లహరిలో ముంచి, నాకు ఉపాస్య అయ్యే బాలికను ప్రేమించడానికి మరి నేను ప్రేమింపబడటానికి ఇన్నాళ్ళు ఎదురుచూస్తున్నాను. నీకున్న ఆశయం చాలా తక్కువది. నీకు చిఱుతపులిలా అందంగా ఉండి డాబుడీబుగావుంటే చాలు, నీమనస్సు ఆకర్షింపబడుతుంది రా రాజీ! నా హృదయం అల్లా సరిపోదు. నాకు కళాపూరితమైన హృదయం కావాలి. కళాపూరితమైన రూపం కావాలి. రెండూ ఎక్కడ సమకూడతాయి! ఒరే రాజీ! నాకట్టి బాలిక సాక్షాత్కరిస్తే నా కామెతో దేహసంబంధమే కావాలని కోరను. నన్ను 'మగతనం లేనివాడవు' అను, ఇబ్బంది లేదు. 'బడాయి' అను, భయంలేదు. లేదూ 'దొంగసన్యాసివి, లోకాన్ని మాయ చేస్తున్నావు' అను, పరవాలేదు. నేను దేహసంబంధం అయిన సంతోషమునూ, పరవశత్వాన్నీ కోరని పవిత్రుడనని చెప్పను. అలా చెపితే దొంగనవుతాను. దేహంమాత్రం అందంగావున్న ఇద్దరు బాలికలతో ఆవేశ పూరితుడనై సంతోషం అనుభవించా. మళ్ళీ వాళ్ళను కోరలేదు. నారాయుడంటి మహానుభావుడు తప్ప ఇంకోడు 'నేను పరస్త్రీని ఎరుగను' లేకపోతే 'కోరను' అని చెప్పలేడు. చెపితే వట్టి ఝూటామాట అనుకో.'

'అల్లాంటి సందర్భంలో, రాజీ! 'రెండురోజుల క్రితం శ్యామసుందరీ చెల్లెలు రోహిణిని చూశానురా! ఆమె నాకన్ని విధాల తగిన పరమపవిత్రురాలు. అందానికి అందమూవుంది. నా ఆశయాలకీ తగింది. నేను కలలోమాత్రం యుగయుగాలుగా చూస్తున్న నా స్వప్నదేవీమూర్తిరా, ఆమె' అని యిట్లు పాడినాడు పరమేశ్వరమూర్తి.

(పాట: కలబాల)

'ఓ చెలీ నీ వెవరు ఓ చెలీ నీ వెవరు?
కలబాలవా? ప్రకృతి వలపులపాపవా?
నింగిపై మేఘాల నీలియంచులమీద
చుక్కల్లో మినుకాడు సూక్ష్మకాంతుల్లోన
నాట్యమాడుచు దివ్యమందాకినీదీప్తి

లీనమై యానందలీలలో సుడివోదు
ఓ చెలీ నీ వెవరు
ఓ చెలీ నీ వెవరు
కలబాలవా ప్రకృతి
వలపుల పాపవా?'

'శ్యామసుందరి యెవరురా? ఆ మంగళూరు అమ్మాయి, మెడికల్ కాలేజీలో చదివేపిల్లేనా? ఆ! నేను ఎరక్కేం! వాళ్ళప్పచెల్లెళ్లంతా మాంచి అందమయినవాళ్ళు. అబ్బో! వాళ్ళల్లో, పెద్దాళ్ళు ముగ్గురిలో ఎవరైనా నాకు దక్కుతారేమో అని మహాప్రయత్నం చేశాను. శ్యామసుందరి గుట్టూ మట్టూ అన్నీ, రహస్యభటుల ద్వారా కనుక్కున్నా! ఏమి లాభంలేదాయె. శ్యామసుందరి చాలా విచిత్రమైన పిల్లరా. ఖద్దరు కట్టుంది. ఆ అమ్మాయి 1922 లో నిరాకరణంచేసి, మళ్ళీ కాలేజీలో చేరింది. మంచి పవిత్రమైన జీవితం. నాకు మొదట అంతామాయ అని అనిపించిందికాని, రహస్యంగా అంతా కనుక్కునేటప్పటికి నిజం తెలిసిపోయింది. నేను మీతో అక్కడికి వచ్చేందుకు వీలులేదు. నేనంటే శ్యామసుందరికి భయం!'

నిద్దురబోవుచున్న నారాయణు డేట్లు లేచెనో 'ఏమిటిరా 'శ్యామసుందరి' అని అంటున్నావు. నువ్వు ఎరుగుదువా ఏమిటీ?' అని ప్రశ్నించెను.

రాజే: అదేమిటిరో ! ఆడవాళ్ళ పేరు చెప్పితే శుకమహర్షి కంగారు పడ్డట్టయింది నువ్వు లేవటం. 'శ్యామసుందరి' అన్న పేరులో ఏముందిరా దద్దరిల్లి లేచావు!

నారా: ఒరే రాజీ! నోరుముయ్యి. వాగకు. శ్యామసుందరీదేవి చాలా పవిత్రచరిత్ర యని నే ననుకున్నాను. అది నిజమని నా నిద్దట్లో నాకు కలలో వినిపించినట్లయింది. మెలకువ వచ్చేప్పటికి నువ్వా ఆముక్కలే అంటున్నావు. ఏమిటదీ...అంట?

పర: చాలా పవిత్రురాలు, మాంచి హృదయంకలదీ అని వాడు చెప్తాడురా. వాడు డిటెక్టివులను పెట్టికూడా నిర్ధారణ చేసుకున్నాట్ట.

నారా: ఎల్లాగన్నా భారతీయ నారీమణులు పవిత్రచరిత్రలురా. పర: సరే ఒప్పుకున్నామురా.

రాజే: ఇంతకూ నువ్వులేచి, పరమేశ్వరుడు చెప్పే అద్భుతమైన కథకు అడ్డువచ్చావు. వాడి ఆశయమైన కలబాల కనబడిందటగా? రూపంతో, శరీరంతో అవతారం ఎత్తివచ్చిందట!

నారా: రోహిణీదేవేనా? నిజంగా ఆ బాలికలంతా అద్భుతమైనవాళ్లే. ఒరే రాజీ! నువ్వు పోనీ పై ఆదివారం పట్నానికివస్తే మనమంతా వాళ్ళింటికి వెళ్ళవచ్చును.

రాజే: ఓహో! నన్నామె పూర్తిగా ఎరుగును. నేనంటే హడలు. ఆ కథంతా తర్వాత చెప్తా.

పరం: ఏమి లేదురా నారాయుడూ! వాళ్లు మామూలు 'చిలుక' లని అనుకొని టోపీ వేయాలని చూశాట్ట. కాని బెడిసికొట్టిందట. వాళ్ళు వీడంటే హడలిపోయారుట.

నారా: (నవ్వుచు) ఆరి పరమదౌర్భాగ్యదామోదరా!

పర: నా పేరెత్తకు.

రాజే: (నారాయణరావుతో) నీ పేరూ ఎత్తుకోకు. అంటే నన్నను అంతే!

నారా: నారాయణుడు వట్టి దామోదరుడు కాదురా! జాగ్రత్త!

అందరు నవ్వుకొని పడకలు వేసినారు.

౧౮
దసరా

దసరా పండుగలకు నారాయణరావు, జానకమ్మగారు, సుబ్బారాయుడుగారు, సూర్యకాంతము, రాజమహేంద్రవరములో గాపురము చేయుచున్న రమణమ్మ లక్ష్మీపతి గారలు, వెంకాయమ్మయు బిల్లలు, సత్యవతియు బిల్లలు, శ్రీరామమూర్తిగారు ఆయన కుటుంబము, అందరును జమీందారు గారింటికి రాజమండ్రి వచ్చిరి.

జమీందారుగారు స్వయముగా వెళ్ళి వీరినందరిని దీసికొనివచ్చినారు. 'నేను రాను. మీ వియ్యపురాలుగారిని తీసుకొని వెళ్ళు'డని సుబ్బారాయుడుగా రెంత నిరాకరించినను జమీందారు భల్లూకమువలె విడిచినారుకారు.

జమీందారుగారు సుబ్బారాయుడుగారి పెద్దయల్లుళ్ళ నిరువురను దీసికొని వచ్చుటకు జాల బ్రయత్నించిరిగాని వారు రామని స్పష్టముగా జెప్పివైచిరి.

జమీందారుయొక్కయు, సుబ్బారాయుడుగారి యితర స్నేహితుల యొక్కయు ప్రాపకముచే లక్ష్మీపతికి గవర్నమెంటు ఆర్ట్సు కళాశాలలో నాచార్యపదవి దొరికినది. అప్పటినుండియు రమణమ్మతో, బిడ్డతో, దనతల్లితో లక్ష్మీపతి రాజమహేంద్రవరమున గాపురము ప్రారంభించినాడు. జమీందారుగారి పెద్దమ్మాయి శకుంతలాదేవి వచ్చినది. పెద్దయల్లు డా పండుగ రెండు రోజులు వచ్చునట. జగన్మోహనరావునకు భర్తను పోరి యాహ్వాన మంపించినది వరదకామేశ్వరమ్మ, తానును తప్పక రావలసినదని వ్రాయుచు, కొమార్తె శారదచేగూడ వ్రాయించినది. చెన్నపట్టణమునుండి యానందరావుగారి భార్య వచ్చెను.

నారాయణరావునకు సెలవులు ముందుగనే యిచ్చుటచే, నాతడు కొత్తపేట వెళ్ళి, యచ్చటనుండి, రేపు మహర్నవమి యన దన చుట్టములతో గలసి వచ్చినా డత్తవారింటికి.

జమీందారుగారి పెద్దయల్లుడగు డిప్యూటీకలెక్టరు గారున్ను, చెన్నపట్టణము నుండి ఆనందరావుగారును పండుగనాటికి విచ్చేసినారు.

నారాయణరావు చెన్నపట్టణములో నున్నంతకాల మొక్కసారియైన నానందరావుగా రా బాలుని దనయింటికి బిలిచినపాపాన బోలేదు. జమీందారుగారు శాసనసభా వ్యవహారములపై నచ్చటికి వచ్చినప్పు డానందరావుగారు తన కారుమీద జమీందారుగారి భవనమునకు వచ్చి కలుసుకొని, యాయనను దన యింటికి బిలుచుకొనిపోయినాడు. నారాయణరావుతో మాట్లాడనైన మాట్లాడలేదు.

జమీందారుగారి యింటిలో నారాయణరావుతో మాట్లాడునది యొక్క జమీందారుగారి యప్పగారు సుందరవర్ధనమ్మ గారును, జమీందారుగారి బీద చుట్టములలో రంగమ్మగా రొకరును నారాయణరావన ఆపేక్షగానుండి గౌరవము చేయుచుండిరి. సేవకు లందరు నారాయణరావన భయముతో బ్రేమతో మెలగుచుండిరి. పరిచారికలతో జమీందారిణి

అల్లునిగూర్చి నిరసనగా మాట్లాడునపు డెల్ల వారామె యెదుట మౌనము దాల్చుచుండిరి.

ఆ భవనమంతటిలో జమీందారుగారి తర్వాత నారాయణరావన్న ప్రేమ కురిపించునది కుమారరాజా కేశవచంద్రరావే. కేశవచంద్రుడు బావగారిని వదలడు. బావగారికడ భోజనమునకు గూర్చుండవలె. బావగారితో మాట్లాడవలె. బావమరిది నిద్రకు దనగదికి బోవునంతవఱకు కేశవచంద్రు డాతని కడనేయుండి, కబుర్లుచెప్పి యప్పుడు వెళ్ళి నిద్రపోవును. తనకడకుదక్క నితరులకడకు జనువుగా బోని కుమారుడు నారాయణరావునెడ సౌహార్ద్రముతో మెలంగుట జమిందారునకు నాశ్చర్య సం----------ను.

జమీందారుగారు నారాయణరావున కొక గదియు, పెద్దయల్లుని కొక గదియు, సుబ్బారాయుడుగారి కొక గదియు, స్త్రీజనమున కొక గదియు, మేనల్లు డానందరావుగారి కొక గదియు, నీరీతి వచ్చిన చుట్టము లందరి గదు లేర్పాటుచేసెను, గదులన్నియు బాగుగా నలంకరింపబడినవి. పడక గదులు మేడపైనను, క్రిందను దక్షిణవైపున నున్నవి. మేడపైన తూర్పునగూడ కొన్నిగదు లున్నవి. వెనుకభాగములకు ముందుభాగములకు సంబంధము ముఖ్యమగు హుజూరు కచ్చేరీ జమీందారుగారు నివసించు భవనమునకుముందు నేబదిగజముల దూరములో నున్నది. హుజూరుకచ్చేరీ యొక మేడ. అచ్చట పురాతనములగు కాగితములగది, మేనేజరు దివానుగారి కచ్చేరి, హుజూరుతాణేదారుగారి కచ్చేరి, గుమాస్తాల చావడి, ఖజానాకొట్టు, సిరస్తాదారుకచ్చేరి మొదలగునవి యున్నవి.

జమీహుజూరు కచ్చేరీకి సింహద్వార మిన్నీసుపేటలో నొక వీథి వైపున నున్నది. రాజాగారి మేడకు సింహద్వారము వేరొకవీథి నున్నది.

జమీందారుగారింట ఆశ్వయుజ శుక్ల పాడ్యమీ దినమున కలశ ప్రతిష్ఠాపన మొనర్చి దశరాత్రములు పూజలు, హరికథలు, సంగీతపుకచ్చేరీలు జరుపుదురు. జమీందారుగారు వీరేశలింగంపంతులు శిష్యుడగుటచే పూజాపురశ్చరణలపట్ల నుపేక్ష వహించియుందురు.

శ్రీరాజావిశ్వేశ్వరరావు (డిప్యూటీకలెక్టరు) గారు తోడల్లుని జూచుట తోడనే కొంచెము తల పైకెత్తి క్రిందిచూపు చూచి మామగారికి దనకన్న తోడల్లునిపై నెక్కుడు ప్రేమయున్నదని గ్రహించినాడు. అతని హృదయమున నుడుకుబోతుతనము ప్రవేశించినది. ఎంత ధనమున్నను, ఈ సామాన్య సంసారిబిడ్డపై మామగారి కేల యీ గౌరవమో తెలియదు.

ఆరోజున నారాయణరావుతో మామగారు వివిధవిషయములగూర్చి చర్చించుట జూచినాడు. నారాయణరావు చాల తెలివైనవాడనియు, నింత వరకు ప్రతిపరీక్షయు విశ్వవిద్యాలయమునకు మొదటివాడుగా నుత్తీర్ణుడైనా డనియు బెద్దయల్లునికి దెలియజేసినాడు జమీందారు.

తోడల్లుళ్ళిద్దరకు సంభాషణ జరిగింది. ‘ఏమండీ ఖైదుకు వెళ్ళివచ్చారే, మళ్ళీ కాలేజీలో ఎందుకు చేరారూ?’ అని విశ్వేశ్వరరావు ప్రశ్నించెను.

‘నేను చేసింది పొరపాటేనండి అన్నగారు. నేను మాతండ్రీ, ఇతర చుట్టాలూ ఎంతచెప్పినా వినక, యింటరులో నెగ్గిన సంవత్సరము వేసవి కాలంలో సహాయనిరాకరణంలో జేరాను. ఖైదుకు వెళ్ళాననుకోండి.’

‘రాజమండ్రి జైల్లోనే ఉన్నారా?’

‘రెండునెలలు రాజమండ్రీ, నాలుగునెలలు కడలూరు.’

‘అలాగా!’

‘అవునండి. జైలునుంచి వచ్చాను. జైలుకుముందు ఆరు నెల్లు దేశంఅంతా తిరిగి ఉపన్యాసాలు ఇవ్వడం, ఖద్దరమ్మడం మొదలైన ప్రచారం చేశా. ఆ తర్వాత జైలు. మొదట దిగేటప్పుడు పాశ్చాత్యవిద్య మానేసి ఏ సంస్కృతమైనా నేర్చుకుందా మనుకున్నాను, లేకపోతే ఏ గుజరాతీ విద్యాపీఠంలోనో చేరదామనుకున్నాను. చిన్నతనము గనుక గుండెధైర్య మెక్కువ. దేశానికి పరీక్షలు నెగ్గి సేవచేయడం ఎక్కువవీలు అనే దురభిప్రాయం వదుల్చుకోలేక మళ్ళీ చెన్నపట్నంపోయి ప్రెసిడెన్సీ కాలేజీలో బి. ఏ. ఆనర్సులో చేరాను. 1928 వ ఏప్రిల్‌లో ఆనర్సు ఫిజిక్సులో నెగ్గేటప్పటికి ఇంతలో స్వరాజ్యపార్టీ ప్రాబల్యం ఎక్కువయింది. అందుచే విసుకెత్తి లా కాలేజీలో చేరాను.’

‘కోర్టులు పూర్తిగా విసర్జించాలి అని కదా మీ అసహాయవాదులు బోధించేది. మీరు లా కాలేజీలో చేరా రేమిటి అని ఆశ్చర్యంగావుంది!’

‘ఎవరికన్నా ఆశ్చర్యంగానే ఉంటుంది. నేను న్యాయస్థానాల్లో న్యాయవాదిగా ఉంటానని చెప్పలేను. ఒకవేళ న్యాయవాదినైనా యెంతకాలమో! నా మనస్సు ఇంకా నిర్ధారణ చేసుకోలేదు. మొత్తంమీద నా హృదయానికి పూర్తిగా వ్యతిరేకమయిన కార్యం చేస్తున్నాననిమాత్రం నే నెరుగుదును.’

‘నా మాట విని మీరు నిరాకరణం గిరాకరణం అన్నీ మాని, హైకోర్టు న్యాయవాదిగా చేరి ఏ మునసబీకన్నా ప్రయత్నం చేస్తే నిముషంలో అవుతుంది. అయితే జైల్లో ఎల్లా ఉండేదేమిటండీ?’

‘మొదట వెళ్ళినప్పుడు కొంచెం నాకు భయం వేసింది, ఒక పది నిముషాలు, అన్నీ వదలి వచ్చినందుకు. తర్వాత అలవాటు అయింది.’

‘ఏంపని చేయించారు?’

‘నాబోటివాళ్ళకు నూనెగానుగ, మోట, పిండివిసరటం వేశారు. నేత, తాళ్ళు పేనడం, చాపలు అల్లడం, గొంగళీల నేత మొదలైనవి ఉన్నాయి. తివాసీనేత ఉన్నది. రాజమండ్రి జైల్లో అప్పుడే మోపలాలు వచ్చారు. వాళ్ళనందరిని ఒక డేరాలో కాళ్ళకి కడియాలువేసి, ఒక యినుపమోకు వాటిల్లో నుంచి దూర్చి, కట్టివేసి పశువులకన్న కనాకష్టంగా చూసేవారు.’

‘భోజనం?’

‘మాకు వేరేభోజనం ఏర్పాటు చేయించారు సాంబమూర్తిగారు. సీతారామశాస్త్రిగారు, విల్సనుగారి పదునాలుగు షరతులులాగ, జైలు ముఖ్యాధికారిని పదునాలుగు షరతులు కోరారు. దీపాలు, వ్రాతకు గ్రంథాలు, పాయిఖానా, మూత్రపుదొడ్డులు విడివిడిగా మనుష్యులకు కనబడకుండగా కట్టించడము, భోజనములో పప్పు, కూర, పులుసు విడిగా ఉండడము, నేయి, మజ్జిగలు ఇవ్వడము, తద్దినాలు పెట్టుకోనివ్వడము, నెలకు రెండుత్తరాలు, నెలకో బంధుమిత్ర సందర్శనము, కాళ్ళకు కడియాలు తీసివేయడము, భోజనము హెచ్చించడము మొదలైనవి.’

‘వాళ్ళిచ్చారా?’

‘ఎక్కడిస్తారు! రాజమండ్రిలో రాతకు కలాలు, కాగితాలు ఇచ్చారు. సబ్బులు, కంచాలు,

నేయి, మజ్జిగ యిచ్చారు. ఎవరిదీపము వారిని తెచ్చుకో నిచ్చారు. అవన్నీ కడలూరులో తీసివేశారు. మళ్ళీ అక్కడ దెబ్బలాట; మళ్ళీ కొన్ని యిచ్చారు. ఇంతట్లో ఆరునెలలూ అయ్యాయి, నేనూ బయటకువచ్చాను.'

'ఎల్లాగన్నా చాలా కష్టం అండీ, మీ రెల్లా ఉన్నారో! నాకు ఈ సహాయనిరాకరణం వృథా అని దృఢమైన నమ్మకం ఉంది. మీరు ప్రభుత్వము వాళ్ళిచ్చినవి పరిపాలిస్తూ ఎక్కువ కావలెనని గడబిడ చేస్తూవుంటే, నెమ్మది నెమ్మదిగా అవే వస్తాయి. స్వరాజ్యమూ వస్తుంది.'

'అభిప్రాయాలు వేరులెండి. వానినిగురించి తేల్చుకోవాలంటే తెమలదు.'

'వీరి సంభాషణ అంతా జమీందారుగారు నిశ్శబ్దముగానుండి వినుచుండిరి. జైలునుగూర్చి నారాయణరావు చెప్పుచున్నప్పు డాయన కళ్లు చెమర్చినవి. ఆ పరిసరములనే కూర్చుండి వినుచున్న సుబ్బారాయుడుగారు డగ్గుత్తికలు మింగినారు. విశ్వేశ్వరరావుగారికిని తోడల్లుని యసహాయశూరత ఆశ్చర్యము గొలిపి, వానిపై కొంత గౌరవము నావిర్భవింపచేసినది.

విశ్వేశ్వరరావుగారికి అసహాయవాదులు కాలము వృథాజేయు పిచ్చివారని యనిపించినది.

నారాయణరావు వీరుడని జమీందారుగారనుకొన్నారు. తానిట్టిపుత్రుని కన్నందుకు జన్మము సఫలమైనదని సుబ్బారాయుడుగారు హృదయమున రహస్యముగా నుప్పొంగిపోయినారు.

తన్ను హేళనజేయుటకు సంగతులు తెలిసికొనుటకుగూడ తోడల్లు డట్లడిగినాడని నారాయణరావు గ్రహించుకొన్నాడు. నారాయణరావు నిష్కల్మష హృదయముతో సత్యమునే సతతము వాక్రుచ్చు స్వభావము కలవాడు. నిజము చెప్పు మానవుడు ప్రపంచమున మానవులలోకెల్ల బలవంతుడని యాతడు వాదించును.

అతనికి మామగారి హృదయము గోచరించినది. తండ్రిగారి హృదయము తెలియవచ్చినది. అల్పమానవునివలె తానుచేసిన యల్పకృత్యముల జెప్పుకొంటి నేమోయని నారాయణరావునకు లజ్జ జనించినది. కాని యాతడు తన హృదయమును దరచి తరచి చూచుకొన్నాడు. దోషములేదని సమాధానపడినాడు. చీకట్లు క్రమముగ నావరించినవి.

౧౯
బహుమతి

శారద తన యత్త గారికడకే పోవునదికాదు. జానకమ్మగారు, తన వియ్యపురాలు తనతో మాట్లాడకపోవుటయు, దన తోడలు కూడ తమ గదుల లోనికి రాకుండుటయు, దన వియ్యాలవారి చుట్టములు ముభావముగా మాట్లాడుటయూ జూచినది. కాని సుందరవర్ధనమ్మగారు మాత్రము వేయికన్నుల జానకమ్మగారికి నామె కుమార్తెలకు మర్యాద కేమియు లోటు లేకుండ జరిపించుచుండెను. భర్త మోటుగా నున్నాడనియు రాక్షసియనియు జగన్మోహనుడు తన్ను గూర్చి జాలిపడుటవలన శారదకు భయ మంకురించినది. భర్త బాగా చదివిన నేమిలాభ మని జగన్మోహనరావు బావ అన్నాడు. దివ్యారోగ్యసంపన్నుడగు నారాయణుని విమల హరిద్రారుణవర్ణము, వెలవెలబోవు జగన్మోహనుని యనారోగ్యపు

దెలుపు బసిమిముందర నలుపేయని యామె యనుకొన్నది. దశమినా డందరును గలసి భోజనశాలలో బట్టుబట్టలు ధరించి కూర్చుండినప్పుడు, సుబ్బారాయుడుగారు పచ్చనివాడయ్యు జమీందారుగారు, విశ్వేశ్వరరావు, సుందరరావు, జగన్మోహనరావుల ముందర నల్లనివానివలె గనబడెను. నారాయణరావు లక్ష్మీపతులు నీగ్రోలవలెనున్నారని తనతల్లి పెదవివిరుపుతో దనకు జూపించినది. భర్త బరంపురం వంగపండుచాయ పెద్ద జరీరుద్రాక్షఅంచుల తాపితాలు కట్టుకొని, విశాలవక్షముతో, విశాలఫాలముతో వట్రువలుదిరిగిన దేహసంపదతో, విజ్ఞానము, ధైర్యము, బలము, శాంతము వెదజల్లు తీక్షణములగు చూపులతో స్ఫుటములైన కనుముక్కుతీరుతో ప్రద్యుమ్నునివలె నున్నట్లు ఆమె హృదయాంత రాళము విశ్వసించినను, తల్లిమాటలచే నా విశ్వాస మడగిపోవుచున్నది.

ఆ రోజున తాంబూలములు వేయునప్పుడు శారదను బిలిచి, తండ్రి యాపూట శ్రీరామయ్యగారితో గలసి జంత్రగాత్రముల నైపుణ్యము జూపుమని కోరెను. వీరందరికి నేను సంగీతము వినిపించవలయును గాబోలు ననుకొని తండ్రితో 'నాన్నగారూ నా కేమి యివ్వాళ పాడాలని లేదండీ' యనెను.

తన యిరువురు కుమార్తెలను కుమారుని జమీందారుగా రత్యంతము ప్రేమించినారు. వారు కోరునది కొండమీద కోతినైనను దెచ్చినారు. ఆ ముప్వురు బిడ్డలకు దండ్రియన్న భయము, గాఢ ప్రేమయు. తండ్రికి సంతోషము గలుగజేయవలెననియే ప్రయత్నించెదరు. తండ్రి తెల్లబోయినట్లు కనిపించగనే శారద 'సరేలెండి నాన్నగారు తప్పకుండా పాడ్తాను' అని తండ్రియొడిలో తలనిడి కంటనీరు పెట్టుకున్నది. తండ్రి యామె నుదురు ముద్దిడుకొన బైకెత్తి నపుడు శారద దల నెత్తనిచ్చినదికాదు. జమీందారుగారు 'సరేలే అమ్మా' యని కొంచె మనుమానపడి, తలయెత్తి కంటనీరు తుడిచికొన్నట్లుండుటచూచి, యేమదియని చిన్న బుచ్చుకొని 'పోనీ అమ్మా నీకు బాగాలేకపోతేవద్దు, కచ్చేరీ వద్దు. ఇంకొకసారిలే' యన్నారు.

శారద చెంగున యచ్చటనుండి పారిపోయినది. ఏమది? తన ముద్దుల కుమార్తె యట్లు కంటనీరు పెట్టుకున్నది?

నారాయణరావు తన చిన్నారి పొన్నారి ప్రేయసికై పండుగ బహుమతి పట్టుకొని వచ్చినాడు, బంగారపు గొలుసులో ఆణిముత్యములు, నాయకమణి యైన గోమేధికపతకము మిలమిలలాడుచున్నవి. ఆ హారము వెల పదునెనిమిది వందలరూపాయలు. ముద్దులొలికిపోవుచున్నది. ఆ హారము దనంతట తాను భార్యమెడలో నలంకరించదలచి యువ్విళ్ళూరినాడు.

రంగమ్మగారితో రహస్యముగ శారదను మేడమీదకు దీసికొని రమ్మనియు, దానొక బహుమతి యీయదలచుకొంటి ననియు జెప్పినాడు. రంగమ్మగారు శారద నేదేని వంకబెట్టి మేడమీదకు దీసికొనివచ్చినది. నారాయణరావు లేచి 'శారదా! ఈ బహుమతి నీకోసం పట్టుకువచ్చాను. పండుగ బహుమతి' అని సుందరమగు నొక రజితపేటిక సీలనొక్కి మూతదెరచి, లోన మొఖమల్ పరుపుపై పవళించియున్న యా హారము జూపించినాడు. శారద తెల్లబోయి యాపెట్టె నందుకొనక యటులనే నిలుచుండెను. రంగమ్మగారు 'పుచ్చుకోతల్లీ! పుచ్చుకో అమ్మాజీ! బాగుండదు పుచ్చుకోకపోతే' అన్నది. శారద చేయిచాచి యాపెట్టె పుచ్చుకొని విసవిస నడచి, గదిలోనికిబోయి తన పెట్టె తెరచి యందులో నా బహుమతి పెట్టె నుంచి తాళమువేసి క్రిందిగి దిగి పోయెను. నారాయణరా వామె ధరించిన యెట్లుండునో చూడవలయునని కుతూహలముపడినాడు.

తన్ను మేడమీద నొక విచిత్రము జరుగునని రంగమ్మగారు తీసికొని వచ్చుటయు, భర్త బహుమతి నొసగుటయు శారదకు దిగ్భ్రమ కలిగించినవి. ఆమె యేమియు మాటలాడలేక, రంగమ్మగారిపై గోపము తెచ్చుకొనలేక, యక్కజమున నాలోచించుకొనుచు గ్రింద తమ్ము డాడుకొనునట్టి గదిలోనికి బోయి యచ్చట గూర్చుండెను.

'చిన్నక్కా! ఏనుగు బాగా పరుగెత్తుతుందా, గుఱ్ఱమా?'

'ఏనుగు, తమ్ముడూ.'

'మరి కీయిచ్చి వదిలిపెడితే రెండూ ఒకమోస్తరుగా పరుగెత్తుతున్నాయేమి?'

శారద నవ్వుకొనుచు 'ఈ యేనుగూ ఈ గుఱ్ఱమూ అల్లాగే పరుగెత్తుతాయి తమ్ముడూ!' అన్నది.

'చినక్కా! చిన్నబావ నీ కెప్పుడన్నా కథలు చెప్పాడా?'

శారద మాట్లాడదు.

'చిన్నక్కా! చిన్నబావ నిన్ను చెన్నపట్నం తీసుకువెడతాడా?'

'ఛీ! ఊరుకోవోయి!'

'పోనీలే చిన్నక్కా అంతకోపంవస్తే! నీ కన్న మా చిన్నబావే మంచివాడు.'

శారద కోపంతో నచ్చటనుండి విసవిస వెడలిపోవుచు జగన్మోహనుని రెండవ సభామందిరమందు చూచినది. జగన్మోహనుడు 'శారదా! యిల్లారా! ఏమిటి? ఎక్కడదాగున్నావూ? అంతా వెతికానే!'

శారద ఇంకను కోపముతో మౌనమూని యచ్చటనొక కుర్చీ పైకూర్చున్నది. 'ఇంత కోపంగావున్నావు, ఎవరిపై నేమిటి? నా పైని కాదుగదా? ఇదిగో! నీకో బహుమతి పట్టుకువచ్చినాను, పండగ బహుమతి. ఎంత చిన్న గడియారమో! ఇది అసలు బంగారంగాజుకు అతికించిఉంది. ఈ గడియారము చూడు. ముద్దులు గులుకుతూ లేదూ శారదా?'

శారద యదిజూచి 'చాలా బాగుంది. మా నాన్న నాకిచ్చినగడియారం కన్న బాగుందే!' యన్నది.

'చేయియేదీ?' యని జగన్మోహనరావు శారద యెడమచేయి పుచ్చుకొని యా బంగారుగాజు చేతిగడియారము నామె చేతికి బెట్టి, యాచేయి నిటు నటు త్రిప్పుచు ఆ చేయిని దన పెదవులకడకు గొనివచ్చి ముద్దిడుకొన్నాడు. శారద యొడలు ఝల్లుమన్నది. జగన్మోహనుడు శారద బుజముచుట్టు దనచేయి వేచి యామెను దనకడకు లాగుకొని యామెతల తన హృదయమునకు హత్తుకొనెను. శారద హృదయము దడదడ కొట్టుకొన్నది. అతని హస్తమునుండి నెమ్మదిగ తప్పించుకొని యాబాలిక 'నువ్విచ్చిన గడియారము అమ్మకు చూపించివస్తా' నని లోనికి వెడలిపోయినది.

ఆ సాయంకాలము పై మేడపై నొంటిగా గూర్చుండి జగన్మోహనుని కౌగలింతను గూర్చి యాలోచించుకొనుచున్నది. జగన్మోహనరావుబావ చాల మంచివాడు, అందమైన వాడును.

కాని అతని కౌగిలింత తనకంత యిష్టమేల కాలేదు? తియ్యని జలదరింత పొందినమాటమాత్రము నిజము. ఇరువురి బహుమతులలో నెవరి బహుమతి బాగున్నది? వారిచ్చిన బహుమతియు చాల యందముగా నున్నదనుట కామె హృదయ మొప్పుకొనక తప్పినదికాదు.

జగన్మోహనుడు చాల అందగాడని యామెకు బొరము నేర్పబడినది. కాని చదివిన ప్రతి నవలలో బలమైనవాడు, ఉత్కృష్ట గుణసంపన్నుడు, మేధావి, నిజమైన సౌందర్యవంతుడని వర్ణించినారు. చక్కని రవివర్మబొమ్మలు కాని, మోడరన్ రివ్యూలోని బొమ్మలుకాని అన్నియు తనభర్తను తలపింప జేయుచున్నవి. ఇరువురిలో నెవరెక్కువ యందమగువారో యామెకు నిర్ధారణ కాలేదు. అయినను వారికన్న జగన్మోహనుడే సుందరుడు కాకుండు టెట్లని యామె యనుకొన్నది.

జగన్మోహనుని బెండ్లి చేసికొనియున్నచో, దానొక జమీకి రాణియై యుండును. ఇప్పుడు పల్లెటూరిలో నుండవలసివచ్చినది. భర్త ఉద్యోగము చేసినమాత్ర మేమిలాభము? బావ యెప్పుడు చక్కని కబుర్లు చెప్పుచుండును. ఎంతయో ప్రేమజూపియుండును. ఏమో? జగన్మోహనరావు బావకు తన్ను పెండ్లి చేసికొనుట అంత యిష్టములేదేమో అని భావించుకొన్నది. ఏది ఎట్లయిన నీయత్త వారు తన కర్మముచే దనకు సంభవించినారని యక్కగారును తల్లియు నెన్ని సారులో యనుకొన్నారు. అది నిశ్చయమని యా బాలకు స్పష్టమై తోచినది.

౨౦
తాత ముచ్చటులు

పండుగనాడు భోజనములైనవెనుక జమీందారుగారు స్వయముగా వియ్యంకునకు క్షీరాబ్ధితాపితా బహుమతినినిచ్చెను. బాలకుడగు కేశవచంద్రునిచే నల్లుళ్ళకు, మేనల్లుళ్ళకు, లక్ష్మీపతికి, శ్రీరామమూర్తికి బహుమతుల నిప్పించెను. ఆడవారికి జమీందారిణియు, నాయమ కొమరితలు నిచ్చిరి. అందరును క్రొత్త వస్త్రముల ధరించిరి.

పండుగ మరునాడు సుబ్బారాయుడుగారు కుటుంబముతో కొత్తపేట వచ్చి చేరిరి. సుబ్బారాయుడుగారి ముత్తాతగారి పెద్దకుమారుని కుమారుడు రాధాకృష్ణయ్యగారు దొడ్డంపేటనుంచి విచ్చేసిరి. డెబ్బదియెనిమిదేండ్లవృద్ధు. బండియెక్కడు. ఎంతదూరమైన నడవగల శుద్ధసత్త్వుడు. ధవళమై నెరసిన మీసములతో, జుట్టుతో భీష్మునివలె నాజానుబాహుడగు మానిసి. సుబ్బారాయుడు గారికన్న నెక్కువ సత్త్వముగలవాడు.

‘ఒరే సుబ్బారాయుడూ! పిల్లలు మేకలు కులాసాగా ఉన్నారురా! చూసివద్దాము, మళ్ళీ చూడ్డంపడుతుందో లేదో అని వచ్చాను. చిక్కావేమిటి? ఏమిటో ఈ రోజుల్లో నీఅంత చిన్నతనంలోనే ముసలితనాలురా. ఏరీ నీ కొడుకులూ! వీడు పెద్దాడా? చిన్నాడా వాడు? నలుగురేగా కూతుళ్ళు నీకు? అది పెద్దగా? నీపిల్లలేరీ, శ్రీరామమూర్తీ? ఆ గొట్టికాయవెధవ నీకొడుకే! పరవా లేదురా నీ సంతానమూ, సంతానం సంతానమున్నూ. ఏదీ నా కోడలు. రాజమండ్రి పెళ్ళికి వద్దామనుకుంటే విజయనగరం వెళ్ళాలిసొచ్చింది. నడిచి వెళ్లవలసిందే. కాని ఈ పట్టు రైలులో వెళ్ళాలి తప్పదని మా చలమయ్య చంపాడురా. వెధవ రైలు. దానికన్న నేనే ముందు వెళుదును. కాని అదీ ఒక విచిత్రంగానే ఉంది. రైలెక్కడం అదే మొదలు. ఆస్తి ఏమాత్రం సంపాదించావు?’

‘ఉంది, బాబూ! నీ వెరగనిదేవుంది!’

'నీపని బాగుంది అన్నారులే. జమీందారుతో సంబంధం చేశావుట. సంతోషం. నీ రెండోకోడల్ని చూడాలి. రాజమండ్రి వెడుతున్నా. నే నక్కడికి వస్తానని నీ వియ్యంకుడికి రాయి. వెళ్ళి చూసి మోటారెక్కి ద్రాక్షారం వెళుతా.'

'నువ్వు ఒక వారం, పదిహేనురోజు లిక్కడుండాలి బాబూ!'

'వీల్లేదు రా!'

'అలా అంటే పనికిరాదు.' 'సరేలే!'

తటవర్తి వారి కుటుంబాలు పెద్దవే. అచ్చుటచ్చుట దేశమల్లా ఉన్నవి. బాగా ఆస్తులు సంపాదించుకొన్నారు. రాధాకృష్ణయ్యగారికి మంచి ఆస్తి ఉన్నది. కాని యాయన తదనంతరము కుమారులు నలువురు పంచుకొన్నచో, తలకొక యిరవై యకరాలు వచ్చును. పైగా పెళ్ళిళ్ళకు, భూములు కొనుటకు అప్పులు చేసినారు. అవి పెరుగుచున్నవి.'

'బాబూ! మీ అప్పులన్నీ తీర్చారా?'

'ఏమి తీర్చుడమోరా, మనవాళ్ళ బతుకులు మారువాడీల చేతుల్లో అంతరిస్తా యనుకుంటాను. రామచంద్రపురంవాళ్ళకు ఏడువేలు తణకాలమీద ఇవ్వాలి. ఎవ్వణ్ణి చూసినా అప్పులే. దేశం అంతా అప్పు నానాటికీ పెరిగిపోతోంది. ఎలాగో తీర్చుకోడం. నాలుగురాళ్ళు మిగుల్చుకున్న వాడెవ్వడూ కనబట్టంలేదు.'

'అవును. దేశంలో పండిన పంటంతా ఏమవుతోందో, మనవాళ్ళు_ ఇదంతా రూపాయికీ కాసుకూ ప్రభుత్వంవారు ఏర్పాటు చేసిన మారకం రేటు వల్లనే అంటారు. అట్లాకాకుండా మారకంరేటు తగ్గించి, వెండి ఖరీదుచేసి, మేలిమి వెండి పట్టుకువెళ్ళినవారికి, చేయుబడి ఖరీదు తీసుకొని, గట్టికి ఇతర లోహం కలిపిన ఖరీదు తీసివేసి, రూపాయ చేస్తే దేశం దౌర్భాగ్యం తగ్గుతుంది అంటారు. జపానులో అల్లా చేస్తారు. కనుకనే వాళ్ళ దేశంలో వస్తువులు వెట్టిచవుక. అప్పు లేదు, బీదతనం లేదు అని మా నారాయుడు చెప్పాడు.'

'ఏమి లెక్కలో! మా చిన్నతనంలో మేము జొన్నన్నం తిన్నాం, వరీ తిన్నాం; వస్తువులు వెట్టిచవుక. మనవాళ్ళందరికీ, మెరకాపల్లం అంతా కలిసి రెండువందల యకరం ఉంటే, స్వంతంగా వ్యవసాయం. కాయగూరలు పండేవిరా! మా నాయన జొన్నమోపు పొలాన్నుంచి మోసుకువచ్చేవాడు. మళ్ళీ దేశపాండేలంకూడా. లోకం అంతా గజగజలాడేది. కుంఫినీరాజ్యం రాని క్రితంసంగతి యెరుగుదునని మా తాతయ్య రామయ్యగారు నాకు చెప్పేవారు, మీ నాన్నా యెరుగును. మీ తాత ఈ ఊరు దౌహిత్రం వచ్చాడు. ఇల్లరికం కూడాను. ఆ రోజుల్లో మా తాతయ్యా తండ్రి పల్లకీమీద వెడుతోంటే వీధుల్లో జనం కూచునిఉండేందుకువల్లా! మీ తాతయ్యా తాత మా తాతయ్యా తండ్రి. తెలుసునా? ఆయన నవాబుదగ్గిరకు పల్లకీమీదేరా వెళ్ళడం సుబ్బారాయుడూ!'

నారా: ఏం తాతయ్యా, మీ తాతయ్యా వాళ్ళూ బాగా వడ్డూపొడుగూ మనుష్యులేనా!

రాధా: ఒరే నారాయుడూ! నన్ను చూశావా, నా పొడుగుముందర మా తాతయ్య గోపురం అనుకోవాలి. వాళ్ళ శక్తి, సామర్థ్యం మాదగ్గిర ఎక్కడుందిరా?

నారా: మీదగ్గరున్నది మాదగ్గిర లేదు తాతయ్యా! రాధా: మీరా, మీరు వాలఖ్యిలులే! మా నాయన గారు కరణీకం ఊళ్ళు పధ్నాలుగూ తిరిగి మిట్టమధ్యాహ్నం ఇంటికి

వచ్చేటప్పటికి మా బామ్మా వాళ్ళు వడ్డుదంచి, బియ్యంచేసి అన్నంవండి, అటక మీంచి గుమ్మడికాయదింపి, తరిగి కూరవండేవారు. వంటా అయ్యేది, మా తాతయ్య వచ్చేవాడుట. స్నానం, సంధ్యావందనం అంతా అయ్యేటప్పటికి పన్నెండున్నర. అతిథి అభ్యాగతీ, ఇంట్లో వాళ్ళూ అంతా కలిసి యిరవైమంది భోజనాలు మగవాళ్ళు.'

నారా: నేను చెన్నపట్టణం వెళ్ళేలోపుగా దొడ్డంపేట వచ్చి మనవాళ్లందరిని చూసి వెళ్తాను తాతయ్యా!

రాధాకృష్ణయ్యగారు ఉన్న నాలుగు రోజులును సుబ్బారాయుడుగారు పినతండ్రికి తన పొలములు, దొడ్లు, పాకలు, తోటలు మొదలైనవన్నియు జూపించినారు.

తెలుగుదేశమే కాదు, భారతభూమియే యంత కంత కధోగతిలో బడిపోవుచున్నదని రాధాకృష్ణయ్యగారి మతము. మనుష్యుల కెప్పడును జబ్బులే, అలసులు, పట్టుమని పది అడుగులు నడువలేరు. నూరు సంవత్సరముల మాట యటుండనిచ్చి డెబ్బదియేండ్లు బ్రతికిన మగవాడేడీ!

'ఒరే సుబ్బారాయుడూ, మనదేశం చేసిన పూర్వకర్మలవల్ల యింకాబతికి వుంది కాని ఈ రోజుల్లో జబ్బులకూ, వాటికీ దేశం నిర్మానుష్యమై యుండ వలసిందే, ఏమంటావు?'

'అవును బాబూ! ఎట్లాగో దారీ తెన్నూ కనబడటంలేదు. చదువులు, నాగరికత, మోటార్లు, రైళ్లు, తిండిలోబలం తగ్గడం__ఈలాంటివన్నీ కూడు తున్నాయి.'

'అవునురా. ఈ ఆనకట్ట వచ్చి మన కొంప మాడ్చింది. డెల్టాలలో ఉన్న జనం మెరకజనంకన్న భాగ్యవంతులు అని చెప్పుకోవడమే కాని వాళ్ళంత బీదవాళ్ళింకోళ్ళు లేనేలేరు. కాలవ మాగాణి అంతా నిస్సారం అయిపోయింది కాదుట్రా?'

'దానికి తగినట్లు మిల్లుబియ్యం కూడాను.'

'సరిపోయె, మఱేమీ! మా యింట్లో దంపుడుబియ్యం ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. అయితే యిప్పటివాళ్లు డబ్బు లేకుండా, జవసత్తువులు లేకుండా వుండడానికి సగం కారణం ఏమిటనుకున్నావు? వీళ్ళకి దైవభక్తి నశించింది, సంధ్యావందనం లేదు, దేవుడుగుళ్ళోకి వెళ్ళరు, పూజా పునస్కారాలు లేనేలేవు. ఇవన్నీ సగం దేశాన్ని తగలేస్తున్నాయి.'

నారా: తాతయ్యా, నువ్వలా అంటావు, ఎప్పుడు ఉండేవంటావు భయం భక్తి పూజా పునస్కారాలున్నూ?

రాధా: ఎప్పుడా? మా కాలంలో. నారా: అయితే మా అంత అప్రాచ్యులు పుట్టడానికి కారణం మీ కర్మా, మా కర్మా?

రాధా: మీదీ మాదీ కూడా రా.

నారా: మీదే అందాము. అలా అయితే మాతప్పు కాదుకదా? మా భక్తి రాహిత్యానికి కారణము మీరు కాబట్టి, మేము చేసేది ఏమీ లేదు. ఇక మేమే కారణము అందాము. అయితే ఎప్పుడో ఒకప్పుడు దీనికి కారణమైన దుష్కర్మ చేసివుండాలిగదా! ఆ! అప్పుడు భగవంతునిమీద భక్తి లేని వాళ్లున్నారన్న మాటేగా? అప్పుడే ఉంటే ఇప్పు డుండడంలో

ఆశ్చర్యము ఏమీ లేదన్నమాట.

రాధా: ఆ! తెలివైనఘటమేరా నీ కొడుకు, సుబ్బారాయుడూ!

ఆ సాయంకాల మంతయు నారాయణరావుకు తాత గారు చెప్పిన సంగతియే జ్ఞప్తికి వచ్చినది. తానుగూడ రాముడు దేవుడు కాడని వాదించిన రోజులు జ్ఞప్తికి వచ్చినది. తాను ఇంగరుసాలు వ్రాసిన గ్రంథములు చదివి నిజమని నమ్మిన వత్సరము లెన్నియో! ఈనాటి యువకులు భక్తిరహితులైనారు. తాను దేశములు తిరిగినప్పుడు గుడులలో భక్త్యావేశము కలిగెడిది. తన స్నేహితు లనేకులు పూజ సేయించు టననేమో యెరుంగరు.

భక్తి యెందుకు? మోక్షముకొఱకా? మోక్షమననేమి? యని వాదించువాండ్రు. మోక్షము భగవంతునితో నైక్యమందుటా? మోక్షము లేనిచో నష్టమేమి? పుట్టుచు గిట్టుచునుందుము. పుట్టుచు గిట్టుచు ననంతమువరకు భగవంతునికి దూరులమై సైతానులవలె నున్న మాత్రమున భయమేమి? అని వారడుగుదు రనుకొందము. భగవంతుడన నేమిటి ? భగవంతుడొక వ్యక్తి యందురా? ఆ భగవంతు నెవరు పుట్టించిరి? కాదు నామము, రూపము, మొదలు, చివర లేని__ నేతి, నేతి నేతి యనజెల్లు నొకానొకటి యని యందురా? అదికాదన్న నేమి నష్టము? అని నారాయణరావు హోరాహోరి వాదించువాడు. నే డాసంగతు లన్నియు మనస్సునకు దట్టినవి.

ఈ బ్రహ్మాండములో ననంతవిశ్వములో నొక సౌరకుటుంబములో నొక చిన్న భూగోళములో నొక చిన్న పురుగువంటి తాను భగవంతుడనుట నిజమా? 'శివోహం' అని తెలిసికొనుటయే శుద్ధ మోక్షమా? నేను బ్రహ్మమునైన, సమస్తము బ్రహ్మము. కాని ఒక చక్రవర్తి నిద్రబోవుచున్నంత కాలము తాను చక్రవర్తి నను జ్ఞానములేక, తానేమియో తెలియక మైమరచియుండి మేల్కొనుట తోడనే దాను చక్రవర్తినను జ్ఞానమును బొందునట్లు, నీ బ్రహ్మము తన్ను తానెరుగునా? ఆత్మజ్ఞాన పరిపక్వముచే ఈ గ్రంథములన్నియు జదువుచున్న కొలది నేమో తెలిసినట్లుండును. ఏమి తెలిసినది? మనకు తెలిసినట్లున్న దంతయు మాయకావచ్చును. నిజము గోచరించుట యుత్తమపురుషునకే కాబోలు. ఆస్థితి, తనకీజన్మములో నున్నదో లేదో? తన కొక్క వాసనయు వీడిపోలేదే. శారద తనకుగావలె. తన బంధుగులు, తన యాస్తి, తన మిత్రులు తన చదువు, తన! తన! తన!

౨౧

ఆడవాళ్ళ బ్రతుకు అథోగతి బ్రతుకు

మరునాడు సుబ్బారాయుడుగారి రెండవ కొమరితకడనుండి యుత్తరము వచ్చినది. సత్యవతి యిరువదియారేళ్ళ స్త్రీరత్నము. తీర్చిన కనుముక్కుతీరు కలిగి జామపండు చాయతో సుందరియని చెప్పతగిన వనిత. కాని బెంగచే కృశించి శలాకవలె నైపోయినది. భర్త రంపపుగోత, ప్రథమసంతానమగు నొక బాలిక తప్ప తక్కిన పిల్లలందరు పోయినారు. ఇప్పుడు మరల నెలతప్పి మూడు నెలలయినది.

వీరభద్రరావు కెప్పుడు ననుమానమే. ఛాందస బ్రాహ్మణుడు, కఠిన హృదయుడు. చిన్నతనమున నెంత సంతోషజీవియో, నేడంత పరమకోపియై నిప్పులు గ్రక్కుచుండును. అతని తల్లికిగూడ కుమారుడన్న భయము. చేయు నుద్యోగము పెద్దాపురమున డిప్యూటీకలెక్టరు కచ్చేరీలో రెండవగుమాస్తా పని. యేబదిరూపాయల జీతము ఖాయము. ఎనభై తాత్కాలికపు జీతము.

రివిన్యూపనిలో మంచి తెలివితేటలుగలవాడు. ఇంటిదగ్గర నెంతపులియో, కచ్చేరిలో అంతపిల్లి. పైఅధికారులన్న గజగజలాడుచుండును. వారి మెప్పును బొంది ప్రాపకము సంపాదించుకొనుచుండును. గ్రామాధికారులపై తోడేలువలె పడును. తనదగ్గరకు బనియుండివచ్చిన వారు పెద్దవారైనచో నిమిషమున వారిపని చేసి పంపును. చిన్నవారైన కస్సుమనును, బుస్సుమనును. అట్టిచో నెవరైనా దిరుగబడి 'ఏమిటయ్యా! ఇదిగో వీళ్ళందరిని సాక్ష్యం వేసి పెద్ద కలెక్టరుకు పిటిషను పెట్టి డిప్యూటీకలెక్టరుగారికి ఇప్పుడే ఆర్జీ దాఖలుచేస్తాను ఉండు' అని యనెనా తక్షణమే వీరభద్రుడు చిరునవ్వునవ్వి 'ఏందుకు లేకోపం' విసిగిస్తే అన్నాను. ఇదుగో చూశావూ, అబ్బాయి! పొద్దున్నుంచీ పని చేస్తూ ఉంటా. చూశావూ! అలాంటప్పుడు కాస్త కోపమూ వస్తుంది. చూశావూ, తొందర పడకు, ఏమిటీ నీపని?' యని మేకపిల్లయైపోవును.

మంచి ఆస్తిగల కుటుంబము, గౌరవమైన కుటుంబమని యీయ, నిట్లు కొమార్తె యగచాట్లుబడుచున్నదిగదా యని సుబ్బారాయుడుగారి మనస్సు కలత నొందుచుండును.

సత్యవతి నారాయణరావు తోబుట్టువులలో నెల్ల నందగత్తెయని యెన్న దగిన పూబోడి ఆమె. కన్నులు పరమకరుణాపూరితములై, శిశునిర్మలత్వమును గోచరింపజేయును. ఆమె లేడివలె సాధుహృదయ, సాధ్వి, పతిభక్తి పరాయణ, ఆ బాల తెలివియైనది. ఏ మానిసియైన యట్టిభార్య రావలయునని తప మొన రింపవలయునంతటి సుశీల. కఱ్ఱతో మోది కుక్కనువలె భర్త కొట్టుచుండినపుడు కిక్కురుమనదు. 'రామ! రామ! రామ!' యని మాత్రమనుకొనుచు, నశ్రుధారలు తుడుచుకొనుచుండును.

సత్యవతి కొమరిత బంగారుబొమ్మ. తల్లి నోటిలో నుండి యూడిపడినది. తండ్రి తల్లిని గొట్టునపుడు విరగబడి యేడ్చును. ఒకనాడు 'నాన్నా నాన్నా! అమ్మను చంపెయ్య రక్తము వస్తూంది' అని అడ్డంపడితే ఆమెను కూడ చావగొట్టినా డా కర్కోటకుడు.

జానకమ్మగారి పేర సత్యవతికూతురు నాగరత్నం ఉత్తరం వ్రాసినది. 'అమ్మమ్మా, ఈరోజు అమ్మను కొట్టిన దెబ్బలకి అమ్మ మూర్ఛపోయింది. రెండుగంటలు తెలివిరాలేదు. నాన్న డాక్టరుకోసం వెళ్ళగానే ఈ ఉత్తరం మీకు రాయమని మా యింట్లోనేకాపురంవున్న విజయలక్ష్మమ్మత్త యీ కార్డు యిచ్చింది. నీకు ఉత్తరం రాశాను, వాళ్ళే పోస్టులో వేశారు. ఈమధ్య నాన్నకు కోపం ఎక్కువైంది. తప్పులు క్షమించవలెను. చిత్తగించవలెను. ----- మనుమరాలు, నాగరత్నం.'

ఈ యుత్తరము చూచుటతోడనే జానకమ్మగారు కళ్లనీళ్ళు క్రుక్కికొనుచు వాపోవజొచ్చెను. సుబ్బారాయుడుగారు చిన్నబోయి మనసున కుములుచున్న కోపమున, నేమి చేయవలెనో యాలోచన తేలక కూరుచున్నారు. తన చిన్నతనములో నిట్టివ్యాపారము తనచెల్లెలికి జరిగియుండినచో దానేమి చేసి యుండును? వానిని బోయి తొక్కి పాతర వేసి, తన చెల్లెలి నింటికి తీసికొని వచ్చియుండునా? అయ్యో, అది తప్పు. స్త్రీ, పతివ్రత; పతిభక్తి పరాయణ. భర్త చంపినను సరే, భరించవలయును. తాను దుర్మార్గుడైనచో తన బావమరది తన్ను హతమార్చుటకు దా నొప్పుకొనునా? ఏది ఎట్లయినను దన బాలికగతి యంతియ. వెళ్ళి తీసికొనివచ్చి తన యింటిదగ్గర నుంచుకొనిన లోకము హర్షించునా? పోనీ, లోకముకొరకు వెరువక తీసికొనివచ్చి పంపించక యూరకుండినచో? తన ముద్దులబిడ్డ బ్రతు కథోగతియేకదా. ఏది ఎట్లయినను తనకుమార్తె యనుభవించవలసినదే! అని యూహాలోకమున బడి సుబ్బారాయుడుగా రుస్సురని కూర్చుండిపోయిరి.

రాధాకృష్ణయ్యగా రది విని 'ఏమిరా సుబ్బారాయుడు! మా పినతల్లిని ఆవిడ మొగుడు

యిలాగే వేపుకుతింటుంటే రెండుసార్లు కాపురానికి వెళ్లిన రెండు సంవత్సరాలలో నూతిలో బడిందట. రెండుసార్లూ ఎవరో బతికించారటరా అబ్బాయి! ఆ తర్వాత మొగుడుమీద తిరగబడి మహాశక్తి దేవతై వెధవన్నని పిల్లిలా చేసిందట. అల్లాగే నువ్వు చేసేదేముంది? నేను చేసేదేముంది? భార్యాభర్తలకు దెబ్బలాటవస్తే వాళ్ళే సముదాయించుకోవాలి' యనెను.

నారాయణరా వీ సంగతివిని, తండ్రిగారితో చెప్పి, పెద్దాపురం వెళ్ళినాడు. తన చిన్నక్కగారు మొన్ననే పండుగకువచ్చి, పెద్దాపురం వెళ్లినది. ఇంతలో నేమి మునిగినదో! ఆడవాళ్లను గష్టపెట్టు పరమ దౌర్భాగ్యులు, చదువుకొన్న పశువులు నున్నారు. వారికి శిక్ష యెటులో భగవంతుడు ఎరుగడు కాబోలు.

మధ్యాహ్నము రెండుగంటలకు నారాయణరావు పెద్దాపురం చేరుకున్నాడు. ఇంటిదగ్గర బావగారు లేరు. తన చిన్నక్కగారు, మేనకోడలు నాగరత్నము నున్నారు. 'చిన్న మామయ్యా! నిన్నే వచ్చింది మెలుకువ అమ్మకు. ఆ కట్టుకట్టిందే, అమ్మకు తల పగిలిపోయింది. ఉగ్రుడైపోయి చేతిబెత్తంతో కొట్టాడు. మామయ్యా! నన్నూ కొట్టాడు మా నాన్న' అని నాగరత్న మన్నది.

'ఒరే తమ్ముడూ! నా కర్మానికి మీరంతా ఇదిఅవుతే ఏం లాభం! ఈ తెలివతక్కువ మొద్దు మీకు ఉత్తరం రాయడం ఎందుకు చెప్పు? అమ్మకీ, నాన్నకీ, మాకూ గుండెలు తరుక్కుపోవడం తప్ప ఏం లాభం ఉందీ?

'ఎందుకు కొట్టాడే చిన్నక్కయ్యా?'

'ఎందుకైతే ఏమిరా బాబూ! నేను పూర్వజన్మలో చేసుకొన్న పాపం నన్ను ఇల్లా బాధిస్తూంది. ఏదో కారణం. ఆయన మంచివారే. ఊళ్ళోవాళ్ళందరికీ మంచే. అందుకనే ఆయన కొట్టిన సంగతి ఊళ్ళోవాళ్లకి తెలియగానే నావల్లే తప్పుందనీ, నీ బావగారివల్ల తప్పేమీ లేదనీ ఈ చుట్టుప్రక్కల వాళ్లు కొందరు అనుకున్నారు. నన్ను గురించి మీ రనుకొనేది తప్పు అని వాళ్లతో నేను చెప్పగలనురా! నా కర్మం.'

'అమ్మని పెద్దమామయ్య తీసుకువచ్చి దిగబెట్టగానే, అమ్మని ఏదో అని, నాన్న కోప్పడ్డాడు మామయ్యా! అప్పణ్ణుంచి ఏదో ఒక కోపమే?'

'అయితే నిన్ను అంత చావగొట్టడానికి కారణం ఏమిటే?'

'ఏవుంది, పండుగకు వెళ్ళి ప్రతిమగవాణ్ణి చూశానట. ఇంకా ఏమో ఏమో అన్నారు. జవాబుచెప్పను నాయనా! చెపితే అప్పుడే ప్రాణాలు వదులుకోవాలి.'

'అదా! సరేలే!'

'నా తోడు! ఒట్టు! ఒరే తమ్ముడూ! ఏమన్నా తొందరపడతావేమో సుమా! నేను నుయ్యో గొయ్యో చూసుకుంటాను!'

'ఒసే అక్కయ్యా! నీ మొగుడు పశువు కాని మేమంతా పశువులు కాము. జన్మం ఎత్తినందుకు జ్ఞానం కలిగిన మనుష్యులుగా సంచరించాలి. ద్విపాద పశువైపోవాలా! ఛీ! వెధవజన్మలు. కుక్క నయం. పందినయం. పెళ్ళాన్ని చావగొట్టి ఆమెచస్తే, మళ్ళీ పెళ్లి చేసుకొని, కొత్తగావచ్చిన పెళ్లానికి అడుగులకు మడుగులొత్తుతారు మగ సన్యాసులు, పురుగుజన్మ లక్కయ్యా.'

'ఒరే బాబూ నీకు కోపం వస్తూంది. నువ్వు బలంకలవాడవు. చేయి చేసుకొని నన్నథోగతిపాలు చెయ్యకు. నా కర్మం నేను అనుభవిస్తాను గాని, నువ్వు ఇంటికి వెళ్ళిపో.' 'ఒసే అక్కయ్యా! నువ్వు వెట్టి అభిప్రాయం ఎందుకు పడతావు! నేను బావను కొట్టలేను. కొట్టగలిగివుంటే అతనిపని బాగానే ఉండును. నాకు బలం లేక కాదు. అట్టి నీచపుపనికి నేను దిగలేను.'

ఆ సాయంకాలమునకు వీరభద్రరావు వచ్చునప్పటికి పడకకుర్చీలో గూర్చుండిన బావమరిదిని జూచి తెల్లబోయి 'ఎప్పుడువచ్చావోయి బావా?' యని ప్రశ్నించెను.

'మధ్యాహ్నం.'

'ఏం పనిమీద?'

'చెన్నపట్నం వెళ్లబోతూ మిమ్మల్ని చూద్దాం అని వచ్చా.'

'అలాగా! అని లోనికిబోయి 'నాగరత్నం!' అని కూతుర్ని పిలిచి, ఎందుకు వచ్చాడే మీ చిన్న మామయ్యా?' అని ప్రశ్నించెను.

నాగరత్నం గజగజలాడిపోయినది. ఆమె కళ్ళనీళ్ళు తిరిగినవి. నారాయణరావు గ్రహించి లోనికిబోయి బావగారితో నిట్లనెను.

'బావా! ముసుగులో గుద్దులాట యెందుకు? నాగరత్నం వాళ్ళమ్మకి తెలియకుండా పక్కయింటివారు యిస్తే, కార్డుమీద మాయింటికి ఉత్తరం రాసింది. నేను వచ్చాను. నువ్వు చదువుకొన్నవాడివి. రేపు వియ్యమంద దలచుకున్నావు. నిన్ను గుఱించి ప్రపంచం ఏమనుకుంటున్నదో నీకు తెలియటంలేదు. బావా! మన కుటుంబాలలో ఇలాంటిది ఎక్కడన్నా ఉందటోయి!'

'నాపద్ధతి అంతే. నన్నేమి చెయ్యమంటావు? నాకు కోపం జాస్తి, దాన్ని చంపుకుందామని ప్రయత్నంచేస్తే చావదు. నన్నేమి చెయ్యమంటావు?'

'రాత్రి మాట్లాడుదాములే. ఇప్పుడేమి మాట్లాడకు.'

తాను వాడుకొనుటకు కొన్న వెస్టు అండు కంపెనీ వారి ఎనుబది రూపాయల ఖరీదుగల బంగారు 'కీపుసేక్' అను చేతిగడియారము నారాయణరా వీయబోగా నతడు వలదని వారించినాడు. నారాయణరావు బావగారిని తీక్షణంగా జూచి 'బావా, నువ్వంతకంతకు చాలా చిత్రంఅయిన మనిషివి అవుతున్నావోయి. మనం మగవాళ్లం. ఆడవాళ్ళు నీరసులు. ఎలా చూసినా వాళ్ళు మన చేతిలో ఉన్నారు. మనం దయదలచి, ఆడవాళ్ళని మనుష్యులుగా ఎంచాము. అయినా వాళ్ళు మన దృష్టిలో పశువులు. అంతే. వాళ్ళని చంపినా ఎవరూ ఏమనరుగదా? ఆఫ్రికా నీగ్రోలల్లే ఆడవాళ్లు వస్తువులేకదా బావా! బానిసలే ఆడవాళ్ళు? నిన్న మొన్నటిదాకా అరబ్బీ, పెరిసియా, టర్కీ దేశాలలో ఉన్నట్లు, బానిసత్వం మన దేశంలో కూడా ఉండాలనా మనం ఈరోజున ప్రయత్నం చేయవలసింది? బావా, నీ హృదయం సర్వవిధాలా మంచిది. పది మందిలో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకుంటున్నావు. నీకోపం అంతా యింట్లో చూపిస్తున్నావుగాని, నీ పైఅధికారి పైన చూపించగలవా? అలాగైతే వెయ్యి రూపాయిలిస్తాను బహుమతి నీకు. నీ పైఅధికారి నిన్ను కోపపడినా రాని కోపం, నీ చేతిలో ఉండి నీకు దాసివలే వంగి ఉన్న భార్య పైన ఎందుకు వస్తుంది? అధికారి పైన వచ్చినకోపం అంతా ఏమయింది? అది మనము అణచి

వేసుకుంటాము, చంపివేస్తాము. ఆ శక్తే మనం, మనకింద వాళ్లపట్ల కూడా ఎందుకు చూపకూడదు? యుగ పురుషుడు గాంధీమహాత్ముడు, క్రైస్తు, బుద్ధుడు మనకు బోధచేసింది. ప్రేమకాదా బావా? మనం కోపం చంపుకుని ప్రేమ చూపించడంవలన మనలను నమ్ముకున్న వారు జన్మజన్మకు మనయం దపరిమిత కృతజ్ఞత చూపిస్తారు. ఒకరియెడ ద్వేషంపూని వారిని హింసిస్తూ తక్కిన యావన్మంది విషయంలో ఎంత ప్రేమచూపినా, అది క్రోధస్వరూపము, అసత్యమూ అవుతుంది సుమా! క్రోధం రావడం, మనలో పశుత్వం ఇంకా చావలేదనేదానికి సూచన. నీకన్న చదువు రాని యానాదివాడు గొప్పే!

'నేను ఉపన్యాసం ఇస్తున్నాను అని అనుకుంటావేమో? ప్రపంచంలో అందరికీ ఇలాంటి విషయాన్ని గురించే నేను ఉపన్యాసం ఇవ్వాలసివస్తుందా బావా?

'బావా! నన్ను బాగా ఎరుగుదువుగదా? మామయ్యగారూ, అత్తయ్యగారూ ఈ విషయంలోనే నీతో కలహం పెట్టుకున్నారు. మా వాళ్ళందరూ దుఃఖిస్తున్నారు. నీమనస్సుమట్టుకు నీకు బాగుందా? నేను చిన్నవాణ్ణే! అయితే నీకూ నాకూ ఉన్న చనువునుబట్టి చెప్పాను.

'ఆడది ఎల్లాగా దెబ్బలు పడుతుంది. ఎదిరించలేదు. అది పతివ్రతలకు ధర్మం. సహజం. కాని, వాళ్ళూ మన తోటివాళ్ళు అని ఆలోచించాలి. నేను నిన్ను వేడుకొనేదింతే.'

౨౨
నాదీ భారం

బావమరిది మాటలు విన్నకొలదీ వీరభద్రరావుకు కోపము, నా వెనుక లజ్జయు, నా వెనుక విషాదము కలిగినది. అతడు మారుమాటాడలేదు. అతని కన్నుల నీరు తిరిగినది. ఇంతలో గోపమువచ్చినది. మరల నాపుకొన్నాడు. తానిచ్చిన యుపన్యాసమునకు బావగారికి గోపమువచ్చునని నారాయణరా వనుకొన్నాడు. అందుకై యేమి చెప్పవలయునా యని యాత డాలోచించుచుండెను.

లోపల సత్యవతి యేది యెట్లగునో యని లోన గజగజ వణకిపోవుచు, సత్వరముగ వంటచేసెను. బావమరదు లిరువురు కాళ్లుకడిగికొని భోజనముల ముందు గూర్చుండిరి. వీరభద్రరావునకు భోజనము సహించలేదు. నారాయణరా వది చూచి 'బావా! నువ్వు సంతోషముగా భోజనము చెయ్యి. లేకపోతే నాకు అన్నం వంటపట్టదు' అనెను. భోజనములైనవెనుక వీరభద్రరావు నారాయణరావును 'మీ అక్కయ్యను మీ యింటికి తీసుకెళ్తావా?' అని ప్రశ్నించెను.

'అదేమిటి బావా! రెండురోజులేగా అయింది మా అక్కయ్యవచ్చి! తర్వాత యేడోనెలలో తీసుకెడ్తాము. అన్ని రివాజులు తప్పించాలి అని మా అమ్మ గారంటూనే ఉన్నారు. పురిటికి రాజమండ్రి తీసుకెళ్లాలని ఉన్నది. ఏమంటావు? నీ యిష్టం అయితే మావాళ్ళ యింటికి తీసుకువెళ్తాం. లేకపోతే ఆస్పత్రిలోవుంచి అక్కడ పురుడుపోస్తాం. లేకపోతే నేను చెన్నపట్టణం తీసుకొని వెళ్ళిపోతాను. ఆలోచించుకో, అమ్మా వాళ్లూ వస్తారు.'

వీరభద్రరావుకు దానెందుకు దన యిల్లాలిని కొట్టినాడో తెల్లమైనది. జమీందారుగారువచ్చి పిలిచినాడు. జమీందారు వీరభద్రరావుగారిని బంపుడని డిప్యూటీకలెక్టరుగారి నడిగినాడు. డిప్యూటీకలెక్టరుగారు వీరభద్రరావుగారిని దీసికొనిపోవచ్చుననియు దనకు పరమసంతోషమనియు వీరభద్రరావు ఆఫీసులో కెల్ల మంచి

గుమాస్తాయనియు దానును బ్రమోషనుకు వ్రాసినాననియు జెప్పినాడు. వీరభద్రరావు వెళ్ళవలెననియున్నను కలెక్టరుగారికి ముఖ్యమగు బనులుండుటచే, మకాంగుమాస్తా వీరభద్రరావు తప్ప నింకొకరు పనికిరారని యాయనకు తోచి వీరభద్రునితో నీవువుండి 'నీ భార్యను బిల్లను బంపు' మని చెప్పినారు. వీరభద్రరావు చేయునదిలేక, నిట్టూర్పులతో, హృదయమున ఝంఝామారుతముతో, భార్యను గూతును జమీందారుగారితో బంపినాడు. జమీందారుగారు తన మోటారు తోలువానితో ముందు కూర్చుండి, సత్యవతిని, కొమార్తెను వెనుక గూరుచుండబెట్టి, తన కారులో రాజమహేంద్రవరమునకు తీసికొని వెళ్ళిపోయినాడు.

జమీందారు గారు పెద్దలు, పూజ్యులు అని తానెరుగును. వేఱుతలంపులు దలంచుట హైన్యమనియు నెరుంగును. పండుగ నాలుగురోజులు వీరభద్రరావనుభవించినది యమలోకము. ఎంతమంది పరపురుషులు జమీందారుగారి యింటికి వచ్చెదరో? భార్య వారిని చూచునేమో? వారు తేరిపార భార్యను జూచెదరు కాబోలు. ఇదివరకెప్పడు భార్యను బుట్టింటికి పంపినను దానుగూడ వచ్చి, తనతో దీసికొనిపోవువాడు. పండగనా డెట్లయిన దాను రాజమహేంద్రవరము పోవలయునని యెన్నియోవిధముల బ్రయత్నించినాడు. కాని డిప్యూటీకలెక్టరుగా రొప్పుకొనలేదు.

ఇంటికి తన భార్యను పెద్దబావగారు శ్రీరామమూర్తి తీసికొనివచ్చి దిగబెట్టుటతోడనే భార్యపై మండిపడినాడు.

'నువ్వు దౌర్భాగ్యురాలివి! నువ్వు పెద్దాపురం సానిదానికన్న నీచురాలివి. ఆపళంగా పరుగెత్తుతావూ! నీ మనస్సు చెడుమనస్సు కాకపోతే నువ్వలా తయారవుతావా? నీచపుముండా! అక్కడ యెందరకు ఉత్తరాలు రాశావో...' ఇట్లు వినగూడని, వ్రాయగూడని, యుచ్చరింపరాని కారుమాట లన్నాడు. వీథిలో కాట్లాడు నూరకుక్కయైపోయినాడు. నేడు వీరభద్రరావుకు దన నైచ్యమంతయు గనులకట్టినది. సత్యవతి తనకు చేసినసేవ, యామె ప్రేమ, యామె మెత్తని హృదయము జ్ఞప్తికి వచ్చినది. మరల ననుమానపు బిశాచము పీడించినది. భార్య యెవరో యొకనిని ప్రేమించుచున్నదని కాదు, తన్ను మాత్రము ప్రేమించుటలేదని యాతని భావము.

నారాయణరావు రెండురోజులక్కడ నుండి వీరభద్రరావుకు వేదాంతము బోధించినాడు. ఇతర దేశములలో, స్త్రీలను జూచు విధ ముగ్గడించినాడు. స్త్రీలను పూర్వమునుండియు భారతీయులు గౌరవించుచుండి రన్నాడు.

'బావా! మనకు స్త్రీ లెంత గౌరవనీయులోయి! మన నాగరికతను, మన గౌరవాన్ని, మన నీతిని, మన జాతిని కాపాడుచున్నది ఆడవాళ్ళోయి బావా. ఖడ్గతిక్కనను జ్ఞప్తికి తెచ్చుకో. రుద్రమదేవిని, తరిగొండ వెంకమాంబను, మొల్ల మొదలగువీరవనితలను స్మరించుకో! మాంచాల భర్తకొరకై తపస్సు చేసి, భర్త బోగందాని వలలో బడితే, భర్తను కాపాడుమని దైవమును ధ్యానించి, భర్తపాదాలు స్మరించి స్మరించి ఉంటూ ఉన్నప్పుడు, బాలచంద్రుడు యుద్ధానికి అనుజ్ఞ అడగడానికి మాంచాలదగ్గరకు వస్తే, మాంచాల కత్తినిచ్చి యుద్ధానికి పంపి, భర్త వీరమరణం పొందితే తాను సహగమనం చేసింది. మల్లమ్మదేవి చరిత్ర తెలియదు బావా నీకు?'

కొన్నిగంట లాతని బొగడినాడు. 'నీ హృదయం చాలా మంచిది బావా! నువ్వెందరకు ఉపకారం చెయ్యడం నే నెరగను! నీబోటి మనిషి మా సహాయ నిరాకరణంలో జేరితే గొప్ప నాయకుడవు అవుదువు. నీ హృదయము ఈ ఉద్యోగంలో చేరడంవల్ల యిల్లా పాడయింది. కాని యిలాంటి ఉద్యోగాలలో ఉండి తమ జీవితాలను న్యాయమార్గాన్ని నడిపే

మహానుభావులున్ను ఉన్నారని యిప్పటివరకు ప్రజలు చెప్పుకోవటం లేదటోయి?'

మరునాడు నారాయణరావు బావమరదికడ సెలవు పుచ్చుకుని, అక్కగారికి దండ్రియిచ్చిన ఇరువది రూపాయలు సేత బెట్టి కొత్తపేట వెడలి పోయినాడు.

తల్లితో సంగతులన్నియు జెప్పి తాను తన బావమరది మనస్సును కొద్ది నెలలలో మార్చగలనని ధైర్యము చెప్పెను.

'నాయనా, నువ్వలా అంటావు. ఎవరు మార్చగలరురా ఆ కర్కోటకుడి మనస్సు! అల్లాగే కుళ్ళి కుళ్ళి కృశించి, సత్యం ఏ నుయ్యో గొయ్యో చూచు కొంటుందిరా నాయనా!'

'అదికాదు అమ్మా! నువ్వలా కుంగిపోతా వెందుకే? దాని బాధ తప్పించడం నాది భారం. అతను ఈ పట్టు నా చిన్నక్కయ్యను కష్టపెట్టాడా, నేను వెళ్ళి అతని యింటిదగ్గిర నిరశనవ్రతం చేస్తాను. దానివల్ల ఆతని మనసు పూర్తిగా కరుగుతుంది.

౨౩
అఇఉఊణ్‌ఋఌక్

చెన్నపట్టణమునకు బ్రయాణమై, రాధాకృష్ణయ్యతాతగారు తోడరా, నత్తవారింటికి నారాయణరావు మధ్యాహ్నమునకు జేరుకొనెను. జమీందారుగారు తనయల్లుడు వచ్చుటకు ముదమంది, యల్లుని జ్ఞాతియగు తాతగారి నపరిమిత గౌరవమొనర్చి తమ సంతోషమును వెలిబుచ్చి నాలుగురోజులు తమ యింటికడ నుండవలయునని బలవంతపరచిరి. కాని రాధాకృష్ణయ్యగారు తనకు జాలకార్యము లున్నవనియు, దాను త్వరితముగ జుట్టముల నందర జూచి యింటికి బోవలయు ననియు జెప్పినారు.

నారాయణరా వారాత్రి మెయిలుమీద చెన్నపట్టణమునకు బ్రయాణమై పోవుట యాగినది. జమీందారుగారు మరియు బలవంతము పెట్టుటచే రాధాకృష్ణయ్యగారు మరుసటిదినమంతయు నచటనే యుండిరి. జమీందారుగారు వారికి వెలగల యుడుపులు భక్తితో సమర్పించినారు. వారును శారదకు నొక వెండిగంధపుగిన్నె ఆశీర్వాదముతో చేతనిడి, తమ నారాయణునకు తగిన భార్యయని సంతోషించినాడు. లక్ష్మీపతి యింటికి బోయి చూచివచ్చి, మోటారుబస్సుమీద మరునాడు రాధాకృష్ణయ్యగారు ద్రాక్షారామము వెడలి పోయిరి.

జగన్మోహనుడు రాధాకృష్ణయ్యగారు వెళ్ళినప్పటినుండియు నాయన గూర్చి శారదకడ, నావెనుక తన మేనత్తకడ హేళన ప్రారంభించెను.

'మామయ్య గారికి మతిపోయినట్టుంది. నానారకము అడివిమనుష్యుల్ని ఆయన గౌరవము చేస్తూవుంటారు.'

'ఎంత ముసలివాడో ఆయన బావా!'

'నాకు చూస్తే భయమువేసింది. ఆ ముసలి మీ ఆయన తాతటగాదూ?'

'అనుకున్నారు.'

'మీ ఆయనా, ఆ ముసలివాడూ కలిసి నుంచుంటే పెద్దకోతీ చిన్నకోతీలా ఉన్నారు.

నేను నవ్వుపట్టలేకపోయాను శారదా! హహహ.’

శారద మాట్లాడలేదు. జమీందారిణి తన మేనల్లుని జూచి,

‘నీవు పోల్చిన పోలిక సరిగా సరిపోయినదోయి!’ యన్నది.

ఆనాడు జమీందారుగారి చుట్టములలో నారాయణరావు కుటుంబమును గూర్చి చిత్ర విచిత్ర సంభాషణ బయల్వెడలినది. వేళాకోళములు, వెక్కిరింతలతో విరుగబడినారు. ఆ సాయంకాలము జగన్మోహనుడు శారదకడకు జేరి ‘శారదా! తోటలోకి షికారువెడదాము, రా!’ అని అడిగెను. ఆరోజు పున్నమ. ఆశ్వయుజ పూర్ణిమ ఆనందకల్లోలిని. నీలములు ధవళములునగు శారదాజ్యోత్స్నలు మీగడతరకలై, మధురక్షీరతరంగములై యుబికిపోవును.

శారద వల్లెయని తోటలోనికి బయలుదేరినది. ఆ బాలకు యౌవనము నానాటికి పూవునకు దావివలె జేరుచున్నది. ఆమెను సౌందర్యము వెన్నెలవలె నావరించియున్నది.

పూవుతోటలోని సౌరభము, దిశల నావరించియున్న పండు వెన్నెలలు శారదాసౌందర్యములో లీనమైపోయినవి.

శారదను శలభమును చూచు గౌళివలే జగన్మోహనుడు తేరిపార చూచుచు, వెనుక నడచుచు నా బాలిక నొక వేదికకడకు గొనిపోయెను. సుగంధములగు వేడినీళ్ళ స్నానమాచరించి, పాముకుబుసమువంటి గ్లాస్గోమల్లు పంచగట్టి, అట్టి లాల్చీయేతొడిగి, ‘కూటికూర’ పొడి దేహమెల్ల నలది ఘుమ ఘుమమనుచు, జరీపూవు బుటేదారిపనిచేసిన ముఖమల్ పాదరక్షలు ధరించి తెల్లనిదేహము వెన్నెలలో తళుకులాడ, ప్రక్కనే నడచు జగన్మోహనుని జూచుచు శారద ముగ్ధురాలై పోయినది. జగన్మోహను డామెకు నవమన్మథుని వలె కన్పట్టినాడు. ఆ బాలకుని బెండ్లి చేసికొనియుండిన నెంత చక్కగా నుండెడిదో అని ఆమె నిట్టూర్పుపుచ్చినది. చిన్నతనమునుండియు దా నాతనినే ప్రేమించినానని యామె యప్పుడనుకొన్నది. ‘ప్రేమించుట’ యను విషయ మామెకు నవలలవలన తెలియునుగదా. ప్రతిబాలికయు నెవరినేని పురుషుని ప్రేమించునుగదా . ప్రేమలేని పురుషుని బెండ్లిచేసికొనినచో నామె గతియెట్లు? తన తండ్రిగారట్టి ప్రేమకు దన్నెడసేసి వేరొకరికిచ్చి వివాహమొనరించుట తన దురదృష్టముగదా! తాను జదివిన పెక్కు నవలలలో కథానాయకులకు నాయికనిచ్చి వివాహముచేయక తల్లిదండ్రులందరు నిట్లే యితరుల కిచ్చుటకు బ్రయత్నించినారు.

‘శారదా! ఏమిటీ ఆలోచిస్తున్నావు? ఇదివరకు నీరక్తం ప్రవహించడమే పైకి కనబడుతుంది అనుకున్నాను. ఇప్పుడు నీ ఆలోచనలుకూడా కనిపిస్తున్నాయి ప్రియా!’

‘ఏమి లేదు బావా!’

‘శారదా! నీ అందం నా అందం కలిసిపోతే ఎంత బాగుండును! నేను నీభర్త నైయుంటే రోజూ నీపాదాలదగ్గర కూచుని నిన్ను ప్రేమిస్తూఉందును.’

శారద మాట్లాడలేదు కాని యామె హృదయము జగన్మోహను డన్న మాటకు సంతోషముచే బొంగిపోయినది. శారద నాతడు దగ్గరకుజేరిచి యామెచుట్టు చేయివైచి, యామె మోము పైకెత్తి తమితో ముద్దుగొనబోవుచుండ, కేశవచంద్రరావు గబగబ నచ్చుటికి, బరువెత్తి వచ్చి ‘చిన్నక్కా, నాన్నగారు నీకోసం చూస్తున్నారు’ అన్నాడు.

కేశవచంద్రరావు మాట వినబడుటతోడనే శారదా జగన్మోహను లిరువురు నులికిపడినారు. జగన్మోహనుడు తన చేయి శారదచుట్టునుండి తీసివేసి, దూరమునకు జరిగినాడు. శారదయు గబుక్కునలేచి, త్వరితముగ లోనికి వెడలిపోయినది.

జగన్మోహను డచ్చటనే యొంటరియై కూర్చుండెను. అబ్బా! యీ పిశాచిబాలకుడు సమయానికి దాపరించుచున్నాడు. తాను జమీందారుబిడ్డ యయ్యు వీనికి నా వెధవపల్లెటూరి మొద్దంటే ఇంత ప్రేమ యేమిటి? ఆ తండ్రిపోలిక తగలబడింది కాబోలు. 'నిమిషంలో జారిపోయినది. ఇంకొక చిటికలో నామెను ముద్దుగొనియుండువాడే. ఎప్పటికైనా తనదే శారద!'

శారద లోనికి బోవునప్పటికి జమీందారుగా రొక పడుకకుర్చీపై నధివసించి యేవేని వార్తాపత్రికల జదువుకొనుచు, శారద వచ్చుట జూచి, యామెను దగ్గరకు లాగికొని 'ఎక్కడకు వెళ్ళావమ్మా' యని ప్రశ్నించెను.

'తోటలోనికి నాన్నగారూ.'

'జగన్మోహనుడు నిన్ను కొట్టబోయాడు అని తమ్ముడు చెప్పాడేమిటమ్మా?'

కేశవచంద్రుడు తండ్రికడకుబోయి తండ్రిగారి చేతిమీద రెండుచేతులు వైచి తండ్రి మొగముచూచి, 'ఆ! బావ శారదను దగ్గిరగా తీసికొని కొట్టబోయాడు. అది కిటికీలోంచి చూచాను. రంగమ్మను కనుక్కోండి నాన్నగారూ!' జేవురించిన మోముతో పలికినాడు.

జమీందారుగారు కుమారునెత్తి యొడిలో కూర్చుండబెట్టుకొని, కౌగిలించుకొని, క్రిందికి దింపివేసెను.

'అమ్మాయీ! జగన్మోహనరావు తోటలో నున్నాడా!' యని యడిగెను.

'అవును నాన్నగారూ. నేనూ బావా తోటలోకి వెళ్ళాం. అదిచూచి బాబు బావ నన్ను కొట్టున్నాడు అనుకున్నాడు కాబోలు.'

'అదేలే! లేకపోతే ఏమిటి కాని, నువ్వు లోనికివెళ్ళు తల్లీ! బాబూ నువ్వు బువ్వతిన్నావా? నిన్ను ఎవరూ పడుకోబెట్టలేదూ? తల్లీ, బాబుకు నువ్వు జగన్మోహనునితో మాట్లాడటమే ఇష్టంలేదు.'

శారద మరల వచ్చునేమో యని జగన్మోహను డచ్చటనే కూర్చుండి యుండెను. ఎంతకును నామె రాకుండుటయు, భోజనమువేళదనుక నచ్చటనే యుండెను. శారదచుట్టు చేయివేసినప్పు డాతని కన్ను లెఱ్ఱపడినవి. కాయము మోహావేశముచే వణకిపోయినది. ఆ వణకంతయు నెమ్మదించుకొనుచు శారద యందమును గూర్చి తలపోయుచు నా జమీందారు డటులనే యాలోచనాపరుడైపోయినాడు. వెనుక విజయనగరములో మనోహరియను వేశ్యతో దాను సలిపిన క్రీడలన్నియు నాతని స్మృతిపథంబునకు వచ్చినవి. ఆ పిల్ల కన్నెరికమునకు లక్షాధికారు లనేకులు ధనమిచ్చెదమన్నను, వారందరు సమర్పణ చేసెదమన్న రొఖ్ఖముకన్న మిన్నగా తానర్పింప నీయకొనెను. దానే కన్నెరికముచేసి, యా రాత్రి దాననుభవించిన మహదానందము స్మరించుకొనుచు, శారద తన కౌగిలి జేరినచో నంతకన్న నెక్కువ సంతోషము బొందువాడనుగదా యని, తలంచికొని యుస్సురుమనియెను.

జమీందారుగారు తన కొమార్తె శారద జగన్మోహనునితో నెక్కువ చనువు చేయరాదని యూహించుకొని శారదను జూచి 'అమ్మా నువ్వు జగన్మోహనరావుతో నంత చనువుగా నుండకూడదు. నువ్వీమధ్య చదువుతగ్గించి నట్లున్నది. ఈ యేడు తప్పక స్కూలు ఫైనలు పరీక్షలో నెగ్గాలిసుమా. మీ గురువుగారితో ఇంకా జాగ్రత్తగా చెప్పమని చెప్తాను. సరే, లోపలికి వెళ్ళు' అని చెప్పినారు.

శారద తెల్లపోయి నెమ్మదించుకొని 'బాగానే చదువుకుంటున్నానండి నాన్నగారూ! తప్పకుండా పరీక్షలలో నెగ్గుతానని ధైర్యంగా వుంది' అని జవాబు చెప్పినది. ఆమె కన్నులలో నేలనో నీరుతిరిగినది.

జగన్మోహనరావు బావ తన్ను ప్రేమించుచున్నాడని తండ్రి గ్రహించి నాడేమో యని యామె కొంచెము భయపడినది. ఆమె మాటలో చూపులో నిర్మలత్వము ప్రద్యోతమగుచున్నది. ఆమె హృదయము నిష్కలుషము. ఒక నిమేషము తనయను దీక్షముగా జూచి యామెకు దెలియకుండగనే కనులు వాల్చి కొమరితను దగ్గరకు దీసికొని, యామె శిరంబు మూర్కొని ముద్దిడుకొనెను. శారద లోనికి వెడలిపోయినది.

జగన్మోహను డంతకంతకు నధోగతిలో పడిపోవుచున్నాడనియు, విజయనగరములో కొందరు వారకాంతలతో దిగంబరుడయి యొక గణికా గృహంబున జలక్రీడలు సలిపినాడనియు, జమీందారీవలనవచ్చిన రాబడిచాలక దినదినము వేలకువేలప్పుచేయుచున్నాడనియు, యూరేషియను సాంగత్యమున వారికి ధనము దోచిపుచ్చుచున్నాడనియు జమీందారు గారికి అస్పష్టమైన వార్తలు వినవచ్చినవి.

రెండవ బావగారగు నారాయణరావు తనకు కథ చెప్పుచున్నట్లు కల గనుచు కుమారరాజా కేశవచంద్రరావు నిదురగూరినాడు.

నారాయణుడు రాత్రి రైలులో వెళ్లుచున్నాడు. వేగము! వేగము! రైలు సంగీతము పాడునా! ఒకొక్కప్పుడు రైలు తాళము వేయుచున్నట్లు తనకు తోచును. ఎంత చిత్రమో? టక టక టక టక. శారద మెరపువలేమాత్రమే తోచినది. నారాయణుడు పాడుకొన్నాడు.

ఓహో కవిత్వమా, నీవు విశ్వమోహినివి. శివుని డమరుకమున జనించితివా?

'అ ఇ ఉ ణ్ ఋ ఌ క్.'

ఈ రైలుచక్రముల చప్పుడు అందుండియే జనించినదా?

'అ ఇ ఉ ణ్ ఋ ఌ క్.'

'శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాజేషుయే.'

కవిత్వము సర్వకళాస్వరూపము. కవిత్వము విశ్వస్వరూపము. సర్వ సృష్ట్యాత్మకము. అఇఉణ్ఋఌక్. టక టక టక టక. ఆతడు నిద్రగూరినాడు.

తృతీయ భాగము

౧

పునస్సంధానము

నారాయణరావు బి. ఎల్. పరీక్షలో బ్రథముడుగా నెగ్గిన వెనుక హైకోర్టులో నొక సుప్రసిద్ధ న్యాయవాదికడ ఎప్రెంటీసు శుశ్రూష నడపి యా పరీక్షలోను మొదటివాడుగా 1928 సంవత్సరపు వేసవికాలములో కృతార్థుడైనాడు. శారదయు బ్రవేశ పరీక్షలో విజయము గాంచినది. జమీందారుగా రామెను నింటరుపరీక్షకు జదివించుచున్నారు.

ఆ వేసవికాలములో భార్యాభర్తలకు పునస్సంధానమహోత్సవం సంకల్పించి చుట్టముల నందరిని రప్పించినారు. నారాయణరావు స్నేహితులు చుట్టములుగూడ బెండ్లికి వచ్చినట్లే వచ్చినారు.

పునస్సంధానమున కొంతమంది విచ్చేయుట నారాయణుని కిష్టము లేకున్నను తండ్రిగారి యిష్టమున కాత డెదురుచెప్పలేక పూర్వాచారము ప్రకారము చుట్టపక్కములతో జమీందారుగారి గృహమునకు దరలి వెళ్ళెను.

ఉదయముననే భార్యాభర్తలు పీటలమీద కూర్చుండవలయును. గ్రామ గ్రామములనుండి బ్రాహ్మణోత్తము లెందరో విచ్చేసిరి. జమీందారుగారి సభా మంటపమంతయు లోచనమోహనముగ నలంకరింపబడినది. చుట్టములు, స్నేహితులు, పండితశ్రేష్ఠులు, పరివారజనము క్రిక్కిరిసియుండిరి.

పూర్ణయౌవనముచే నారాయణరావు దేహము మిసమిసలాడుచుండెను. చిరుమీసములు తుమ్మెద రెక్కలవలె నల్లనై మోమున కొక వింతయందము గూర్చెను. కుమారస్వామివలె, మంజుశ్రీవలె, శ్రీకృష్ణునివలె నున్న యాతని మూర్తి తెల్లగంధపు బొమ్మవలె సభ్యుల కన్నులకు జల్లనై హృదయములు మోహింపజేసినది. సంధ్యావందన మొనర్చి, తడిపి యారవేసిన క్షీరాబ్ధిదుకూలముల ధరించి, యున్నతమూర్తియు గోమూర్ధకటియునగు నా యువకుడు, మత్త గజగమనముతో వత్సరాజువలె నరుదెంచి పీఠముకడ నిలుచుండెను.

శారద సర్వాభరణభూషితురాలై సరిగ బుటేదారియంచుల హోంబట్టు చీర ధరించి, తెల్లని మేల్పట్టు బనారసు (జంపరు) కంచుకము ధరించి, పూలు ముడిచిన వాలుజడతో వచ్చి భర్తప్రక్కనే నిలుచుండినది.

మంగళవాద్యములు బోరుమనినవి. దంపతులను పీటలపై నధివసింప జేసిరి వసిష్ఠులవారు.

'ఓం కేశవాయస్వాహా ఓం నారాయణాయస్వాహా ఓం మాధవాయ స్వాహా' అని వసిష్ఠు డాతనిచే నాచమనాదులు చేయించెను. అప్పుడు వాలుజూపులతో నారాయణరావు భార్యను జూచినాడు. ఉన్మి.................గు నామె వివిధాంగములు స్ఫుటత్వము దాల్చుచుండ వసంతమునాటి మల్లికాలతవలె మిలమిలలాడినది. ఆమె కన్నులు నిశ్చల నిర్మల యామినీతారకలవోలె మెఱిసినవి. ఆమె చెక్కులలో నుషస్సుందరీ హాసములు ప్రసరించిపోయినవి. ఆమె బంగారు దేహము మేల్మియెక్కి పాలసంద్రాన

సంధ్యారుణహేమము లలమినట్లయినది. నిత్యోపాసనాగ్నిని ఆ దంపతులు జరిపిరి.

ఆమె నడకలో నొక యొయారము, చూపుల కొక వెన్నెల, శరీరమున కొక దీప్తి, యాలోచనలకొక యనంతనీలత్వము, ఆమెలోనే యొక దివ్యశ్రుతి ప్రత్యక్షమైనవి యని నారాయణరావు ప్రణయయోగమున గన్నులు మూసి ధ్యానించెను. మనసులో నామెను కౌగలించుకొన్నాడు. ఆమె తన ప్రాణములోని ప్రాణము, ఆత్మలోనియాత్మ యనుకొన్నాడు.

తనచేతిలో నామె యుదకము పోసినప్పు డామె యంగుళులు చంద్రకిరణములై యాతనికి దోచినవి.

పురోహితు డేమేమి తంతు చేయించెనో, యెప్పుడు మామగారు తనకు స్వయముగను తన భార్యకు నత్తగారిచేతను శుభవస్త్రముల నిప్పించెనో, ఎట్లు తానా శుభవస్త్రముల ధరించెనో, యేవిధమున నాశీర్వచనముచేసిరో, హారతు లెత్తిరో యవి యన్నియు నారాయణరావు గమనించలేదు.

పీటల పైనుండి లేచినపిమ్మట నారాయణరావుతో పరమేశ్వరుడు, 'ఒరే నారాయణా! నీ మోము దివ్యమై కనిపించిందిరా, ఇందాక పీటలమీద. ఏమిటి ఆలోచిస్తున్నావు? మీ రిద్దరూ కూర్చునిఉంటే, ఇంతకన్న పరమోత్కృష్టమైన దాంపత్యము ఎక్కడనైనా దొరుకుతుందా అనుకున్నా, 'అనిరుద్ధుడూ, ఉషాబాలలా కనబడ్డారురా మీరిద్దరూ!' అన్నాడు.

'ఓహో, మొదలెట్టావు, మాగధస్తుతి?'

'అరే పోవోయి స్తుతి యేమిటీ? నీ భార్యలాంటి అందమైనపిల్ల, నీవంటి మారసుందరుడు ఉన్నారట్రా! మీరిద్దరూ సినిమాలో చేరి ప్రపంచానికి ఆదర్శరంగనక్షత్రా లెందుకు అవరాదూ?'

'డగ్లాసు ఫైర్‌బాంక్సు, మేరీ ఫిక్‌ఫోర్డు లంటావా మేము?'

'ఆ అదే!'

'మన దేశంలోని నవీన తారలతో పోల్చావుకాదు నీ పుణ్యమా?' అని లక్ష్మీపతి అందుకొని, 'మనదేశంలో నాటకాలు ఎందుకూ పనికిరాకుండా తయారవుతున్నాయి, నానాటికి' అన్నాడు.

నారా: పరమేశ్వరుడు చక్కనిపిల్లలా ఉండేవాడు. ఎప్పుడూ ఆడ వేషమే వేస్తూ ఉండేవాడు. పర: నువ్వో? నువ్వు కృష్ణుడు, అర్జునుడు, హరిశ్చంద్రుడు వెయ్యలేదట్రా కాలేజీలో?'

నారా: నా వేషాల కేమిగాని, నువ్వు కూల్డ్రేగారి తరిఫీదున ఇంగ్లీషు నాటకాల్లోకూడా ఆడవేషం వేసిన వాడవాయెను.

పర: లక్ష్మీపతికూడా ఆ రోజుల్లో బూడిద పూసుకున్న వాడేరా!

లక్ష్మీ: ఆ! ఏవో బంట్రోతువేషాలేగా మనపాలిటికి!

నారా: నేను వచ్చేటప్పటికే ఆ మహానుభావుడు వెళ్లిపోయాడురా!

పర: నువ్వంటే నిన్ను వదలియుండునా? నీ ఆటలు, నీ తెలివితేటలు, నీగొంతులో పాటలు చూచి నిన్ను సర్వవిధాలా గౌరవంచేసియుండును.

లక్ష్మీ: నాటకాలు, పాశ్చాత్యదేశంలో ఉన్నట్టున్నాయిరా మన దేశంలో పరమేశ్వరం?

నారా: ఎట్లావుంటాయి బావా! వాళ్ళకి డబ్బువుంది. వాస్తవమా అనే భ్రమ కల్పించడానికి తగిన పరికరాలు లక్షలు ఖర్చు చేసి సమకూర్చుకొంటారు. నిజమైన గుఱ్ఱం ఎక్కివస్తారు. రంగంమీద ఉత్తరధ్రువం కల్పిస్తారు. తెరలు రంగస్థలంలా కనబడతాయా? అసలు ప్రకృతి అయిపోతాయి. నిజమైన గుఱ్ఱా, గోపురాలు, మేడలు, మిద్దెలు అయిపోతుంది రంగస్థలం.

పర: డబ్బుగలవాళ్ళు కాబట్టే పదిహేనురూపాయలు టిక్కెట్టు పెట్టినా పెడతారు. లక్షలకొలదీ డబ్బువస్తే వేలకొలది జీతాలుయిస్తే దేశంలో ఉన్న తెలివైనవాళ్ళు ఇతర ఉద్యోగాలకి తిరగరు. అదీ ఒక గొప్ప వృత్తే. ప్రభుత్వంకూడ 'సర్' మొదలైన బిరుదావళులు యిస్తుంది. ఇంతకూ మనదేశం బీదది.

లక్ష్మీ: నారాయణుడు అనడమూ, నువ్వు తందాన తానా! ఆ బాగుంది. అదంతా నేను ఎరగనిదికాదోయి. నా ఉద్దేశం మన వీధినాటకాలకన్నా వాళ్ళ నాటకాలు, ఎక్కువ అందంగా ఉంటాయని.

పర: ఆగు, ఆగు! మన వీధినాటకాలికిమల్లే వాళ్లకి వీధినాటకాలు ఉండేవి. వాళ్ల నాటకాలకిమల్లే మన సంస్కృతనాటకాలు లేవురా మరి!

నారా: తెలుగుదేశంలో ఉన్నాయిరా పరం, సంస్కృతనాటకాలంటివి?

పర: లేవు. కాని యక్షగానాలూ, భామకలాపం, గొల్లకలాపం, వీధినాటకాలూ ఉన్నై. సంస్కృతనాటకాలూ ఆడేవారు.

లక్ష్మీ: తెలుగులో యిప్పుడు వచ్చాయి కాని పూర్వంలేనట్లు ఒప్పుకున్నారా?

నారా, పర : ఆ!

లక్ష్మీ: సంస్కృతనాటకం, ఇంగ్లీషునాటకం వంటిదేనా? నారా: అవును. కాని మన సంప్రదాయం వేరు, వాళ్ళ సంప్రదాయం వేరు. అంతే! తక్కిన 'ఫక్కీ' అంతటా ఒకటే. లోపల భావాలు వేరన్నమాట.

పర: వాళ్ల ఆశయం ప్రాపంచికం, మన ఆశయం ఆధ్యాత్మికం అంతే తేడా.

లక్ష్మీ: మన వీధినాటకాలు వాళ్ళకున్నాయా?

నారా: 'ఓపెరా' లేదు బావా? అది మన వీధినాటకానికి ఒక మోస్తరుగా సరిపోతుంది. ఆ ఓపెరా, సాధారణనాటకం రెండూ కలిపితే మన వీధినాటకం అవుతుంది.

లక్ష్మీ: కాని ఎల్లా భరించగలవురా ఆతందానతాన ధిమికిట ధిమికిట! రాజుభార్య కూడా గంతులు వెయ్యడమే, సంభాషణా మాట్లాడడం ఉండదు. అందరూ కలిసి గంతులూ! 'నువ్వు ఎవడవురా? నువ్వు యెవడవురా?' అని పల్లవిని పట్టుకొని 'నువ్వా! యెవడవురా?' అని తణికితతోం అని యిటు గంతు, అటు గంతులో కథానాయికయైన

చంద్రమతి తన్మయం అయిపోవడం. ఏమిటిది? నాకంతా ప్రహసనంలో ఉంటుంది. అదీకాకుండా ఒక్కొక్కప్పుడు ఈ పాత్రధారులు ఏ రాజువేషమో వేసికొని 'రాజు వచ్చే సభకూ పురప్రముఖులందరూ కొలువ' అని అంటూ వస్తారు. అదేమి అభినయమోయి వెఙ్టికాయా?

నారా: బావా! నువ్వు చెప్పిన దోషాలు దోషాలు కావోయి; అసలు దోషాలు వేరు. 'మూలచ్ఛేదీ తవ పాండిత్య ప్రకర్షః' అన్నట్లు వీధినాటకానికి ఏవి నిజమయిన అందం సమకూరుస్తున్నాయో అవే బాగా లేవంటావు ఏమిటి?

పర: లక్ష్మీపతీ! వినరా వెఙ్టివాడా! శాస్త్రం చెప్పినట్లుగా అభినయం చేసేటప్పుడుందే, నువ్వు ఏపాత్ర అభినయిస్తున్నావో ఆ పాత్రే అయిపోవాలి. అదికాకుండా రెండో ముఖ్యమయిన సంగతి ఏమిటంటే, నువ్వు ఎప్పుడూ సంపూర్ణంగా ఆపాత్రవు కావు కాబట్టి నువ్వు ఆపాత్రను కాను, ఆపాత్రను అభినయిస్తున్నాను అని తెలపాలి. అభినయము ఒక కళ. దానివల్ల చిత్రలేఖనంలో వలే మానవుణ్ణి ఆనందంలో ముంచివెయ్యాలి. భ్రమను కొల్పడమే ముఖ్యసాధనంగా ఎంచుకుంటే, ఈ కళ ప్రాపంచికంలోకి దిగిపోతుంది.

లక్ష్మి: ఒరే నువ్వు మాట్లాడింది కవిత్వంగాని వాదనకాదు. వాడి ఉద్దేశ్యం నువ్వు చెప్పు, బావా!

నారా: విను. భరతదేశంలో కళలన్నీ కూడా కళాస్రష్ట యొక్క ఆశయము వ్యక్తీకరిస్తాయి. ఇదే నిజము అయివుంటుంది అని భ్రమకొల్పడానికి ప్రయత్నించవు. అది అభినయంలో చూపించాలంటే, వీడేసుమా హరిశ్చంద్రుడు అని భ్రమింపజేయడానికి ప్రయత్నించక, నాహృదయానికి హరిశ్చంద్రుడిట్టివాడు సుమా అని చెప్పుతూ నేను హరిశ్చంద్రుడి వేషం వేస్తున్నాను అన్నట్లు తెలియజేస్తూ, హరిశ్చంద్రుడు ఇట్లనవచ్చును, అని వ్యక్తీకరిస్తాడు. తర్వాత తానే హరిశ్చంద్రుడవుతాడు. అంటే తన ఆశయంలో హరిశ్చంద్రు డిట్టివాడు, ఆ హరిశ్చంద్రుడే నేను అన్నట్లు అభినయం చెయ్యాలి.

లక్ష్మి: మీరిద్దరూ ఒకేరకంగా చెప్పారు. ఇంకా విపులం చెయ్యాలి.

౨
శోభనమందిరము

ఎప్పటికిని సాయంకాలము కాదు. పేక ఆడినాడు నారాయణరావు; బ్రిడ్జి, బేస్తు, లిటరేచరు ఎన్ని ఆడినా తోచినదికాదు. హిందూదేశం అంతట, క్లబ్బులలో, గ్రంథాలయములలో, ఇండ్లదగ్గర పాశ్చాత్యదేశమునుండి పందొమ్మిదవ శతాబ్దిలో దిగిన దీ పేకాట. బ్రిడ్జి, ఆ ఆటలలో మహారాజు వంటిది. ఆ యాటలో మన ఆంధ్రులు శక్తి సామర్థ్యములు సముపార్జించుకొన్నారు. నెమ్మదిగా ననేక భేదములతో బ్రిడ్జి యాట దేశమంతటను పల్లెటూళ్ళకును గూడ బ్రాకినది.

'బేస్తాట' ప్రత్యేక మాంధ్రుల సొత్తు. కాని డబ్బు మేజుపెట్టి యాడినచో నంత నష్టముండదు. అర్ధణా, అణా, బేడ మేజుపెట్టి సంసారములు ధ్వంసము చేసికొనువారు కొందరు, కొంద రదేవృత్తిగా ధనము సంపాదించుకొనువారు. జూదమే అని చెప్పదగిన 'రన్‌మోరు' అను నాట కొందరు రహస్యముగా నాడుచుందురు.

ఈ ఆలోచనలతో నారాయణరావు బేస్తాటలో రెండురూప్యము లోడు వడి, ఎపుడు ప్రొద్దుకుంకునాయని ఎదురుచూచుచు, హృదయములోని భావములు పరమేశ్వరునికి దక్క

నేరికిని తెలియనీయక గడియ లెట్టెట్లో వెడలబుచ్చెను.

రాత్రి శుభముహూర్తము సమీపించినది. నారాయణరావు వంగపండు చాయ పట్టుతాపితాలతో వచ్చి పీఠముచెంత నిలిచినాడు. శారద వెలవెలబోవు మోముతో వెండిపళ్ళెరాన గుమ్మడిపండు, నారికేళబొండము, అరటిపళ్ళు, ఖర్జూరఫలములు, పసుపుకుంకుమ, మంత్రాక్షతలు మొదలగు వస్తువులతో బ్రక్కనే నిలిచియుండ, భూదేవత ననుజ్ఞ నొసంగ మంగళపీఠములపై కూర్చుండ నియమించిరి. శ్రీ గణేశ్వరుని దంపతు లర్చించిరి.

కర్మణః పుణ్యాహవాచనము పురోహితులు జరిపించిరి. భార్యాభర్తలకు జమీందారుదంపతులు కట్నాల నొసంగిరి. దంపతులకు బ్రహ్మముడిని రచించినారు వసిష్ఠులు. దేవరులు ప్రత్యక్షమై దివ్యమంత్రములు పఠించినట్లయినది. మంత్రములు మిన్నుముట్టి దిక్కుల గలసిపోయినవి. శుభముహూర్త మరుగుదేర మంగళ వాద్యములు మ్రోగించినారు. 'ఆరోహోరు ముపబర్హ స్వబాహుం పరిష్వజస్వ' అని వధూవరసంశ్లేష సంయోగమంత్రము వసిష్ఠాది భూదేవతలు ప్రారంభించిరి. ఆహో! ఈ సంగమ ధర్మమును మహోత్తమ స్థితికి గొనిపోయిన దా ఆర్యధర్మము! నారాయణుడు దివ్యుడే అయినాడు.

భార్య కెడమవైపున గూర్చుండి, కుడిచేత నామె తనువల్లిని చుట్టి, ఫలములతోనున్న పళ్ళెరమునుబట్టుకొన్న దివ్యక్షణము లాతని నానంద తన్మయుని జేసినవి.

'తం మే వాయో సమర్థయ' ఆశీర్వాదములైనవి.

భార్యాభర్తలను లోనికి గొనిపోయి పాయసము ద్రావించినారు. వారి నిరువుర శోభనమందిరములో, శోభనతల్పాన కూర్చుండ బెట్టినారు.

శోభనమందిరము దివ్యకళామయముగ నమర్చబడినది. గోడలు పాలరాతి వలె స్నిగ్ధములు. నందలాలు, ప్రమోదకుమార, అవనీంద్ర, దేవీప్రసాదరాయ, ఆసిత కుమారాది చిత్రకారకుల చిత్రములు; దామెర్ల రామరాయలు, పరమేశ్వరమూర్తి మొదలగు నాంధ్ర చిత్రకారకుల చిత్రములు అందందు మనోహరముగ వ్రేలాడదీయబడినవి. విశాలమగు నా మందిరమంతయు రంగు రంగుల దీపముల శబలకాంతులచే దీప్తిమంతమైపోవ, పట్టుజాలరులు, కలంకారీ తెరల యందములు విరిగిపోవ, నిలువుటద్దములు తమ హృదయములలో మందిరాంతరములు వేనకువేలు సూప, దంతపుబల్లపై చందనపు వెండి రాగి విగ్రహములు; కొండపల్లి, నక్కపల్లి కఱ్ఱబొమ్మలు; ఆగ్రా స్ఫటికశిలాప్రతిమలు; లక్నో లోహ సామగ్రులు, మెరుగులీన నాగది నలకూబరుని కేళీమందిరమై విలసిల్లిపోయినది. దంతపుకోళ్ళ పెద్ద పందిరిమంచము చిత్రమగు తెరలతో, పాలసముద్రమువంటి దుప్పటితో, పట్టు ఉపధానములతో, నలంకారములతో చిత్రవిమానమువలె నున్నది. పరుపు హంసతూలికలతో కూర్చినది. ఒకచో రంగుదుప్పట్లు పరచిన బల్లపై, చెన్నపురిలో ఆంధ్రదేశములో దొరుకు చక్రకేళులు, బత్తాయిలు, సాతుకుడులు, అనాసలు, అంజూరలు, దానిమ్మలు, కాబూలిద్రాక్షలు, కిసిమిసులు, నాగపూరు సంత్రాలు, కర్బూజలు, మామిడిపళ్లు, పచ్చవాలప్పణి, సేంద్రజాలప్పణి, మలైవాలప్పణీ మొదలగు నరటులు, సీమరేగులు ఇంకను వివిధఫలములు; వేరొక బల్లపై మినపసున్ని, అరిసెలు, లడ్డు, బర్ఫీ, దూద్‌పేడా, పాదుషా, జాంగ్రి, మైసూరుపాకు, రసగుల్లా, సందేష్, పకోడీ, కారపుపూస, జీడిపప్పు, బూంది మొదలగు పెక్కు తినుబండారములు నున్నవి. బల్లలకడ సోఫాలున్నవి. అగరువత్తులు సుగంధపు బొగల నెగపోయుచుండెను.

జమీందారుగా రీమందిర మలంకరించుటకై చెన్నపట్టణమునుండి నూరు రూకలు రానుబోను కర్చుల నిచ్చి యొక శిల్పిని తీసికొనివచ్చినారట. కొన్ని లక్షల మల్లెమొగ్గలతో, కనకాంబరాలతో, గులాబులతో శోభనమందిరము మధ్య తూగుటుయ్యేల నమర్చినారు. అప్సరస్సమూహమువలె అలంకరించుకొని వనితాబృందమంతయు నా మందిరము చేరవచ్చెను. భార్యాభర్తలచే దంపతులకు తాంబూలమును రవికల గుడ్డలు పళ్లు దక్షిణలు నిప్పించిరి.

నారాయణరావు హాసప్రఫుల్లవదనముతో, మెరుపు లీను కన్నులతో భార్యకు నత్తరువు నలందినాడు, గంధము పూసినాడు, తాంబూలము కొనపంట గొరికి యిచ్చినాడు. మదనసుందరుడగు నారాయణరా వప్పుడు ప్రణయమున మరియు సుందరసుభగత్వపూర్ణుడై ప్రకాశింప, వదిన గారు శకుంతలా దేవి చెల్లెలి భర్తను జూచి యిత డింత యందగాడా యనుకొన్నది. ఆమెకు తన పునస్సంధానము జ్ఞప్తికి వచ్చినది. నారాయణరావు చూపుల హావభావవిలాసములు తనభర్త జూపలేదు. ఏమిది! ఈతనివంటి వాడు తనవారిలో నెక్కడ, నెవ్వరు లేడుగదాయని మురియుచు నామె తనమరిది నేదేని వ్యాజమున ముట్టు కొనుచు, నాతనిచే తన చెల్లెలికి నత్తరు వలందచేసినది. చెల్లెలిచే నతని కలందించినది. తాంబూలము లిప్పించినది. సూర్యకాంతము జానకమ్మగారు మొదలగువా రానందమున నోలలాడినారు. జమీందారుగారి చుట్టపు సుందరీమణులు, నారాయణరావు చుట్టు మూగిపోయినా రావేళ.

శారదకు చైతన్యము లేదు. ఆమె వదనాన నలముకొన్న విచారతమస్సును నారాయణుని తను మనఃప్రభాజ్యోత్స్నలుకూడ పారద్రోలలేదు.

బాలికలు కిన్నరీ కంఠముల పాటలు పాడినారు. శారదమాత్ర మెంత వేడినను పాటపాడినదిగాదు. వియ్యాలవారి పాటలు, శ్రీరాధికాకృష్ణగీతములు పాడినారు కొందరు బాలలు. రాత్రి రెండవయామము దాటునప్పటికి తలుపులుమూసి, అందరును వెడలిపోయినారు. శకుంతల శారద నావలి కొకసారి తీసికొనివెళ్ళినది.

నారాయణరా వరగంటవరకు హృదయము గబగబ కొట్టుకొనుచుండ మంచమునుండి దిగి యొక సోఫాపై కనుపెట్టికొని యున్నాడు. తన చిన్నారి భార్యకు మనస్సెటులున్నదో యని యూహించుకొన్నాడు. అతనిని తేనెతీపు లావరించుకొని పోవుచున్నవి.

ముప్పాతిక గంటయైనది. ఇంకను వధువు లోనికి రాలేదు.

నారాయణరావు లేచినాడు. గదిలోని యలంకారములు తిరిగి చూచినాడు. కాని యాతని దృక్కులకు శారదావిగ్రహముతప్ప నేమియు గాను పించలేదు. శారద సర్వాభరణభూషితురాలై యున్నది. ఆ బాలకు నా దివ్య మోహనమూర్తికి నలంకారములేల! సాయంసమయముననే కోసిన గులాబీ పూవులతో నామె శిరోజములు కప్పివైచిరి. కట్టిన చీర ఎంత విలువగలదైన శారదాసౌందర్యముమ్రోల నగలతో బాటు వెలవెలలాడిపోయినది అనుకొన్నాడు. ఆమెను ముట్టినప్పుడెల్ల పులకరింపులు, మలయమారుతమునకు పుష్పభరితమాలతీలత జలదరించినట్టు అతని నావరించుకొన్నవి. ఒంటిగంటయైనది. ఇంకను శారదను లోనికిబంపలేదు. గడియారము వంకజూచి, నారాయణుడది యంతయుదంతులోని భాగమా యని సందేహించినాడు. అతని దేహము మధురాతిమధురమగు నొక మత్తుచే నావరింపబడినట్లయినది. తా నిదివరకు జూచిన పునస్సంధానముల కిట్లాలస్యము చేసినారా?

లేచి యాతడు తల్పముపై పరుండినాడు. ఈ తల్పము పురాతన తల్పమువలె నున్నది. ఇయ్యది తన మామగారి పూర్వీకులదేమో?

ఒక దేశమున కొక యాచారముండును గాబోలు. ప్రథమ సమాగమ సమయములందు ముగ్ధలగు బాలికలెట్లు చరింతురో?

స్త్రీ పురుష సమాగమ మింత మాయామోహితమా? మానవుల మూల మట్టముగ కదలించి వేయునుగదా స్త్రీ, పురుష సమాగమము! తన సర్వస్వము ధారపోయగలడు మనుజుడు స్త్రీకై. స్త్రీ పురుషుల ఈ మోహముచే ప్రపంచ చరిత్రమే మారిపోవునట!

తానెట్లు సంచరించవలయునో?

గడియారము మృదుస్వనమున రెండుకొట్టినది.

చటుక్కున శారదను లోనికంపి శకుంతలయు, వారి మేనత్తయు పైకి వెడలి తలుపు పైనగొళ్ళెము వేసినారు.

అంతయు నిశ్శబ్దము.

ఆ నిశ్శబ్దములో వెక్కి వెక్కి లోలోదుఃఖించు శబ్దము నారాయణరావునకు కర్ణగోచరమైనది. ఆత డులికిపడినాడు. శారదయే యేడ్చుచున్నది. ఏమిటి? సిగ్గుకాబోలు! భయమా? అది కొంతసేపటికి తగ్గునేమో? ఏమి చేయవలె? అతనికి సిగ్గు వేసినది.

అతడు నెమ్మదిగాలేచి శారదకడకు బోయి 'శారదా! ఇక్కడ నిలుచున్నావేం?' అని యడిగినాడు. శారద మాట్లాడలేదు. ఆమె యింకను భుజములు కదల్చుచు లోలోన నేడ్చుచున్నది.

అతని హృదయమున అనుకంప వెల్లివిరిసి యుబికి దిశల నాక్రమించుకొని పోయినది. ఆమెను దరికి జేరదీసికొన్నాడు. శారద కుంచుకొనిపోయినది. ముకుళించుకొనిపోవు పుష్పమైనది.

'ఎందుకు నువ్వు ఏడుస్తావు పిచ్చిదానా! నిన్ను ప్రేమించి నిన్ను నాలో చేర్చుకొను ప్రేమమూర్తినిసుమా! నీ వంటి దివ్య సౌందర్యమూర్తి నాకు ప్రణయిని అయిందంటే నా అదృష్టంకాదా శారదా? ఈ నన్నావరించిఉన్న యీ పురుషత్వ సౌభాగ్యం, నా తెలివితేటలు, నా సమస్తం నీ పాదాలకడ అర్పిస్తున్నా. నేనింతవరకూ ఎవరినీ ప్రేమించలేదు శారదా? ఏనాడు నిన్ను చూశానో ఆ క్షణంలోనే, నా హృదయేశ్వరి, నా జీవితేశ్వరి ఈమే యనుకొన్నాను' అన్నాడు. శారద గుండె చెదరున ట్లేడువదొడంగెను. నారాయణరావు చకితు డయ్యెను. అతని హృదయము కుంచుకొనిపోయినది. అతడు తెల్లపోయినాడు. ఆ బాలిక నచ్చటనే వదలివచ్చి యొక దిండ్లకుర్చీపై కూర్చుండెను. అరచేతిలో మోము నాన్చి శూన్యమనస్కుడై శూన్యమగుదెసలజూచినాడు నారాయణరావు.

అరగంట అయినది. శారదయేడుపు తగ్గినది. నారాయణరావు శారదవైపు చూచుచు, నామెయందము తనివితీర గ్రోలుచు, హృదయమును సమాధానపరచుకొనుచు నట్లే యుండెను. శారద తలుపుమూలనే నిలుచుండి యున్నది. పదునైదేండ్లు నిండిన నవయౌవన సౌందర్యపూర్ణ! ఏమి యీ చిత్రము! లోకములో సిగ్గులున్నవి. కోపములున్నవి. కాని చదువుకొన్న బాల, ప్రవేశ పరీక్షలో విజయము గాంచినది. కళాహృదయ. ఏమిటీ

విచిత్రము! నారాయణరా వా బాలిక నాయాలోచనలతో నట్లే తేరిపార జూచుచుండెను.

కొంతవడికి నారాయణరావు లేచి 'శారదా, నువ్వు మంచముమీద పడుకో, ఇక్కడ ఇల్లా నిలుచుంటా వెందుకు' అని యామెను పుష్పమువలె నవలీలగ నెత్తి తన హృదయమున కదుముకొని ముద్దునిడబోవ నా బాలిక చటుక్కున మోము వెనుకకు ద్రిప్పుకొన్నది. నారాయణరావు సిగ్గుపడి యామెను గొనిపోయి పల్యంకమున బన్నుండబెట్టను. ఆమె మరుక్షణమున లేచి, మంచము దిగి, మరల గదిగుమ్మము కడకేగి నిలుచున్నది.

అది యంతయు నభినయము కాదుగద? స్త్రీలు కేళీమందిరమున ప్రథమ మున నిట్లే చరింతురుకాబోలు. అట్టియప్పుడు తానేమి చేయవలెను? రాజారావుకాని, పరమేశ్వరుడుకాని వారి ప్రథమ సమాగమదినము వర్ణించి చెప్పినప్పు డిట్టిరీతి చెప్పలేదు! రాజారావును భార్యయు కొంచెము సిగ్గుపడిరోలేదో, తలుపువైచిన యరగడియకే వారిరువు రొకరి కౌగిలింతల నొకరు మరిగిపోయిరట. పరమేశ్వరుని భార్య ఇంకను కొంచెమాలస్యము చేసినది. కాని, రెండు గంటలలో సంపూర్ణముగా ప్రాణకాంతు హృదయమున ద్రవించిపోయినదట. ఇంకను పెక్కురు స్నేహితులు చెప్పివారు. కాని ఈ వైపరీత్యమేమి!

'శారదా, నువ్వు చదువుకున్నదానవు, తెలివైనదానవు. ఏమిటి సంగతీ?' యని భర్త శారదను బ్రతిమాలినాడు. శారద యంత మొండియైనదేమి?

శారద తన్ను ప్రేమించుటలేదేమో యని యొక్క యశరీరవాణి అతని హృదయమునకు మెరుమువలె ప్రత్యక్షమైనట్లయినది. తాను కురూపియా? మూఢుడా?

అనురక్తి విరక్తులకు మనుష్యుని రూపముగాని, గుణగణముగాని, యాతని తెలివితేటలుగాని కారణములుగావు. పూర్వకర్మయే కారణము కాబోలు. ఈ మానవ హృదయ గ్రంథాంతరార్థములు కనిపెట్టగలిగినవాడు మహానుభావుడు.

శారదకడకు మరల నారాయణరావు పోయినాడు. ఆ బాలిక నిలుచుండ లేక యచటనే యాగదియంతయు బరచియున్న రత్నకంబళిపై కూలబడినది.

3
రిక్తకాంక్షలు

అప్పటికి గడియారము మూడున్నర కొట్టినది. శారదకడకు బోయి యచ్చట కూర్చుండి 'ప్రాణేశ్వరి శారదా! ఈ శుభముహూర్తం ఇల్లా గొడ్డు వేళ కాకూడదేమో? నువ్విట్లా పడుకోవడం బాగుండదు. వచ్చి ఆ మంచము పైన పడుకో, నీకు ఇష్టం లేకపోతే నేనా సోఫాపైన పడుకుంటాను. మనం వృథాగా మేలుకొని ఉండడం ఎందుకు...?'

ఆమె తలవంచి యట్లేకూర్చున్నది. 'ఒకటి మాత్రం మరువకు సుమా! నేను నీకు భర్తనయ్యాను కదా అని, నా అధికారాలుగాని, నాకున్న హక్కులుగాని నేను కోరను. నీకు యిష్టం లేదంటావా, నా మొగం నీకు మళ్ళీ చూపను. నీ మనస్సు కష్టపెట్టుకొనకు. మనము చదువుకున్న వాళ్ళము. నువ్వూ పరీక్షలు నెగ్గుతున్నావు. నాగరికురాలవు.'

శారద మాట్లాడలేదు.

నారాయణరావు తిన్నగా పోయి, యొకసోఫాపై చదికిలబడి నిట్టూర్పు నించి,

హృదయపుటమున పావకజ్వాలలు సెలరేగ, జేతితో మొగము గప్పుకొని యా సోఫాపై వాలిపోయినాడు.

శారద పరీక్షలో నెగ్గిననాటినుండి తాను విద్యావతి ననియు నాగరిక వనితననియు విఱ్ఱవీగినది. నవలలో జదివినయట్లు చదువుకొన్న 'విద్యావంతురాలు' ప్రేమయొక్క తత్వము దెలిసికొనవలె. ప్రేమాస్పదుడుగాని పురుషుడు పరపురుషుడే. ప్రేమబంధనమే విధివిహిత మగు వివాహబంధనము.

ప్రేమాస్పదుడుగాని పురుషుని స్పృశించుటెట్లు? అమెరికా 'దొరసాని' యామె యుపాధ్యాయురాలు ప్రేమతత్వ మామెకు బోధించినది. పాశ్చాత్యదేశముల ముఖ్యముగా నమెరికాఖండములో పొరబడివివాహము చేసి కొన్న స్త్రీ, పురుషులు ప్రేమలేదని గ్రహించిన నిమిషమున నా వివాహము రద్దుచేసికొనెదరట. ఒకరిమీద నొకరికి, బ్రేమలేదని తెలిసిన మరుక్షణము ఒకరి నొకరు ముట్టుకొనరట.

ఆమె ఇంటరు పరీక్షకు దీక్షతో జదువుచున్నది. ఇంటికడనే యుండి చదువుచున్నది. చదువుకొను నితరబాలికలతో స్నేహము కుదిరినది. చదువు కొను బాలలు వివాహము చేసికొనుటకన్న వేఱు పొరపాటు లేదట. పాశ్చాత్య విద్య చదువుకొను బాలలకు హృదయమున మంచుతెరలు విడిపోవునట. మొరకులగు స్త్రీలకు బ్రేమస్వరూపమే తెలియదు. వారు పశువులవలె నత్త వారిండ్లకు వెళ్ళెదరు. వారు భర్తకు సొత్తయి యాత డేమిచేసినను భరించి జీవితాదర్శ ముల నెరుంగక నశించిపోవుచుందురట. కాని చదువుకొను బాలలకు బ్రేమయన నేమియో తెలియును. వారి హృదయమున బ్రేమోదయము కాని యప్పుడు వారెట్లు వివాహము చేసికొందురు? ప్రేమ కుదిరినచో నా పురుషునకు వారు సర్వస్వము ధారవోయుదురట.

ఈ విషయములన్నియు నా బాలికలు చర్చించుకొన్నారు. తనకు వివాహమైనది. తాను భర్తను బ్రేమించుటలేదే! తన కుటుంబము వేరు. తన భర్తకుటుంబము తన తండ్రిగారికడ సేవకావృత్తి చేసికొనవలసిన పల్లెటూరి కుటుంబము. చదువున్ననేమి? వారికి దర్జాలేదు. క్రిస్టియనులు మొదలగువారు చదువుకొనుట లేదా! ఇక బలమగు దేహమా! అది కూలివాండ్ర కందరకు నుండును. ఆ సంగతే తన మేనబావయగు రాజా జగన్మోహనరావు తనతో వేసారులు చెప్పియున్నాడు.

జగన్మోహనుని గౌరవము, అతనిదర్జా, ఠీవి తన యత్తవారి కెట్లువచ్చును? తాను జగన్మోహనుని ప్రేమించుచున్నదా? తాను చెప్పలేదు. తన్ను జగన్మోహనరావుబావ ప్రేమించుచున్నాడు. అతనికి ప్రేమించుట తెలియును. తక్కువజాతి వారికి ప్రేమించుట యెట్లుతెలియును? తాను జగన్మోహనుని ప్రేమించినది, లేనిది ప్రస్తుతము తనకు తెలియకపోయినను, తన భర్తను ప్రేమించుట లేదన్న మాట మాత్రము నిశ్చయము.

నెలలు గడిచినవి. ఇంటరు పరీక్షాగ్రంథములు చదివించు నమెరికా వనితామణి తనకు బాఠములు చెప్పు సందర్భమున జమీందారులు, ప్రభువులు నమెరికా దేశములలో లేరనియు, ఈ దినమున బాకీపనిచేయు పురుషుడు రేపు అమెరికా దేశాధ్యక్షుడు కావచ్చుననియు, గావుననే జమీందారులన్న పదమే తన దేశములో నుపయోగింపరనియు జెప్పినది.

అప్పుడు శారద కా ఉపాధ్యాయినియెడ కోపమువచ్చినది. కానీ భర్తయన్న నసహ్యము పోలేదు. తనకు పునస్సంధాన మహోత్సవన్నమాట వినబడినతోడనే యామె

గజగజ వణకిపోయినది. తన కక్కరలేదని తల్లి దగ్గర కంటనీరు పెట్టుకొన్నది. తల్లి జమీందారు గారి కడకుబోయి 'అమ్మాయి కిప్పుడు కార్యముచేయుట నాకిష్టము లేదండి' యని యన్నది.

'ఎందుచేత?'

'అదియింకా చిన్న పిల్ల.'

'పదహారో ఏడు జరుగుతూంది. పద్దెనిమిదేళ్ళవరకు ఉంచడం బాగానే ఉంటుంది. కాని దాని యత్తవారు పూర్వకాలపురకం. వియ్యంకుడుగారు కోరుతూ ఉత్తరము వ్రాశారు. వారిమాట కాదనలేక సరే అంటూ ఉత్తరం వ్రాశా.'

'అల్లాంటి చాదస్తపు పూర్వకాలపు సంబంధం యెందుకు చేశారు?' 'వాళ్లు పూర్వకాలపు మనుష్యులయితే నేమి? వాళ్ళంత మర్యాదస్తులు ఉదారహృదయం కలవాళ్లు మన నియోగుల్లో ఇంకోళ్లులేరు. పిల్లవాడు మహారాజులకు అల్లుడు కాదగిన మహానుభావుడు. నిజంగా అటువంటి అల్లుడు నాకు లభించడంవల్ల నా జన్మ పావనమయిందని నా ఊహ!'

'మీకు మీ అల్లుడంటే మహాపక్షపాతం. ఏది ఎట్లాగయినా మీరీ కార్యంమాట ప్రస్తుతం ఆపుచెయ్యండి. అది నా ప్రార్థన.'

'మాట యిచ్చాను. బహుశా వేసవికాలందాక గడుపుతాను. అమ్మాయి పెద్దమనిషి అయి ఏణ్ణార్థం అవుతుంది. క్రిస్టమసు నెలరోజులలో వస్తుంది. అప్పుడీ శుభకార్యం చేయిస్తే బాగుంటుంది అని వ్రాశారు సుబ్బారాయుడు గారు. నిన్న సరేనని వ్రాశాను. ఇవ్వాళ వేసంగి సెలవులదాకా వీలులేదు ఆని వ్రాస్తాను.'

అప్పటికి తాత్కాలికముగా శారద కా యాపద గడచినది.

కాని సుబ్బారాయుడుగారు మరల చైత్రమాసములో జమీందారుగారి కిట్లుత్తరము వ్రాసినాడు.

ది 5 ఏప్రిల్ 1928 సం. మకాం కొత్తపేట.

మహారాజరాజశ్రీ శ్రీమంతపరరాజగండ, మహాభట్టారక శ్రీ శ్రీ రాజా తల్లాప్రగడ లక్ష్మీసుందర ప్రసాదరావు బహద్దరు జమీందారు బావగారి సముఖమునకు.

ఉభయకుశలోపరి

ఇక్కడ అందరూ క్షేమం, అక్కడ శ్రీ శ్రీ మహలక్ష్మీ సమానురాలగు అక్కగారి క్షేమమున్ను శ్రీ శ్రీ గం. స. వదినగారి క్షేమమున్ను శ్రీరస్తు చిరంజీవి సౌభాగ్యవతులగు మాకోడళ్లు శకుంతలమ్మ, శారదల క్షేమమున్ను శ్రీ శ్రీ మా అల్లుళ్ళు కుమారరాజా కేశవచంద్రరావు క్షేమమున్ను బంధుమిత్రాదుల క్షేమమున్ను వ్రాయించకోరుచున్నాను.

తర్వాత, చి. మా అబ్బాయికార్యము తాము వెనుక తమఉత్తరములో సెలవిచ్చిన ప్రకారము ఈ వైశాఖమాసంలో శుభముహూర్తములున్నవి. తారాచంద్రబలాలు మొదలు సమస్తవిషయాలతో గొప్ప ముహూర్తం కుదిరింది. కాబట్టి తా మా ముహూర్తము పరిశీలించి

యనుమతించవలయునని పార్థించుచున్నాను.

చిత్తగించవలెను.
విధేయుడు
త. సుబ్బారాయుడువ్రాలు

కుమారుని పునస్సంధాన మహోత్సవము త్వరలో జరుగవలయుననియు, కోడలు తన యింటికి త్వరలో గాపురమునకు రావలయుననియు మురియుచున్న నారాయణునితల్లి భర్తను తొందరపెట్టి యుత్తరము వ్రాయించినది.

వియ్యంకుని యుత్తరము జమీందారుగారు భార్యకు జదివి వినిపించి యీపట్టు తప్పదన్నారు. శారద కాసంగతి తల్లి చెప్పుటతోడనే యొకటి రెండుసంవత్సరములవఱకు దప్పిపోయినదని సంతోషించిన యా బాలిక విచార గ్రస్తురాలయి, తల్లితో నెట్లయిన నింకొక సంవత్సరమువఱకు నిట్టివి తలపెట్టకుండ జేయవలెనని మరియు మరియు గోరినది. తల్లి భర్తకడకు పోయి శారద యింకను జిన్న పిల్లయనియు నిప్పుడింత తొందర యేమివచ్చినదనియు బాలికలకు బదునెనిమిదవయేటివరకు వివాహము చేయించ వలనుపడదని వాదించిన వారిలో మీరొకరుకాదా యనియు నామె భర్తతో వాదించినది. జమీందారుగారి కామె చెప్పు మాటలన్నియు సత్యపూరితములని తెలియును. ఈ పల్లెటూరివా రిట్టి తెలివితక్కువ లేల జేతురో యని యాయన విసుగుకొన్నాడు.

భర్త వ్యతిరేకముగ నున్నాడనుకొని ఇప్పుడీ శుభకార్యము శారదకే యెంతమాత్రము ఇష్టములేదని జమీందారిణి చెప్పినది. జమీందారుగారు 'ఆఁ! శారద కిష్టములేదూ? అవును. చిన్నపిల్ల. ఇంకను చదువుకొనుపిల్ల. ఆటల సరదాఅయినా వదల్లేదు. సంగీతము అది పూర్తికాలేదు. నిజమే, గట్టిగా 'వీల్లేదు' అని రాస్తాను.'

'శారద కళ్ళనీళ్లు పెట్టుకొని యేడ్చిందికూడాను!'

'శారదకంటిలో నీరే! అదేమిటి? నా వెఱ్ఱితల్లి, శారదకు కంటి నీరెందుకు? సిగ్గు చేతనేమొ? చదువు చెడిపోవునని భయమా? చదువుకున్న బాలికలు త్వరలో భర్తలయిండ్లకు బోవుట కిష్టపడరు. అయిన నెంత యాలోచించినను శారద కళ్ళనీరు పెట్టుకొనునంతటి భయమేమియు గనబడదే?

భార్యయు, నితర చుట్టములు, తన వియ్యాలవారిని అల్లుని హేళన జేయుట జమీందారుగారు గ్రహించినారు. అట్టి సందర్భముల నెంత యాలోచించిన, నాయనకు పునస్సంధాన మహోత్సవ మాపుచేయుట కిష్టములేదు. కార్యమొనరించిన మరునాడే కాపురమునకుబోవ నవసరములేదుకదా. కాబట్టి శారద యే కారణమునను భయపడ నక్కరలేదు.

శుభకార్యము తప్పలేదు. శారద మరియు గారాముచేసి పట్టుపట్టినచో జమీందారు డేదేని వంకబెట్టి కార్యము మాన్పించునేమో. కాని శారదయు అది బాగుండదని యాలోచించినది. తప్పక కార్యమైన నేమిచేయవలె? భగవంతు డెట్టి కష్టము దెచ్చిపెట్టినాడు. పేరునకు భర్తయైనను ప్రేమలేమి, పరపురుషుడేకదా! పరపురుషుడెట్లు తన్నంటుట?

౪

నామీద ప్రేమ లేదా?

నాలుగున్నరగంటల కులికిపడి నారాయణరావు లేచిచూడ శారద తలుపుదగ్గరనే తివాసీపై పరుండి నిద్రపోవుచున్నది. ఆమె కన్నులచుట్టు నీరు ప్రవహించి యెండియున్నది. పూవులప్రోవు వెదజల్లినట్లు, చెదరిన పైట, చీర, జడతో జడలోని పూవులతో, విడి విడి రాలిన గులాబి రేకులతో ఆ సుందరీమణి తన యిల్లా లటుల పరుండవలసిన గతియేమి? ఆమెకు దనయెడల ఎంతటి అసహ్యతయో? తా నొక రాక్షసునివలె నామెకు కన్పట్టినాడు కాబోలు. పాప మా బాలికను వృథగా తనకు గట్టిపెట్టిరిగదా.

ఇంతకు దన్నాబాల ప్రేమింపకపోవుటకు దనయెడల నేమిలోపము కనిపెట్టినదో? ప్రేమవిషయమున లోపములు, తాపములు గణనకు వచ్చునా? నిజమునకు మన భావనయే కాని ప్రేమయను వస్తువున్నదా! అటులనుటకు వీలులేదు. తా నీ బాలికను జూచినప్పటినుండియు బ్రేమించుచున్నానని యను కొనుటలేదా? అనుకొనుటయేకాదు నిజముగా ప్రేమించుచున్నాడుకదా! ఆమెకొఱకు పరితపించుచున్నాడు. ఆమెకు దన హృదయమున బట్టము గట్టినాడు.

ఈ బాలికకు దానన్న ప్రేమ లేమియే నిజమయినచో దానేమి చేయవలెను? ప్రేమలేని బాలికతో గాపుర మెట్లు? తమ కుటుంబములో స్త్రీ పురుషులకు బ్రేమోదయమైనపిమ్మట వివాహములు జరుగుచున్నవా? వివాహములై కార్యములైనవెనుక, నూటికి తొంబది దంపతులు సంతోషమున గాపురములు సేయుచున్నారే! వారు ప్రేమించుకొనుట యెరుగుదురా? యువకునకు యువతి గావలెను. యువతికి యువకుడు గావలెను. మన వివాహములలో మీ రిరువురు నొకరి నొకరు కోరుట కలవాటుపడండి. ఒకరికొకరు స్నేహితులుకండి యని మనకు నేర్పినారు. ప్రేమకూడ కుదిరినచో వారి దాంపత్యప్రవాహము గంగా నదియే. లేనిచో స్నేహితులుగానైనా సంసారయాత్ర సాగించుకొందురు.

కాని యీ బాలిక తన్ను గోరుటలేదా! ఇంక నెప్పుడు తన్ను గోరదా!

మరల తుదిప్రయత్నము చేయవలెనని యాత డూహించుకొని పరమ కరుణామూర్తియై భార్యకడకేగి నిదురబోవు నా బాలికను, వాయువు సౌరభము నెత్తికొనిపోవురీత గొనిపోయి మంచముపై బరుండబెట్టి తనివితీర ముద్దుగొనెను. శారదకు చటుక్కున మెలకువవచ్చి లేచి ‘అమ్మయ్యో’ యని దిగ బోయినది.

‘ఎవరైనా వింటే నవ్విపోతారు. మంచముపై పండుకున్నట్లయినా కన్పించడం మంచిది. తెల్లవారవచ్చింది. లేచి వెళ్ళిపోవచ్చులే... ఆఖరిసారి అడుగు తున్నాను. నీకు నామీద ప్రేమలేకపోవచ్చును. కాని అనేకమంది సంగతి చూడు. మీ నాన్నగారి పెళ్ళి అయినప్పుడు మీ అమ్మగారిమీద ప్రేమచేత పెళ్ళిచేసుకొన్నారా? అయినా ఎంత ప్రేమగా ఉన్నారు! మీ అక్కయ్య మీ బావని ప్రేమచేత పెళ్ళి చేసుకుందా? అయినా దంపతులిద్దరూ ఎంత ప్రేమగా ఉన్నారో! పనసతొనల్లాంటి బిడ్డల్ని కన్నారు. అలాగే మీ కుటుంబంలోనూ, మా కుటుంబంలోనూ, మనదేశం అంతలో జరుగుతున్నాయి. నువ్వు చేసే విడ్డూరం ఎక్కడాలేదు శారదా! నేను మామూలు తుచ్ఛులగు భర్తలవంటివాడను కానే? నా భర్తత్వం నీకు హేయం అయితే పోనీ, నా స్నేహమున లోపమేమున్నది? నేను కలుసుకొన్న ప్రతివాళ్లూ నేనంటే స్నేహంగా ఉంటారే?

శారద తలవాల్చికొని యట్లే మంచముమీద కూర్చుండియున్నది. నారాయణరావామె

మనస్సు కరుగుచున్నదేమో యనుకొన్నాడు. ధైర్యము చేసి యామెపై చేయివైచి చెంతకు లాగికొనబోవ నామె గింజుకొని 'అబ్బా నా_కి_దే_మి_టి_బాబూ' అన్నది.

నారాయణరావు చిన్నబోయి యామెను జుట్టియుంచిన చేతులు విడదీసి దీర్ఘముగా నిశ్వసించి,

'నువ్వు నెమ్మదిగా తలుపుతీసికొని వెళ్ళిపో. నేను తెల్లవారువరకూ ఇక్కడుంటాను' అని మంచముపై పరుండెను. శారద గదిగుమ్మముదగ్గరకు వెళ్ళి తన యక్కగారు పైన గొళ్లెము వేసిన సంగతి జ్ఞాపకము రానట్లే యచ్చట నిలుచుండిపోయెను. నారాయణరా వదిచూచి యచ్చటకు బోయి తలుపులాగి చూచుటయు నది తీసియేయుండెను. తానప్పుడువచ్చి మంచముపై పరుండి నిద్రపోయినట్లు నటింపసాగెను.

ప్రేమకు దివ్యచక్షువులున్నవి. కావుననే ప్రేమాస్పదులగువారి హృదయమును మనమిట్టె గ్రహింతుము. నాటి రేయి తన మఱిదియు జెల్లెలు నత్తరువు లలదుకొన్నప్పుడు తనచెల్లెలు భర్తయగు నారాయణరావును బ్రేమించుట లేదని శకుంతలాదేవికి మెరపువలెదట్టినది. ఆమె హృదయము చలించినది. నారాయణరావునం దామెకు బ్రేమ వెల్లువవలె బొర్లిపోయినది. అతడు తనభర్త అయినచో దనజన్మ సార్థకమయియుండునుగదాయని యనుకొన్నది. అందమయినవాడు. నిజమైన పురుషుడు. ఉత్కృష్టమగు తెలివితేటలుగలవాడు. అంతకన్న బ్రేమింపదగిన భర్త దొరుకుట కలలోనివార్త. శారద వెఱ్ఱిపిల్ల. తన భర్తకన్న శారదమగడు సర్వవిధాల పూజింపదగినవాడు. తా నదృష్ట వంతురాలని సంతోషించవలసిన శారదకు భర్తపై నింత హేయభావము కలుగుటకు కారణము దాని పెంకితనమే. తామందరు ఈ బాలిక హృదయాన్ని పాడుచేయలేదా! ఈ కన్నతల్లి యెదుట తాను, తనతల్లి, అందరూ తన మఱిదిని, దేవతామూర్తియైన తన మఱిదిని, ఆడిపోసుకొనలేదా? శకుంతలాదేవి చెల్లెలి హృదయమును మార్చబూని యామెకు బుద్ధులు గరపుటకు యీవలకు దీసికొని వచ్చినప్పుడు చెల్లెలితో 'శారదా! అదేమిటి అల్లావున్నావు?' అని పల్కరించినది. శారద మాట్లాడినదికాదు. 'తల్లీ, నీభర్త చాలామంచివాడమ్మా. అతనంతసరదాగా అత్తరూ అదీ పూస్తూ ఉంటే పెంకిదానిలా మూతిముడుచుకొని కూచుంటారటే! తప్పుకాదూ! అల్లాంటిభర్తే నాకు దొరికిఉంటే ఈ జన్మలో నాకింకేమికావాలి? నీ అంత అదృష్టవంతురాలు లేదు. మగవాళ్ళ మనసు చాలా సున్నితం సుమీ! నువ్వు పెంకిచేష్టలు చేసేవు! జాగ్రత్త! ప్రేమతో నీ చుట్టూ కోటకట్టగల శక్తిగల వాడు. ఎంత అందమయినవాడు. ఎంత తెలివైనవాడు. చచ్చు జమీందారి సంబంధాలు మహామంచివి అనుకున్నావు కాబోలు. నాబాధలు చెవులారా వినటం లేదూ నువ్వు, శారదా!' శకుంతల యామె చెవులో నెన్నేని చెప్పినది. శారద రోషమున 'ఇదివరదాకా నువ్వుకూడా వాళ్ళను నానామాటలు అన లేదూ' అని వెక్కి వెక్కి యేడువదొడంగినది. అంతలో శారద మేనత్త యటకు వచ్చినది.

శారద లోనికి వెళ్ళనని పట్టుపట్టినది. జమీందారిణి కొమరితకు భర్తపై నయిష్టమని తెలిసి సంతోషించినది. కాని గర్భాదానమునాటిరాత్రి కొమార్తె గదిలోనికి వెళ్ళదనుట నలుగురుకు దెలిసినచో నేమనుకొందురో యని భయపడి 'లోపలికి వెళ్ళు తల్లీ' యనిమాత్ర మన్నది.

మేనత్తయు నక్కగారును రెండుగంటలు బతిమాలి, కోపపడి, వాదింపనప్పటి కాబాల విధిలేక హృదయ ముచ్చిపోవునట్లు వెక్కి వెక్కి యేడ్చుచు లోనికిబోవ సంసిద్ధయైనది. ముద్దులకూతును గాంచి జమీందారిణియు గండ్ల నీరుక్రుక్కుకొనుచు, బిడ్డను కవుగిలించుకొనెను. శకుంతల ఆడుపులియై, కోపమున కన్నులు కెంపెక్క 'అమ్మా! నీకేమైన

మతిపోయినదటే? ముత్తయిదువు లంతా వెళ్ళిపోయి రెండున్నరగంటలు కావచ్చినది. తెల్లవారబోతోంది' యని కేకలువేసినది.

'ఏమి కామేశ్వరమ్మా! బాగావుంది. నేర్పుతున్నావు కూతురుకు బుద్ధులు. చాలుచాలు. ఎవరన్నా వింటే నవ్వుతారు. తమ్ముడికి తెలిసిందంటే మన గౌరవాలు దక్కవు. ఇల్లాంటివి ఎక్కడా వినలేదు, చూళ్ళేదు. శారదా! ఇల్లారా' యని యా బాలికచుట్టు చేయిచుట్టి తలుపు తెరచినది. శకుంతల యొకవైపు 'ఊరుకో అమ్మా, అతను చూస్తాడు' అని చెవిలోనూది లోనికి ప్రవేశింపజేసినది. అప్పుడు వారిరువురు తలుపులు మూసి బైట గొళ్ళెము పెట్టినారు.

చెల్లెలి విపరీతావస్థకు బెంగగొనియున్న శకుంతలాదేవి కా రాత్రి యంతయు నిదురపట్టలేదు.

శకుంతలాదేవికి నిరువదియొకటవ సంవత్సరము. ఇరువురు బిడ్డల తల్లి. ఆమె శారదవలె నందకత్తియ. కాని రెండు కాన్పు లైన వెనుక బొద్దయి, కొంచెము స్థూలమైన దామె దేహము. అయినను మేలిమి బంగారు దేహము. చెల్లెలికివలె, దల్లికివలె దీర్ఘమై నొక్కులున్న జుట్టు, విశాలములగు కన్నులు, చిన్న నోరు, శకుంతలాదేవి నందకత్తియగా, నుత్తమజాతి లోలాక్షిగా జాటుచున్నవి.

ప్రక్కనున్న గదిలో బరుండి యప్పడప్పుడు వచ్చి, తలుపుకడ చెవి యొగ్గి విని మరల వెళ్ళి పరుండినది. తలుపు గొళ్ళెము తీసివచ్చినది.

తెల్లవారగనే శారద వచ్చి తన ప్రక్క పరుండుటయు, శకుంతల యులికిపడి లేచి, విద్యుద్దీపము వెలిగించి శారదను దేరిపారచూచి, యా దీపము మరల నార్పివేసి, శారదను కౌగిలించుకొని పండుకొన్నది.

రెండవనాటి రాత్రి ముచ్చటలు జరుపుటలో నారాయణరా వత్యంతోత్సాహము సూపినాడు. శారద మామూలుగ నొకరీతిగా నున్నది. శకుంతలాదేవి నే డంతయు జక్కపడునని యనుకొన్నది.

నారాయణరావు తనకు, దన భార్యకు జరిగిన ప్రథమదినోదంతము పరుల కెరుక పరుపకూడదనియు, పరు లూహింపనైన నూహింపకుండ చరింపవలయు ననియు సంకల్పించుకొనుటచే మరునాడు వసంతునివలె నలంకరించుకొని, మొదటి నాటికంటె మరియు నుత్సాహముగ చరింప మొదలుపెట్టెను.

శారదకుమాత్ర మిదియంతయు నాశ్చర్యము కలిగించినది.

ముచ్చట లన్నియు నైన వెనుక, ముత్తయిదువు లందరును వెళ్ళిన వెనుక శారద వెంటనే గదిలోనికి వచ్చి తలవంచుకొని, తలుపుమాటున జతికిలపడి పోయినది. నారాయణరావు తాను దెచ్చి పెట్టుకొనిన యుత్సాహమంతయు మరిగిపోవ నిరాశావశుడై మోమువాల్చి, యొక దిండులకుర్చీపై నాసీనుడయి యాలోచనాపరుడైనాడు. తన జీవితమంతయు నెడారియైపోవునని యాతనికి దోచినది.

తన నిర్మల చరిత్రమున నేమి కళంకములు రానున్నవో?

తన హృదయదేవత యనుకొన్న శారద తనకు గాకపోయినదా?

ఎట్లు? తన యింటికడ మూడు రోజులును నున్నవికదా. అవి వేగించుటెట్లు? నారాయణుడు లేచి తన్ను ముంచివేయు నిరాశామేఘములను దరిమివేసి, భార్య పడియున్న తావునకు జిరునవ్వుతో జేరబోయి 'ఆనందమయీ అని పిలవనా, లేక ముగ్ధలలనా! అని పిలవనా అని ఆలోచిస్తున్నాను. ఏమని పిలవను చెప్పు శారదా?' యని ప్రశ్నించినాడు.

శారద ముకుళించుకొనిపోయినది.

'మన జన్మం ఇలా వృథా అయిపోవాలనా నీ ఉద్దేశం? అయితే సరే. నాకు ఇతరుల మనస్సులు కష్టపెట్టడం గిట్టదు. అది నా చేతకాదు. ఈలాంటి అందకత్తె నా భార్య అవుతుంది. ఆమెకు చదువు సంగీతం దివ్యంగా వస్తాయి. శ్రీవిష్ణువులా హృదయంలో ధరించుకొంటాను, శివునిలా అర్ధనారీశ్వరుణ్ణి అవు తాను, బ్రహ్మలా నా వాక్కులో ధరిస్తాను అని కలలుకన్నా. నా కలలే రూపం పొందినట్లుగా నువ్వు నాకు హృదయేశ్వరివి అవడం నా జన్మం పావనం అయిందనుకున్నా! నవ్వితే నక్షత్రాలు నర్తిస్తాయి అని వర్ణించుకున్న బాలికవునువ్వు. నువ్వు వీణా, నేను ఫిడేలు వాయించుకొంటూ కిన్నర మిథునంలా ఉందామనుకున్నాను. ప్రతిపరీక్షలోనూ ప్రథముడుగా నెగ్గుతూ, అనేక శాస్త్రాలలో పాండిత్యం సంపాదించుకొన్నందుకు అనురూపయైన విద్యావతివి నాకు లభించావని మురిసిపోయాను.

'నాకు అలవడిన కవిత్వం, చిత్రలేఖనం నీవల్ల చరితార్థమవుత వనుకొన్నా. నా రాణిని నానా భాషల్లో పాడుకొందామనీ, నా దేవిని నానా వర్ణాల, నానాభంగుల చిత్రించుకొందామనీ, నా ఆత్మేశ్వరితో నానాపరమార్థ ప్రణయలీలల దివ్యుణ్ణౌదామనీ పొంగిపోయాను. జన్మజన్మాలకూ నన్ను ప్రేమించడానికి, నీకు తక్కువైన ప్రేమను కూడా సర్దడానికి తగినంత ప్రేమ నాలో కట్టలు తెంచుకొని పొర్లుతూంది. ఈ ప్రవాహంలో నిన్ను తేల్చి వేస్తాను. క్రమంగా నా దాన్ని చేసుకుంటాను. దివ్య ప్రేయసివి నువ్వల్లా కొంచెం సుముఖంగా ఉండు. ఉపేక్షతోనైనా సరే నా ఆరాధనను అంగీకరించు. అంతేకాని నువ్వింతటి వైముఖ్యం తాల్చి మన యిద్దరి బ్రతుకులు మరు భూముల్లో ఇంకి నశించే మహానదిలా చేయకు.'

౨౪
నాకు ప్రేమ లేదు

భర్త ప్రేమతో దివ్యశాంతమూర్తియై తన్నట్లు నిర్దేశించి చెప్పినంత కాలము శారద మాట్లాడలేదు. ఒకసారి రెండుసారులు భర్త చెప్పినమాటలు నచ్చి కొంచెము మెత్తపడినది. కాని జగన్మోహనునిమాటి లామె కాసమయమున నే స్పష్టముగా బొడగట్టినవి. 'ప్రేమలేని మనుష్యుని ముట్టుకొనుట కూడా తప్పుసుమా శారదా!' యని యాతడు పదేపదే యన్నముక్క పిడుగు వలె జెవిలో వినబడినది.

నారాయణరావు స్త్రీలతో నొకవిధమున చనువుగా నుండును. నే డెటుల శారదతో మాట్లాడగలిగెనో యతనికే తెలియదు. మరల నాతని నోట మాట రాలేదు. ఉస్సురని వెడలిపోవజూచుచు 'మాట్లాడవేమి శారదా!' యని జాలిగ ప్రశ్నించెను.

శారద భయమునిండిన హృదయముతో నిజముచెప్పిన ఈయన వదలు నను ఆశతో కంపితస్వరమున 'నాకు ప్రేమ లేదు' అని గబుక్కున కన్నుల నీరునిండ వేడ్చినది.

నారాయణరావును కొరడాతో మొగమున గొట్టినట్లయి చివుక్కున వెనుకకు జరిగి మెదడు రక్తహీనమైపోవ తూలి, లేచి, అచ్చటనుండి వచ్చి వచ్చి, సోఫాపై కూలబడినాడు.

ఇక నేమున్నది? సర్వము ముగిసినది. అంతయు నల్లబడిపోయినది. ఆ ముక్కలే తనకు జన్మాంతరము దుఃఖితుడవు కమ్ము అని విధించిన శాపము. తాను కట్టుకొన్న దివ్యభవనము కూలిపోయినది. తన బ్రతుకు నిరర్థక మైపోయినది.

*   *   *

నారాయణరావు రాపడిన గుండెతో లోతులేని నవ్వుతో గపటనాటక మాడుచు నత్తవారింటికడ, కొత్తపేటలో దనయింటికడ, తక్కిన యామిను లెట్టులో వేగించినాడు. మిత్రులకైన దెలియనీయలేదు. పునస్సంధాన మహోత్సవ మిట్లు ముగిసినది.

తనయింటికడ తండ్రి సత్యనారాయణవ్రతము సంకల్పించినారు. ఎటుల జరిగినదో, ఏమి జరిగినదో!

శారద పుట్టిల్లువచ్చి చేరినది. ఆమెకు దాను భర్త యెడజేసిన మహాపరాధము అవగతమైనది. తన తండ్రికిని, తన భర్తకును దోష మొనరించినాను అన్న భావము వ్యక్తావ్యక్తమై యామెకు దోచినది.

బాలకుడగు కేశవచంద్రుని హృదయమున నేదియో అనిష్టము జరిగినదన్న యాందోళన కలిగి పెద్దక్కగారికడకేగి 'చిన్నబావ మంచివాడు పెద్దక్కా?' యనెను. శకుంతల తమ్ము నెత్తుకొని, ముద్దుపెట్టుకొన, కేశవచంద్రుడు పెదవులు తుడుచుకొనుచు 'పెద్దక్కా చిన్నబావ మంచివాడు కాడా' యని ప్రశ్నించెను.

'అయితే మీ పెద్దబావగారు మంచివారు కారన్న మాటేనా?'

'కారు.'

'ఎందుచేత?'

'ఏమో!'

అతడు శారదకడకేగి చిన్నక్కగారి మోము తీక్ష్ణముగ నాలోకింపుచు,

'చిన్నక్కా! మా చిన్నబావ దేవుడి అవతారముకాదూ! నిజంగా నేను నమ్ముతా' నని యనెను.

శారద అతనిమాటల కులికిపడెను.

శకుంతల తన చెల్లెలిని జేరి 'శారదా! మీ ఆయన చెన్నపట్టణం వచ్చేటప్పుడు మనఊరు వస్తారటే?' యని యడిగినది. శారద తనకు తెలియదని సూచించినట్లు తలతిప్పినది.

శకుంతలకు మరదిపై ఆపేక్ష యినుమడించినది. నిర్మలహృదయముతో దల్లికడ, చెల్లెలికడ, మేనత్తకడ, తండ్రికడ నాతని పరిపరివిధముల బొగడ జొచ్చినది. శారదకు దన సహోదరి మాటలు కష్టములై యామెను జేరుటకు సందేహించుచు, వీలైన దప్పించుకొనుచు మెలగచొచ్చినది. రానున్న భయంకరమగు విపత్తు తప్పినట్లయినది. భర్త బలవంతము చేయునేమో యని యామె భయపడినది. కాని యాత డంత నెమ్మదిగ సంచరించుట చే నామెకు హృదయము నుండి పెద్ద బరువు తీసివేసినట్లయినది.

చదువు విషయమై ఎక్కుడు శ్రద్ధవహింప నారంభించినది. పూర్ణకంఠమున సంగీతము దివ్యకిన్నరస్వరముతో నర్తనసేయ, దనలోనే మోహమావరించి పోవ త్యాగరాజు భక్తిగీతములు మరియు నానందముగ బాడుకొనజొచ్చినది.

శకుంతల శారదను జూచి ఈసును, మెప్పునుట్టిపడ, 'నీ వదృష్టవంతు రాలవే చెల్లీ! నీకు మహారాజ కొమార్తెలు కోరితే దొరకని మగడు దొరికాడే తల్లీ. పాడుకో! నాకంఠం ముక్కలయిపోయింది. మీ బావకూ నాకూ ఎప్పడూవచ్చే వాగ్వివాదంతో గొంతుకలో అపశ్రుతి వచ్చిందే. వీణ వాయించుకోవడమే లేదు. పిల్లలిద్దరూ ఎప్పుడూ అల్లరే.'

'శారద తన యక్కగారి పిల్లలను సంతతము నాడించునది. ఈరోజులలో నా బంగారుతొనల బాలిక లిద్దరిని ఒక్కనిమిషము వదల లేదు.

*   *   *

జమీందారుల యిండ్లలోని ఆడువారిట్టులే సంచరింతురా? లేక తనకు మాత్రమిట్లు జరిగినదా? సంగీతముపై మనస్సుపోలేదు. తమ తోటలోనికిబోయి చెట్లతో దనహృదయము విప్పుకొన్నాడు. చెట్టు చేమలను జేరబోయి 'చూచినారా నా చెలిని' అని యడిగిన కావ్యనాయకుల చేష్ట లాతనికి జ్ఞప్తికి దగిలి నవ్వువచ్చినది. గులాబులు, మల్లెలు, సంపెంగలు, లెజిస్ట్రోమియనులు, బోగెన్ విల్లాలు తన్ను జూచి కరుణ ఒలికించుచున్నట్లు తోచినది నారాయణరావుకు.

తండ్రిగారికి, మామగారికి, అన్నగారికి నారాయణరావు రాణ్మహేంద్రవరములో న్యాయవాదవృత్తి ప్రారంభింపవలెనని కోర్కె యున్నది. తాను అందుకు వల్లెయనవలెనని కుతూహలము నందినాడు. ఇప్పుడెట్లు? న్యాయవాద వృత్తి యెందులకు? శ్రీ గాంధీమహాత్ముడు మరల కాంగ్రెసును నడుపుచు ఖైదులకు బొండని యా దేశమిచ్చినను బాగుండును. సమస్తము విడిచి సన్యసించిన బాగుండునేమో? శ్మశానవైరాగ్యమా? తనలో వాంఛపోయినదా? 'తలలు బోడులైన తలపులు బోడులా!' ఏరీతినైన దేశసేవ చేయవలెను. ఏమియున్నది? గ్రంథాలయములా? ఇప్పుడు వానిరుచి పోయినది. ఖద్దరు ఉత్పత్తియా? ఓ ఫ్యాక్టరీ పెట్టుటయగును. ఆస్పత్రి పెట్టుదమన్న వైద్యవిద్యకు దూరమై పోయెను. రాజు అదృష్టవంతుడు. వాడు పరీక్షలన్నిట గృతార్థుడై మదరాసులో పెద్ద ఆసుపత్రిలో వృత్తి నేర్చుకొనుచున్నాడు.

పరమేశ్వరుని హృదయము మెత్తనిది. అతడు సంతోషజీవి. కష్టములున్నవని గుర్తింపలేడు. అంతము లేని యెడారివలె కన్పించు తన జీవిత మింక గడతేరుట యెట్లు? తన జీవితములోని కళ నశించిపోయిననేమి? సంగీత, సాహిత్య, చిత్రలేఖనలతో తనకేమి పని?

ఒకరోజున చటుక్కునలేచి 'నాన్నా! నేను దేశయాత్ర చేసివద్దామని ఉంది' యని నారాయణరావు తండ్రికి విన్నవించెను. తండ్రి యాశ్చర్యమంది 'చదువుకుంటూ దక్షిణాదంతా చూసివచ్చావుకాదుట్రా?' అని ప్రశ్నించెను.

'ఈపట్టు ఉత్తరాది చూస్తాను నాన్నా.'

'ఉత్తరాది అంటే?' ఉత్తరాది యన్న సుబ్బారాయుడుగారికి తెలియక కాదు. పుత్రు డడుగుటయే యాయన కాశ్చర్యమైనది.

'కాశీ, ప్రయాగా అన్నీ తిరిగివస్తాను.'

'ఒక్కడవూనా?'

'పరమేశ్వరుడూ నేనూ వెళ్తాము.'

'ఎన్నాళ్ళు?'

'నెలా రెండునెలలో.'

'ఆలోచిద్దాములే.'

'అదికాదు నాన్నా! తర్వాత నేను పట్టాపుచ్చుకొని వృత్తి ప్రారంభిస్తే దేశం చూచుటకు వీలుండదు.'

'చూద్దామన్నాను కాదుట్రా, బాబూ.'

ఆ సాయంకాలము సుబ్బారాయుడుగారు భార్య నొంటరిగాజూచి చిన్నబాబు కాశీ అదీ వెళ్ళివస్తాడుట, తర్వాత వాడికి వీలుండదు. దేశాలన్నీ తిరిగివచ్చి వృత్తి ప్రారంభిస్తే బాగానే ఉంటుంది? అని తెలియజేసెను. జానకమ్మగారికి గుండెలో రాయిపడినది. ప్రయాణాలంటే మాటలా? మరునాడు పురోహితునకు గబురంపి సుబ్బారాయుడుగారు శుభముహూర్తము పెట్టించెను. సుబ్బారాయుడుగారు, భార్యయు, వదినెగారును ఇదివరకె కాశీ వెళ్ళివచ్చినారు. అందుచేతనే జానకమ్మగారు ఎట్టులో కుమారుడు వెళ్ళివచ్చుటకు నియ్యకొన్నది.

నారాయణరావు పెట్టెలు, పరుపు మొదలగునవి సర్దుకొని తండ్రి యిచ్చిన నాల్గువందలరూపాయలు పుచ్చుకొని, లెక్క కావలసినప్పుడు తనకు తంతివార్త నిమ్మను తండ్రిగారికి దలయూపుచు తల్లికడకు వెళ్ళినాడు. కుమారుని దరికి జేరదీసికొని శిరస్సు మూర్కొని 'నాయనా! రామలక్ష్మణులులా నా కిద్దరు వరప్రసాదులు పుట్టారు. జాగ్రత్తగా వెళ్ళిరా. మీమీదే ప్రాణాలు పెట్టుకొని ఉన్నాను. నువ్వు దుందుడుకు మనిషివి. రైలు కదులుతోంటే ఎక్కుతావు. వాడికీ వీడికీ ఆపత్తు వచ్చిందని పరుగెత్తుతావు. జాగ్రత్తరా తండ్రీ' యని యామె యాశీర్వదించి కుమారుని పంపెను.

శుభకార్యమునకై వచ్చిన బందుగులు, అక్కగార్లు, చెల్లెళ్లు, ఎవరియిళ్లకు వారు అప్పుడే వెళ్ళిపోయినారు. సూర్యకాంతమున కేమియు దోచుటలేదు. ఆ బాలిక యన్న గారికడకు వచ్చి 'నువ్వూ వెళ్లిపోతున్నావా అన్నయ్యా! నా కసలే తోచదు' అన్నది. నారాయణరావు చెల్లెలిని దగ్గరకు దీసికొని 'సూరీడూ! నీ కేమిటి తెచ్చిపెట్టనే?' అని యడిగినాడు.

'నీకే తెలుసును అన్నయ్యా! అన్నిటికన్నా నువ్వు దబ్బునరావడం కావాలి చిన్నన్నయ్యా!'

'అలాగా, తల్లీ.'

ప్రేమపదార్థము దాగదు. ఈ బాలిక, తన చిట్టిచెల్లెలు, ప్రేమంపుముద్ద. ఆమె హృదయము నవనీతము. ఈ బాలికను వివాహముచేసికొన్న రామచంద్రుడే పూర్ణముగ నదృష్టవంతుడు. వీరిరువురి జీవితము చూడ ముచ్చట యగునుకదా?'

క్వినైను భైసల్ఫేటు మాత్రలు, క్వినైను సాలిసిలీసు, టించరు అయిడీను, టించరు బెంజాయిను, లైజాలు, హైడ్రోజన్ పెరాక్సైడ్ , ఆనందభైరవి, శీతాంకుశరసము, సన్నిపాతభైరవి, పైత్యాంతకరసము, సుఖవిరేచనమాత్రలు, పెర్మాంగనేటు మాత్రలు, కాలోమెల్ మాత్రలు, అమృతాంజనము, ప్రోడయేరియా మందు మొదలగు నౌషధములు, అరువది యడుగుల గట్టిత్రాడు, వంటగిన్నెలసెట్టు, నెయ్యి వీశెడు, వీశెడు పప్పునూనె, కొంత బియ్యము, పచ్చికారపుపొడి, ఎండుమిర్చి, చింతపండు, కొన్నికూరలు, ఆవకాయ, మాగాయ, పాతచింతకాయ, నిమ్మకాయ, గోంగూరపచ్చడి, చారుపొడి, కారప్పొడి, చాకు పెద్దది యొకటి, చిన్నది యొకటి, గాలితుపాకి, కట్టికత్తి, రెండునెలలకు సరిపోయిన బట్టలు, రెండు దోమ తెరలు, ప్రయాణపు మడతమంచములు, చిన్న పరుపులు రెండు, రెండు తోలు పెట్టెలు, రెండు దేవదారు పెట్టెలు సర్ది సిద్ధమైనాడు నారాయణరావు.

ఈలోన నారాయణరావు పరమేశ్వరమూర్తికి దనతో దేశయాత్రకు రమ్మనియు, ఖర్చులన్నియు దానే పెట్టెదననియు, భార్య నామె బుట్టింటిలోన గాని, యాతని తల్లిదండ్రులకడగాని దిగబెట్టి రావలయుననియు, నీ సమయము దాటినచో మరల పరమేశ్వరునకు దేశయాత్ర చేయుటకు వీలు దొరకదనియు వ్రాసినాడు. పరమేశ్వరమూర్తి వెంటనే దేశోద్ధారక నాగేశ్వరరాయనికడకు బోయి, సెలవుపుచ్చుకొని, భార్యను దీసికొని, యామె పుట్టినగ్రామమగు బెజవాడలో వదలిపెట్టి, నారాయణరావును రాజమహేంద్రవరములో గలిసికొనెను.

వారశూలలు, రాహుకాలము, గుళికకాలము, వర్జ్యము లేకుండగను, నక్షత్రము, వారము, తిథి, రాశిరహితముచేసి తారాబలము చూచుకొని, పుష్కర సమయ ముహూర్తమున తల్లిదండ్రులు, పెదతల్లి మొదలగు పెద్దల పాదములకు నమస్కరించి, చెల్లెలిని ముద్దుగొని మోటారుపై బయలుదేరినాడు నారాయణరావు. ప్రయాణమగుచుండ ముత్తైదు వెదురుగ వచ్చినది. ఆ సాయంకాలము ప్యాసెంజరుబండికి పరమేశ్వరమూర్తి రాజమండ్రి స్టేషనుకురా, నారాయణరా వాతని దన బావమరది లక్ష్మీపతి యింటికి దీసి కొనిపోయెను.

ముగ్గురు స్నేహితు లా రాత్రియంతయు నిష్టాగోష్ఠి కాలముపుచ్చిరి. లక్ష్మీపతి దానును రావలయునని ముచ్చటపడెను గాని సెలవు దొరకుటకు వీలులేనందున ఆగిపోవలసివచ్చెను.

మరునా డుదయము రమణమ్మ తెల్లవారగట్లనే వేపుడుకూర, ఉల్లిపాయ పోపుతో కాల్చిన వంకాయ పచ్చడి, ఆవకాయ, పెరుగు వేడియన్నముతో భోజనము పెట్టినది అన్నగారికి, బరమేశ్వరునకును. మేనత్తకు నమస్కృతులిడి యామె యాశీస్సులంది, రమణమ్మను తనదగ్గరకు జేరదీసికొని 'రమణా! నీకు, బాచిగాడికి చిత్రాలు పట్టుకొస్తానేవ్' అని యామెతో జెప్పి లక్ష్మీపతి వెంటరా నారాయణరావు పరమేశ్వరునితో ఇన్నీసుపేట నుండి పెద్దస్టేషనుకు రెండు జట్కాలమీద బయలుదేరెను. ఇంటరులో వారిద్దరు ఖురదారోడ్డు స్టేషనుమీదుగా పూరి (జగన్నాథం)కి టిక్కెట్లు పుచ్చుకొన్నారు. పది గోల్డుఫ్లేకు సిగరెట్టుడబ్బాలు, పది త్రీకాజిల్సు డబ్బాలు పుచ్చుకొని, ఇన్ని గ్రంథములుకొని, మెయిలునెక్కి, లక్ష్మీపతిచేతిని ఝాడించి మెయిలుబండి సాగగా దానితో వారును సాగినారు.

౬
ఉత్తరహిందూదేశ యాత్ర

భరతదేశము ఆదియుగమునుండియు బ్రపంచమునకు నాగరికత, మానవ ధర్మము, ఆధ్యాత్మికతత్త్వవిచారము నేర్పుచునేయున్నది. సేతుహిమాచల పూర్వ పశ్చిమ సముద్రపరివృతమగు భరతదేశమున నెన్నిజాతులు, నెన్ని రాజ్యములు నవతరించి, వృద్ధియై యుత్కృష్ట సంప్రదాయముల సృజించి, నశించి పోయినవో? ఒక జాతిలోనుండి వేరొక జాతి జనించినది. నూతనజాతుల దనలో జేర్చుకొన్నది. పూర్వసంప్రదాయముల విజృంభింపజేసినది.

భిన్నత్వమున నేకత్వము, నేకత్వమున భిన్నత్వము సూచింపుచు భగవంతుని విశ్వరూపసందర్శన మన్నట్లు విజాతీయునకు భిన్నతాదూషితమై తోచుచు, మహానదివలె నెటనుండి యెటకు బోవుచున్నదో భారతీయమహా చరిత్ర! నారాయణరాయ పరమేశ్వరులకు పూరీమహాపట్టణమున, కోణార్కులో, భువనేశ్వరములో గనుపించిన కేసరి గాంగకళాచమత్కృతియు ఉత్తమనాగరికతయు వారి నాలోచనాపూరితుల, నానందవికసితులను జేసినది.

భరతదేశములో సూర్యునకు ప్రత్యేకము గుడులు రెండు మూడు చోటులనేయున్నవి. ఒకటి యోడ్రదేశములోని కోణార్క. కాని కోణార్క దేవా లయమునను బ్రతిష్ఠ జరుగలేదు. మహారాజు సూర్యదేవునకు దేవాలయము సంకల్పించి తన యాస్థానమహాశిల్పి నా కార్యమున నియోగించెనట.

ఆస్థానశిల్పికొక పుత్రుడున్నాడు. ఆతడు తండ్రికడ శుశ్రూష సలిపి జనకుని యుత్కృష్ట శిల్ప చమత్కృతియు, శక్తియు నభ్యసించి, దేశ దేశములకు బోయి అందందుగల శిల్పసాంప్రదాయముల గమనించివచ్చెదనని తండ్రి యనుమతి కోరినాడట. తండ్రి యితరదేశముల శిల్పులలో భావనయందు, బనితనమునందు తన్ను మించినవారు లేరని పుత్రుని యాత్రాకౌతుకము మాన్ప జూచెనట. కుమారున కది తండ్రియందు దోష మనిపించినది. కాన తండ్రికి నమస్కరించి, 'తండ్రీ! మనకెప్పుడును గర్వము హానికర' మని చెప్పి చలమున విదేశయాత్ర సాగించినాడట.

ఇచట తండ్రి దేవాలయము నతి విచిత్రముగ నిర్మించి శ్రీవిమానమున శిఖరమువరకు గట్టినాడట. ముఖమండపములు, భక్తిమందిరము, వివాహ మండపము, క్షేత్రపాలకాలయము, పరిసేవిత దేవతాలయములు నిర్మింపబడినవి. సింహగజాశ్వాది మృగములు, నద్భుత సుందరవనితా విగ్రహములు, దేవతా శిల్పములు మున్నగునవియెల్ల నా శిల్పచక్రవర్తియు నాతని శిష్యులును జెక్కి యమర్చినారు. దేవళము నద్భుతమై విరాజిల్లినది. కాని కూపస్థమండూకమువలె నున్న యా శిల్పికి శ్రీవిమానశిఖర పద్మశిల నమర్చు నుపాయము తెలియలేదట. అత డంతట మహారాజుతో నిజము వచింపక తనకొక ముఖ్యావసరమగు కార్యమున్నదని చెప్పి, యితరదేశ శిల్పుల నారహస్యమడిగి తెలిసికొనుటకు బయలుదేరి పోయినాడట.

ఇంతలో దైవజ్ఞులు పదునయిదు దినములలో మంచి ముహూర్తమున్న దనియు, కొన్ని సంవత్సరములవరకు నట్టి ముహూర్తము మరల దొరకదనియు మహారాజునకు విన్నవించినారట. మహారాజు సమయమునకు శిల్పి దేశాంతర గమనుడగుటకు వగచి, యాతని శిష్యులలో శిఖర మమర్చగలనారుండిరా యని పృచ్ఛచేసి యేరును లేకుండుటకు

జింతాకులుడై, తన శిల్పికై చారుల బంపినాడు.

ఇంతలో నాస్థానశిల్పి కుమారుడు తన యాత్ర ముగించుకొని నిజపురికి తిరిగివచ్చి యీ సంగతులన్నియు విన్నాడు. తండ్రిగారికి నపఖ్యాతి వచ్చునట్లున్నదని భయపడి యా కార్యమునకు దానియ్యకొని, వలయు సన్నాహము లన్నియు నొనర్చుచుండెను. జనకున కలవికాని యీ కార్యము తాను సాధించినచో నభిమానియగు నాతనికి కోపమురాగలదని సంశయించి, ఆ కుమార శిల్పి ప్రచ్ఛన్నుడైయుండి తనవారి కెవ్వరికి నిజస్థితి తెలుపకయే కార్యమునకు బూనుకొనెను. పదిపండ్రెండు బారువుల బరువుగల శిఖరశిలను, విమానమూలమున ప్రక్కగానొక యిసుక దిబ్బపై పెట్టించి, మహారాజుతో రోజునకు వేనకు వేలు బండ్లు సముద్రమునుండి యిసుక తెప్పించి యాదిబ్బ యెత్తుచేయించ కోరెనట, బండ్లువచ్చి యిసుకదిబ్బ నెత్తుజేయుచుకొన్నకొలది యాబాలశిల్పి, యా శిఖర పద్మశిల యా దిబ్బమూపుపైననే యుండునట్లు చూచుకొనుచుండెను. మూడుదినములలో బర్వతమువలె నాయిసుక దిబ్బ శిఖరముకన్న నెత్తుగ నూట యిరువది నాలుగడుగులు సువ్వునలేచినది. విమానశిఖరశిలయు నాదిబ్బమూపుననే యున్నది. అప్పుడా విమానశిల కడుగున నుండి విమానశిఖరమునకు గట్టి దూలపు కమ్మిలు చేర్పించినా డా బాలశిల్పి. రాతికి ఇటు నటు తాళ్ళుకట్టి కమ్మిలపై జరిపించి శిఖరముపై నాశిఖరశిల నమర్చి కమ్మీలు లాగించివేసినాడు.

రాజు ఈ మహాకార్యకౌశలము దినదినము వచ్చి చూచుచు, కార్య సాఫల్యమునకు సంతోషించుచుండెను. విమానశిఖరశిల నమర్చురోజున దేశ దేశముల నుండి జనమువచ్చి ఆ చిత్రము చూచి ఆనందించిరి. ఆ వచ్చిన వారిలో నాస్థానశిల్పియు నున్నాడు. అతడు వచ్చిన వార్త నేరు నెరుగకుండ నాశిల్పి విన్నబోయిన మోముతో ఆ జనమహాసముద్రమున జేరి విచిత్రమును జూచు చుండెను.

శిఖరశిల నమర్చుటయు మహారాజు మెడలో హారమువేయు ఆ బాలశిల్పి వంగి నమస్కరించి మరునాడు శుభముహూర్తమునకు సర్వము దేవాలయమున సిద్ధముజేయ నాత డా గుడిలోనే పండుకొన్నాడు.

కుమారుని గుర్తించలే దా తండ్రి. చిన్న నా డిల్లువదలిపోయిన ఆ బాలున కిప్పుడు మీసములు పెరిగినవి. పురుషుడైనాడు. దేహమంతయు గట్టిబారినది. అట్టి కుమారుని గుర్తించక తన్నిట్లవమాన బరచిన యా ద్రోహిని హత్య నొనరింపవలయునని దుర్బుద్ధిజనించి, యారాత్రి గుడిలో నొంటిమై నిద్రించు దన కుమారుని బాకుతో పొడిచినాడు. బాలకుడు హృదయమునుండి రక్తము స్రవింప హాయని నిదురలేచి యా దీపపు వెలుతురున దండ్రిని గుర్తించి 'తండ్రీ నన్నేల బొడిచినావు? నన్నానవాలుపట్టలేదా! అయ్యో! ప్రాణములు పోవుచున్నవి. స్వామికార్యమునకై యా శిఖరము నేనెక్కించవలసివచ్చినది. జనకా! రేపటిదినము సర్వోచ్ఛమగు ముహూర్తమట. అబ్బా బాధ! ఈ బాకు పీకివేయుము. నా తండ్రీ! గురుదేవా! నీ చేతిలోనే మరణించినందులకు సంతసమే. నీకివే నాచరమప్రణామము' లనుచు ప్రాణములు విడచినాడట.

తండ్రి కుమారు నానవాలుపట్టి గుండె తరుగుకొనిపోవ, తాను చేసిన మహానేరమును, కుమారుని చంపుకొన్న క్రూరకర్మమును నిందించుకొనుచు తన ఘోరకృత్యమునకు గుండెపగిలి యచ్చటనే చనిపోయెను.

మరునాడు శుభముహూర్తమున ప్రతిష్ఠ జరగలేదు. మరి యెప్పుడును జరగలేదు.

ఆకథ విని పరమేశ్వరునకు గన్నుల నీరుతిరిగినది. నారాయణరా వట్లనాయని

నిట్టూర్పునించినాడు. కోణార్కలో, జగన్నాథములో, భువనేశ్వరములో దేవాలయములకు శ్రీవిమానము లెత్తైయుండును. అంతకన్న మధ్యమండపము, అద్దానికన్న ముఖమండపము చిన్నవి. గోపురములు చిన్నవి. గుడియంతయు మొక్కజొన్నపొత్తివలె నుండును. మూలమునుండి శిఖరమువరకు రాళ్ళ తోడనే కట్టెదరు, ఎఱ్ఱయిసుకశిల, సుందరశిల్పలాలిత్య మా రాతిలో రూపించునట్లు వేరొకరాతిలో రూపింపలేదు. గాంగశిల్పులు స్త్రీరూపరచనమున దన్మయులైనారు. బ్రహ్మ పూవులతో, లతలతో, లేతయాకులతో, తేనెలతో, లేడికన్నులతో, చుక్కతళుకులతో, వెన్నెలవెలుగులతో స్త్రీమూర్తిని సృజించినాడన్న మాటను ఆ శిల్పులు నిక్కువముచేసినారు. గాంగులు ఆంధ్రులు. ఉత్తరాంధ్ర శిల్పులు గాంగశిల్పులు.

భువనేశ్వరములో రాజారాణి, పరమేశ్వర, మార్కండేయేశ్వర, లింగేశ్వరుల దేవాలయములలోను, కోణార్కలోను, ముఖలింగములో, సాక్షిగోపాలములో గాంగశిల్పుల శిల్పలాలిత్యము ప్రత్యక్షమగుచుండును. గుడియంతయు లతలు చెక్కియుండును. మధ్య మధ్య విగ్రహములు పొదిగింపబడును. దాక్షిణాత్య దేవాలయముల రీతి వేఱు. చోళ, పాండ్య, చాళుక్య దేవాలయములలో గర్భగుడిపైనుండి శిఖరమువరకు గట్టిగా రాతికట్టడమో, యిటుకకట్టడమో కట్టుకొనిపోదురు. కాని గాంగదేవాలయములకు దేవాలయపాదము నుండి శిఖరమువరకు లోన గుల్లగా కట్టుకొనిపోదురు. తెలుగుచోడుల దేవాలయములలోనూ గర్భాలయము గుల్లగానే యుండును.

భువనేశ్వరములో రెండువందల దేవాలయములున్నవి. ప్రతి దేవాలయమునకు మిక్కిలి లోతుగల కోనేరులున్నవి. ఎచ్చటనుండియో జలము వచ్చునట్లు చేసి, యా జలము పొలముల కుపయోగించునట్లా శిల్పు లమర్చిరి. జగన్నాథమునందు మొండిజగ్గని యందము దిలకించి, సాక్షిగోపాలము, శ్రీకూర్మము దర్శించి, నారాయణరావు పరమేశ్వరమూర్తులు కలకత్తా చేరుకొన్నారు. కలకత్తాలో మ్యూజియము, దక్షిణేశ్వరము, కాళీఘట్టము, సర్వవృక్షవనము, జంతుశాల, విక్టోరియా మందిరము, జైనమహాభవనము, బోసుగారి వృక్షశాస్త్ర పరిశోధక భవనము మొదలైనవి చూచినారు.

శ్రీ రామకృష్ణపరమహంస నిర్వికల్పసమాధి నందిన పంచవటి, మాత దేవాలయము, ఆ భక్తమూర్తి, యవతారపురుషుడు మెలంగిన యా పవిత్రస్థానము చూచునప్పటికి నారాయణ పరమేశ్వరులు పులకరించిపోయిరి.

ఈ మహాపురుషుడు సర్వమతములు హిందూమతములోనివే యని లోకమునకు దెల్పుటకు, సర్వమతముల వారికి ఆత్మవిద్యాభిక్ష మా మతమే పెట్టినదని తెల్పుటకు అవతరించెనని, నారాయణరావు పరమేశ్వరునకు తెలిపెను. రామకృష్ణునకు చదువురాదు. ఈశ్వరచంద్ర విద్యాసాగరులవంటి పండితు లా పరమహంసకు జోహారులన్నారు. కేశవచంద్రసేనువంటి మహానుభావు లాతని పాదములకడ నాత్మజ్ఞానము సముపార్జించుకొన్నారు.

'శ్రీ రామకృష్ణపరమహంసకు వివేకానందస్వామి అర్జునుడంటివాడురా. నరనారాయణులే వారిరువురున్నూ. ప్రతిమతంలోనూ కొన్నికొన్ని ఆచారాలు బయలుదేరుతవి. ఆ ఆచారాలనూ, చిహ్నములనూ అనుసరిస్తేగాని మోక్షం లేదు అనుకోవడమంత మూర్ఖత ఇంకోటి లేదు. నామాలుపెట్టి, గండభేరుండంచుల పంచెలుకట్టి, విష్ణ్వాలయాలలోనికి వెళ్ళి, విష్ణునిమాత్రం కొలిచేవాడు వైష్ణవుడనిన్నీ; తలంతా గొరిగించుకొని గడ్డం పెంచుకొని మహమద్ వారుమాత్రమే దైవము యొక్క మతము బోధించేవారనిన్నీ, ఖురానుమాత్రమే మతగ్రంథ మనిన్నీ, ఒక దైవమే యున్నాడనిన్నీ, రెండు దేవుళ్లు లేరనిన్నీ నమ్మేవాడు మాత్రమే మహమ్మదీయుడనిన్నీ; బాప్టిజం పుచ్చుకొని,

యేసుక్రీస్తు దేవుని కుమారుడనీ, ఆతనిద్వారానే మోక్షం వస్తుందనీ, ఏసును నమ్మకుండా ఉన్న వాడికి నరకం అనిన్నీ, నమ్మేవాడే క్రైస్తవమతస్థుడనీ వాదించడంకంటే పరమ ఛాందసం లేదురా పరం.'

'మన మహర్షులు మాత్రమే చెప్పగలిగారురా సర్వమతాలు దైవాన్ని చేరుకుంటాయి' అని.

'అలా అనకు. క్రీస్తుగాని మహమ్మదుగానీ అలా చెప్పలేదనా నీ ఉద్దేశము? కాదు. ప్రతి అవతారపురుషుడు అలాగే చెప్పాడు.'

'నువ్వనేది, సరియైన జ్ఞానముతో సంచరించేవాడు, సత్యాన్ని కొలిచేవాడు, ఏ మతంవాడైనా సరే మోక్షము చెందుతాడు అని రామకృష్ణ పరమహంస ప్రపంచానికి బోధించిందే నిజమంటావు. అంతేనా?'

'అవును మరి. ఆయన మహమ్మదీయుడై అల్లాను ప్రార్థించి భగవంతుణ్ణి సాక్షాత్కరింపజేసికొన్నాడు. క్రైస్తవుడై జెహోవాను స్వాధీనము జేసుకొన్నాడు. రాధ అయి శ్రీకృష్ణునీ, హనుమంతుడై రాముని సాన్నిధ్యము పొందాడు. అందరూ ఒక్క పరమాత్ముని మహాభావమే కాదుట్రా?'

బేలూరు మఠం చూచి, చందా యిచ్చి, కలకత్తానుండి బయలుదేరి, మన యాత్రికులు గయ వెడలినారు. ఫల్గునీనదిలో స్నానమాడినారు. శ్రీరామగిరి దర్శించి శ్రీరాముడు ప్రతిష్ఠించిన మరకత రత్న ఘటిత స్ఫటికలింగమును దర్శించినారు. బుద్ధగయ కేగి యచ్చట సిద్ధార్థుడు బుద్ధుడైన ప్రదేశములో గూర్చుండి, యా పరమపురుషునీ ధ్యానించి, యా దేవాలయ రచనాచమత్కృతికి సంతసించినారు. ఇదే ఔత్తరాహమగు ప్రథమ దేవాలయము. బుద్ధభగవానుడు నిర్యాణమొందినవెనుక నాతని దేహమునకు దహనసంస్కారము లైనవి. అప్పుడా తథాగతుని వపువులోని బొమికలు, దంతములు మొదలగునవి బరిణెలలోనుంచి దానిని వివిధ దేశములకు నాయనశిష్యులు పంపించినారట. ఆ బరిణెలనందిన మహారాజులు వానిని పవిత్ర స్థలములందు స్థాపించి వానిపైన రాతితో, నిటుకతో, మట్టితో దిబ్బలుకట్టిరి. వానిపై శిల్పములుంచిరి. అయ్యవి స్థూపము లన్నారు. ఆ స్థూపములు పవిత్ర ప్రదేశములు. భక్తులు వానిపై వారి కళా ప్రజ్ఞయంతయు జూపించినారు. దానికి తోరణములు, చుట్టును శిల్పములు చెక్కిన కంచెలు నేర్పరచిన మహారాజులు వానికై కోట్లు వెచ్చము చేయించినారు. తర్వాత బుద్ధునికై దేవాలయమును నిర్మించినారు. అట్టి దేవాలయములలో బుద్ధగయ యొకటి. అచ్చటను శిల్పములు తీర్చిన రాతి కంచె యున్నది. స్థూపముల జూచియే, దేవాలయము లేర్పరచినారని కొందరి మతము. కాని పరమేశ్వరుడు బుద్ధునికి బూర్వమే దేవాలయము లున్నవని వాదించును.

గయనుండి మొగలిసరాయి మీదుగా శ్రీ కాశీపట్టణము చేరినారు. గంగానదిలో స్నానమాచరించి, విశ్వేశ్వరుని, బిందుమాధవుని, ఢుండిగణేశ్వరుని, యన్నపూర్ణ విశాలాక్షిని, గవ్వలక్కను, వారణనదిని, ఆసినదిని దర్శించి కేదార ఘట్టములో శ్రీ విజయనగరం మహారాజావారి భవనములో బసజేసినారు. స్నేహితులిరువురు కాశీ విశ్వవిద్యాలయము దర్శించినారు. 'ఒక్క మహానుభావుడు బిచ్చగాడయి కోటులు సముపార్జించి యీ మహోత్కృష్టమైన విద్యాలయం కట్టించినాడు; పవిత్రుడు మదనమోహనుడు. ఈ విద్యాలయానికి బిసెంటమ్మ అసలు పునాది వేసింది. అహో! ఏమి చిత్రంరా మానవుని ప్రకృతి!' యనినాడు పరమేశ్వరుడు.

'ఈ మహాక్షేత్రము ఎన్నివేల సంవత్సరాల నుండి సర్వమానవలోకాన్ని పవిత్రం జేస్తోంది! శ్రీ రామచంద్రుడీ పుణ్యక్షేత్రాన్ని దర్శించినాడా! ఒరే పరమేశా! మన దేశంలో ఉన్న ఇతర పుణ్యక్షేత్రాలు తర్వాత తర్వాత వచ్చినవేమో కాని ఈ మహాక్షేత్రంమాత్రం మహాపురాతనంరా!' అని అనినాడు నారాయణరావు.

౭
భారతీయుల ప్రాచీన నాగరికత

'ఈ విద్యాలయానికి లక్షలు ఖరీదుచేసే యీ భవనాలు ఎందుకు నిర్మించాడో పూర్వ సంప్రదాయాభిమానియగు మదనమోహన పండితుడు?'

'ఒరే నారాయణా! ఒకటిమాత్రం ఉందిరా. పాశ్చాత్యవిద్యే పరమావధి అనే ఈ రోజులలో, ప్రభుత్వమువారి కోపానికి గురికాకుండా జాతీయతను పోషించడానికి వీలైనంతవరకు పోషించే ఈ విద్యాలయం ఒకటి సృష్టించాడురా మహానుభావుడు.'

'నువ్వు చెప్పింది నిజమే. వెనక ఆనాటి కాశీ విద్యాపీఠము, నలందా, తక్షశిల, అజంతా, నాగార్జున పర్వతము, ధాన్యకటకము, నవద్వీపము మొదలగు పరిషత్తులవంటి విద్యాపీఠాలు ప్రస్తుతం మనం పెట్టలేమురా. 1921 ఆప్రాంతాల్ని పుట్టిన గుజరాతు, కలకత్తా, ఆంధ్ర జాతీయ విద్యాలయాలు పేరుకుమాత్రం ఉన్నాయి. మహానుభావుడు శివప్రసాదగుప్తగారు నిలిపిన విద్యాలయం, గుజరాతు విద్యాపీఠంమాత్రం ఇంకా నిలిచాయి. ఎప్పుడో మళ్ళీ నిజమైన విద్యాపీఠాల దర్శనం? ఆంధ్రవిశ్వవిద్యాలయం బెజవాడ నుండి వెళ్ళి పోయేటట్టు ఉంది. విశాఖపట్టణం వెళ్ళిపోతే రాయలసీమవారు తప్పుకుంటారట. బెజవాడ ఆంధ్రదేశానికి మధ్యపట్టణం. అన్ని దేశాల నుంచి వచ్చే రైలుమార్గాలున్నై. పవిత్రమైన కృష్ణవేణినది ప్రవహిస్తూ ఉన్నది.

'అబ్బాయి, ఈసబబులన్నీ విచారించేవాళ్ళు ఎక్కువమంది ఉండరురా బాబూ! రేపో యెప్పుడో శాసనసభలో విశాఖపట్టణం విశ్వవిద్యాలయ ప్రధానస్థానం కావాలి అని బిల్లు పెట్టున్నారు. ఆమోదిస్తారు. సరే, దానికి కాదు. వీరు ఇంతా చేసి మద్రాసు విశ్వవిద్యాలయంకన్న ఇందులో ఏమి కొత్తదనం వెలగబెట్టారు అనే నా విచారం.'

కాశీనుండి సారనాథు వెళ్ళి యచ్చట పురాశిల్ప రక్షణశాఖవారు స్థూపమును త్రవ్వి బయలుపరచిన సంఘారామకట్టడములు చూచినారు. శృంగ ఆంధ్రరాజ్యకాలముల విజృంభించి, గుప్తరాజ్యకాలమున బేరొందిన యా స్థూపమును మహాబోధి సంఘమువారు వృద్ధిపరచుచు నూతన సంఘారామము నిర్మించుచున్నారు. బుద్ధుని విగ్రహములు, మంజుశ్రీ తారావిగ్రహము లచ్చట శిల్పకళాచమత్కృతి వెదజల్లుచున్నవి. అశోకుడు బౌద్ధమతావలంబియై, భక్తుడై, సర్వ సర్వంసహామండలములో హింసకు చోటులేకుండ చేయుటకు, తథాగతుని బోధ లోకమెల్ల ప్రజ్వలింపజేయుటకు దీక్షవహించిన దినములలో నా స్థూపము ప్రారంభింపబడినది. అశోకుని శిలా స్తంభమచ్చట నొకటియున్నది. రానురానా సంఘారావము వృద్ధినొందినది. ఆ స్థలము వేణువనము. బుద్ధుడై యా లోకపావనుడు దేశములనెల్ల సత్యమార్గమును బోధించి యా వేణువనాన ఆశ్రమ మేర్పరచుకొని లోకమెల్ల మార్తాండుడు వెలుగు వెదజల్లురీతి తన బోధను ప్రకాశింపజేయుచుండెను.

పరమేశ్వరు డా ప్రదేశమంతయు దిరుగుచుండెను. నారాయణరావా స్థూపమున కెదురుగ పద్మాసనోపవిష్టుడై యర్ధనిమీలిత నేత్రుడై, యా బుద్ధపరమాత్మను ధ్యానించుకొనుచుండెను. అతని వాక్కుల అమృత ధారలు నారాయణరావు కర్ణముల

ప్రతిధ్వనించినట్లయినది. పరమేశ్వరు డా పవిత్రమూర్తి పద్మాసనధారియై జ్ఞానముద్రతో 'ఓం మణి పద్మిహమ్' అని జ్ఞానోపదేశము చేయుచున్నట్లు భావించినాడు.

కాశీనుండి ప్రయాగ వెళ్ళి, త్రివేణీ సంగమములో మన స్నేహితులు కృతావగాహులైనారు. త్రివేణీ సంగమములో రెండువేణులే కలియుచున్నవి. మూడవ వేణి యంతర్వాహినియట. యమున నీలగాత్ర, గంగాదేవి ధవళశరీర, సరస్వతి సువర్ణచ్ఛాయావర్తన, యమున కూర్మవాహన, గంగ మకరవాహన, సరస్వతి పద్మవాహన.

ఆ సూర్యతనయ కూర్మవాహన మంగీకరించి యెన్ని వేలేండ్లు గడచెనో, నేటికిని యమునాకచ్ఛపము లా నీలంపు లోతులలోకి నీదులాడుచు,తేలికొనుచు, మునుగుచు సంచరించును. యమునకంటే గంగ లోతుతక్కువ. సరస్వతి లోతు నకు కాలమే ప్రమాణము. గంగ మహావేగమున ప్రవహించును. యమున గంభీరముగా నెమ్మదిగా చరించును. లోతులేని గంగయు, లోతుగల యమునయు సంగమించినచోట నా యువకులిరువురు స్నానమాడి, ఊరు జూడబోయిరి. పండిత మోతీలాలుని భవనము, విశ్వవిద్యాలయములు, కోట, పురాతనాశ్వత్థ నారాయణము దర్శించినారు. కోటలోని యశోకుని స్థంభము గమనించినారు.

వారిరువురు ప్రయాగలో గంగను పెద్దబిందెలలో బట్టి రైలుమార్గమున రాజమహేంద్రవరము లక్ష్మీపతికి పంపినారు.

అలహాబాదు నుండి లక్నో, హరిద్వారము, హృషీకేశము దర్శించినారు. వియత్పథము వదలి గంగాదేవి హృషీకేశముకడ నార్యావర్తములోనికి కుడియడుగు పెట్టినది. అచటి ఋషుల యాశ్రమముల దర్శించినారు. రామతీర్థస్వామి గంగలో గలసిపోయిన ప్రదేశము చూచినారు. ఆ మహాభాగుని దలపోసికొని నారాయణరావు పరమేశ్వరుని జూచి 'ఈ పరమఋషి, హిమాలయములో దిగంబరుడై సుమేరువు నధిగమించినాడురా! ఆ మహానుభావుడు రచించిన ఎన్నో గ్రంథాలు పోయాయి. దేశాలు తల్లడిల్లజేసి వివేకానందుని యాత్రను సంపూర్ణము చేసి యవతారం చాలించాడురా. ఏమి మేధావి! లెక్కల ఎం. ఎ. చిన్నతనంలో పది లెక్కలిచ్చి, ఎనిమిది చెయ్యమంటే, పదీ చేసేవాడు సగం కాలంలో.

'సత్యస్వరూపుడగు పరమాత్మను కనుగొన్న ఆ మహానుభావునకు లెక్కలు గిక్కలూ ఒక లెక్కటరా నారాయణం?'

కతిపయ దినాలలో ఢిల్లీ చేరుకున్నారు. కుతుబుమినారు, అశోక చక్రవర్తి నాటిన ఇనుపకంబము, జుమ్మామసీదు చూచినారు. మహమ్మదీయ శిల్పచమత్కృతి గమనించినారు. క్రొత్తఢిల్లీలో తయారగు భవనములు చూచి 'జీవములేని యీ కళాచమత్కృతి యీ కాలమునకు దగినట్లే యున్నది' యను కొన్నారు. మ్లేచ్ఛచక్రవర్తులు ఢిల్లీ చుట్టున నున్న వివిధస్థలముల గట్టిన కోటలు, మహాభవనములు చూచినారు. అక్బరు కట్టిన ఫతేపూరుసిక్రీయును, ఫైజాబాదును, హుమయూను గోరీని మొదలగునవన్నియు జూచినారు. ఫతేపూరుసిక్రీలో రెండురోజులున్నారు. అక్బరు చక్రవర్తి, చరిత్రయంతయు దలపోసికొనినారు.

'ఓరే నారాయుడూ! ఈ భవనములో దిరిగిన అనార్కలీ చరిత్ర మంతయు దలపుకు వచ్చుచున్నది. వివిధదేశాల నుండి వచ్చిన యప్సరస్సమానలగు సుందరీమణు లెందరీ మందిరాల తిరిగినారో? అస్పష్టమధురములయి వారి మాటలు పాటలు ప్రతిధ్వనిస్తున్నవిరా.'

‘కవిత్వం! కవిత్వం! నారాయణా! నువ్వొక సర్దారువు. నువ్వు దర్బారునకు వెళ్తూవుంటే జనానా మేడలమీద ఒక కిటికీలో నుంచి రెండు లేడికన్నులు నీవైపు చూశాయి. నువ్వూతలెత్తావు ఆలోచనాలు నవ్వినై...’ ‘ఆ ఏమిటి! తర్వాత తర్వాత.’

‘తర్వాత నీ కొరకొక సిద్దీ కబురు తెచ్చాడు. రహస్యమార్గాల వెంట నువ్వు కోటలోకి వెళ్ళావు. ఒక సిద్దీ బానిసబాలిక నిన్నో మందిరంలోకి తీసుకు వెడితే, అక్కడ ఒక చక్కనిచుక్క పరిశియాబాలిక, అందం ఒలికిపోతూ ఉన్న దేహాన్ని పట్టియిచ్చేడక్కా వస్త్రాన్ని కట్టుకొని, ఒరగిలి, ఒయారంగా పడుకొనిఉంటే, నువ్వు చూసి ఆనందమూర్తివై ఆమె పాదాలకడ వాలావుట. ఆమె తన దానిమ్మపువ్వులాంటి పెదవుల్ని విరుచుకొని, గబుక్కున లేచి, ఎవరు నువ్వు, ఇక్కడకు ఎందుకువచ్చావు అని చప్పట్లు చరిచిందిరా.’

‘కథలు చెప్పటంలో మా నాన్నగారి తర్వాత నువ్వేరా! నన్ను గురించిన కథ వినడానికి నాకే ముచ్చటగా ఉంది. తర్వాత చెప్పమరి, మొండి తేలు కుట్టుకుండా ఉండాలంటే.’

‘చప్పట్లు కొట్టిందో లేదో, ఎక్కణ్ణుంచి వచ్చారో యమభటుల్లాంటి వాళ్ళిద్దరు సిద్దీలు– నాలుగు బెత్తల వెడల్పు ఉన్న కరవాలాలు పుచ్చుకొని. నువ్వు గజగజలాడావు.’

‘అమ్మయ్యా!’

‘వీణ్ణి లాక్కెళ్ళి పాతాళగృహంలో ఇనపకొట్టులో వెయ్యండి అందామె. నిన్ను తీసుకొనిపోయి అల్లాగే ఇనపకొట్టులో పడేశారు.’

‘ఆ అవతారములో కూడ ఖైదే మనకు?’

‘ఆ! ఇంకా ఎన్ని అవతారాలలో ఖైదో. ఇనపకొట్టులో వేసి నీళ్ళు, రొట్టీమాత్రం ఇస్తూఉండేవారు. నాలుగోరోజున రాత్రి పన్నెండు గంటలకు నవాబుయొక్క నాలుగువందల ఒకటోరాణి కావడానికి చూస్తూఉన్న ఆబాల, కటకటాల తలుపులు తీసి, లోపలికివచ్చి, నిన్ను కౌగలించుకొని ముద్దు పెట్టుకొంది. నువ్వు తెల్లపోయి సంతోషంతో ఒళ్ళు మరిచావు. భోజనం అదీ దిట్టంగా పెట్టూఉండేది, రాత్రిళ్లు నీ కొట్టులోకి వచ్చేది, లేదా తన శయన మందిరానికే తీసుకొనిపొయ్యేది. ఒకరోజున నవాబుకు ఈ సంగతి తెలిసింది. మహానుభావుడు కాబట్టి తన కక్కర లేదని ఇద్దర్నీ...’

‘నరికించేశాడా!’

‘అంతేనా మరి? ఏనుగులచేత తొక్కించడానికి ఆజ్ఞ యిచ్చాడు. తర్వాత నవాబుకు పాంచాలంలో రాజులు తిరగబడ్డారని వార్త వచ్చింది. మీ ఇద్దరి గొడవా మరచిపోయి సైన్యాలతో వెళ్ళాడు. కాపలాఉన్న వాళ్ళకు లంచాలిచ్చి మీ రిద్దరూ దక్షిణదేశాలకు పారిపోయి కృష్ణదేవరాయల కొలువులో చేరారుట.’

‘మంచి కథరా!’

‘ఢిల్లీ నుండి బయలుదేరి మధుర, బృందావనము, ఇంద్రప్రస్థము, కురుక్షేత్రము, హస్తినాపురము మొదలగు దివ్యక్షేత్రములన్నియు జూచినారు. ఈపవిత్ర ప్రదేశముల భగవంతుడు శ్రీకృష్ణుడు చరించినాడు. పాండవులు, కౌరవులు రాజ్యమునకై పెనంగినారు. మహాభారత మంతయు వారి మనోనేత్రములకు గోచరించినది. కురుక్షేత్రమున అభిమన్యు యుద్ధమును స్మరించి మన యాత్రికులు కన్నుల దడిపికొనిరి.

బృందావనములో వారికి మీరాకథ స్మరణకు వచ్చినది.

'పురుషు డెవ్వం డిచట?
పురుషు డాత డొకండె పురుషోత్తముండు.
పురుషు డాత డొకండె
పొలతులము మనమంత,
దివ్యపురుషుని ప్రేమ
తేజఃప్రదీప్తులము,
　　పురుషు డెవ్వం డిచట?
నాథు పాదాలపై
నా బ్రతుకుపువు నుంతు
పూజ గైకోవేర
పొలతులను బ్రోవరా!
　　పురుషు డెవం డిచట?

అని పరమేశ్వరుడు పాడినాడు.

౮
బృందావనము

స్నేహితుల కిరువురకు మీరాబాయి దివ్యచరిత్రము కనుల గట్టినది. మీరాబాయి శ్రీకృష్ణుని కొనియాడుచు బృందావనము వచ్చినది. అప్పుడు బృందావనమున కొక మహాత్ముడు వచ్చియుండెను. ఆ స్వామి తానున్నంత కాలము బృందావనములోనికి స్త్రీలను రానియ్యవలదని యాజ్ఞనిడుటయు, ప్రజ్ఞావంతుడగు నా సన్యాసియాజ్ఞ పూర్ణముగా నిర్వర్తింపబడుచున్నది. ఇంతలో మీరాదేవి బృందావనము ప్రవేశింపబోవుచుండ 'నిలు నిలు' మని అడ్డగించినారు.

'ఎందుకు నాయనా ఆపుజేశారు?'

'తల్లీ! నువ్వు స్త్రీవి. బృందావనములో ప్రవేశించ వలనుపడదని మా గురువు గారి ఆజ్ఞ.'

'మీ గురు వెవరూ?' 'హిమాలయములలో తపస్సు చేసి మహత్తులు సంపాదించిన మహాఋషి మా గురువు, శ్రీ శ్రీ రూపగోస్వామి!'

'అలాగా! అయితే ఈ పాట వినిపించండి ఆయనకు' అని శ్రీ మీరా 'పురుషు డెవ్వడు? శ్రీకృష్ణు డొక్కడే పురుషుడు, భక్తులందరు స్త్రీలు, పురుషునిలో లయమగుటకే తపస్సులు భక్తియున్ను' అని పాట పాడినదట. శిష్యు లా పాటను గురువుగారికడకు బోయి వినిపించుటయు, నా స్వామి నిర్విణ్ణుడై యర్థము గ్రహించి 'యేది నా తల్లి' యని పరువులిడివచ్చి యామె పాదాలపడి 'తల్లీ, సత్యసూత్రము నా కనుగ్రహించి నా గురువైనావు. మూర్ఖుడను. క్షమించు. స్త్రీలు మోక్షం భంగం చేసేవాళ్లు, ప్రకృతిస్వరూపిణులు అనుకొని, వీళ్ళను చూస్తే పురుషుని హృదయం మోసపడిపోయి దగ్ధమగునని తప్పుదారిని పడ్డాను' అన్నాడు.

ఆ కథ స్మరించుకొనుచు నా పాట పాడుకొనుచు, తులసీవనము, యమునాఘట్టము,

--శీయప్రాదము, గోవర్ధనము మొదలగునవి దర్శించినారు.

'కృష్ణా కృష్ణా! గోపకుమారా!
బృందావన సంచారా!
మురలీమోహన, మృదుపదనర్తన
మోహనలీలాకారా!
సుందరనందకుమారా!
కృష్ణా కృష్ణా!'

యని పరమేశ్వరుడు పాడుచు 'నారాయణా! యీ వెన్నెలగడియల్లో యమునాతీరాన్ని, రాసక్రీడాలోలుడైన శ్రీ వేణుగోపాలుని చూద్దామురా' అన్నాడు.

నారాయణరా వా మాట వినుపించుకోలేదు. శ్రీ గోపాలకృష్ణ పరమేశ్వరుడు దివ్యబాలుడై యీ ప్రదేశముల నాడుకొన్నాడా? మోహార్తలగు వ్రజసుందరులకు సర్వసమర్పణ నేర్పినాడా? ప్రేమయనగా స్త్రీ పురుషుల పరస్పర వాంఛయేనా? మోహావేశమున తాను ప్రేమించు బాలికనే దేవస్వరూపమున నెంచి పూజించెదరా? ఎంతమౌఢ్యము! ప్రేమికులకు ప్రేమ భక్తియే కాదా! నిజమైన ప్రేమ ప్రతిఫలము కోరదు. నాథు డితరులను బ్రేమించుచున్నాడని కించపడదు, ఐక్యమే పరమావధిగా గోరును. ఆ ఐక్యభావము సార్థకమగుట ఒక భగవంతుని పాదముల మ్రోలనే కదా.

చిన్నతనాన ప్రేమయే భక్తియని భక్తియోగము గరిపిన నందబాలుడు, వెన్నముద్దలదొంగ, రాధికాహృదయనాథుడు, గోపికామనశ్చోరుడు, కురుక్షేత్రాన మహావేదసారము, ఉపనిషత్తుల నవనీతము, సాంఖ్యామృతము కలియబోసి, నిగ్గుతేల్చి సర్వమతాభిప్రాయాలు సమన్వయించి నరస్వరూపుడయిన వివ్వచ్చునకు బోధించి, లోకానికి యుగయుగాలకు సందేశమిచ్చినాడుగదా. ఈ మహాభావము నిలువెల్ల దివ్యామృతముచే నింపుటలేదా? ఆపుకోలేని మధురావేశము పవిత్రాంబువులై నయనాంచల బిందుధారలై జన్మము పూతమొనర్చుచున్నది.

'ఒరే పరమేశ్వరం! సాంఖ్యవిచారం ఉత్కృష్టమైనదే! కాని సాంఖ్యము ఏమి చెప్పింది? ప్రతియాత్మయు పురుషుడు, అతడే సాక్షిభూతమగు పరమాత్మ, వ్యక్తిలోని మనస్సు, అహంకారము, బుద్ధి, ఇంద్రియములు అన్నియు ప్రకృతి. తెలియని వ్యక్తికి సాక్షిభూతుడగు పురుషుడు మరుగుపడి ప్రకృతిచేత గప్పబడి తనబిడ్డలు, తనయిల్లు వాకిలి అని మోసపోయి, గిట్టుతూ పుట్టుతూ ఉండును. కాని జ్ఞానము చేతనూ, యోగము చేతనూ నువ్వు నిన్ను తెలిసికొంటే అప్పుడు పురుషునికినీ ప్రకృతికినీ సమ్యక్స్థితి కలిగి అంటే నిశ్చల సమాధి కలిగి జన్మరాహిత్యము సంభవిస్తుంది. సాక్షిభూతుడగు పురుషుడు ఏమిన్నీ మార్పులు చెందడు. ప్రకృతియే మార్పులు చెందుతూ ఉంటుంది. పురుషుడు కుంటిమగనివంటివాడు. ప్రకృతి గుడ్డిభార్య. ప్రకృతికి పురుషుడు దారిచూపిస్తూఉంటే ప్రకృతి పురుషుని మోస్తూ ఉంటుంది.'

'ఈ సాంఖ్యధర్మంలో ఉండే లోటేమిటి? శ్రీకృష్ణు డెల్లా ఆ లోటు తీర్చాడు?'

'కపిలమహర్షి యింతవరకును బోధించి, ఆ బోధ సంపూర్ణము చేయలేదు. కాని ఒక్కొక్క ఆత్మ ఒక్కొక్క పురుషుడుగదా. అంటే విశ్వంలో కోటానుకోట్లు పురుషులు వివిధ వ్యక్తిత్వాలతో ఉంటే ఈ పురుషుల శక్తి యేమిటి? ఆద్యంతరహితులై సర్వ బ్రహ్మాండ స్వరూపులే అయితే, వీళ్ళందరినీ నడిపే నాయకుడొకడుండాలి. వీళ్ళందరినీ సృష్టించిన

వాడొకడుండాలికదా! అల్లాకాకపోతే ఇన్నికోట్ల ఆత్మలు ఇన్ని బ్రహ్మాండాలు అవుతారా? కాబట్టి శ్రీకృష్ణుడు ఉపనిషత్తులకు పొయ్యాడు. ఉపనిషత్తులు ఏమన్నాయి? ఆద్యంత రహితమై అనిర్వచనీయమైన బ్రహ్మమున్నది. ఆ బ్రహ్మస్థితి ఎంతటి జ్ఞాన వంతులున్నూ ఊహించలేరు. ఆ బ్రహ్మపదార్థములోనుంచి మూల ప్రకృతి జన్మించింది. ఆ మూల ప్రకృతివలన ఈ సృష్టంతా ఉద్భవిల్లింది. సృష్టిలోని ప్రతి వ్యక్తియు, ప్రతి ప్రాణిన్నీ బ్రహ్మమే. నక్షత్రాలు, ఆకాశం, భూమి, పురుషులు, స్త్రీలు, కుక్కలు, గుఱ్ఱాలు అన్నీ అన్ని ప్రకృతి ఉండడంవల్ల ఈ సృష్టిలో వ్యక్తిత్వం. అది రహితం చేసుకుంటే బ్రహ్మలో లయం.

'శ్రీకృష్ణపరమాత్మ ఏమన్నాడు? అన్నీ ఒకటే చెపుతున్నాయి. కానీ సంపూర్ణంగా ఏదీ వ్యక్తీకరించడం లేదు. సృష్టికలిగిన కారణం నీకువలదు. అది చిదానందము. కాని సృష్టిఉంది. సృష్టిలో పురుషుడు ప్రకృతి సాంఖ్యాలో చెప్పినట్లే. కాని ఈ పురుషుడు, ఈ ప్రకృతిన్నీ ఒక్క పురుషోత్తముని స్వరూపాలే. అన్నీ ఒకటే. సాక్షీభూతుడగు పురుషుడు, ప్రకృతిస్వరూపం. అన్నీ పురుషోత్తముని అవతారాలు. నిజమైన లయం వచ్చినప్పుడు ప్రకృతి పురుషునిలో లయమై పురుషుడు పురుషోత్తమునిలో లయం అవుతాడు అని చెప్పాడు.

'ఒరే నారాయుడూ! మనం భగవద్గీత ఇంకా విపులంగా చదవాలిరా మరి.'

ఆగ్రా వచ్చారు ఇరువురు యాత్రికులునూ. ప్రియవధూమణిపై ప్రణయము మూర్తించినట్టి, ప్రణయినీవిరహము ముద్దకట్టినట్టి, కన్నీటిబిందువులు ఘనీభవించినయట్టి, నిర్మల హృదయము నీడై ప్రతిఫలించినయట్టి తాజమహలు ప్రథమదర్శనము వెన్నెలలో నొనరించెదముగాక యని యమునాతీరమున కారాత్రి వెడలినారు.

ప్రపంచమున మానవుడు సృజించిన సప్తాద్భుతములలో నిది యొకటియట. సమస్తరేఖలు, వంపులు, ఎత్తులు, సమాలంకారములు, సంపూర్ణస్వరూపము ఒక్క శ్రుతిలో మేళవించిన మహారాగమువలె తాజమహలు కాళిందీతీరమున సౌందర్యము మొలకెత్తినది.

ఉదయారుణరాగము తాజమహలుశిఖరములపై ప్రసరించినప్పుడు చూచినారు. మధ్యాహ్న నిశ్చలతలో గమనించినారు. నక్షత్రకాంతిలో బరికించినారు. చూచినకొలది నొక వింతయానందము, తీరనితృష్ణ వారికి నుద్భవించినది.

నాల్గవనాటి రాత్రి స్నేహితులిరువురు బయలుదేరినారు. పరమేశ్వరుడు తాజమహలును పదునేను చిత్రములుగా చిత్రించినాడు. ఆరాత్రి నారాయణరావు తాజమహలు గీతము పాడుటకు సంకల్పించుకొనెను. పరమేశ్వరుడు తల నాకసముదెస కెత్తి నక్షత్రముల గమనింపుచు గూడ బోయెను. ఇరువురు యమునాతీరమునకు బోయినారు.

నారాయణరావు ఫిడేలు మేళవించి కమాను తీగలపై నానించి కదిపినాడు.

ససారీ

యమునా కల్యాణి, కల్యాణిరాగము, యమునారాగము, కల్యాణి పరమాత్ముని శక్తి: శిల్పశక్తీ ప్రత్యక్షము. యమునాఝురీవేగము ప్రేమప్రవాహము. రెండింటికిని సంయోగము. అదియే యమునాకల్యాణి. నారాయణరావు యమునా కల్యాణి రాగ మాలపించి, రూపకతాళమున తానము ప్రారంభించినాడు.

క్షీరశిల కరిగిపోయినది. యమునానది ప్రవహించుట మానినది. తాజమహలు మాయమై యచ్చుట షహజహాను, ముంతాజరాణి పద్మాసనాసీనులై తోచినారు. అంతయు మధురమైనది. పరమేశ్వరు డా యానందములో లీలా నంతస్వరమై యాడుకొన్నాడు ....

దయాలుబాగు సత్సంగులకు మక్కా. ఇచ్చుట వారి సద్గురుమహారాజు నివసించుచుందురు. ఇప్పటివా రైదవగురువుగారు, సాయెబ్జీ మహారాజావారు. నాల్గవ గురువుగారి కాలములో నీ యాశ్రమము ప్రారంభింపబడి నేడు సర్వతోముఖముగ విజృంభించియున్నది. సత్సంగమతము ముఖ్యముగా మూడు విషయములు బోధించుచున్నది. మతము, సంఘము, పారిశ్రామిక విషయములు. పరమాత్మ శబ్దస్వరూపమై యున్నాడు. 'రాధాస్వామి' అని ఆయనశబ్దము, ఆశబ్దమైనను మన ముచ్చరింపజాలని, మనము వినజాలని అతీంద్రియశక్తికే గోచరించునట. కాని ఆస్వరూపమున భక్తులకొరకు పిండాండములో అనగా ఈ ప్రపంచములో నట్టిరూపమున దర్శనమైనదట. రాధాస్వామిదయాళునకు రూపము లేదు. ఆయన శబ్దమాత్రము. ఈ విశ్వమంతయు మూడు భాగములుగ విభజింపబడి యున్నదట. పిండాండము, బ్రహ్మాండము, శుద్ధచైతన్యము. పిండాండము భౌతికసంబంధము. బ్రహ్మాండము మనస్సంబంధమైనది. ఈ మూడు విభాగములు ప్రతిజీవిలో నున్నవి. పిండాండ విభాగము లందరకు దెలియును. బ్రహ్మాండములో ప్రథమము జ్ఞానచక్రము భ్రూమధ్యమున నుండును. అందుండి ఆత్మధార సహస్రారము, జ్యోతిర్నారాయణము, సున్న, మహాసున్న, వంకనాళములకు బోవునట. ఆపై శుద్ధచైతన్యము. అందు ప్రథమము భ్రమరగుహ, దానిపై సత్యలోకము, ఆగమ అలకలోకములు. అన్నిటికన్న పైన రాధాస్వామిధామము. అరిషడ్వర్గముల బారద్రోలి, రాధాస్వామిదయాళుని కృపవల్ల సులభముగ పిండాండము బ్రహ్మాండము దాటి శుద్ధచైత్యము జేరు యోగమార్గము సద్గురువు దెలిపెదరట. మన మా రాధాస్వామిదయాళుని పాదముల నమ్మియుండి, శబ్దములు పాడుచు, యోగమాచరించుచు, సంతులతో సత్సంగమాచరించుచు విశుద్ధజీవనము చేయుచుండినచో, ఈ మూడు ముఖ్యవిభాగప్రదేశములలో నున్న వివిధోపలోకములను దాటుచుబోయి సంతులు పరివేష్టించియుండు సంత సద్గురువువారి ధామము చేరుదుము. అచ్చుటినుండి సంతసద్గురువే నిన్ను రాధాస్వామి ధామము చేర్చగల శక్తి గలవాడు. వివిధ ధామముల జేరునప్పు డచ్చుట నుండి సంతదివ్యులు వివిధ ధ్వనులతో వివిధవర్ణ తేజస్సులై కన్పించెదరట. ఇది దయాలుబాగు సద్గురు మహారాజువారు బోధించు ఆధ్యాత్మిక తత్త్వము.

రెండవది సంఘసంస్కరణ. ఏమతమువారైనను సత్సంగులుకావచ్చును వారికి జాతి మత వర్ణ వివక్ష లుండరాదు. భోజన ప్రతిభోజనములకు వివాహములకు వర్ణము లడ్డమురావు. యువవివాహములు చేయవలయునుగాని, బాల్య వివాహములు పనికిరావు. అర్థములేని యీ నాటి ఆచారము లన్నియు త్రోసివేసి, శుభ్రతయే యాచారములకు ముఖ్యసూత్రముగా బరిగణింపవలయును.

ఎప్పుడు జాతి మత వర్ణ వివక్ష లుండవో, కలిమిలేముల తేడాలు నుండరాదు. సంఘమంతయు సంఘముకొరకు బాటుపడవలయును. ఆస్తియంతయు సంఘముది. సంపాదనయంతయు సంఘముదే. కావున సంఘమే వ్యక్తుల కుటుంబముల బోషించును. ఈ మహాసూత్రము నాచరించుటకై, దయాలుబాగులో వస్త్రములు, ఊటకలములు, కత్తులు, గ్రామఫోనులు, రంగులు, సీసాలు, గరిటెలు, గడియారములు, వెన్న, జోళ్ళు, పెట్టెలు మొదలగు నన్ని రకములగు సామానులు పాశ్చాత్యదేశములతో సమానముగ నొనర్చుచున్నారు. ఏదేశమునకు వలయు వస్తువుల నాదేశమే చేసికొనవలయునను ధర్మమును దయాలుబాగు వారు మనకట్టెదుట కనబరచుచున్నారు. 'అహో దయాలుబాగా! నీకు నమస్కారములమ్మా, సద్గురూ! నీకు జయమగు గాక!' అన్నారు వారు.

నారాయణరావును, బరమేశ్వరుడును దయాల్‌బాగులో నివసించి సద్గురువుగారి బోధనలు విని సంతసించి, వారి యాధ్యాత్మిక తత్త్వము భగవద్గీతాబోధతో సమానము మాత్రము కాదని నిశ్చయించుకొనిరి.

౯

స్నేహితుల కాహ్వానము

రాజేశ్వరరావు బి. ఇ. పరీక్షలో నెట్లో కృతార్థుడై పని నేర్చుకొనుచున్నాడు. అతని ప్రాణమంతయు రాజమహేంద్రవరములో సుబ్బయ్యశాస్త్రి గారి యింటిలో నున్నది. ఒకసారి దక్షిణాదికి బోవలసివచ్చినది. ఒకసారి మలబారు తీరమునకు వెళ్ళినాడు. మొదటి సంఖ్యలో గృతార్థుడు కావలసిన యా యువకుడు, పరీక్షలో నెగ్గుటయే కష్టమైనది. ప్రభుత్వపు నౌకరీదొరకుట దుర్లభము. కావున హైదరాబాదు సంస్థానములోనో లేక జిల్లాబోర్డులోనో యుద్యోగము సముపార్జింప నాతని కోరిక.

ఆలం, రాజారావు మున్నగు మిత్రులు రాజేశ్వరుడు మకాము చేసిన వై. ఎం. సి. ఎ. లో జేరినారు. ఆలం బి. ఎల్. పరీక్ష నెగ్గినాడు, అప్రెంటిస్ పరీక్షలో జేరి అడ్వకేటయి చెన్నపురిలో గృతార్థుడగుటకు నారాయణరావు ఆలంను తనదగ్గర నుంచుకొని, కృషి చేయించినాడు. ఆలంకు నారాయణరా వన్న ప్రాణమే. అతనికి 'బ్రాహ్మణతురక' యని స్నేహితులందరు పేరిడిరి.

ఆలం బి. ఎల్. తరగతిలో జదువుచున్నప్పుడు ట్రిప్లికేనులో వర్తకము చేయు నెల్లూరు మహమ్మదీయ వర్తకుని కొమార్తెనిచ్చి వివాహము చేసినారు; వివాహము నెల్లూరులో జరిగినది. నిక్కా ఉత్సవమునకు మన మిత్ర బృందమంతయు విచ్చేసినారు. ఆంధ్ర తమిళ దేశములలో హిందూ మహమ్మదీయ సమస్య లేనేలేదు. మహమ్మదీయులు, హిందువులు సోదరులవలె మెలంగుదురు. మహమ్మదీయుల హృదయములలో వీర్యాగ్ని ప్రభుత్వమువారు అనేక రీతుల రగుల్కొల్పిరి గాని యది రాజినదికాదు. మహమ్మదీయులు హిందూ దేవాలయములను గౌరవించుచున్నారు. హిందువులు, మసీదులకడ వాయిద్యము వాయించరు. తెలుగుదేశముల మహమ్మదీయుల సోడాషాపులలో బ్రాహ్మణులుకూడ షర్బతులు త్రాగుదురు. కిళ్ళీలు కొందురు. మహమ్మదీయ యోగుల గోరీలకు బోయి హిందువులు పూజలు చేయించుచుందురు. ఆలం స్వస్థలమగు నెలూరి కెన్నిసారులో పోయి, నారాయణరావు మొదలగు మిత్రు లాలంగారి యింటిలో మకామువేసి, భోజనమునకు మాత్రము హోటలునకు బోయి, తక్కిన ఫలహారాదు లాతని యింటనే భుజించుచుండిరి.

ఆలం మంచి వస్తాదు. కుస్తీలో నేర్పరి. కాలిబంతిలో, హాకీలో వెనుకటి యిద్దరి యాటగాళ్ళలో నొకడు. వెనుకనుండి యాతడు బంతిని కొట్టినచో అది ఆవలి కక్షవారి గోలు (బంతి దాటిపోకుండ కాపాడవలసిన రెండు కఱ్ఱల మధ్య స్థలము) వరకు పోయెడిది. అందుకని ఆలంకు 'ఫుట్‌బాల్ పులి' యని పేరు వచ్చినది. ఈ కాలిబంతియాటవలననే ఆలం నారాయణరావులకు స్నేహము వృద్ధియైనది.

ఆంధ్రదేశ మేయాటలయందును బేరువహింపలేదు. కాలిబంతికి కలకత్తా, క్రికెట్టునకు బొంబాయి, చెన్నపట్టణము, లాహోరు మొదలగునవి, హాకీకి పంజాబు, టెన్నిసునకు మదరాసు, కలకత్తా, పంజాబు, అలహాబాదు మొదలగునవి ప్రసిద్ధి. ఆంధ్రులలో నేడు కొంచెము టెన్నిసు, కాలిబంతి, హాకీ, క్రికెట్టులు వృద్ధినందినవి.

కాని యాంధ్రులలో గొందరుపీరులు వివిధ క్రీడలలో బేరుగాంచినారు. క్రికెట్టునందు సి. కె. నాయుడు, సి. ఎస్. నాయుడు, రామస్వామి, బాలయ్య మొదలగువారు; టెన్నిసుఆటలో రామస్వామి, నారాయణమూర్తి, కృష్ణస్వామి మొదలగువారలు. ఏది ఎటులయిన నాంధ్రులు నిద్రమత్తువారు. సహజమగు క్రీడాకౌశల మున్నను అది వృద్ధిచేసికొనరు. పరదేశములకుబోయి పేరు సముపార్జింపరు.

ఆలంకు ఆటలన్న ప్రాణము. అతనికి రాజ్యాంగ వ్యాపారము లవసరము లేదు. మతవిషయములమాట మనసు చొరదు. ఆర్థికవ్యవహారము లాతనినంటవు. ఆటలు! ఆటలు! హిందూపత్రిక నాటల వార్తలకే చదువును. తక్కినపుటలు చదువడు. సినిమా కేగుటయైన నాతడు మానును గాని ఎమ్. యు. సి. లో గాని, ఎం. సి. సి. లో గాని, ఎస్. ఐ. ఎ. లో గాని బంతియాట ఆడుచున్నచో వెళ్లుట తప్పదు. ఇంగ్లండు దేశమునుండి గిర్లీగాను గారి నాయకత్వమున టేట్, మెర్సర్, పాండాం మొదలయిన క్రికెట్టు ఆటగాండ్రు వచ్చినప్పు డాలం చెన్నపట్టణములో చూచుటకు ముందు బొంబాయివెళ్ళి చూచివచ్చెను.

రాజే: ఒరే ఆలం! నారాయణా, పరమేశ్వరం ఎక్కణ్ణుంచిరా నీకు ఉత్తరం రాస్తా?

ఆలం: నాకు సాంచీనుంచి ఉత్తరం రాశారు. అందులో పరమేశ్వరం కవిత్వమే రాశాడు. నిన్ను తిట్టారురా యిద్దరూ! నేనూ, నటన్, రాజారావూ అజంతా వచ్చి కలుసుకుంటే, అజంతా, ఎల్లోరా, నాసిక, ఔరంగాబాదు, ప్రతిష్ఠానము, కార్లే, కన్హేరి, ఎల్ఫాంటా, పూనా, వాతాపి, బీజపురం, పండరీపురం, హైదరాబాదు, ఒరంగల్లు, పాలంపేట అవన్నీ చూచి అక్కడినుండి బెజవాడమీదుగా ఇళ్ళకు చేరుకోవడంట. ఈ యాత్రలన్నీ రెండు నెలలు పట్టుతవట. మనం అంతవరకూ ఉండలేకపోతే అజంతా ఎల్లోరాలన్నా చూచి వెళ్ళిపోవచ్చునట.

నటరాజన్: నన్నర్జంటుగా రమ్మనిదా తంతి యిస్తుడు ఆలం! ఎందుకుదా అని వస్తును. తీరా చూస్తే దీనికిదా. రాజేశ్వర్! నువ్వుకూడా బయల్దేరు మరి.

రాజే: నేను నిజం చెప్పాలి. మా యిల్లువదలి చాలారోజులయింది. మా అమ్మగారు బెంగ పెట్టుకుందనీ, నువ్వు వేగిరం రావాలి అనీ మా వాళ్ళు ఉత్తరాలు, టెలిగ్రాములు పంపారు. కాబట్టి మీరంతా వెళ్ళండి.

రాజా: ఏమోయ్ రాజీ! నాకుమాత్రం ఇంటికి వెళ్ళాలని లేదుటోయి! మావాళ్ళని పిల్లలను చూసి చాలా రోజులయింది. మా అమ్మ బెంగపెట్టుకుంది. పైగా నేను అమలాపురంలో దుకాణం పెట్టాలని నిశ్చయించుకున్నాను. అశ్రద్ధ చేసేందుకు వీలులేదు. నాకుమాత్రం వచ్చేందుకు వీలుందా? అయినా బయలుదేరుతున్నానా లేదా?

నట: నాకూ తీరుబడిదాలేదు. ఇప్పుడుదా మా హాస్పత్రులు నిండాపనిలో ఉండును.

ఆలం: ఏ రైటరుకో లంచమిస్తే సరి...

రాజా: అంతమంది డాక్టర్లున్నారు. నీవే అవసరమా?

ఆలం: అబ్బాయిలు! ఎవ్వరూ ఏమీ అభ్యంతరం పెట్టేందుకు వీలులేదు. ఇంక మూడురోజుల్లో బొంబాయి మెయిలుమీదో, ఎక్సుప్రెస్ బండి మీదో ప్రయాణం. రాజేశ్వరుని బడాయిమాటలు ఎవరెరుగరురా? రాజమండ్రిలో గులాబిపుష్పాల సువాసన ఇక్కడికి కొట్టి వీడికి వెర్రెత్తుతోంది.

రాజే: నాకు కోపం తెప్పించకోయ్!

ఆలం: నవాబులు ఒకళ్ళ బెదిరింపులకు బెదరరు. పుష్పం మనదైతే ఎప్పుడైనా దొరుకుతుందికాదుట్రా రాజీ.

రాజే: ఒరే ఆలం! జాగ్రత్తరోయ్. నీపని శ్రుతిమించి రాగాన్ని పడుతోంది.

ఆలం: గ్రామఫోనువాళ్లను పిలిపించరా మరి!

నట: రాజీ అపశ్రుతిదా అవుతాడేమో.

రాజా: మీకంతా వెఱ్ఱియెక్కినట్లుంది. మీకందరికీ మెదడుశస్త్రం చేయించాలిరా. ఆ నాచుపట్టిన మెదళ్ళన్నీ కాస్త బాగు చేసి మళ్ళీ పెట్టేస్తాను. ఏవంటారోయి!

రాజీ: డాక్టర్లు కురుపులు కడుక్కుంటూ, మాత్రలు నూరుకుంటూ కూచోక, వేళాకోళాలుకూడానూ! రాజా: ఇటుకలు పోతపోసే ఇంజనీర్లకన్న వైద్యులు నయమోయ్.

ఆలం: రెండూ రెండే. ఒకడు నాచేతిమాత్ర వైకుంఠయాత్ర అంటాడు. రెండోవాడు నేకట్టిన వంతెనా అదిబద్దలయి నీళ్ళలో గంతెనా!

రాజా: కొంపలు మాపే తమ లాయరుద్యోగం చాలా గొప్పది కాబోలు. ఏమి ఎరగనివాళ్ళకు తలలుమార్చుడాలు నేర్పి, సంసారాలు దిబ్బచేసే దెవరో?

నట: మీరంతా ఒకటేదా. మా రైతుల రక్తం పీల్చటానికిదా పుట్టారు. మీరు మాదేశంలో ప్రవేశించిన చీడపురుగులువంటివాళ్లుదా.

రాజా: ఈ అసలైన రైతుబిడ్డ ఈ నటరాజన్ ఏమి బాగా మాట్లాడుతున్నాడు. ఒరే రైతూ! నీ తెలివితక్కువతనాన, నీశక్తి లేకపోవడం మూలాన పరరాజ్యాలవాళ్లు వచ్చి మనదేశం ప్రవేశించడం, మనలందరినీ రక్తం పీల్చడం జరిగింది. ఓరీ అరవరైతూ.

ఆలం: అచ్ఛా అచ్ఛా, బహుత్ అచ్ఛాహై! సుల్తాన్‌వారి ఆజ్ఞ హేమిటి చెప్తారట్టా!

రాజే: నేనురావడం సుతరామూ వీలులేదు.

ఆలం: అయితే ఒక సంగతి చెప్తాను వినండి. మనవాళ్ళకి నేను ఉత్తర ప్రత్యుత్తరాలు రాస్తూ ఉంటాను. వాళ్లు ఎప్పుడు హైదరాబాదు వస్తారో అప్పుడంతా హైదరాబాదు వెళ్ళి కలుసుకుందాము. అక్కడ చూడవలసినవి చూసి, ఒరంగల్లు, పాలంపేట చూసి అందరం బెజవాడ వద్దాము. ఏమంటారు?

రాజే: తురకాడు తురకాడేరా! హైదరాబాదులో మనవాళ్లని కలుసుకోవాలేం? షరం నహీహై?

ఆలం: హహ్హహ! ఎక్కడ నేర్చుకున్నావురోయి తురకం?

రాజే: నాకు వచ్చిందోయి, రాజేశ్వరులవారికి ఇబ్బంది లేదు, ఎటువచ్చీ నటరాజన్ గారిని మనం యిబ్బంది పెడ్తాం

నట: నువ్వు రావడందా, హాజరుదా?

రాజేశ్వరరావు మేఘాలమీద రాజమండ్రిలో వ్రాలినాడు. వచ్చినప్పటి నుండియు పుష్పశీలయే కలవరింత! ఆమె నెట్లు కలుసుకొనుటా యను విరహ వేదనయే.

రాజేశ్వరుడు చదువుకొనురోజులలో పుష్పశీలకడనుండి యుత్తరములు చిత్రముగా తెప్పించుకొనువాడు. తానొక స్నేహితునికి వ్రాసి యచ్చటనుండి యొక బాలకునిచే నామెకా ఉత్తరము అందునట్లు చేయువాడు. ఆమె తన ఫొటోలు రెండు అతనికి బంపినది, వానిని దాస్ బ్రదర్సు వారికడ నలభై రూపాయలిచ్చి పెద్దవి చేయించినాడు. తన గది యలంకరించుకొన్నాడు. ఆమె చిన్న చిత్రమొకటి తీయించి, తన యుంగరములో నిమిడించుకొన్నాడు. ఇంకొకటి వాచిగొలుసులో బెట్టుకొన్నాడు. ఇక నేమి! లోపల బయట నంతట పుష్పశీలయే, విశ్వమెల్ల బుష్పశీలామయమే.

వీరిరువురి సంబంధము నెమ్మదిగా లోకమెల్ల బ్రాకుచు ప్రవహించుచున్నది.

పుష్పశీలకు రాజేశ్వరుడన్న వెఱ్ఱియెత్తిపోవుచున్నది. భర్తకుగాని ఇంటిలోని ముసలమ్మకు గాని తెలియునన్న భయముచే అతి జాగ్రత్తగా మసలినది. భర్తపై అనురాగము చూపించ ప్రారంభించినది. తన లీలావిలాసములలో నాతని ముంచెత్తునది. తనభర్తలో రాజేశ్వరుని యూహించుకొనునది. ఈ కౌగిలింత, ఈ ముద్దాతని కిచ్చిననేకదా జన్మము సార్థకము. ఈ ముసలికోతికి తన యీ విలువగల కౌగిలింత, ముద్దు ధారపోయవలసివచ్చుచున్నది. భగవంతు డింత నిర్దయుడేమి యనుకొన్నది.

ఛీ! ఛీ! మనము చేయు నీ పాపకార్యమునకు భగవంతుని తలచుటేల యనుకొన్నది. ఇందు పాప మేమున్నది? నిజమైన ప్రేమే వివాహమని భర్త రహస్యముగా తెచ్చుకొన్న నవలలో నున్నదిగా! ఆ నవల 'స్వతంత్ర ప్రేమ' సంఘాధ్యక్షునిచే వ్రాయబడినది.

౧౦
దేశయాత్రా విశేషములు

శారదకు మనస్సేమియో బోధించుచునేయున్నది. మొదటి మూడుదినములు భర్త తన్ను బ్రతిమాలినాడు గాని తరువాత తాను గదిలో నున్నదియు లేనిదియు గమనించకుండ నిదురించినాడు. 'అమ్మయ్యా వదిలినా' డని సంతోషించినది. పిమ్మట కాలముగడచి వారములు బ్రవహించిపోయినకొలది శారదకు మనస్సు పరిపరివిధముల బోయినది.

భర్త దేశయాత్రకు బోయినాడు. ఏ దేశముల దిరుగుచున్నాడో యని తన తండ్రి ప్రొద్దస్తమానము దిగులుపడుచుండుటవలన, నామెకు భర్తపై కోపము కలిగినది. కాని ఆటలలో, సంగీతములో, చదువులో భర్తమాటే మరచిపోవుచుండును.

ఇంతలో నక్టోబరు నెలాఖరున భర్త కొత్తపేట వచ్చినాడనియు, గాశీ సంతర్పణ తల పెట్టినారనియు నుత్తరములు వచ్చినవి.

చెన్నపట్టణమునుండి యప్పుడే వచ్చిన జమీందారుగారు భార్యను జూచి 'అల్లుడు రాజమందిరము వచ్చినప్పుడు మన యింటికి వచ్చినాడా?' యని ప్రశ్నించెను. 'రాలేదండి. ఈ ఊరు వచ్చినట్లే మాకు తెలియదండీ.'

'ప్రొద్దున మెయిలులోవచ్చి యిక్కడ గంగపూజ చేసికొని, బావమరిది యింటిలో

భోజనములుచేసి స్నేహితులతో గొత్తపేట వెళ్ళినాడట.'

'మనయింటికి ఎందుకు రాలేదో?'

'ఎందుకు రాలేదని అనుకునేది? అతని యిష్టం.'

'మూడు నెలలైనది. ఇల్లు వదలి, ఇచటికి వచ్చికూడా మనయింటికి ఒకసారైనా రాకపోవడం ఆశ్చర్యమే! ఎప్పుడూ అలా సంచరించేవాడు కాదే!' అని సుందరవర్ధనమ్మగారనినది.

ఒక వేళ కొత్తచేత సిగ్గుపడినాడేమో? అల్లుడు రాకుండుట కేదియో కారణముండియుండునని యనుకొనవలె. ఏమి కారణమైయుండును? తన భార్యకు అల్లుడన్న బొత్తుగ నిష్టములేదన్న సంగతి గ్రహించినాడు. అనేక పర్యాయము లామె కల్లునిగుణగణములు వర్ణించినాడు. అతనిని గౌరవించనిచో దనను గౌరవించనట్లే యని నొక్కి చెప్పినాడు. ఆమెమాత్రము ప్రసక్తి వచ్చినప్పుడెల్ల నల్లునియందు నిరసనము చూపుచునే యున్నది. ఉదారహృదయుడైన యల్లుడు ఇట్టి క్షుద్రభావములకు జోటిచ్చువాడు కాడు. భార్యగాని, యితరులుగాని అల్లుడు తన యింటికి వచ్చుటకు సిగ్గుపడునంతటి యగౌరవము సలిపియున్నచో నట్టివారికిని దనకు నా నిముషముతోసరి, యని యనుకొని భార్యను జూచి, 'అతని మనస్సు పరమోత్కృష్టమైనది. అతడు చిన్నచిన్న దానికి మనస్సు కష్టపెట్టుకోడు. ఇంతవరకు ఈ ఊరు వచ్చినప్పుడు మన యింటికి రాకుండా ఉండలేదు. నువ్వెప్పుడైనా అతనికి మనస్సు నొచ్చు కార్యము లేమియు జేయలేదుకదా?' అనెను జమీందారు.

'అబ్బే, లేదండి.'

'అతని హృదయం మనవాళ్ళలో ఎవరివల్లనైన కష్టపడినదంటే వారు నాకు కానివారు. ఈ జన్మలో వాళ్ళకూ నాకూ ఏ సంబంధమూ ఉండదు.'

'అంత విచిత్రంగా మాట్లాడతారేమిటి? అతన్ని అగౌరవపరచేవాళ్ళెవరండీ?' వరదకామేశ్వరీదేవి లోన కంపించినది. తానేమియు పొరపాటున యల్లుని బాధించలేదుగదా?

కాశీసంతర్పణకు జమీందారుగారు భార్యను, సోదరిని, గుమారుని, శారదను వెంటదీసుకొని కొత్తపేట వెళ్ళినారు.

ఎప్పుడు రాని వియ్యపురాలు వచ్చినదని కామేశ్వరీదేవి యడుగులకు మడుగులొత్తించిరి వియ్యాలవారు. శారదా నారాయణరావులు బీటలపై కూర్చుండవలసి వచ్చినది. దంపతు లిరువురు గంగాపూజ సలిపినారు, పీటల మీద కూర్చున్న బావగారికి కేశవచంద్రుడు ఖద్దరువస్త్రముల నిచ్చినాడు. కుమార్తెకు, తల్లి సూర్యకాంతముచే పసుపు, కుంకుమ, చీర, రవికయు నిప్పించెను. హారతి నిచ్చిరి. బ్రాహ్మణ సమారాధన జరిగినది. సంభావన లిచ్చిరి. వచ్చిన చుట్టము లందరకు గంగచెంబు లీయబడినవి. జానకమ్మగారి యక్క గారును బ్రతికియున్నంతవరకు సరిపోయినంత గంగ పట్టుకొని వచ్చినాడు కుమారుడని సంతసించినది.

భోజనములైన వెనుక సుబ్బారాయుడుగారి రెండవ భవనమగు మేడలో జమీందారుగారు, శ్రీరామమూర్తిగారు, సుబ్బారాయుడుగారు, నారాయణరావు, నతని

స్నేహితులు, తదితరులు నింకను బెద్దలు తాంబూలము వేసికొనుచు కూర్చుండినారు. ఆలమును, రాజారావును, జమీందారుగారు తన యల్లుని యాత్ర విషయమై అడిగినారు. కాశీ సంతర్పణకై బెజవాడనుండి వచ్చునపుడు పరమేశ్వరుడు తన భార్యను కొత్తపేట తీసికొనివచ్చినాడు. అతడును విశాఖపట్టణములో కాశీసంతర్పణమును సంకల్పించినాడు.

విశాఖపట్టణమునుండి ఆహూతులై పరమేశ్వరుని తలిదండ్రులును, అతని అనుజులు, చిన్న చెల్లెండ్రు వచ్చినారు. రాజారావు తలిదండ్రులు, భార్య సూరమ్మయు, బిడ్డలును వచ్చిరి.

ఢిల్లీ ఫతేపూరు సిక్రీ, ఆగ్రా మున్నగు ప్రదేశములందలి వింతలు చెప్పి, దయాలుబాగు చరిత్రయంతయు జెప్పి యచ్చట నుండి జబ్బలుపురమునకు బోయినారమని నారాయణరావు చెప్పనారంభించెను.

'జబ్బలపురము దగ్గరనుండి నర్మదానదిలోయ చూద్దామని వెళ్ళాము. ఆ పాలరాతి కొండల్ని తొలిచి ఆ నది ప్రవహించే సొంపు, మన గోదావరి పాపికొండల్ని దొలిచి ప్రవహించు ప్రదేశముయొక్క అందముతో సరిపోతూ ఉన్నదండి. ఆ గుబుర్లు, అడవులు, కొండలు, జలప్రవాహము, నీలాకాశం మమ్మల్ని సమ్మోహింపచేశాయి.

'అక్కణ్ణుంచి భోపాలు వెళ్ళాము, భోపాలు తర్వాత స్టేషను భిల్సా. అక్కడ సాంచిస్థూపము హిందూదేశములో అందమైన స్థూపాలలో ఒకటి, ఆ స్థూపము చుట్టూవున్న మహాద్వారములందున్న విచిత్ర శిల్పసంపద ఇంకో చోట లేదండి. ఆ మహాద్వారాల్లో ఒకటి ఆంధ్రచక్రవర్తుల ఆస్థానపు శిల్పిధాన్యకటకమునుండి వెళ్ళి, నిర్మించి, చెక్కివచ్చెనట.

'సాంచీనుంచి ఉజ్జయిని వెళ్ళాము. శ్రీ కాళిదాసాది మహాకవుల పొగడ్తలనందిన ఉజ్జయిని అద్భుతం అయిందండి. దశకుమారుల చరిత్రము, వాసవదత్త, మేఘసందేశము, కథాసరిత్సాగరము వర్ణించిన మహాకాళేశ్వరుని గుడి, మొదలయిన వన్నియు జూచి యచ్చటనుండి అహమ్మదాబాదు వెళ్లాము. శ్రీ గాంధీమహాత్ముని సబర్మతీ ఆశ్రమము చూచాము. శ్రీ మహాత్ములవారిని దర్శనము చేసుకున్నాము. ఎక్కి కదిలిస్తే కదిలే మినారెట్ చూసినామండి. అట్లాంటివి రెండుండేవిట. ఒకటి ఒక ఇంజనీయరు విప్పి మళ్ళాకట్టినాడట. అందువల్ల కదలుట మానినది. రెండవది పైకెక్కి ఇటు నటు కదల్చినచో కదలిపోవును. నీరు గిన్నె నిండుగా పోసి మినారట్ కదిల్చినచో నీరొలికిపోవును.

'అహమ్మదాబాదు నుండి కథియవారు వెళ్ళి శ్రీ గాంధీమహాత్ముని జన్మస్థానమగు పోర్‌బందరుపురము, శ్రీ గాంధిమహాత్ముడు పుట్టిన గృహమును గనుగొని యానందపూర్ణుల మయ్యాము. అక్కడ నుంచి ద్వారక వెళ్ళాము. ద్వారక నుండి తిరిగి అహమ్మదాబాదువచ్చి, అచ్చటనుండి ఆబూపర్వతం వెళ్ళాము.

'ఆబూస్టేషను నుండి ఆబూపర్వతానికి మోటారుబస్సున్నది. మోటారు మీద నాలుగు వేల అడుగుల ఎత్తున్న ఆబూపట్టణానికి వెళ్ళాము. అచ్చటినుంచి తిన్నగా దిలావర జైనదేవాలయములు చూశాము. అహో! ఏమి యాదేవాలయ శిల్ప సౌభాగ్యము! ఎంత చూచినను తనివితీరదండి. అంతా పాలరాయి చెక్కడమే. ఆప్రదేశం అంతా రూపాయలుపరచి జైన భక్తుడు కొన్నాట్ట. ఎన్ని కోట్లు ఖర్చు చేయించి ఆ గుడి కట్టించాడో!

'దిలావరాన్నుంచి అచలేశ్వరం వెళ్ళి అచ్చట పూజారి బ్రాహ్మణుని యింటిలో మకాంచేసి, రొట్టెలు, పాలు ఫలహారంచేసి పడుకున్నాం. మరునాడు ప్రొద్దున్నే దత్తాత్రేయశిఖరానికి వెళ్ళాము. అయిదువేల అడుగుల ఎత్తు ఆ శిఖరం. పైన ఒక

పెద్దరాయి, ఆ రాతి పైన ఒక గుడి ఉంది.

'ఆబూపట్టణం నుంచి చిత్తూరు వెళ్ళాం. చిత్తూరు మార్వార్ మహారాణాలు సంగరాణా, భీమసింగు, లక్ష్మణసింగు, హమీరు మొదలగువారు మహాప్రతాపవంతులు పరిపాలించిన ఆ మహాపట్టణము చూచినప్పుడు కన్నుల నీరు తిరిగినది. అక్కడనుంచి తిన్నగా బరోడా వచ్చాము. బరోడాలో ఆగి, గైక్వారుగారి భవనములు, తోటలు మొదలగునవి యన్నియు జూచి సూరతు వచ్చి యచ్చటనుండి బార్డోలీ వెళ్ళాము. బార్డోలీ ప్రజల వీరత్వమంతయు మొదటి నుండి వినియున్నందున, ఆ దేశం చూసి, ఆ ఊళ్ళో నాయకులను కలసుకొని, అచ్చట ఒక రోజాగి, తిన్నగా బయలుదేరి జాల్‌గాను వచ్చి చేరాము.

'జాల్‌గాను దగ్గర బొంబాయినుండి ఢిల్లీకి బోవు జి. ఐ. పి. రైలు ముఖ్య మార్గమున్నది. జాల్‌గాన్ నుండి మోటారు చేసికొని తిన్నగా అజంతాకు పోయాము.

'అజంతా చూచి మా పరమేశ్వరుడు మూర్ఛపోయాడు. ఆతని ఆనందానికి మేరలేకపోయింది. చిత్రకారుల కది కాశీపట్టణం. ఇప్పటికి రెండువేల సంవత్సరాలకు పూర్వంనుంచి పధ్నాలుగువందల సంవత్సరాల క్రితంవరకూ ఆరువందల సంవత్సరాలు వృద్ధిపొందింది.

'భోగిరానది సాత్పురా కొండలలో పుట్టి ఆ కొండలను రెండుమూడు మైళ్ళు తొలుచుచు ప్రవహించింది. ఆ లోయలో ఒక్క అరచంద్రాకృతిని ఉన్న వంకరలో యిరువది యెనిమిది గుహలు తొలిచినారు. 'ఆ గుహలన్నీ ఒక తరాన తొలిచినవికావు. అవికొన్ని చైత్యాలక్రింద, కొన్ని విహారాలక్రింద నున్నవి. చైత్యం అంటే గుడివంటి గుహ. విహారము బౌద్ధభిక్షువులుండే గుహ. కొన్ని కొన్ని విహారాలలో వేయిమంది సౌఖ్యముగా కూర్చుండవచ్చును. ప్రతి గుహయందూ బుద్ధదేవుని విగ్రహమున్న గర్భమందిరముంది. అట్టి గుహల్లో చాలావాటిలో గోడలకు లోకప్పుకు, స్తంభాలకు మట్టి మొదలైనవి కలిపిన ముద్దపూసి, దానిపై దివ్యమైన చిత్రలేఖనం చిత్రించినారు. ఆ రంగులు నేడు పూసినట్లుగా ఉన్నవి. బుద్ధజాతకకథ లెన్నియో అందు చిత్రించి ఉన్నాయి. బోధిసత్త్వుని మూర్తులు, బుద్ధుని మారుడు పరీక్ష చేయుటయున్నూ చిత్రించి ఉన్నవి. ఇవికాక అలంకార చిత్రవిన్యాససంపద ఇంతా అంతా కాదండి. ఏనుగులు, పక్షులు, జింకలు, మనుష్యులు, పళ్లు, కమలములు మొదలగు పూవులు అన్నియు అలంకారవిన్యాసములోనికి తీసికొనివచ్చి ఒక అద్భుత చిత్రప్రపంచం అల్లారండి.

'అజంతాలో వారంరోజులున్నాము. అక్కడ నుంచి మన్‌మాడు మీదుగా ఎల్లోరా గుహలకు వెళ్ళాము. ఎల్లోరా గుహలలో ముఖ్యమైన పదహారవ గుహను రాష్ట్రకూటులరాజగు మొదటి కృష్ణరాజు దొలిపించినాడు. ఎల్లోరాలో జైనగుహలు, బౌద్ధగుహలు, హిందూగుహలు ఉన్నవి. అన్నింటి కన్న విచిత్రమైనవి హిందూగుహలే.

'కృష్ణరాజుకు కుష్ఠురోగము అంకురించినదట. యెట్టి ఘనవైద్యులున్నూ ఆరోగ్యము కుదర్చలేక పోయినారుటండి. ఇంతలో ఒక ముసలిబ్రాహ్మణుడు ఒకరోజున వచ్చి, 'ప్రభూ ఎల్లోరాగుహలోని శివప్రీతికరమగు నొక చిన్న కందరములో ఒక జల వెలిసింది. అద్దాని సేవించి నీలకంఠుని ప్రార్థించినచో మీకు రోగం నివృత్తి అవుతుందని చెప్పి యెక్కడికో వెళ్ళిపోయాడుటండి.

'తన రాజధాని మాన్యకేతనం వదలి, రాష్ట్రకూటరాజు తిన్నగా ఎల్లోరావెళ్ళి అచ్చట

మకామువేసి, శివుని ప్రార్థిస్తూ ఆ శిలల్లోంచి పుట్టిన నీరు త్రాగాడుటండి. అతనికి కుష్టు సంపూర్ణంగా పోయిందట. అప్పుడు శ్రీ పరమేశ్వర ప్రీతికరంగా కైలాసమే ఆ కొండలో నిర్మించాలని ఆ ప్రభువునకు నిశ్చయం కలిగి శిల్పులలో పేరుపొందిన యొక మహానుభావుణ్ణి రప్పించి, కైలాసంవంటి దేవళం ఈ కొండలో దొలిపించాలి అని అన్నాట్ట. ఆ శిల్పి కైలాసగిరికి ప్రయాణం చేసి, ఒక ఏడాదిలో తిరిగివచ్చి, అనేక శిల్పులను పోగుచేసికొని, ఆ దేవాలయం నిర్మించాట్టండి కొన్ని సంవత్సరాలకి.

'సుమారు నూరడుగులపైన ఆ కొండప్రక్కగా దొలిచి అందులో గుడి, మండపం, గోపురం, రెండు ధ్వజస్తంభాలు, రెండు ఏనుగులు, యాత్రికుల మందిరాలు, విహారమండపం అన్నీ చేశారు. ఒకేరాయి గుడిఅంతా. సింహాల మీద, ఏనుగులమీద, శరభాలమీద గుడి నిలిచియున్నట్లు చెక్కారు.

ఆంధ్రమహారాజ్య చిహ్నములు

నారాయణరావు తన యాత్రలనుగూర్చి చెప్పుచున్నకొలది జమీందారుగారు, సుబ్బారాయుడుగారు మొదలగు చుట్టపక్కములత్యంత సంతోషముతో వినుచుండిరి. ఇంతలో గ్రామస్థులును, నారాయణరావు నెలకొల్పిన గ్రంథాలయ కార్యదర్శియు, నధ్యక్షుడును వచ్చి యందరకు నమస్కృతులిడి కూర్చుండిరి. వారు నారాయణరావును, బరమేశ్వరుని తమ యాత్రలగూర్చి యుపన్యాసముల నిమ్మని కోరుటకు వచ్చిరి. జమీందారుగా రల్లుని తప్పక యొప్పుకొమ్మని చెప్పినారు. నారాయణరావు వల్లెయనెను.

'ఒకేరాయి, పైనుంచి యింకొకశిల తీసికొనిరాలేదు. ఇది సరిగదా, ఇక ఆ శిల్పంయొక్క అందం ఇంతని వర్ణించడానికి వీలు లేదండి.'

అక్కడకు వచ్చినవారిలో నొకరు 'ఎంత కష్టం అండి చెక్కడం, ఆ రాతిలోనే అంతా. ఒకేరాయి లోపలా పైనాకూడా చెక్కాలంటే ఎంత కష్టం, మా గొప్ప శిల్పం అండీ' యనినాడు.

'గుహలన్నీ ముప్పై ఉంటాయి. ముందు బౌద్ధగుహలు, తర్వాత హిందూ గుహలు, తర్వాత జైనగుహలు బయలుదేరాయి. హిందూగుహలలో దశావతారం అన్న గుహలో చాలా గొప్పశిల్పం ఉందండి!'

ఆ సాయంకాలం సభలో పరమేశ్వరుడు మాట్లాడినాడు. నారాయణరావు కంఠముకన్న బరమేశ్వరుని కంఠము ఉపన్యాసము లిచ్చుటలో నెక్కువ గంభీరత దాల్చును. అతడు వేలకొలది జనమును దన వాగ్ధారలో ముంచియెత్తుకొనిపోగలడు. నారాయణరావు గొంతుక యుపన్యాసములో మధురముగా నుండును. ధారాశుద్ధిగలది. ప్రతివిషయమునుగూర్చి లెక్కలు మున్నగు వివరములు చెప్పుచు శ్రోతల హృదయము చూరగొనును.

బరమేశ్వరుడు లేచి 'మానవుని హృదయం విశాలం అవ్వాలంటే దేశాలు తిరగడం ఒకమార్గం. ప్రతి విద్యార్థినీ, ప్రతి రైతు కుఱ్ఱవాణ్ణి చివరకు ఆంధ్రదేశమైనా పూర్తిగా తిరిగిరమ్మనాలి. ఆంధ్రదేశంమాత్రం తక్కువ ఉందా! ఋషికుల్యానదికడనుండి కంచివరకు, సముద్రం ఇటు, అటు ముచికుంద నది, భీమనది మొదలైనవి ఎల్లలు. మనదేశం ఏలినవాళ్ళు ఆంధ్రులు. మొదట మనకు చరిత్రలో తెలిసివున్నంతమట్టుకు ఆంధ్రులు ఆఖరి కాణ్వాయణచక్రవర్తిని చంపి, తాము చక్రవర్తులై రాజ్యం చేశారు ఆరువందల సంవత్సరాలు. తర్వాత ఇక్ష్వాకులు, సాలంకాయనులు బృహత్పాలాయనులు, పల్లవులు రాజ్యం చేశారు. విజయవాడలో, వేంగిలో, కాంచిలోను. తర్వాత గాంగులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డులు, వెలమలు, క్షత్రియులు, తెలగాలు, కమ్మవారు, గొల్లలు, కోమట్లు, బ్రాహ్మణులు రాజ్యాలు చేశారు.

'ఆంధ్రమహారాజ్యము యొక్క చిహ్నాలలో అమరావతి, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, గోలి, ఘంటశాల, నాగార్జునమెట్ట ముఖ్యమైనవి. ఆంధ్రశిల్ప మత్యంత ప్రాభవము పొందినది. అంత ఉత్తమశిల్పము నాటికి నేటికి లేదని వక్కాణింపవచ్చును. అంతయు పల్నాటి పాలరాతిలో చెక్కారు.

'ఆంధ్రశిల్పంయొక్క గొప్పంతా చెన్నపురి, లండను, బెర్లిను వస్తు ప్రదర్శనశాలలలో ఉన్నది.

'పల్లవులున్నూ తమయొక్క చిహ్నాలు కాంచీపురంలో, మహాబలిపురంలో అక్కడక్కడా నిలిపారు. విజయవాడలో వారు నిర్మించినట్టి దేవాలయం కృష్ణఒడ్డునే కొండమీద ఉన్నది.'

అతని ఉపన్యాసం వరదలనాటి గోదావరినదివలె ప్రవహించుచున్నది.

'మహాబలిపురశిల్పంలోని గంభీరత అతి విచిత్రమైనది. అర్జునుని తపస్సు, కోతులగుంపు, యేనుగుల శిల్ప విన్యాసం మాధుర్యం వెదజల్లుచుండును. అచ్చట రాతిరథములు, ఒకేరాతిలో దొలిచినవి. ఆ గుడులు పరమాద్భుతములు. పంచపాండవుల రథములు, ద్రౌపదిరథము నున్నవి. ఆ పట్టణమంతయు సముద్రమున మునిగిపోవుచున్నది.

'చాళుక్యుల శిల్పము, దేశమంతయు వెదజల్లబడియున్నది. బాదామిలో, కళ్యాణిలో, ద్రాక్షారామములో, రాణ్మహేంద్రవరములో, సింహాచలములో ఇంకా అనేక స్థలములలోనున్న దేవాలయములలో విగ్రహములలో చాళుక్యుల శిల్పచమత్కృతి కనబడుతుంది. చాళుక్య దేవాలయములు దాక్షిణాత్య దేవాలయములంత పెద్దవికావు.

'కాకతీయుల శిల్పకళాప్రాభవము ఓరుగల్లులో, పాలంపేటలో, అమ్మకొండలో దర్శనమిస్తుంది. కాకతీయులు శ్రీనటేశ్వరుని నాట్యమహదానందము చూపించుకొన్నారు వారి శిల్పములో.

'విజయనగర సామ్రాజ్యము హంపీ, తాడిపత్రి, పెనుగొండ, గుత్తి, మాచెర్ల, లేపాక్షులలో జూడగలము. హంపీదృశ్యములు జూచిన యేమానవుని గుండెలు తరుగుకొనిపోవు?

'మన హృదయములు విశాలతనొంది సర్వమానవ ప్రేమవిలసితాలు కావలెనంటే కళాపూజకన్న ఇంకొటిలేదు. ఇంతమందిలో భద్రాచలము ఎంతమంది వెళ్లారు? భద్రాచలము వెళ్లుటే ఒక చక్కని యాత్ర. గోదావరిలో పడవలలో ఒక వారమురోజులు ప్రయాణము. ముందు ముందు మోటారు లాంచీలు వస్తాయి అనుకోండి. ఆ పాపికొండల్లో పడవమీద ప్రయాణం చేస్తూ తిప్పలమిద వండుకుంటూ, వెన్నెల్లో తిప్పలమీద పవళిస్తూ కొండలు, అడవులు, గోదావరీ నీలపులోతులు తన జీవితములోనికి ఆకర్షిస్తూ ప్రయాణము చెయ్యడము ఎంత ఆనందమో ఆలోచించండి.

'అజంతాలోయలో జలజల ప్రవహించే భోగీరానది ఒడ్డున నిలుచుండి, ఆ జలప్రవాహము పాడు పాటలు వింటూ గోడల్లా పైకెగసిఉన్న ఆ కొండల మధ్య కనబడే ఆకాశము చూస్తూ అర్ధచంద్రాకృతిగా ఉన్న ఆ విచిత్ర కందరముల గమనిస్తూ, సంధ్యారుణకాంతులు ఆకాశాన ప్రసరిస్తూ కొండ శిఖరాన్ని ఎరుపుచేస్తూంటే, ఆ దివ్యప్రపంచంలో పురాతన శిల్పి చెక్కిన విగ్రహాలకుమల్లే అలా నిలుచుండిపోయాము.

'వాతాపినగరములో పశ్చిమచాళుక్యుల శిల్పచమత్కృతి ఉన్నది. కన్హేరీగుహలు గ్రీకుల లేబ్రినులవలె ఉంటవి. కార్లేగుహలు అతి పురాతనమగు ఆంధ్ర బౌద్ధగుహలు. రెండువేల రెండువందల సంవత్సరాలక్రిత మా గుహలలో నిర్మించిన దారుఫలకములు నేటికినీ చెక్కు చెదరకుండా ఉన్నవి. నాసికలోని గుహలలో ఆంధ్రరాజుల శాసనములు చెక్కించినారు. ఔరంగాబాదు గుహలలోగూడ మంచి విగ్రహములు, చిత్రలేఖనము లున్నవి. నానాఘట్టములలో ఆంధ్రశాతవాహన ప్రభువుల శిల్పాలున్నవి.

'బీజపురములో బోలుగుంబాజ్ అనేది ప్రపంచములోనున్న పెద్ద గుమ్మటములలో నొకటి. ఆ గుమ్మటములో పైకెక్కి గుమ్మటమున కావల నీవల నిద్దరు మనుష్యులుండి

ఎంతకేక వేసినా వినపడదు. గుమ్మటము గోడపై పెదవి యొకరూ, చెవి యొకరూ ఆన్చి రహస్యములు, గుసగుసలు సల్పినచో గూడ స్పష్టముగా వినబడును.

'దౌలతాబాదుతోట అజేయము. తినుబండారములు చేరనీయక మాడ్చవలసినదే గాని మానవమాత్రు డా దుర్గమును శౌర్యముచే చేరలేడు. ధాన్యపు రాశివలె అయిదువందల అడుగుల ఎత్తున ఉన్న కొండను, వరికుప్పవలె చెక్కినారు. కొండచుట్టూ సమతలానికి నూరడుగుల లోతు కందకం, నూరడుగుల వెడల్పు ఉంటుంది. సమతలానికి పైన గోడలా చెక్కిన కొండభాగం ఎత్తు నూటఏభై అడుగులు. కొండంతా కోటగోడలు. కొండశిఖరంపై చిన్నకోట, కోటమధ్య రాజభవనం, భవనం శిఖరంమీద ఫిరంగి.

'త్ర్యంబకంలో గోదావరి పుట్టింది. కోట్లకొలది సంవత్సరాల యీడున్న ఆ కొండలు నాలుగువేలు, అయిదువేలు అడుగుల ఎత్తు, సగం ఎత్తువరకు కంకరా, అడవులూ ఆవరించిఉంటాయి. తక్కినభాగం అంతా నల్లటిరాయి. అల్లాంటి ఒక కొండ వెయ్యి, పదిహేనువందల అడుగులఎత్తు ఎక్కాము. ఆ పైన ఒక చిన్నగుహ, కోనేరున్నూ. కోనేటి ప్రక్కను ఒక గోముఖవిగ్రహం ఉన్నది. ఆ గోముఖంలోంచి చుక్కచుక్కలా గోదావరినది పడుతోంది. అసలు అక్కడ అన్నీ కొండలలోంచి ప్రవహించే జలప్రవాహాలే. అవి అన్నీ గోదావరి అన్న పేరుతో ఉన్న చిన్నయేటిలో కలుస్తాయి. అక్కడినుంచి ఇరు వదిఐదు మైళ్ళ దూరంలో ఉన్న నాసిక వచ్చేటప్పటికి గోదావరి రెండువందల అడుగుల వెడల్పున గొప్ప నదియైనది. ప్రతిష్ఠానంలో నాలుగువందల అడుగుల వెడల్పు, నిజామాబాదులో ఆరువందల అడుగుల వెడల్పు, భద్రాచలముదగ్గర మైలు, రాజమహేంద్రవరముకడ రెండుమైళ్ళు, ధవళేశ్వరముకడ నాలుగుమైళ్ళు, డెల్టాముఖమున ముప్పదిమైళ్ళు వెడల్పున్నది.'

పిమ్మట పండరీపురము, హైదరాబాదు, గోలుకొండ, ఒరంగల్లు మొదలగు ప్రదేశముల వింతలన్నియు కనులకు గట్టునట్లు పరమేశ్వరమూర్తి వర్ణించి చెప్పెను.

నారాయణరావు వివిధ దేశ ప్రజల యాచార వ్యవహారములు, వివిధ దేశములలో ఒంటలు, ప్రజల కట్టుబొట్టులు, వర్తకసరళి మొదలైన విషయముల గూర్చి యుపన్యాసము నిచ్చినాడు. ఉత్తరదేశ ప్రజలు సిక్కులు, కాశ్మీర దేశస్థులు, పంజాబీయులు, పఠానులు, సరిహద్దు పరగణాలవారు చాల బలమైనవారు. సంయుక్తపరగణాలవారు, మధ్యపరగణాలవారు, బిహారీయులు, రాజపుత్రులు, మహారాష్ట్రులు, ఆంధ్రులు రెండవరకమువారు. ఆఖరిరకము వంగము, అరవ, మళయాళములవారు. కన్నడులు రెండవరకమునకు, ఆఖరిరకమునకు మధ్య నుందురు.

అందమున మొదటివారు కాశ్మీరదేశ స్త్రీలు. మంగుళూరువారు, మైసూరు వైష్ణవులు తరువాత. తర్వాత మళయాళివారు, రాజపుత్రస్త్రీలు, కొంకణీయులు, గుజరాతీ, మహారాష్ట్ర. ఆంధ్ర, వంగ మొదలైన తక్కిన దేశముల వారు తర్వాత, దాక్షిణాత్య స్త్రీ లాఖరున వచ్చెదరు.

కట్టులలో ఆంధ్రస్త్రీల నేటి కట్టు చాల అందమైనది. తర్వాత మహారాష్ట్రపు కట్టు. అయ్యంగారికట్టు తర్వాత. కథైవారీలు, రాజపుత్రస్థానస్త్రీలు పరికిణీలు కట్టెదరు. సిక్కులు, కాశ్మీరదేశస్థ వనితామణులు లాగులు తొడుగుకొనెదరు. గుజరాతీ, ఉత్తరహిందూస్థానం, వంగదేశముల లలనలు చిన్నచీరలు కట్టెదరు. ఒక శాలువ పైన కప్పకొనెదరు. అందరికట్టుకన్న అసహ్యమగు కట్టు ఒరియా దేశ స్త్రీలు కట్టెదరు.

శుచిలో మలయాళీలు మొదట, ఆంధ్రులు రెండవవారు. తర్వాత తమిళ బ్రాహ్మణులు.

తర్వాత కన్నడులు. తర్వాత మహారాష్ట్రులను వంగదేశపువారిని చెప్పవలెను. రాజపుత్రస్థానీయులు, పంజాబు, కాశ్మీరదేశస్థులు నాలుగవవారుగ వచ్చెదరు. ఒరియా దేశపువారు ఆఖరువారు. మురికిగుడ్డల ధరించి, పసుపునూనె కారుచుందురు.

ఆంధ్రులు, కన్నడులు భోజనమైనవెనుకమాత్రం తమలపాకులు ఉపయోగించెదరు. తక్కినవారందరు కాలనియమరహితముగా పొగాకుతో నుపయోగించెదరు. పొగాకు మసాళాల రూపమున వాడుదురు. వంటలలో ఎక్కువ ఖరీదుగల భోజనము గుజరాతీ భోజనము. పంజాబీయులు తరువాత. ఔత్తరాహు లావెనుక వచ్చెదరు. వంగ, మహారాష్ట్ర, ఆంధ్ర, కన్నడ దేశముల వారిని తర్వాత చెప్పవలె. అరవదేశం, మళయాళదేశం వారు తర్వాత, ఒరియావా రాఖరున వచ్చెదరు. పిండివంటలలో దక్షిణాదివారు, గుజరాత్‌వారు, కన్నడులు మొదట. తర్వాత వంగదేశస్థులు, ఔత్తరాహులు. తర్వాత మళయాళీలు, తెలుగువారు. ఆఖరున ఒరియావారు. వంటకములలో ఆంధ్రులు ప్రథములు.

ఆచారము తెలుగువారి కెక్కువ. స్నానము చేయవలె, ఆరోజున ఆర వేసినబట్టి యుండవలెను. ఒకసారి మయిలపడిన మరల స్నానము చేయవలెను. మరల ఆరవేసినబట్ట కట్టవలెను. విడిచిన వస్త్రము మయిలపడును. తక్కిన అన్ని దేశములలో నిన్న ఆరవేసినబట్ట నేడు పనికివచ్చును. ఒకసారి స్నానము చేసి మడిబట్ట కట్టుకున్న యెడల మరల మరల మయిలపడుట యుండదు.

దాక్షిణాత్యులకు, మళయాళులకు, ఆంధ్రులకు, కన్నడులకు, ఔత్తరాహులకు దృష్టిదోషమున్నది. మహారాష్ట్ర, ఘూర్జర, కాశ్మీర దేశస్థులకు పంక్తిదోషముమాత్రమే.

ఆంధ్రులు, దాక్షిణాత్య, మళయాళ, మహారాష్ట్ర, కన్నడ, ఔత్తరాహ ఘూర్జర బ్రాహ్మణులు మాంసాదులు తినరు. వంగ, ఓడ్ర, కాశ్మీర, సారస్వత బ్రాహ్మణులు మత్స్యములు భక్షించెదరు. మాంసమును ఒక్కొక్కప్పుడు భక్షింతురు.

ఆయా విశేషము లుపన్యసించుట పూర్తి యగుటతోడనే యధ్యక్షులు, నారాయణరావు, పరమేశ్వరమూర్తి మొదలగువారు దేశయాత్రలకు బోయి, జ్ఞానము సముపార్జించి, ప్రజలకు తెలియజెప్పుట యత్యుత్కృష్టమగు కార్యమని వచించి సభ ముగించెను. అందరకు కృతజ్ఞతాపూర్వక నమస్కృతులు కార్యదర్శి సమర్పించినాడు.

౧౨
నారాయణరావు సాహసకృత్యములు

రాజేశ్వరరావు, సుబ్బయ్యశాస్త్రిగారి భార్యతో నెచటికేని పోయెనను వార్తయు, నమలాపురములో రాజారావుభార్యకు చాల జబ్బుగానున్నదను వార్తయు రెండు నొకేసారి నారాయణరావుకు గొత్తపేట చేరినవి. స్నేహితులందరు వెడలిపోయిరి. చుట్టము లందరు వెడలిపోయిరి. నారాయణరావు చెన్నపట్టణమున గాపురముపెట్టుటకు నిశ్చయించెను.

సుబ్బారాయుడుగారు కుమారునిమాట కడ్డముపెట్టరు. ఇరువురుపుత్రులు నింటికడనుండకుండ వెడలిపోవుట ఆయనకుగాని, జానకమ్మగారికిగాని యెంత మాత్ర మిష్టములేదు. అయినను దామాబాలుని యిష్టమునకు వ్యతిరేకము చెప్పలేక నిట్టూర్చి యూరకుండిరి. నారాయణరావు తన పెత్తల్లి కూతురు, చిన్న తనంలో భర్తనుకోల్పోయిన యొక నిర్భాగ్యవనితను దనతో జెన్నపట్టణమునకు దీసికొనిబోవ నిశ్చయించినాడు. ఆమె ఉండి గ్రామములో నున్నది. సూర్యకాంతముగూడ చెన్నపట్టణము వచ్చెదనన్నది.

సూర్యకాంతమున కే కారణముననో శారదా నారాయణరావుల సంసార ప్రవాహము పుట్టకమునుపే నశించినసంగతి గోచరించినది. ఆమె కన్నగారి యెడగల ప్రేమబలమే యామె కా సంగతి గోచరింపజేసినది.

కావున శారద కాశీసంతర్పణకై కొత్తపేట వచ్చినప్పు డామెతో యథాలాపముగా జెప్పిన ట్లన్నగారి యద్భుతచర్యలు కొన్ని చెప్పినది. రాజమహేంద్రవరములో గోదావరిలో నిరువురు కాలేజీ విద్యార్థు లీతకు వెళ్ళినారట. నారాయణరావు గజీతగాడు. ఆ పరిసరములనే ఆత డీదులాడుచుండెను. ఇంతలో కాలేజీ విద్యార్థులలో నొకరు ఈదలేక మునిగిపోవుచు నొక్క కేక వేసెనట. నారాయణరావా కేక విని రెండు బారులలో నచ్చటకు నీదుకొనిపోయి, మునిగి యాబాలుని పట్టి, పైకితేల్చి నిముషంలో నొడ్డునకు తెచ్చి చేర్చెనట. ఆబాలుని పొట్టనొక్కి నీరుసడల్చి, యూపిరియాడునట్లు వైద్యము సల్పి, చలి మంట వేయించి, యా బాలుని నెత్తుకొని, రెండునిముషములలో నిన్నీసుపేటలో వైద్యముచేయు నొక వైద్యునియింటికి గొనివచ్చెనట. ఆ బాలుడు బ్రతికినాడు.

వేరొక పర్యాయము చెన్నపట్టణములో నొక పిల్లవాడు, 'రైలు వచ్చుచున్నది పోవల'దని యందరు మందలించుచున్నను వినక పట్టాలు దాటు చుండ రైలువచ్చిపడినది. ఆ బాలుడు రైలు కింద పడిపోవువాడే కాని, ఆ చెంతనేయున్న నారాయణరా వొక్క అడుగున నురికి, ఆ బాలుని ఎత్తి యావలకు హనుమంతునివలె నొక్కగంతువేసెనట. లేనిచో నిద్దరును రైలుకింద పడి ముక్కలు ముక్కలయిపోయియుండువారే!

కొత్తపేటలో నొక నూతిలో ఒక యావు పడిపోయినదట. దాని నేవిధముగ దీసినను నడుము విరిగిపోవలసినదే, అది పోట్లావగుటవలన నెవ్వరు నూతిలో దిగుటకు సాహసించలేదు. నారాయణరావు చొరవచేసి దిగి, యడుగునుంచి తాళ్ళుపోనిచ్చి ముందుకాళ్ళదగ్గర వెనుక కాళ్లదగ్గర నడుముకు బగ్గములుకట్టి, పైకి తాళ్ళందిచ్చి యడుగునుండి సహాయము చేయుచు, ఆవును లాగివేసినాడట.

అన్నగారి సాహసకృత్యము లిట్టివెన్నియో శారదకు సూర్యకాంతము చెప్పినది.

'వదినా! మా అన్నయ్య పూర్వం మనంవినే కథల్లో ఉండే రాజకుమారుడివంటివాడు. ఎంతమందికి సహాయం చేశాడు! మా నాన్నగారికి ఉంది ఎంతో బలం. మా నాన్న పోలికే మా అన్న. ఒకమాటు గోదావరి పొంగి ఒక ఊరు కొట్టుకుపోతే అందులో ఒక ముసలమ్మమాత్రం ఒక గుడిసెలో చిక్కడింది. పడవలు లేవు. గుడిసె మునిగేటట్లు ఉంది. మా నాన్న ఈదుకు పోయి ఆ ముసలమ్మనిబట్టి, నాలుగుమైళ్ళ దిగువకు గట్టుకు చేర్చాడట.' ఆ రాత్రి తానును తన చిన్నక్కగారును గది నలంకరించినారు. శిల్పహృదయముకల నారాయణరావు చెల్లెళ్ళ మనిపించుకొన్నారు.

మనస్సులో గుబగుబమను భయముతో శారద యాడుబిడ్డలచే దల దువ్వించుకొని, తోటలోని పూవుల ముడిపించుకొన్నది. ఆ రాత్రి గదిలోకి బోవుట కామెకు గుండె దడదడమనుచునేయున్నది. కాని భర్తపై నంతరాంతరముల నెచ్చటనో కొంచెము కరుణ జనించినది. నారాయణరావు పదునొకండు గంటలకు వచ్చి పక్కపై పండుకొన్నాడు. శారదవచ్చి యక్కడున్న సోఫా నానుకుని నిలుచుండి భర్తను వాలుచూపులతో చూచినది. సూర్యకాంతము వర్ణించిన మహాభాగుడు, వీరోత్తముడు ఎదుట మంచముపై కరుణార్ద్రమూర్తియై వాలిపోవుట చూచి విచారముతో నా బాలిక కంపించినది. స్త్రీ పురుషసంపర్కము లేనిచో యేదైన కబురులు చెప్పుచు కూర్చుండిన సంతోషమగునేమో?

దేశయాత్రా విశేషముల నుపన్యసించు నా సభలో తనభర్త మహాప్రవాహము వరదలు కట్టించి, వాగ్ధార నామెను విచిత్రానందపూర్ణను జేసినది. భర్త స్నేహితుడగు పరమేశ్వరమూర్తిగారు ఎంత మధురముగ, గంభీరముగ మాట్లాడినారు! మనదేశమున నిన్ని వింతలుండునా? అవి ఎరింగి, అట్టి దివ్య ప్రదేశములకు బోపుటయు ఉత్తమ ప్రజ్ఞయే!

ఉపన్యసించునపుడు దివ్యమూర్తివలె, ఆయా కాలముల దేశమున చరించిన మహోత్తమ పురుషునివలె శారదకు నారాయణరావు దర్శన మిచ్చినట్లయింది.

ఆ సోఫాలో పడుకొని యాలోచించుకొనుచు నామె యట్లనే నిదుర కూరినది.

మరునాడు శారదయు, జమీందారుగారును, జమీందారిణియు, జమీందారుగారి యప్పగారును రాణ్మహేంద్రవరము వెడలిపోయిరి.

నారాయణరావు, రాజారావు భార్య పుట్టింటి గ్రామమగు రామచంద్రపురము బోయినాడు.

రాజారావునకు నిరువురు సంతానము. ఒక కొమరితయు, నొక కుమారుడును జనించినారు. రాజారావు భార్య సూరమ్మ మంచి సౌందర్యవతి. నెమ్మదిగల యువతి. అందరకు తలలోని నాలుక. అత్తమామల ప్రాణము, భర్తహృదయము సంపూర్ణముగ గుర్తెరిగి, అద్దానిని చూరగొనిన పతివ్రతా శిరోమణి.

రాజారా వమలాపురము నుండి రామచంద్రపురం వెళ్ళినాడు, నారాయణరావు రామచంద్రపురములో మిత్రుని గలిసినాడు.

సూరమ్మ నీళ్లాడిన తర్వాత రెండవరోజునుండి జ్వరము వచ్చుచున్నదట. మలేరియాకు, బాలింతజ్వరమునకు, రాజారావు ఇంజక్షను లిచ్చినాడు. చంటిపిల్లవాడు క్షేమముగ నున్నాడు. జ్వరము నూటఅయిదువరకు వచ్చుచుండుటచే రాజారావు తడిగుడ్డలు పొత్తికడుపుమీద వేయించెను. అత్తగారు వాతముచేయునేమో యని భయపడుచుండెను.

నాలుగురోజులలో జ్వరం నెమ్మదించినది. నెమ్మదించిన వెనుక రెండు రోజులుండి రాజారావు పథ్యము పెట్టించినాడు. నారాయణరావా ఆరు రోజులు మిత్రునిదగ్గరనే యుండి, అతనితో గ్రంథకాలక్షేపము చేయుచు, నాతనికి రెండవ ప్రాణమువలె నుండి తర్వాత కొత్తపేట వచ్చి చేరెను. పరమేశ్వరాదులు వెడలిపోయిరి.

కొత్తపేట వచ్చునప్పటికి హైదరాబాదునుండి రాజేశ్వరరావు వ్రాసిన యుత్తరము వచ్చినది.

‘నేనేమి చేసేది, నారాయణా! నాకూ మతిపోయింది. ప్రపంచంలో ప్రేమ లేదనుకున్నాను. స్త్రీ కీ, పురుషుడికీ ఒకరి దేహంమీద ఒకళ్ళకు కోర్కె కలగడమే ప్రేమ అనుకున్నా, ఇప్పుడు నా సంగతి చూస్తే నాకే ఆశ్చర్యం వేస్తూంది. నేను ఇదివరకు చక్కని బాలికలతో స్నేహంచేసి వారి మనస్సులు చూరగొన్నానుగాని, ఇదేమిటో నాకర్థం కాలేదురా.

‘అల్లా ఉంటూ ఉండగా, ఇక పుష్పశీలాదేవికి నేనంటే పిచ్చే! నిన్ను వదిలి ఒక్క నిముషం అన్నా ఉండలేను, నాకీ భర్త వద్దు’ అని మొదలు పెట్టింది. మొదట భర్తకావాలి, నేనూ కావాలి అన్నది. శ్రుతి మించి రాగాన్ని పడింది. ఇద్దరము ఇక విడిగా ఉండడం

పడలేదు. కాబట్టి బయలు దేరివచ్చి ఈ హైదరాబాదులో మమ్మెవరూ పట్టుకోలేని మేడలో ఉన్నాము. మేమే నిజమయిన భార్యాభర్తలము. నీ స్నేహము వదలుకోలేను. నా యీ భార్యనూ వదలుకోలేను. నీ సదభిప్రాయం నాకు ఉండాలి. నీ కొక్కడికే నా అడ్రసు ఇస్తున్నాను. నాకు అవసరం వచ్చినప్పుడు వేయి రూపాయలవరకు నువ్వు ధనం సప్లయి చేయవలసి ఉంటుంది.

'మా ఆనందం ఎవరికి కలుగుతుంది? నువ్వు నా మాట విను. శ్యామసుందరి నువ్వంటే ప్రాణం ఇస్తుంది. నువ్వు దేశాలు తిరిగినన్నాళ్లు నిన్ను గూర్చి నీ స్నేహితుల్ని ఎంత వాకబుచేసింది! ఇంక ఊరుకోకు.

'పుష్పశీలా, నేనూ కలలోగూడ ననుభవించని మహదానందంలో ఓల లాడుతున్నాము. నేను హైదరాబాదు వచ్చేటప్పుడు పదివేలరూపాయలు వసూలుచేసి తెచ్చుకున్నాను.

'రెండు, మూడు సంవత్సరాలు యీ ఆనందంలో మునిగి తన్మయుడనైతేనే గాని నాకు తృప్తిఅవుతుందని తోచదు. అంతవరకూ ఇంక యేమి తల పెట్టను. ఆవల! తృప్తి అప్పటికీ తీరదూ, యెంతకాలమో అంతే. 'ఆ సుబ్బయ్యశాస్త్రిని చూస్తే నాకు జాలి. అతను ఏంజేస్తాడు? అతన్ని పెంచిన సంఘాన్ని అనాలి. కాని, ఏదీ తెలియకుండా మా సమాజం చేరకూడదు. అది చాలా అపాయం.

'ఇదివరకు సుబ్బయ్యశాస్త్రిని దగ్గరకు రానిచ్చేది కాదు. నా కొరకే వాడికి పై పై మోజులు చూపి మురిపించింది. అందుకు నన్ను క్షమార్పణ అడిగింది.

'అహో నారాయణరావు! పుష్పశీల పువ్వుల కుప్పోయి. పుష్పాలలోని లాలిత్యమురా! నారాయణా! నన్ను నువ్వు అభినందించాలి. నేనంటే మీరందరూ ఉడుకుబోతుదనంగా ఉండాలి.

'పరమేశ్వరుడి జన్మం, ఒక పెద్ద రాజీనామాసుమా. వాడిహృదయమూ వాడి జన్మమూ సౌందర్యం కోసం తపస్సు చేస్తూన్నవి. భార్యవల్ల వాడి కవి లభ్యంకాలేదు. వాడివరసచూస్తే శ్యామసుందరి పెద్దచెల్లెలితో ప్రాణ స్నేహము చేస్తున్నట్లున్నాడు.'

'నే నెందుకు ఈలా రాస్తున్నాను? నాతోపాటు మీరందరూ ఈ మహోత్కృష్టమైన ప్రేమానందంలో మునిగిపోయి ప్రేమనిర్యాణం పొందాలి అని.'

ఇట్లు,
అభినవవంద్యుడయిన ప్రేమదక్షుడు,
రాజీ

ఈ ఉత్తరం రాజీ ఒడలు తెలిసియే వ్రాసినాడా? నిజమైన ప్రేమతత్వం ఏమిటి? అది మానవునకు అనుభూతమగుటయెట్లు? తనకు దన శారదయన్న పరమ ప్రణయ మనుకొన్నాడు. ఆమె తన ఉపాస్యదేవత అనుకొన్నాడు, కాని, నక్కకు ద్రాక్షపండ్లవలె, ఆమె తనకైనది. ప్రపంచము తనకు మిథ్యయైపోయినది. తన్ను దేశయాత్రకు బనిపిన దా బాలికావిముఖతయేనా? ఆ పరమ సౌందర్యరాశి భర్తహృదయము నిట్లెంత కాలము అంపపుగోత పెట్టునో? ఒక వేళ నామె తన్నెప్పటికిని ప్రేమించనిచో తానేమి చేయవలయును?

సంఘముయొక్క దౌర్భాగ్యస్థితి యట్లున్నది. వివాహములు నిజముగా ఇనుపముళ్ళ బోనులా? ఒకసారి వివాహమయినచో, నది రద్దగుటకు వీలులేదు. పుష్పశీల ఏమిచేయవలెను? మనదేశమున వివాహములన్నియు పుష్పశీలా వివాహములేనా?

౧౩
మదరాసు కాపురము

నారాయణరావు చెన్నపట్టణమున గాపురము పెట్టినాడు. మైలాపురిలో మంచియిల్లద్దెకు దీసికొని, రెండువేల రూప్యములుపెట్టి న్యాయశాస్త్ర గ్రంథములు, హైకోర్టుతీర్పులు నాతడు కొనెను. ఇల్లంతయు బరమేశ్వరుని సహాయముతో నలంకరించెను. మామగారి యింటిలో నుండనని యాతడు దెలిపినాడు. సూర్యకాంతమును, పెత్తల్లి కుమార్తె బంగారమ్మను గూడ గొనివచ్చెను.

అడ్వకేటు నారాయణరావుగారు న్యాయవాదవృత్తి ప్రారంభించినారు. ఇంటిలో ముందు నారాయణుని కార్యాలయము. నాలుగు బీరువాలలో న్యాయశాస్త్ర గ్రంథము లున్నవి. ఖద్దరు రంగుదుప్పట్లు పరచిన బల్లలు, సోఫాలు, కుర్చీలు నున్నవి. మందిరమంతయు నీలధూసర వర్ణములచే నలంకరింపబడినది.

ప్రక్క గుమాస్తాగదియు, వెనుక రహస్యాలోచనపు గదియు నలంకరించినారు. ఆ వెనుక ఆడవారుండు స్థలమున్నది. దాని వెనుక విడిగా వంటయిల్లున్నది. వంటయింటిలోనికి బోవు మార్గమునకు, బైన గప్పును అమర్చినారు. నారాయణరావు న్యాయవాదవృత్తియందలి మెలకువలు నేర్చుకొనుటకు, వృత్తియందనుభవము సముపార్జించుటకు, నొక పెద్దవకీలుకడ జేరినాడు. నారాయణరావు బి. ఎల్. పరీక్షలో మొదటివాడుగా కృతార్థుడైన సంగతియు, తక్కిన పరీక్షలన్నిట మొదటివాడుగా జయమందిన సంగతియు నా వకీలునకు దెలియును. రెండుమూడు అప్పీళ్ళలో బనిచేయుమని చెప్పినప్పుడు నారాయణరావు జయరామయ్యగారి హృదయమున నద్భుతము నిండునట్లు పనిచేసి, యాయన చేతికిచ్చినాడు. ఒక అప్పీలులో నాయనగూడ తెలిసికొనజాలని యొక విషయము పట్టుకొని అప్పీలు వాదమునకు బలము చేకూర్చినాడట. జయరామయ్య, ముందు ముందీ బాలుడు హైకోర్టులో ముఖ్య న్యాయవాదియై, న్యాయ సింహాసనముకూడ నధిష్ఠింపగలడని యనుకొనెను.

అన్నగారు శ్రీరామమూర్తి పంపిన చిన్న అప్పీళ్ళు రెండు తయారుచేసి దాఖలు చేసినాడు. న్యాయవాద ప్రముఖుడగు జయరామయ్యగారు తాను దగ్గర నుండి నారాయణరావు నొక చిన్న అప్పీలు వాదించుమన్నారు. నారాయణరావు బాగుగా నా యప్పీలు వాదించుటకు సిద్ధపడియే వచ్చియుండెను.

న్యాయమూర్తియు నీ బాలకుని వాదన యెట్లుండునో చూచెదముగాకయని, నారాయణరావునకు ననుమతి యొసంగెను. పదినిముషములలో నాచిన్న యప్పీలు, విషయనిర్ధారణచేసి. పరస్పర సంబంధము చూపి, విషయములను బలపరచు న్యాయశాస్త్రమున బూర్వపు దీర్పులనుజూపి, వాదము ముగించి కూర్చుండెను. న్యాయప్రభువును ఆ బాలుని చమత్కృతికి, భాషకు, విషయ నిర్ధారణప్రజ్ఞకు జాల మెచ్చుకొన్నాడు. ఇతర న్యాయవాదులయినచో నరగంటలో దేల్పజాలని యాయప్పీలు పదినిముషములలో ముగించినాడు. ఎదిరి వకీలు వాదమునకు నలుబదియయిదు నిముషములు పట్టినది. ఆతని వాదన పేలవమై తోచెను. నారాయణరావు గొంతుక గంభీరమయినది. దానికి తగినట్లు దివ్యోత్తమాంగుడు. ఎక్కడెక్కడి విషయములు

కరతలామలకముగ గ్రహించగల మహామేధావి. ఎదిరి న్యాయవాది చేసిన అడ్డువాదనను అయిదు నిముషములలో ఖండించి కూర్చున్నాడు నారాయణరావు.

తత్‌క్షణమే న్యాయమూర్తి నారాయణరావు పక్షమున దీర్పు జెప్పినాడు. గురువుగారగు జయరామయ్యయు నితర న్యాయవాదులును నారాయణరావు నభినందించిరి.

న్యాయశాస్త్రములో, న్యాయవాదములో నెంత మునుగుదమన్నను మనస్సేమియు నెక్కుటలేదు. తాను బాగుగా పని చేయుచున్నట్లు కనబడుటకుగాను జయరామయ్యగారి యింటికడ నపరిమితావేశముతో, మంచినిపుణతతో, ఓర్పుతో బనిచేయును. ఇంటికడ కలతనొందుచు, కలలలో మునిగిపోవును.

కలలు! కలలు! ఏ కలగన్న నాకలలో నెచ్చటనో శారద ప్రత్యక్షమగును. ఇదివరకు బండుకొనుట తడవుగ నిద్రపట్టునది నారాయణునకు. ఇపుడు గంటయు, రెండుగంటలు స్వప్నప్రపంచములో నివసింపవలసివచ్చు చుండెను, నాతిగల బ్రహ్మచర్యము! శారదకు బ్రేమకుదురునో కుదురదో? కుదురనిచో దన కర్తవ్యమేమి? ఒకవేళ భార్య అన్యాసక్త కాదుగదా! నిజమైన కర్మయోగి పవిత్రకాలమున నొక పుత్రుని, పుత్రికను గనవలెను. భార్యనైనను మోహమున దాకగూడదు. అది మహాదోషము. తా నా విధమున నుండలేనప్పుడు దోషమగునుకదా! తన భార్యయే అట్టిదోష మాచరించుచుండ దాను సహించవలసినదేనా?

ఇది చిన్నతనములో వివాహము చేయుటవలన నైన దోషమా? వైద్యశాస్త్రము బాలికకు పదునారవయేట బెండ్లి యుక్తమేనన్నది. కొందరి కా యీడున హృదయము వికసించకపోవచ్చును. ఇంతకు భార్య పరపురుషు నాశించినచో దన కర్తవ్యమేమి? తన హృదయాంతరమున నామె యట్లాశించుట దోషమనియే తోచుచున్నది. ఇతరులు దోషమాచరించుచుండ వారి నా మార్గమునుండి త్రిప్పగలవా రుపేక్షింపరాదు. ఒకరిమోక్షమున కొకరు కారణమగుట కలదేని, యొక్క గురువునకుమాత్రమే యట్టిపని శక్యమగును. తాను శారదకు గురువా? ధర్మశాస్త్రము భర్తకు గురుస్థానము చెప్పినది. నిజమే. తన భార్యయెడల దనకట్టి యర్హతకలదా?

తెలిసీ తెలియని ధర్మవిచార మొకప్రక్క, భార్యపై తనకున్న పూర్ణ కాంక్ష యొకప్రక్క 'నాతో కాపురం చేయడం ఆమెకు కష్టం, కంటకం, దుర్భరం. ఆమె నాయింటిలోనుండ నా ప్రేమ విజృంభించిపోతూవుంటే నా మనస్సుతో యుద్ధంచేస్తూ, ఆ బాలికను ముట్టకుండ అసిధారావ్రతం చేయడం మరీ కష్టము.' ఏది ఎట్లయినను శారద తనయింటికి రాకుండుట యుత్తమము. అట్లయినచో నా బాలికను రక్షింపవలసిన తన కర్తవ్యము నెరవేర్చుకొనుట యెట్లు? తనతో కాపురము చేయుచుండ గ్రమముగా భార్యకు దానన్న ప్రేమ కలుగదా?

వనిత యొక పురుషునిగాని, పురుషుడొక వనితను గాని ఒకసారి ప్రేమించినచో జన్మాంత మయ్యది యట్లుండవలసినదేకదా? అట్టిచో పర పురుషానురక్తయగు శారద కా ప్రేమ నశించి తనపై మరల ప్రేమ కలుగుట యెట్లు? ఒకవేళ తనపట్ల అయిష్టమే కాని, యితరునిపై నామెకు ప్రేమ లేదేమో? అట్లగుచో నా బాలికను ప్రసన్న నొనర్చుట తగునుగాని, నీ దారి నీవు చూచికొమ్మని వదలి వేయుట తనకును నామెకును హానియే. కావున తన కడ కామెను తీసికొనివచ్చుటయే కర్తవ్యమగును.

ఈ యాలోచనలతో నిదురపట్టక విద్యుద్దీపము వెలిగించుకొని, పుస్తక మేదియో చేతనుంచుకొని, ఎదుటిగోడపై పరమేశ్వరుడు చిత్రించిన యొక చిత్రఫలకముపై జూపులు

నిలిపి, అన్యమనస్కుడైయున్న యన్న గారికడకు, సూర్యకాంతమువచ్చి, 'అన్నయ్యా! ఏమిటి ఆలోచిస్తున్నావు? నాకొక్క దానికీ ఏమి తోచడంలేదు. అవును గాని, అన్నా! దబ్బున వదిన్ని తీసుకురావూ? ఇద్దరం ఎంతో స్నేహంగా ఉంటాం, అన్నయ్యా' అన్నది. ఆ ముద్దరాలి పలుకు శ్రుతిగా గ్రహించి నారాయణరావు చెల్లెలిని దగ్గరకు దీసికొని, యామె కన్నుల కనుంగొని 'సూరీడూ! నీ కడుపంతా ప్రేమమ్మాతల్లీ! రామచంద్రరా వదృష్టవంతుడు' అనెను. సూర్యకాంతం నవ్వుకొనుచు ప్రక్కగ నిలుచున్నది. ఇంతలో నామె నగుమోమునందు విచార మేఘములవరించినవి. కళ్ళనీరు తిరిగినది.

'తల్లీ! రామచంద్రరా వెప్పటికప్పుడు జాబు రాస్తున్నాడా లేదా? మా అందరికన్నా విద్యావంతుడూ, ప్రయోజకుడూ అయి ఇంకో ఆరు నెలలకివచ్చి వాలుతాడమ్మా!' అని ముద్దుచెల్లెలి నూరార్చెను.

నారాయణుడు సూర్యకాంతమున కెప్పటికప్పుడు రామచంద్రుని కబుర్లు చెప్పుచు, నాతని కామెచే నుత్తరములు వ్రాయించుచు, నామెకు ధైర్యము గొలుపుచుండెను. నారాయణరావు కోర్కెవలన రామచంద్రరావు తన ఛాయాచిత్రములు, నాలుగునెలల కొకటి తీయించుకొని పంపుచుండెను. సూరీడు అనేకవిధముల దీయించుకొన్న తన ఛాయాచిత్రము లాతనికి బంపుచుండును.

పాశ్చాత్యవిద్యాపండితుడై, పడమటిదేశములనుండి వచ్చినవాని భార్య పాశ్చాత్య విద్యలలో బ్రవీణురాలు కావలయునని, కొత్తపేటలో నొకగురువు నేర్పరచి సూరీడుకు విద్య చెప్పించినాడు చిన్నన్నగారు. తాను వెళ్ళినప్పుడెల్ల నామెకు నాంగ్లభాష గరపుచుండెను. ఆమె యేగ్రంథమైన ధారాళముగ చదువ నేర్చుకొన్నది. రామచంద్రరావు వచ్చునప్పటికి సూర్యకాంతమును బ్రవేశపరీక్షకు బంపవలెనని నారాయణరావు యత్నించుచుండెను.

శారదకన్న సూరీ డొకయేడు చిన్న. రామచంద్రరావు నారాయణరావు కన్న చిన్న. సూరీడు యౌవనవతియైన నాటినుండియు నేపుగా నెదుగుచున్నది. సూరీడు మోము రాజపుత్రబాలిక మోమువలె నుండును. ఆమెకళ్ళు కాటుక కండ్లు. గంభీరమైన మోము. మోమున రేఖలు లాలిత్యమును, అంతకన్న స్ఫుటత్వమును, సుందరతను దాల్చినవి. సూరీడు మోము చూచినచో రాజ్యము లేలగల వీరాంగనలు స్ఫురించెదరు. రుద్రమదేవి, విమల, అహల్య, ఝాన్సీ లక్ష్మీబాయి, చాందిబీబీ మొదలగు వా రామె వదనాన బ్రత్యక్షమయ్యెదరు, అయినను ఆమె హృదయము, జీవితము ప్రేమచే, గరుణచే నిండి మథిత నవనీత స్నిగ్ధమై సౌందర్యార్ద్రమై యుండును.

ఆమె పెండ్లినాటినుండి రామచంద్రరావును దన జీవితమునకు కథానాయకుని జేసికొన్నది. ఆమె ప్రేమించినను, గోపించినను, సంతోషించినను, అసహ్యపడినను అన్నియు గంభీరప్రవాహమువలె ప్రవహించవలసినదే! ఆమె భావములకు లఘుత్వము లేదు. చిన్నతనమునుండి తండ్రి చెప్పిన కథలన్నియు, నామె మనమున హత్తుకొనిపోయినవి. శ్రీమతి భండారు అచ్చమాంబ గారు రచించిన 'అబలా సచ్చరిత్రరత్నమాల' చదువుకొన్నది. 'భారతీ', 'శారద' మొదలగు మాసపత్రికలు చదువునది. ఆమె లేతభావములలో, బాలికాహృదయములో, రూపొందిన యాశయములలో యన్న గారియందువలె దేశసేవాసక్తి తలయెత్తినది. భరతమాత పే రామెకు పుల్కరింపు. ప్రతిసభకు తల్లిదండ్రుల యనుమతిని తల్లితోడనో, యక్కగారితోడనో జనునది.

ఇంటిదగ్గర చేయనవసరము లేకున్నను పై పనుల నన్నింటిని నిముషమున జేయుచు,

పుస్తకముల జదువుకొనుట యామె కిష్టము. కష్టపడి వీణ వాయించుట నేర్చుకొన్నది. దానియందు తగుమాత్రము కౌశల్య మేర్పడినది. అయినను పట్టుదలతో నేర్చుకొన్నది. ఇరువది త్యాగరాయకృతులు, హిందీ పాటలు, నండూరి సుబ్బారావు గారి యెంకిపాటలు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పాటలు, అభినవాంధ్రకవిత్వ జనకుడగు గురజాడ అప్పారాయ విరచితములగు పాటలు, విశ్వనాథ సత్యనారాయణ మహాకవి పాటలు నేర్చుకొన్నది. గొంతుకలో సమమైన ఒదుగు, అత్యంతమాధుర్యమును కలదు. రెండును ఏకమై అపారమై, తేనె వాకలు కట్టును.

తన జీవితము భర్తృప్రీతిపాత్రముగ మార్చుకొనవలయుననియు, నతని హృదయ మానందమున నోలలాడించవలయుననియు దనకే తెలియని దీక్ష బూనినది. బొమ్మలు వేయుట పరమేశ్వరునికడ నేర్చుకొన్నది. పార్శీబాలిక బోలి, గుజరాతీ వనితవలె, మహారాష్ట్ర యువతివలె నలంకరించుకొనుట నేర్చుకున్నది.

అన్నగారితో దనకు పియానోవాద్యము నేర్పించమని యన్నది. అమెరికానుండి వచ్చు భర్తకు కొన్ని ఇంగ్లీషుపాటలు పాడి వినిపించినచో, నెంతయో యానంద మొనగూడునని సిగ్గున నామె యాలోచించుకొన్నది.

౧౪

రామచంద్రుని విద్యార్థిదశ

హార్వర్డు విశ్వవిద్యాలయములో భారతీయ విద్యార్థు లొక వసతిగృహ మేర్పరచుకున్నారు. అందు రామచంద్రరావును జేరినాడు. అమెరికాలో నిరుపేద, హిందూదేశమున భాగ్యవంతుడు. భారతీయు లమెరికాలో జదువవలెనన్న మిక్కిలి భాగ్యవంతులు కావలెను. కాబట్టి భారతీయ విద్యార్థులు తమ దేశపు సన్యాసులవలె మితాహారమాత్రతృప్తులై అమెరికాలో జీవించుచుందురు. వారందరిలో రామచంద్రరావెక్కువ ధనము వెచ్చించుచుండెను.

అమెరికాలో భారతీయులను హీనముగ జూచువా రున్నారు. విచిత్ర జంతువులుగ జూచువారున్నారు. ఆధ్యాత్మికదృష్టి ప్రపంచమునకు నేర్పునట్టి శక్తిగల దివ్యదేశమునకు జెందిన యుత్తమపురుషులుగ జూచువారున్నారు.

రామచంద్రరావు సెలవుదినములలో నమెరికా దేశమంతయు జూచుటకు బోవువాడు. అచటి విహారవనములు, నదీపాతములు, లోయలు జూచివచ్చెను. పెక్కు కర్మాగారములు, పరిశ్రమ మహాప్రపంచములు సంచారమొనర్చెను.

ఎఫ్. ఏ. ఇంగ్లీషులో కృతార్థుడు గాకున్నను, లెక్కలలో ఆంధ్రవిశ్వవిద్యాలయమునందు ప్రథముడుగ గడతేరినాడు. అమెరికా వచ్చినవెనుక హార్వర్డు విశ్వవిద్యాలయమునందు లెక్కలలో నాతని మేధాసంపన్నతకు మెచ్చి ఇంగ్లీషు భాషాపరీక్షకు జదువవచ్చునని బ్రత్యేకముగ ననుమతి యొసంగిరి. ఇంగ్లీషుభాషలో నెగ్గుట కారునెలలు పట్టినది. రామచంద్రరావు ఈలోన బి. ఎస్ సి ఆనర్సులో జేరి చదువుటకు అధికారులు ప్రత్యేకానుమతి నొసంగిరి. లెక్కలలో, పదార్థవిజ్ఞానశాస్త్రములో నమెరికా విద్యార్థి ప్రపంచమున నాతనికి సమానులు డి. ఎస్‌సి. క్లాసులోకూడ లేరట.

రామచంద్రరావువచ్చి రెండేండ్లపై నాలుగునెలలు అయినది. రెండేళ్లలో నా యువకుడు లెక్కలలోజూపిన తెలివితేటలు మిక్కుటము. అతనికి దెలిసిన కొన్ని లెక్కలవిజ్ఞానము

ప్రపంచములో గొందరికిమాత్రమే తెలియును. ఈతడు జవాబుగోరి ప్రచురించిన గణిత ప్రశ్నలకు జవాబిచ్చువారు కనబడక పోయినారు. గణితాచార్యు డాత డన్న మంచి గౌరవము చేయును. ప్రేమమున నాతని ముంచెత్తును. అతనికి ఎం. ఎస్‌సి. బిరుదము నిచ్చుట కింకను ఆరు నెలలు వ్యవధియున్నది.

ఈ రెండేళ్ళలో రామచంద్రరావు, రౌనాల్డుసన్ దంపతులను దర్శించుటకు స్నేహితురాలగు లియొనారాతోగలిసి వెళ్ళుచుండును. రామచంద్రరావును లియొనారాయు హార్వర్డు విశ్వవిద్యాలయములోనే చదువుచుండుటచే వారమున కొకసారియైన గలసికొనుచుందురు. లియొనారా రామచంద్రరావుల స్నేహము నానాటికి వృద్ధినందినది.

లియొనారాకన్యక నెమ్మదిగా రామచంద్రునిపై సోదరునికన్న నెక్కువ ప్రేమము జూప నారంభించెను. అది పురుషుని వాంఛించు ప్రేమయని యామె గ్రహింపలేకపోయినది. రామచంద్రరావెన్ని విశేషములనో జెప్పువాడు. భరతదేశమును బొగడువాడు. వేదాంత సారమునుగూర్చి యేదియో మాట్లాడువాడు. ఆమె తన స్నేహితురాండ్రను గొనివచ్చి రామచంద్రరావునకు వారితో బరిచయము కలుగజేయుచుండునది. రామచంద్రరావునకు నాట్యము నేర్పుచు నాతనితో నత్యంత స్నేహమై వదలకుండునది.

'రామ్, మా అమెరికను బాలకులవలె, మీ భారతీయు లాటలాడ రేమిటి?'

'నారా! మీరు సంపూర్ణస్వతంత్రులు. అడుగడుగున మీ రగౌరవము పొంద నవసరములేదు. మీస్వాతంత్ర్యము, మీ అభివృద్ధి, మీకున్న గౌరవము ప్రపంచముననే దేశమున కున్నది? స్వతంత్రములేనప్పు డమెరికాకున్న స్థితి యేమిటి? నేటికి నాటికి హస్తిమశకాంతరము భేదమున్నది. నేడు కెనడావలె నుండవలసిన దేశము, దేశము లన్నిటికన్న మిన్నయై, ప్రపంచమునకు షాహుకారై, యుద్ధపరిశ్రమలో ముందంజయై విజృంభించి, ముఖ్యమైన పరిశ్రమలకు వ్యవసాయములకు ప్రథమదేశమై యొప్పారుచున్నది. మీవలె మాకు ఇట్టి సంతోషకారణము లేదు. ఇది ఒకటి. రెండు, మా దేశములో ప్రబలిన మెట్ట వేదాంతము మమ్ము పురుషకారహీనులైనజడులను చేసివైచినది. మేము వెనుకటి వారమూ కాము, ఈ కాలములోనూ లేము.'

'నువ్వు మాట్లాడినదంతా అధీరత సూచిస్తూ ఉన్నది. ఆంగ్లేయులు మీ దేశము ఆక్రమించడం ఉత్తమం అని నా అభిప్రాయం.'

'అది నిజమే చెల్లీ! ఏ మహాచక్రవర్తి కాలంలోనో దేశం అంతా ఏకచ్ఛత్రాధిపత్యం క్రింద వచ్చినా, ఆ రాజు పోవడంతో, మళ్ళీ దేశం ముక్క లయ్యేది. అంటే దేశంలో సంయోగశక్తి కన్న వియోగశక్తి ఎక్కువ ఆవరించి యుండు స్థితికి వచ్చింది. కాని బలవంతులగు ఆంగ్లేయులు మా దేశం ఆక్రమించుకొనడంచే అన్ని ఉపజాతులవారము, అందరము ఒకటిఅయ్యాము, ఇంకా కావాలి. అంతవరకూ ఆంగ్లదేశస్థులు మా దేశంవదలి వెళ్ళరు.'
'అవును, నువ్వు చెప్పింది నిజమే అన్నా! చూశావూ! అమెరికా మొదట చిన్నచిన్న రాజ్యాలుగా ఉంది; ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు వారిలో వారు యుద్ధం చేసుకున్నారు చాలాకాలం. అలాంటిది అమెరికా ఇంగ్లండుతో విరోధించి తిరగబడినప్పుడు అందరూ ఏకమయ్యారు. కెనడా ఇంగ్లీషువారి కింద ఏకమయింది. ఫ్రెంచివారూ ఇంగ్లీషువారూ ఏకమయ్యారు. అల్లాగే దక్షిణఆఫ్రికాలో ఆంగ్లేయులకూ డచ్చివారికీ సంయోగం కలిగింది.'

లియోనారా రామచంద్రరావుల స్నేహము నానాట గాఢమాయెను. లియొనారాబాల వచ్చి సోదరప్రేమ వెల్లిగొన రామచంద్రుని యొడిలో గూర్చుండి యాతనికి ముద్దులిచ్చును.

మొదట నామె యట్లుచేయుట రామచంద్రునికి చాల సిగ్గజనింపజేసెడిది. కాని యందు కలవాటుబడినాడు. రానురాను రామచంద్రునకు లియొనారా తనచెంత నున్నంతసేపును పరమ హర్షముగ నుండెను. ఆమె సంభాషణ యాతని మనఃపథము వికసింపజేసెను. నానాదేశముల వార్తలు వారు చర్చించుకొనువారు. ఒక్కొక్కప్పు డామె తండ్రియు వారితో జేరువాడు.

రామచంద్ర రా వమెరికా వచ్చిన కొన్ని నెలలవరకు లియొనారాకుగాని, యామె తలిదండ్రులకుగాని, తనకు వివాహమైనదని చెప్పుటకు సందేహించుచుండెను. తర్వాత నొకనాడు తన కంతకుముందే మూడేళ్ల క్రింద వివాహమైన దనియు, తన భార్య ఛాయాచిత్రము తన బావమరది యగు నారాయణరావు పంపినాడనియు దెల్పెను. వారంద రాశ్చర్యపూరితులైరి.

అప్పుడు వారందరు సూర్యకాంతము చిత్రము చూచినారు. నారాయణరావు మంచి ఛాయాచిత్రకారునిచే దీయించి పంపిన ఆ చిత్రఫలకములో సూర్యకాంతము చక్కని భంగిమములో ప్రత్యక్షమైయున్నది. రౌనాల్డుసన్ రామచంద్రుని చూచి ‘రామచంద్ర! మిస్ మేయో చెప్పినట్లు అతిబాల్య వివాహములు మీలో నున్నవన్నమాట!’ అని యనెను.

రామ: ఆ! ఉన్నవి. మేయో చెప్పినవి ఇంకా చాలా నిజమైనవి ఉన్నవి.

రామచంద్రునికి తన దేశము నెవరైన కొంచెము నిరసించినట్లు తోచినచో జివ్వున కోపము, విషాదము సంభవించును. పరదేశమున నుండుటచే వానిని జంపుకొని మాట్లాడును. అప్పు డాతని డెంతయు విచారమునబడితప్తుడైపోవును.

రౌనాల్డుసన్: మూడునెలల బాలలకు, మూడు నెలల బాలురక వివాహములు జరుగుచున్నమాట నిజమేనా?

రామ: అవును. అక్కడక్కడ కొన్ని అలాంటివి జరుగుచుండును, కాని చాల సకృతు.

రౌనా: అది చాలా విచారకరమైనది కాదూ? రామ: మీ దేశంలో అంతకంటే విచారకరమైనవి జరగడం లేదంటారా?

రౌనా: అనను. కాని చూడు, మా ఉద్దేశంలో ప్రపంచానికి నాగరికత నేర్పింది భారతదేశము. అటువంటి దేశము నేడిట్లు అధోగతిపాలైంది అంటే మా కెంత విచారంగా ఉంటుందో ఆలోచించు.

రామ: నిజమే, హీనస్థితిలో మానవుడికి అన్నీ దుర్బుద్ధులు పుట్టుతూ ఉంటాయి. కాని ఈ నాటికీ మా వివాహములు మంచివా, మీ వివాహములు మంచివా యన్న సంగతి నిర్ధారణ కాలేదు. జడ్జి లిండ్‌సేగారు వ్రాసిన వ్రాతల్ని చూశారు గాదా?

రౌనా: అతడూ మేయోవంటివాడే!

రామ: గాంధీమహాత్ముడు చెప్పినట్లు ఇద్దరూ పాయికానా పనిచేసినారు అనుకోండి. అది అవసరమే కాని లిండ్‌సే వ్రాతయంతయు యధార్థ కథనమైనను, అతడు తేల్చిన పర్యవసానంమాత్రం తప్పు అయిఉండవచ్చును. మేయో వ్రాసిన వ్రాతలు ఒకటి రెండు అంశాలు తప్ప తక్కినవన్నీ శుద్ధ అసత్యాలు. నీచమైన భావాలతో కూడివున్న ఆ చెడువ్రాత మా దేశానికి విరోధులు వ్రాయించారు ఆమెచేత.

లియొనారా యీ సంభాషణ యేమియు వినుటలేదు. ఆమె రామచంద్రుని చుట్టూ కల్పించుకున్న కథ కొంతవరకు కూలినది. ఎందుకు దానిట్లు మనస్సున కుంగిపోవుచున్నదో యామెకు తెలియదు. ఈ హైందవ యువకునకు, దనకు సంబంధమేమి? దేశము కాని దేశము విద్యకై వచ్చినాడు. తాను, తన కుటుంబము ఆ బాలుని చేరదీసినారు. సద్గుణములు కలవాడు, ఉత్తమ భారతీయ కుటుంబమునకు జెందినవాడు అని కదా?

అప్పుడా బాలికకు దా నీ బ్రాహ్మణ యువకుని ప్రేమించుచున్నానా యని లీలగా ననుమానము తగిలినది. లోన నణగియున్న రహస్య భావములన్నియు పైకిదేలి, యామె మనోనేత్రమునకు గోచరించినవి. ఈ యువకునకు వివాహము కాకయుండినచో, దా నాతని వివాహమాడి, యాతనితో భారతదేశమునకు బోయి, ఆ దేశమునకు ప్రేమనిధానపు కోడలై, యా దివ్యభూమిలో పెరుగుచు, ఆ మాత పరమపవిత్ర రహస్యాలలో భాగము పంచుకొనగోరినది. ఆ బాలికయు నా దేశమున సౌందర్యవతియే. పరిపూర్ణయౌవన, పరిమళార్ద్రమధురగాత్రి. ఏది యెట్లయినను రామచంద్రరావు తనవాడు. ఆ బాలకుని ప్రేమ యెట్లుండునో? భారతీయుల ప్రేమ యుద్వేగమయినదట. అతివిచిత్రమైనదని స్నేహితురాండ్రనుకొను మాటల యర్థము తెలియలేదు. తనచుట్టు జుమ్మని తేనెటీగల రీతి దిరుగు నమెరికను యువకులంద రొకవిధముగనే కనుపింతురు. రామచంద్రుడు తనయెడ సంచరించు విధమే వేరు.

వారందరు తనతో నాటపాటలనుగూర్చి ఎక్కువగను, శాస్త్రములను గూర్చి తక్కువగను ప్రసంగింతురు. వారు పరదోషాన్వేషణపరులు, కవిత్వ చిత్రలేఖనములను గూర్చి వారు మాటలాడునపుడు బేలవముగానుండును. రామచంద్రుడు మాటలాడినపు డెంత సాధారణవిషయమైనను ఏదో యద్భుతమగు లోతులు కలిగియుండును. ఏదో విచిత్రపుదృక్పథము నాతడు చూపును. ఇది యంతయు నా బాలకునిపై దనకుగల ప్రేమప్రభావమా? లేక భారతీయులలో నది సహజమా? తన శీలము చెడకుండ నీ బాలుని వలచి, వలపించి, ప్రేమ ప్రవాహ రహస్యములు గ్రహించవలయునని లియొనారా తలంచెను. రామచంద్రుని ముఖము దీక్షగా గమనించుచు నట్లనే యాలోచనానిమగ్న యగుచుండును.

రౌనా సతి: రామచంద్రా! మా దేశస్థులు హిందూదేశం అంటే పులకరింపులు పొందుతారు. ఇంగ్లీషువారి చేతుల్లోంచి మీరు తప్పించుకు వెళ్ళకూడదు అని అనుకుంటారు. కొందరికి హిందూదేశం పాడైపోతుందని భయం. కొందరికి ఇంగ్లీషువారికి నష్టం వస్తుందని భయం. చాలామంది అమెరికనులకు హిందూదేశము స్వతంత్రత సముపార్జించుకోవాలనిన్నీ, ఇప్పుడు గాంధీమహాత్ముడు మొదలిడిన యుద్యమం క్రైస్తవధర్మయుతమైనదనిన్నీ, ఆంగ్లహృదయమును జూరగొని వారికి తమ చర్యలు తప్పని తోపింపజేసి, ఆంగ్ల సామ్రాజ్యములోనో, వెలుపలనో వారితో స్నేహముగా ఉండడం ఉత్తమమని అనుకుంటున్నారు. గాంధిగారి బోధలే యీ మార్పుకు కారణం.

రౌనా: ప్రియా! ఎంత చక్కగా విపులపరచి చెప్పినావు! మా అందరి ఉద్దేశం అదే. రామచందర్! గాంధీగారి మార్గమే ఉత్తమమైనది. ఆంగ్ల పరిపాలకుల నేమాత్రము ద్వేషించక వారి ప్రాణమే మనప్రాణ మనుకొని వారి హృదయము మార్చుటకు తలచిననాడే మీరు నెగ్గిపోయెదరు.

౧౨౪

'గురువు వెదుక్కుంటూ వస్తాడు'

నారాయణరావుకును, శ్యామసుందరీదేవికిని రానురాను స్నేహము గాఢమైనది. వీలయినప్పుడెల్ల నాత డా బాలిక గృహమునకు బోయి సంగీతముగూర్చి మాట్లాడుటయో, సంగీతము వినుటయో, వినిపించుటయో చేయుచుండును. శ్యామసుందరీదేవితో మాట్లాడినప్పుడు చెల్లెళ్ళు ముగ్గురు నెమ్మదిగా నచ్చట నుండి మాయమగువారు.

'చెల్లీ! సంగీతములో నెన్ని స్వరములనైన కల్పించవచ్చును. కాని పాశ్చాత్యులును, మనమున్ను గూడ పన్నెండు స్వరాల్ని మాత్రం గ్రహించాము. పన్నెండింటికి మించినవి కొద్ది తేడాలుమాత్ర ముండును. కాబట్టి సర్వస్వరములు పన్నెండు స్వరాల్లోనే యిముడుతున్నాయి. తక్కినవి సూక్ష్మములు.' 'ఒక్కొక్క స్వరానికి మూడు నాలుగు శ్రుతులుంటాయికదా అన్నగారూ?'

'అవునమ్మా. కాని శ్రుతియొక్క ధ్వని అతిసూక్ష్మము. శాస్త్రవిధానాన రచితమైన యంత్రసహాయాన్ని ఆయా శ్రుతుల్ని వినగలం. అంతే. మూడు నాలుగు శ్రుతులు కలిసి వినబడిన మొత్తపుధ్వని ఒక స్వరం అవుతుంది.'

'అయితే అన్నగారూ! మన సంగీతానికి పాశ్చాత్య సంగీతానికి ఏమిటీ తేడా అంటారు?'

'ఏమున్నదమ్మాతల్లీ! కాకలినిషాదం ప్రతిమధ్యమము చతుశ్రుతి ధైవతములు అపశ్రుతులట. అయినా పాశ్చాత్యులు రెంటినీ ఉపయోగిస్తారు. మన వాళ్ళు ఏదో ఒకటేరాగంలో వాడ్తారు. అంటే అసలు ముఖ్యమైన కిటుకు పాశ్చాత్య సంప్రదాయంలో శ్రుతికి, అపశ్రుతి కలిగించి, ఆ అపశ్రుతికి, శ్రుతికి, సమీకరణం చేసే స్వరాలు మధ్యమధ్య రానిస్తూ రెంటికీ శ్రుతి కలిపిస్తుంటారు. అందుచేతనే వట్టి స్వరకల్పనలో భావనిర్ధారణ చేస్తామంటారు.'

'పదార్థవిజ్ఞానశాస్త్రం ప్రకారం స్వరస్వరూపం, శ్రుతిస్వరూపం మీరు బాగా చదివినారుకదా, స్వరం నుంచి స్వరం చటుక్కున గంతువేసి వెళ్ళుతుందా? లేక ప్రవహించి వెళ్ళుతుందా?'

'పెద్దప్రశ్న అడిగినావు చెల్లీ! ఇప్పటికి ప్రసిద్ధ శాస్త్రజ్ఞులుకూడా ఆ అనుమానం నివర్తించలేకుండా ఉన్నారు. స, రి, గ, మ అని మనం స్వరములు పలుకుతాము. 'స' కీ 'రి' కీ ఉండే సంబంధం యేమిటి? 'స' లో నుంచి 'రి' వస్తూందా? ఈలాంటి అనుమానాలు. కాని నెమ్మదిగా గవాయిపద్ధతిగా పాడితే 'స' నుంచి 'రి' కి గంతువేసినట్టుగా ఉండదు. ఇంతకూ నా అభిప్రాయంలో స్వరాలకు ఒకదాని కొకటి సంబంధంలేదని, కాని సినిమాలో బొమ్మలు విడివిడిగా ఉన్నప్పటికీ, చటుక్కున తిరుగుటమూలాన్ని వెనుకటి బొమ్మయొక్క ఛాయ మనస్సులోంచి పూర్ణంగా మాయంకాకుండానే, కొత్త బొమ్మ వస్తోంది. మన దృష్టి ఒకదానిమీదనుంచి ఒకదానిమీదకు గంతువేస్తూ ఉన్నా అంతా ఒక్క బొమ్మే అయినట్లు కనబడుతుంది.

'ఇంకా స్వరంలో ఉండే గమ్మత్తు ఏమిటంటే, ఒక స్వరంపలికి, మన గొంతుక మరొక స్వరంలోకి వచ్చేటప్పటికి, ఈ రెండు స్వరాలమధ్య కొన్ని కొన్ని అవ్యక్తస్వరాలు గర్భితమై ఉంటాయి. ఇంద్రధనుస్సు చూడు: ఊదా, నీలం, ఆకుపచ్చన, పసిమి, వంగపండుచాయ, ఎరుపు, మళ్ళీ ఊదా. అసలు రంగులు మూడు. కాని ఎరుపులోంచి నీలం పుట్టుతుందా? కాని ఎరుపునుంచి నీలానికి వచ్చేటప్పటికి ఊదా, నీలి మధ్యను ఉన్నై. నీలిలోనుంచి పసిమికి వచ్చేటప్పటికి రెంటి కలయిక ఆకుపచ్చన ఉంది. ఆ మధ్యరంగులు ముఖ్య వర్ణాల

కలయికే.’ ‘కాని, ఒక తెలుపులోంచి అన్ని రంగులు వచ్చినట్లు, ఒక మహాస్వరం లోంచి అన్ని స్వరాలు రావడం లేదా అన్నా!’

‘అదిమాత్రం నిజం. అదే అఖండ శ్రుతిస్వరూపం సుమా!’

‘శ్రుతి చాలా చిత్రంకాదు అన్నా? మొన్న శ్రుతిలోనే అపశ్రుతి యిమిడిఉందన్నావు ఏమిటి?’

‘నాఅర్థం ఏమిటంటే, ఈ సృష్టిలో అవ్యక్తమై, అనిర్వచనీయమైన పరబ్రహ్మ స్వరూపము తప్ప తక్కినవన్నీ ద్వంద్వాలేకాదూ! వెలుగు నీడ, మంచి చెడ్డ అలాగు. శ్రుతి అపశ్రుతికూడా అట్టి ద్వంద్వమే. శ్రుతిలో అపశ్రుతి సతతము గర్భితమయ్యే ఉన్నది. శ్రుతి ఉంచుకు వెడుతూఉంటే ఎక్కడ పడితే అక్కడ అపశ్రుతి రావచ్చు కాదూ చెల్లీ. సైకిలుఎక్కి పోయేవాడున్నాడు. వాడికి సమ్యక్స్థితి (బేలన్సు) ఉన్నది. ఎక్కడపడితే అక్కడ బేలన్సు తప్పిపోవడానికి వీలుందా లేదా! ఎక్కడనుంచివస్తున్నది ఆ అపశ్రుతి? శ్రుతిలోనుంచే! అలాగు వెలుగులోనుంచే నీడ!’

శ్యామసుందరీదేవి నారాయణరావుతో నిటుల గంటలతరబడి సంభాషించుచు, నాతని వదలజాలకుండును.

శ్యామసుందరీదేవి యింతవరకు నేరిని బ్రేమింపలేదు. ఆమె సుగుణఖని. ఆమె ప్రతి జాతీయోద్యమమునందు బాల్గొనుచుండును. ఆమె శ్రీమతి కమలా చటోపాధ్యాయికి స్నేహితురాలు. జాతీయవారములందు, గాంధీవారములందు ఖద్దరు, వాడవాడకు దిరిగి యమ్ముచుండును. స్వదేశవస్తువుల నమ్ముచుండును. గ్రామ గ్రామములకు శ్రీమతి ఆచంట రుక్మిణీదేవి మొదలగు దేశనాయికల యాజమాన్యమున దిరిగి, కల్లు త్రాగవద్దనియు, హిందూ మహమ్మదీయ సమ్మేళనమున్న గాని దేశమునకు స్వరాజ్యము రాదనియు బోధించుచుండెను.

శ్యామసుందరీదేవి తెలుగు బాగా మాట్లాడగలదు. తెలుగే యామె మాతృభాషయా యనిపించునట్లు మాట్లాడగలదు. ఆమె సగము కర్ణాటాంగన యయ్యు భారతీయ భాషలలో తెలుగే యత్తమమని వాదించును.

శ్యామసుందరి హృదయము పవిత్రమైనది. ఆమెకు పురుషు లనేకులతో స్నేహమున్నను మనస్సులో నిసుమంతయు వికారముకలుగదు. అంతరాంతరములనైన గోర్కి జనించనులేదు, తీగెలు సాగనులేదు.

అట్టి శ్యామసుందరి నారాయణరావన్న వెఱ్ఱిప్రేమలో మునిగినది. పవిత్రహృదయ యగుటచే నారాయణరావన్న నింత భ్రాతృప్రేమ కలుగుటకు కారణమేమని చర్చించుకున్నది. అతడు తన సోదరుడని దృఢనిశ్చయము చేసికొన్నది.

ఇదివర కే యువకుడూ ఆమెతో నొంటరిగానుండి మాట్లాడలేదు. అందులో పరుడగు యువకునితో నొంటిగా గంటలకొలది సంభాషించుట ఇంతవర కామె జన్మలో జరుగలేదు. శ్యామసుందరినిగూర్చి లోకముమాత్రము గుసగుసలు సల్పుచునే యున్నది. ‘అనేకమంది విద్యార్థినులున్నారు. కాని యీ విచిత్ర మెచ్చటను జూడలే’దనువారు, ‘ఆ బాలకు బరపురుష వాంఛ యుండకతీర’ దనువారు, నిట్లు పలువిధములుగ చెప్పుకొనుచుందురు. అట్లనుకొనుచున్నారని శ్యామసుందరికిని తెలియును. ఎంతమంది యేవిధమున ననుకొన్న నేమి, తన పవిత్రత తనకున్న జాలునని యామె చిరునవ్వు నవ్వుకొన్నది. దేశమునకై తాను

సలుపు సేవ కేమియు నాటంకము రాకూడదని యామె దృఢప్రతిజ్ఞ పూనినది.

అట్టి శ్యామసుందరి నేడు నారాయణరావు పేరుచెప్పిన పుల్కరించి పోవును. అతని గొంతుక వినుచు గంటలకొలది యట్లుండిపోగలదు. అతని మోము చూచుచు పారవశ్యము ననుభవించును. ఆ సమయములో నొరుల కామె యదృశ్య. నారాయణరావుతో బరమేశ్వరుడు వచ్చినప్పుడెల్ల పరమేశ్వరునికి దన చెల్లెళ్ళను, దమ్ముని ఒప్పగించునది. తానును, నారాయణరావును నెమ్మదిగ నామె చదువుకొను గదిలోజేరి, యనేక విషయముల జర్చించుకొనుచుండువారు. ఒక్కొక్కప్పుడు నారాయణరావు పేము సోఫాపై కూర్చుండి యుండ, తానాతని ప్రక్కనే కూర్చుండి మాట్లాడుచుండును. ఆమె నారాయణరావును ముట్టినను అతడు చలింపక, ఆమెకు దనపైనున్న సోదర ప్రేమకు సంతసించుచుండును.

ఒకనాడు నారాయణు డామెను జూచి 'చెల్లీ, నీ ఆశయాలు, నీ చరిత్ర చిన్నతనాన్నుంచి నాకు చెప్పు' మని యడిగెను.

'ఏముంది అన్నా! చిన్నతనం నుంచి గొప్ప సంగీతపాటకురాలిని అవుదామనిన్నీ, గొప్ప కవిత్వం వ్రాయగలదానిని అవుదామనిన్నీ, దేశంకోసం సర్వస్వము ధారపోయాలనిన్నీ కలలుకంటూ ఉండేదాన్ని. మా అమ్మగారు నాన్నగారుకూడ నన్ను 'స్వప్నబాల' అంటూ ఉండేవారు.

'మా నాయనగా రుద్యోగం విషయంలో మారినప్పుడల్లా చిన్నబిడ్డనై ఉన్నప్పుడు దారీ, చెట్లు చేమలు, ఆకాశం అన్నీ నన్ను ఆనందంలో ముంచేస్తుండేవి. నేను ఆటకు బొమ్మలు తెమ్మనిగాని, ఆడుకునేందుకు వెళ్ళాలనిగాని మారాం పెట్టేదాన్ని కాదట. ఇతర పిల్లలతో ఆటకు వెళ్ళేదాన్ని కాదట. అస్తమానము చెట్లు చేమలు చూడడం, గ్రామఫోనులో పాటలు వినడం మహాఇష్టంట. త్యాగరాజు గారి 'రామాభిరామా' నన్ను చిన్నతనాన్నుంచి పుల్కరింపచేస్తూండేది అన్నా.'

నారా: చెల్లీ! రామాభిరామా కృతి నాకు వెఱ్ఱే ఎత్తిస్తుంది. అది ఒకటీ, 'ఆరగింపవా పాలు' ఒకటి, 'నను పాలింప నడచివచ్చితివా' ఒకటి, వీటికి నేను తన్మయత్వంలో మునిగిపోతా చెల్లీ!

'మనము పూర్వమునుంచిన్నీ అన్నా చెల్లెళ్ళమేమో తెలియదు. ఇన్నాళ్ళనుంచి కలియకుండగా తిరుగుట ఏమో? ఎన్ని సంవత్సరాలు వృథా అయిపోయినాయో?' 'అమ్మా! అన్నిటికీ కారణము లేకుండా ఉండదు. కర్మయొక్క విచిత్రము అదే!'

'కర్మ అనేది విధి (ఫేట్) అనేది కాదుకదా?'

'కాదమ్మా కాదు! కర్మకూడా ఆత్మతోపాటు అనాదిసిద్ధమైందే; అది మూడు భాగాలుగా విభజించారు. ప్రారబ్ధ, సంచిత, ఆగాములని. ప్రారబ్ధం పాతకర్మలు కారణంగా వచ్చినది. అది ఎవ్వడికీ తప్పదు. మహాత్ములకున్నూ, రామకృష్ణపరమహంసవంటి జీవన్ముక్తులకున్నూ తప్పదు. రామకృష్ణపరమహంసకు కంఠములో వ్రణము వేయడము విన్నావుకదూ?'

'ఆ విన్నాను.'

'ఇక సంచితము ప్రస్తుత కర్మ. దీని యొక్క ఫలితము ఇప్పుడున్నూ, ముందున్నూ సంభవిస్తూ ఉంటుంది. ఆగామి అనేది ముందువచ్చేది. ఇప్పటి కోర్కెలు, ఇప్పటి భావాలయొక్క ఫలితము. నువ్వు జ్ఞానివై కర్మయోగివైతే ప్రారబ్ధము అనుభవిస్తూ,

సంచితము, ఆగామి కర్మలను నశింపుచేసుకుంటే జీవన్ముక్తురాల వౌతావన్నమాట.'

'ఆ రెంటిని నశింపుచేసుకొనుట ఎల్లాగో? నేను రామకృష్ణపరమహంస సుభాషితాలు, గ్రంథాలు చాలా చదివాను. నాకు స్పష్టంగా తెలియలేదు.'

'నాకుమాత్రం తెలుస్తుందా చెల్లీ! ప్రాపంచికమైన యీ మిడిమిడి జ్ఞానంతో ఎంత చదివినా మన జ్ఞానం ఊహామాత్రం. అసలు జ్ఞానం కించిత్తియినా సముపార్జించా లంటే మొదట మహాత్ముడొకడు గురువు కావాలి.'

'గురువు వచ్చిందాకా మనకేమి లాభంలేదన్న మాటేనా?'

'అలాకాదు. నీకు ఆ తహతహ, ఆ జిజ్ఞాస ఎప్పుడు ఉంటుందో, ఏ సాధువాక్యాలో వినికాని, చదివికాని, కర్మమార్గంలోకాని, యోగమార్గంలోకాని ప్రవేశించాలని వెర్రిపుట్టుతుంది. అప్పుడే నీలో నీవే ఏదో పద్ధతి పెట్టుకొని గురువుకు ఎదురుచూస్తూ ఉంటావు. ఆ యెదురుచూట్టంలో జ్ఞానులన్న వాళ్ళని వెళ్ళి ఆశ్రయిస్తూన్నా ఉంటావు. ఆ యెదురుచూచే గురువు నిన్ను వెదుక్కుంటూనే వస్తాడు.'

'కళావిషయంలో మీకోసం నేను ఎదురు చూచినట్లు!'

'నే నెంతవాడిని! పాపిని. ఏ విషయంలోనూ నేనుగురువుగా ఉండలేను.'

జగన్మోహనుని పెండ్లి

కర్నూలు వాస్తవ్యులు రామరాజు సుబ్బరామయ్యగారి కుమార్తెనిచ్చి వివాహము చేయుదుమని జగన్మోహనరావు జమీందారుగారికడకు రాయబారులు వచ్చిరి. సుబ్బరామయ్యగారు లక్షాధికారి. వారి అమ్మాయికి జమీందారీసంబంధం చేయవలెనని కుతూహలముకలిగి యాంధ్రదేశమంతయు గాలించుచుండ బాలిక రజస్వలయైనది. ఇంతలో జగన్మోహనుని సంబంధము వారికి దెలియవచ్చినది. బాలిక చెన్నపట్టణమున మిషనరీల పాఠశాలలో నాల్గవఫారము చదువుచున్నది. అందమైన పిల్ల. అధునాతన నవనాగరితాభిప్రాయములు పూర్తిగా నలవరచుకున్న బాలిక.

జగన్మోహనరా వా బాలికను జూచి, యామెతో మాట్లాడినాడు. ఇరువురకు పరస్పరము నిష్టము కుదిరినది.

సంబంధము నిశ్చయమై, ఆ సంవత్సరము మాఘమాసములో ముహూర్త మేర్పరచినారు. ముహూర్తము దగ్గరకు వచ్చినది.

‘వీరేశలింగం పంతులుగారు ఆంధ్రదేశ నాయకమణిగా ప్రఖ్యాతి వహించినారు. ప్రసిద్ధమైన కార్యాలు చేశారు. అయితే ఇప్పుడేమన్నా పని జరుగుతోందాండి? ఆయన ఏవి తప్పులని గొడ్డలిపుచ్చుకు కొట్టారో, అవన్నీ మొలకలెత్తాయి. పదిరెట్లు విజృంభించాయి. ఆయన మొదలు పెట్టినవి ఆయనతోటే నశించాయి. కట్నాలు మానిపించే మహానుభావు లెవరన్నా ఉన్నారా?’

‘రామమోహనరాయి, కేశవచంద్రసేను, దయానంద సరస్వతి, రామకృష్ణపరమహంస, వివేకానంద, విద్యాసాగరులు ఇటువంటి మహానుభావులూ, నేడు గాంధీగారూ ఇవి తప్పుతప్పు అని ఖండిస్తూవుండడము, ఒకళ్ళ ఇద్దరో అలా నడుచుకోవడము అంతే. అవన్నీ పుబ్బలోపుట్టి మఖలో మాడడము, చూడండి, మా జమీందారు బాబుగారు నేను బ్రహ్మసమాజకుణ్ణి, నేను విధవా వివాహం చేసుకుంటాను, నేను కట్నాలు పుచ్చుకోను అన్నాడు నిన్నటి వరకూ. ఇవ్వాళ్ళ? ఎదిగిన పిల్లనే అనుకోండి, చేసుకుంటున్నా ఆరువేల రూపాయలు కట్నము ఏమిటి? వెధవ కబురులు ఎన్నైనా చెప్పవచ్చు, చెయ్యడమేది?’

‘ఓరబ్బో! గోడలకు చెవులుంటాయి. గట్టిగా మాట్లాడకు. తద్దినాలు మానేశాడు. ధర్మకార్యాలు తగలెట్టాడు. యజ్ఞోపవీతము తీసేశాడు. కాని అంతే! ఈ పెళ్ళికిచూడు, ఎన్నివేలు ఖర్చవుతాయో! బ్రహ్మసమాజమువాడైతే, వెధవపిల్లని చేసికోవాలి. కట్నము పుచ్చుకోకూడదు. ఒక రోజులో ఏ వెంకటరత్నమునాయుడుగారి యాజమాన్యాన్నో వివాహం చేసుకోవాలి మగవాడైతే! ఏమంటావు?’

అని జమీందారీ ఠాణేదారులిద్దరు మాట్లాడుకొనుచు కూర్చుండినారు విశాఖపట్టణం హుజూరు ఠాణాఆఫీసులో.

జమీందారి ఉద్యోగులందరు పొట్టు పొట్టయిపోవుచున్నారు — డబ్బు పోగుచేయుటలో, సరంజాములు చేయుటలో, శుభలేఖలు వ్రాయుటలో, అలంకారములు సమకూర్చుటలో, అటువంటి యింక నెన్నియో పనులలో, జగన్మోహనుడు అడిగినచోట నడుగకుండ 50 వే లప్పుచేసినాడు. పది గ్రామములలో రెండు గ్రామములు తనఖా

పెట్టినాడు. కట్నాలని, నజరానాలని ఇరువది వేల రూపాయలు రైతులనే గానుగాడి ప్రోగుచేసినాడు.

కర్నూలు పోవుటకు ప్రత్యేక ధూమశకటము. చుట్టములు, స్నేహితులు గొప్పకుటుంబములవారే పిలువబడిరి. విదేశీయబ్యాండు తెప్పించినారు. పాట కచ్చేరీలు పనికిరావట. ఒకరోజే వివాహము. విశాఖపట్టణములోను, చెన్నపురిలోను ఉన్న జగన్మోహనరావుగారి స్నేహితులగు యూరేషియను కుటుంబాలవా రాహ్వానింపబడిరి. వారికై పటకుటీరము లేర్పరుపబడెను. ఒక పెద్ద సినిమా హాలులో వారి భోజనములకు, నాట్యమునకు నేర్పాటు చేయబడెను.

శారదయు, నామె తల్లియు వివాహమునకు వచ్చిరి. బళ్ళారిలోనున్న శకుంతలాదేవియు వివాహమునకు విచ్చేసినది.

తోడల్లునకు శుభలేఖవచ్చినను, నారాయణరావునకు గబురే లేదు.

వివాహవిధి నిముషములో జరుగవలెను. అనవసరములగు తంతులన్నియు మాన్పింపబడినవి. సంబంధమునకై దేశదేశములు వెదకిన సుబ్బరామయ్యగారు జగన్మోహనుడు కోరిన షరతులన్నిటికీ ఒప్పుకొనెను.

పెండ్లికూతునకు జగన్మోహనుడన్నియు పాశ్చాత్యాభరణముల నిచ్చెను.

సుబ్బరామయ్యగారు రప్పించిన చెన్నపట్నపు సన్నాయిమేళము విడిది కడ గానము చేయరాదు. కొందరికి బల్లలమీద భోజనములు.

ఊరేగింపు టుత్సవమునకు ముందు ఐరోపీయబ్యాండు (వాయించువారు నల్లవారే). తరువాత పెండ్లికుమారుడు, కొమరితయు గూర్చున్న రెండు గుర్రములబండి, వెనుక బదునైదు గుర్రపుబండ్లు.

పెండ్లికుమారు డప్పుడే ఇంగ్లండునుండి వచ్చిన ఇంగ్లీషు యువకుని దుస్తులు ధరించి టోపీ చేతనుంచుకొని కూర్చుండెను. పెండ్లికుమార్తెకు నింగ్లీషుబాలిక వివాహమునాడు ధరించుదుస్తులు ధరింపించినాడు వరుడు. ఆ దుస్తులు స్నేహితులగు యూరోషియనులు తెప్పించినారు. వారి ఆడవారు వధువు నలంకరించినారు.

ఊరేగింపులో యూరేషియనులు బండికొక స్త్రీయు పురుషుడు చొప్పున పదమూడు బండ్లలో నున్నారు. వెనుక రెండుబండ్లలో పెండ్లికుమారుని చుట్టములు, జమీందారిణి, శారద, శకుంతలాదేవి, శకుంతలాదేవి సంతానము, పెండ్లికుమారుని తల్లివంకవారు తండ్రివంకవారు పదునైదుగురు.

కర్నూలులో నిది బాశ్చాత్య వివాహమాయని ఆిచ్చపడిరి.

జమీందారిణి మేనల్లుని వివాహపు బద్ధతుల నన్నింటిని మెచ్చుకొన్నది.

జగన్మోహనుని తల్లి శివకామసుందరీదేవి జమీందారిణి: 'అందుకనే మావాడంటే అందరికీ గౌరవం వదినా.' ఆమె అన్నగారి భార్య శేషమాంబ: ఎంత చక్కగా ఉన్నదండీ. వెధవ పల్లెటూరి పెళ్ళిళ్ళూ చేసారు.

వరదకామేశ్వరీదేవి: శారదా! చూశావా నీ పెళ్ళికిన్నీ, బావపెళ్ళికిన్నీ తేడా? ఇదీ నిజంగా జమీందారీ వివాహమంటే.

శారద: చాలా బాగావున్నది. ఎంతో శాంతంగా ఉన్నది. ఇంగ్లీషు వారి వివాహమల్లేనేఉంది. కాదుటే అక్కయ్యా?

శకుంతల: వెట్టి నలుగులు అవీలేవు. కాని ఏమిటో మొత్తంమీద నాకు అన్నీ కలిసి వికారంగా కనబడుతోంది.

శారద: బావకు ఇంగ్లీషువాళ్ళ పద్ధతులన్నీ తెలుసు.

శకుంతల: ఎందుకే నువ్వూ మీ బావా ఇంగ్లీషువాళ్ళో ఇంగ్లీషువాళ్ళో అని యిదవడం?

శారద: నువ్వు గాంధీగారి మతంలో చేరావుటే అక్కయ్యా?

శకుంతల: నువ్వదృష్టవంతురాలవు కాబట్టి నీకు నాన్‌కోఆపరేషన్ భర్త దొరికాడు. నువ్వు నిముషంలో జేరడానికి వీలుంది.

శారద మౌనము.

వరద: అదేమిటే శకుంతలా! వెర్రిమాటలు. ఎక్కడ నేర్చావు? శారదను నువ్వు దెప్పటం బాగాలేదు. దాని మనస్సు ఇదివరకే పాడైపోయినది. గోరుచుట్టుమీద రోకటిపోటువంటి మాటంటావు. ఊరుకోతల్లీ!

శకుం: ఊరుకో అమ్మా! నీ సంగతి నాకేమి అర్థంకావటం లేదు. నేనూ చూస్తూ ఉన్నాను. నల్లేరుమీద బండివెళ్ళినట్లు మా మరిది గారిమీద ఒకటే చాడీలు. వాళ్ళిల్లూ, వాకిళ్లు, వాళ్ళకుటుంబాలు, మర్యాదలు తలక్రిందులా తపస్సు చేసినా మనకి రావు. ఇంటికి వచ్చినవాళ్ళని మనం చూడనేచూడము. మొన్న మనం వెళ్ళినప్పుడు వాళ్లు చేసిన మర్యాద మహామహావాళ్ళుకూడా చేయరు. వాళ్లందరి హృదయం ప్రేమతో నిండిఉంటుంది.

శివకామ: ఎవరికోసం చేస్తారమ్మా కోడలా!

శకుం: ఎందుకు చెయ్యాలి అత్తా? వాళ్ళకు మీరు చేసిన ఉపకారం ఏమిటి? మీ కుటుంబాలన్నింటిని ఏళ్లతరబడి ఉంచి పోషించగల భాగ్యం ఉంది, సిరీ ఉంది, సంపదా ఉంది. వాళ్ళింటినిండా బిడ్డలు. ఒక్క మా మరిది గారి కుటుంబంలోనే ఉన్నారు ఇరవైమంది చంటిబిడ్డలు. నాకు ముచ్చటవేసి పోయింది. ఏదీ మన జమీందారీ కుటుంబాల్లో చూపించు పదిమంది ఉన్న కుటుంబాన్ని?

శారద: (కొంచెము కోపమున) పేడనీళ్ళతో అన్నంకడుక్కుంటావా మీ ఇంటిలో?

శకుం: (మూతి ముడుచుకొని కనుబొమలు దరిదీసి) పేడనీళ్లతో కడు క్కొంటున్నారో లేదో ముందు నీకు తెలుస్తుంది. పేడనీళ్ళతో కడిగిన అన్నం తినడానికి ఇష్టంలేక అత్తవారింటికి వెళ్ళవు కాబోలు. మన అత్తయ్య ఆచారం తక్కువా, అంతమాత్రాన్న ఆవిడ పల్లెటూరి మొద్దుఅయిందా?

వరద: ఏమిటి శకుంతలా అది? ఊరుకోఅమ్మా శారదా! ఎందుకూ ఈ గడబిడ నువ్వు, పెద్దమ్మాయీ!

శకుం: ఎందుకా? పొద్దున్నుంచి నారాయణరావు నారాయణరావు అని అతన్ని ఆడిపోసుకోవడమే. మన యింటికి వచ్చినప్పుడల్లా యిదేవరస. విని విని చెవులు తడకలుకట్టి అన్నాను. నారాయణరావువంటి అల్లుడు తపస్సు చేసినా దొరకడు. విన్నావా అమ్మా? బాబయ్యా గారు ఎందుకు కోరి తెచ్చుకున్నారు? మన సంబంధంకోసం శారద మామగారిని హేమాహేమీలు వెళ్ళి ఒప్పించారు. నీకు ఇష్టం లేకపోతే బాబయ్యగారితో నిజంచెప్పు. ఇలాంటి తెలివితక్కువలు చేస్తే జరిగే నష్టం నాకు తెలుసును. జరిగిన సంగతులు తెలిశాయి. తర్వాత విచారిస్తావు.

అందరూ తెల్లబోయినారు. వరదకామేశ్వరీదేవి కొమరిత గంభీర వాక్యముల కదరిపడి శారదవంక చూచినది.

శారద యచ్చట లేదు.

శారద చురచుర కోపముతో వెడలిపోయి, విడిదిమేడలో దమ కిచ్చిన గదిలో పందిరమంచముపై బరుండి, కంట నీరుదిరుగ వాపోయెను. ఆ దారిని పోవు జగన్మోహనున కది వినబడి గది తలుపు త్రోసికొని లోనికివచ్చి మేనమరదలిని జూచి, పట్టరాని తమకమున నొక్కగంతున నా మంచముదగ్గరకు బోయి, యామెను బిగ్గ గవుగిలించుకొని మోహావేశమున వణకు కంఠముతో 'శారదా! ఎం ...దు ...కు ... ఏ... డు... స్తు ... న్నా ... వు' అని యడిగెను.

శారద యేడ్పుమాని మాటలాడక యాతని బారినుండి తప్పించుకొని, గోడవైపుకు దొర్లి 'యేమిలేదు బావా' అన్నది. జగన్మోహను డా దివ్యసుందర విగ్రహము ఏడ్పుమోమున మరియు సుందరతరముగ గన్పట్ట, తమి నాపలేక, మంచముపైకి బ్రాకి, యామెను తనవైపుకు లాగికొని, యామె బుగ్గలను, కంఠమును, చెవులను, జడముడిని ముద్దాడుకొని మోము తనవంకకు ద్రిప్పికొని, పెదవుల ముద్దిడబోవుచుండ శారద చటుక్కున విదల్చుకొని 'ఏమీలేదు బావా' అన్నది. ఇంతలో శకుంతల చెల్లెలిని వెదకుచు నచ్చటికి వచ్చినది.

౧౭
'పిల్లలంటే ప్రాణం'

శ్యామసుందరీదేవి తండ్రి పీమర్తి గోపాలకృష్ణయ్యగారు, మైసూరు వాస్తవ్యుడు. తెలుగు వెలనాటి బ్రాహ్మణుడు. ప్రసిద్ధ బ్రాహ్మసమాజికుడు. చెన్నపురి ప్రభుత్వపు పెద్ద వైద్యశాలలో ముఖ్యవైద్యులలో నొకడు. ఆయన దక్షిణదేశమున జిల్లా వైద్యశాలలో నుపవైద్యులుగా నున్నప్పుడు, మైసూరు దేశపు వైష్ణవ వితంతు బాలికను బ్రహ్మసమాజ పద్ధతిని వివాహమాడెను. ఉద్యోగము విరమించి తన భార్య గ్రామమగు మంగుళూరులో నామెకు సంక్రమించిన మేడలో నుండినాడు. ఆయనకు నలుగురు కొమరితలు, నలుగురు కుమారులు జనించినారు. కుమారులలో బెద్దవాండ్రు ముగ్గురు విదేశములకు బోయినారు. పెద్దకుమారుడు ఇంజనీరింగులో నుత్తమవిద్య బడసి కాశీ హిందూ విశ్వవిద్యాలయములో నాచార్యుడుగ నున్నాడు. రెండవ కుమారుడు ఇంగ్లండులో వైద్యవిద్య నభ్యసించి ఇప్పుడు దక్షిణార్కాటుజిల్లాలో జిల్లా వైద్యుడుగా బనిచేయుచున్నాడు.

మూడవ కుమారుడు జర్మనీలో కర్మాగారవిద్య బడయుచున్నాడు. నాలుగవ కుమారుడు చెన్నపురిలోనే చదువుకొనుచున్నాడు.

ఆంధ్రులు పూర్వకాలమున వివిధదేశములకు వలసబోయినారు. విదేశములతో

ఓడబేరము సలిపినారు. దేశముల జయించినారు. క్రీస్తుపుట్టినపిమ్మట నయిదారు శతాబ్దులలో కొందఱాంధ్ర బ్రాహ్మణులు మళయాళదేశమునకు బోయి నంబూద్రీలయినారు. తంజావూరు, మధుర నాయకుల కాలములో దక్షిణాపథమునకు తెలుగు బ్రాహ్మణులు, నాయకులు, కమ్మవారు వలసబోయినారు. హైదరాబాదు పరిసరముల నుండి కొందఱు బొంబాయి కరిగి యచ్చట వృద్ధినొంది, కామాఠీలని పిలువబడుచున్నారు. తరువాత నాగపురము, కళ్యాణి, అహమ్మదాబాదు, జబ్బలుపురము, కలకత్తా, కాశీ, ప్రయాగాది ప్రదేశముల నాంధ్రు లుద్యోగవర్తకాదులకైపోయి యచ్చటనే నిలిచిపోయినారు. ఇంటిలో దెలుగు మాట్లాడుకొందురు. పైకి వచ్చినప్పుడే ఆ దేశభాష మాట్లాడుకొందురు.

అటులనే గోపాలకృష్ణయ్యగారి పూర్వీకు లెప్పుడు మైసూరువచ్చినారో తెలియదు. గోపాలకృష్ణయ్యగారి భార్య అయ్యంగారి యువతియైనను నామెకు దెలుగు బాగుగా వచ్చుటచే భర్త యిష్టము ప్రకారము బిడ్డలందరకు దెలుగు నేర్పినది. కావుననే శ్యామసుందరీదేవి కుటుంబమువారందరికి తెలుగు, అరవము, కన్నడము బాగుగవచ్చును. హిందూదేశమున మైసూరు వైష్ణవులు సౌందర్యములో రెండవవారని ప్రసిద్దినందినారు. నాజూకుతనము, జ్ఞానము, సౌందర్యము కలిగియు త్రివేణీసంగమములో వారే యఖిలభారతదేశమునకు బ్రథమ పీఠము వహింపగలవారు. అట్టి తల్లికిని, తెలుగు తండ్రికిని జనించిన శ్యామసుందరి మొదలగు నాబాలికలందరు నందమున భారతీయ రాణు లనదగినవారు.

ఆంధ్రదేశ మొకనాడు బెంగాలు పంజాబు దేశములవలె సంఘసంస్కరణోద్యమములో నిలబడి పేరువహించినది.

ఒకనాడు పరమేశ్వరమూర్తి, ఆలం, రాజారావు, వారి యరవస్నేహితుడగు నటరాజన్ శ్యామసుందరి యింట జేరినారు. నారాయణరావింక నచ్చుటికి రాలేదు. ఆనాడు జమీందారుగారు వచ్చుటచే నారాయణరావు మామగారితో మాట్లాడుటకు వెళ్ళుచు స్నేహితులను తరువాత వచ్చి కలిసికొందునని చెప్పి, కీలుపాక్ లో మామగారి యింటికి మోటారుమీద బోయినాడు.

అనేక విషయములగూర్చి సంభాషించినవెనుక, శ్యామసుందరీదేవి తన తండ్రినిగూర్చి మాటలువచ్చి ఇట్లు పలికినది.

‘మా తండ్రిగారున్ను వీరేశలింగకవిగారి శిష్యుడండీ పరమేశ్వరమూర్తిగారు! చిన్నతనములోనే భర్తను గోల్పోయిన మా తల్లి యామెతల్లిదండ్రులకు దెలియకుండ, చెన్నపురిలో శ్రీ వీరేశలింగము పంతులుగారి యాజమాన్యమున విధవా వివాహసంఘమువారు నెలకొల్పిన వితంతు బాలికాశ్రమమునకు బారిపోయివచ్చి యచ్చట చదువుకొనుచు ప్రవేశపరీక్షలో ప్రథమతరగతిలో నుత్తీర్ణురాలైనది. మా తల్లి అయిన ఆండాళ్‌దేవిగారి తెలివితేటలూ, చక్కదనమూ చూచి మా తండ్రి ఆమెను వివాహమాడినాడు.’ అంత రోహిణీదేవి తన యింట జేరిన స్నేహితుల కందరకు టీ పానీయ మిచ్చెను.

శ్యామసుందరీదేవి యందము నానాట బెరుగుచున్నను కొంచెము చదు వెక్కువగుటచే జిక్కిపోసాగినది. రోహిణీదేవి సంపూర్ణ యౌవనము దాల్చినది. సరళాదేవికి వయసు పరిమళించుచున్నది. నళినికి బ్రాయము తొలకరించినది. ఆ మిసిమి మిటారిబాల కన్నుల సహజమగు నవ్వుల కాంతులు మరియు వెలుగు చుండ వదనాంచలముల హాసములు ప్రసరింపుచుండ నల్లరిమాటల నందరిని మేలమాడసాగినది.

సరళ యేరితోడను సాధారణముగ మాట్లాడదు. మితభాషియగు రాజారావును, ఆమెయు వైద్యవృత్తిని గూర్చియు, వేదాంతమునుగూర్చియు మాట్లాడువారు. రాజారావు అమలాపురములో వైద్యవృత్తి నారంభింప వెడలిపోయిన వెనుక, నేటికి పరమేశ్వరమూర్తి భార్యకు గర్భస్రావమగునంత గడబిడయగుటయు, రాజారావుకు తంతినంప నాతడు చెన్నపురి కరుదెంచెను. రాజారావు వృత్తి నవలంబించిన తర్వాత నా బాలిక లాతని చూచుటకదే మొదలుగావున నాతడు రాగానే,

'నమస్కారమండి రాజారావు గారూ! ఎప్పుడు వచ్చారు?' అని ఒక్కసారిగా నడిగినారు.

'రెండురోజు లైనదండీ.'

'ఇప్పుడాండి మాకు కనబడుట డాక్టరుగారూ' అని శ్యామసుందరీదేవి ప్రశ్నించినది.

రాజా: పరమేశ్వరమూర్తి భార్యకు జబ్బుచేసినది, కొంచెం కంగారుపడ్డారు. నారాయణరావూ, అతనూను నాకు తంతినిచ్చారు. నిన్న ఉదయం వచ్చాను. నిన్న సాయంత్రానికే కొంచెం సుగుణమిచ్చింది. శ్యామ: జబ్బు చేస్తే నాకు తెలియపరచారు కాదే నారాయణరావుగారు కాని, పరమేశ్వరమూర్తిగారు కాని? పోనీ లెండి.

పర: క్షమించాలమ్మా దేవిగారు! మొన్న నేనూ, నారాయణరావు మూడుసారులు కాలేజీకి ఫోనులో మాట్లాడినాం. మీరింకా పెద్ద ఆస్పత్రినుండి రాలేదట. తర్వాత ఇంటికి కారు పంపాము. మీరు షికారుకు వెళ్ళారట. నిన్న రాజారావు రావడంవల్ల ఆ గడబిడలో ఉన్నాము.

శ్యామ: ఏమిటండీ జబ్బు?

రాజా: గర్భస్రావము అయినంత పని అయింది. ఇదివరకు మూడుసార్లు ఇంతే. ముందు రాకుండా ఉండడానికి వైబర్నం, అశోక, సిడాన్సు మొదలైనవి వాడుతున్నాను. మీరు కొంచెం చూస్తూఉంటారుగనుక భయం ఏమీ లేదు.

శ్యామసుందరీదేవి అయిదవసంవత్సరం ఎం. బి., బి. ఎస్. పరీక్ష చదువుచున్న దాయేడు. 'పని ఆట్టే చేయించకుండా ఆమెకు కావలసినంత విశ్రాంతి ఇస్తూ, నే చెప్పిన మందును ఇస్తూఉంటే ఏమీ ఇబ్బంది లేదన్నాను. ఏమంటారు మీరు?' అని రాజారా వనెను.

శ్యామ: అవునులెండి. తప్పకుండా చూస్తూ ఉంటాను. నా కిదివరకు ఎప్పుడూ చెప్పినారుకాదే పరమేశ్వరమూర్తి అన్నగారు?

రాజా: అతను సిగ్గుపడాడేమో?

శ్యామ: కాబోలు.

రోహిణీదేవి రెప్పవాల్చక పరమేశ్వరునివైపు జాలిచూపుల జూచుచు 'అన్నగారికి చాలామంది పిల్లలు పోయారని విన్నాను. పాపం!' అన్నది.

రాజా: ఇదివరకు ముగ్గురు కుమాళ్లు పుట్టి పోయినారు, ఇతనికి పిల్లలంటే ప్రాణం.

మా నారాయణరావన్నా ఇతడన్నా పిల్లల్ని వదలరు! చంటిపిల్లా డయిపోతాడు పరమేశ్వరమూర్తి వాళ్ళతోపాటు.

రోహి: ఆయన హృదయం వెన్నవంటిదని మేమంతా అప్పుడే గ్రహించాము.

పర: నారాయణ హృదయం పన్నీరే!

రాజా: కాని అవసరం వస్తే 'వజ్రా దపి కఠోరాణి' అయిపోదటోయి? అతనూ నువ్వూ ఒకటే!

పర: అదా నాయనా, నువ్వు గ్రహించింది?

నట: అదిదా అడగండిమీ. ఏవిటిదా డాక్టరు చెప్పుదురూ! అవసరము వచ్చినప్పుడుదా మంచి గట్టిదని. అంతదా! ఏమిరా పరమేశ్వరమూర్తిగారూ అవళదానేనా?
పర: అవళదా! నల్ల సొల్లారుదా మీరు.

నళినీదేవి: ఏమండీ! ఆయన హృదయం రాయివంటిదని చూపించండి.

రాజా: మావాడు నారాయణరావుకు బాస్వెల్ లెండి.

పర: ఆ విధంగా కూడా కీర్తికాంత వరిస్తుంది. కాదటోయి డాక్టరూ?

రాజా: తప్పక.

నళిని: చెప్పండి కవిగారూ!

సరళ: మధ్య మధ్య చిత్రలేఖన కూడా చెప్పండి.

నట: వహ్వా!

పర: మేము మొన్న యాత్రలు చేసినపుడు రైలుక్రిందబడిన ఒక బొంబాయి ఉద్యోగస్తుణ్ణి రక్షించాడు నారాయణం.

నళిని: ఏవిటదీ?

పర: వినవమ్మా చిట్టిచెల్లీ! కంగారు పెట్టక ఊకొట్టు. నారాయణరా వంత పెద్దకథానాయకుణ్ణి కాకపోయినా నేనూ కథలు రాస్తూవున్నా.

నళిని: ఊఁ.

నట: అచ్చా!

పర: మన్మాడుస్టేషనులో ఆ రోజున వందలకొలది జనం ఉన్నారు బొంబాయి మెయిలు కోసం.

నళిని: ఊఁ.

పర: (చిరునవ్వు నవ్వుచు) అల్లరి అమ్మాయీ! మేము నాసిక వెడుతున్నాము.

ఇంతలో రైలు వచ్చింది. ఇంకా పూర్తిగా ఆగలేదు. వేగంగా ఉన్నది. మనబొంబాయి పెద్దమనిషి ఒక్క గంతువేసి బండి పట్టుకొనబోయినాడు. పట్టుతప్పి రైలుకూ, ఫ్లాట్‌ఫారం అరుగికీ మధ్య పడ్డాడు.

నళిని: రామ రామా! ఊ! తర్వాత.

పర: కాస్తయితే నలిగిపోవలిసిందే కాని, నారాయణరావు గబుక్కున వంగి గోడ ప్రక్కనే కదలకుండా పడుకో అని కేక పెట్టాడు. ఆ మనిషి అది వినిపించుకోకుండా రైలుక్రింద దూరిపోయాడు. ఆ దూరడంలో ఒక్క కాలు తీసుకోలేక పోయాడు. చక్రం ఆ పాదం మీదనుంచి పోయింది. పాదం పచ్చడి. రైలు వెళ్ళిపోయినది. స్పృహతప్పి ఆ మనిషి పడిపోయాడు. జనం వందలకొలది దూకి ఆ మనిషి చుట్టూ చేరారు. ఒక్కళ్ళూ సహాయానికి వంగరు.

నళిని: అబ్బా! (ఒడలు జలదరించును)

పర: నారాయుడు చటుక్కున వంగి, ఆరడుగుల పైచిలుకున మంచి లావూ, భారీవున్నవాణ్ణి చంటిపిల్లవాడిలా ఎత్తి ఒక్క గంతులో ఫ్లాటుఫారం ఎక్కాడు , గబగబ రెండవ తరగతివారి విశ్రాంతిగదిదగ్గరకు తీసుకొని వెళ్ళాడు. రాయివేసి రక్తం స్రవించకుండా రక్తనాళాన్ని గట్టిగా కట్టాడు. నేను వెనకాలే పరుగెత్తుకొని లైజల్‌బుడ్డి, పళ్ళెము, నీళ్ళకూజా, దూది, గుడ్డలు మాదగ్గర ఉన్నవి పట్టుకువెళ్ళాను. అవి వాడికిస్తే...

నళిని: (చిరునవ్వు నవ్వి) మధ్య మిమ్మల్ని వీరుణ్ణి చేసుకున్నారే!

పర: (నవ్వుచూ) తప్పదు. 'మంచిపని చేశావురా' అని 'నీళ్ళు' అని పొలికేక పెట్టి, కాలుకడిగి నేను తెచ్చిన లైజాలు నీళ్ళలోవేసి, పాదం అంతా కడిగి తనజేబులో ఉన్న చాకుతో కాలికి ఉన్న బూటుకోసి తీసివేశాడు. టించరు అయోడిన్ వేసి గుడ్డ చుట్టాడు. ఇంతలో డాక్టరు వచ్చాడు.

౧౮
ఆంధ్రులు డాంబికులు

నళిని: మా అక్కకన్న బాగా ఫస్టుయైడు (మొదటి వైద్యసహాయం) చేశారే! చాలా సంతోషంగా ఉంది. తర్వాత?

పర: తర్వాత ఏముంది అమ్మా! మేం వచ్చేశాం. మా అడ్రసు ఇచ్చి వచ్చాము కాదూ? మొన్ననే ఉత్తరం రాశాడా బొంబాయి పెద్దమనిషి.

రాజా: ఇంకా మీ నారాయణరావు వీరకృత్యాలుంటే వర్ణించవోయ్ కవీ!

శ్యామ: డాక్టరు అన్నగారూ! నారాయణరావు గారికి బాగా యీత వచ్చునట కాదూ?

రాజా: పరమేశ్వరుడికీ వచ్చును.

పర: మా నారాయుడి యీత గజీతలెండి. ఒకమాటు రాజోలుదగ్గర పడవ రేవు దాటివస్తూఉంది, గాలి బాగా వీస్తూంది. గోదావరి కెరటాలో ఉబికిపోతూ ఉన్నది. నారాయణరావూ, నేనూ నర్సాపురం నుంచి స్టీమరు మీద వచ్చి రేవులో దిగుతున్నాము.

ఘొల్లుమన్నారు. ఏమిటా అని చూసే ఎల్లా మునిగిందో ఆ పడవ మునిగింది. నారాయుడు ఎట్లా ఉరికాడో, ఎల్లా బారలమీద వాయువేగంతో వెళ్ళాడో యిరవైగజాలదూరంలో ఒకరితర్వాత ఒకళ్ళను నలుగురిని పట్టుకోడం, వెనకాలే వచ్చిన పడవకు అందివ్వడం చేశాడండి. ఇద్దరు మనుష్యులు స్పృహతప్పితే ఒడ్డునపడేసి పొట్టనొక్కి ఊపిరితిత్తులాడించి వాళ్ళను బ్రతికించాడు డాక్టరుగారు వచ్చేలోపుగా.

రాజా: అప్పుడే కాదటోయి ప్రభుత్వంవారు బహుమతి యిచ్చారు?

పర: ఇస్తే, ఆ పడవవాడికి పంపించాడది. ఇంకా ఉన్నాయి వాడి వీరకృత్యాలు.

నళిని: మరి కానీండి! పర: కలకత్తాలో మేము నడిచి వెడుతూఉంటే, ఒక సార్జెంటు సైకిలు మీద వస్తూ నారాయుడికి తగిలి క్రిందపడ్డాడు. పడి 'ఛండాలుడా' అంటూ లేచి 'నీబుర్ర బద్దలుకొడ్తాను' అని మీదకు వచ్చాడు. నారాయుడు నవ్వుతూ నుంచొని మనిషి ఎప్పుడువచ్చి చేయెత్తి కొట్టబొయ్యాడో మెరుపువేగంలా ఆ చెయ్యి పట్టుకొని వాణ్ణి వెనక్కు తిప్పి చెయ్యిమెలిపెట్టి వదిలేసి 'అనవసరంగా మీదకు రాకు. తప్పు దగ్గర ఉంచుకొని ఎగిరితే ఎవరూ భయపడరు పో' అని తోవచూపాడు. దెయ్యంలా ఉన్న మనిషి పిల్లి అయ్యాడు. మాట్లాడక సైకిలు ఎక్కిపొయ్యాడు. అది చుట్టుపక్కల వాళ్ళంతా చూస్తూ ఉన్నారు. ఒక్కసారి వచ్చి నారాయుడు చుట్టూ మూగారు.

రాజా: ఇదిగో వచ్చాడు నారాయణం, వెయ్యేళ్ళాయువు.

పర: అయితే త్రిదశవర్యుడవైపోరా నారాయుడూ!

నారా: (లోపలికి వచ్చుచు) ఆలస్యమయింది, క్షమించాలి. నళినీ, సరళా కన్యలలో ఎవరైనాసరే, యీ అన్నకు ఒక ఔన్సుడు మంచినీళ్లు ఇస్తే చాలా సంతోషిస్తాడు.

రాజా: మీ మామగారేమన్నారోయి?

నారా: ఉండు ఈదాహం తీర్చుకోనియ్యవయ్యా.

నళినీదేవి లోనికి పోయి మంచినీరు దీసికొనివచ్చి యిచ్చినది. నారాయణరావు దాహము దీర్చుకొని కూర్చుండెను. మంగపతిరావు నారాయణరావును జూచి 'రేపు మాయన్న వచ్చుచున్నాడు' అనెను. 'ఏ అన్న?' యని నారాయణరావు పృచ్ఛజేసెను.

'మా రెండవ అన్నయ్య.'

పర, నారా: చాలా సంతోషము.

రాజా: మాకు శల్యవిద్యలో ద్వితీయోపాధ్యాయుడుగా ఉండేవారు.

శ్యామ: (నారాయణరావును జూచి) అన్నగారూ! నటరాజన్ మీ ఆంధ్రులు వట్టి ఢాంబికులు అని వాదించాడు. నాకు జ్ఞానం వచ్చినతర్వాతనే చెన్నపట్టణం వచ్చాము. కనుక నాకు ఆంధ్రుల చరిత్రా, వారి స్వభావాలూ యేమి తెలియవు. చిన్నతనంలో తెలుగుదేశంలోగూడ ఉన్నామట.

నారా: ఒకసారి మీరంతా మా దేశంవస్తే బాగుంటుందని నా ఉద్దేశం. మా ఇంటికి కొత్తపేట అతిథులుగారండి. దేశం, దేశంలోని ఆచార వ్యవహారాలు, దేశం యొక్క వర్తమాన

చరిత్ర అన్నీ జాగ్రత్తగా గ్రహించగలరు.

నళిని: మన ఆంధ్రుల్ని నటరాజన్ గారు చెక్కివదిలారు. మీరు దానికి సమాధానము చెప్పరేమండీ అన్నయ్యా!

పర: మన ఆంధ్రులకు ఉత్సాహం యెక్కువ. సమయం వచ్చిందంటే ఉత్సాహంతో వేలకువేలు జనము సిద్ధము. ఉత్సాహం తగ్గటంతోనే కనుచూపుమేర దూరాన్ని మళ్ళీ ఎవరూ కనబడరు. రాజా: ఆ ఉత్సాహం కూడా ఎక్కువకాలం ఉండదండి.

పర: దేశం అంతా గ్రంథాలయాలు అన్నారు. ఎక్కడచూస్తే అక్కడ గ్రంథాలయాలు కృష్ణదేవరాయ, వసురాయ, గౌతమి, రామమోహన, మోహనదాసు, తిలకు మొదలగు పేర్లతో దేశం అంతా గ్రంథాలయాలు. గ్రంథాలయ మహాసభలు, గ్రంథాలయ పత్రికలు. ఇప్పుడుచూస్తే ఏవో నాలుగో అయిదో బాగా పనిచేస్తున్నవి. తక్కినవి నామమాత్రా వశిష్టముగా కొన్ని, కొట్లాటలతో చప్పగా నశించిపోయినవి కొన్ని.

నారా: పత్రికలు రోజుకు రెండు బయలుదేరి నాలుగు నశిస్తున్నవి. ఎపుడో ఒకనాడు భీమాకంపెనీలు అలాగే బయలుదేరి నశించిపోయినవట.

పర: బందరులో పంచదార యంత్రాలయము, రాజనరేంద్రనగరిలో కాగితాల యంత్రాలయం, గుంటూరులో ఇనుపకర్మాగారం, ఏలూరులో గోనెగుడ్డల కర్మాగారము అలాగే అనేక కంపెనీలు బయలుదేరి, మాయమై పోయినవి కొన్ని, మరిగిపోతున్నవి కొన్ని.

రాజా: 1920 సంవత్సరములో ఊరికి ఒక జాతీయకళాశాల బయలుదేరినది. ఇప్పుడు కొనఊపిరితో శారదానికేతనం ఒకటి ఉన్నది. బందరు జాతీయ కళాశాల ఎల్లాగో కాలం గడుపుతూ ఉన్నది, కాదురా నారాయణరావూ?

నారా: ఆశ్రమాల్లో పల్లెపాడు ఆశ్రమం ఏమయింది? ఆ మహానుభావుడు దిగుమర్తి హనుమంతరాయుడు పోవడంతోనే, ఆశ్రమం నశించింది.

శ్యామ: ఇది ఏమిటి ! అన్నగార్లు అంతా మనదేశాన్ని పట్టుకొని దూషిస్తున్నారే.

నారా: దూషణ పూర్తికావాలి శ్యామసుందరీదేవీ! కానీ పరం!

పర: తిట్టులు నువ్వే పూర్తి చెయ్యలేకపోయినావట్రా? సరే! ఒకసారి గబుక్కున దేశంఅంతా పరపతి సంఘాలు. ఎన్నో నశించాయి, కొన్ని సంఘాలు దివాళాతీశాయి. పోనీ, మూడురూపాయల వడ్డీకి మారువాడీ దగ్గర అప్పు తీసుకరావడం మానేరా అంటే అదీలేదు.

శ్యామ: దీనికంతకూ కారణం?

నళి: ఫీజు యిచ్చి ప్లీడర్ని పెడితేపిచ్చెత్తి యెదిరిపార్టీ తరఫున వాదించి ఎక్కడికో లేచిపోయిన వకీలులా ఉన్నారు మీరంతా.

నారా: హృదయదౌర్బల్యం. వెన్నెముక బలం లేకపోవడం. పట్టుదల హుళక్కి. నమ్మకము సున్న. అహంభావము అతిజాస్తి. ఒక్క నాయకుడు లేడు. అంతా నాయకులే. పెద్దలయెడ మర్యాదలేదు. పర: అందుకనే జ్యోతిషంలో మన దేశానికి రెండువందల సంవత్సరాల నుంచి కుజుడు రాజయ్యాడు. మనదేశం నుండి ఇతరదేశాలకి వెళ్ళితేనేగాని

మనవాళ్ళకు పేరురాదు. బంగాళీవాళ్ళు, మహారాష్ట్రులు, పాంచాలురు, ఉత్తర హిందూస్థానంవారు వాళ్ళ దేశాల్లోనే గౌరవం పొందుతున్నారు.

నారా: ఇంకో పెద్దకారణం ఉన్నది. పూర్వం మహారాజుల ఆదరణ ఎక్కువ ఉండేది; ఇప్పుడు లేదు. ఆంధ్రదేశంలో కొన్ని పెద్దజమీందారీలు ఉన్నవి. వారు మరీ పెద్దవారు. వారి పూర్వీకుల పేరు నిలబెట్టక ధనం ఎన్ని విధాలో నశింపుచేయుట ఉద్దేశంగల కొందరు మహానుభావులు ఉన్నారు. వివిధ ఉద్యమాలకు సహాయం చేసే మాన్యులూ ఉన్నారు. తక్కినవారు 'నన్ను ముట్టుకోకు నామాలకాకి' అని అంతఃపురాల్లో కూర్చుంటారు. ఆంధ్రా పేపరుమిల్లు విషయంలో ఒక్క మహారాజు పూనుకుంటే ఈపాటికది ఎంత లాభకారి అయిఉండును? దేశానికి ఎంత ఉపకారం! అలాగే బందరు పంచదార ఫ్యాక్టరిన్నీ. ఈ పెద్ద జమీలులేని ప్రదేశం రైతువారిదేశం. అందరూ చిన్నరైతులు. వారు తమకు మించిన బ్రతుకు బ్రతుకుతూ మారువాడీలదగ్గిర, షాహుకార్లదగ్గిర అప్పు తెచ్చుటలోనే దేశోపకారం చేస్తూఉన్నారు.

పర: ఇదుగోనమ్మా సోదరీ! రేపు డిశంబరు 15వ తారీఖున చెన్నపురిలో ఆంధ్ర నవ వాఙ్మయసభ జరుగుతూఉన్నది. అప్పుడు చూద్దుకాని, ఆంధ్రుల ఉత్సాహం, కార్యశూరత్వమున్నూ.

సరళ: ఇంక వారంరోజులే ఉంటా!

రోహిణి: మా మంగపతి ఇంగ్లీషులో కవిత్వం వ్రాస్తాడు. అతడు రావచ్చునా?

పర: తప్పకుండా రావచ్చును.

శ్యామ: ఏమిటీ కవులసభ?

పర: ఇప్పుడు ప్రస్తుతం రెండు ఉద్యమాలు భాషావిషయంలో ఉన్నాయి తెలుగుదేశంలో. ఒకటి గ్రాంథికభాషా, పూర్వసాంప్రదాయ కవిత్వం. రెండు వ్యావహారిక భాషా, నూతనసాంప్రదాయ కవిత్వం. దీన్నే భావకవిత్వం అనికూడా అంటారు.

నట: నా బదులు పరమేశ్వరమూర్తి నిండా బాగుగా వాదించినాడుదా.

పర: ఉండవయ్యా ! అరవవాళ్లపని తర్వాత చెప్తాను. సంతోషించకు. అరవము అని అరుస్తారుదా మీరు. మమ్మల్ని మేము నిందించుకొంటూంటే సంతోషిస్తున్నాడు నటరాజన్ ఇందాకటి నుంచిన్నీ.

రోహిణి: భాషనుగూర్చిన వాదం ఏమిటది?

పర: ఏముందమ్మా? గ్రాంథికవాదం, వ్యావహారికవాదం. ఇప్పుడు దేశంలోఉన్న పరిస్థితులు చెప్తా. పూర్వం నుంచీ వచ్చిన గొప్ప గ్రంథాలన్నీ పద్యాలలో ఉన్నాయి. భారతం, భాగవతం, ప్రబంధాలు అవి ఏమిటో తర్వాత చెబుతా. ఆ పద్యాలతోపాటు గద్యమూ ఉన్నది. నన్నయభట్టు భారతం వ్రాసిన కవులలో మొదటికవి. తెలిసివున్నంతవరకు ఆంధ్రభాషలో గ్రంథము వ్రాసిన మొదటికవి. 'వాగనుశాసనుడు' అని పేరు ఆయనకు. ఆయన సంస్కృతంలో తెలుగుభాషను విధిస్తూ వ్యాకరణం వ్రాశారు. తర్వాత చాలమంది వ్యాకరణాలు వ్రాశారు అప్పకవి మొదలైనవాళ్ళు. ఆ మొదటి వ్యాకరణాన్ని అనుసరిస్తూ ఏదో కవిస్వతంత్రాలు అక్కడక్కడ చూపిస్తూ తర్వాత కవులంతా ఆ వ్యాకరణాన్ని

అనుసరించారు. కాని 1850 దాటేవరకు తెలుగులో వచనగ్రంథం సరియైంది ఒకటి పుట్టలేదు. చిన్నయసూరి, వచన నన్నయ అయ్యాడు. బాలవ్యాకరణం వ్రాశాడు. ఆయన నీతిచంద్రిక అని పంచతంత్రాన్ని తెలుగువచనంలో భాషాంతరీకరణంచేస్తూ పూర్వగ్రంథాలలో ఉండే గద్యభాషే వ్రాశాడు. వీరేశలింగకవి, చిలకమర్తి లక్ష్మీనృసింహకవి ఇంకా అనేకు లా భాషను అనుసరించారు. దానికి గ్రాంథికభాష లేక వ్యాకరణయుక్తమైన భాష అని అంటారు.

రాజా: అబ్బ! గుక్కతిప్పకుండా ఒక్కబిగిని ఉపన్యాసం ఇచ్చాడు!

పర: కాని 1914 ఆప్రాంతాల్ని ఒక ఉద్యమం బయలు దేరింది. గురజాడ అప్పరాయకవి, సెట్టి లక్ష్మీనరసింహకవి మొదలైనవారు దానికి మొదటివారు. గిడుగురామమూర్తిగారు ఆ వాదానికి అర్జునుడు. వాళ్ళనేది ఏమిటి? పద్యాలమాట అటుంచండి. కాని పూర్వం నుంచి ఉత్తమతరగతులవాళ్ళు ఉపయోగించిన భాష మనకు ఆదర్శం అవ్వాలి వచనరచనకు, ఇంగ్లీషు భాష వచనం ఎప్పటికప్పటికి రాజసభలో మాటాలాడుటబట్టి మారుతూ ఉంటుంది. మనదేశంలో ఉత్తమకులాల భాషనుబట్టి మార్చుకోవాలి. లేకపోతే భాష ఎదగడం మానుతుంది. ఎదుగుట మానితే చచ్చిపోతుంది. భాషను రైలుపట్టాల మీద నడువమనకూడదు. భాష ఒక వ్యక్తి , ఒక ఆత్మ. అది యుగాలు బ్రతకాలి. అనేక యుగాలు బ్రతికి ప్రాణము వదిలిందికాబట్టే సంస్కృతం మహానిధి అయింది. వేదభాష వేరు, పురాణభాష వేరు, నాటకభాష వేరు. ఊరికే ఎదిగి హిమాలయాన్నికూడా మించాలి భాష. వ్యావహారికంలో ఉండే భాషే అలాగ ఎదుగుతూంది. ఆ భాషే మన వచనభాష చెయ్యాలి అని వాదిస్తున్నారు.

రాజా: రెండవ ఉపన్యాసం అయింది. ఇంకా!

పర: పూర్వకవులు మహారాజులను నాయకుల్నిచేసి, మహారాణులను నాయికలను జేసి గ్రంథాలను సృష్టించారు. కాలాన్ని బట్టి శృంగారం ముఖ్యరసం చేశారు. వారు వ్రాసిన పురాణాలు, మహాగ్రంథాలు, ప్రబంధాలు బాగానే ఉన్నవి. ఇంకా అవే అనుకరిస్తే పేలవమైపోతాయి అని యువకులు క్రొత్త మార్గాలు తీశారు. ఇంగ్లీషుభాష ఒకటి చాలా ఉద్బోధం కలిగించింది. ఈ క్రొత్తకవిత్వానికి మార్గదర్శకులు గురజాడ అప్పారావుకవి. బొబ్బిలిపాట అదీ చూడండి. ఎంత మాధుర్యంగా ఉంటాయో! కాబట్టి క్రొత్తమార్గాలు తీయండయ్యా అన్నారు. తమ భావాల్ని, తమ ప్రేమనీ ఆశ్రయించి వ్రాసేవారు, జానపదుల జీవితాల్ని దర్శింపచేసేవారు, పురాతన ఆంధ్రుల మహాచరిత్రలు స్మరింపచేసి పుల్కరింపులు కలుగజేసేవారు__ఈరకాలుగా ఉన్నా రీనాటి కవులు.

౧౯
ఆంధ్ర నవకవి సమితి

'ఆంధ్ర నవకవుల కూటమి' అని పెద్దఅక్షరములతో పచ్చయప్ప కళాశాల సింహద్వారముపై పెద్దఅట్ట కట్టినారు. మధ్య సభామందిరమును, వేదికయు మనోహరముగ నలంకరింపబడినవి. అలంకారాది సమస్త యాజమాన్యము నారాయణరావు నెత్తిపైన బడినది. వరదరాజస్వామివారు అధ్యక్షులు. ఆహ్వాన సంఘాధ్యక్షులు ఆంజనేయకవి, ఆహ్వాన కార్యదర్శి నారాయణరావు, పరమేశ్వరమూర్తి, రోహిణీదేవి మొదలగువారు ఆహ్వానసంఘ సభ్యులు. అనేక మంది కళాశాలా విద్యార్థులను బ్రోగుచేసి, వారలకు ఉత్సాహము గఱపి నారాయణరావు కార్యక్రమమంతయు విచిత్రముగ నొనగూర్చెను.

కూటమి మూడురోజులు. సమస్తమగుఖర్చులకు నారాయణరావు మున్నూరు

రూపాయలు చందావేసెను. జమీందారుగారు నూరురూపాయలిచ్చిరి. నాగేశ్వరరాయలు నూరు, అల్లాడి కృష్ణస్వామయ్య గారు నూరురూపాయలు, ఇంకను వకీళ్ళు, షాహుకార్లు మొదలైనవారందరు చందాలు వేసినారు. సుమారు రెండువేల రూపాయలు ప్రోగుచేసి నారాయణరావు ఆహ్వానసంఘము వారికిచ్చి, సరళను, యువకవియు భారతీ పత్రికాస్థానములో వ్రాయసకాడునగు రామలింగరావును గోశాధిపతులజేసి, జాగ్రత్తయని వారికప్పగించినాడు.

సమయములో సమయమని చిత్రకళా ప్రదర్శనము, కవుల ఛాయాచిత్ర ప్రదర్శనము, నవీనకవుల ముద్రితాఽముద్రిత గ్రంథముల ప్రదర్శనము నేర్పాటు చేసెను. చిత్రకళాది ప్రదర్శనములకు గళాహృదయుడగు కజిన్సుపండితుని నేతగా నాహ్వానించెను.

ధనాభావముచే సభలకు రాజాలరని యెంచిన కవులకు రానుపోను ఖర్చు లీయబడునని తెలియజేయుచు తానే తన స్వంతములోనుంచి ధనమును బంపినాడు.

ఆహ్వానము లచ్చువేయించినారు. కార్యక్రమములు ముద్రించినారు. ధనము లోటగునేమో, తనకు మించిన ఖర్చు తగులుబాటగునేమో యని యువకుల గొందరిని నాటకమాడ నేర్పరచినాడు. చిత్రకళా ప్రదర్శనమునకు దేశదేశ చిత్రకారుల కాహ్వానము లంపినారు. శాంతినికేతనమునుండి నందలాలుగారు, కలకత్తా నుండి అవనీంద్రనాథఠాకూరుగారు, లక్నో నుండి అసితకుమార హవల్దారుగారు, పంజాబ్ నుండి అబ్దుల్ రహమాన్ చౌకుతాయిగారు, బరోడానుండి ప్రమోదకుమార చటోపాధ్యాయులు, మైసూరునుండి వెంకటప్పగారు, బొంబాయినుండి సాలొమానుగారు, అహమ్మదాబాదునుండి కనూదేశాయిగారు, మణిభూషణగుప్తగారు, ముజుందారు, సుధాంశుచౌదరి, దేవీప్రసాదరాయి చౌదరిగారలు మొదలగువారును; ఆంధ్రదేశములో రాజమహేంద్రవరమునుండి వరదా వెంకటరత్నంగారు, శ్రీమతి దిగుమర్తి బుచ్చికృష్ణమ్మగారు, చామకూర భాష్యకార్లుగారు, భీమవరమునుండి అంకాల సుబ్బారావుగారు, గ్రంధి శేషారావుగారు, తంగెళ్లమూడి వేంకటసుబ్బారావుగారు, గుంటూరునుండి గుఱ్ఱం మల్లయ్యగారు, అనిశెట్టి సుబ్బారావుగారు, చెన్నపురిలోని కవుతా రామమోహనశాస్త్రిగారు, కేశవరావుగార్లు, గుజరాతునుండి కవుతా ఆనందమోహనశాస్త్రిగారు, విశాఖపట్టణమునుండి తలిశెట్టి రామారావుగారు, కాకినాడ నుండి చామకూర సత్యనారాయణగారు, నరసాపురముమండి వెన్నా శేషగిరిరావుగారు, ఏలూరునుండి చంద్రుపట్ల బాపిరాజు, రామారావుగారలు, పెనుగొండ నుండి వెంకట్రావుగారు యింకను బాలచిత్రకారులు తమ తమ చిత్రములను ప్రదర్శనమునకు బంపిరి.

ఆహ్వానము లంగీరించి ఆంధ్రదేశ వివిధ మండలాల నుండి రాయప్రోలువారు, విశ్వనాథవారు, తల్లావఝులవారు, కురుగంటివారు, దేవులపల్లివారు, వేదులవారు, నండూరివారు, కాటూరివారు, మాధవపెద్దివారు, దువ్వూరివారు, పింగళివారు, మునిమాణిక్యులు, కవిరాజులు, మొక్కపాటివారు, నోరివారు, నాగేంద్రరాయలు, చింతావారు, పంచాగ్నులవారు, కరణంవారు, కోలవెన్నువారు, మల్లంపల్లివారు, తుమ్మలవారు, భావరాజువారు, కవికొండలవారు, మల్లాదివారు, పువ్వాడవారు, త్రిపురారిభట్లవారు అనేకులు సభల నలంకరించినారు.

పచ్చయప్ప కళాశాలాభవనములో కవుల సభలుజరిగినవి. నానాప్రాంతాగతులయిన సుప్రసిద్ధ కవులు తాము క్రొత్తగా రచించిన పద్యములు, పాటలు మనోహరముగ జదివి వినిపించినారు. సాయంకాలముల గోఖలేభవనమున గొప్ప ఉపన్యాసముల నిచ్చినారు. ఉత్తమ గాయకులు సంగీతము పాడి వినిపించిరి. ఒకనాడు కూచిపూడివారి భాగవత

ప్రదర్శనము, ఒకనాడు జంగంకథ, దేశీనాట్యములు మున్నగు వినోదములు ప్రదర్శింపబడినవి. రసజ్ఞులు, విమర్శకులు కవితావిషయములగూర్చి చక్కని ఉపన్యాసములు చేసిరి. ఒకనాడు శ్యామసుందరీదేవి చెల్లెండ్రతో పాటకచేరి చేసి, సభ్యుల నానందమున నోలలాడించినది. ఆ సమయమున నారాయణరావు ఫిడేలుతో వారి ననుసరించెను. పరమేశ్వరుడు తాను రచించిన ఏలపాటలు సహజ మధురతాపూర్ణస్వనమున సాభినయముగ బాడి వినిపించెను. అతిథులందఱకు హిందూ యువజన సమాజ భవనమున ముప్పొద్దుల షడ్రసోపేత భోజనములు, ఫలహారములు నమర్చిరి.

అధ్యక్షులవారు మధురముగ, గంభీరముగ ఉపన్యాసము గావించినారు. కవిత్వము జీవితమూలము కదిపిరావలెను. పైనుంచి తెచ్చిన అలంకారము కారాదు. కవి బ్రతుకులో భాగమై అది మొలకెత్తవలెను. ఈరీతి వారు గంగాప్రవాహమువోలె, సముద్ర కెరటములరీతి నుపన్యాసము లిచ్చినారు.

భావకవిత్వము అనుమాట పనికిరాదన్నారు గొందరు. భావములేని కవిత్వం ఏది? ఆ పదము తప్పక తీసివేయుడని ఉపదేశించిరి. కాని భావమన అర్థముకాదు. రసస్వరూపమైన భావమే సరిఅయిన పదమనియు, భావమన హృదయము, మనస్సు అనియు, భావజ్ఞు డా యర్థమును గోచరింప జేయుననియు, కవిజీవితమును ప్రతిఫలింపజేసికొన్న కావ్యము భావకవిత్వమని కొందరు వాదించిరి. అందరు భావకవిత్వమన్న (సబ్జెక్టివ్) కవియే నాయకుడైన కవిత్వమనిరి.

ఇరువురు భారత భాగవతములు పూర్ణకవిత్వం కాదన్నారు. సంస్కృతమునుండి ఆంధ్రీకరణము చేసినంత మాత్రమున అది కవిత్వమా యనిరి.

కాని ఆ యిరువురను ఖండించి మనల మన మెంతమెచ్చుకొనుచున్నను భారత భాగవతాది మహాగ్రంథకర్త లవతారమూర్తులని పూజింపవలెనన్నారందరు.

పాటలు వ్రాయవచ్చునన్నారు. పాటలును కవిత్వమని ఒప్పుకొన్నారు.

ఇక నెట్టిభాష ఉపయోగించవలెనన్న ప్రశ్న వచ్చినది. వ్యాకరణ యుక్తమగుభాష నుపయోగించదలచిన వారు పద్యములకు, పాటలకు నుపయోగింపవచ్చుననియు, వచనగ్రంథములకు దప్పక వ్యావహారికమే యుత్తమమనియు వచించినారు.

పరమేశ్వరు డిట్లు వాదించినాడు: 'భాష పెరుగుతుంది. భాషకూడా ఒక వ్యక్తి. భాషకూ పుట్టుక, వృద్ధి, చావు అని మూడు స్థితులున్నాయి. ప్రపంచంలో ఎన్నోభాషలు పుట్టాయి, పెరిగాయి, నశించాయి. కొన్ని చనిపోయినచెట్టు, రాయి, లోహము మొదలయినవి శిల్పరూపముతో, నాణెములును నగలు మొదలయిన రూపాలతో జీవించిఉన్నట్లు సలహా భాషలక్రింద జీవించి ఉండవచ్చును. కాని అవి నిధులు, జీవభాషలు మాత్రముకావు. సంస్కృతం చూడండి అనేక వేల సంవత్సరాలు జీవించింది. నేడు మహానిధియైఉన్నది. అలాగే లాటిను, గ్రీకు, హేబ్రూ మొదలగు భాషలు. మీరు ఎప్పుడు భాష ఎదుగులేకుండా వ్యాకరణం ఏర్పాటుచేసి శాసిస్తారో అప్పటినుంచి వృద్ధి పొందడం మానివేస్తుందేమో. అలాగే సంస్కృతాన్ని శాసించగానే ప్రాకృతం వచ్చింది. అది శాసించగానే పాలీవచ్చింది. అది శాసించబడగానే వంగభాష, బిహారీభాష, ఒరియా, హిందీ భాష మొదలైన భాషలు వచ్చాయి. అలాగే తెనుగును శాసించకండి. అప్పుడే రెండురకాల భాషలు__గ్రాంథికం, వ్యావహారికం వచ్చాయి. ఈ రెంటికి గట్టులు దూరం అవుతున్నాయి. ఏలాగో వంతెన

కట్టాము. ఇక కట్టలేనంతదూరం అయితే ఇంకో కొత్తభాష తయారవుతుంది. ఆ భాష సంస్కృతంలా నిధి కావచ్చును అనుకుంటారేమో. ఆ అదృష్టం సంస్కృతం దివ్యభాష గనుక దానికి పట్టింది. కాని ప్రతిదానికీ పట్టదు.'

ఈ రీతిగా మాట్లాడినాడు.

వ్యావహారికమును కావ్యభాష యనినారు. కాదు వచనకావ్యములు వ్యావహారికములోననే యుండవలెనని మరికొందరు వాదించిరి. కావ్యలక్షణాలు ఉండవలెను. కాని, భాష ఉపాధి. అదియును కావ్యానికి ముఖ్యాంగము కాబట్టి ఏ భాషనైనా ఉపయోగించవచ్చునని, అది కావ్యములో లీనమైపోవలెనని తీర్మానము జయమందినది. నారాయణరావు చిత్రకళను గురించి మాట్లాడినాడు చిత్రకళా మహాసభలో.

'కళ ఆనందస్వరూపం. ఒక వ్యక్తిలో జనించిన ఆనందం కళాస్వరూపంతో వ్యక్తం అవును. ఆ వ్యక్తమైన కళ సూచనమాత్రం కాక , సంపూర్ణముగా ఆనందమును వ్యక్తీకరించాలి. ఆనందం ఎలా కలుగుతుంది? సృష్టి మనదృష్టి పథములోనికి వచ్చినప్పుడు అనగా సృష్టిలో శ్రుతిపూర్ణమగు విషయం నీ దృష్టిపథాన్ని పడినప్పుడు నీకు ఆనందం కలుగుతుంది. దివ్యమై పరబ్రహ్మ స్వరూపమైనది ఆది శ్రుతి. ఆ శ్రుతి ప్రకృతిలో అనేకరకములగు శ్రుతులుగా వ్యక్తమవుతుంది. రంగులు రంగుల కలయిక, స్వరములు వాని కలయిక, వస్తువులు వాని కలయిక, పరిమళాలు వాని కలయిక, రేఖలూ వాని కలయిక, హృదయములు, జీవితములు, మనస్సులు, చరిత్రలు వీని కలయికలు, ఆత్మలు వాని కలయిక ఇవి శ్రుతిస్వరూపాలవుతవి.

'ప్రపంచంలో వ్యక్తుల జీవితాలు భిన్న భిన్న శ్రుతులతో ఉంటవి. ఎవని శ్రుతినిబట్టి వానికి తగిన ఆనందం కలుగుతుంది.'

'ఆ ఆనందం వ్యక్తీకరించే శక్తి పూర్వకర్మ సముపార్జితం. అలా వ్యక్తీకరించలేనివాడు ఆ వ్యక్తీకరణము గోచరించినప్పు డానందిస్తాడు.'

'వ్యక్తీకరించగలవాడు స్రష్ట. అట్టి కళాసృష్టిని చూచి ఆనందించువాడు కళాభిజ్ఞుడు.'

'సంగీతహృదయంగల వ్యక్తి ఒక చిన్న సెలయేటి పతనంలో సంగీతం విన్నాడు అనుకోండి. అతని హృదయంలో ఆనందం పుట్టింది. ప్రశ్రవణగానసదృశమగు పాట రచించినాడతడు. అది విని మన మానందిస్తాము.'

'ఒక కొండ, కొండ ప్రక్క మహానది, నీలాకాశం, సాయంత్రపు బంతి రంగు మేఘాలు ఒక చిత్రకారుడు చూసినాడనుకోండి. అతనికి ఆనందం కలుగుతుంది. ఆ ఆనందం ఒక కొండను, మహానదిని, మేఘాలను చిత్రించి వ్యక్తీకరిస్తాడు. ప్రకృతిలో అపశ్రుతిభూయిష్టములైనవానిని చెట్లులు, చేమలు ఏమన్నాసరే ఉంటే పరిహరించి ఎక్కడైన రేఖలరాగంలో సంపూర్ణత లేకపోతే, ఏ చెట్టో, పుట్టో, పడవో సరియైన స్థలములో కల్పించి చిత్రంచేస్తాడు, అది చూచి ఆనందిస్తాము.

'కవీ అంతే.

'మనము ప్రకృతిని చూసి అనుకరిస్తున్నామనుకున్నారేమో! కాదు. ప్రకృతిదృశ్యం చూసినప్పుడు ఆనందం పొంది, ఆ ఆనందం శ్రుతిలోఉంచి, అట్టి శ్రుతులు నాలిగింటిని కలియజేసి, ఒక చిత్రం సృజింపవచ్చును.'

'కళావిషయం ఇది ప్రకృతియేనా అని భ్రమింపజేసేదికూడా కావచ్చును. కుక్క కూత నేను కూశాననుకోండి, మీరంతా సంతోషిస్తారు. కాని ఆ ఆనందం చాలా హీనమైనది. కుక్క కూతలోంచీ అపశ్రుతి తీసివేసి శ్రుతియుక్తం చేసి గానకళకు చేర్చవచ్చును. అపశ్రుతి తీసివేయడం, ప్రకృతిలో దొరికిన కొవ్వురాయి అగు వజ్రమును సానబెట్టి తళ తళ మెరయు రత్నమును చేయుటవంటిది.'

ఈ రీతిగా నారాయణరావు గంభీరోపన్యాసము గావించెను. ఆనందము నాలుగు రకములుగ నుండునట. భౌతికము, మానసికము, హృదయజనకము, పారలౌకికము, చక్కని బాలికను పొంకములగు నవయవములతో, దిసమొలతో రచించినచో శరీరానందము కలుగునట. లతలు, పండ్లు అలంకారములుగా చిత్రించినచో వాని యద్భుతమునకు మనస్సు సంతోషించుననియు, అట్టిదే స్వరకల్పనయనియు అతడు వచించినాడు. కరుణ, భయానకము, విషాదము మొదలగు రసము లుప్పతిల్లు చిత్రవిషయములు హృదయమును కలంచును. భగవంతుడు, మహాత్ములు, అవతారముల చరిత్రలు, ఉత్తమచరిత్రలు, గాథలు, సాంఖ్యము, కర్మయోగము, భక్తియోగము మొదలగునవి పారలౌకికములు ఆత్మానందము నిచ్చునని నారాయణరా వనెను.

౨౦

క్లిష్ట సమస్య

సభలన్నియు పూర్తియైనవి. కార్యక్రమ మంతయు సర్వోచ్చముగ జరిగినదనియు, చిత్రకళాప్రదర్శనము, కవులకూటమి, బొబ్బిలికథ, భాగవతము, తోలుబొమ్మలు, నాటకము లుత్కృష్టములై యున్నవనియు ఆంధ్ర, హిందూ, స్వరాజ్య, భారతి మొదలగు పత్రిక లన్నియు వాకొన్నవి.

చిత్రపటములలో అత్యుత్తమచిత్రమునకొకటి, పౌరాణిక చిత్రములలో నుత్తమమగుదాని కొకటి, మానవజీవిత విషయములు రచించిన చిత్రములలో నుత్తమమున కొకటి, మొత్తము మూడు బహుమానములు, రెండువందలు, నూరు, నూరురూపాయల చొప్పున నిచ్చినారు. ఆంధ్రనారీమణులలో నుత్తమచిత్రము వేసినవారి కొకబహుమతి నూరు రూపాయలు, ఆంధ్ర చిత్రకారకులలో నుత్తమ చిత్రకారులకు రెండు బహుమతులు నూరురూప్యముల చొప్పున నిచ్చిరి.

ఆ యేడు ప్రచురింపబడిన నవీనగ్రంథములలోను నుత్తమ గ్రంథమునకు ఐదునూర్ల రూపాయలు బహుమతి నిచ్చినారు.

ఉత్తమ కథానికమునకు రెండువందలు, ఉత్తమ పద్యకావ్యమునకు రెండువందలు, ఉత్తమ గీతికా కావ్యమునకు రెండువందల రూపికలు బహుమతుల నిచ్చినారు. రెండవ తరగతి బహుమతులుగా వెండి పెట్టెలు, బంగారుపతకాలు, వెండిగిన్నెలు అయిదువందల రూపికల ఖరీదుగలవి అర్పించినారు.

నవీనకవుల ఛాయాచిత్రములు, వారి వారి కవిత్వములలో నొక్కొక్క పాటతోగాని పద్యముతో గాని చేర్చి ఒక గ్రంథము ప్రచురించుటకు నారాయణరా వేర్పాటుచేసెను.

నాటకమునకు పంతొమ్మిదివందల రూపాయలు వచ్చినవి. భోజనమునకు, ఫలహారములకు నారువందలైనవి. అద్దెలకు మూడువందలు. అచ్చులకు నూటయేబది, దండలు ఛాయాచిత్రములకు నూటయేబది రూపాయలు, భాగవతులకు,

తోలుబొమ్మలవారికి, బొబ్బిలిపాటవారికి, రానుపోను ఖర్చులకు, బహుమతులకు నాలుగువందలైనవి. మొత్తము చిల్లర ఖర్చులతో నాలుగువేలు సమావేశమునకు ఖర్చయినది. నారాయణరావునకు కొందరికవుల రానుపోను ఖర్చులతో చేతి సొమ్ము మూడువందలైనది. ప్రదర్శనమునకు రెండువందల పాతికరూపాయలు వచ్చినవి. మొత్తముమీద సొమ్ము మిగులలేదు. కాని ఇట్టి ఉత్కృష్టమైన సభా కార్యక్రమము ఎప్పుడు నెక్కడ జరుగలేదని లోకమంతయు ననుకొన్నారు.

నారాయణరా వేదో యొకపని కల్పించుకొని తనహృదయమును గలంచుచున్న వేదన మఱచిపోవ యత్నించుచుండెను. తన మామగారు మొన్న వచ్చి క్రిస్టమసుకు శారదను కొత్తపేట పంపవలయునని సుబ్బారాయుడుగారు వ్రాసినట్లును, దానట్లు బంపుటకు నిశ్చయించుకొంటిననియు దెలిపినారు. శారదను కొత్తపేట నుండి తాను చెన్నపురి తీసికొనిరావలయునట. ఆమె పరీక్షకు వెళుచుండుటచే దా నామెకు పాఠములు బోధింపవలయునట. ఆమె మదరసులో జదివి రాజమహేంద్రవరములో జరుగు పరీక్షకు 1929 మార్చి నెలలో వెడలునట, తన మామగారు తీసికొనివెళ్లుదురట.

ఆమెతో నెట్లు తాను కలిసియుండుట? పులిమీద పుట్ర యనునట్లామెకు గురువై బోధించుటా? ఇంతకు నా బాలిక యొప్పుకొనునా? తండ్రి మాట యన్న తప్పదు గాబోలు. ఆమెయే తల్లితోడ జెప్పి యీ మార్గ మేర్పరచినదేమో? అంత యదృష్టమా! ఇది మామగారి యాలోచనయే యగును. తప్పదు. తమ యిద్దరి వైఖరియు దెలిసి యిట్లాచరించలేదుగదా? తనపై నింత ప్రేమ యేలనో మామగారికి? ఆయన అమృతమూర్తి. దివ్య సౌందర్యగాత్రయగు నా బాలిక యిట్లాచరించినదేమి? ఆమె దుష్ట హృదయ కాలేదుగద! ఛీ! తానెంత దుర్మార్గుడో! పవిత్రచరిత్ర లగు భారత నారీమణులలో నొకరితనైన తుచ్ఛుడగు పురుషు డనుమానింపదగడు. తన యంతరాత్మ యా బాలిక పవిత్రచరిత్ర యని పాటలు పాడుకొన్నదే. పోనిమ్ము, తన ప్రేమ యంత గంభీరమై, నిర్మలమై ప్రవహించుచుండ తన చిన్నారిభార్య, తన ప్రేమమందిర పూజాపీఠస్థదేవి తన్ను తిరిగి ప్రేమింపదా?

ఆ బాలికను బ్రేమచే ముంచివైచి, ఆమెకు దన హృదయకమలమున కమలాబాల నొనర్చుకొనవలయును.

ఆమె హృదయం నొవ్వకుండా సంచరింపగలనా? మేమిద్దరమూ ఇచ్చుట ఈ సముద్రం ఒడ్డున ఉండిపోగలమా!

‘నీకు నాకూ జోడు అయితే
మల్లెపూల తెప్పగట్టి
తెప్పమీద తేలిపోదం పదరా’

అన్నట్లు మా దివ్య ప్రణయాన్ని తెప్పగట్టి తేలిపోలేమా?’ అతని కన్నుల నీరు తిరిగినది.

తన ప్రేమ మవ్యాజమేనా యని నారాయణరావు హృదయములో బ్రశ్నించుకొన్నాడు. ప్రేమలేని పశువుకన్న తుచ్ఛకామియగు మానవుడు మేలని వివేకానందు డనినాడే! కళంకపూర్ణమగు బ్రేమనైన నెరిగిన వ్యక్తియే, ఏనాటికైన భక్తి నెరుంగ గలడని గదా వివేకానందమహర్షి యనినది.

కావున సకామమగు ప్రేమయు యుక్తమేనని యర్థమిచ్చునుగద. తుదకివి యన్నియు నీశ్వరప్రేమగా పరిణమించి చరితార్థములగునని నారాయణుడు భావించుకొన్నాడు.

భార్య యెట్లును తనతో సంసారమున కిచ్చగించుటలేదుగదా! అవకాశము దొరికినందుకు తా నీ సమయముననే యన్నియు వదలి యే హృషీకేశము నకో, యే హిమాలయ నగశ్రేణికో పోయి, యచ్చట గురుమహారాజును వెదకి జ్ఞానవిద్య నేర్చికొని యేల తపస్సు చేయకూడదు? ఏనాటికైన ఏజన్మమునకైన నా మార్గమునే వెదుకవలయునుగదా? క్షణికమై, యనిత్యమైన యీ నీచపుం బ్రతుకు ఏల వదలలేము? రాళ్లను గాలికన్న తేలికచేసి యాకాశమున కెగుర వేయుట యెట్టిదో యీ జన్మమును దరింపజేయు ప్రయత్నమట్టిది. తానంతటి యదృష్టవంతుడా? ఛీ! తన దురదృష్టపు జీవితమునకు వెలుగు పొడచూపు మార్గము గోచరించినను దాని ననుసరించు ధైర్యము చాలకున్నదే! రామచంద్రా! భక్తపరాయణా! నీదే భారము.

ఇంతలో పరమేశ్వరమూర్తి యచ్చటకు వచ్చినాడు. వారిరువురు సముద్ర తీరమున గలిసికొనవలెనను సంకేత మేర్పరచుకొన్నప్పుడు, యువతీ కళాశాల కెదురుగ కలసికొందురు. రాజారావు అమలాపురం వెడలిపోయినాడు. పరమేశ్వరమూర్తి భార్య రుక్మిణి క్షేమముగ నున్నది. ఏది యెట్లయినను మంచిదని యామెకు సంపూర్ణారోగ్యము కలుగువరకు దనయింట నుండవలెననియు, పరమేశ్వరుడు తనయింట భోజనము చేయవలెననియు నారాయణరావు మిత్రుని బలవంతముజేసెను.

‘పర! జనవరి నుంచి శారదను గొనివచ్చి కాపురం పెడుతున్నాను.’

‘మంచిది మంచిది! చేయి యేది? నాకు సంతోషముగా ఉందిరా?’

నారాయణరావు శారదను బ్రేమించుచున్నంత గాఢముగ నారాయణు నామె ప్రేమించుట లేదనియు, తనమిత్రు డందులకై మిక్కుటముగ బాధ ననుభవించుచున్నాడనియు బరమేశ్వరుడు గ్రహించినాడు. తానుమాత్రము రుక్మిణి తన్ను ప్రేమించినంత దా నామెను ప్రేమించుచున్నాడా? పరమేశ్వరుడు తాను నిర్మలుడనని చెప్పలేడు. మనసెప్పుడును బంకిలమగుచుండును. కొంచె మందమయిన వనిత కనబడినప్పుడెల్ల పరమేశ్వరుడు విచారముపొందును. ఆమెను భావనాలోకమున వివస్త్రజేసి యవయవములన్నియు మనోనేత్రముచే బరీక్షించుకొనును. ఆతడు శిల్పి.

రుక్మిణి కురూపి కానేకాదు, దివ్యసౌందర్యవతియు గాదు. ఒక్కొక్కప్పు డామె సౌందర్యము ఉత్తమముగ గన్పట్టును. భర్త కిసుమంత కోపము రానీయదు. సంసారము చేయుటలో కొద్దిలో కొండలు చూపగలదు. ఆమె పొదుపరి. కాని యనవసరమగు ఖర్చు చేయకుండుటలోనే యా పొదుపు. భర్త తెచ్చిన ధనములో షడ్రసోపేతమగు భోజనము, గృహాలంకారములు పోను ధనము మిగిల్చి, భర్త స్వంతఖర్చులకు బదిరూపాయలు నెలకిచ్చి, నెలకు బది, పదిహేను సేవింగ్సు బ్యాంకిలో ధనము నిలువచేయును.

భార్య యెదుట నున్నచో బరమేశ్వరుని కామెయే మనోజ్ఞానమూర్తి వలె గోచరించును. పరమేశ్వరు మోహము మహాలక్షుభిత సముద్రము వంటిది. అప్పు డాతని భార్య ఆనందములలో గరిగిపోయి యాతనిలో నైక్యమైపోవును.

రుక్మిణికి, సూర్యకాంతమునకు బ్రాణస్నేహము కుదిరినది.

‘వదినా! నీకు చిన్న పాపాయి పుట్టినప్పుడు నన్ను రోజూ యెత్తుకో నిస్తావా? నేనేమో నీళ్లుపోస్తా! ఉగ్గు పెట్టడం నా చేత కాదు. అక్కయ్యల పిల్లలని నేనే ఎప్పుడూ ఆడించేది. పరమేశ్వరం అన్నయ్యకీ, మా చిన్నన్నయ్యకీ చంటిబిడ్డలన్న అంత ప్రేమ యేమిటి వదినా?’

రుక్మిణికి రాబోవు ఆనందస్మృతి గన్నీరై ప్రవహింప, మోము ప్రఫుల్లమై వెలుగ, సూర్యకాంతమును దన హృదయమునకు హత్తుకొని యా బాల నుదురు ముద్దిడుకొన్నది.

పరమేశ్వరమూర్తి తన చుట్టములలో నిరువురు యువతులతో గొంచె మనుమానముపడవలసినరీతి సంచరించినట్లు తన భార్యకు తోచినది. అప్పుడు రుక్మిణి పడిన బాధ వర్ణనాతీతము. పరమేశ్వరు డది గ్రహించినాడు. భార్య కడకు బోయి యామె పాదములపై దన మోమునుంచి కన్నీటిచే వానిని దడిపినాడు.

నిజముగ నొక బాలికతో నాతడు రెండు మూడుసారులు ఆవేశపూర్ణము, భయంకరము నగుకలయిక ననుభవించి యథోలోకమున బడినాడు. ఆమెభర్త మోటువాడు. ఆ బాలిక భర్తయెడ హృదయమున నసహ్యాంచుకొనుచుండియు, తెచ్చి పెట్టుకొనిన హాసముచే మోము వైవర్ణ్యము చెంద, నాతనితో కాపురము చేయుచున్నది. చిన్నతనమునుండియు బరమేశ్వరుని ప్రేమించినది. ఆమెయే పరమేశ్వరునిపై దనకు తమియున్నదని భావము ప్రకటనజేయుచుండినది. ఆ బాల చక్కని యవయవస్ఫుటత్వము కలిగి, యందముగ నుండును. పరమేశ్వరుడు పంకిలజీవితుడైనా డామెతో.

పరమేశ్వరుడు సంపూర్ణముగ నథోలోకవాసి కాకుండ నాతని రక్షించునది సౌందర్యపిపాసాపూర్ణమగు నాతని హృదయమే! అందమయిన వనిత కానిచో నాతనికి మనస్సు చలింపదు. ఆ వనిత చుట్టునున్న విషయములు నందమైనవి కావలెను. భావము నైన అపశ్రుతి కానరాగూడదు. కావుననేయాతడు ఒక్కబాలతో మాత్రము భౌతికానంద మనుభవించినాడు. ఆ సంతోషము పంకిలమైనదను అపశ్రుతియే ఆతని గలంచివేయ నచ్చటనుండి పరనారీసాంగత్యము సంపూర్ణముగ మానినాడు.

రోహిణీదేవితో నాతడు స్నేహము చేయుటకు వీలుకలిగినప్పు డా బాలికకు దనహృదయము సమర్పించుకొన్నాడు. రోహిణీదేవియు బరమేశ్వరు డన్న హృదయాంతరమున గలగిపోవునది. అతనిమాట లామెకు మైమరపు కలిగించును, హృదయములో మధురిమలు ప్రవహించును. అతని కోర్కెయు నామె కవగతమైనది. ఆమె భయమును జెందినది, పరవశయునైనది. ఇట్టి యశోవంతు డాతని ప్రేమనంతయు దన పాదములకడ ధారపోయుచున్నాడన్న మోద మామెను గరగించివేసినది. వీలయినప్పుడెల్ల నాతని నొంటిగా గలసికొనునది. అక్కగారు వైద్యవిద్యాలయమునకో, వైద్యశాలకో పోయినప్పుడు తన స్నేహితుడగు నారాయణరావు రాకుండ పరమేశ్వరుడొక్కడే వచ్చువాడు.

కాని రోహిణి ధర్మహృదయ. ఆతడు వివాహితుడు. భార్యతో సుఖముగ గాపురము సేయుచున్నాడు. తా నవివాహిత. కావున పరమేశ్వరుని గీతదాటి రానివ్వకూడదని దృఢనిశ్చయయై యానాటి నుండి నిర్మలమగు ధైర్యముతో నాతని ప్రేమయు పూజను గైకొని యానందించునది. అట్టి ప్రేమను పెరగనిచ్చినచో తా మిరువురుకూడ గీచుకున్న గీతలుదాటి, పరవశులై ఐక్యమే పోవలసివచ్చునేమో యన్న భయ మామెకు గలుగలేదు.

పరమేశ్వరునకు నామె యభిప్రాయము తెలిసి, యతిజాగ్రత్తగనే యుండెను, ఆశాప్రవాహములోనికి దా నతివేగమున లాగికొనిపోబడుచున్నాడనని యాతడు గ్రహింపలేదు.

ఇష్టాగోష్టి

నారాయణరావు, పరమేశ్వరమూర్తి, శ్యామసుందరీదేవి, రోహిణీదేవి కవులకూటమినిగూర్చి సముద్రపుటొడ్డున మాట్లాడుకొన్నారు.

ఇప్పుడిప్పుడు వచ్చు యువకవులలో నింకను స్వాతంత్ర్యము జూపువారున్నారు. మొత్తముమీద ఆంధ్రప్రదేశంలోని నేటి కవిత్వము ప్రేమతోనిండి నీరసత్వములోనికి దిగినదని యొక కళాభిజ్ఞుడు భారతిలో వరుసగా నాలుగు వ్యాసములు వ్రాసి యువకవుల నందరిని యెత్తిపొడిచినాడు. వేషములో నాడుతనము కనబడినట్టు కవిత్వములోను ఆడుతనమే కనబడుచున్నదట ఆయనకు. మొన్న జరిగిన కవుల కూటమివంటివి జరుగవలెననియే యభిప్రాయమట. కాని యీ యువకవులు తమచుట్టు వేనకువేలు విషయములుండ నీ సృష్టిలో నాడుదియు మగవాడును దక్క నింకేమియు లేనట్లు కవిత్వము వ్రాయుట ఉపజ్ఞాశూన్యతను బ్రకటించుచున్నదని యాయన వాదించినాడు.

నారాయణరావు ఆ కళాభిజ్ఞునితో నేకీభవించలేక పోయినాడు.

పరమేశ్వరు డా వాదమును ఖండించినాడు. 'ప్రేమ యుత్కృష్టమగు విషయము. నీ ప్రియభామినిపై జూపించు ప్రేమ యీ జన్మలోనో మరికొన్ని వేల జన్మాలకో భగవంతునిపై ప్రేమగా మారుతుంది. లీలాశుకుడు చింతామణిపై ప్రేమచే మహాభక్తుడుగా మారి పరమభాగవతుడైనాడు.

నారాయణరావు శ్యామసుందరినిచూచి చిరునవ్వుతో 'చెల్లీ! సృష్టి అంతా భగవంతుని స్వరూపం కద. అలాంటిది, కరుణాది రసాలచే మానవజీవనక్షాళన మొనరింపక ప్రేమ ప్రేమయని వెఱ్ఱిపద్యములు వ్రాయుట హృదయ దౌర్బల్యసూచకం గాదూ? నీ ప్రేమ గొప్పగా ఉండాలి. వ్రాయి! రెండు మూడు మహా ప్రేమసూక్తాలు. తక్కినవి తిండిలేక మాడు బీదవాళ్ళను గూర్చి, బానిసలకన్న అథమాథములుగ నున్న మాలవాళ్ళను గూర్చి మనుసులు కరిగేటట్లు కవిత్వం రచించు. మానవలోకాన్ని ఈశ్వరాభిముఖం చేసేదే కవిత్వం' అని వాదించినాడు.

శ్యామసుందరి వారిరువురకు చక్కగ సమాధానము కుదిర్చినది. 'ప్రేమ ప్రపంచములోని మహోత్తమ విషయం. అది ప్రాపంచికత్వానికి ఉత్తమ విషయం అయినట్లు కావ్యవిషయంలోనూ మహోత్తమము. తక్కినవి జీవితంలో స్త్రీ పురుష సంబంధం తర్వాత వస్తాయి. కావ్యంలోనూ అంతే. ఏ విషయం వ్రాసినా కావ్యంమాత్రం అయిఉండాలి. అవునా అన్నా, అవునా పరమేశ్వర్?' అని నవ్వినది. నారాయణరావు మనస్సు సంకటపడునప్పుడెల్ల శ్యామసుందరిని కలసికొని యామెతో నన్నివిషయముల జర్చించుచు నానందమునొందును.

ఆడువారికి మగవారికి పవిత్రమగు స్నేహముండుట సహజమనియు, దానిని మనము అసహజమగు మన బ్రతుకులచే పంకిలమొనరించుకొనుచున్నామనియు, కావుననే నేడు పురుషులకును వనితలకును ప్రవిత్రస్నేహ ముండుటకు వీలులేకుండ నున్నదనియు నాతడు పరమేశ్వరునితో ననినాడు.

రష్యా దేశపు స్థితినిగూర్చి ప్రసంగము వచ్చినది. 'నిజమైన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏది అంటే బోల్షివిజమనే చెప్పాలి. ఆస్తి అందరికి సమము కావింపబడవలె. అంటే ఆస్తి అంతయు ప్రభుత్వముది. ప్రజలు తమతమ విధులు నిర్వర్తించాలి. వారి వారి పనులనుబట్టి జీతము టిక్కెట్ల రూపమున ఇవ్వాలి. ఆ టిక్కెట్లనుబట్టి నీకు కావలసిన

వస్తువును తెచ్చుకొన వచ్చును. ఒకవేళ తిండి చాలదందువేమో, ప్రతిమానవునకు భోజనాదికముల మితి యేర్పరచవచ్చు' నని నారాయణరా వన్నాడు.

పర: మనయంతటి మనము ఉత్సాహము పుట్టి పనిచేయలేముగా! మనకు వచ్చే లబ్ధి భోజనముమాత్రమే. అంటే గొప్పగొప్ప కార్యములు చేయడానికి ప్రచోదనం ఏదీ?

నారా: ఎందుకు కలగదురా? ఏమమ్మా చెల్లీ! నువ్వు చెప్పు, ఈమధ్య బోల్షివిజము పుస్తకాలు చాలా చదివావు.

శ్యామ: ఉత్కృష్టకార్యాలు చేసేవాళ్ళకు ఎక్కువ టిక్కెట్లు ఇస్తారు. పైగా ధనపూర్ణమైన ఇంగ్లండు మొదలైన దేశాలలో కూడా గొప్పగొప్ప శాస్త్రజ్ఞులు అద్భుతములు కనిపెట్టారంటే డబ్బుకోసమా? ఆ ఉత్సాహం వారిలో సహజం కాబట్టిన్నీ, పేరుకోసమున్నూ. ఇప్పుడు రష్యాదేశానికి ఏమన్నా లోటు ఉన్నదా?.

నారా: బాగున్నదమ్మా.

పర: కాని శ్యామచెల్లీ! ఒకటి ఆలోచించు. ఏనాటికైనా బోల్షివిజము చనిపోతుందిసుమా. ఎవడిబాగు వాడు విచారించుకోవడమే మానవస్వభావం. కాబట్టి, నెమ్మది నెమ్మదిగా ధనం రహస్యంగా పోగుచేసుకుంటాడు. ఇప్పటికి రష్యాలో ఎన్ని కేసు లల్లాంటివి చూడడం లేదు?

శ్యామ: అదికాదు; ఒక వేళ ఆ గుణం సహజం అనుకున్నా, దేశంలో ఉన్న ఆస్తిఅంతా కలేసి పంచుకోడం మంచిది.

నారా: జాయింటు కుటుంబమల్లె.

పర: అబ్బా లాయరు! ప్రపంచం అంతా జాయింటు కుటుంబం చేస్తావా! బోల్షివిజము ఏ దేశానికి ఆ దేశానికే ఉంటే చాలా? లోకమంతా ఒక్కటే రాజ్యం చేయాలా? శ్యామ: ప్రపంచం అంతా కలిసే ఉండాలనిగా లెనిను, స్టాలిను, ట్రాట్స్కీ మొదలగు వాళ్లు వాదించేది. ఉన్న ధనమంతా పోగుచేసి జనాభాని బట్టి దేశాలు పంచుకోవడం, ఏ దేశంలో ఏ పంట ఎంత పండునో లెక్కలు వేయడం, ప్రపంచానికి కావలసినంత పంటమాత్రం పండించడం, అది దేశాలన్నీ పంచుకోడం. ప్రతీపంటా అంతే! అలాగే బంగారు మొదలగు లోహాలు. ఆ లోహాలన్నీ శాస్త్రవృద్ధికోసం. నాణేలు అవసరంలేదుగా! ప్రపంచం అంతా కలిసి అంగారకుడిదగ్గరకు వెళ్ళుటకు ప్రయత్నం మొదలైనవి చేయవచ్చును. ఈలాగే సర్వశాస్త్రజ్ఞానమూ వృద్ధి చేయాలి.

నారా: లేదూ, భగవంతునిగూర్చి తెలిసికొనుట కన్నిజాతులకు సౌకర్యము కలుగజేయవచ్చును.

పర: ఓహో మీ యిద్దరి స్వప్నమూ చాలా బాగుంది. అయితే, తెల్లవాడు నల్లవాడిని దగ్గరకు రానిస్తాడా? పచ్చవాడికి పచ్చవాడిపచ్చ కిట్టదు. చీనాకు, జపానుకు యుద్ధం రాదంటారా!

శ్యామ: అన్నా, అదేమిటి మీ వాదం! వినండి. ప్రపంచమంతా బోల్షివిజం వ్యాపించడానికి కొన్ని యుగాలు కావచ్చును. ధనంఉన్న షాహుకార్లకు శక్తి ఉన్నంత కాలం రాజ్యాలు వదలరు. కాని ప్రపంచంలో ఎక్కువ సంఖ్య ఎవరు? కూలి నాలి

చేసుకునేవారేకదా? బీదవాళ్ళగువారు తలచుకుంటే ఏమి చేస్తారు షాహుకార్లు?

రోహిణి: మనదేశం ముప్పదిమూడుకోట్లు ఏమి చేస్తున్నాము తుపాకీ ముందర?

శ్యామ: ప్రపంచంలో తుపాకీ పట్టుకునే వాళ్లంతా బీదవాళ్ళేగా! రష్యాలో వాళ్ళు తిరగబడితేనేగా షాహుకార్లయొక్కయు, ప్రభువులయొక్కయు రాజ్యం కూలబడింది?

పర: ధనం యొక్క ఉత్కృష్టత ఏమిటో చెపుతా విను. ధనవంతుడు తన ధనసంపాదన ప్రయత్నంలో దేశానికి అనేక లాభాలను సమకూరుస్తాడు. దానివల్ల లోకానికి కావలసిన వస్తువులన్నీ తయారవుతాయి. అమెరికాలో, ఇంగ్లండులో, జర్మనీలో, ఫ్రాంసులో అంతే! ఇనుపచక్రవర్తులు, కిరసనాయిలు సార్వభౌములు, బిస్కట్ల మహారాజులు, మోటారు రాజాధిరాజులు వగైరా వగైరా! వీరంతా ఉండడముచేత దేశదేశాలకు ఆ వస్తువులు సరఫరా అవుతున్నవి.

శ్యామ: అన్నా , నువ్వు చెప్పే వాదనలో అన్నీ దోషాలే.

నారా: 1919 సంవత్సరంలో యూరపుఖండంలో మహాయుద్ధం ఆఖరయింది. ప్రపంచం అంతా విప్లవం వచ్చేటట్లు కనబడింది. కాని అమెరికా వాళ్ళు బంగారం పట్టుకువచ్చి యూరపు అంతా వెదజల్లినారు. దానితో యుద్ధంవల్ల అలిసిన ప్రజలంతా, ‘బాగుంది! మనస్థితి బాగుంది’ అని సంతో షించుకున్నారు. తాత్కాలికంగా కనబడిన ఆ పరిస్థితులకు పునాది యేది? అమెరికా అప్పుయివ్వడం మానివేసింది. కోటీశ్వరుల కోట్లు కరిగిపోయాయి. ఆ కరగడం మహావేగంతో జరుగుతోంది. వర్తకాలు హుళక్కి అవడం మొదలుపెట్టాయి. ఇంక వచ్చేది ఏముంది? ప్రపంచంలో ఉన్న షాహుకార్లందరికీ దివాలా వచ్చేటట్టు ఉంది.

‘సరే, కూలివారు పైకివచ్చి రాజ్యాలు ఆక్రమిద్దాము అనుకున్నారు, ఇటలీ, జర్మనీ, ఇంగ్లాండుదేశాలలో. కాని ఇంక ఎక్కడా కూలివారిలో కట్టులేదు. కూలీలూ, సామాన్యప్రజలూ లేవడం చూచారు. ధనవంతులు హడలిపోయారు. కోటీశ్వరుడు దగ్గరనుంచి కొద్దో గొప్పో కలవాళ్ళంతా భాయి భాయి అని ఏకమయ్యారు. ఫాసిజమ్ అని కట్టుకట్టి ఒక సర్వాధికారితో రాజ్యం ఏర్పరిచారు. దానికి జాతీయ సాంఘికవాదమన్నారు. ఇక ముందు అన్ని రాజ్యాలు అల్లాగే అవుతాయి.’

‘అసలు ప్రపంచానికి వచ్చిన చిక్కేమిటో చూడు, కావలసినంత తిండి తయారు అవుతోంది. అంతా పంచితే అందరికీ పూర్తిగా ఆకలి తీరుతుంది. కాని ఎన్నికోట్లమంది ప్రజలు మలమల మాడిపోవుటలేదు? ఏమిటీ ఆలోటు? తయారైన పదార్థాలని పంచేమార్గం సరిగా లేదు. ధనికవర్గం ఆ పని యేనాటికీ చేయలేదు.’

శ్యామ: పనిలేని కూలీ లెన్నికోట్లున్నారు వివిధదేశాల్లో? ఎలాగు వీరందరికీ తిండి పెట్టడం?

రోహి: మన ఆంధ్రదేశంలో జమీందారీ రైతులపని మహా అన్యాయంగా ఉన్నది కాదూ?

పర: అవునమ్మా, ఉన్నది. అన్ని జమీందారీలు అల్లా ఉన్నవా? కొన్ని జమీలు హృదయం తరుక్కుపోయేటట్టున్నవి.

నారా: 1908 సంవత్సరమునకు పూర్వమే రైతులను బలవంతం చేసి యెక్కువ శిస్తు

ఏర్పరచుకొని ముచ్చిలికాలు వ్రాయించుకొన్నారు. కొన్ని కొన్ని చోట్ల ముప్పదిరూపాయల శిస్తు నేను ఎరుగుదును. ఎన్ని వేలమంది రైతులు దివాళాలు తీశారు? మా అత్తగారి మేనల్లుడొక జమీందారు. ఆయన జమీ ఎంత కంగాళిగా ఉండాలో అంతయిదిగా ఉన్నది. ఎంతమందో రైతులు బాకీలు చెల్లించలేక జైళ్ళలో ఉన్నారు. కొందరి భూములాఖరయ్యాయి. కొందరు దివాళాలు దాఖలు చేసినారు. చెంతనే ఉన్న రైతువారీ గ్రామాలస్థితి యింతకంటే నయం. ఈ జమీందారుల పూర్వీకుల కాలంలో శిస్తులు యింత అన్యాయముగా ఉండేవికావు.

పర: కొన్ని జమీందారీలలో, ఈనాం, మొఖాసా గ్రామాలలో (అసలు మొఖాసాదార్లు, ఈనాందార్లు మాయమైపోయారు) పంటలు పండనిరోజులలో, ధనం చిక్కువచ్చిన రోజుల్లో శిస్తుతగ్గించి పుచ్చుకోరేమి? జమీందారు రైతులకు తండ్రి. కాని తన తండ్రిత్వము తిండిత్వములోకి దింపాడు.

రోహి: కొందరు జమీందారులు రైతులంటే పడిచచ్చిపోతారు, వాళ్ళబాగే తమ బాగని చూచుకుంటున్నారు. మాతండ్రిగారి స్నేహితుడొక డున్నాడు అలాంటి ఆయన.

పర: నారాయణరావు మామగారో? ఆయన జమీ చూస్తే ముచ్చటైపోయినది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి యేబది వేలిచ్చారు. పంటపండని రైతును బాధపెట్టరు. సర్వేలు చేయించుకున్నారు. ఎప్పటికప్పుడు రైతులకు__ రైతువారీ రైతులకు ప్రభుత్వంవా రిచ్చినట్లు పట్టాలు యిచ్చారు. జమీందారీ ఉద్యోగులు లంచాలు తినకుండా నారాయణరావు మామగారు స్వయముగా ప్రజలను తనిఖీచేస్తూ ఉంటారు. ఆయనకు చేతులెత్తి మొక్కని రైతు లేడు.

శ్యామ: అవును విన్నాము. అన్నా, నారాయణరావూ! మా చిన్న వదినను ఎప్పుడూ చూపించుట? చాలా అందమైన బాలిక అని ఈ అన్నయ్య చెప్పినాడు.

పర: రేపు క్రిస్టమసుపండుగ వెళ్ళిన తర్వాత ఇక్కడికి కాపురానికి తీసుకొని వస్తున్నాడు.

రోహి: ఏమిటన్నా చెప్పావుకావు!

నారా: చెప్పుదామనుకున్నాను. సరి, పరమం చేప్పేశాడు.

ఇంతలో మంగపతిరా వచ్చుటకు వచ్చినాడు. మంగపతిరావు నారాయణరావును చూచి చిరునవ్వు నవ్విలోనికి బోయినాడు.

మంగపతిరావు గాంధీగారి అహింసావ్రతము ఆడుదాని మతమని వాదించును. శక్తి హీనులమగు మనం ఈ అహింసావ్రతంలో బడి మరింత శక్తి పోగొట్టుకొని నశించిపోవుదుమని యా బాలుని వాదన. ఏమి తెలియని కుట్టివాళ్ళు, 'సరియైన దారి చూపండి నడుస్తాం. బాంబులు తయారుచేస్తాం. రివాల్వరులు గురిచూస్తాం. యుద్ధం చేసి రాజ్యం సంపాదిస్తాం' అని వాదించారు.

'ఈ కుట్టివాండ్రు సరియైనమార్గం లేక తప్పుదారిని పడుతున్నారు. మీరటు కుట్రకేసు చూస్తూన్నాం కాదూ? శ్రీ మహాత్ముని తత్త్వం వీళ్ళకేమి తెలుసును చెల్లీ! ఈతని మనస్సు నెమ్మదిగా మార్చి వేయాలి. లేకపోతే ఓ రాత్రివేళ యెక్కడికో పారిపోతాడు. చివరకు ఉరికంబ మెక్కుటకు సిద్ధం అయిన తర్వాత ఎవళ్ళమూ ఏమీ చెయ్యలేము' అన్నాడు నారాయణరావు.

అతడు తనయింటికి బోయి బోల్షివిజము ప్రత్యక్షము చేసిన మహాచిత్రకారుని చిత్ర మొండు తన చిత్రసంపుటినుండి తీసి చూచినాడు. వేలకొలది పురుషులు, స్త్రీలు ఒడలు తెలియక రాక్షసులు చేయతగిన పనులు చేయుచున్నారు. నలిగిపోవుచున్నారు బిడ్డలు, స్త్రీలు.

మహాశక్తివలె యంత్రము దిశల నావరించియున్నది. ఇట్టి ప్రచార చిత్రమునుగూడ నెంత విచిత్రముగ చిత్రించినా డీ శిల్పి!

వర్ణములు, రేఖలు, లోతులు, బరువులు లయ సామ్యసంకలితములై మహోత్కృష్ట శ్రుతిలో లీనమైపోవుచున్నవి.

శిల్పి మహాభాగుడు. ఒక్కగీతంలో, ఒక్కరంగులో ఎన్ని సమూహాములు, ధీశాలి కందని లోతులు చిత్రించగలడు!

అత డా చిత్రము తదేకదృష్టితో జూచుచు, అటులనే నిలుచుండి పోయినాడు.

చతుర్థ భాగము

౧

భర్తయే గురువు

క్రిస్టమసు సెలవులలో నారాయణరావు తన భార్యతో చెన్నపురికి వచ్చెను.

అతడు మైలాపూరులో వెనుకటి చిన్న మేడవదలి, నెలకు నూరురూపాయ లిచ్చి పెద్దమేడ నద్దెకు పుచ్చుకొనెను. ఆ మేడచుట్టు తోటయున్నది. విశాలమైన భవనము.

పరమేశ్వరుని భార్యకు బురుడు చెన్నపురిలో బోయుట కాత డేర్పాటు చేసెను. చెన్నపురిలో కాపురము బెట్టినప్పుడే యాతడొక నియ్యోగి వంటలక్కను గుంటూరు జిల్లానుండి రప్పించుకొనెను. ఆమె యిదివరకే తూర్పుగోదావరిజిల్లాలో నధికారులకు వంటచేసినది. మంచి మనసుది. నెలకు బదునైదు రూపాయలు జీతమును, యేడాదికి నాలుగుపంచెలు నిచ్చుట కేర్పాటు చేసికొని యాత డామెను గుదిర్చెను.

శారదను క్రిస్టమసు సెలవులలో మంచిరోజుచూచి యత్తవారింటికి తీసికొనివచ్చుటకు సూర్యకాంతమును, సుబ్బారాయుడుగారును వెళ్లినారు. ఆమెకు జమీందారుగారు వెలపొడవు చీరలు, పసుపు, కుంకుమ, రెవికలు, నగలు, వెండిబిందెలు, వెండిగంగాళము, వెండిచెంబులు, వెండిగిన్నెలు, వెండిబొమ్మ సామానులు, వ్రాత బల్లలు, కుర్చీలు, సోఫాలు, పందిరిమంచము, చిన్నమంచము, పెద్ద ఉయ్యేల, యింకను నెన్నియో సామానులు సారె యిచ్చినారు. కొన్ని చెన్నపురికి గొనిపోవుటకు రాజమహేంద్రవరములోనే యుంచినారు.

లాంచిమిద, మోటారుకారులమీద వారు కొత్తపేట చేరిరి. భార్యవచ్చినప్పడు నారాయణుని హృదయము దడదడ కొట్టుకొన్నది. రాత్రి గదిలోనికి వచ్చినప్పుడాతడు కదలు హృదయముతో, కంఠాన తీపులతో, కన్నులలో వెలుగులతో భార్యవంక జూచినాడు. కాని యా బాలిక మాట్లాడలేదు.

నారాయణరావు ఉదారహృదయుడై నొసలు ముడిచి, పెదవులు బిగించి, ముక్కుపుటములు విస్ఫారితములుకాగా, తన పందిరిమంచముపై యట్లనే పరుండియుండిపోయెను.

భార్యాభర్తలు చెన్నపురి కాపురమునకు వచ్చినప్పటినుండియు ఆ బాలికను బలుకరించుట యెట్లు, ఆమెకు చదువుజెప్పుట యెట్లని యాలోచింపదొడగెను. వారమురోజులు గడచిపోయినవి. తాను చెప్పుటమాట యటుండనిచ్చి, శారద పరీక్షలో గృతార్థురాలు గావలెననియు, జెల్లెలు సూర్యకాంతము ప్రవేశపరీక్షలో గృతార్థురాలు కావలెననియు సంకల్పించి, భాస్కరమూర్తి శాస్త్రులగారివంటి యొక విద్యాశేఖరుని, హిందూ ఉన్నత పాఠశాలలో పనిచేసి పింఛను బుచ్చుకొనుచున్న బి. ఏ., ఎల్. టి. ని, నెలకు ఏబది రూపాయలు వేతనమిచ్చి చదువుచెప్పుటకు కుదిర్చినాడు.

శ్యామసుందరీదేవియు, నామె చెల్లెళ్లును నారాయణరా వింటికి జూడ వచ్చినారు. వారందరు సీమరేగు, ద్రాక్ష, దానిమ్మ, అంజూరా మొదలగు ఫలములు; జీడి, పిస్తా, బాదం మొదలగు పప్పులును; పటిక బెల్లమును, పసుపు కుంకుమమును, పట్టుచీరయు, రవికయు దీసికొనివచ్చినారు.

సూర్యకాంత మదివరకే శ్యామసుందరీదేవి యింటికి వెళ్లుచు వారితో బరమస్నేహమున మెలగుచుండెను. 'శ్యామక్కా' యని యొకసారి 'డాక్టరక్కా' యని మరియొకసారి సూర్యకాంత మామెను బిలుచుచుండును. 'అందరము యెనమం డ్రక్కచెల్లెండ్ర' మని యామె యనుచుండును. శ్యామసుందరి తల్లిని 'పిన్నీ పిన్నీ' యని పిలుచుచు ప్రాణమిచ్చు చుండునది.

నారాయణరావా నలుగు రక్కచెల్లెండ్రకు పుట్టినదినమని, పండుగలని పేరులు చెప్పి బొమ్మలు, చీరలు, రవికగుడ్డలు, వెండిసామానులు బహుమానముగ నిచ్చుచుండెను.

శారద వీరంద రెట్టిచుట్టములో యనుకొని సిగ్గుచేతను, గర్వముచేతను చాల ముభావముగ సంచరించినది. శ్యామసుందరి యది యంతయు సిగ్గనుకొని యామెతో సౌహార్ధమున మాట్లాడినది. వారందరు 'శారదవదినా! వదినా! చిట్టి వదినా! యని వివిధరీతుల బల్కరించిరి. 'మా అత్తగారు కులాసాగా ఉన్నారమ్మా, వదినగారూ?' అని నళిని యన్నది. 'ఉన్నా' రని శారద యుత్తర మిచ్చినది.

వారంద రామెను నెయ్యముమై వీడుకొని వెడలిపోయిరి.

శారదకు చెన్నపట్టణమున భర్తజీవితము విచిత్రముగ గనుపించినది. ఆతడు తెల్లవారుగట్ల దండెములు, బస్కీలు తీసి ముద్రలు తిప్పుచు శరీరవ్యాయామము చేయును. వ్యాయామము చేసిన గంట కాతడు చన్నీళ్లలో స్నానమాచరించి రెండు యిడ్లీ పుచ్చుకొని, పాలు త్రాగి, సిగరెట్టు కాల్చుకొని, ఖద్దరు దుస్తులు ధరించి కచ్చేరిహాలులోనికి బోయి యచ్చట తన యప్పీళ్ళు మొదలగునవి చదువుకొనును. మామగారు షాహుకార్ల ఖాతాలుకొన్ని యిప్పించినారు. అన్నగారు పంపించిన యప్పీళ్ళు, శ్రీనివాసరావుగారు పంపినయప్పీళ్ళు, తండ్రిగారు వచ్చునట్లుచేసిన యప్పీళ్ళు, నారాయణరావుకు పుష్కలముగ పనియున్నది. అప్పీళ్ల విషయమైవచ్చిన పార్టీలతో సంప్రదించి, యచ్చట నుండి మోటారు మీద తన గురువగు వకీలు ఇంటికి బోవును. పదింటికి ఇంటికి తిరిగివచ్చి భోజనము చేసి దుస్తుల ధరించి తిన్నగ ఉన్నత న్యాయస్థానమునకు బోవుచుండును. నారాయణరావుకీ కొలది మాసములలో నెలకు రెండువందలు వచ్చు పనులు స్వయమైన కాతాలవలన నేర్పడినవి. గురువుగా రీతనిపని చూచి మెచ్చుకొని పెద్ద వ్యాపారములలో సహాయన్యాయవాదిగా పని చేసినందుకు నూరు, నూటయేబది యిప్పించుచుండిరి.

కోర్టుపని యగుటతోడనే యింటికివచ్చి, సూర్యకాంతమున కొకగంట చదువు చెప్పును. తరువాత స్నానముచేసి దుస్తులు ధరించుటతోడనే, యెవరో యొకరు స్నేహితులు వచ్చెదరు. వారిని తీసికొనియో, తానొంటిగనో కారులో విహారమునకుబోవును. వచ్చినప్పు డాతని స్నేహితుడగు పరమేశ్వరమూర్తి కూడ నుండువాడు. ఒక్కొక్కప్పుడు సూర్యకాంతమును, శారదను విహారమునకు కారుమీద బొమ్మని తాను నడచి సముద్రపుటొడ్డునకు బోవువాడు. నడచివెళ్ళి నప్పుడుమాత్ర మతడు తిరిగివచ్చిన వెనుక మూడవసారి స్నానమాచరించువాడు.

శారద చెన్నపురికివచ్చిన పదిరోజులకు జమీందారుగారు కొమరితను జూచుటకు వచ్చిరి. శారద యత్తవారింటికి వెళ్ళునపుడు భర్త మేధాసంపన్నులగువారిలో మేధావి యనియు, నాతడే యామెకు జదువు చెప్పుననియు బోధించి పంపినాడు. కావున 'నుపాధ్యాయుని బెట్టినా వెందుకు, నీవు చెప్పిన సరిపోవునుగదా' అని జమీందారుగా రల్లుని బ్రశ్నించిరి.

'నాకు సరిగా తీరుబడిలేదు. ఉన్నప్పుడల్లా చెపుతూ ఉంటానండి.' ఆ ముక్కలనుట కాతని హృదయము తల్లడిల్లిపోయినది.

నారాయణరా వొకనాడు సూర్యకాంతముతో 'మీ వదిననుకూడ చదువుకునేందుకు రమ్మని చెప్పమ్మా' యని వచించెను. సూర్యకాంతముపోయి శారదను దీసికొనివచ్చినది.

శారద కత్తవారింటికి వచ్చుటకే యిష్టము లేక పోయినది. ఆమెకు భరింపరాని దుఃఖము వచ్చినది. తండ్రిమాట కెదురాడి యెరుగదు. తమ్ముడు కేశవచంద్రుడు 'చిన్నక్కా! నువ్వన్నా వెళ్ళి బావను దీసుకురా' యని కోరినప్ప డామెకు ఏవియో యాలోచనలు జనించి కన్నుల నీరు పొరలివచ్చినది, తల్లి కంటనీరు పెట్టుకొన్నది. మేనత్త విచారించినది. జమీందారుగారు తనయను చెంతజేర్చికొని 'తల్లీ! స్త్రీలు జన్మము నెత్తినప్పుడే భర్తయింటికై నిర్దేశింప బడ్డారుకదా! నువ్వు చదువుకొన్నదానవు. నీ కొరులు చెప్పవలెనా! వెళ్ళమ్మా, నువ్వు చెన్నపట్టణములో ఉందువుకాని. మీ మామగారితో చెప్పాను. నేను ఎప్పుడూ వస్తూ ఉంటాను. నువ్వు మార్చి ఆఖరువారంలో ఎలాగు ఇంటికి వస్తూనే ఉన్నావు. అక్కడ వాళ్ళ సూర్యకాంతము ఉండనే ఉండును. బావ సుందరరావు, అతని భార్య, పిల్లలూ వాళ్ళూ ఉంటారాయెను. అక్కయ్యను వచ్చి చూడమని వ్రాస్తున్నాను' అని బుజ్జగించినారు.

ఏనాటికయిన అత్తవారింటికి, భర్తకడకు వెళ్ళక వలనుపడదని యామెకు తెలియును. భర్తతో గాపురము తప్పుటెట్లని యామె యాలోచించుకొనలేదు. భర్త తనకడకు రాకుండ తప్పిన జాలుననియే యామె కోరిక. భర్తకడకు తాను వెళ్ళినచో నాతడు తన్ను బ్రేమించుట మొదలిడినచో దానెట్లు బ్రతుకుట? వెల్సుకవి రచించిన 'సౌహార్ద్రమగు స్నేహము' అను నవల తాను చదివినది. అందులో నాయిక తన జీవితమును ప్రేమార్పితము చేసినది. పోనీ, తా నెవరినైన అట్లు ప్రేమించుచున్నదా? జగన్మోహనరావు బావను తాను ప్రేమించుట లేదు. అది నిశ్చయము. జగన్మోహనరావు బావ తన్నతిగాఢముగ బ్రేమించు చున్నాడని తనకు దెలియును. ప్రేమయన నేమి? పురుషుని జూచినను, తలచినను అతనిలో నైక్యమైపోవ గోరుటయేకదా! తానట్లెవరినైన ప్రేమించినదా? జగన్మోహనరావు బావపట్ల మంచి స్నేహమున్నది. అతనితో గంటల కొలది మాట్లాడ మనసగును. అతడు చెంతనున్నప్పుడు తన్ను సంతోషమున ముంచివేయును. తన తల్లిదండ్రులపట్ల తమ్మునిపట్ల మాత్రము తన కట్టి భావము లేదా? అంతకు మిక్కిలి తా నేపురుషుని ప్రేమించుట లేదు.

భర్త చదువుకొనినవాడు. మోటుమనిషి కాడు. తాను జూచినంతవరకు నొరులజోలికి బోవని కరుణార్ద్రహృదయుడు. అతని జూచినవారెల్ల మెచ్చు కొనుచున్నారు. అటువంటియప్పుడు తన కిష్టముగాని ప్రేమను అతడు గోరునా?

చిన్నతనమునుండియు దన్ను పెంచిన పుష్పవనము, గోదావరిగాలి తన కింక దూరమైపోవును. తన చిన్నతమ్ముడు ఇంక తన్ను విచిత్రములగు ప్రశ్నలు వేయడు. ఈ పరిచారికలు చుట్టములు వెనుకనే యుండిపోవుదురు. ఏమిటిది! చదువుకొన్నవా రిట్టుల బెంగ పెట్టుకొననగునా?

శారద అత్తవారింటికి వెళ్ళి పదిరోజులుమాత్రమే యున్నది. ఇంతలో చెన్నపురి వెళ్ళిపోవలసివచ్చినది. భర్త మొదటితరగతి జంటసీటుల పెట్టెలో తనతో ప్రయాణము చేసెను. వారన్న నందరకు ప్రేమయే! ప్రయాణములో ఎన్నో సౌకర్యములు! తన మనస్సేమియు నొవ్వని విధాన పువ్వులలో ప్రయాణము జరిగినది.

భర్త తన్ను జదువునకు బిలిచినాడని ఆడుబిడ్డ కబురు తెచ్చుటతోడనే, యామె

హృదయము కలతనొందినది. ఆశ్చర్యమందినది. ఆమె నారాయణరావు కడకు సూర్యకాంతముతో వచ్చి మేడమీదగదిలో సూర్యకాంతము కుర్చీ ప్రక్కకుర్చీలో గూర్చుండిపోయినది. తన గంభీరమగు గొంతుకతో నారాయణరావు సర్వసౌందర్యసంపన్నయగు శారదకు పాఠములు ప్రారంభించినాడు.

ఎట్లుగడిచినదో యొక గంట, శారద పరవశురాలయిపోయినది. తన మధురకంఠముతో జ్ఞానము తేనెవాకలు కట్టునట్లు భర్త బోధించినప్పుడు శారద విభ్రాంతయైపోయి విన్నది. అంతయు జెప్పినవెనుక నాత డామెను ప్రశ్నలు వేసినాడు. మొదట చెప్పలేక డగ్గుత్తిక పడినది. కాని నెమ్మది నెమ్మదిగ భయముతీరి యన్ని ప్రశ్నలకు జవాబు చెప్పినది. 'ఇక వెళ్ళవచ్చు' నని నారాయణరావు లేచి క్రిందకు దిగి వెళ్ళిపోయినాడు. శారద యిట్టి బోధన మెన్నడువినలేదు. దూదివలె విడబరచి వెనుకకు బోవుచు ముందుకు సాగుచు పాఠమంతయూ హృదయమున హత్తిపోవునట్లు చెప్పినాడు. ఇదివరకెవ్వరును ఇంత బాగుగా చెప్పలేదు.

'చూశావా వదినా! మా అన్నయ్య ఎంత బాగా చెప్పాడో! నేను తప్పక ఈయేడు పరీక్ష నెగ్గి తీరుతాను. మీ పరీక్షలు మా పరీక్షలు ఒకమాటే.'

'ఇవాళ చాలాబాగా అర్థమయింది సూరీడూ.'

ఆరోజున శారద కేలనో హృదయము సంతోషమున పూర్ణమై, ఆమెను వివశత్వమున కదిల్చివేసినది.

నారాయణరావు తాను భార్యను ప్రేమించు చున్నట్లు కనబడకూడదు. ఇదియంతయు మామూలుతంతుగ జరిగిపోవుచున్నట్లామెకు దెలియవలెను. తన హృదయము, జీవితము ఆ బాలికపై ప్రణయముచే నిండి, జగమెల్ల నుబికి, సృష్టి నంతయు నాక్రమించుకొన్నదని యామె కెట్లుతెలియును? తెలియుటయు వలదు.

ఈ ప్రేమమహానిర్ఝరి గోచరించి భయపడినదా యీ బాలిక? ఆమెలో నేమియున్నది తన్నిట్లాకర్షించుటకు? అందమైన రూపరేఖావిలాసము లుండవచ్చును. అట్లందమయినవా రితరులు లేరో? శ్యామసుందరి సౌందర్యమున శారదకు జోడు కాగలదు. శారదకన్న సరళహృదయ, గంభీరమానస, విజ్ఞాన సంపన్నురాలు. ఆమె ప్రేమలో ముంచి వేయదలచుకొన్నచో నెవ్వరు నిలబడగలరు? అయిన నాబాల తనలో నిట్టి ప్రణయభావము జనింపజేయలేకపోయినది. ఈ శారదలో నేమున్నదో! ఆమె ఆత్మసంస్కార మెంత యున్నతమో!

శారద చెన్నపురి వచ్చిన వెనుక శ్యామసుందరిలో దీప్తి యెక్కువ అయింది. ఆ యిరువురకు దనకు నేమి సంబంధము! శారద భార్యయేమి? ఏ యదృష్టమున శారద భార్య యయినది? ఏ పూర్వపుణ్యాన శ్యామసుందరి మిత్రురాలేనది?

శ్యామసుందరి వైద్యకళాశాలనుండి వచ్చి యింటిలో నొక పడకకుర్చీపై చదికిలబడినది. ఆమెకు బరీక్షాదినములు సమీపించుచున్నవి. రేయింబవళ్ళు నిద్ర హారములు మాని యామె విద్యాదీక్షితయైనది. చదువు, చదువుమధ్య నిద్ర, నిద్రమధ్య నారాయణరావుమాత్ర మామెకు సతతము గోచరించును.

నారాయణ యన్నచో దనకింత మైత్రి యేలనో యామె కర్థముకాలేదు. నారాయణరావును దాను ప్రేమించుట లేదుకద! అయిననేమి? అట్టి మహాపురుషుని,

పూర్ణవ్యక్తిని బ్రేమించుటకన్న తన జన్మమునకు సార్థకత యేమున్నది? అతడు పరాధీనుడు; అయిన నాతని తన యంతరాంతముల బ్రేమించి యానంద పరవశయై కరిగి యాతని యాత్మాంతఃపదంబుల బ్రవహించిపోవుటకన్న తరణోపాయము లేదు. అని అనుకొనుచు ధ్యానముద్రయైనది. శ్యామసుందరి చిన్నతనమునుండియు గంభీరహృదయ. ఈశ్వరోన్ముఖ. మానవసేవ చేయవలెననియే యామె వైద్యశాలయందు చేరినది. దేశసేవచేయు శ్రీ సరోజినీదేవి, శ్రీ కస్తూరిబాయి మొదలగు వనితామతల్లులవలె దనజన్మము సేవకై యర్పణమని సంకల్పించుకొన్నది. వీలయినప్పుడెల్ల రాట్నము వడకును, చెల్లెండ్రచేత వడకించును.

ఆమె నిమీలితనేత్రయై, హృదయమున దక్షిణహస్తతల మదుముకొని, ధ్యానించుకొనుచు యా పడక కుర్చీపై నట్లే పండుకొనియున్నది.

శారదకు భర్తయే గురువైనాడు. ఆయన పాఠము చెప్పిన విధానము స్మరించుకొనుచు తన పడకగదిలో సోఫాపై మేనువాల్చి కన్ను లరమూతలుగా, ఏమేమో పుల్కరింపులు, ఏవియో మధురతరంగాలు తన్నెచ్చటికో తేల్చిపోవ, ఒంటిగా ఆమె ఆరీతీగానే పవళించియున్నది.

౨
వెట్టి తల్లి

ఇంతలో రుక్మిణికి బురుడువచ్చినది. నెలలు నిండినవని తోచుట తోడనే నారాయణరావు పరమేశ్వరమూర్తు లాలోచించుకొని రాజారావును రప్పించుకొనిరి. రాజారావు తానెరిగియున్న విద్యావంతురాలును నిపుణురాలు నగు యూరేషియను దాయి నేర్పరచినాడు. వారు చేయవలసిన విధులన్నియు నొనర్చి, శ్యామసుందరీదేవితో నవసరమయినపుడువచ్చి కనుగొనుచుండుడని చెప్పి తాను వెడలిపోయినాడు.

రుక్మిణి సుఖముగ నాడపిల్లను గన్నది. పరమేశ్వరుని మో మానంద ప్రఫులమైనది. ఈ బాలికయైన బ్రతికి బట్టకట్టిన తాను ధన్యుడే. తనకు శిశువు అన్న నెంత యానందమో యంత విషాదమును గూర్చినాడు విధి. ఈ బాలిక యైన బదికాలములు సుఖముగ బ్రతికినచో తన కంతియే చాలును.

‘ననూ పాలింపా, నడచి వచ్చితివో
నా తల్లి _ ఉమా శిశూ _ ననూ...
వనజనయన, హిమ _ గిరి తనయ జననీ
నీలశరీరద్యుతి నిండించీ విశ్వమెల్ల
ననూ పాలింప...........’

అని పాడుకొన్నాడు. బాలిక యొడలు తొనలుకట్టి యున్నదట.

‘పరమేశ్వరం, నీకూతురు మలయమారుత రాగాన్ని ఏడుస్తూ ఉన్నదిరా! మంచి సంగీతపాటకురా లయ్యేటట్లున్నది. అచ్చంగా నీ పోలికే. వెళ్ళిచూడు, నక్షత్రం మంచిది, ఏమి దోషాలు లేవు’ అని నారాయణుడన్నాడు.

శారద బాలికను జూచి కిలకిలలాడినది. ‘ఏమి బుగ్గలమ్మా నీ కూతురుకు రుక్మిణమ్మగారూ’ అని మేలమాడినది.

'నా మేనకోడలు బుగ్గలబూరెమ్మ' అని సూరీ డన్నది.

'ముష్టిపిల్ల! మంత్రసానికి డబ్బిచ్చి కొనుక్కోండి' అని వంటలక్క రామమ్మ అన్నది.

'ఒరే అబ్బాయి! దీనికి ఏం పేరు పెడతారో చాలా పెంకిపిల్లలా ఉందిరా' అని నారాయణరావును జూచి యాతని పెత్తల్లి కొమార్తె బంగారమ్మ అన్నది.

'వెట్టితల్లి' అని పేరు పెట్టండి అని రుక్మిణి అన్నది, అలసట పొందిన నవ్వుతో.

పదిరోజులు సుఖముగా గడచి పురిటినీళ్ళు పోసినారు. బాలసారెలేదు. శిశువు దినదిన ప్రవర్ధమానయై ఒళ్లు చేయుచున్నది. రోహిణీదేవి యా బాలికకు చిట్టిచొక్కాలు కుట్టుకువచ్చినది. వెండిచెంచా, పాలు పోసికొనుట కొక వెండి కొమ్ముచెంబును బహుమతి పట్టుకొనివచ్చినది.

రోహిణీదేవి వచ్చినప్పుడెల్ల రుక్మిణి హృదయమున గలత జనించునది. భర్త యా బాలికను బ్రేమించుచున్నాడని యెచ్చటనో యామెలో మారుమూల ప్రతిధ్వనించినది. రోహిణీదేవి తనకన్న యందకత్తె. రోహిణియు తన భర్తయు సర్వదా మాట్లాడుకొనుచుందురని యామెకు గర్ణాకర్ణిగ తెలిసినది. శ్యామసుందరియు నారాయణరావునుగూడ స్నేహితులని విన్నను, వారలను ఇసుమంతయు నామె యనుమానించలేదు. భర్త తన ప్రాణమును దనకు ధారపోయునని యామెకు దెలియును. అయినను భర్తహృదయమున ప్రేమ సముద్రము నిండియున్నదనియు, నయ్యది యెవ్వరిపైన నైన సులభముగ ప్రవహించి పోవుననియు నామె గ్రహించినది.

తానంత యందకత్తియ గాననియు భర్తృసంపూర్ణ ప్రేమను దాను జూరగొనజాలననియు నామెకు విదితమే. భర్త యొకటి రెండుసార్లు లెవరి తోడనో మైమరచి ప్రవర్తించినాడనియు నామె గ్రహించినది. కాని ఇదమిత్థమని తెలుపలేదు. లోలోన నొకటి రెండు వారములు కుళ్ళిపోయినది. అది పరమేశ్వరుడు చూచినాడు. తాను భార్యతో నగ్నిదేవుని యెదుట జేసిన వాగ్దానమునకు భిన్నముగ రెండుమూడుసారులు వివశుడై చరించినను ఆ వెనుక ఘోర నరకబాధ ననుభవించినాడు. అతనికి దలగొట్టినట్లయినది. ప్రపంచము నల్లబడి పోయినది. భార్య ఘోరనరక మనుభవించుచున్నదని యాతడు గ్రహించి సర్వము మరచిపోయి యా బాలిక పదములకడ బ్రణయపూజామతియై మోకరిల్లినాడు.

అయినను వారట్టుల రెండు వారములు బాధనందినారు. పరమేశ్వరమూర్తి పరితప్తచరిత్ర మాతని భోజనములో, నిద్రలేమిలో, భార్యకు దోచినది. ఎట్టకేలకు పతిప్రాణయగు ఆమె నావరించిన దుఃఖమేఘములు తొలగిపోయినవి. అప్పుడొకనాడు భర్తను జేరి యామె 'ఇక నెప్పుడు నాయెడ దోషం చేయనని ప్రతిజ్ఞ చేయండి' యని కోరినది. పరమేశ్వరుడు సర్వభూతముల సాక్షిగ నా ప్రమాణ మొనరించినాడు.

'రుక్కూ! నా హృదయము పంకిలమయినమాట నిజము. కాని నేను దుర్బలుడను. ఎప్పుడైనా ఈలాంటి గాఢనైచ్యమై వచింపరాని పాపంలో పడిపోయింది రెండుసారులే. నన్ను క్షమించమని నేను కోరను. కాని నువ్వు పవిత్రమైన చరిత్ర కలదానవు. నీకు నన్ను భర్తగా సమకూర్చిన విధే దూరవలసినవాడు. ఏమి చేయను దేవీ! నాబోటి తుచ్ఛులు ఈ ప్రపంచంలో జన్మించి తమచుట్టూ ఉన్న నిర్మలత్వానికి కళంకం తెస్తారు. స్వచ్ఛమైన నీ జీవితానికి నలుపుమచ్చను నేను.' అని కన్నుల నీరు నించుకొన్నాడు.

రుక్మిణి భర్తగారి బాధను జూచి భరించలేకపోయినది. కరుణార్ద్రహృదయయైన యామె వెల్లువయై ప్రవహించి, భర్తను చుట్టివేయుచు తన పాదాలపై మోమువంచి వాపోవు భర్తను లేవనెత్తి తన హృదయానికి జేర్చుకొన్నది. నాటినుండియు జిన్న బిడ్డలరీతి నెప్పటియ ట్లత్యంత ప్రేమతో వారు మెలగినారు.

రుక్మిణి కివియన్నియు నొకసారి సినిమాలో కథవలె గోచరించినవి. అప్పుడు మనస్సు కుదటబడ, నిట్టూర్పునించి సహజమగు మర్యాదతో భీతితో రోహిణీ, సరళా, నళినీదేవులతో మాటలాడి కొమార్తను గూర్చిన వారి మేలములకు హాసవదనయై జవాబులిచ్చినది. సూర్యకాంతము సతతము నా బాల నెత్తు కొనుటయే. 'వదినా, నా కాళ్ళమీద పడుకోబెట్టమ్మా! నువ్వు నీళ్లుపోస్తే నేను తుడుస్తాను వదినా. కోడలు నవ్వుతుందిసుమా' అని ఆమె ఆనందమున మునిగిపోవును.

రుక్మిణి: కాదమ్మా! మామయ్య ఎప్పుడు వస్తాడో? అని అత్తయ్య కనిపెట్టుకు ఉన్నదిగదా అని నవ్వినది.

సూరీ: అబ్బా! అసాధ్యురాలే నా కోడలు వదినా? తల్లిపోలికే!

రుక్మిణి: వేశావు బాణమూ?

అందరు నవ్విరి. శారద యా మాట విని యాగిపోయినది. ఆమె హృదయమునం దొక్కసారి గుబుక్కుమన్నది. తన చిన్న ఆడుబిడ్డ సూరీడునకు భర్తయన నింత ప్రేమయా! దూరముననున్న భర్తకై ఎదురుచూచుటయా? నిజమే! అప్పుడప్పుడామె యుత్తరములు వ్రాయుచుండును. సూరీడు గదిలో నామె భర్తగారి ఛాయాచిత్రమున్నది. ఆమె మెడలోని బంగారు గొలుసులో చిన్న చిత్రమున్నది. భర్తయామెకు వ్రాసిన యుత్తరములన్నియు విశాఖపట్టణపు మంచిగంధపు పెట్టెలో నుంచుకొన్నది. అవి యన్నియు మరల మరల తీసి చదువుకొనుట శారద కనిపెట్టినది.

తన యింటిలో గాపురమున్న యీ రుక్మిణీ పరమేశ్వరమూర్తులు ప్రేమచే నిండియుండుట, పరమేశ్వరమూర్తి తన భార్యతో సల్లాపములాడుచు నమిత సంతోషమున బ్రతుకుదారిని నృత్యముచేయుట ఆమె చూచినది. జమీందారుల లోనే భార్యాభర్తలు ప్రేమచే నిండియుందురనుకొను శారదకు, జమీందారుల కుటుంబములలోకన్న నితర కుటుంబములలోనే యెక్కువ ప్రేమ యుండు ననియు, జమీందారుల కుటుంబములలో ప్రేమయే లేదేమో యనియు గోచరించెను.

శారద చెన్నపురి వచ్చిన మరునాడు ఆనందరావుగారును, ఆయన భార్య ప్రమీలాదేవి గారును మోటారుపై నారాయణరావుగారి యింటికివచ్చి శారదను గుశల ప్రశ్న జేసినారు. శారదకు ప్రాణము లేచివచ్చినది. ప్రమీలాదేవి నామె బిగ్గ కౌగిలించుకొని కన్నుల నీరునించినది. శారదను దగ్గరకు దీసికొని, 'తల్లీ! నీ తండ్రిగారు చేసిన యీ దోషానికి నువ్వు అనుభవించవలసినదే' యన్నది.

చటుక్కున శారదమనస్సులో 'ఏమి యనుభవించుచున్నాను' అను ప్రశ్న స్పష్టమై పొడసూప 'అనుభవ మేమిటి' అని మందహాసమున బలికినది.

నారాయణరావు పెళ్ళియైన వెనుక నీ రెండు సంవత్సరములనుండియు నొక్కసారియైన ఆనందరావుగారి ఇంటికి భోజనమునకు వెడలలేదు. తెలుగు వారలలో బాగుగ ధనము వచ్చు న్యాయవాదులలో నానందరావుగారు ప్రథములు. అయినను

నారాయణరావును దన కచ్చేరీకి రమ్మనిగాని, భోజనమునకు రమ్మనిగాని అతడు పిలువలేదు. నారాయణరా వాయనకు గర్వమని గ్రహించినాడు. కీలుపాకులో మామగారియింటనున్నప్పుడు జమీందారుగారువచ్చినప్పుడెల్ల ఆనందరావుగారు నారాయణుని కలిసికొనుచునే యుండిరి. మేనమామను భోజనమునకు రమ్మని పిలిచినాడు గాని నారాయణుని పిలువలేదు.

జమీందారుగా రల్లునిగూడ తన మేనల్లుడు పిలుచున్నాడనే నమ్మిరి. నారాయణరా వానందరావుగారి యుదంత మిసుమంతయు మామగారికి తెలియనీయక చరించెను.

నారాయణరావు చెన్నపురికి కాపురమువచ్చినప్పుడును ఆనందరావుగారు నారాయణరావుగారి యింటికి రాలేదు. హైకోర్టులో న్యాయవాదుల సంఘ మందిరములో గలిసికొన్నప్పుడును నారాయణరావు నాతడు పల్కరించువాడు కాడు. చెన్నపురి యాంధ్ర న్యాయవాదులు, తమిళ, కన్నడ, మళయాళ న్యాయవాదులలో బెద్దవారుకూడ అతడు లక్ష్మీసుందర ప్రసాదరావుగారి యల్లుడనియు, బి. ఎల్. పరీక్షలో ప్రథముడుగా గృతార్థుడైన యువకుడనియు, భాగ్యవంతుడనియు, దెలివిగల బాలుడనియు, భారతి మున్నగు తెలుగు పత్రికలలో, త్రివేణి మొదలగు ఇంగ్లీషు మాసపత్రికలలో వ్యాసముల వ్రాయుచుండుననియు, సంగీతమున నిధియనియు, బొమ్మలు అద్భుతముగ జిత్రించుననియు దెలియగనే వారంద రాతనితో స్నేహము చేసినారు. న్యాయవాదులసంఘములో నేవిష యము చర్చకు వచ్చినను నారాయణరా వక్కడ నున్నచో నతనిని వారు సందేహము లడుగుచుండుటయు, నాతడు నిర్దుష్టముగ వానిని గూర్చి తెలియ జెప్పుటయు గలదు. వాని మేధ న్యాయవాది మందిరములో సామెతయైనది.

ఇది యంతయు నానందరావుగారు గమనించినారు. ఆయన యాశ్చర్యమునకు మేరలేదు. ఎంత గొప్ప న్యాయవాదియైనను దన చుట్టు కోటగోడల కట్టుకొన్న వాని నెవ్వరు చేరగలరు! కావుననే నారాయణరావును తోడి న్యాయవాదులు గౌరవించుట గాంచి యాయన అక్కజపడెను.

నేడు నారాయణరా వింటికి వచ్చుచున్నానని యాయనకు మొదటిసారి హృదయమున జ్ఞానమేర్పడినది. తన మేనమామ కొమరిత శారద మగని యింటిలో నున్నది. ఆమెను దాను, దన భార్యయు వెళ్ళి చూడవలెను. 'లా' తప్పనేమియు నెరుగని యాతని మెదడునకు దోచిన దంతియ. 'లా' ప్రపంచమావల నేమున్నదో, యేమో?

3
ప్రకృతి - పురుషులు

రామచంద్రరావు హార్వర్డు విశ్వవిద్యాలయములో 1926 వ జూలైలో బి. ఎస్ సి. ఆనర్సులో ప్రవేశించినాడు. బి. ఎస్ సి. మూడు సంవత్సరముల పరీక్ష. బి. ఎస్ సి. ఆనర్సులో విశ్వవిద్యాలయమున రెండవవాడుగా జయమందెను. బి. ఎస్ సి. ఆనర్సు జయమందిన ఆరునెలలకు ఎమ్. ఎస్ సి. పత్రమును విశ్వవిద్యాలయమువా రిత్తురు. అందులకొక పరీక్షయు జరుగునట. ఆ పరీక్ష వ్యాసములు వ్రాయించి వానిని బరీక్షించుటయట. ఎమ్. ఎస్ సి. పరీక్షకై చాలా పట్టుదలతో జదివి 1929 ఫిబ్రవరి నెలలో నా పరీక్షకయి వ్యాసము వ్రాయుట కారంభించినాడు.

ఈలోన నా మూడేడులు హార్వర్డులోను, మశ్శాచియెట్సు రాష్ట్రప్రభుత్వమువా రేర్పరచిన, విద్యుచ్ఛక్తి విద్యాలయములోగూడ చదువుచుండెను. అమెరికా దేశమున

నట్టివీళ్ల నెన్నిటినో విద్యాలయములు కల్పించెను. విద్యుచ్ఛక్తి ప్రపంచములో నా విద్యాలయపుబరీక్ష చాలా గణనీయమైనది. లియొనారాకన్యకయు నటులనే చదువుచున్నది. ఆ విద్యాలయము మహానుభావుడగు ఎడిసను పండితునిచే నిర్మింపబడినది.

రామచంద్రరావు తెలివితేటలు గ్రహించి యా విద్యాలయమువా రాతనికి వలయు సౌకర్యములు సమకూర్చుచుండిరి. ఆ విద్యలో బారంగత్వము నందవలెనన్న నైదేడులు చదువవలెను. బి. ఏ. లెక్కలు గాని, పదార్థవిజ్ఞాన శాస్త్రము గాని చదివిన వారిని మూడవ సంవత్సరపు తరగతిలో జేరనిచ్చెదరు. పరీక్షలో విజయమందిన వారికి డి. ఇ. ఇ. అను బిరుదపత్రము నిచ్చెదరు. రామచంద్రరావు రెండు సంవత్సరముల పరీక్షలో మొదటివాడుగా గృతార్థుడైనాడు.

లియొనారా కన్యకును నది తుది సంవత్సరపు బరీక్ష.

లాతిదేశములలో ఏకదేశస్థులు కలిసికొన్నప్పు డాత్మీయ సహోదరుల జూచినట్లు ప్రేమ జనించును. ప్రాణము లేచివచ్చును. ఆంధ్రు లే బెంగాలు దేశముననో కలిసికొన్నచో, నంతకుమున్ను వారిరువురకు పరిచయము లేకపోయి నను సరియే వారిలో నొకరిది బళ్ళారి, రెండవవారిది బరంపురము నైనను సరియే, ఒక్కచోట పుట్టి పెరిగినవారికన్న నెక్కువ స్నేహముగ మెలగుదురు. అటులనే హిందూ దేశస్థు లిరువు రే యాస్ట్రేలియా ఖండములోనో, జర్మనీలోనో కలిసిననాడు స్నేహితులై సంచరించెదరు.

రామచంద్రరావు మొదలగు హైందవ విద్యార్థు లనేకులు హార్వర్డు విద్యాలయమున, బెర్కిలే, న్యూయార్కు, కాలిఫోర్నియా మొదలగు విద్యాలయముల జదువుచున్నారు. వర్తకము చేసికొను గుజరాతీ దేశస్థు లున్నారు. రాజకీయ వ్యవహారములకై యున్నవా రున్నారు. వీరిలో నెవరెవరు కలిసి కొన్నను బ్రాణము లర్పింతురు.

రామచంద్రరా వట్లె పెక్కుమంది విద్యార్థులతో స్నేహ మొనర్చెను. రాజకీయ వ్యవహారములు చూచుకొనువారిలో కొందరు అమెరికా హిందూదేశముల కొండొంటికి గాఢమైత్రి నొనగూర్చ ప్రయత్నించువారున్నారు. అందు కొందఱిభావము లెట్టివో యేరికిని తెలియదు. అట్టివారిలో గండార్ సింగు, ప్రాణకాంతబోసు అను నిరువురు విద్యార్థు లున్నారు.

వారిరువురు చదువులు పూర్తి జేసికొనిన వెనుక కొన్ని నెలలాగి ఫిబ్రవరి నెలలో హిందూదేశమునకు వచ్చినారు. వారువచ్చిన కొద్దిరోజుల కా యువకులపై ప్రభుత్వము వారభియోగమును జరిపినారు. వారికి చెరియొక మూడేళ్లు ఖైదును న్యాయాధికారి విధించెను.

మార్చినెల మొదటివారములో నారాయణరావునకు రామచంద్రరావు వ్రాసిన యొక కమ్మ అందినది.

హార్వర్డు విశ్వవిద్యాలయం,
ఫిబ్రవరి, 1929.

ప్రియమైన బావా,

నీవు వ్రాసిన ఉత్తరం అందింది. నీది యెంత చక్కని హృదయమోయి! ఈ మూడేళ్లు

నాకు సరియైన ధైర్యం కొలిపింది నువ్వేసుమా! వారం వారం నీ ఉత్తరానికి ఎదురుచూడ్డం నాకు రెండవభోజనం అయిపోయింది. నేనే నీకు జవాబులు ఆలస్యం చేసేవాణ్ణి. ఎప్పుడు డబ్బు కావాలంటే అప్పుడు పంపించావు. కోటీశ్వరుడగు అమెరికా దేశస్థుని కొమరు డెట్లు సంచరించగలిగినాడో ఆలాగు నేనిక్కడ సంచరించానంటే దానికి కారణం నువ్వు. ఎమ్. ఎస్ సి. తప్పక వస్తుంది. కాని డి. ఇ. ఇ. తప్పదు. ఇంకనూ ఉన్న కొలదీ నేర్చుకో వలసింది చాలా ఉంది. కాని మన దేశంలో విశ్వవిద్యాలయాలు చాలా ఉన్నవి. ఏ విద్యాలయంలో నైనా నాకు ఉద్యోగం సంపాదించి పెట్టగలవని నా నమ్మకం. ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రొత్తగా పెట్టారుకదా! అందులో నాతో ఆచార్య పదవి సంపాదించగలవను నా నమ్మిక కు నువ్వు వ్యతిరేకం చెయ్యవద్దు. నేను డబ్బు సంపాదించాలనీ, లేక పోతే కూడుదొరకదనీ కాదుగదా ప్రవేశించుటకు కోరేది. ఏదైనా విశ్వవిద్యాలయంలో ఉండి, విద్యుచ్ఛక్తి విషయమై కొత్త సంగతులు చాలా పరిశోధించవలెనని ఆశయము ఉంది. విశ్వవిద్యాలయములో నాకు ప్రవేశం దొరకకపోతే, ఏ బెంగుళూరు శాస్త్ర పరిశోధనాలయములో నైనను సరే ప్రవేశము నా కిప్పించకోరుతూ ఉన్నాను.

చి. సౌ. సూరీడుకు చదువు చెప్పించి, ఈ యేడు ప్రవేశ పరీక్షకు పంపిద్దామన్న ఉద్దేశం నీకు కలగడం చాలా ప్రశంసనీయం. పరీక్షలో నెగ్గితే అమెరికా నుండి మంచి బహుమతీ తెస్తున్నా నని చెప్పు. ఆవిడకూ నేను ఉత్తరం రాస్తున్నాను. నా సహోదరి శారదాదేవిని నే నింతవరకు చూడలేదు. ఆమెయు, మా చెల్లెలును కలిసి చదువుచున్నారని వినుటకున్ను చాలా సంతోషమయినది. చి. సౌ, నూరీడు సంగీత ముకూడా బాగా నేర్చుకున్నదని పాశ్చాత్య సంగీతముకూడా నేర్చుకుంటూన్నదని నీ ఉత్తరంలో చదివినప్పుడు నా కపరిమితానందం కలిగింది.

నేను జులై నెలలో బయలు దేరి ఇంగ్లండుమీదుగా వస్తున్నాను. బొంబాయి వచ్చి అచ్చటి నుంచి కొలంబోవచ్చి రైలుమీదవస్తాను. ఇంటికి నేను చేరుకునేందుకు రెండు నెలలు పట్టును. ఈలోన ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లండు, ఇటలీ చూచుకొని మరీ వస్తున్నాను. నీ కేమి కావలసినా తంతి నీయవలయును.

ఇట్లు నీ ప్రియమైన
రామచంద్ర

విద్యుచ్ఛక్తి విద్యాలయములో బరీక్షలు సంపూర్ణము లయ్యెను. రామచంద్రరావు విజయము గాంచి జయపత్రమును భారత దేశమున కంపుట కేర్పాటు చేసికొని, మరల నొకపరి దేశములోని చిత్రములు చూచెదను గాక యని నయగరా పతనమునకు బోయినాడు.

రామచంద్రు డిక నమెరికా వదలి వెళ్లిపోవుచున్నాడని లియొనారా కన్య విచారగ్రస్థయయినది. ఇన్నాళ్లు రామచంద్రు నొక ని మేష మేనియు నెడబాసి యుండలేదు. అతని నా బాలిక నయగారా తన కారుమీద కొనిపోయినది.

దారిలో నొక నిర్జనప్రదేళము కడ ప్రకృతి లీలావినోదిని యొసగు చోట కారు నాపినది. 'రామచంద్ర! మళ్ళీ మన మెప్పుడు కలుసుకొనుట? నీవు మరల అమెరికాకు వచ్చుటో లేక నేను హిందూదేశమునకు వచ్చుటో, లేనియెడల నీరూపము నా దృష్టి పథమునుంచి మాయ మైపోవును.'

'అదేమిటీ నారా! అంత విచారముగా ఉన్నావు? నీవంటి ధైర్యమైన పిల్లను మా

దేశంలో చూడనే చూడము. కథల్లోమాత్రము వింటాము.'

'నీ వెందుకు నా జీవిత నాటకంలో నొక ప్రాత అయినావు?' 'అది ఉత్తమ సంఘటనం కాదా. అది నా అదృష్టంకాదూ?'

నీ వున్న మూడేళ్లు నాకు నీవు సమకూర్చిన ఆనందము నా వ్యక్తిత్వమును ఉన్నతపథాల కెత్తివేసినది.'

'లీ! ఈలాగున ఏమిటి వణికిపోతున్నావు!'

'రామ్! నా ప్రియతముడైన స్నేహితుడా! భారత దేశము మహాత్ముని నాయకత్వాన సలుపు ప్రేమమహాసంగ్రామమువలన నే ప్రపంచమునకు ధర్మ సందేశ మొసగగలదని నీవు సల్పిన జ్ఞానబోధ నన్నొక నూతన వ్యక్తిని చేసింది. ఆలోచించినకొద్దీ ప్రపంచాన్ని తరింప చేయుటకు అమెరికా హిందూదేశములు రెండూ కలియాలి. భరత దేశము పురుషుడు, మా దేశము స్త్రీ. ఈ రెంటికీ సంపూర్ణ సంయోగము కలగాలి. ఆ నాడు ప్రపంచబోధ ప్రారంభమవుతుంది.'

'నా ప్రాణప్రియ స్నేహితురాలవగు లియోన్! నీ వివాళ భగవంతుని సాన్నిధ్యమునుండి యవతరించిన దేవతలా ఉన్నావు. నీ మోమున దివ్య తేజస్సు తాండవమాడుతూ ఉంది. 'నీ శిరస్సు వెనుక తేజోమండలము వంగపండు చాయతో గన్పట్టుతూ ఉంది.'

లియొనారా నవ్వుచు రామచంద్రుని ఒడిలోకివచ్చి కూర్చున్నది. సత్యప్రదర్శకములగు నామె కన్నులు పారలౌకికమగు నవ్వు నవ్వుచున్నవి. రామచంద్రు నామె కవుగిలించుకొన్నది. రామచంద్రుని మూర్తి పులకరించిపోయినది.

మా క్రైస్తవమతస్థు లెందరో శ్రీ యేసుక్రీస్తు దివ్యబోధ గ్రహించలేక పోయినారు. హోల్మ్సు మహాఋషి చెప్పినట్లు శ్రీ గాంధి, క్రైస్త అపరావతారమే! భగవద్గీత లోని బోధయే యేసు కొండమీదయిచ్చిన ఉపన్యాసం'

'నా లియోన్! నే నిదివరకు మా దేశాననున్న దివ్యమణులగు గ్రంథరాజా లేమి చదువలేదు. నా లెక్కల్లో నేను పడివున్నా . ఏనాడు నిన్ను ప్రథమాన్ని ఓడపైన దర్శించానో, ఆ శుభముహూర్తా న్నే అమెరికా హిందూ దేశము లేకమై ప్రపంచానికి మార్గదర్శకము లవ్వాలని నాకు మెరుపు వలె హృదయమున గోచరించినది. ఇన్ని వందల సంవత్సరాలుగా ఇంగ్లండు భారత దేశమును పాలిస్తూ, భరతదేశ సందేశాన్ని గ్రహింపలేకపోయింది. ఇంగ్లీషువారు రాజ్యము చేయుట మాకు మరియు ఉపకార మైనది. భగవంతుడు వారి ఆక్రమణముచే మమ్మందరినీ యేకం చేసినట్లయింది సుమా.'

'నా హృదయానికీ, ఆత్మకూ ప్రియమిత్రుడవైన రామచంద్ర! సర్వ దోషరహితమైన జీవితము గడపుటే సత్యము. అట్టి సత్యవ్రతము చేసిననేకాని సత్య స్వరూపుడగు భగవంతునితో నైక్యమందలేము. అట్టి సత్యవ్రత మొనర్చుటకు బ్రేమ ముఖ్యసూత్రమన్నావు. నాచే రాధాకృష్ణ గారి గ్రంథములు, వివేకానందుని యుపన్యాసములు, గాంధీ జీవితచరిత్రమూ చదివించావు. నాహృదయంలో మానవసేవ చేయుట పరమపవిత్ర మైనదనిన్నీ, మోక్షదాయకమైన దనిన్నీ తోచింది...'

ఆమె కంఠము రుద్ధమైనది. ఆమె నేత్రాంచలములు తడియైనవి. ఆమె మోమున ప్రేమశాంతులు తళుకుమనుచున్నవి. అపు డా బాలిక __యా యమెరికను ప్రసిద్ధ వైద్యుని

కౌమార్తె, యా సౌందర్యనిధి లియొనారా రామచంద్రుని బిగ్గ కవుగిలించుకొని యాతని హృదయములో మోమునుంచి,

'నీవు నా గురువువు. నే నింతటినుంచి బ్రహ్మచారిణినై మానవసేవ చేయుటకు సంకల్పించుకొన్నాను. అమెరికాకు నేను చిహ్నన్ని, కాని నన్ను దగ్ధము చేయు నా యీ ప్రేమను వదలి వేయాలి. ప్రియతమా! నా ప్రభూ! నన్నొకసారి పాలించుకో. మొదలూ తుదీ ఏకమైన ఆనందము నాకియ్యి. నన్నీ ఒక్క ముహూర్త కాలమూ భార్య నొనరించుకో. ఈ యొక్క నిమేషము నీలో ఐక్యమైపోవనీ' అన్నది. ఆమె మాట లస్పష్టములై, కాకలీకూజితములై, యా సంధ్య వెలుగులలో గలిసిపోయినవి.

రామచంద్రుడు నిశ్చేష్టుడై, చైతన్యరహితుడైనాడు. ఆతని మోము వెల వెలబోయినది. లియొనారాను చుట్టిన యాతని చేతులు వాలిపోయినవి.

'ప్రభూ, నా కోర్కె పాలింపవా?'

'ఆమె మోము హృదయముతరుగునట్టి బాధతో నిండినది. ఆమె కన్నుల సంతతజల ధారలు నయాగరాలైనవి.

'తీరని యీ కోర్కెతో నా మనస్సు శాంతి లేక దహించుకొనిపోవలసినదేనా? నాకు సేవకై యనుజ్ఞ నీ వీయదలచుకొనలేదా? అందమగు నాయీబ్రతుకును విషాదాంతము చేయదలచినావా, నా ప్రాణప్రియా! నీ వేల నా జీవిత చరిత్రలో నొక పాత్ర వయ్యావు! అహో!'

రామచంద్రుడు కరిగిపోయినాడు. అతని లోకాలు సురిగిపోయినవి. ఈమె కింత ప్రేమ యున్నదా! తాను పాపమాచరించుట లేదా?

లియోనారా ఇంకను గట్టిగా నదిమికొన్నది. ఆమె మోమెత్తి, అతని హృదయమున తన హృదయ మదిమి పెదవులు ముద్దిడుటకు అతని మోమె వంచినది.

ఇరువురు పుల్కరించిపోయినారు.

ఆ సంధ్యాకాంతులలో, పక్షులు కలస్వనములలో, తారకలు స్పష్టకాంతుల వర్షించు శుభ ముహూర్తాన ప్రకృతి గంభీర సౌందర్యాన నృత్యము చేయునాచోట, ఒక్క విచిత్ర ప్రేమ సంశ్లేషావేశము సంఘటించి పోయినది.

౪

స్నేహపవిత్రత

శారదను జమీందారుగారువచ్చి పరీక్షకు రాజమహేంద్రవరము తీసికొనిపోయినారు.

శారద చెన్నపురిలో నున్నంత కాలము భర్తతో జదువునప్పుడుతప్ప, తదితర కాలమం దేమియు మాటలాడలేదు. నారాయణరావు శారదతో మాట్లాడలేదు. చదువు చెప్పునప్పుడు బడిలో నుపాధ్యాయులందరు విద్యార్థుల కేరీతి చెప్పుదురో యంతకన్న నిచ్చుట నధిక మేమున్నదని నారాయణరావు తలపోసికొన్నాడు.

శారదయు, దానును బ్రేమతో తమ జీవితనౌక నానందఝురీతరంగములలో

వదలినచో ఆ నావ యనంతమగు నే తీరము సేరియుండునో?

నారాయణరావును ప్రజలందరు గౌరవించి ప్రేమించుట శారద చూచినది. నారాయణరావు సౌందర్యవంతుడని, విద్యార్థినులగు బాలికలు, విద్యావంతులగు యువతులు అవిసెచెట్టును నాగవల్లు లలమికొనునట్లు చేరుట గమనించింది. తానీ పురుష శ్రేష్ఠు నేల ప్రేమింప లేకపోవుచున్నానని ఒక్కొక్కప్పు డామె యాశ్చర్యపడును. దినదినము నూతన పాఠముల కెదురుచూచును. ఆతని కంఠగతమధురస్వర ప్రవాహములో నామె తేలిపోవును.

సూర్యకాంతమునకు శారదకు నాతడు వీలయినప్పుడెల్ల సర్వప్రపంచమునకు సంబంధించిన విషయములను వారి కర్థమగునటుల వారువ్విళ్ళూరుచు వినునంత తీపిగ బోధించుచుండెను.

ఫిబ్రవరి నెలాఖరునకు వారికి బాఠములన్నియు హృదయగతములైనవి. పరీక్షలో ప్రశ్నలకు జవాబువ్రాయు నేర్పంతయు నుపన్యసించినాడు. వారిచేత వందలకొలది జవాబులు వ్రాయించినాడు.

ఒక నాడతడు శారదకు బాఠము చెప్పుచుండెను. సూర్యకాంతము తన పాఠము లవగతము చేసికొనుట కింకొక గదిలోనికి బోయెను. నారాయణరావు కాంభోజి రాగయుక్తమగు తన గొంతుకతో ఇంగ్లీషులో నిట్లు వచించినాడు. 'షేక్సుపియరుకవి దేహమనఃప్రాణప్రపంచముల మహానాటకములు రచించినాడు. ఉత్తమదశోన్ముఖులుకానివారి జీవితముల నీ ప్రపంచసంబంధములగు గుణములు విషాదమున ముంచి వేయును__అను ఉత్కృష్ట విషయమునే యాతడు వెల్లడించినాడు. గుణములు నీచములు, ఉన్నతములు అని రెండురకములు. నీచ గుణములు గల వాడు నశించును__అనే సర్వసాధారణ నీతి నవి మనకు దోపింప జేయును. పురుషకారహీనమగు మంచితనము మనల నడంచి వేయును__అను విషయమే అతడు మహావిషాదాంతమగు హామ్లెటు నాటకములో చూపించి నాడు. హామ్లెట్టు సజ్జనుడు. తన తండ్రిని తన పినతండ్రి చంపెనా లేదా యను సంగతి పూర్ణముగ దెలిసికొనకుండ నెటులాతని శిక్షించుట అని యాతడు సందేహించినాడు. ఆ సందేహమే యాతని నడంచినది. ఒథెల్లో సర్వ మానవులను బూర్ణముగ నమ్మినాడు. ఆ నమ్మకమే భార్యవిషయమున అపనమ్మకమైనప్పుడు క్యాసియోపై నసూయ, భార్యపై కోపము, చివరకు తాను తన భార్యయు నశించిపోవుట తటస్థించినది. కావున సద్గుణములైనను అహంకారమున జనించిన ట్లయిన వినాశ హేతువులు. ఇంత గొప్పవియైనను షేక్సుపియరు నాటకములకు సంపూర్ణత్వము రాలేదు. మహాకళలైనను సంపూర్ణత్వమునందనిచో ఉత్కృష్టానంద మెట్లీయగలవు? భారతీయ నాటక శిల్పులకు సంపూర్ణత్వమున్నది. కాళిదాసు రచించిన శకుంతల గమనించినచో నా మహానాటకము రెండు భాగములుగా విభజింపబడినది. ప్రథమ భాగమున దేహమనఃప్రాణలోకముల ప్రదర్శించినాడు.

'దుష్యంతుడు మహారాజు, శకుంతల వనకన్య. మహారా జితర దేవేరులలో శకుంతలను జ్ఞాపక ముంచుకొనవలయును. శకుంతలను మరచినాడు. ప్రాపంచికమగు నానందము కొలదిమాత్ర మనుభవించి యా భౌతిక సుఖములో మైమరచుట నీ యాత్మకు భంగకరము. ఓ ఋషికన్యా, నీ ఆర్ష సంప్రదాయము మరువకుము' అని దుర్వాసుడు ఆమెను శపించినాడు. ఆర్యబాల విషయ సుఖములకోసం జనింపలేదు. సేవకే. తన ఆత్మ తాను తెలిసికొనుటకే. కావున మేనక శకుంతల నెత్తికొనిపోయి కశ్యపాశ్రమమున వదలినది. ఆర్యసంప్రదాయమున పుత్రుల గనుట పున్నామనరక బాధ నివర్తించుకొనుటకు,

బిత్తాణము దీర్చుటకు. అందు కొక పుత్రుడు చాలు. శకుంతల మాతయైనది. రెండవ భాగమున శకుంతలా దుష్యంతులకు స్వర్గలోక పరిసరముల పునస్సంధానము కలిగినది. అప్పటికి దుష్యంతుడు రాజర్షి, శకుంతల యోగిని, ఇంక పవిత్రమగు వానప్రస్థాశ్రమము, సచ్చిదానంద జ్యోతిర్ముఖమగు జీవితద్వంద్వము.

'ఇయ్యది భారతీయుల ఉత్కృష్టాశయము. కవిత్వపాకములో, కథా సరళిలో, అలంకారములలో జీవిత ప్రదర్శనములో ఒకరికొకరు తీసిపోరు కాళిదాసు, షేక్సపియరులు. కాని కాళిదాసులోని లాలిత్య మాధుర్య గంభీరతలకు షేక్సపియరు కొంచెము తగ్గినాడు. కాళిదాసు గౌరీశంకర శిఖరము (ఎవరెష్టు), షేక్సపియరు ధవళగిరి'

ఈరీతి నింగ్లీషులో నుపన్యసించు భర్తయొక్క భాషగాని, భావములు గాని సంపూర్ణముగ గ్రాహ్యము గాకపోయినను శారద విస్ఫారిత నేత్రములతో నందమగు మోహముతో ఆకర్షింపబడి పరవశమైన హృదయముతో నట్లే కూర్చుండి భర్త వంక అనిమిషయై చూచుచున్నది.

చీకట్లు దిశల ప్రసరించుచున్నవి. సాయంకాలపు వెలుగు లా గదిలోనికి తొంగి చూచుచున్నవి, తోటలోని పూవుల సువాసన జగత్తును పరిమళ వివశత్వ మున మూర్ఛముంచినది. పశ్చిమారుణచ్ఛాయ యొండు గవాక్షమున లోన బ్రవేశించి శారదమోమును వెలిగించినది. ప్రణయతపస్సిద్ధికై తన ప్రణయాధి దేవియే ప్రత్యక్షమైన ట్లాతని కామె గోచరించినది.

ఇంతలో ఉల్క యొకటి మెరసిన ట్లా మోములో మార్పులు జనించినవి. ఆ మోము శ్యామసుందరీ దేవి మోమైనది. శ్యామసుందరి తన్నతి ప్రేమతో దిలకించిన ట్లాతనికి దోచినది. శ్యామసుందరి చిరునవ్వు నవ్వి, లేచి, చేతులు చాచి తనకడకు వచ్చి తనపై వంగినది. ఆమె యూపిరి పరిమళములు తన్నలమినట్లయినది. అతడు రక్తము వేడియై దేహమెల్ల ప్రవహింప, హృదయము హోరులెత్త, ఆమె మెత్తని చిగురాకు పెదవులు తన పెదవులపై తగిలినట్లు భావించినాడు. ఇంతలో నామె, తన్ను గౌగిలించిన ట్లయినది.

ఆమె తమిదీర తన్నతిమోహావేశమున చుంబనమొనరించిన ట్లాతడు తన భావపథమం దూహించి చటుక్కున లేచి తన పడకగదిలోనికి రెండడుగులలో చేరినాడు.

ఆతడు చకితుడై బాణహతిచే సుడివడిపోయి రెక్కలు టపటప కొట్టుకొను గువ్వపిట్టవలె హృదయము చలించిపోవ నిట్టూర్పు నించుచు పర్యంకము జేరినాడు. ఆతని కన్ను లెఱ్ఱవారిపోయినవి. కణతల చిరు చెమ్మటలు నిర్మలాకాశాన నల్లని మేఘశకలములవలె పొడసూపినవి.

ఏమిది? మనస్సులోనైన నా బాలిక శీలము చెరుపవచ్చునా? అది పాపము! పవిత్రమగు నాత్మకూడ పంకిలమ్మగు ననునంత పాపకార్యమది. ఎంత గర్హ్యము!...

ఎట్టఎదుట తన ఇల్లాలుండ, బరకాంతపై దనకీ యసమయావేశ మేల జనింపవలెను? భార్యను తాను ప్రేమింపకూడదా? అయినచో నామెయే తన్ను చేరవచ్చినట్లు తన యింద్రియములకు మించిన శక్తి తన్నట్లు కదల్చివేసినదా?

శ్యామసుందరి యను భ్రాంతికి కారణము తనలోనున్న కల్మషమే, అయినను తాను ద్రోహము చేయుటా?

శ్యామసుందరీదేవి పవిత్రచరిత్ర కావుననే యాత డామెతో స్నేహము చేసినాడు. వ్యక్తికి స్నేహము పాపమా? గర్హ్యమా? పురుషుడు వనితలతో నేల స్నేహము చేయరాదు? పురుషుని పురుషుని ప్రేమలతల పెనవైచు స్నేహము పవిత్రమైనచో, మగవానిని వనితను సువాసనాబంధముల జేర్చి వైచు స్నేహము మాత్ర మేల పవిత్రముకారాదు?

పురుషుల పరస్పర ప్రేమగూడ ధనలాభాది వ్యాజమూలకమై నీచమగును. స్త్రీ, పురుష స్నేహములో నంతకంటె నీచమగు కారణముండుటకు వీలున్నది. స్నేహము పవిత్రమంటారు. స్నేహము లేని పురుషుని మొరడనియు, శ్మశానములోని చెట్లనియునందురు. మిత్రకోటిలో మైమరచువాని బంధుసముద్రుడంటారు. అట్టియెడ, పురుషునకును వనితకును స్నేహ మేల పనికిరాదు? ఎట్టి సత్పురుషుడైనను ఒక బాలికతో నెంత నిర్మలస్నేహాన మెలగినను గుసగుసలు, తేరిపార చూపులు, పెదవి విరుపులు. ఒహో!

యౌవనమందున్న స్త్రీ పురుషులకు మాత్రము పవిత్ర స్నేహము సాధ్యమేల కారాదు?

శ్యామసుందరితో దన స్నేహము పవిత్రమైనదా? ఏ మూలమూలలనైన పవిత్రతకు దూరమగు నర్థ మేమైన గలదా?

౫౪
మోహావేశము

రాజేశ్వరరావు, పుష్పశీలయు నీ ఆరునెలలు మోహావేశపరవశులయి తిరిగినారు. రాజమహేంద్రవరమునుండి హైదరాబాదు, హైదరాబాదునుండి ఢిల్లీ, ఢిల్లీ నుండి కలకత్తా, కలకత్తా నుండి బొంబాయి. రెండవతరగతిలో నిరువురకుమాత్రముండు పెట్టెపుచ్చుకొనువాడు. స్టేషనుమాష్టరు చేతిలో రెండు, గార్డు చేతిలో రెండు లంచము. అంతే! అతడే మహారాజు!

అజంతా మొదలగు ప్రదేశములకు గూడ నాతడు వెళ్లెను. అంతటను బంగాళాలు మకాము. ఎప్పుడు పుష్పశీలయే యెదుట నుండవలెను. ఎప్పుడు మోహావేశమే. పుష్పశీల కా యారునెలల కాలము తృటిలో వెళ్లిపోయినది. రాజేశ్వరు డామెను పూవువలె చూచుకొన్నాడు. మహారాణివలె నాదరించినాడు. ఆమె యేది కోరిన నది ఇచ్చినాడు. ఆరు నెలలు తిరిగి తిరిగి వారిరువురు హైదరాబాదు వచ్చినారు. అచ్చట నాతడు ఉద్యోగమునకై ప్రయత్నింప నారంభించెను.

రాజేశ్వరునకు దూరపుచుట్టమగు బందరు నాయుడుగా రొక రచట పెద్ద ఇంజనీయరు. ఆయన రాజేశ్వరు నాదరించి నెలకు నూటయేబది మొగలాయి రూకల జీతముతో నారంభించి సంవత్సరమునకు పది చొప్పున రెండువందల యేబదివరకు హెచ్చు పద్ధతిని, సహాయ ఇంజనీయరుగా నవాబు గారు కట్టించు నైజాము సాగర్ అను పెద్ద చెరువున బనిచేయుట కేర్పరచెను.

పుష్పశీలపై నెయ్యమున రాజేశ్వరుడుగూడ మాంసాదుల వర్జించెను. ఆమెయు భార్యవలె సంచరింపదొడంగెను. తాను కాపుపిల్లనైతినని యామె భావించుకొన్నది. వారిద్ద రా చెరువులో బనిచేయు నింజనీర్లకై యుద్దేశింపబడిన యొక బంగాళాలో కాపురముండిరి.

సుబ్బయ్యశాస్త్రిగారికి మతిపోయినది. స్వతంత్ర ప్రేమ సంఘము నాయన నొవ్వ తిట్టినాడు; అగ్నియైనాడు. ప్రపంచము మ్రింగివేయుద మన్నంత కోపము వచ్చినది.

రాజేశ్వరరా వింటికిబోయి యాతని వృద్ధమాతపై మండిపడి దుర్భాష లాడుటచే వారు సేవకునిచే నాతని గెంటించివైచిరి. ఇంటికి వచ్చి భార్య వస్తువులు చూచి యేడ్చినాడు. ప్రపంచమున నెవ్వని నిక నమ్ముట! ఛీ! ఛీ! పురుషుడన్న వాడు పెళ్లి చేసుకోవాలి. పరభార్యల నపేక్షించుట ఎంత హీనము! తా నిదివరకు చేసిన పొరపాట్లున్నవి. అవి తాత్కాలికములు. కాని ఈ దారుణ మేమి? దీనికి శిక్షాస్మృతి ననుసరించి పరభార్యాపహరణము క్రింద నభియోగము గొనివచ్చి ఈ పిశాచిని, ఈ చండాలుని రక్తము పీల్చవలెను.

కాని, అభియోగము దాఖలు చేసినచో నిదివరకే తలవంపులు రానున్న తనకు మరియు తలవంపు లగును. ఆడవారివల్ల లోకాలు పాడవుచున్నవికదా!

అతడు వీధివెంట జనుచున్నప్పు డందరు తన్ను చూచి హేళనచేయుచున్నట్లు భావించుకొన్నాడు. అభియోగము చేసినచో వేలుతో చూపించి మరియు హేళనము చేయుదురేమో! మరియు దుర్భరపు బ్రతుక గును.

రాజేశ్వరరావుకు జమీందారుగారి యల్లుడగు నారాయణరావు గారు స్నేహితుడని యాతనికి దెలియును. చెన్నపట్టణము పోయి ఆయన సహాయ మడిగినచో నుపయోగించునేమో?

ఆ యాలోచన జనించిన రాత్రియే చెన్నపట్టణము వచ్చినాడు సుబ్బయ్య శాస్త్రి. తిన్నగా నారాయణరావు గారి యింటికివచ్చి నారాయణరా వింటికడ లేకపోవుటచే నొక హోటలునకు బోయి సామానచ్చట బెట్టి, స్నానమాచరించి, భోజనము చేసి నారాయణరావు గారి మేడకు వచ్చెను. అప్పుడే వచ్చి నారాయణరావు భోజనముకడ కూర్చున్నాడు.

నారాయణరావు భోజనము చేసి యీవలకు వచ్చుటతోడనే, సుబ్బయ్య శాస్త్రి గారు లేచి నమస్కరించెను. నారాయణరావు సుబ్బయ్యశాస్త్రి గారి నెరుంగును. ఆయన వచ్చినపని నిమేషమున నాతని కవగతమైపోయినది.

‘సుబ్బయ్య శాస్త్రి గారూ! నమస్కారము. దయచేయండి’ అని యాతడన్నాడు.

సుబ్బయ్యశాస్త్రి గారికి కన్నుల నీరుతిరిగినది. నారాయణరావు తెల్లబోయినాడు.

‘అదేమిటండీ శాస్త్రులుగారూ! మీరు వచ్చినపని తెలుస్తూనేవుంది. వాళ్ళు తిరిగి హైదరాబాదు వెళ్ళినారట. అచ్చట అతని కేదియో యుద్యోగము దొరికినదట. నన్ను వెళ్ళి ప్రయత్నము చేయమని మా యుద్దేశమైతే నేనీ రాత్రి బయలుదేరి వెళ్తాను. ఇదివరకే అనుకుంటున్నాను. కాని అతను దేశాలు తిరుగుతున్నాడు. మీరు కూడా వచ్చి హైదరాబాదులో ఉండండి. భగవంతుడు మన ప్రయత్నం నెరవేర్చకమానడు.’

‘చిత్తం. నేను నాశనం అయిపోయానండి. ఈ ఆరు నెలలు నేను పడిన బాధ నా విరోధికైనా వద్దండి. మర్యాదగా బ్రతికినవాణ్ణి. ప్రజలు అన్ని విధాల నన్ను హేళన చేస్తున్నారు. ఎన్నిసార్లో గోదావరిలో పడిపోదామనిన్నీ, విషం పుచ్చుకుందామనిన్నీ తోచింది.’

‘ఆలాగా!’

లోకపు మెప్పుగోరి మంచి చేయుటయు, నిందకోడి చెడుచేయకుండుటయు గొప్ప కాదు. లోకమే మనశీలమును గాపాడుచున్నదా? హరిశ్చంద్రాది నాటకశాలలో నీ భావములు

వెల్లడించి ఈ నాటక గ్రంథకర్త లెట్టి ద్రోహమాచరించుచున్నారు! మనము మంచి చేయుట మంచికొరకు గాని, లోకము కొరకా? ఓ భరతమాతా, నీ కెట్టికళంకము తెచ్చుచున్నామమ్మా! మేము చేయు మంచి చెడ్డలు సంఘమనుకొనుదాని పై నాధారపడియున్నవికదా! మంచి కదాయని మంచిచేయుటకాదు. చెడుకదాయని మానివేయుట కాదు. హరిశ్చంద్రుడు నిజమాడిన, ప్రజలు హరిశ్చంద్రుడు సత్యమాచరించినాడని చెప్పుకొనవలెననియా? అందులకా అత డా వ్రతము పట్టుట? అని నారాయణరా వనుకొనెను.

ఆరాత్రి వారిరువురు బెజవాడమీదుగా హైదరాబాదు ప్రయాణమై పోయిరి.

హైదరాబాదునుండి నైజాముసాగరు వెళ్ళిరి. దూరమున నొక యాత్రికుల బంగాళాలో సుబ్బయ్యశాస్త్రిగా రాగినారు. నారాయణరావు రాజేశ్వరరావును కలిసికొనుటకు వెడలిపోయినాడు.

రాజేశ్వరున కుద్యోగమై పదునైదు దినములైనది. అత డందరితో, దోడి యధికారులతో, పై యధికారులతో, తాబేదారులతో మంచిగా సంచరించు చుండెను. ఆ పదునైదు దినములలోనే యాతడన్న నందరు గౌరవము జూపుచుండిరి. రాజేశ్వరరావు తోడియధికారి యొక మహ్మదీయ యువకుడున్నాడు. ఇత డొక నవాబు గారి కొడుకు. ఆ నవాబు గారికి నైజాము ప్రభుత్వములో జాల పలుకుబడి యున్నది. ఆ యువకుడు హైదరాబాదులో ఇంజనీరింగు చదువు కొన్నాడు. పలుకుబడిచే నాతని కా యుద్యోగమిప్పించి నారు.

ఆ యువకునకు, రాజేశ్వర రావునకు మిక్కుటమగు స్నేహము కలిగినది.

రాజేశ్వరరావు స్వతంత్ర ప్రేమ సంఘంలో నిజమగు సభ్యుడు గాని, స్వలాభమునకై యందు జేరలేదు. తనయం దిష్టము లేని స్త్రీ నెప్పుడు నాతడు బలవంతము చేయలేదు. తాను మోహించిన యువతి యొక నెల తరువాత నైన తన యిష్టము వేరొకనిమీద ప్రసరింపజేసినప్పు డా యువకుడు హృదయమున నిసుమంతయు నసూయపడక, ఆ యువతిని వదలి వేయువాడు; జుగుప్స నొంద లేదు. అతని హృదయ మిసుమంతయు బాధ ననుభవించలేదు. తాను పెళ్లిచేసుకొన్న భార్య పరుని గోరినచో నామె కోర్కె దీర్చుట కాతడు సంసిద్ధుడనని హృదంతరమున సంకల్పించుకొనియే యున్నాడు. పుష్పశీలయు దానును రాజమహేంద్రవరమునుండి బయలు దేరినప్పుడే యాతడు సుబ్బయ్య శాస్త్రి గారి కిట్టి యుత్తరము వ్రాసి తపాలులో వేసినాడు.

‘ఆర్యా! మనం ఒక విచిత్ర సంఘంలో చేరిన సభ్యులం. ఆ సంఘంలో ఉన్న నియమాలు జరుపుటకు మీరు ప్రమాణం చేశారు. ఇంక ఆ యుద్దేశాలేమిటి:

1. ఆడవాళ్ళు ఇన్ని యుగాలనించీ మగవాళ్ళకు బానిసలై యుండుట చేత, వారి బానిసత్వం తొలగ చేయుట, వారికి పురుషునకున్న సర్వ స్వతంత్రాలు ఇచ్చుట.

2. వివాహము అన్నది వ్యక్తిత్వాన్ని చంపి మానవుల్ని సంఘానికి బానిసల్ని చేస్తూవున్నది కాబట్టిన్నీ, ఈ వివాహం అనే సంస్థ పురుషుడు స్త్రీని తనకు బానిస చేసుకోడానికే యేర్పాటు చేసుకున్నది కాబట్టిన్నీ, సదరు వివాహం అనే సంస్థను రూపుమాపి దాని స్థానే స్త్రీ పురుషులకు సమానహక్కుల్ని యిచ్చే సంస్థను యేర్పాటు చేయడానికిన్నీ.

3. ఉద్దేశాల్ని ఆచరణలో పెట్టడానికి మన సంఘాచార్యులగు తిరుపతిరావుగారు మనకు దినచర్య సూత్రాలు కొన్ని నియమించారుకదా: (ఎ) ఎప్పటి కప్పుడు కనబడినవారి కెల్ల మన సంఘోద్దేశాలు చెప్పి సభ్యులను చేర్చుకోవడం. (బి) వివాహము చేసికొనని

పురుషుడు వనితతో, వనిత పురుషునితో స్నేహమున కలిసియుండవలెను. వారు ప్రేమకొరకై యట్లున్న మరియు నుత్తమము. (సి) వివాహము చేసికొన్న సభ్యులు తమ భార్యలకు స్వాతంత్ర్యమిచ్చి వారి యిష్టానుసారము సంచరించుటకు సమ్మతింపవలెను.

ఈ మూడు ముఖ్య సూత్రాలను తమరు గమనించవలెనని ప్రార్థిస్తున్నాను. నేను మీ భార్యయైన పుష్పశీలాదేవిని ప్రేమించాను. ఆమె నన్ను ప్రేమించినది. కాబట్టి యీ ప్రేమ సాఫల్యం చేసుకోటానికి మేము దేశాలు తిరుగుతున్నాము. మీ ప్రమాణం జ్ఞాపకం చేసుకోండి. ఎప్పుడు పుష్పశీల నాపై ప్రేమను మరుస్తుందో ఆనాడు తిరిగి మీయింటికి వస్తుంది. పుష్పశీలకూడా నా ఉద్దేశమే బలపరుస్తున్నది. అందుకనే ఆమెకూడా ఈ ఉత్తరంలో సంతకం చేస్తూ ఉన్నది.

మీ ప్రియమిత్రుడు రాజేశ్వర రావు.

పై ఉత్తరం అంతా నా యిష్టం పైన కూడా వ్రాయబడింది.

మీ మిత్రురాలు పుష్పశీల.

ఈ ఉత్తరం చూచి తల బ్రద్దలుకొట్టుకున్నాడు సుబ్బయ్య శాస్త్రి. ఆ ఉత్తరం సంగతి ఆలోచించుకొనుచు సుబ్బయ్యశాస్త్రిగారు నిట్టూర్పు నించుచుండ నారాయణరావు రాజేశ్వరు డింటలేడనియు, బనికై బోయి నాడనియు తెలుసుకొన్నాడు. నారాయణరావు గబగబ నడచుచు కూలీల, గుమాస్తాల, చిన్న యుద్యోగుల నడుగుచు రాజేశ్వరరావు పని చేయు స్థలమునకు బోయెను. రాజేశ్వరరావు నారాయణరావును కనుగొనగానే తెల్లబోయినాడు. అతనికి జిరుచెమ్మటలు పట్టినవి. ఒక్క పరుగునవచ్చి నారాయణుని కవుగలించు కొన్నాడు. 'నారాయణా, నువ్వేనట్రా వచ్చింది! నువ్వేనట్రా! ఏమిటిది, ఎందుకు వచ్చావు, ఎల్లావచ్చావు? ఎప్పుడువచ్చావు? రా! రా! మా యింటికి వెళ్లావా? ఎవరున్నారు?'

'వెళ్లాను. అక్కడున్న ఒక మహమ్మదీయ యువకుడు చాలా డాబుగా ఉన్నాడు. అతడూ, ఒక చక్కనిపిల్ల, పుష్పశీల కాబోలు, తేయాకుబల్ల ప్రక్క కుర్చీలలో కూర్చుని ఉన్నారు. నన్ను చూచి మహమ్మదీయ యువకుడు ఈవలికివచ్చి నువ్విక్కడున్నావని చెప్పాడు. నీ బంగళాకూ ఇక్కడకూ రెండు మైళ్లుందిరా, అబ్బా!'

౬

వ్యాధికి మందు; ఆయువుకు మందు లేదు

సాధుశీల, సత్యహృదయ, సూరమ్మకు నెంతయో జబ్బు చేసినది. ఆమెకు పురిటిలో జేసిన జబ్బు నిశ్శేషము కాలేదు. చిక్కి శల్యమైనది. తిండి సహించుట లేదు. ఎప్పడు తలనొప్పులు, చిన్న చిన్న జ్వరములు.

రాజారావు తన భార్య పుట్టినింటికడ అలతి రోగములచే కృశించుచున్న దని, తనకడకు గొనివచ్చి, యామెకు వైద్యముచేయ నారంభించెను. బలమునకై మందులిచ్చెను. దేహములో నెచ్చటనైన రోగపదార్థమున్న దేమో యన్న భయాన స్ట్రెప్టోకాకయి మందు నరముల ద్వారమున లోనికిచ్చెను. క్షయ యేమో అని భయము పుట్టి జాగ్రత్తగ పరీక్ష చేసినాడు, ఎక్కడను ఆ జాడయైన లేదు. అంతకంతకు రోగము శ్రుతిమించి రాగమున బడినది.

మలేరియా జ్వరమేమోనని యాలోచన కలిగినది. సబ్ టెర్షియన్ మలేరియా యే జబ్బునైన అనుకరించును. అతడు క్వినయిను లోపలికి వాడినాడు, సూదివెంట నెక్కించినాడు. జ్వరము రోజుకు నూరుదగ్గర మొదలిడి నూటమూడు డిగ్రీల వరకు నెక్కుచున్నది. ఆమె జిక్కిపోకుండ ద్రాక్ష, పంచదార, కోడిగ్రుడ్డుసొన, బార్లీ నీరు, పాలు విరుగుడునీరు ఇవియన్నియు నామె కిప్పించు చుండెను. అత్తవారు వచ్చినారు. తన చుట్టములు వచ్చినారు. సూరమ్మకు జబ్బు విజృంభించింది. రాజారావు తన మిత్రులగు నిరువురు పేరుపొందిన వైద్యులకు తంతులనిచ్చి రప్పించుకొన్నాడు. వారువచ్చి యెడతెగక వైద్యము చేసినారు. ముగ్గురు జాగ్రత్తగ గ్రంథములు పరిశీలించి యాలోచించి వైద్యము చేసిరి. సన్నిపాత (టైఫాయిడు) జ్వరము కాదని నిర్ధారణ చేసినారు. రక్తము, మలము, ఉమ్మి గిండీకి పంపి పరీక్ష కూడ చేయించినారు.

ఊపిరితిత్తులు శ్లేష్మముచే నిండ, అయొడిను ఏఫిడ్రిను ఇచ్చినారు. తగ్గిపోయినది. గుండె అతి నెమ్మదిగా కొట్టుకొన్నది, నెమ్మదిగ ఏడ్రినాలిన్ మొదలగు మందుల నిచ్చి యా గడ్డు దాటినారు. తడిగుడ్డలు పొత్తికడుపుపై వైచి వైద్యము చేసినారు. పైలక్షణము లన్నియు తగ్గినవి

గుండె బలముగా నుండుటకు డిజటాలిస్ అను మందు, లోన పేగులలో విషములు లేకుండుటకు డైమాలు, మూత్రకోశము శుభ్రముగ నుండుటకు ఎక్సమీను మొదలగునవి యిచ్చుచు నతి జాగ్రత్తగ వైద్యము చేయుచునేయుండిరి. చోప్రా మొదలగు మహానుభావులు పాశ్చాత్య వైద్యములోనికి గొనివచ్చిన ఆయుర్వేదౌషధముల నాసవముల నుపయోగించినారు.

ఇతర జబ్బులువచ్చి తగ్గుటయే కాని అసలు జ్వరము తగ్గలేదు.

రాజారావు చుట్టములలో నొకడు గొప్ప ఆయుర్వేద వైద్యుడు వచ్చి చేయిచూచి పెదవి విరిచి రాజారావుకడకు పోయి 'ఏమి చేయదలచుకొన్నావురా, అబ్బాయి?' అని అడిగెను.

రాజారావు 'ఏమి చెప్పను మామయ్యా! ఈ రోజో రేపో అనుకుంటున్నాము. వ్యాధికి మందున్నది; ఆయుస్సుకు లేదు అని నా కీనాటికి దెలిసి వచ్చింది' అనుచు నిట్టూర్పు విడిచెను.

భర్తయగు రాజారావును, తన బిడ్డలను, నితర చుట్టములను వదలి, సూరమాదేవి దివంగతురాలైనది.

భార్య బ్రతుకదని రాజారావుకు దోచినప్పుడే నారాయణరావునకు తంతినిచ్చినాడు. నారాయణరావు హైదరాబాదు వెడలి ఇంకను రాలేదు. పరమేశ్వరుడు తిరిగి హైదరాబాదుకు తంతినిచ్చి తానుతక్షణం బయలుదేరి, అమలాపురం వెడలిపోయెను. పరమేశ్వరుడు వెళ్ళిన నాలుగుగంటలకు సూరమాంబ దేహము చాలించినది.

ఆ బాలిక తలిదండ్రులు, అన్నదమ్ములు, రాజారావు తల్లిదండ్రులు వచ్చినారు. ఇల్లంతయు చుట్టాలతో నిండి గొల్లుమనిపోయినది. రాజారావు స్తబ్ధుడైపోయినాడు.

కొత్తపేట నుండి సుబ్బారాయుడు గారు, జానకమ్మగారు వచ్చినారు. శ్రీరామమూర్తి రాజారావింటికి రాని నిముషము లేదు.

ప్రాణము పోవుముందు సూరమ్మ భర్తను బిలిచి యాతనికి రెండు చేతుల నెమ్మదిగ దరికిచేర్చి నమస్కరించి, 'పిల్లలు_ మీకు_ చెప్పనక్కర లేదు. మళ్ళీ_వివాహం _ చేసుకోండి' అని కన్నుల మూసికొని మరల తెరచినది. అప్పుడామె మోమున పారలౌకిక కాంతి ప్రజ్వరిల్లినది. ఆమె చిరునవ్వు నవ్వుచు, ప్రక్కనే భగవద్గీత చదువుచుండిన మామగారిని చూచి, మామగారికి నమస్కరించి 'కృష్ణా! కృష్ణా !' యని ప్రాణము వదలినది.

ఆయమ్మ తలిదండ్రు లా శవముపై వ్రాలి రోదించిపోయినారు. 'తల్లీ! నువ్వు భూదేవతవు. మాకెప్పుడూ చాకిరీ చేసేదానవు. నా కొడుకువల్ల కాకపోయినా నీవల్ల ముక్తి పొందుదామనే అనుకున్నాను. అందరికీ తల్లోని నాలికలా ఉండేదానవు.

'నాతల్లీ ! నాబోటి నిర్భాగ్యురాలికి నీవంటి కోడలు ఎలా దక్కుతుంది సూరమ్మతల్లీ!' యని రాజారావుతల్లి గుండెలవియ విలపించినది.

రాజారావుకు నిరువు రాడుపిల్లలు. పెద్దపిల్ల ఆరేండ్ల బాలిక, రెండవది మొన్న పుట్టిన చంటిబిడ్డ. వీరిరువురకు మధ్య నొక యాడుపిల్ల పుట్టిపోయినది.

రాజారావు ధీరత్వముతో తన దుఃఖమంతయు దిగమ్రింగి తిరిగినాడు.

ఇంతలో నారాయణ రావు రెండవరోజుకు వచ్చిపడినాడు.

రాజారావును తన హృదయమునకు జేర్చుకొన్నాడు. అక్కడ నారాయణుడు, రాజారావు, పరమేశ్వరమూర్తి మాత్రమే యున్నారు. రాజారావు వైద్యస్నేహితు లదివరకే వెడలిపోయినారు.

రాజారావు కంటివెంబడి అశ్రుధారలు ప్రవహించినవి. నారాయణు డోదార్చినాడు.

'నా బ్రతుకులో, నా జన్మంలో ఉత్కృష్ట భాగం మాయమైంది నారాయణా!'

'ఓయి తెలివితక్కువా! ఎక్కడికి మాయిమైందంటావు? దేహంవదలి పోయిందంటావు. అయితే ఏం? ఆమె ఉత్తమవ్రత కావున మళ్లీ యెత్తే జన్మ, జన్మరాహిత్యం చేసుకునేందుకనే ఎత్తుతుందిరా!'

'ఎంత సమాధానపరచుకున్నా మనసు కుదుటపడడం లేదురా.'

‘అవును. ఎంతనుకున్నా మానవమాత్రులం. ఈ మానవ జన్మలో ఎన్నో మనం చెప్పుకోగలుగుతున్నాము. అనుభవించగలుగుతున్నాం. ఈ జన్మ లోంచే మనం తరించేదికూడాను. అంతజబ్బు ఎలా చేసిందిరా, డాక్టరు ఆంజనేయులు, డాక్టరు నాగరాజుకూడా వచ్చారన్నావు. అబ్బా! అదేమిటోయి, మీరెవరూ ఏమిటో చెప్పుకోలేని జబ్బుకూడా ఉందాంట? ఇంతకు మనకు దురదృష్టం రాసిఉన్నదిలే, లేకపోతే అటువంటి విచిత్రరోగం రాదు. అదేమిటిరా పరం! కళ్ళనీళ్ళు తుడుచుకో! వట్టి బేలహృదయం నువ్వూనూ! రాజారావూ! నీ కళ్ళనీళ్ళు చూసి పరమం కూడా గంగానదిలో యమునను సంగమం చేస్తున్నాడు. మొన్ననే చూసినట్లు ఉందిరా! అప్పుడు బతికించుకున్నావు. ఆ రోజుల్లో నువ్వు చూపించిన ప్రజ్ఞ ధన్వంతరిని తలపించింది. అట్టి సుశీల, పరమసాధ్విని చూట్టం అరుదురా. దేవుడు ఎవరికీ ఉపకారం చేయడేమో! ఆ పని మనుష్యులగోల ఏమిటి? ‘మా తల్లి! మా తల్లి!’ అని ఒకటే యేడుపు.’

‘నారాయణ! అదిగో ఆ పనిచేసే మనిషి, అక్కడ కూర్చున్న వారిలో గుమ్మం దగ్గిర రెండోది, అది మా అమ్మాయి బంగారుబిళ్ళ తెంపుకొనిపోతూ ఉండగా, మా నౌకరు పట్టుకొన్నాడు. పోలీసువాళ్ళకు అప్పగించాలనుకున్నా; నా భార్య కన్నులు విప్పి తెల్లబోయి,

‘అదేమిటండీ! మీ హృదయం గాంధీగారి బోధలు మరిచిందా! పోనీలెండి, దాన్ని వదిలేయండి. తప్పుని గట్టిగా చెప్పి వదిలివేద్దాం. దాన్ని మానిపించవద్దు’ అని సన్న సన్నగా చీవాట్లు పెట్టింది. నేను వైద్యంచేసి బతికించిన అమ్మాయిభర్త ఇక్కడ పోలీసు జవాను. మా యింటిలోని దొంగతనము సంగతి తెలిసికొని, చరచర మా యింటికొచ్చి, కేసుపెడతాననీ, అనుమతి యివ్వండనీ అడిగాడు. మా ఆవిడ ఒప్పుకోలేదు. ఆనాటినుంచి ఆ పనిమనిషి నమ్మకంముద్ద అయిపోయిందోయి!’

‘అవునోయి, సూరమ్మను గూర్చి నువ్వు నాకు చెప్పడమా! నా చెల్లికన్న ఎక్కువ ప్రేమ, నా తల్లికన్న ఎక్కువ ఆదరణ చూపించేది.’

రాజారావు తన హృదయమంతయు స్నేహితు లిరువురికడ వెళ్ళబోసి కొన్నాడు.

తాను వేదాంతము చదువుటయందు సర్వమూ మరచిపోవువాడు. వైద్యమునందు మునిగియుండువాడు. ఇంటిలో నేమియున్నదో ఏమిలేదో యను విచారణముతో నాతని కవసరముండునదికాదు. ఎంతమందియో చుట్టాలు వచ్చువారు. సూరమ్మ తన హృదయ మెఱిగి చరించు సుశీల. గృహలక్ష్మి. వృద్ధులగు నత్తమామలకు భక్తిమెయి పరిచర్య జరుపునది. తన భార్యయన్న హృదయమున నెంత ప్రేమయున్నను ఒక్క నాడైన తాను నిండారు ప్రేమను భార్యతో మాటలాడుకొనలేదు. ఆయమకు దన భర్తమనస్సేమి కష్టపడునో యన్న భయమే.

‘ఆమెను నా బిడ్డలకు తల్లి అయ్యేందుకు ఉపయోగించానే గాని నా హృదయము నిండారుగా ఆమెతో మాట్లాడలేదు. ఇంకోచిత్రం ఏమిటంటే; చుట్టపక్కాలకు ఎప్పుడూ పతిభక్తి బోధిస్తూ ఉండేది. భాగవతము కంఠతా! అందులోని వేదాంతార్థాలు చెప్పేదిట. నాకు తెలియదు. ఆమె చక్కని గొంతుకతో పద్యములు చదవగలదు అన్న సంగతే తెలియదు నాకు’ అని రాజారావు తలపోసి విలపించెను.

అంతకన్న అంతకన్న వారి చర్చలు వేదాంతపథముల విహరించినవి. జీవపరమాత్మల సంబంధము, జీవావతారము, పరమాత్మావతారము, జీవాత్మ పరమాత్మ సంధానము, సాంఖ్యజ్ఞానసిద్ధాంతము, యోగకర్మసిద్ధాంతము, కర్మ జ్ఞానమార్గముల సమీకరణము,

పురుష ప్రకృతి, వాద బ్రహ్మావాద సమీకరణము, గీత ఎట్లుచేసెనో, గీతావాక్కు ప్రపంచములో మహోత్తమగ్రంథ మెట్లాయెనో, శ్రీకృష్ణుడెట్లు సంపూర్ణావతారమో అన్నియు చర్చించుకొన్నారు.

వేదము లిరువురు పురుషులే యన్నవి. సాంఖ్యము అనంతమగు పురుషులు, ఒక్క ప్రకృతి యన్నది. ఉపనిషత్తులొక్క బ్రహ్మమునే తెలిపినవి. గీతలో శ్రీకృష్ణుడు వాటినన్నిటిని సమన్వయము చేసినాడు. భగవంతుడే లేడనువారు, అనేక లక్షల భగవంతులున్నారనువారు, ఒక్కడే భగవంతుడున్నాడను వారు, మూడువిధములుగ జనులున్నారు. ఈ మూడు వాదనలను సనున్వయము చేసినాడు శ్రీకృష్ణుడు. సాంఖ్యము ద్వైతవాదమునుకూడ మించిపోయినది. సాంఖ్యులు విశ్వకారణము నేమందురు? విశ్వము నావరించిన రెండు మూలసూత్రములు పురుషుడు, ప్రకృతి, పురుషుడు సాక్షి. ప్రకృతిశక్తి .

సాంఖ్యము వెనుక యోగము చర్చించినారు. గీతలోని యోగమార్గము పతంజలి చెప్పినదికాదు. పతంజలి గీతకు కొన్ని వేల వర్షము లిటీవలి వాడు. యోగమునుగూర్చి అనుశ్రుతముగా, పరంపరగా వచ్చిన దానిని పతంజలి ప్రోగు చేసి, సూత్రరూపముల వెల్లడించినాడు. గీతలో చెప్పుయోగము పతంజలి కెన్నో సంవత్సరముల పూర్వకాలము నాటి ఋషిసాంప్రదాయమగు యోగము.

ఆ వెనుక ఉపనిషన్మతమును గూర్చి చర్చించినారు. భగవద్గీత ఈ మూడింటిని ఎట్లు సమన్వయించినది చర్చించి నారు.

సాంఖ్యులు పురుషుడు, ప్రకృతి, త్రిగుణములు, త్రిగుణ జనితములగు ఇరువది నాలుగు తత్త్వములు అను వానితో మొదలు పెట్టి, వెనుక నుపనిషత్తులు చెప్పిన క్షర, అక్షర బ్రహ్మములను జెప్పి ఈ రెంటికిని సమన్వయము చేయు పురుషోత్తముడు అని పరబ్రహ్మావాదమును సిద్ధాంతీకరించును, క్షరబ్రహ్మయు ప్రకృతియే. అక్షరబ్రహ్మయు సాక్షి. క్షరముతో సంబంధము లేక తనలో జనించిన క్షరమునుజూచుచు నుండును. క్షరబ్రహ్మయు అక్షరబ్రహ్మ స్వరూపమే. ప్రకృతిని లయించి ప్రకృతిని ఆటంక ప్రకృతిలో చేరియును తన స్వరూపమగు క్షరబ్రహ్మమును జూచుచుండును. ఆ క్షరపురుషుడు ప్రకృతిలో జేరక ప్రకృతి స్వరూపమగు క్షరబ్రహ్మమునకు సాక్షి. అక్షరబ్రహ్మమునకు పైన పరబ్రహ్మము పురుషోత్తముడున్నాడు. క్షరాక్షరబ్రహ్మ లిరువురు పరబ్రహ్మ స్వరూపములే. పరబ్రహ్మమే తన ప్రకృతివలన జీవాత్మయగును. ఆ ప్రకృతియే మూలప్రకృతి. ఆ మూల ప్రకృతిలో నుంచి జనించినది సాధారణ ప్రకృతి.

౭
ప్రేమాశయము

సూర్యకాంతం పరీక్షలో బాగుగా వ్రాసినది. తప్పక విజయమందితీరునని నారాయణరావు నిశ్చయించినాడు. రాజారావును వీడి నారాయణరావును బరమేశ్వరుడును చెన్నపురి చేరినారు. శారద పరీక్షలో బాగుగ వ్రాసినట్లు జమిందారుగా రల్లునికి వ్రాసినారు.

దారిలో బరమేశ్వరునికి నారాయణరావు రాజేశ్వరుని చరిత్రయంతయు జెప్పినాడు. 'రాజేశ్వరరావుతో ఒక దినమంతయు ధర్మజిజ్ఞాస చేశానురా! వాడి దృష్ట్యా చూస్తే న్యాయపథంగానే ఉంటుంది వాడి నడత. వాడెంత సేపు చెప్పినా 'నాకు మా వివాహధర్మములందు నమ్మకము లేదు. పుష్పశీల నన్ను ప్రేమించింది, నేనామెను ప్రేమిస్తున్నాను. ఆవిడకు నామీద ఇష్టంపోతే ఆవిడ యిష్టంవచ్చినచోటికి వెళ్లవచ్చును.

నేనెప్పుడూ ఏవిధమైన అభ్యంతరం పెట్టను. నీ వేదాంతం నా కవసరం లేదు. నీ ధర్మం, నీ అహింస, నీ సత్యమార్గం నాకు పథ్యం కాదు. నాకు అర్థం కాదు. నువ్వు నీ బోధ పుష్పశీలకు చేసుకో. ఆ అమ్మాయి మనస్సు మళ్లుతుందీ, తీసుకుని వెళ్లి ఆ భర్తకే అంటగట్టవోయి. ఇది మాత్రం నేను నిర్ధారణగా చెప్పగలను. పుష్పశీల సంపూర్ణంగా నన్ను ప్రేమిస్తోంది. సర్వకాలం ఆమెకు నామీదే ఉంటుందని చెప్పను. ప్రేమకూడా నువ్వు చెప్పే బ్రహ్మపదార్థంలా నిత్యమని చెప్పటం మామతమేకాదు!' అన్నాడు. నేను, ఆ అమ్మాయితో ఒంటిగా ధర్మమార్గం అంతా చెప్పినాను. ఆ అమ్మాయి విన్నదంతా విని నవ్వుతూ 'నారాయణరావు అన్నగారూ! మీరంటే చాలా గొప్పగా చెబుతారు నాయుడుగారు. కాని చూస్తే మీరు వట్టి ముసలమ్మ కబుర్లు చెబుతున్నారు' అన్నది. నేను మాత్రం తెల్ల బోయినాను'

'ఏమి చెప్పావురా రాజేశ్వరుడితో?'

'ఏముందిరా! నీ వృత్తిలో సర్వసృష్టిన్ని పరబ్రహ్మైక్యం చేయడమే మహాత్ముల దృష్ట్యా ఉన్నతాశయం అన్నాను. కాబట్టి అందరూ ఒక్కసారే మోక్షం పొందినా ఇబ్బందిలేదురా అన్నాను. మనం చేసే పనులు రెండువిధాల ఆలోచించాలి. నివృత్తికోసం, ప్రవృత్తికోసం. అంటే మోక్షమార్గం క్రిందా, ప్రపంచంలో ఆనందం పొందడం క్రిందా. నువ్వు చేసినపని ఎందులోకి వస్తుందన్నాను.

'నాకు ఇప్పుడు ఆనందం ఇస్తోందిగా!' అన్నాడు.

'అదేనా నువ్వుచేసే ప్రతికార్యం ఆలోచించుకోవలసిన పద్ధతి? ఏ కార్యం చేసినా దాని మంచి చెడుగులు నీ జీవితం అంతా ఎలా ఉపకరిస్తాయి, ఎలా అపకారం చేస్తాయి అని ఆలోచించుకోవుట్రా' అన్నాను.

'ఇప్పు డీ అమ్మాయి నువ్వూ ఉన్నారుకదా, ఆ భర్త నీపై శిక్షాస్మృతి క్రింద కేసు తెస్తాడనుకో. నువ్వు ఏ రెండేళ్లో జైలుకు వెళ్లవచ్చుకదా?' అన్నాను.

'అవును. నువ్వు నీ అహింసమార్గం అవలంబిస్తూ జైలుకు యెందుకు వెళ్లావు? నా ఆశయంకోసం జైలుకు వెళ్లితే తప్పా?' అన్నాడు.

'మనం చేసే ప్రతికార్యం దోషరహితంగా ఉండదు. 'సాధ్యమైనంత వరకు' అనే మాట ఒకటుందికదా. అలాగే నువ్వు ఆచరించే కార్యాలలో సాధ్యమైనంత వరకు ఇతరులకు కష్టంగా ఉండకూడదు అని కూడా చూడాలి కదా' అని నేనంటే, 'చూడాలి కాని సంఘం ఒక దోషం చేస్తూంటే అది మార్చడానికి ప్రయత్నం చేసేటప్పుడు కొందరికి అపకారాలు జరుగుతాయి. నీ అహింసావ్రతంవల్ల ఎంతమందికో నష్టం కలుగవచ్చును. అంతమాత్రాన మానుతావా?' అని నన్ను ప్రశ్నించాడు.

'సరే, అంతవరకు వచ్చావు గనుక నేను అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పు. ప్రపంచంలో ఉత్కృష్ట ఆశయం ఏది?' అంటే , 'సంతోషమే ఉత్కృష్ట ఆశయ' మన్నాడు.

'సంపూర్ణమైన, సర్వతోముఖమైన సంతోషం ఏరకమైన స్త్రీ, పురుష సంబంధములో లభిస్తుంది? అనే ప్రశ్నకు, 'ఇంతవరకు లేదు. ముందుముందు మా పద్ధతివల్ల లభించగల' దని చెప్పాడు.

'జడ్జి లిండిసే గారి వ్రాతలు, సర్ హావిలాక్ ఎల్లిస్ మొదలగు వైద్య విశారదుల వ్రాతలు చదివావా?' అన్నాను.

'అవన్నీ గమనించి వివాహశాసనం ఉన్న మనదేశంలో స్త్రీ, పురుషులకు అంతకంటె ప్రాపంచినందం ఎక్కువగా కలగటం లేదని చెప్పగలవా?' అన్నాను. 'అమెరికాలోని పద్ధతులు ఎంత నికృష్టంగా ఉన్నా లిండిసే కనబరచిన దోషాలకు అతడు చూపినది నివారణోపాయంకాదు' అన్నాడు. షెల్లీ మొదలగువారు మీ పద్ధతులు అవలంబించి భగ్నమనోరథులై కృశించి కృంగిపోయారు. ఇంక ప్రకృతిశాస్త్రజ్ఞులు శాస్త్ర పరిశోధన చేస్తూ చేస్తూ ప్రకృత్యతీతమగు పరబ్రహ్మకు మార్గము చూపు దారికి వచ్చి యచ్చట ఆగిపోయినారు. ప్రకృతి సంబంధమగు పరీక్ష చేయడానికి పనికివచ్చే పరికరాలు పరబ్రహ్మమును కనిపెట్టలేవు. ప్రకృతిమార్గం చేత పరానికి దారి దొరకదు. దానికి పార లౌకికంగా ఆలోచించాలికదా. పారలౌకికంగా ఆలోచిస్తేనే మీదనున్న దారి కనపడుతుంది అంటూ ఈలాగున చెప్పాను. వాడు తల వాల్చుకొని ఉన్నాడురా. ఆ పిల్ల కూడా చెంతనే ఉన్నది. ఇంతా విని ఆ అమ్మాయి అన్నదికదా, 'నారాయణరావు అన్న గారూ! నా జన్మలో నేను మనుష్యస్త్రీగా సంచరించింది ఈరోజులే. మీరెంత చెప్పినా లాభంలేదు' అన్నది. సరే, బాగా ఆలోచించుకోండి, అని బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నాను. రాజేశ్వరునితో ఆ అమ్మాయి భర్త వచ్చినాడని చెప్పినాను. అత 'డల్లాగా' అని అతన్ని కూడా వచ్చి భార్య హృదయం మార్చడానికి ప్రయత్నించమనరా' అన్నాడు. నాకు నవ్వువచ్చింది. ఇంతలో నువ్వు పంపించిన భయంకరమైన టెలిగ్రాము చక్కా వచ్చింది.'

చెన్నపట్నం వచ్చుటతోడ నే నారాయణరావుగారి ఇంటిలో సూరీడు, శ్యామసుందరి, ఆమె ముగ్గురు చెల్లెళ్లు అందరూ కూర్చొనిఉండగా నారాయణరావు, రాజారావు భార్య పోయిన సంగతి చెప్పి, సూరమాంబ గుణగణములను వర్ణించి చెప్పినాడు. శ్యామసుందరి వివర్ణవదనయై విన్నది.

'అన్నా! మంచి వాళ్లు బ్రతుకరుగదా!' 'అవునమ్మా! లోకంలో ఉండే చెడుగు మంచిని తరిమేస్తుందంటావు. మామూలుదృష్టికి అల్లాగే కనబడుతుంది. కాని ఈ ప్రపంచంలో చెడుగు ఇంకా హద్దుమీరకుండా ఉన్నదంటే, మంచియొక్క ప్రాబల్యం చేతనే. చెడుగు ప్రాబల్యంగా ఉంటే యీపాటికి జగత్తుకు ప్రళయం రాదటమ్మా. మనకు ఈ ప్రకృతే అంతా బోధిస్తూఉన్నది. రాక్షసశక్తి కిరసనాయిలులో ఉన్నది. ఆవిరిలో ఉన్నది. విద్యుచ్ఛక్తిలో ఉన్నది. ఇవన్నీ కట్టుతప్పితే కాలాన్ని దగ్ధం చెయ్యగలవు. అలాగే మనుష్యునిలో ఉండే రాక్షసశక్తి కట్టుతప్పకుండా చేస్తూఉన్నది అతనిలోని మంచే సుమా! కాబట్టి చెడుగు మంచిని తరిమి వేస్తోందని ఎల్లా చెప్పగలవమ్మా?'

'నిజమే అన్నా!'

పర: ఒరే నారాయుడూ! ఒక సంగతి ఆలోచించు. చెడుగు, మంచి ఒక్క ప్రకృతిలో నుంచేకదా వస్తాయి, అప్ప చెల్లెళ్ళవలె. ఎందుకు మంచి మన మోక్షానికి మార్గం అయింది; 'చెడుగు' ఎందుకు కారాదు?'

నారా: నీకు తెలియదా, నన్నడుగుతావు! పురుషుడు ప్రకృతి మాయచే దేహాత్మ భ్రమలో పడుతున్నాడు. అహంకారంలో ఉన్నన్నాళ్ళు పురుషుడు సాక్షీభూతుడగు అక్షరుని, అక్షరస్థానమందుండి పురుషోత్తముని తెలిసికోలేడు కదా! ఆ పురుషుడు, ఆ ప్రకృతి పరబ్రహ్మ స్వరూపులేకదా. కాబట్టి ప్రకృతి యొక్క గుణములలోంచి జన్మించిన మంచి చెడ్డలతో మంచి పురుషుడు తానే అక్షరబ్రహ్మమను జ్ఞానం సంపాదించుకొనుటకు మార్గం అయ్యాడు.'

రుక్మిణియు, చిన్న బాలయు క్షేమముగ నున్నారు. పరమేశ్వరునకు గొమరితయందు

వెఱ్ఱిప్రేమ. ఆమెపై నెన్నియో పాటలు వ్రాసినాడు. రోహిణి దేవి వానిని చదువుమని మరియు మరియు గోరునది. పరమేశ్వరుని భావములన్నియు చిత్రములు. అనాదినుండియు ఒక సంపూర్ణ ఆత్మ ఉద్భవిస్తుందట. అది ఆ ఆదికాలంలోనే స్త్రీ పురుష మూర్తులనే రెండు ఆత్మలుగ విడివడునట. వారి జీవిత యాత్రలో నెప్పుడో యొకప్పుడు భార్యాభర్తలే కలియుదురట. ఒక్కొక్కప్పుడు ప్రాణమిత్రులైన స్త్రీ పురుషులై కలియుదురట. అట్టి జన్మలో ఒక నాడు స్త్రీ పురుషునకు మోక్షముపొందుమార్గ ముపదేశించునట. అప్పుడా జంట ఒకటై తారకమార్గము నందునట. ఇదియంతయు నిజము కాకపోయినను ఒక్కటిమాత్రము నిజమని పరమేశ్వరుడు వాదించును.

'ఒరే నారాయుడు! పురుషుని కొక యాశయస్వరూపమయిన వనితయును, స్త్రీకి ఆశయస్వరూపుడైన పురుషుడున్ను ఉండితీరాలి. వారాచరించు దీక్షకు ఉత్సాహము, ఉత్తేజము ఇస్తూఉంటారని నేను పూర్ణంగా నమ్ముతాను. డాంటీకి బియట్రిసు ఉన్నట్లు, కీట్సుకు ఫానా ఉన్నది. నెపోలియనుకు జోసెఫైను, సంపూర్ణావతారస్వరూపమగు శ్రీకృష్ణునికి రాధ, పాండవులకు ద్రౌపది, రామునకు సీత, వివేకానందునకు నివేదిత, కాళిదాసు కాయన భార్య, లీలాశుకునకు చింతామణి, క్రైస్తునకు మాగ్దలీను, మీరాబాయికి తాన్ సేను, అనిబిసెంటుకు కృష్ణాజీ. అవునా?' అనినాడు ఒకనాడు పరమేశ్వరుడు.

'నువ్వు చెప్పినది చాలాభాగము నిజమే. ఎందుకు నీ కా ఆలోచన కలిగింది?'.

'నాకూ, రోహిణీబాలకు స్నేహము కలిగినప్పటినుంచీ ఎన్ని పాటలో వ్రాశాను. బొమ్మలుకూడా, చూశావా? ఆమధ్య ఆగాను. మరల నాకు ఎక్కడ లేని శక్తివచ్చినట్లు వేయుట ప్రారంభించాను.'

'అవును! నేనూ ఆశ్చర్యపడుతూ ఉన్నాను. అదా నువ్వూ, రోహిణీ ఎప్పుడూ కలిసి మెలిసి మాట్లాడుకోవడం?'

'రోహిణీ దేవికి ఈ యేణ్ణర్థం నుంచి చిత్రలేఖనం బాగా నేర్పుతున్నాను, నీకు చూపించమంటే పూర్తిగా తానువేసిన బొమ్మలు తయారుగానే చూపిస్తానంది. అంటే నేను దిద్దడం తక్కువగా ఉండడం అన్నమాట. నాలుగు బొమ్మలు వేసింది. మొదటి మూడు నేను బాగా దిద్దాను. ఆ బొమ్మలలో నా ప్రజ్ఞే ఎక్కువపా లున్నది. ఇప్పుడు వేసింది అంతా ఆమె. నేను ఒక గీతగీసినానో లేదో అన్నీ తనే వేసుకున్నది. బొమ్మలు వేయుటలో మమ్ముల నందరినీ మించేటట్టు ఉన్నదిరా!'

'దుర్మార్గుడా! నాకు చూపించకుండా నువ్వు ఇన్నాళ్ళు దాచావు?'

'అరే! నీతో నేను వాళ్ళకి బొమ్మలు వేయటం నేర్పుతున్నానని చెప్పలేదుట్రా?'

'కాని ఇంత బాగా వేస్తుందని సూచించి ఉంటే నేను చూచి సంతోషించేవాణ్ణి. ఏదీ ఈవాళ సాయంత్రం వాళ్ళయింటికి వెళ్ళి చూద్దాము, శ్యామసుందరి బొమ్మలు వేయలేదు కాబోలు.'

'వేయలేదుకాని శ్యామసుందరి తెలుగులో కవిత్వం రాయడం మొదలుపెట్టినది. తెలుగు చదువను, వ్రాయను బాగా తెలియకపోయినా వినికిడివల్ల, ఎక్కడినుంచి పట్టుకున్నదో తెలుగునుడి, ఏమి తియ్యగా వ్రాస్తుందిరా! పాటలలోని రహస్య మామెకు బోధించినాను. ఈమధ్య సంస్కృతం బాగా చదువుకుంది. నీ కీ రోజునో రేపో పాడి వినిపిస్తానంది.'

౮

అగాధము

నారాయణరాయని జీవితాంతర్గతమగు ప్రేమప్రవాహము మహావేగమున ప్రవహించి మాయమగుచున్నది. విద్యుచ్ఛక్తి రెండు స్వరూపములట. అవి ఒకదాని కొకటి వ్యతిరేకములట. రెండును కలిసిన గాని విద్యుచ్ఛక్తి కాదట. అట్లే మానవుని ప్రేమయు ఎదిరిప్రేమ లేనిచో వ్యర్థమై జీర్ణించిపోవును. ఒకప్పు డా జీవిని మూలమునంట కదల్చివేయును. ఎన్ని యుగములకో శారదకు మెలకువ వచ్చుటయని యెదురు చూచుచున్నాడు. ఇంగ్లీషుకథలో చెప్పిన నిదురసుందరిని మేల్కొలుపగల ముద్దు తన బ్రతుకులో లేదా? తా నా రాజకుమారుడును గాదా యని యాత డనుకొన్నాడు. ఎన్ని సారులో దననిశ్చయమును మరచి యా బాలికను దరి చేర్చుకొని తనలో నైక్యమొనరింపదలచుకొన్నాడు. ఆ బాల వట్టి విగ్రహము వలె చైతన్య రహితమా యన్నట్లున్నది.

ఇట్లు శ్యామసుందరి ఉత్తమ మేధాసంపన్నురాలు. కర్మయోగిని. వైద్యవృత్తిచే రోగి నారాయణసేవ జేయ సంకల్పించినది. వైద్యవృత్తిచే వచ్చు ధనము దేశసేవకై వినియోగించెదని యామె దీక్ష. ఆ బాలిక తన సహోదరి. ఆమె సంగీతము నేర్చుకొన్నది. పరమేశ్వరునికడ పాటలువ్రాయ నేర్చుకొన్నదట. ఏమి పట్టుదల! ఆమె హృదయమెంత సున్నితము. ఎంత ప్రేమమయము. ఆమె వైద్యురాలై యెట్లు మనగలదు? నీవు శస్త్రచికిత్స చేయ గలవా యని తాను ప్రశ్నింప__

'వజ్రాదపి కఠోరాణి, మృదూని కుసుమాదపి' యని చదివినది. ఇట్టి యుత్తమాంగనలు దేశమాతకు భూషలుగదా!

ఈ యాలోచనలతో దానును బరమేశ్వరుడు కారునెక్కి శ్యామసుందరీ దేవి యింటి కా రాత్రి వెళ్ళినారు. అప్పుడు శ్యామసుందరి దీక్షగా పరీక్షకై చదువుకొనుచున్నది. మనవారిని చూచి మోము ప్రఫుల్లమైపోవ తన సహజమగు నొయారపు నడకతో వచ్చి డాబామీద నున్న కుర్చీలుసర్ది, రండని వారితో నచ్చట కూర్చున్నది. పరమేశ్వరుడు రోహిణి యేదని యామెను వెదకుచు లోనికి బోయినాడు.

పదియేను నిముషములు వారేమియు మాటలులేక కూర్చుండినారు. ఆమె నలముకొన్న భక్తి యాతని చుట్టివేసినది. ఆమె తలవంచుకొని యేమి యాలోచించుకొనుచున్నదో. సముద్రపవనములు శీతలములై హాయిగ వీచుచున్నవి. తారకలు తమ కాంతిరకముల నెమ్మదిగ పన్నీరు చల్లుచున్నవి.

చటుక్కున నారాయణ రావు తలయెత్తి 'చెల్లీ! నువ్వు పాటలు రాయుచున్నావని పరమేశ్వరుడు చెప్పాడు. ఒక పాట పాడ్తావా?'

'అదేమిటన్నా! పరమేశ్వరం అన్న, కొంటె అన్న, ఏమిటి నాపాటలు!'

'పాడమ్మా! నా దగ్గరకూడానా నీకు సిగ్గు?'

'పాడుతాను. మరి నువ్వేమీ అనుకోకుండా ఉండాలి. నీవంటివారి దగ్గర పాడుటకు చాలా ధైర్యం ఉండాలి అన్నయ్యా!'

'నేను కొట్టనుగద!'

‘ఏమో ఎవరికి తెలుసును?’

‘పాడు మరి. శ్రుతివద్దు. నీ కంఠంలోనే ఉంది శ్రుతి.’ ‘వదినగారి కంఠంలో ఉన్న శ్రుతి, ఎవరి కంఠంలో ఉంది?’

‘ఏమిలాభం?’

‘అదేమిటన్నా!’

‘ఏమీలేదు తల్లీ, ఏమీలేదు. శ్యామా! పాడు.’ అతని కంఠమున మారినది.

చటుక్కున శ్యామసుందరి లేచి ‘అన్నయ్యా! నీ ఆత్మ పరమ పవిత్రమైనది’ అని అన్నది. ఆమె కూర్చుండినది. శారద నారాయణరావుయొక్క ఉత్కృష్ట జీవితరాగానికి శ్రుతి కాలేకపోయినది కాబోలు. ఈ యువకుడు తన గంభీరహృదయంతో, మొక్కవోని మనస్సుతో తలవాల్చి ముందుకే నడుచుచున్నాడు. శారద ఈ పుణ్యచరిత్రుని బ్రేమించుట లేదా? అవును, అవును. ఆమెకు ఒక్కసారి మబ్బుచాటుననుండి వెన్నెల ప్రసరించినట్లయినది. శారద చరిత్ర ఇప్పుడొక్కసారిగా అవగతమైపోయినది. శారద నారాయణరావును బ్రేమించుటలేదు.

ఎందుకు ప్రేమించుటలేదు? అయ్యో, శారద ఎంత మూర్ఖహృదయ! ఎక్కడను ఈతడు తన రహస్య మిసుమంతయు నితరులకు దోపించక సంచరించుచున్నాడే. శారద! నీ వెంత దురదృష్టవంతురాలవు! నీ హృదయమున కర్కశత్వమున్నదా? నీ రూపమంతయు విగ్రహరూపమా? నీలోన నేమాత్రము ప్రేమలేకుండ నుండవలె. నీవు మరుభూమివా? ఏమి యీ విషాదము; ఈ విచిత్ర నాటిక. ఆమె భావములు వెలుగువలె ప్రసరించినవి. ఆపరాని దయ ఆవరించిపోయినది, అశ్రువులు తిరిగినవి. ఆమె మైమరచిపోయినది. తిన్నగ నారాయణరావుకడకు బోయినది.

ఆమె అతని తలను దనహృదయమున నదుముకొన్నది.

ఒక్కసారిగా ఇరువురకు దేహములు కంపించినవి. వార లిరువురి రక్తములు వేడియైపోయినవి. అప్రయత్నముగ నారాయణరావు శ్యామసుందరిని గవుగిలించుకొన్నాడు. వారిరువురు దృఢాలింగనాపరవశులైరి. శ్యామసుందరి నారాయణరావు మోమును దన వైపునకు ద్రిప్పి భక్తితో నాతని ఫాలమును ముద్దుగొన్నది. నారాయణుడు సర్వము మరచినాడు.

ఆమె శారదయైనట్లు గాఢలాలసుడగు నారాయణరావునకు దోచినది.

తక్షణ మా కౌగిలి సడలించి నారాయణుడు నిద్రమేల్కొన్న వాని భంగి, నిట్టూర్పు నించి ‘అయ్యో’ అనుకున్నాడు. గబగబ అచ్చటనుంచి రెండంగలలో క్రిందికి దిగిపోయినాడు. తిన్నగా తాను వెళ్లు దారితెలియక, చెమ్మటలు తుడిచికొనుచు సర్వమును మరచిన జడునిభంగి సముద్రతీరమును జేరుకొన్నాడు.

అప్రయత్నముగ ఆతనికి హాహాకారమగు శోకము కంఠమునుండి వెలువడినది. ఆతడు తలను బట్టికొని ఇసుకలో జదికిలబడినాడు. ఏమది! ఇట్టి ఘోరపాప మాచరించినాడేమి? అట్లు తా నాచరించుటకు గారణమేమి? ఆమెను బ్రేమించుచున్నాడా? అవును; తన చెల్లెలుగా చూచుకొన్నాడు. తన కైదవచెల్లె లనుకున్నాడు.

పెద్దసూరీడనుకొన్నాడు. అంతే! నిర్మల ప్రేమ రక్తసంబంధము లేనప్పుడు కొంచెము వెనుదిరిగినచో కామదోషిత మగునేమో?

తనకు వివాహము కానప్పుడు, ఒకరిద్దరు బాలికలజూచి తాను సంభోగాపేక్ష పొందినాడు. ఆ భావము ముహూర్తమాత్రము. అటువెనుక నా తుచ్ఛ భావము రాలేదు.

సంభోగ భావము తుచ్ఛభావమా! అయినచో ఋషుల కెట్లు సంతతులు గలిగినవి? లోన పుల్కరము కదలించు మోహావేశమున్న గాని సంభోగేచ్ఛ జనింపదే. ఆ యిచ్ఛ పాపమా? అది పాపమైన భార్యయందును అట్టి కోర్కె జనింపగూడదే? కాని యిదేమి యాలోచన! శ్యామసుందరి తన్ను ప్రేమించినట్లే యెరుగడు; తన్ను ముద్దుపెట్టుకొనుట సంపూర్ణముగా పాశ్చాత్యుల సోదరీ భావముననే కాదా! ఈ దేశమున అట్టి ఆచారములు లేకపోయినను ఆమె పెట్టిన ముద్దులలో దీప్తసాంత్వన మున్నది. అగుచో తనకంత వేడి యేల జనించినది? తన కట్టి ఆవేశము కలుగ ఏది కారణము? రాజేశ్వరుని మతము నిజము కాదుగద! ఛీ! అది యెట్లు?

ఆతని మత మింద్రియ సంబంధమైనది. అటువంటి యప్పుడు ఆతని మతము దోషభూయిష్ఠము. పురుషునిలో విటత్వము గర్భితమైయున్నదా, కర్రలోని నిప్పువలె? ఎప్పుడో యప్పుడు ప్రతిమానవుని నుండి యిది బయట కురుకునా? పవిత్రమయిన ప్రేమ ఆనందదాయక మందురే. అదియు ఖేద భూయిష్టమా?

అతడు బాధపడిపోవుచున్నాడు. సముద్ర కెరటములవంక జూచుచున్నను అవి కనబడలేదు. అటు తాను ప్రేమించిన తన భార్య తనకు ప్రేమ నీయదు. ప్రేమనిచ్చుటకు సంసిద్ధయగు నొకయుత్తమాంగన తలంప వీలుకానిది. ఎందుకో, మనుష్యుని జీవితములో నింతభాగ మీ ప్రేమ యాక్రమించుకొనుట? యని యాత డాడిపోసికొన్నాడు.

ఏలాగున ఆమె మోము జూచుట. చూడకపోయిన తాను వట్టి పందయై పోడా! పిరికితనము కాదా అది? ఏది గత్యంతరము? అతని కణత లుబ్బుచునే యున్నవి. రక్తము వేగముగ ప్రవహించుచునే యున్నది. వేడియై, హిమశీతలములైన తన యంగములు పట్టుతప్పిపోయినవి. ఆతని హృదయరోదనము సముద్రఘోషలో మిళితమైనది. సముద్రము ఒడ్డుననే యా యువకుడు నిశ్చేష్టుడై యట్లే పడియున్నాడు. సర్వప్రపంచము ఆతనికి లేనిదై, మాయమైనది. నారాయణరా వెప్పుడు సంభ్రమమున లేచి, నిమిషమున తనకడనుండి మాయమైనాడో, ఆ క్షణములో శ్యామసుందరికి జగత్తు తలక్రిందులైనట్లు మెలకువ వచ్చినది. ఆమె గజగజ వణకిపోయినది. ఆమె ఆలోచించుకొనుటకుగూడ భయపడిపోయినది. ఆమె కప్రయత్నముగ నేత్రాంబువులు దొరలినవి. దడదడ మని యుబికిపోవు గుండియ నామె నణచుకొన హృదయముపై రెండు చేతులు వేసికొని నొక్కికొన్నది. తానిట్టి తెలివితక్కువపనిచేసి, యాతని కలంచిన దేమి? అట్టిది ఎప్పుడైన కలనైన తలంచినదా యని వాపోయినది. అంత సమాశ్వసించుకొన్నది. తానింత యబలయైన దేమి? అత డంత కంగారుపడినా డేమి? తానేమి దోష మాచరించినది? కరుణావేశయై యాతని ననునయింప బోయినది. ఇంతలో శీలమున కేమైన భంగము కలిగించినదా? అతనిని కౌగిలించినప్పు డేమియో తీపులు తన్నలమిన ట్లయినది. అతనిని దాను ముద్దుపెట్టు కొన్నది. అదియేల? ఆ ముద్దునీయుట భారత నారీమణులు చేయు పనియా? చంటిబిడ్డను ముద్దుగొన మధురముగా నుండదా? అంతకన్న వేరు రుచి తానాతనికి సమర్పించిన ముద్దులో గోచరింప లేదు. ఎంత గట్టిగ కౌగిలించినాడు! భయపడిన బాలు డటులనే యాలింగనము చేయును.

త్రికరణములచే తాను దోష మాచరించినట్లే తనకు దోచుట లేదు. పురుషునితో స్త్రీ, సంచరించునట్లు చరించినదా? తన స్త్రీత్వమే పోయినది. తాను వైద్యకళాశాలలో నెప్పుడు చేరినదో యప్పుడే స్త్రీత్వమును వదలివేసినది. తన్నిదివర కే పురుషుడు నింత కదలింపలేదు. నారాయణరావు పవిత్రహృదయుడు. అతనిపై పవిత్రమగు ప్రేమ చూపించుచున్నది. ఆ ప్రేమలో నపశ్రుతి యేమున్నది? తన ప్రేమలో దేహానందమున్న నుండవచ్చు గాక. అది తాను దోషభూయిష్ఠహృదయముతో నాచరింపలేదే. కాని ఆతని హృదయములో నేమున్నదో, ఆతని కౌగిలింతలో గంభీరమధురములు తోచినవి. తన ప్రేమలో నేమున్నదో? ఆ క్షణికములో తా నెవరైనదో ?

అట్టి యుత్తమపురుషు డొక్కసారి తన దేహము గోరిన దాను వెనుదీయవలెనా? అంతమాత్రమున తనలో కళంకము జేరునా? అది ఎట్లు? మహర్షి రుచిగల పదార్థము నొకసారి వాంఛించిన యాతనిలోని పవిత్రత ఎట్లు నశించును?

ఏమో! ఏమో!

తా నాతని పవిత్రత భంగము చేయుటకు కారణమయ్యెనా? అట్లుకాదు. మహాసత్వుడగు నాతడు ప్రేమకై తపించినాడు. తనకు బరమ కరుణ గలిగినది. కరుణలో స్త్రీ ప్రేమ జనించినది. ఇరువు రొక పరమనిమేషమున నేదియో యానందమున నోలలాడినారు. అంతమాత్రమున దోష మేమియు లేదు.

౬
మోహధర్మము

నారాయణరావు తనకడకు రాకమునుపే రాజేశ్వరుడు పుష్పశీల హృదయము మారినదేమో యని సందియమందసాగెను. అతని తోటియుద్యోగి యగు నా మహమ్మదీయ యువకుడు రాజేశ్వరరావింటికి బదింబదిగ రానారంభించెను. రాజేశ్వరరావుమాత్రము పుష్పశీలకు సంపూర్ణ స్వాతంత్ర్యమిచ్చి, యామె యిచ్ఛానుసారము మెలగనిచ్చెను. తమ ప్రేమస్వాతంత్ర్య సంఘాదేశములు, ఆశయములు విజయమందుట కాచరించవలయు మార్గములు అన్నియు పుష్పశీల కుపదేశించినాడు. 'నువ్వు నీప్రేమ ననుసరించి మెలగవచ్చును. నీకు నామీద ప్రేమ యెంతకాలము ఉంటుందో అంతకాలం నాదగ్గిర ఉండవచ్చును. నీకు ప్రేమ సంపూర్ణముగ నాయెడల నశించిపోయి, వేరొకని నీవు వలచినచో నీవు నిస్సంశయముగ ఆ పురుషునికడకు వెళ్ళిపోవచ్చు' ననియు రాజేశ్వరరావా సుందరితో వచించినాడు.

పుష్పశీల చపలచిత్త, ఆమెహృదయము సీతాకోక చిలుకయే. రాజేశ్వరునిపై మమకార మప్పుడే నశించిపోసాగినది. ఇంతలో నీ మహమ్మదీయ యువకుడు రాజేశ్వరుని యింటికి రా నారంభించినాడు. రాజేశ్వరరావు పుష్పశీలకు నా మహమ్మదీయ యువకునితో పరిచయము గలిగించెను.

పుష్పశీలకు ఇంగ్లీషున మిడిమిడిజ్ఞానము కలదు. కాన ఆ భాషలో నా మహమ్మదీయ బాలకునితో నేదేని మాటలాడుచు వినోదించుచుండెను. ఆ బాలకుడు రాజేశ్వరరావు లేని కాలములోకూడ రాజేశ్వరునింటికి వచ్చుచుండెను.

ఒక నా డాత డా యువతి చేయి పట్టుకొన్నాడు. పుష్పశీల మాటాడలేదు. చిరునవ్వు నవ్వినది. రెండురోజులు పోయిన వెనుక నా మహమ్మదీయ యువకు డామెను వెనుక

నుండివచ్చి కవుగిలించుకొన్నాడు. పుష్పశీల ఆతని బాహువులలో బులకరించినది. వారిరువు రంత శయ్యాగృహమున కేగినారు.

రాజేశ్వరున కప్పుడే పుష్పశీలకు నా మహమ్మదీయ యువకునకు గల సంబంధము కరతలామలకమై తోచినది. ఆనాటి నుండి రాజేశ్వరుని హృదయమున నెచ్చటనో కనబడని కంటకమువలె నీర్ష్య బాధింపజొచ్చెను. రాజేశ్వరుడిది ప్రథమమున నీర్ష్య యనుకొన లేదు. ఏదో బాధ యనుకొన్నాడు.

అప్పుడే నారాయణరావు వచ్చినాడు. నారాయణుడువచ్చి యేమేమియో చెప్పినాడు. గాంధీతత్త్వము బోధించినాడు. తన భార్యను నితరులకు సంతానార్థ మిచ్చిన ఆర్యకాలము నాటి గృహమేధి తప్పొనరించినాడా? లేదు. తప్పు అనునది కాలమునుబట్టి మారుచుండునుగదా. తప్పు అని కనుగొనుటకు ముఖ్య సూత్రము మనము హింస నాచరింపుచున్నామా యని నిర్ణయించుకొనుటయే. పరదారను, పరధనమును ఆశించుట పరుల హింసించుటయే యగును. కావున పాపకృత్యమని వాదించినాడు. అహింసాసూత్రము నాధారము చేసికొని నీవు నీకర్మ నడుపవలెను. సంఘము ముక్తి మార్గము నన్వేషించుటలో నెన్నియో పద్ధతుల నలవడచేసికొనును. అవి యన్నియు అహింసకు, సత్యమునకు వ్యతిరేకము గాకూడదు. కావుననే సంఘమున ధనమంతయు నందరకు సమముగా బంచవలెనని నిబంధన పెట్టుకొని దానికై పలువుర జంపుట పాపమగును. నీవు స్వచ్ఛ కర్మయోగివై, నీ ప్రేమచే సంఘప్రజ నంతను సంస్కరింపవలెను. ఆలాగుననే స్త్రీ విషయమునను. స్త్రీలకు పురుష వాంఛయు, బురుషులకు స్త్రీ వాంఛయు హద్దుమీరుట మోక్షమునకు దూరము. అది ఇంద్రియలోలత్వములో ముంచును. గాన దానికై వివాహసంస్థ నెలకొల్పి యావాంఛను జాలవరకు తగ్గించినారు. వివాహమన ప్రేమ లేకుండుట కాదుసుమా! అందు దోషము లేవైననున్న యెడల మార్పుచేయుము. అంతియకాని నీ యిష్టము వచ్చినట్లు పోరాదు. మానవునకు స్వాతంత్ర్యము మంచిచేయుట కున్నదిగాని, చెడుగొనరించు టకులేదు.

ఈరీతిగా నారాయణరావు తనకు బోధయొనరించినాడు. అది నిజమా? ఆధ్యాత్మిక పథ మొకటి యున్నదని తనకు నమ్మకము లేదు. ఈజన్మము ముగిసిన వెనుక ఆత్మలు మరల జన్మించునా? ఆ ఆత్మలు__త్రాసునకు, జూపునకును అందని ఈ ఆత్మలు__ ఆద్యంతరహితములన్న మాట కేవలము కల్పితము అని నిశ్చయము జనించును.

కాని ఆ నిశ్చయము బూర్వమెప్పుడు చలనము లేక స్థిరమై యుండునది. ఇదివర కెంద రెన్నిరీతుల వాదించినను, వానిని ఛూ ఛూ యని తోసిపుచ్చు వాడు. నే డాతనికి అనేక సందేహములు జనించినవి. తన భావములు, గురువుగారి సందేశము తప్పేమో? ఇదివరకు తన గురువు గారి మతమువంటిదే చార్వాకమతము ఉండెడిదట. రోమను కాలమున, గ్రీకు మహాసామ్రాజ్యము విచ్ఛిన్న కాలమున ప్రజల కిట్టి విపరీతబుద్ధు లుండెడివట అని నారాయణుడన్నాడు. అది నిజమా? ఇది నిజమా?

ఈ యాలోచనలతో నొకనాడు రాజేశ్వరుడు తన యింటికడకు వచ్చినాడు. ఆ మహమ్మదీయ బాలుడును, పుష్పశీలయు లోననున్నారని సేవకుడు చెప్పినాడు. ఇంటిలోనికి వెళ్ళక మండిపోవు హృదయము నుపశమింప జేసికొనుచు రాజేశ్వరుడు తన పాదము లెచటికి గొంపోవుచున్నవో యెఱుంగని యవస్థలో నిల్లువిడిచి యేగెను.

తనలో నీర్ష్య జనించినదని యాతనికి స్పష్టమై తోచినది. దృఢవ్రతుడనని తా నెంత గర్వపడుచుండెనో యంతకు తగినశాస్తియైనది. నాకళ్ళయెదుటనే స్త్రీలు చంచలచిత్త

లనుమాటను పుష్పశీల నాకు ఇంత చక్కగ బోధించునని యెఱుగ నైతిని. తన హృదయము దహించుచున్నది. తాను క్రొత్తగా స్వతంత్ర ప్రేమ సంఘములో జేరినప్పుడు, కొందరు కొందరు యువతులతో దాను వినోదించినప్పడు, వారు తన్ను వదలి యితరులతో జరించునప్పుడు తా నెట్టి యీర్ష్యయు నందలేదే! అట్టి తనకు నే డీ యీర్ష్య యెక్కడ నుండి జనించినది?

రాజేశ్వరుడు పుష్పశీలకడ కొకదినమున బోయినాడు.

'పుష్పం! నాపై ప్రేమ అంతా మారిపోయిందా?'

'ఛా! ఛా! అదేమిటి రాజా! అల్లా అంటావు? నీవు నా ఆత్మనాథుడవు. నిన్ను తప్ప నేను ఇంకో పురుషుణ్ణి తలంపలేను. నేను నీ దానను.'

'నువ్వు మాట్లాడేది నాలిక చివరినుంచా, హృదయములోనుంచా? పుష్పశీలా! నీకు ప్రేమమారితే మారి ఉండవచ్చు. అది తప్పు అనే ఉద్దేశముతో నిన్నీ ప్రశ్నలు అడుగుట లేదు. నిజము చెప్పవలసింది అని. ఎందుకీ గ్రుద్దులాట? మన యిద్దరిస్థితి యేదో ఒక నిశ్చయానికి, ఒక మార్గానికి వస్తుందని, అంతే. నీపై నా ప్రేమమాత్రము ఇసుమంతైనా తరగలేదు, అదేమి చిత్రమో!'

'ఇదివరకు మీ ప్రేమకూడ అస్తమానము మారుతూ ఉండేదిగా?'

'అప్పటికి నా ప్రేమకు తగిన స్త్రీమూర్తి కనబడ లేదు కాబట్టి.'

'అల్లాగే నాకు ఇప్పటికి నా ప్రేమకు తగిన పురుషమూర్తి కనబడలేదేమో అనుకోరాదా?'

'అవును. అందుకనే నేను నిన్ను అడిగేది ఏమిటంటే, నీ హృదయము ప్రస్తుతము మారిందా? అని.'

'అది నేను ఎలా చెప్పగలనండీ!'

'అదేమిటి పుష్పం! నువ్వు చెప్పలేవా! ఇదివరకు లేనిది నన్ను కొత్తగా అండీ అని అంటున్నావు. నీ హృదయం మారినటులే తోస్తూంది.'

'అండీ అనకూడదా! మీరు నాకు భర్తవంటివారు గనుక అన్నాను.'

'అబ్బా! నన్ను నీ భర్తవంటి వాణ్ణి అన్నావు, సరే, నేనున్నూ మిమ్ము గౌరవంచేసి మాట్లాడనా?'

'అదేమిటి నామీద ప్రేమ తప్పిందా?'

పుష్పశీల సుడిగాలి వేగమున వచ్చి రాజేశ్వరుని కౌగిలించుకొన్నది. అతని నదిమిపట్టి పెనవేసికొనిపోయినది. 'నీకు వట్టి అనుమానం నాథా! లేని పోనివి పెట్టుకోకు' అని యామె యాతని చెవిలో సన్నని యెలుగున పలికినది. అతడును, ఆమెయు మోహావేశమున మైమరచినారు.

నాలుగురోజులైన వెనుక రాజేశ్వరుడు తోటలో చెట్లకు మళ్ళు త్రవ్వుచుండెను. ఆ రోజు

శుక్ర వారము. నెలవు చీకట్లుపడినవి. అంతయు నిశ్శబముగా నున్నది. బంగాళాచుట్టు చెట్లపై పక్షులు గూళ్ళుచేరి పాటలు పాడుచున్నవి. వేసవికాలము వచ్చుచున్నదని చూపిన వెర్రి వేడియెండ పూర్ణముగా పోయినను దేశమింకను జల్లబడలేదు.

రాజేశ్వరుడు తోటలో పని చేసికొనుచున్న సంగతిని పుష్పశీల మరచి విహారమునకై చెరువుగట్టుకు పోయినాడని యనుకొన్నది. కావుననే యందకాడగు నా మహమ్మదీయ యువకుడు రాజేశ్వరుని యింటికివచ్చి, వరండా వెనుకను మధ్యగదిలో కుర్చీపై కూర్చుని, కలలుకనుచున్న పుష్పశీలను దన హృదయానికి జేర్చుకొన్నాడు. పుష్పశీల సర్వము మరచి యా మహమ్మదీయ బాలుని అదిమి పట్టుకొని యాతని నక్కడున్న సోఫాపైకి ద్రోసి, యాతనిపై వ్రాలి యాతని నావరించినది. మేఘబాల అచలకుమారుని చుట్టినది. ఆ సమయముననే రాజేశ్వరుడు తోటలోనుండి లోనికి దొడ్డత్రోవను వచ్చినాడు.

ఎట్టయెదుట దృశ్యము తిలకించి నిశ్చేష్టుడయి యచ్చటనే నిలబడిపోయినాడు, పుష్పశీలయు, నా మహమ్మదీయ యువకుడును చటుక్కున లేచి నిలుచుండిపోయినారు. రాజేశ్వరుడు రౌద్రమూర్తియైనాడు. హుమ్మని చేయినెత్తి యా మహమ్మదీయ బాలుని శక్తి కొలది చెంపపై నొక పెట్టు పెట్టెను. ఆ యువకుడా దెబ్బ కొకకుర్చీపై పడిపోయినాడు. లేచి చొక్కాచేతులు వెనుకకులాగి, రాజేశ్వరుని మోముపై ముష్టి ఘాతము నీయబోయినాడు. రాజేశ్వరు డెక్కుడు బలవంతుడగుటచే నాతని చేయిపట్టుకొని యాపి, కోపము దిగమ్రింగి 'క్షమించండి హుస్సేను గారూ! నేను తొందరపడ్డాను. తొందరపడుటకు కారణం ఉందని మీరే గ్రహించగలరు. ఇప్పుడు మీరింటికి వెళ్ళిపోండి' అన్నాడు.

పుష్పశీల తెల్లబోయింది. గజగజలాడుచు భయాకులయై యచ్చట నొదిగి నిలుచున్నది.

ఆ మహమ్మదీయ యువకుడు కందిపోయిన తన యెడమ చెంపను ఎడమ చేత నొక్కి పట్టుకొని,

'నేను వెడితే, ఆ బాలికను చంపివేస్తావేమో?'

'రామా! నీకంత భయము ఉంటే ఆ అమ్మాయిని తీసుకువెళ్లు.'

పుష్ప: మీరు వెళ్ళండి సాహెబు గారూ.

ఆ యువకుడు రాజేశ్వరు నొకసారి, పుష్పశీల నొక సారి తీక్ష్ణముగ జూచి 'నీ భార్య కాదుగా? ఈ మనోహరిని నా కిచ్చివేయి, నేను తీసుకుపోతాను. నేను నిక్కా కట్టుకుంటాను.'

రాజేశ్వరుడు: 'ఏమిటి పుష్పశీలా నీ కిష్టమా?' అని గంభీర స్వరమున నడిగెను.

'అయితే అవుతుంది' అని యామె యన్నది.

రాజే: అలాగా! అయితే నా అభ్యంతరంమాత్ర మేమిటి?

పుష్ప: నేను రాను. మీరు వెళ్ళండి సాహెబు గారూ. ఆ యువకుడు వెనుతిరిగి యింటిగుమ్మములు దిగి వెడలిపోయినాడు.

రాజేశ్వరు డా వనిత ను జూచి 'పుష్పం, నాకు జ్ఞానోపదేశం చేశావు. కృతజ్ఞుణ్ణి' అని గబగబ, యా చీకటులలో కలిసిపోయినాడు. పుష్పశీల కుర్చీపై చదికిలబడినది.

అంత అనుమానరహితమనుకొన్న నిశ్చయములు ఇంత యనుమానపూరితములైనవి. తా నిం కేయాశయములపై సంఘముపై గత్తి కట్టుట? పూర్వకాలము నుండి స్త్రీ, తన ప్రకృతిలోపమువల్ల నొక పురుషునిజేరి ఆతని నాధారపరచుకొని యున్నది. అంతియ కాని తాను బానిసయై పురుషునికి లోబడియుండలేదు. అని నారాయణుడు చెప్పిన ముక్కయే నిజము కాబోలు.

రాజేశ్వరుడు అంతకంతకు దీర్ఘ విచారమున బడెను. ఆతడు ఇతికర్తవ్యతా మూఢుడై, కంటక వృక్షముల నడుమ బడిన నరునివలె బాధ నందుచుండెను. ఇది వర కాతనికున్న నిశ్చయబుద్ధి మూలమట్టముగ గదలిపోయినది. నిర్మలహృదయము మేఘావృతమైనది.

స్త్రీకి స్వాతంత్ర్యము, పురుషునకు నీర్ష్య లేకుండుట యను తమ యాశయములు తనయెడ మృగ్యమైనవి. తాను పుష్పశీల భర్తకు దృఢబుద్ధితో వ్రాసిన దెల్ల బడాయియైనది. తనకును, బుష్పశీల భర్తకును భేద మేమున్నది? పశువువలె నా మహమ్మదీయ బాలకు నట్లు కొట్టినాడేమి?

ఎట్లు భగవంతుడా! భగవంతుని నమ్మడే, యేల జ్ఞాపకమునకు వచ్చినాడు? నారాయణు డేల దాపురించి తన కా యత్కృష్టత బోధ చేసినాడు? ఒక వేళ తమ సంఘాశయములన్నియు అజ్ఞానవిలసితములా?

తనకు నీర్ష్య జనించినది.

'అబ్బా! నా కీ గుండెల్లో బరువు. నా కేమి దారి కనబడుట లేదు. ఆలాగు పుష్పశీల నా దగ్గర నుండి వెళ్ళిపోతే ఉండగలనా? నా పుష్పశీలా! నిన్నెంత ప్రేమించాను. ఆ మహమ్మదీయుణ్ణి చంపేద్దామనే అనుకున్నాను. నారాయణుడు చెప్పినట్లు నిజముగ పుష్పశీల బ్రతుకు నేనే తగలేశానా?

'ఓ పుష్పశీలా! పుష్పశీలా! నీ కష్టములకు నేనా కారణము? నీవు నావలన అధోగతిలో పడినావా?' కాదు, కాదు. తాను చేసిన దంతయు మంచిదే.

ఆతని మనస్సున కేదియో నిశ్చయము కలిగినది. మోము రాతితో చెక్కినట్లయినది. దేహము బిర్రబిగిసిపోయినది. అబ్బా! యని యా నిశ్చయమును దూరమునకు ద్రోసినాడు. తొందరపడుచున్నాడేమో, ఇంకొక మార్గము లేదు. ఇదే, ఇదే! 'నీ బ్రతుకు వృధా. నీ బతుకు వృధా!' నారాయణుడు, పరమేశ్వరుడు, రాజారావు వాళ్ళు దేవతలు. 'ఛా! నారాయణుని దగ్గరకు పోనా సాయంత్రము?' అతడు రాత్రి పన్నెండు గంటలకు కూర్చుండి ఉత్తరము లెన్నియో వ్రాసెను.

తెల్లవారగట్ల మూడగుచున్నది.

నెమ్మదిగ అడుగులిడుచు పుష్పశీల నిద్రించు గదిలోనికి బోయినాడు. ఆమె వాడిన పుష్పమువలె పందిరిమంచముపై పండుకొనియున్నది.

పుష్పశీల నొక్కసారి కౌగిలించుకున్నాడు. ఆమె నిద్దురలో రాజేశ్వరరావును తనకడకు లాగికొన్నది.

అతని కన్నుల రెండు చుక్కలు నీరు తిరిగినవి. ఆమె కౌగిలి సడలించుకొని 'ఎప్పటికైనా ఆడవాళ్ళ బాధలకు పురుషులే కారకులు' అని గొణుగుచు తన వ్రాతగదిలోనికి

బోయి సోఫాపై పండుకొని ఒక పొట్లము నోటిలో వేసికొని మంచినీరు త్రాగుచుండగనే యాతని చేతిలో నుండి గ్లాసు క్రిందకు పడి బద్దలైనది. ఆతని చేయి వాలిపోయినది.

౧౦
శస్త్రచికిత్స

కొత్తపేట
10 గం. 20-4-29
తటవర్తి నారాయణరావు
అడ్వకేట్
హైకోర్టు, మద్రాసు.

మీ నాయన గారు - దుష్టవ్రణము - (మాలిగ్నెంటు ట్యూమరు) - వ్రేలి మీద - రేపు ఉదయం - మెయిలు - తీసుకొని వచ్చుచున్నాము - శస్త్రచికిత్స - రంగాచారి - ఏర్పాటు చేయి - స్టేషను - మోటారు - భయము లేదు.

రాజారావు'

అని తంతి నారాయణరావునకు చెన్నపురిలో హైకోర్టులో నున్నప్పుడందినది. నారాయణరావునకు హృదయం చలించి తల యొక్కసారి తిరిగినది. ఈ దుష్టవ్రణ మేమిటి? దీనివలన భయము లేదని తంతిలో వ్రాసియున్నది. అతడు తత్ క్షణమే రంగాచార్యులగారి యింటికిబోయి వారితో మాట్లాడెను. ఆయన యా తంతిని చూచి 'రేపు తిన్నగా మా వైద్యశాలకు తీసుకొనిరండి. అన్నీ సిద్ధం చేయించి ఉంటాను' అని చెప్పినాడు. విషవ్రణములలో భయపడ వలసినవి యున్నవి. ఏమి భయములేనివి యున్నవి. 'భయము లేదా' యని ప్రశ్నింప రంగాచారి గారు ధైర్యము చెప్పి నారాయణ రావును బంపించినారు. శస్త్రవైద్య మయిన వెనుక యొకటి రెండురోజు లుంచవలసినచో వైద్యశాల లోనే సుబ్బారాయుడుగారి నుంచి, నారాయణరావుగారి యింటికి వెడలిపోవచ్చునని రంగాచారి గారు చెప్పినారు.

మరునాటి ఉదయము మెయిలుకు సూర్యకాంతము, నారాయణరావు కారుమీద సెంట్రలు స్టేషనుకడకు వచ్చినారు. రెండుమూడు కిరాయి మోటారులనుగూడ కుదిర్చియుంచినాడు. మెయిలువచ్చి యాగినది. ఒక రెండవతరగతి బండియంతయు నద్దెకు బుచ్చుకొని శ్రీరామమూర్తి, రాజారావు, యజ్ఞనారాయణశాస్త్రి, వెంకాయమ్మ, రమణమ్మ, జానకమ్మ గారును, లక్ష్మీపతితల్లి శేషమ్మ గారు, లక్ష్మీనరసమ్మగారు మెయిలులో సుబ్బారాయుడు గారితో దిగిరి.

సుబ్బారాయుడుగారి కుడిచేయి కట్టబడియున్నది. ఆయన బాధ నణచుకొనుచు మధ్యమధ్య బొమలు ముడుచుకొనుచు, బెద్ద కుమారుని బాసట గొని రైలుదిగి బాధతో నిండియున్న చిరునవ్వు చిన్నకుమారునిపై ప్రసరించెను. అతడు దెచ్చికోలు ధైర్యము మోమునదోప, తండ్రికడకువచ్చి, 'ఎల్లాఉంది నాన్నగారూ?' అని ప్రశ్నించెను. 'బాధగా ఉంది. ఫరవాలేదులే. ఇదిగో సూరీడు వచ్చింది! ఏమీ లేదు తల్లీ. ఏదో చిన్నకురుపు, కణుపుజెష్టో లేక ఏదైన మాదో!' అని సుబ్బారాయుడుగా రనిరి.

తిన్నగా పరీక్షచేసి ఇది శస్త్రము చేయవలెనని రంగాచారి గారు నిర్ణయించినారు. చిటికెనవ్రేలిపై ఒక చిన్న పుట్టుమచ్చయు, మచ్చపైన కాయయు నుండెడిదట. అది

చటుక్కున పదిరోజుల క్రిందట పెద్దదికానారంభించి పోటును, బాధయు మొదలుపెట్టినది. చేయి వాచినది. సుబ్బారాయుడు గారికి తిండి సహించుటలేదన్నారు. సుబ్బారాయుడుగారిది యేమియని, అమలాపురము పెద్ద కుమారునికి కబురంపిరి. శ్రీరామమూర్తి రాజారావును తీసికొనివచ్చెను. రాజారావుమాత్రము పరీక్షించి మధువు లేదనియు, మూత్రములో నితరమగు జబ్బేమియు లేదనియు, ఆ వ్రణము దుష్టవ్రణజాతీయనియు నిశ్చయించెను. కండరములలో పెరుగు సార్ కోమా యను వ్రణమట. అది పెరుగుటవలన వ్రణము పుట్టినచోటనేగాక రక్తములోనుంచి విషము ప్రవహించి వ్రణము కండరములు, నరములు, రక్తధమనులు, చెడురక్తపు నాళములు పాడుచేసికొనుచు విజృంభించి ప్రాణమునకు మొప్పముకూడ తెచ్చునని రాజారావు శ్రీరామమూర్తితో జెప్పి, అందుకు వ్రేలు కొట్టి వేయవలసియుండు నేమో యనియు, చెన్నపట్టణము డాక్టరు రంగాచార్యులుగారి కడకు వెళ్లుట యుత్తమమనియు సలహా చెప్పెను. తాను కొంత మందు లోనికిచ్చి, కట్లు గట్టి చెన్నపట్టణమున కారాత్రి మెయిలులో బయలు దేరుటకు నిశ్చయించి నారాయణరావునకు తంతినిచ్చెను.

రంగాచార్యులు గారు రాజారావు చెప్పినట్లుగానే యెంచి చిటికెన వ్రేలు మొదలంట కొట్టివేయవలెనని నిర్ధారణ చేసెను. సుబ్బారాయుడు గారు మత్తుమం దక్కర లేదన్నారు. కాని రంగాచార్యులు గారు చాల జాగ్రత్తగల వైద్యుడు. చేతినెల్ల నిజముగా రాతివలె మొద్దుచేయుటకు తగినట్లు కండలలోనికి పిచ్చికారీ మందిచ్చి చేయిని బండచేసి కత్తులు మొదలయినవి సిద్ధము చేసికొని శస్త్రచికిత్స చేసినాడు. చిటికెనవ్రేలంతయు దీసివేయబడినది. సార్ కోమా సంబంధమగు వ్రణచిహ్నము లేమియు లేకుండచేసి యంతయు శుభ్రము చేసి రక్తము నష్టముగాకుండ రక్తనాళములుకుట్టి రంగాచార్యులు గారు చర్మముకూడ కుట్టివేసినారు.

ఆరోజంతయు సుబ్బారాయుడుగా రక్కడనే యుండిరి. మరునాడు సాయంకాలము మోటారుకారుమీద నారాయణరావు గారి యింటికి తీసికొని వచ్చినారు వారిని.

ప్రతిదినము వచ్చి రంగాచారి గారు కట్టు కట్టుచుండిరి. నాలుగురోజులైన వెనుక, ఆయనకడనున్న సహాయ వైద్యయువకుడు కట్టు కట్టుచుండెను. రంగాచారిగారు లోపలికి మంచిమందు లిచ్చుచుండిరి. సుబ్బారాయుడుగా రొక పదునైదు దినము లుండినవెనుక కొత్తపేట గ్రామము వెళ్లవచ్చునని రంగాచారి గారన్నారు.

సుబ్బారాయుడుగారిని జూచుటకు జమిందారుగారును, శారదయు చెన్నపట్టణము వచ్చినారు. సుబ్బారాయుడు గారు, వియ్యంకుడు నవ్వుకొనుచు వేళాకోళములు సలుపుకొనిరి.

జమీ: ఏమండీ బావగారూ! మేరుపర్వతానికి పిడుగు తగిలిందట?

సుబ్బా: ఒక వేలు కొట్టేసిపోయింది వజ్రాయుధం.

జమీ: అమృతం ఎత్తుకుపోయే గరుడుణ్ణి ఆపుచేద్దామని ఇంద్రుడు వజ్రాయుధం వేస్తే ఒక రెక్కయీక ఊడిపోయిందట గరుడుడికి. మీరేమన్నా అమృతం ఎత్తుకురాలేదుగదా బావ గారూ!

సుబ్బా: ఎల్లాచూసినా ఇంద్రుడే కనబడ్డాడు. బావగారికి పుక్కిటి పురాణాలు అన్నీ తెలుసునే!

జమీ: అదేమిటండోయి దెబ్బకొడ్తున్నారు! నాకు పురాణాలు రావని వ్యంగ్యము ఏమి లేదుకద?

సుబ్బా: జమీందారులు, శాసనసభలో సభ్యులు పుక్కిటి పురాణాలకు తీరుబడి ఉంటుందా అని అన్నాను బావగారూ!

జమీ: బావగారిబోటి పెద్దలు వెళ్ళండి అంటే వెళ్లాను. మీబోటి వారి తరఫున ప్రతినిధినేగా? మేము జమీందారులము, మీరు జమీందారులకు ప్రభువులు.

సుబ్బా: ఎల్లాగయినా బావగారిమాట పైనే.

జమీ: ఎప్పుడూ మీ చెయ్యే పైన. సుబ్బా: కాని మీ అల్లుడిచేయిపైన మీ చేయి అయింది కాదండీ!

జమీ: బావగారు డెబ్బదిఏళ్లు వస్తూన్నా తమ అబ్బాయి అన్నగారిలా ఉన్నారు. ఇరవైఏళ్లు నాకన్న చిన్నవారుగా కనపడుతున్నారు.

సుబ్బా: జ్ఞానవంతులకు దబ్బున ముసలితనం వస్తుందట.

జమీ: యోగులకు పడుచుదనం వచ్చునట్లు.

వియ్యంకు లిద్దరు సరససల్లాపముల కాలము బుచ్చిరి.

*   *   *

రాజారావు అమలాపురము వెళ్ళెదనని తెల్ప నారాయణరావు వలదని వారించెను. ఆరోజున పరమేశ్వరుడు, లక్ష్మీపతి, రాజారావు, ఆలం, రాఘవరాజను నొక క్షత్రియమిత్రుడు, నారాయణరావు కలసి సముద్రపుటొడ్డునకు వాహ్యాళికి పోయినారు. రాఘవరాజు ఆలంతో ‘ఏమిరా, బలం అంటే మన పూర్వకాలపు వాళ్ళదిరా. నువ్వూ నేనూ ఉన్నాం. నారాయణరావు తండ్రిని చూడు. ఆయన మత్తుమందు అక్కర లేకుండా చేతివేలు కొట్టెయ్యమన్నారు. నువ్వూ నేను అలా అనగలమా? మన కా బలం ఉందా? ఆ ధైర్యం ఉందా?’ అని పలుకరించెను.

ఆలం: అరే! ఏమిటోయి పెద్ద చత్రివుడవు! కత్తి లేదు. కలంపోట్లకి ఎందుకూ వచ్చావు?

పర: నవాబులు, చెట్లక్రింద వకీళ్ళయినపుడు, రాజులు చెవుల్లో కలాలు దోపుకునేవాళ్ళయితే తప్పు వచ్చిందేమిటిరా తుర్క అబ్బాయి!

ఆలం: అల్లా, అల్లా! వీడ్కి కవీకూడా! దద్దమ్మ. నేనే నవాబును అయితే మా దర్బారుఖానానుంచి పది కొర్డాదెబ్బలతో దేవిడీమన్నా ఆజ్ఞ వేస్తానురోయి.

పర: నవాబుల దర్బారులకే రావాలి? మా మహారాజులు లేరుట్రా. అప్పడు మూరురాయరగండ పరగండ భైరవ సకల మూర్ధన్యాభిశేఖర శ్రీమన్మహారాజాధిరాజరాజేశ్వర రాఘవరాయలుంగారి కొలువుకూటంలో ఉంటాను గాని.

రాఘ: అక్షరలక్షలు! ఒరే నారాయణ మంత్రీ! మన ఖజానానుంచి పదిపైసలు ఈ కవికి దానమీయి.

ఆలం: ఒరే రాజారావూ దివాన్, ఈకవిని గాడిదమీద ఊరేగించూ! తియ్యరా త్రీకాజిల్సు. నారా: హుక్కా గుడగుడ అక్కరలేదూ? ఇదిగో నాదగ్గర స్టేటు ఎక్స్ ప్రెస్ ఉన్నది.

రాఘు: అహింసావాదులు సిగరెట్లు కాల్చవచ్చునురా, నారాయణా! నీ అహింసావాదం నీవూ! వకీలుపనికి సిగరెట్లకూ మంచి శ్రుతి. పర: ఏమోలే! సంగీతపాటకుడివి నీకు తెలియాలి; మాకేం తెలుస్తుంది? పొగ కొట్టకుండా ఉండడానికి స - అ - రీ - ఆ!

లక్ష్మీ: అదేమిటి రా?

ఆలం: వీడు పద్యం మాట్లాడుతున్నాడా డాబుదొరా?

నారా: డాబుదొర కాదురా! డాగుదొర!

రాఘు: కుక్కలదొరా!

లక్ష్మీ: అల్లా అయితే పశువుల వైద్యుడవ్వాలి.

అందరూ ఇసుకతిన్నెలపై వసియించియుండిరి. రాజారావుమాత్రము తల వాల్చుకొని యేదియో ఆలోచనలలో మునిగి, స్నేహితులతో మాటలాడక కూర్చుండియున్నాడు. ఆలం రాజారావు ప్రక్క జేరి యాతనిచుట్టి 'రాజా! నీ స్నేహితు లందరి హృదయాలు నిన్ను ఆవరించి ఉన్నాయోయి! నువ్వు దహించుకుపోతోంటే ఈ తురకబిడ్డ మోటుమనస్సు కూడా నీరయిపోతోంది. మా అందరిలోకి గట్టిమనస్సు నీది' అన్నాడు.

రాజారావు బొటబొట కన్నీటి కాలువలైనాడు.

౧౧

పరివర్తనము

నారాయణుని తండ్రికి శస్త్రచికిత్స చేయునప్పుడు శ్యామసుందరీదేవి చెంతనేయున్నది. తరువాత నారాయణుని దగ్గరకు వెళ్ళి 'అన్నా! మీతండ్రి గారు భీష్మలవారులా ఉన్నారు. ఏమి బలం, ఏమి ధైర్యము! ఆ విగ్రహం ఏమిటి! మీ యిద్దరు కవలపిల్లలులా ఉన్నారు. నీకంటె ఇంక కొంచెం మాంచి కండలుగట్టిన మనిషి. ఆయన ముఖానకూడా కొంచెమయినా బాధ కనబరచకుండా ఉండడం నాకు ఎంతైనా ఆశ్చర్యమయిపోయింది. ఆయన పాదాలదగ్గిర కూర్చుండి ఆయనను ప్రతిరోజూ పూజ చేస్తే నాజన్మ తరిస్తుంది. ఆయన నాతండ్రికూడాను, అన్నా! నీ హృదయం నొవ్వలేదుకదా, నాన్నగారి బాధచూసి?' అన్నది.

ఆమె కన్నులు కరుణార్ద్రములై ప్రేమపూరితములై యాతని దిలకించినవి.

నారాయణరా వామెకు అనంత కృతజ్ఞతతో నమస్కరించి 'తల్లీ, నీ వింత ప్రేమమయి వేమిటమ్మా?' యని తన కారుమీద నెక్కించి పంపెను.

శ్యామసుందరీ దేవి పరీక్షలకు జదువునప్పుడు రాజారా వెంతయో సహాయము జేయ నారంభించెను.

కాలేజి వదలి, యేడాదిపాటు వివిధ వైద్యాలయములలో విద్య సంపూర్ణము చేసికొని అమలాపురంపోయి వృత్తినారంభించిన వెనుక రాజారావు పట్టినది బంగారమయ్యెను. రాజారావు రోగదశ, రోగజాతి (నిదానము) నిముషమున గుర్తెరుగుచుండెను. వైద్యముతోపాటు, రాజారావు మొదటినుండియు నుద్గ్రంథముల జదువుకొనుచు, నుత్తమ భావములలో బులకించుచు నుత్తమాశయముల కూర్చుకొనుచుండెను. తన పూర్వులు తరతరములనుండియు సముపార్జించి యిచ్చిన బ్రహ్మవిద్యామూలముచే నేమి, యాతని పూర్వకర్మచే నేమి రాజారావునకు అతీంద్రియశక్తి (ఇంట్యూషన్) యున్నది. కావుననే రోగ లక్షణము లవలీలగా గ్రహించువాడు. పడవలసిన కాలమునకు సరియైనమందు పడుచుండెను. 'ఏమాత్ర మాయుర్దాయమున్నా ఆయన చేతిలో రోగి బ్రతుక వలసినదేనండి. ఏమి వైద్యుడండి. ఏమి హస్తవిశేషమండి' యని రాజారావును బొగడని కుటుంబి లే డమలాపురములోను, చుట్టుప్రక్కల గ్రామములలోను.

రాజారావు తండ్రి గారి సహాయమున, నారాయణరావు సహాయమున మూడువేల రూపాయలు పెట్టుబడి పెట్టి తన వైద్యశాల నారంభించెను. అమలాపురములో మంచియిల్లద్దెకు పుచ్చుకొని అది యంతయు శుభ్రమైన వెల్ల వేయించి మందుల బీరువాలకు, మందులు, బల్లలకు నొక గది; నిలువమందులకు, సామానులకు నొక గది; తాను రోగుల పరిశీలించుట కొకగది; తాను వ్రాసికొనుటకు, నడుము వాల్చుటకు, వైద్యసంబంధమున గాక స్నేహితులతో మాటలాడుట కొక గది; మూత్రాదుల పరీక్ష చేయుట కొకగది; శస్త్రచికిత్స కొకగది యేర్పాటు చేసెను.

నారాయణరావు దేశ యాత్రలు చేసి వచ్చినప్ప డమలాపురముపోయి వైద్యశాల యంతయు మరియు బాగుగ నమర్చెను. మందులు కలిపియిచ్చు గదిలో, రోగుల బరీక్షించు గదిలో, రోగులు కూర్చుండుగదిలో, ఆరోగ్య వంతుల బొమ్మలు-ఇంగ్లండునుండి వచ్చు ఆరోగ్యపత్రికలనుండి కత్తిరించిన వానిని - పటములు కట్టించి వ్రేలాడదీసెను.

రాజారావు కూర్చుండు గదిలో అభినవ భారతీయ చిత్రముల గొన్ని యలంకరించినాడు నారాయణరావు.

రాజారావు ఉపనిషత్తులనుంచియు, యోగసూత్రముల నుండియు, భగవద్గీతనుండియు ఉత్తేజకములు, భక్తిమధురములు నగు వాక్యములు మనోహ్లాదకరముగ వ్రాయించి, దానికి బట్టములుగట్టి వ్రేలాడదీయించినాడు తన వైద్యశాలయం దక్కడక్కడ.

కొన్ని సాధారణారోగ్యవిషయములు ముఖ్యముగా బ్రజలు గమనింప వలసిన సూత్రము లొక పెద్ద గుడ్డపై పటమువలె వ్రాయించి రోగులు మొదలగు వారు కూర్చుండుచోట గట్టించెను. మైసూరులో గంధపుజెక్కతో, విన్నాణముగ శిల్ప ముట్టిపడునట్లు చెక్కిన శ్రీకృష్ణుని వివిధ శైశవ క్రీడలు జూపు విగ్రహములు, నీకు దోచినవి అయిదారు గొనిరమ్మని నారాయణ రావునకు చెన్నపురికి వ్రాసి, నారాయణరావు వానిని బంపినవెనుక ఆతడు తన వైద్య శాలలో నక్కడక్కడ వాని నలంకరించినాడు. 'దేహవైద్యము, హృదయవైద్యము, ఆత్మవైద్యము అన్నియు నొకేసారి జరగాలని ఇల్లాపెట్టాను- ముఖ్యముగా చివరి రెండువైద్యాలు నాకోసం లెండి' అని రాజారావు తన స్నేహితులతో ననుచుండును.

వైద్యమునకు వలయు మందులన్నియు సంపూర్ణముగా దెప్పించి యుంచికొన్నాడు. ఏకాలమునకోగాని యవసరమురాని ఖరీదుగల మందైనను సరియే, అప్పుడు చెన్నపురికి తంతినిచ్చి తెప్పించుటకు బ్రయత్నించు వైద్యుడు ద్రోహియని యాతని వాదము. కావుననే 'డాక్టరు రాజారావుగారి ఆస్పత్రిలోనండి, కాకినాడ గవర్నమెంటు ఆస్పత్రిలోగూడా లేని మందులున్నాయండి' అని యాతని గూర్చి పల్లెటూళ్ల వెంబడి పేరు మ్రోగినది.

అతడు గ్రామములు సులభముగా బోవుటకై మోటారుసైకిలు (ప్రక్క బండితోసహా యున్న) బండి తెప్పించుకొన్నాడు. ఎచ్చటకుబోయిన నచ్చటకు వెంటబెట్టుకొని తిరుగుటకు ఆతనికడ రెండు పెట్టెలు, ఒక ఖద్దరుసంచియు నున్నవి. ఖద్దరు సంచి చాలా చిన్నది. ఎనిమిదంగుళములు చదరము; అందు రెండరలు. పట్టుకొనుటకుగూడా త్రాడు; మొదటి అరలో గుండెపరీక్ష జేయు యంత్రము, ఆయుర్వేదౌషధపు బొట్లములున్న యొక చిన్న దంతపుపెట్టె (పరమేశ్వరమూర్తి బహుమతి) రెండవయరలో శరీరమున మందు పొడుచుటకు సూది పిచికారి పెట్టెయు, ఒక చిన్న ఇత్తడిపెట్టెలో సూదిమందులు, ఎడ్రినాలిన్, పిట్రూటిన్ , స్టికినైను, డిజిటాలిను మందుల గాజుగొట్టములు నుండును.

పెద్దపెట్టెలలో నొక చిన్న వైద్యశాలయే. ముఖ్యములగు మందులన్నియు, తాత్కాలిక శస్త్రచికిత్సకు వలయు పరికరములు నందుండును. రెండవ పెట్టెలో పొడుపు మందులరకములన్నియు, అన్ని రకముల సూదిపిచికారీలు మొదలగు సామానంతయు నుండును.

రాజారావునకు మొదటి నెల రెండువందలు వచ్చినవి. రెండవ నెల నాలుగువందలు, మూడవ నెల నుంచి మాసమాస మయిదువందలరూకలు వచ్చుచున్నవి. నారాయణరావిచ్చిన వేయిరూకలు నాతడు తిరిగి యిచ్చివేసెను.

ఆతని పేరు కోనసీమయంతటా ప్రాకిపోయినది. నెమ్మదిగ గోదావరి అద్దరిని, యిద్దరిని రాజారావును వైద్యములకై గొనిపోవ నారంభించినారు.

అంతలో ఎచ్చట నుండి వచ్చినదో మాయ మృత్యుదేవత! ఇరువురు బిడ్డలును

తల్లిలేనివారైనారు.

మోహావేశమేగాని ప్రేమ యన నెట్టిదో యెఱుగని చిననాటి దినములలో భార్య కాపురమునకు వచ్చినది. ఎన్నిసార్లు వివేకానందుని చదివిన నేమి? ఎన్నిసార్లు జ్ఞానానందుని విన్న నేమి? ఆ వేదాంతము మనస్సు నుండి అంతఃకరణమున కైన నంటినదా?

రామమోహనరాయలు బోధించిననేమి, వీరేశలింగముగారు పాఠములు చెప్పిననేమి సాంఘిక ధర్మ మర్థమయినదా? తన భార్యను జిన్నతనములో గలసికొనకయున్నచో, నామె ఆరోగ్యవంతురాలై యుండెడిదేమో? పుష్పవతి యగుట తరువాయిగ భారతీయుడు బాలికను గలియుటయేగదా!

భార్య బ్రతికినంత కాలము గోపురంధ్రీమతల్లి, ప్రేమజీవి! ఆమె నెరిగెనా తాను? ఆమె తన బిడ్డలకు దల్లియనుమాటయేకదా తనకు తెలిసినది. 'పరమేశ్వరా! నా కర్తవ్యమేమి? తండ్రీ! ఈ పరీక్ష నీదా? నా వేదాంతము పరీక్ష చేయదలచుకొన్నావా? డబ్బుగణిస్తూ యింటిలో మూటలుకట్టే యీ విచిత్ర రోగినారాయణసేవ నీకు నచ్చినదా? నా హృదయం కల్మషం అయ్యే ఉంది చిన్నతనాన్నుంచిన్నీ. కాబట్టే నన్ను తరింప చెయ్యాలని వచ్చిన నా అన్నపూర్ణని నేను బ్రతికించుకోలేకపోయాను. నా బిడ్డలను తల్లిలేనివారిగా చేశాను' అని రాజారావు క్రుంగిపోవుచుండెను.

చుట్టుప్రక్కల చుట్టాలు, సంబంధములు తీసికొనివచ్చి రాజారావుకు వివాహము చెయ్యవలెనని ప్రయత్నించిరి. రాజారావు 'ఆమాట తల పెట్టకండి' అని చెప్పినాడు.

రాజారావు పైకి ధైర్యముగ తిరుగుచునేయున్నాడు. ఇదివరకు నాటకములన్న నిష్టము లేదు. సంగీతములన్న కడుపులో త్రిప్పు. కవిత్వమన్న కనులు తిరుగును. కళయన్న నసహ్యము.

అయ్యో ఎంతకష్టము అని ఎవరైన అనినచో 'ఏమిటి కష్టము? ఎవరికీ, ఆత్మకా?' అని ప్రశ్నించేవాడు.

'ఇతడు వట్టి పొడివేదాంతి? అని హేళన చేసేవాడు పరమేశ్వరుడు రాజారావును. సినిమాలకు వెళ్ళితే, ఎప్పుడైనా తన స్నేహితులతో వెళ్ళుట వారికొరకే. సంగీతపు కచ్చేరీలు మొదలగు నితర ఖుషీలకు వెళ్ళినను అందులకే.

అట్టి రాజారావు నేడు అబలయైనాడు. చంటిబిడ్డ ఏడ్చిన, అతని కన్నుల నీరు తిరుగును. కరుణార్ద్రములగు కథలువిన్న భరించలేడు. పురాణములన్నియు జదువ ప్రారంభించినాడు. చదువుచు జదువుచు దన్మయుడైపోవును. ఏమి యీ కవిత్వము అనును. రోగులు వారంతట వారిచ్చినచో ఫీజులు పుచ్చుకొనును, లేనిచో లేదు. చెవుల నుండి బిరడాతీసినట్లు సంగీతము వినును. కన్నులనుండి తెర తొలగినట్లు నాటకములు, సినిమాలు చూచును.

ఆత డిప్పుడు తన హృదయమును గనుగొన్నాడు. నేడు తన వైద్యశాలలో నమర్చిన బాలకృష్ణుని లీలలు దనకర్థము సాగినవి. భగవద్గీతలో పురుషోత్తమ భావముయొక్క అర్థము గోచరింపసాగెను.

'కృష్ణా! కృష్ణా! భక్తి లేని యీ హృదయమునకు భక్తి పరిమళము నిచ్చినావా, నా

భార్యను గొనిపోయి?' యని హృదయములో ననుకొనుచు కంటికి పెట్టిన జోడు తీసికొని కన్నులు నులుముకొని తలవంచి నమస్కరించినాడు.

౧౨
ఆత్మహత్య

'నా హృదయము నారాయణ రావు నావరించి వదలి రాకున్న దేల?' అను ప్రశ్న శ్యామసుందరిని వీడలేదు. నారాయణునిపై తనకున్న ప్రేమతత్త్వ మెట్టిదోయని యాలోచించుకొన్నది. ఆ ప్రేమ వాంఛాప్రేరితము మాత్రము కాదు. అది ఒక్కసారే కలిగినది. నే డాతడు ప్రేమార్థియైవచ్చి తన్ను కోరినను, దాను కుంచించుకొనిపోవలసినదే. ఆ దినమున తన శరీరాంగములన్నియు నుప్పొంగిపోయినవి. మూర్తీభవించిన ఆతని పురుషత్వము తలచుకొన్నను నేడు పుల్కయైన జనింపకుండుట కాశ్చర్య మొందినది శ్యామసుందరీ దేవి.

ఆ దివ్యముహూర్తము, తా నాతని కౌగిలిలో కరిగిపోయిన పరమప్రసన్నత, తన జీవితములో ముందునకు దారిజూపు దివ్య తేజస్సువంటిది యని యామె నిర్ధారణ చేసికొన్నది. అప్పటి నుండియు నామెకు సకలలోకములు తన్ను జుట్టు కొన్నట్లు భావము తోచినది. 'నే నందరిని బ్రేమించుచున్నాను, నన్నందరు ప్రేమించుచున్నారు. నేను ప్రేమమూర్తిని. ప్రేమచే నందరు నాలో నున్నా' రన్న దివ్యవాణి తనలో ప్రతిధ్వనించుచున్నదని యామె భావించుకొన్న ది. ఆనాటి నుండి ఆమె ప్రతిజీవియందును ప్రేమానుభావము జూచినది.

ఇంతలో రాజారావు వచ్చినాడు సుబ్బారాయుడు గారి జబ్బుకొరకు. రాజారావునకు భార్యపోయినదా? ఆయన జన్మము తరించు సంసార నౌక విచ్ఛిన్నమైపోయినదా? ఆయనతో జేయిచేయి కలుపుకొని బ్రతుకు తెరువు నడచు బాటసారి భగ్నమైపోయినదా? ఆమె కిరువురు బిడ్డలట. ఆ బిడ్డల నాదరించి పెంచువా రెవరు? మూడు కాళ్ళ ముదుసలియగు మాతామహియా?

రాజారావు వివాహ మేల యాడకూడదు? ఛీ! అదేమి యాలోచన. ఆయన వేదాంతియనియు, అందువలన ఆయన హృదయము కర్కశమైనదనియు దనతో నొకనాడు నారాయణరావు చెప్పినాడు. అట్టి పుణ్యపురుషుడు మరల వివాహము చేసికొనునా? ఆయన బాలికల యదృష్ట మెట్టిదియో? తనతో నారాయణరావు అన్న గారు సూరమాంబ పావనచరిత్రయని చెప్పినాడు. గంభీరహృదయుడగు నారాయణరావే ఆమె పేరు తలచుకొని కన్నీరు పెట్టుకొన్నాడు. ఆ వార్త విని సూరీడు చెల్లి తనఒడిలో జేరి, వెక్కి వెక్కి వాపోయినది. ఆ సూరమాంబ ఎంత సాధ్వియో?'

ఇట్టి యాలోచనలు తన్నావరించుకొన వదలించుకొనుచు వైద్యపరీక్షకై సంపూర్ణ దీక్షవహించి చదువుకొనుచున్నది శ్యామసుందరి.

ఇంతలో రాజేశ్వరరావు విషముపుచ్చుకొని చనిపోయినాడని రోహిణి వార్త తెచ్చినది. ''అదేమిటే? ఆ నాయుళ్ళబ్బాయి ఎప్పుడూ సంతోషంగా ఉండేవాడు! అల్లాంటివాడు, ప్రపంచం అంతా పాడుచేద్దామని తిరిగే పాపపు మనిషి విషం పుచ్చుకోవడ మేమిటి?

అప్పుడే నారాయణరావు, రాజారావు, లక్ష్మీపతి, పరమేశ్వరమూర్తు లక్కడకు వచ్చినారు.

నారా: రాజేశ్వరరావు విషము పుచ్చుకొని చచ్చిపోయినాడని నాకు టెలిగ్రాం వచ్చినది చెల్లీ! నీ చదువు అడ్డంకొడ్తున్నాను. నాకు రెండుత్తరాలు యివాళ వచ్చినాయి. టెలిగ్రాం హైదరాబాదు పోలీసు వారు పంపించినారు. ఉత్తరాలు రాజేశ్వరుడు ఇంకో నిమిషానికి విషం పుచ్చుకోబోతూ వ్రాసినవి. అందులో నీకోటి ఉన్నది. అది నేను విప్పలేదు. నా పేరున నీకు వ్రాసినాడు, ఇదిగో.

శ్యామసుందరి ఆ యుత్తరమును నారాయణరావు చేతి నుండి కంపిత హస్తములతో తీసికొని బల్లపై పెట్టి, యిట్లు చెప్ప నారంభించినది:

'నా స్నేహితులు, నాకు సహోదరులవంటివారగు మీదగ్గర చెప్పుతున్నాను.

'మూడేళ్ళక్రిందట రాజేశ్వరరావు మాయింటికి స్నేహితుడుగా వచ్చేవాడు. అతన్ని వేరే స్నేహితుడు తీసికొనివచ్చి పరిచయం చేసినాడు. సరదాగా మాటలంటూ నవ్వుపుట్టించే హాస్యం చేస్తూ, సంగీతాన్ని, చిత్రలేఖనాన్ని హేళన చేస్తూ మాయింటికి యెప్పుడూ వచ్చేవాడు. ఒక నాడు స్వతంత్ర ప్రేమ అని ఒక ఉపన్యాసం ప్రారంభించాడు. అంతా చెప్పి 'నీమీద నాకు చాలా ప్రేమ ఉన్నది. నీకూ అలాగే నామీద ప్రేమ ఉంటే నన్ను పాలించుకో' అన్నాడు అన్నా! నేను మాటలాడలేకపోయాను. మూర్ఛవచ్చినట్లయినది, ఒక్కసారిగా లేచి, మహాకోపంతో 'వెళ్ళి సముద్రంలో ఉరుకు దుర్మార్గుడా! రాక్షసుడా!' అని ఒళ్లు తెలియకుండా కేకలు వేశాను. నాటికి నేటికి అతన్ని చూడలేదు. అప్పుడప్పుడు మా సంభాషణలలో అతడు మీ స్నేహితుడని విన్నాను. అంతే. ఆ ఉత్తరం మీరే అందరికీ చదివి వినిపించండి అన్నగారూ!' అనినది. ఆమె ఆడుసింహమువలె క్రోధరూపయైనది. మోము జేవురించినది. సహజమగు నామె సౌందర్యమునకు కోపముచే విపరీత శోభ వచ్చినది. నారాయణ రావు ఆ కవరు చింపి. లోన ఉత్తరము తీసి మడతవిప్పి ఇట్లు చదవ నారంభించినాడు:

'శ్రీ శ్యామసుందరీ దేవికి–

అమ్మా, నమస్కారములు. ఈ పాపిని నువ్వు ఈపాటికి మరచిపోయి ఉండవచ్చును. ఆ రోజున నువ్వు ప్రళయశక్తి వలె లేచి నాపై కేకలు వేస్తే భయపడి పారిపోయాను. నేను నా అభిప్రాయాల్ని సత్యమైనవానిగా నమ్మాను. అవే మీకూ చెప్పాను. చెప్పి నా హృదయంలో ఉన్న కోర్కె మీకు తెలియ పర్చాను. ఇంతే. ఏ వనితామణినీ నేను హీనముగా గాని, హేళనగా గాని చూడలేదు. భగవంతుడనేవాడు ఉంటే ఆడవాళ్ళే ఆయన అవతారాలని, సైతాను అనే దెయ్యం ఉంటే మగవాళ్లే ఆతని అవతారాలని నా ఉద్దేశం.

'నేను ఆరోజున అన్న ముక్కలకు నాపైని చాలా తప్పు అభిప్రాయం పడ్డారని నాకు మన స్నేహితుడు చెప్పాడు. అప్పుడే మీకు ఉత్తరం వ్రాయాలని అనుకున్నాను, తల్లీ! నా ఉద్దేశం, నా అభిప్రాయాలలో సత్యమున్నదని. నేను తుచ్ఛుడనే. మీరు పరపురుషుల్ని చేరేటటువంటి మనుష్యులని ఉద్దేశింపబడి అన్నది కాదు. నేను మనసులో ఒక ఉద్దేశం, పైకి ఒక ఉద్దేశం ఉంచుకునే వాణ్ణిగాను. కాబట్టి అప్పుడు నాకు ప్రేమ కలిగినప్పుడు (వాంఛ అనండి) ఆ సంగతి దాచుకోకుండా మీతో అన్నాను. అంతే. మిమ్ము అప్పటినుంచి క్షమాపణ కోరవలెనని అనుకొన్నాను. కాని వీలులేకపోయింది. నేడు నా ఉద్దేశాలు మారాయో లేదో చెప్పలేని విషమసంధిలోకి వచ్చి నారాయణుని ఉత్తరంలో రాసిన కారణాలవల్ల ఈ ప్రపంచం వదలివేస్తున్నాను. మీరు క్షమిస్తే, నాకు ఆత్మ అనేది ఉంటే అది సంతోషిస్తుంది. తల్లీ, నమస్కారాలు.

–రాజేశ్వరుడు'

అందరూ స్తంభించిపోయినారు. నారాయణరావు శ్యామసుందరి వైపు తిరిగి 'అమ్మా! అతని ఆత్మతరఫున క్షమించమని నిన్ను కోరుతున్నాను' అని అడిగినాడు. శ్యామసుందరి కన్నుల నీరు తిరుగ 'అన్నా! అతన్ని గురించి నేను తప్పు అభిప్రాయము పడినందుకు ఆతని ఆత్మను క్షమాపణ అడుగవలసి ఉన్నది. భగవంతుడు ఆతని ఆత్మకు శాంతినిచ్చు గాక' అని అన్నది.

మాటలాడక స్నేహితులందరూ ఈవలకు వచ్చి నారు. రోహిణీ దేవి వారికడకు వచ్చి 'నారాయణరావు అన్నా! రాజేశ్వరుడు విషం పుచ్చుకొని చనిపోయినాడా?' అని అడిగింది.

'అవునమ్మా.'

'ఏమిటీ కారణం?'

'ఈ ఉత్తరం చదువుకో. తర్వాత నేను చెప్తాను.'

రోహిణి ఆ యుత్తరము దీసికొని చదివికొన నారంభించినది.

'నా ప్రియసోదరుడగు నారాయణా! నీ చేయి యేది? నేను సెలవుతీసు కుంటున్నారా! నాకు చాలా పెద్ద ప్రయాణం ఉందో, లేదో, ఇంతటితో ఆఖరో తెలియదు. కొని యింతవరకు దివ్యంగా బ్రతికాను. యుద్ధంలో అభిమన్య కుమారుడిలా ఆయుధంతో జన్మ విసర్జిస్తున్నాను. జన్మ విసర్జించటం కాదు ఆఖరు చేయటం! ఏమోరా, ఏదయినా యిబ్బంది లేదు.

'పుష్పశీల ప్రతి మధుపానికి తన మధువును ఇస్తోంది? మంచి పేరుపెట్టాడు. కాని ఆమె ఏమిచేస్తుంది? పాపం నేనే ఆవిడ బ్రతుకు ఒక లంగరుకు కట్టిఉంటే, లంగరుత్రాడు కోసేశాను, 'ఇంతకూ ఆవిడ పుష్పం అయినందుకు నాకు మనస్సులో ఈర్ష్య పుట్టింది. కాదనుకొని ఎంత సమాధానం చెప్పుకొన్నా లాభం లేకపోయింది. నామతం మా మతానికి విరుద్ధం అయింది. మా ఆశయాలు గంగలో కలిసినవి.

'అయితే అయింది. నువ్వు చెప్పినబోధ అంతా ఆలోచించి చూశా. ఎక్కడా సమాధానం కుదరదు. కాని అవునేమో అన్న అనుమానం పట్టుకుంది. అనుమానాన్ని దూరంగా తోలివేద్దాము అనుకుంటే లాభం లేకపోయింది.

'ఈర్ష్య ఎక్కువైతే, పుష్పశీలాదేవి నామీద ప్రేమ పూర్తిగా వదలి, ఇంకోళ్ళను ప్రేమించి నాదగ్గర నుంచి వెళ్ళితే, ఈ యీర్ష్య వదలక నన్ను బాధిస్తే ఎల్లాగ?'

అది కాకుండా పుష్పశీలమీద ప్రేమపోదే, ఎంత ప్రయత్నించినా! ఆమె నన్ను విడిచి వెళ్ళిపోతే బ్రతకడం ఎల్లాగు? ఆమె మనస్సు చల్లబడిపోయింది. చల్లగా జారిపోయినది. పోనీ ఎల్లాగో నేను ఆ దేవిని విడిచిఉంటాననుకో. ఉంటే మాత్రం ఈ జన్మకేమిసార్థక్యం? ఇంకో జన్మ ఉందీ? సరే! మళ్ళీ పుట్టాను. అప్పుడైనా ఈ హృదయంలో ఉన్న ఈ తుఫాను, ఈమంట, ఈ అగ్ని పర్వతం చల్లారిపోయి, నాకు నిజము గోచరిస్తుందేమో?

'లేదు. ఇంతటితో ఈ జీవితం ఆఖరు అయితే అపరిమితానందంతో బ్రతికిన నేను దుఃఖం ఎల్లా భరించనురా!

'సెలవు. నువ్వూ, పరమేశ్వరుడు, రాజా, ఆలం, సత్యం, రాఘవుడు నన్ను ఎంతో ప్రేమించారు. మీఅందరి దగ్గిరా సెలవు. చాలా ధైర్యంతోనూ, భయం లేకుండాను నా జన్మం

ముగిస్తున్నా.

'ఈ ఉత్తరం అందరికీ చూపించు. మీ అందర్నీ కౌగలిస్తున్నా.

నమస్తే
రాజేశ్వరుడు

'తా॥ క॥ మా తల్లిగార్ని వెళ్ళి ఊరార్చు. వృద్ధు! రాజే.'

ఈ ఉత్తరం చదువలేక చదివినది రోహిణీ దేవి. నిశ్శబ్దము.

'పిరికివాడురా' అన్నాడు పరమేశ్వరుడు.

నారా: పిరికివాడేమిటి? వాడికి సరియైన మార్గం గోచరించలేదు. నా మాటలు కూడా వాడి చావుకు కారణమయ్యాయా, అని నాకు చాలా దిగులుగా ఉన్నది. ఏమి హృదయం!

రాజా: అదేమిటి నారాయుడూ? వెఱ్ఱిగా మాట్లాడుతున్నావు?

పర: ఏమి చెప్పగలంరా? మనుష్యుని హృదయం ఎప్పుడెల్లా వెడుతుందో ?

౧౩
వేదాంతబోధ

శారదకు గ్రమముగా అత్తవారింటను, మదరాసులో భర్త నెలకొల్పిన కాపుర పుట్టింటిలోను చనువుగా మెలంగుట అలవాటయినది. సూరీడు తన వదిన గారితో బ్రేమ యుట్టిపడునట్లు మాట్లాడును. వదినె గారి నెల్లప్పుడు పలుకరించును, మాట్లాడించును. శారద యొంటిగా గూర్చుండ, నచట నామెకు దోడుగ నుండుటకు బోవును.

శారద యత్తవారింట నున్నప్పు డేరితోడను అంత మాట్లాడునదికాదు. ఒక సూరీడుతోమాత్రము మాట్లాడునది. సూరీడును, శారదయు జెన్నపట్టణములో గలిసియున్నప్పుడు వా రిరువురకు బ్రాణ స్నేహము కలిగినది.

ఇప్పుడు శారద యత్తగారితో మాట్లాడుచున్నది. ఆడుబిడ్డలందరితోడను మాట్లాడును. మామగారు తనకేదైన కావలయునని సూరీడును బిలిచినప్పుడు, శారద తాను వెళ్ళి 'యేమి కావాలండి' యని యడుగును. సుబ్బారాయుడు గారు 'నీకెందుకులే అమ్మా' అనుటయు, సిగ్గుపడి వెళ్ళి సూరీడు నచటి కంపును.

తనలో ఎందుకీ మార్పుగలిగినదో, అత్తగారితో, ఆడుబిడ్డలతో, మామగారితో తా నీమాత్రమైన నేల మాట్లాడుట మొదలు పెట్టెనో యామెకు దెలియదు. రెండు మూడుసారు లామె ఆలోచించుకొని మాట్లాడక యుండ వలయునని యనుకొన్నది. కాని యంతకు రెట్టింపుసారులు అప్రయత్నముగ వారితో మాట్లాడినది. ఆమె హృదయము ప్రేమమయము. తండ్రిపోలిక. అత్తవారియింట చనువేర్పడగనే యా మహాప్రవాహములో బడిపోయినది.

సూరీడుకు తలదువ్వుట నేర్చుకొన్నది. పిల్లల జనవుగా నాడించుట మొదలిడినది.

ఇంతలో శకుంతల, చెల్లెలు తన మరిది గారి యింటికి వచ్చినదనియు మరిది గారి

తండ్రికి వైద్యము చేయించుటకు జెన్నపట్టణము తీసికొనివచ్చినా రనియు దెలిసి, యనంతపురమునుండి, చెన్నపట్టణము తన మేనత్త కుమారుని యింటి కిరువురు బిడ్డలతోడను వచ్చినది.

నారాయణరావునందు గౌరవము కుదిరినప్పటినుండియు శకుంతలకు తన భర్తయెడ దొంటి వైఖరి మారిపోయినది.

జగన్మోహనుని వివాహానంతరము తిరిగి భర్తకడకు వెళ్ళినప్పుడు, భర్త తనపై కేకలువేసినప్పుడు మరల జవాబు చెప్పెడిదికాదు. ఆరోజునుండి భర్తకు వలయు దుస్తులందించుట, స్నానమునకు నీరు తోడించుట మొదలగు పరిచర్య లన్నియు సేవకులచే జేయించుటమాని, తానే చేయ దొరకొన్నది. విశ్వేశ్వరరావు గారికి భార్య పరివర్తన మాశ్చర్యము కలిగించినది.

ఇంటివిషయమై యన్నియు కనుగొనుట కారంభించినది. భర్తపక్కపై పరుపులు సరియైనవి లేవని, రాయలసీమలో దొరకు మంచి దూదితో చక్కని పరుపులు కుట్టించినది. రంగు రంగుల ఖద్దరు దుప్పట్లుకొన్నది. భర్తమంచముపై పెద్ద దోమతెర కట్టించినది. స్వయముగా తాంబూలము చుట్టి యిచ్చినది. విశ్వేశ్వరరావు ఇది యంతయుజూచి ఆశ్చర్యమునంది 'ఏమిటిది, ఇంత శ్రద్ధ ఎప్పటినుంచి వచ్చింది? ఏదైనా ఉద్దేశంతో చేస్తున్నావా?' అని యడిగెను. భర్తను గద్దించి మాఱుపలుకుచుండు శకుంతల నేడు మాట్లాడక చిరునవ్వున తనదారిని పోయినది. ఆమె కిప్పుడు గర్భము.

ఆనందరావుగారి కారులో దనబిడ్డల దీసికొని శకుంతల తిన్నగా నారాయణరావుగారి ఇంటికి వచ్చినది. శారద మోము ప్రఫుల్లమయ్యెను. శకుంతల సుబ్బారాయుడు గారిని చూచుటకు వచ్చినదని తెలియగనే జానకమ్మగారు సంతోషాశ్చర్యముల నందిరి. శకుంతల యందరిని బలుకరించి ఉన్న దన చెల్లెలితో సుబ్బారాయుడుగారు పండుకొన్న గదిలోనికి వెళ్ళి 'మామయ్యగారూ! వంట్లో కులాసాగా ఉన్నదాండి?' అని పలుకరించెను. సుబ్బారాయుడుగారు శకుంతల నానవాలుపట్టి చిరునవ్వుతో గది నెల్ల వెలిగించుచు, 'అమ్మా కూర్చో, శారదా! కూర్చో' యనియెను. శారదయు, శకుంతలయు నచ్చటనే యొక సోఫాపై నధివసించిరి.

'మీకు జబ్బు చేసిందనీ, యిక్కడ శస్త్రం చేయించుటకు వెళ్లుచున్నారనీ మా బాబయ్య గారు ఉత్తరం రాశారు. మా చెల్లాయికూడా యీ ఊరినుంచి శస్త్రవైద్యం అయిందని, మీకు చాలా కులాసాగాఉన్నదనిన్నీ వ్రాసింది. ఉత్తరాలు రాగానే మీ అబ్బాయి గారినడిగి, వచ్చానండి. పుండు మానిందాండి?'

'వేలు కొట్టేశారమ్మా.'

'అదేమిటి, మామయ్యగారూ!'

'వేలిమీద ఏదో వ్రణంట. ఆ వేలు కొంచెం ఎచ్చుతగ్గు అంతాపాడయిందట. అందుకని తీసివేశారు.'

'ఏ వేలండి?!'

'చిటికిన వేలే. కుడిచెయ్యికి కూడాను. మా అబ్బాయిగారు, బిడ్డలు అందరూ కులాసాగా ఉంటున్నారా, అమ్మా? వీళ్ళిద్దరూ నీ బిడ్డలామ్మా? యని ఆ బిడ్డల తనకడకు

రమ్మని నవ్వుచు సుబ్బారాయుడుగారు పిలిచినారు. పెద్దకుఱ్ఱవాడు మాత్రమే సుబ్బారాయుడు గారికడకు వచ్చినాడు. సుబ్బారాయుడుగా రాబాలుని తల నిమిరి, 'నాయనా ఆడుకో వెళ్ళి' అని అన్నారు.

భోజనములైన వెనుక నాడువారందరు కూర్చున్నారు. వెంకాయమ్మ అప్పుడే అమ్మమ్మకూడ నైనది. ఆమె ఎప్పుడూ మాట్లాడుచుండును. ఆమెకు గ్రొత్తలేదు. తన పెత్తల్లికి శిష్యురాలయి పంచీకరణపు పట్టువేయుట, అచలబ్రహ్మను గురించి మాటలాడుచు, శుద్ధ నిర్గుణతత్వ కందార్థ దరువులు పాడుకొనుట మొదలగునవి యన్నియు నేర్చుకొన్నది. చుట్టము లందరినీ పలుకరించి వారిని కూడగట్టుకొని యుండుట యామెకు ప్రీతి. భర్తగారు పద్ధతినియోగి, పట్టుదల మానిసియు నగుట తానును భర్తకనుగుణముగ నాచారమున పూర్ణముగ బట్టుదల చూపును.

యజ్ఞనారాయణశాస్త్రి వివాహోపనయనాది విధులు చేయించగలరు. వేదములు ఎనభైనాలుగు పన్నాలు నేర్చుకొన్నాడు. ఉర్లాము వెళ్ళి బహుమతినొందుసామర్థ్యము సంపాదించుకొన్నాడు. వారి గ్రామమంతయు బద్ధతినియోగులే. యజ్ఞనారాయణశాస్త్రి వసతిగల పెద్దసంసారి. స్వంతకమతము ఎనభై యకరాల పల్లపుమాగాణియున్నది. వారింట వంటలక్కలు పనికిరారు. కాబట్టి కోడండ్రందరు పనిచేయవలసినదే. పుట్టింటికడ పని ముట్టుకొనుట యెరుగని వెంకాయమ్మ అత్తింటికడ 'ఏమి పనివంతురాలమ్మా' యనిపించుకొనినది.

శారదను దగ్గరకు జేర్చుకొని 'ఏమో, మరదలా! మీ అక్కయ్య గారికి అన్నీ శ్రద్ధగా కనుక్కుంటున్నావా, అమ్మా?' యని ప్రశ్నించినది.

శకుం: అదేమిటండీ వదినగారూ, మా అమ్మాయి మమ్మల్ని కనుక్కుంటే ఏమి గొప్పండీ!

వెంకా: అమ్మో బ్రహ్మాస్త్రము పంపించారు. మాయింటికి కోడలయినప్పుడు మీ అమ్మాయి ఎలా అవుతుందండీ వదిన గారూ? మీకు, మాకు కనుక్కోవలసిందే శారద.

శకుం: ఎల్లాగయినా తటవర్తి వారికి జవాబులు చెప్పలేము. మీ పెద్దన్నగారు వకీలు, మీతమ్ముడు వకీలు, మీరుకూడా న్యాయంగా వకీలు గారన్న మాట. మీ వాదనకు మేము జవాబు చెప్పలేమండోయి.

జాన: అదేమిటమ్మా కోడలా, మీ ఆయన కలెక్టరు. ప్లీడర్లువచ్చి ఆయన దగ్గర వాదించవలసిందేగా. భర్త కలెక్టరయితే భార్య కలెక్టరుకాదూ? ప్లీడరెంత వాదించినా కలెక్టరుగారు కొట్టివేస్తారు.

శకుం: అత్తయ్యగారు హైకోర్టు వకీలై, వదిన గారితో కలిస్తే కలెక్టర్లు కూడా ఆర్డర్లు వేయడానికి వీలు లేదు.

అందరు ఘొల్లున నవ్వుకొన్నారు. ఇంతలో వంటయింటి పనియంతయు ముగించుకొని లక్ష్మీనరసమ్మగారుకూడ నచ్చటికివచ్చి కూర్చున్నారు. 'ఏమిటీ మా కోడలు అంటూంది? మా చెల్లెలు హైకోర్టు వకీలా? మా అన్నగారు గవన్నేరు దగ్గర నెంబరీగా! ఆయన గవన్నేరన్న మాట. అయితే శకుంతలా గవన్నేరే. వకీలు గవన్నేరు ముందర ఏమిమాట్లాడగలడమ్మా కోడలుపిల్లా?' శకుంతల విరగబడి నవ్వింది. ఇక్కడ మా పక్షంవా ళ్ళెవరూ లేరు. మా వాదం ఓడిపోయింది' అని అన్నది. శారద చిరునవ్వు నవ్వుచు,

సూర్యకాంతముతోబాటు అత్తగార్లకి వదినగార్లకి తమలపాకులు చుట్టలు చుట్టుచున్నది.

ఇంతలో రోహిణి, సరళ, నళిని, వారి తల్లియు లోనికి వచ్చినారు.

శ్యామసుందరికి పరీక్ష లగుచున్నవి.

లక్ష్మీనరసమ్మగారికి కులములేని యీ బ్రహ్మసమాజం పిల్లలు తనయింటికి వచ్చుట యిష్టములేదు. ఇంతవరకు ఎదిగి పెళ్ళికాకుండా ఆ పిల్లలు చదువుకొనుచున్నారనియు, ముత్తయిదువవలె కనబడు వారితల్లి రెండుసార్లు వైధవ్య మనుభవించినదనియు తెలియగనే, యీ ప్రపంచమంతయు నెచ్చటకు పోవుచున్నదోయని యామె హృదయము గడగడలాడినది. నారాయణు డిట్టివారితో సహవాసము చేయుట, కులము పోగొట్టుకొనుటకే. ఈ పట్టణవాసాలలో ఇంతేకదా, యనుకొన్నది.

పెత్తల్లి హృదయములోని ఆలోచన గ్రహించి, వెంకాయమ్మ 'అక్కయ్యా! రెండు కందర్థాలు పాడవే' యనెను.

లక్ష్మీనరసమ్మగారు సరేయనుచు, శ్రావ్యమగు గొంతుకనెత్తి,

అన్నపు సూక్ష్మాంశము మన సెన్నగ
    నీరంబు ప్రాణ మెఱుగుము,
రెండెన్నడు కలియవో, నాడే సున్న
    సుమీ యెఱుక మా సుగుణసంపన్నా
కలియుట యెఱుకసుమీ యింతకన్నా
    ఉన్న దెఱుక మూలమన్నదె వినలేదు.
ఎప్పుడు నీ భ్రాంతి నిన్నంటనియ్యకు సుగుణసంపన్నా
    కలియుటే యెఱుకసుమి యింతకన్నా॥

'గురువు శిష్యుణ్ణిచూచి అంటున్నాడు. అన్నముయొక్క సూక్ష్మాంశమే మనస్సు, నీళ్లయొక్క సూక్ష్మాంశము ప్రాణము. ఈ రెండూ కూడితే యెఱుక. ఈ రెండూ కూడకపోతే అప్పుడే యెఱుకలేదన్నమాట అని.'

వెంకా: అన్నము యెలా మనస్సవుతుంది?

లక్ష్మీ: ఆరగించిన అన్నం ఏడుదినాల్లో రసమున్ను, అది క్రమంగా రుధిరము, మాంసము, మెదడు, అస్థి, మజ్జ, శుక్ల, శోణితములు అగును. వాటి కలయిక వల్ల పిండం అవుతుంది. పిండంలో మనస్సు చేరుతుంది. అంత ప్రాణము చేరుతుంది. అన్నములో ఉన్న ఎనిమిదోవంతు ఆకాశము, ఎనిమిదోవంతు వాయువు కలిసి మనస్సు ఏర్పడుతుంది.

'ఇక ప్రాణం ఎనిమిదోవంతు, వాయువు ఎనిమిదోవంతు. మనం త్రాగే జలంలో వాయువు కూడా ఉంది. 'ఎల్లాగా అసలునిర్గుణంలోంచి మూలప్రకృతీ, అందులోనుండి త్రిగుణాలు పుట్టినవి. అందునుండి మహత్తత్వము, మహత్తత్త్వాన్నుంచి అహంకారము, అహంకారములోనుంచి శబ్ద స్పర్శ రూప రస గంధాదులనే పంచభూతాలు, ఆ పంచభూతాల అన్యోన్య సమ్మేళనంవల్ల సమస్త జగత్తేర్పడింది.

ఒపెరా

లక్ష్మీపతియు, నారాయణరావును ఆరాత్రి సూరీడును, శారదను తీసికొని ఎల్ఫిన్ స్టన్ కంపెనీకి ఇంగ్లీషునాట్యము చూడవెళ్ళిరి. పరమేశ్వరుడు, ఆలం, రాఘవరాజు, రాజారావులు నాటకమందిరముకడ గలిసికొనిరి. నారాయణరావు పదిరూపాయల తరగతి టిక్కెట్లు ఇదివరకే కొనియుంచెను. పరుపుల కుర్చీలపై లక్ష్మీపతిని తర్వాత సూరీడును, శారదను కూర్చుండబెట్టిరి. మిత్రులు తా మాసీను లగుటలో నారాయణరావుకు శారద ప్రక్కకుర్చీ మిగులునట్లు చేసిరి.

నారాయణరావునకు శారదకుగూడ హృదయములు ఝల్లుమన్నవి. ఆమె మోము ప్రఫుల్లమగుట నా చీకటిలో నెవరు కనుగొనగలరు?

నాట్యము మొదలుపెట్టినారు. ఆ నాట్య మొక నాటకమువలె నున్నది. కథానాయిక నాట్యము చేయుచు బ్రవేశించెను. కథానాయకుడు నాట్యము చేసెను. కథానాయికతో నిరువదిమంది, కథానాయకునితో పదిమంది నాట్యముచేయు వనితలు బ్రవేశించిరి.

'గమ్మత్తుగమ్మత్తు దుస్తులురా, ఏమి చిత్రంగా ఉన్నారురా మనుష్యులు!' అని లక్ష్మీపతి అన్నాడు.

దిసమొల అయినట్లుగా వేషాలు. అందరు ఒకటే దుస్తులు, ఒకటేరీతి నాట్యం. కథానాయిక మాత్రం ముందునుండి, వెనుక హంగుచేయు సకియలకన్న నెక్కువగ నృత్యము చేయును. ముందునకువచ్చి పాటపాడును.

అంకము మొదలు చివరవరకు ఒకటే నాట్యము, పాటలు.

అలంకారములు అద్భుతములు. దుస్తులు నిరుపమానములు. ఆ నటీమణుల యందము హృదయసంచలన కారణము.

కథాభాగము తక్కువ, నాట్య మెక్కువ. మగవారిలో పాట పాడెడు వారి గొంతుకలు సముద్రఘోషానురూపములు. ఎంత స్థాయికైనను పోగలవు. ఆడవారి గొంతుకలు కిన్నరీసదృశములు.

నాటకము జరుగునప్పుడు శారద తన చేతిని పొరపాటున భర్త చేతిపై వైచినది. భర్తచేయి యని తెలిసెను. ఆ స్పర్శసుఖాన చేయి మరల తీసికొనలేక పోయినది. భర్త గమనించలేదని యనుకొన్నంతకాల మట్లనేయుంచినది. మధుర ప్రవాహాలు ప్రసరించినవి. ప్రేమావేశముననో ఏమో ఆమె వణకిపోయినది. సిగ్గుతో చేయి వెనుకకు నెమ్మదిగా లాగికొన్నది.

విశ్రాంతి సమయమున నారాయణరావు మొదలగువారు బయటకు పోయి సిగరెట్లు కాల్చుకొనివచ్చినారు. నారాయణరావు వెలగల చాకొలెట్లు (ఒక విధమగు మిఠాయిల) గొని అవి సూరీడు కందిచ్చుటలో తూలి శారదపై వ్రాలినాడు. అరనిమేషములో సర్దుకొన్నాడు.

భార్యాభర్త లిరువురకు దేహమున మెరుపుతీగెలు అలముకొన్నవి. శారదకు నాట్యమున తక్కిన భాగమంతయు దానే నాట్యమాడుచున్నట్లు తోచినది. ఆమె యా యానందములో లీనమై తేలిపోయినది. ఆ ప్రేక్షకులు, ఎదుట దృశ్యము, సర్వమును మరచినది. ఓరజూపుతో భర్తను చూచినది. ఆ చిరుచీకటిలో సమున్నతాంగుడు,

సుందరుడగు భర్త దివ్యునివలె యామెకు దోచినాడు. ఆమె కన్నుల మధురిమములు తిరిగినవి. హృదయాన పరిమళము లలమినవి. లోకమంతయు సంగీతముతో నిండిపోయినది.

నాట్యము (ఒపెరా) పూర్తియగుటయు మనవారందరు బయటకువచ్చి తమ తమ బసలకు జేరినారు, మరునాడు సాయంకాలము నారాయణరా వింటికడ వారందరు చేరినారు. రాఘవరాజు, రాజారావు వెళ్ళిపోవలసిన దినములు వచ్చినవి. కావున స్నేహితులందరిని, రోహిణిని, సరళను, నళినీదేవిని ఉపాహారముల విందునకు, రాత్రి విందునకును బిలిచినాడు. తండ్రిగారికి జబ్బు పూర్ణముగ నివారణ మొనర్చిన డాక్టరు రంగాచారిగారికీ, ఆయన సహాయవైద్యులకు తేయాకునీటి విందును, రాత్రి సంపూర్ణమగు విందును, ఆనందరావుగారును, నారాయణరావు గురువుగారును, నటరాజన్ మొదలగువారందరును వచ్చిరి. హైకోర్టు న్యాయవాదు లంద రరుదెంచిరి.

శ్యామసుందరీదేవి వచ్చుట కామెకు పరీక్షలు. ఉపాహారములు, తేయాకునీరు మొదలగునవి యన్నియు, కోమలవిలాసమువారు సరఫరా చేసినారు. వారి బ్రాహ్మణయువకు లిరువదిమంది తెల్లని గాంధీటోపీలు, లాల్చీలు ధరించి తినుబండారము లందరకు వడ్డించుటకు సిద్ధముగానున్నారు. హైకోర్టు న్యాయాధిపతులను, చెన్నపురిలోని నాగేశ్వరరాయాద్యాంధ్ర ప్రముఖులను, పెద్దషాహుకార్లను విందునకు బిలిచినాడు నారాయణరావు. నారాయణరావు, రాజారావు, పరమేశ్వరుడు, లక్ష్మీపతి అన్ని సరంజాములు చేయించినారు. అద్దెకు పాలరాయి బల్లలు, చక్కని కుర్చీలు తీసికొనిరాబడినవి.

నారాయణరావు భవనము వెనుకనున్న విశాలవనములో విందు. తోటమాలి యని పేరుపొందిన నారాయణరావు తోటయంతయు గులాబీలతో, రంగు రంగుల మెట్టతామరపూవులతో వివిధరకాల చామంతులతో, బోగైనువిల్లాలతో చిత్ర చిత్రపు క్రోటన్సు మొక్కలతో నలంకరింపబడి కన్నులవైకుంఠముగ నున్నది. చెట్లలో, ఆకులలో, జొంపములలో పూవుల నడుమ రంగు రంగు విద్యు ద్దీపము లమర్చినారు. నారాయణరావు మామగారికి ముందురోజుననే తంతి యిచ్చుటచే జమీందారుగారును ఆ రోజు ఉదయముననే విచ్చేసిరి.

విందు ఏ లోటును లేకుండ జరిగినది. సంగీతపు కచ్చేరీ జరుగుటకు ముందు నారాయణరావు లేచి ఇట్లు మాట్లాడెను.

'సోదరీమణులారా! ఆర్యులారా! సహోదరులారా! మా తండ్రిగారికి చాలా జబ్బుచేసినది. అది శస్త్రవైద్యము. డాక్టరు రంగాచార్యుల వారు తమ సహజ సామర్థ్యము, నైపుణ్యము కనబరచుచు మా తండ్రిగారికి చికిత్సజేసి కుదిర్చినారు. రంగాచారిగారి ప్రేమకు, వారి ప్రతిభకు నేనును, మా తండ్రిగారును, మా చుట్టములందరు కృతజ్ఞులము. మేము యేమిచేసినను వారి ఋణము తీర్పలేము. వారి సహాయవైద్యులను, నా మిత్రుడగు వైద్యుడు రాజారావును నేను పొగడుటకు చాలను. భగవంతుడు వారిని, మిమ్ములనందరిని ఆరోగ్యము ఐశ్వర్యము నొసగి సంరక్షించుగాక' యని ప్రార్థించుచున్నాను. (కరతాళములు)

వెంటనే రంగాచార్యులుగారు లేచి 'నారాయణరావుగారు, తమ తండ్రిగారు ఆరోగ్యముగా నున్నారన్న సంతోషముతో, నన్ను పొగడినారు. నాలో ఏమున్నది? ఏ వైద్యుడైన ఆ పని చేయగల్గును. మాకు మా కూలియిస్తే మా శక్తికి తగినట్లు సహాయం చేస్తాము. తర్వాత దైవము. ఇంతమాత్రమునకు నేను వారి పొగడ్తకు దగను' అని కూర్చుండెను. (కరతాళములు)

సంగీతపు కచ్చేరి అయినది. శ్రీరామయ్యగారు తమ సంగీతముచే అతిథుల నుప్పొంగజేసి ఆంధ్రదేశమున నింతటి ప్రజ్ఞావంతులున్నారా! యనిపించినారు.

నళినీదేవి తన ఆంగ్లభాషాపాండిత్య మెల్లర హృదయముల నాటజేసినది. ఆమెకు బాశ్చాత్యవిద్య నభ్యసించుచున్నానను గర్వము మెండు. ఆమె ఎప్పుడు ఇంగ్లీషుభాషయే మాటలాడును. చక చక తిరుగుటలో, రకరకముగ మాట్లాడుటలో, పక పక నగుటలో దాను గళాశాలలో జదువు బాలనని అందరకు దెల్లమగునట్లు సంచరించును.

అల్పాహారపు విందులో విసవిస పెద్దల మధ్యనుండి నడచి వెళ్ళి నారాయణుని 'అన్నయ్యా! యెవరు సంగీతము పాడునది? శ్రీరామయ్యగారి గానకచేరి యని వ్రాసినావు, ఆయన గొప్ప పాటకుడా' యని యడిగినది. నారాయణరావు చిరునవ్వుతో సమాధానము చెప్పి పంపించినాడు.

సరళ మితభాషిణి. ఆమె లజ్జాశీల. రోహిణి గడుసరి. ఆమె యెట్టి వారి హృదయములనైన నాకర్షించు హొయలు చూపించగలదు. పదిమంది తన్ను మెచ్చుకొనుట యామె కానందము. నళినికి బ్రేమయే తెలియదు. అందకత్తెనన్న భావముమాత్రము తన మాటలలో, ఆటలలో వ్యంజనమున దెలియజేయుచు, చిరుబాలికవలె సంచరించును. వారు ముప్వురు విందులో వనితల మధ్య కూర్చుండినారు. నారాయణరావు వారి నమితగౌరవ మొనరించి, యాదరించినాడు. పరమేశ్వరుడు వీలయినప్పుడెల్ల రోహిణితో నేదేని మంతనమాడును. వారితోబాటు పెక్కురు వనిత లాహ్వానింపబడినారు. చాలామందివచ్చి వారితోపాటే గూర్చుండిరి.

అల్పాహారవిందు పూర్తియైన వెనుక భోజనమునకు గూడ నళినీ, సరళా, రోహిణులు నారాయణరావింట నాగిపోయిరి.

శ్రీరామమూర్తికి వీరిని జూచినకొలదియు నాశ్చర్యముగ నుండెను. అయినను రాజమహేంద్రవరములో జదువునప్పుడు శ్రీ వీరేశలింగాఖ్యుని బోధనలు వినియున్నవాడగుటచే మనస్సు సమాధానము చేసికొనెను. అతనికి సరదాపుట్టి వారితో సంభాషణ నారంభించెను.

శ్రీరా: మీ అక్కయ్యగారి పరీక్ష లవుతున్నాయట కాదాండి?

నళిని: అదేవిటి పెద్దన్న గారూ! మమ్ము 'మీరు' అని గౌరవం చెయ్యాలా?

రోహి: మా పెద్దవదినగారిని దీసుకొని రాలేదే?

శ్రీరా: సంసారం పెద్దది. మా యింటిదగ్గిర ఎవ్వరూ ఉండకపోతే ఎలాగు? నేను కొత్తపేట రెండుసారులు వెళ్ళివచ్చాను. అమలాపురం పెద్ద కేసులు ఉంటే చూచుకోడానికిన్నీ వెళ్లానండీ?

నళిని: అదేమిటండీ అన్నగారూ, మీరు మళ్ళీ 'అండీ అండీ' అంటున్నారు? అల్లా అయితే మీతో మాట్లాడం.

శ్రీరా: క్షమించండి, కాదు క్షమించమ్మా, నువ్వు పరీక్షలో బాగా వ్రాశావా?

నళిని: తప్పకుండా నెగ్గుతానని ధైర్యం ఉంది. అమలాపురంలో బాలికలకు ఉన్నత

పాఠశాల ఉన్నదా అన్నగారూ?

శ్రీరా: లేదమ్మా. అక్కడ ఎవరు చదువుకుంటారు?

నళిని: ఎవ్వరూ లేరండి? ఆశ్చర్యం!

రోహిణి: బాగా ఉంది నళిని, చెన్నపట్టణంలో మాత్రం ఏమాత్రం ఉన్నారేమిటి?

ఇంతలో పరమేశ్వరు డచ్చటికివచ్చి రోహిణీ దేవిని జూచి 'చెల్లీ! మీరు ఇంగ్లీషు నాట్యమండలి నాట్యం చూచుటకు ఎల్ఫిన్ స్టన్ వెళ్ళినారా' యని యడిగినాడు.

రోహి: లేదన్నయ్యా! బాగా ఉన్నదా? నిన్న మీరు వెళ్ళినారట కాదూ. శారద వదిన చెప్పింది.

పర: వెళ్ళాం. ఇదివరకు నేను సినీమాలలో చూచాను. వాటికన్న బాగుందమ్మా. నళిని: మన బోగమువాళ్ళ నాట్యంకన్న బాగుందా?

ఇంతలో రాజారావు, నారాయణరావు, యజ్ఞనారాయణశాస్త్రి యచ్చటికి వచ్చిరి. లక్ష్మీపతి దొడ్డి మరల ఎప్పటియట్లు సర్దించుచు మోటారుబస్సుల మీద సామాను పంపించి వేయుచుండెను. జమీందారుగారును భోజనమున కక్కడనే యున్నారు. ఆయనయు వచ్చి యా హాలులో గూర్చుండెను.

పర: ఏవమ్మో, మనవాళ్ళ నాట్యం అంటే వేళాకోళం కాదుసుమా!

ఆరాత్రి డాక్టరు రంగాచార్యుల గారికిని, తదితర వైద్యులకును, అనేకుల మిత్రులకును విందును, విందు పూర్తియైన వెనుక శ్రీ వేదవల్లి నాట్యమును నారాయణు డేర్పాటుచేసినాడు.

నళిని: ఏమిటి మరి! దక్షిణాది గణికలు వేసే వేషం విపరీతం. మొన్న కవితాసభలో చూచిన భాగవతం విపరీతం. మనదేశం నేను చూడలేదా, మన వేశ్యల తెయితెక్కలు నేను చూడలేదా? (అని విరగబడి నవ్వును.)

పర: అదేమిటి నళినీ! నీకు లలితకళ లంటే తెలియదన్నమాట.

నారా: చెప్పరా వాళ్ళకి! వెనకకూడా నేను ఒక చిన్న ఉపన్యాసం ఇస్తే, తల ఊపింది నళిని. శ్యామ, రోహిణీ అర్థం చేసుకున్నారు.

నళిని: అది నీ లోటుకాదు అన్నయ్యా! నాలుగు నిమిషాలలో ఏమిటో ఏమిటో గుప్పేస్తే అర్థంకాలేదు.

జమీం: నాకు చిన్నతనాన్నుండీ వీరేశలింగంపంతులుగారి శుశ్రూష వల్ల భాగవతం అంటే, నాట్యమంటే విపరీతమైన అసహ్యం. ఏదయ్యా పరమేశ్వరమూర్తిగారూ! దానినిగురించి మీ అభిప్రాయం చెప్పండి.

ఇంతలో సుబ్బారాయుడుగా రచ్చటకు వచ్చుటయు, వారికి నారాయణరావు మంచి దిండుల కుర్చీ నిచ్చి తాను కూర్చుండెను.

సుబ్బా: ఏమిటి బావగారూ, నాట్యం అంటున్నారు?

జమీం: (నవ్వుచు) పరమేశ్వరమూర్తి గారు నాట్యంలో ఉండే అందాలు చెపుతానంటే చెప్పమంటున్నాను.

సుబ్బా: మా చిన్నతనంలో మాకు భరత శాస్త్రంలో ఉండే అందాలు కూడా నేర్పేవారు బావగారూ! బోగంమేళంలో మేము కూర్చుంటే గణికలకు హడలు. సమస్తమైన కళలు మానాన్నగారికి తెలుసును. మా చిన్నవాడు మా నాన్నగారి పోలికేకదండీ. మా నాన్నగారంటే హడలు మాకు. ఆయన సంగీతాలు పాడితే లోకాలు మూర్ఛిల్లేవి. తొంబదిఅయిదేళ్ళ వృద్ధుడై పొలంలో పనిచేసుకొని ఇంటికివచ్చి, స్నానంచేసి, భోజనం చేసుకుని, రాత్రి రెండో ఝాముకరకు త్యాగయ్య కృతులు పాడుతూ ఉంటే ఊరుజనం అంతా ఆక్కడే ఉండేవారు. త్యాగరాయగారిని ఎరుగును. ఆయన ప్రియశిష్యుడే మా నాన్నగారు, ఆ సంప్రదాయం సరిగా ఉన్నదీ లేనిదీ నాకు తెలుసును, మావాడు పాడుతుంటే అచ్చంగా మా నాన్నగారి గొంతుకేగాని అంత అందం పూర్తిగాలేదు.

నారా: అది ఇంగ్లీషు చదువు నాన్నగారూ!

పర: నాట్యాన్ని గురించి రెండుముక్కలు పెద్దనాన్నగారు చెప్పితే చాలా బాగా ఉంటుందని మనవి.

జమీం: అవును, బావ గారూ!

సుబ్బా: ఏముందీ నాట్యం రెండురకాలు – నృత్యం, నృత్తం. నృత్యం, భావంకలిగిన నాట్యము. నృత్తం, అలంకారస్వరూప నాట్యం. స్వరకల్పన వంటిది. నృత్యం మళ్ళీ రెండురకాలు. ఉద్ధృతమైన భావాలుకలది తాండవం; కోమలభావాలు కలది లాస్యం.

౧౩
రెండే మార్గాలు

జమీం: మాకు విపులపరచి చెప్పండి, బావగారూ.

సుబ్బా: వస్తున్నా.

భక్తిచేత ఒడలు తెలియకుండా, కోపంచేత, రౌద్రంచేత, వీరత్వంచేత ఆవేశం పూనినభావాన్నీ తెలియచేసేది తాండవం అండీ. శివుని లయతాండవం, కాళికాదేవి సంహారతాండవం, శ్రీకృష్ణుడు భీష్ముని చంపడానికి చక్రంపుచ్చుకొని ఉరికిన వీరతాండవం, రావణాసురుడు యుద్ధానికివస్తూ చేసిన రౌద్రతాండవం, చైతన్యనివర్తి దేవాది మహాభక్తులు చేసిన పారవశ్యతాండవం.

ఇక రెండోది లాస్యం అన్నా. ప్రేమచేత రాధ, సత్యభామ, శ్రీకృష్ణుడు మొదలగువారి శృంగారాది కోమలభావాలు తెలియజేసేది లాస్యం.

ఈ విద్య మహోత్తమమయినది. బావగారు! కవిత్వానికి భాష సాధన వస్తువు. చిత్రలేఖనానికి రంగు, శిల్పానికి శిలా మొదలైనవి. సంగీతానికి ధ్వని. ఆలాగా నాట్యానికి ముఖ్య సాధనవస్తువు మనుష్యుని దేహం. మనుష్యుడే ముఖ్యవస్తువు, అతనిలో ఉన్న సర్వశక్తులున్నూ. అందుకనే నాట్యవిద్యను తపస్సుచేసుకొని అర్పించేవాడు మహోత్తముడు

అన్నారు పెద్దలు.

జమీ: చిత్తం.

సుబ్బా: భావాన్ని వ్యక్తీకరించడం అభినయం. ఆ భావం అంగాభినయంతో, వాచ్యాభినయంతో, ఆహార్యాభినయంతో, సాత్వికాభినయంతో చూపిస్తాడు నటుడు.

జమీం: నాట్యానికి అభినయం ప్రధానమాండి, నృత్యం చేయడం ప్రధానమాండి?
సుబ్బా: భావం లేకపోతే కళ కానేకాదుగదాండి. అంచేత భరతము అంటే భావ రాగ తాళయుక్తమైంది అని భరతశాస్త్రం చెబుతుంది.

జమీం: చిత్తం.

సుబ్బా: అభినయం సంగీతంగా ఉండాలి. అంటే రాగయుక్తంగా, తాళయుక్తంగా ఉండాలి. తాళం పదముల గతివల్ల, రాగము పాడడంవల్ల చూపిస్తారు. నాట్యంచేస్తూ, ఒక పదం పాడుతూ ఒక భావాన్ని ప్రదర్శించేది కరణం. ఆ కరణానికి ముఖ్యభావ సూచనను బట్టి పేరుపెట్టారు. అలాగు లెక్కచూస్తే నూటయెనిమిది కరణాలు ఉదహరించాడు భరతుడు. కొన్ని కరణాలు కలిస్తే అంగహారము అంటారు.

జమీం: విశదంగా చెప్పాలండి.

సుబ్బా: త్యాగరాయకృతిని తీసుకుందాం. కృతి సంపూర్ణకావ్యము. అందులో పల్లవి ఒక కరణంవంటిది. అనుపల్లవి ఇంకోకరణం. చరణాలు ఇతర కరణాలు. అన్నీ కలసి అంగహారం అన్నమాట. ఎన్నో కృతులు ఒక మహాకావ్యం. ప్రతి అష్టపది ఒక అంగహారం అనుకోండి – అన్ని అష్టపదులు కలసి మహాకావ్యం. అల్లాగే ఒక సంపూర్ణకావ్యం నర్తించడం, ప్రదర్శించడం 'నాట్యం' అంటారు.

జమీం: చిత్తం.

నళిని: పెదనాన్నగారూ! అభినయం నాలుగురకాలన్నారు. అవి చేతులు తిప్పడం మొదలైనవేనా అండీ?

సుబ్బా: అవునమ్మా, అంగాభినయంలో దేహం అంతా వస్తువు అవుతుంది. అందులో ముఖ్యాంశాలు, ప్రత్యంగాలు, ఉపాంగాలు అని ఉన్నాయి. చేతులు, తల, కళ్లు, కంఠము, పార్శ్వము, నడుము, కాళ్ళు ముఖ్యాం గాలు. చేతికి మోచేయి ప్రత్యంగము, వ్రేళ్లు ఉపాంగాలు. కంటికి కనుబొమ ప్రత్యంగము, కనురెప్పలు, గ్రుడ్లు ఉపాంగాలు. అలా అన్నిటికి. వీని కదలికతో భావం చెప్పడం అంగాభినయము. భరతుడు, నందికేశ్వరుడు ఈ అభినయాలు విధించారు. అవి కాలాన్ని బట్టి మారాయి లెండి.

పర: లేకపోతే వివిధ రాష్ట్రాల్లో వివిధ విధానాలు ఎల్లా వచ్చాయండి?

యజ్ఞ: ఏమిటయ్యా పరమేశ్వరమూర్తీ, ఆ విధానాలు?

పర: కథకళి సంప్రదాయం మళయాళ దేశంలో, కథక సాంప్రదాయము ఉత్తరదేశాల్లో, మణిపూరులో ఆ పేరిటి సంప్రదాయం – కూచిపూడి సంప్రదాయం, తంజావూరి సంప్రదాయం ఇల్లా ఉన్నాయి బావగారూ!

సుబ్బా: నేను ఆ వివిధరకాల నాట్యాలుచూడలేదు గాని, పూర్వం విదుషీమణులు, సుందరశరీరం కలవాళ్లు అయిన భోగంవాళ్ళు తెలుగుదేశంనిండా ఉండేవాళ్ళు. అద్భుతంగా నాట్యంచేసేవాళ్లు. వారి నాట్యాలెన్నో చూశాను. జమీం: ఇపు డా విద్య నశించిపోయి, చాలా హీనస్థితిలో ఉంది కదాండి?

సుబ్బా: చిత్తం. మళ్ళీ ఆ విద్య పునరుద్ధరించడం చాలా ముఖ్యమండి. అందుకనే మా నారాయణునితో చెప్పి ఇవాళ వేదవల్లి నాట్యం ఏర్పాటు చేయించాను బావగారూ.

ఆరాత్రి షడ్రసోపేతమేకాక బహుళరసోపేతమగు విందు నర్పించినాడు నారాయణుడు. భోజనములైన వెనుక హాలులో అందరును ఉచితాసనముల నుపవిష్టులైరి. వేదవల్లియు నాట్యోచితవేషమున వచ్చి సభ్యులందరికి నమస్కరించి నిలువబడినది. ఆమె వెనుక వాద్యవిశారదులైన మార్దంగికుడు, వాయులీనకుడు, తాళధారియు, గాయకుడును నిలుచుండిరి.

వేదవల్లి అందకత్తియ. దాక్షిణాత్య భోగమువారిలో నుత్తమురాలు. నృత్యప్రజ్ఞాప్రతిష్ఠ చరిత్రగల కుటుంబమున జనించినది. ఆమె నృత్యకళాశక్తి దక్షిణ దేశములో నెంతయు పొగడ్తనందినది. ఆమె పట్టులాగు తొడుగుకొని, బనారసుచీర కాళ్ళకు వెనుకకు విరిచికట్టి, వెనుకనుండి ముందుకు వల్లెవేసుకొని, వెడల్పు సరిగఅంచు చీరకొంగు, కుచ్చెళ్లు ముందుకు విడిచి, వెలగల హోంబట్టు సరిగరవిక తొడిగికొన్నది. రవ్వలయొడ్డాణము నడుమునకు మేఖలయైనది. రవ్వల బేసరియు, రవ్వల అడ్డబాసయు, రవ్వల పతకమును, రవ్వలదుద్దులును, ముత్యపు బాసట బొట్టును ఆమె మోము నలంకరించినవి. పొడుగుగ వాలుజడ రచించి, ఒత్తుగ పూలు ముడుచుకొన్నది. వివిధరత్నములు కూర్చిన శిరోభూషలు రాగిణి, చంద్రవంక , తమలపాకు, మొగలిరేకు, చేమంతిపూవు మొదలైనవి ధరించినదామె. చెంపసరులు, చెంపకళ్ళలు దాల్చినది. కాళ్లకు గజ్జియలు ధరించినది.

ఆమె మద్దెలకు నమస్కరించి, భగవంతుని, సభ్యులను ప్రార్థించి, 'ఆలారిప్పు' (అలరింపు) ప్రారంభించెను. స్వరజతులు చూపినది. తిల్లాణా నృత్యము చేసినది. భైరవీ వర్ణము ప్రారంభించినది.

మలయమారుతమై ఇటునటు ప్రసరించినది. సెలయేటి పతనాలవలె ఉరికినది. వాగై పరవళ్ళైనది. మండలములు, చంక్రమణము, గతులు సుడులై, తరంగాలై, వడులైపోయినది.

ఆమె పరిభ్రమణము నాగుబాము నడకలైనది.

ఒక గంటసే పామె ఆ వర్ణము నృత్యమొనర్చినది. ఆ వెనుక శ్రీ నారాయణతీర్థుల ఆదితాళయుక్తమైన తరంగము పాడ నారంభించెను. ఆమె ముఖారి రాగాన గోపికయై బాలకృష్ణుని ధ్యానించినది. ఆమెయే బాలకృష్ణుడై బాల్యక్రీడల వినోదించినది. మారాము పెట్టినది.

కృష్ణం కలయసఖి సుందరం-
బాలకృష్ణం కలయసఖి
కృష్ణం గతవిషయ తృష్ణం - జగత్ప్రభ
విష్ణుం సురారిగణజిష్ణుం, సదాబాల

అతని బంగారుగజ్జెలమ్రోత లోక సమ్మోహనస్వరపూరితమై, వేణునినాదసంశ్లిష్టమై

దిశల నావరించినది. నీలమేఘశకల మొకండు ఆకాశయానము చేయువడి, తళతళలాడినవి విద్యుల్లతలు. తారాగణములు జ్వలించినవి. వెన్నెల వెలుగులు లోకాలోకాలను కాంతింపజేసినవి.

ఆ వెనుక నామె క్షేత్రజ్ఞుని పదమును అభినయించినది. భైరవీజన్యమై, త్రిశ్రజాతి త్రిపుటతాళయుక్తమైన దాపాట.

'మంచిదినము నేడే-
మహరాజుగా రమ్మనవే!'

ఆమె రాధ, విరహిణియై, అర్ధఖండితయై, తన గంభీరభావము వదలక, దివ్యలీలావినోదుడై పరమదక్షిణనాయకుడైన, నీలగోపాలుని రమ్మని చెలికత్తెకు చెప్పుచున్నది. ఆతని తప్పుల సైరించెద నన్నది. ఆతని ఇతర ప్రేయసుల మాటలైన తలపనన్నది.

పరమేశ్వరు డా బాలిక నృత్యము నాలోకించుచు, ఉప్పొంగిపోవుచు, ప్రతీహస్తప్రాణమునందును, అభినయమునందును లయించిపోవుచు పరవశుడైనాడు. ఆ బాలిక ఉచ్చారణ బాగుండకపోయిననేమి? ఆంధ్రులకు తక్క నొరులకు వాచ్యాభినయము లేకపోయిన నేమి? ఏమీ ఈ అద్భుత నృత్యము!

ఆ బాల ధవళపన్నగాంగనవలె నాడినదట. ఆ బాలరూప మా అభినయమున లీనమై యామెయే నృత్యదేవి యైనదట. ధూపకరండమునుండి పై కెగయు పరీమళార్ద్ర ధూమ వక్రగతి భంగములను దాల్చినదట. విచిత్ర మనోహరవర్ణ భాసిత కుసుమలతవలె లోలాంగియైనదట.

ఆ బాలిక యవయవములు ప్రత్యభినయమునకు, సర్వకరణాంగహారాలకు మరియు సౌందర్యము చేకూర్చినవట. కదలికలో దాక్షిణాత్యమగు యత్కించిత్ కర్కశత్వమున్నను ఆ నృత్య ప్రజ్ఞాకౌశల్యములలో నదియు శోభించినదట.

వచ్చిన అతిథులు, స్నేహితులు ఎవరి ఇండ్లకు వారు వెడలినారు.

సుబ్బారాయుడు గారికి పూర్తిగా స్వస్థత కలిగినది. అందరును గొత్తపేట బయలుదేరిరి. నారాయణరావు కొత్తపేట వెడల నిశ్చయించెను.

రాజారావు కొద్దిరోజులుండి, యమలాపురమునకు వెళ్లిపోయినాడు.

శ్యామసుందరికి పరీక్షలైనవి. తాను తప్పక విజయమందుదునని యామె ధైర్యముతో జెప్పగలిగెను. హైకోర్టునకు సెలవు లిచ్చుటచే నారాయణరావు చెన్నపురి కాపురమును గట్టిపెట్టి భార్యాది బంధుసహితుడై తండ్రితో వెళ్ళిపోయినాడు.

శకుంతల చెన్నపట్టణములో నాల్గుదినములుండి తిరిగి వెళ్ళిపోయినది. ఆమె చెన్నపట్టణములో నున్నంతకాలము నారాయణరావుతో నన్ని విషయములు మాట్లాడుచు, నాతనితో నమిత స్నేహమున సంచరించుచు, జెల్లెలిచే నాతని బలవంతమున బరిచర్యల జేయించుచుండెను. శారద కింత సిగ్గేమియని యామె తలపోసికొన్నది. భార్యాభర్త లెప్పుడు మాట్లాడుకొనరు. శారద యేమియు నారాయణున కందిచ్చుటగాని, యాతనికి వలయు సేవల నొరు లొనరించునట్లు చూచుటగాని యామెకు గనబడలేదు. వీరిరువురి

హృదయపరిస్థితు లెట్లున్నవో యామెకు బూర్తిగా దెలియలేదు.

ఒకనాడు నారాయణుని యాతనిగదిలో నుండుమని కోరినది. తన చెల్లెలు శారద నచ్చుటకు గొనిపోయెను. శారదయు, నారాయణరావును గూడ తెలబోయిరి.

'మా అమ్మాయిచేత మీకు తలదువ్వించాలని సరదా అండీ' యని శకుంతల యన్నది. ఆశ్చర్యపడి, చిరునవ్వుతో నారాయణరావు 'నాకు కొంచెము పనిఉంది వదినగారూ' అనెను.

శకుం: మీ పని సరేలెండి, నేను ప్రార్థించే ఈ కాస్తపనీ నాకోసం చేయరాదా మరిదిగారు?

నారా: మీ యిష్టం.

శారద భయము, సంతోషము, ఆశ్చర్యము తన్ను ముంచివేయ వణకుచు నారాయణునికి తలదువ్వెను.

కొత్తపేట వచ్చిన కొన్ని దినాలకు పెద్దాపురమునుండి నారాయణరావు స్నేహితుడొకడు తంతి నిచ్చాడు. 'మీ అక్కగారిని మీ బావగారు కొట్టి వీధిలోనికి దరిమి తలుపు వేసినాడు. మీ అక్క మూర్ఛపోయింది' యని యందున్నది.

నారాయణరావు తత్ క్షణం పెద్దాపురము వెళ్ళిపోయినాడు. ఎందుకు పెద్దాపురము వెళ్ళినది యేరికి తెలియనీయలేదు.

పెద్దాపురమునకు నారాయణరావు వెళ్ళునప్పటి కన్నియు భీభత్సముగ నున్నవి. భార్యాభర్తలుగాని, తన మేనకోడలుగాని భోజనమే చేయలేదు. తన చిన్నక్క గారికి మూర్ఛ వచ్చుచునేయున్నది. నారాయణరావు హృదయమంతయు గోపముతోను, విచారముతోను నిండిపోయినది.

మగవా రీ రీతి నెట్లు సంచరించగలరు? ఆడువారు పశువులని భావించి చరించు పురుషు లింక నీనాటి కున్నారా? సంపూర్ణ మానవత్వము లేని వీరికి మోక్షార్హత ఎప్పుడు వచ్చునో! పంచమ సహోదరులయెడ, బీదజనులయెడల, స్త్రీలయెడల, పరజాతులయెడ తమ పశుత్వ మింకను జూపు మానవులు కోట్లకొలది యున్న ఈ యుగము నిజముగ కలియుగమే! భగవంతు డున్నాడని గాని, తాను శుద్ధ సత్యమూర్తియగు భగవంతుని యవతారమనిగాని మనుష్యు డెటుల మరచిపోవునో? తన అక్క సత్త్వగుణ సంపన్నురాలు. భర్తయనిన భగవంతుని యవతారమని భావించు పూర్వయుగాలనాటిది. అట్టి శుభచరితలకే కష్టములన్నియు సమకూడును గాబోలు. గడుసుదనమున వర్తించుచు భర్తను తమకు దాసానుదాసులుగా జేయు భార్యల బ్రతుకు పూవులలో బ్రయాణమే కదా?

నారాయణరావు బావ గారికడకు బోయి, 'బావా నీకు బుద్ధిలేదోయి. నీవు మనుష్యుడవనుకున్నాను గాని, కేవలము పశువుతో సమానుడవని అనుకోలేదోయి. ఇదేమిటి నీకింత కోపము? కోపాని కంతుఉండాలి. ఎంతవరకూ ఈ కోపం వెళ్ళడము? పోనీ నీకేమి చిక్కురాకుండా ఏదైనా పదునైన ఒక కత్తిచూసి, దాన్ని నరికివెయ్యరాదూ? లేదూ విషం తెచ్చిపెడతాను, నీ కసితీరగా దానినోట్లో వెయ్యి. ఆ విషం మనుష్యుల్ని నరకబాధ అనుభవింప జేసి మరీ చంపేదిగాచూచి తెస్తాను. అల్లా చంపు. అప్పటికి నీకోపం అంతానికి వస్తుందేమో? మొదట కోపం తెప్పించుకోడం, తర్వాత విచారించడం, రెండూ ఒకేజాతికి చెందినవి. అదిగో సత్యవతికి మూర్ఛపట్టుకొన్నది. ఇంక దాని జన్మ అల్లా పీల్చి పిప్పిచేస్తుంది.

అది చచ్చినదాంతో జమ. నీకు తృప్తితీరిందా?

'ఒక వేళ మా అక్కయ్యయందు దోషం ఉందంటావా చెప్పు. అది పెద్దరకం దోషం అయితే నువ్వు చేసినపనికి సంతోషిస్తాను.'

నారాయణరావు కన్నుల నీరుతిరిగినది. 'బావా క్షమించు. ఈ నా కటిక జన్మానికి కనుల నీరుతిరగడం ఇదే మొదటిసారి. ఏదో కోపంకొద్దీ అన్న మాటలు. కాని కోపం చంపుకొని చెపుతున్నాను, నువ్వు చేసిన పాపానికి నివృత్తి నీలోనే ఉన్నది. నీ హృదయం కరిగేటందుకు, నాలోని కల్మషం అంతా పోయేటందుకు నేను నాలుగురోజులు మీయింటనే ఉపవాసవ్రతం చెయ్యవలెనని ఉంది' యని నారాయణరా వూరకొన్నాడు. వీరభద్రరావు బావమరది. వచ్చినప్పటినుంచి యవనతవదనుడై, పాలిపోయిన మోముతో నున్నాడు.

ఆనాడంతయు వైద్యుల బిలిచి యక్కగారికి వైద్యము చేయించినాడు నారాయణుడు. ప్రక్కయింటివారు మేనగోడలికి దిండి పెట్టెదమని తీసికొనిపోయి భోజనము పెట్టినారు. నారాయణరావు ఎందరు భోజనమునకు రమ్మన్నను వెళ్ళినాడు కాడు. సాయంకాలము మూడుగంటలకు సత్యవతికి మెలకువ వచ్చినది.

మెలకువ వచ్చునప్పటికి సోదరుడగు నారాయణరావును జూచి కలయనుకొన్నది. సత్యవతి కొంతవడికి నొడలెఱిగి కనుల నీరునించినది, రెండేండ్లనుండి తన బావగారు సాధుమూర్తియై సంచరించినారు. తన చిన్నక్కగారు రెండేండ్ల క్రిందట గర్భవతియైనప్పుడు ఆమె నిట్లే బాధించి పెట్టిన కష్టము ఆమె దేహము మూలమంట కదల్చివైచినందున, ఒక నెల ముందుగ బురుడువచ్చి సత్యవతి చచ్చిబ్రతికినది. బిడ్డయు బోయినది.

అది అంతయు వీరభద్రరావు గ్రహించినాడు. నాటినుండియు భార్యను పువ్వులలోనుంచి పూజించుచుండెను.

మరల నే డైదవమాసము గర్భమట సత్యవతికి. సత్యవతి చక్కని మొగము పాలిపోయి, చిక్కి కృశించి, యామె పెద్దకన్నులు మరింత పెద్దవియై భయంకరముగ నుండెను. తగుమాత్రము బొద్దుగనుండి సౌందర్యనిధియైన యామె దేహము చిక్కి, క్షయరోగపీడిత శరీరమువలె నున్నది.

నారాయణరావు చిన్నక్కగారి ప్రక్కల గూర్చున్నప్పుడు, సత్యవతి నీరసముగ నున్నను నెమ్మదిగ లేచి, జరిగి, యాతని యొడిలో దలనుంచుకొని, 'తమ్ముడూ!' అని అతని ఒడలు నిమిరినది. నారాయణరావు హృదయము ద్రవించిపోయినది. ఎప్పుడు దుఃఖమెరుగడు. కన్నుల నీరురాదు. లోన తరిగివేయుచున్నది. 'అక్కయ్యా, ఈ పద్ధతి మారేటందుకు రెండు మార్గాలున్నాయి: ఒకటి నేను కైరాలో, బొంబాయిలో, ఢిల్లీలో గాంధీగారు ఉపవాసం చేసినట్లు మీ యింటిలో ఈ దెబ్బదెబ్బా ఉపవాసవ్రతం చేయడం. లేదా, నిన్ను మా యింటికి తీసుకుపోయి, బావ కాళ్ళబేరానికి వచ్చిందాకా ఉంచివేయడం. కాని యీ రెండు నీకిష్టం ఉండవు. నీకేది ఇష్టంఅయితే అది చేస్తాను. నేను నెలరోజులైనా నిరాఘాటంగా ఉపోష్యంఉంటాను. నీయిష్టం లేకుండా చేస్తే నాహృదయంలో సరియైన పవిత్రత ఉండదు; పైగా నీకు వెఱ్ఱి దుఃఖమువచ్చి యీ అపరిమిత నీరసంలో ప్రాణంపోతే ఏమి చెయ్యను? కనక నీ యిష్టం లేకుండా చెయ్యను అక్కయ్యా.'

'ఒరే తమ్ముడూ! నువ్వు ఉపోష్యం చెయ్యవద్దు, నన్ను తీసుకొని వెళ్లావద్దు. ఆయనకు సేవచేస్తూ ఉంటాను. ప్రాణం పోతేపోతుంది. లేకపోతే ఎల్లాగురా, నేను ఇప్పుడు ఆయన్ని వదలి రావడం?'

'ఒహో! ఏమి పతివ్రతండీ! సెబాసు! మళ్ళీ అరుంధతీ వాళ్ళూ పుట్టివచ్చారు; నాకు కోపం రావాలి అని ప్రార్థిస్తూన్నాను!' అని యాతడు మనస్సు లో ననుకొన్నాడు.

అక్కగారికి నారింజరస మింతయిచ్చి, బలవంతాన త్రాగించి, రాజారావునకు తంతినిచ్చి నారాయణరావు బజారునకు వెళ్ళి వచ్చుచుండగా బావగారు వీరభద్రరావు హోటలులో భోజనముచేసి వచ్చుట కనుగొనెను. కరుణార్ద్రమగు చిరునవ్వాతని మోమున ఉల్కవలె మెరసిపోయినది.

౧౬
ఆకుమళ్ళు

రెండవనాటి సాయంసమయమునకు నారాయణరావు, సత్యవతి, యామె కుమార్తె నాగరత్నం రాజారావుతో కొత్తపేట చేరినారు. సత్యవతిని జూచి జానకమ్మ గారు దిగులుపడి యామెను ఒడిలోకి చేర్చి కౌగలించుకొని 'నాతల్లీ! ఎంత చిక్కినావమ్మా! నా అదృష్టం మండిపోయింది గనుక నిన్ను తీసుకెళ్ళి ఆ బ్రహ్మారాక్షసినోట్లో పారేశాము తల్లీ!' యని వాపోవజొచ్చెను. సూరీడు, వెంకాయమ్మ, లక్ష్మీనరసమ్మగారు అందరు కన్నుల నీరు నించుకొన్నారు.

రాజా: పిన్నిగారూ చూశారా! సత్యవతి అక్కయ్యకు మూర్ఛవచ్చింది. అల్లాగ రాకూడదండి. ఉండండి, ఓహో చేతులుకూడా కొంకర్లుపోతున్నాయి. నారాయణరావూ, అక్కయ్యను ఎత్తుకు లోపలకు తీసుకురా. సూరీడు! చెంబెడు చన్నీళ్ళు, ఆర్జెంటు.

నారాయణరావు అంగలో అందరికి ముందు చల్లనినీరు పట్టుకొనివచ్చి, అక్కగారికి మోముమీద నెమ్మదిగా కొట్టుచుండెను. రాజారావు తన మందుల పెట్టెలోనుండి యొక సీసాతీసి యామె ముక్కుకడ బెట్టినాడు. సత్యవతికి మెలకువ వచ్చినది. లోనికి గ్లూకోజు ఇంజెక్షను ఇచ్చినాడు.

సుబ్బారాయుడుగా రక్కడకువచ్చి యామెను చంటిబిడ్డవలె నెత్తుకొని లోన మంచముపై పరుండ బెట్టినారు. సత్యవతి తండ్రి మెడ కౌగిలించుకొన్నది.

పెద్దాపురములో జరిగిన సంగతి నాగరత్నం అమ్మమ్మతో, తాత గారితో నిట్లు చెప్పినది.

'రెండోరోజున మా నాన్న హోటలులోతినడం చూశాట్ట మామయ్య, ఇంటికివచ్చి మాతో చెప్పాడు. కచ్చేరీనుంచి రాత్రి ఎనిమిదిగంటలకు గాని రాలేదు మానాన్న. మామయ్య నాన్నతో ఎంతో సేపు బోధించి చెప్పాడు. నాన్నని మామయ్య చాలామాటలు అన్నాడు. మానాన్నకు ఏదో కోపంవచ్చి తిరిగి మామయ్యను నాలుగుతిట్లు తిట్టాడు. ఇంతలో మామయ్య ఉగ్రుడై లేచాడు. మానాన్నని ఇటూ అటూ రెండు లెంపకాయలు ఫెళ్ళుమని కొట్టాడు. చొక్కా చేతులు పైకితీసి 'కాసుకో నిన్ను ఈరోజున హతమార్చేస్తాను' అన్నాడు. మామయ్యను చూసేటప్పటికి నాకే వణుకుపుట్టింది అమ్మమ్మా! మామయ్య ఎంతో పొడుగు ఎదిగిపోయినట్లే అయింది. తాతయ్యా! నువ్వు నా చిన్నతనంలో చూడిదూడను కొట్టిన పాలేరు వాణ్ణి, రాక్షసిలా ఉన్నవాణ్ణి, ఒళ్లు హూనం అయ్యేటట్లు కొట్టినప్పుడు ఉన్నావే, అల్లాగే ఉన్నాడు మామయ్య!' నారాయణరావు పకపక నవ్వుచుండెను. అందరు అతనిని జూచి తెల్లబోయిరి. రాజారావు మోమున మందహాసములు ప్రసరించినవి.

సుబ్బా: ఏమిటిరా బాబు?

నారా: ఏమిలేదు నాన్న! కోపం అంతా నటించాను. అతనికి కోపం తెప్పించి మాటలు వాగించి, భయపెట్టాలని ఎత్తువేశాను. ఆ ఎత్తులో పడ్డాడు.

'ఏమండో బావగారు నిండుగా ఉన్నారు. ఇంట్లో పెళ్ళాంబిడ్డలు గంగలో కలిస్తే ఏమి? మనకారోగ్యం, మనకాయుస్సు అనుకోవడం, హోటళ్ళకు వెళ్ళి భోజనం చెయ్యడం, వహ్వా!' అని అన్నాను. అతని మొహం జేవురించింది అప్పుడే. ఇదే సందు అని,

'భార్యను చూలా లనైనా తలపక చెయ్యి చేసుగోడం చేతవును! ఏమి చక్కనివాడవు. ఎన్ని ఏళ్లు వస్తేయేమి? కొంచెము దయాదాక్షిణ్యం ఉండాలి. ఈవల జబ్బుతో, తిండి లేక మాడుతున్న భార్య విషయం అక్కరలేకుండా ఏం మొహం పెట్టుకొని హోటలులో తిండితిని వచ్చావు?' అని అన్నా. అతనికి నిజంగా కోపం వచ్చింది, రుద్రుడయ్యాడు.

'నీ మొహం చూడకూడదు. భార్యాభర్తల్ని ఎడబాపే పాపివి' అన్నాడు. అంత వరకు తెల్లబోయినట్టు నటించాను.

'రంకుముండ అప్పగారిని వెనకకూడా వేసుకువచ్చావు...' అని అంటూఉంటే, మహాకోపం వచ్చినట్లు నటించి వెళ్ళి 'కాసుకో పశువా! నేను నీకు బుద్ధి చెప్పుతా ఉండు' అని నసాళం అంటేటట్లు రెండు లెంపకాయలు కొట్టాను. నాగరత్నం ఘొల్లుమంది. అక్కయ్య వింటూ ఉన్నది గదిలో. దానికి నాయెత్తు చెప్పలేదు కాదూ, కెవ్వున కేకవేసి వచ్చి మా యిద్దరిమధ్య పడి, నన్ను వెనక్కు లాగి, భర్తను కౌగిలించుకొని, 'ఛీ ఛీ! నువ్వు నా తమ్ముడివికావు. నా మంగళ సూత్రానికి మాలిన్యం తెస్తావా? వెళ్ళిపో! నీకు కక్ష ఉంటే నన్ను చంపు' అన్నది. అక్కయ్యని ఆ రోజున చూడాలి. కాళికాదేవి మహామాతే, నాకు అక్కగారే, సుబ్బారాయుడు గారి కూతురే. తత్ క్షణం ఆవిడ కాళ్లమీద బడ్డా! 'అక్కయ్యా క్షమించు. నేను పాపిని. ఎప్పుడూ నాకు కోపం రాదు. బావ నిన్నంటే వచ్చింది' అని అన్నాను.

'బావ గజగజలాడుతూ ఉన్నాడు. అప్పుడు బావదగ్గరకు వెళ్ళి ఆతని చేయి పట్టుకొని 'క్షమించు బావా! నేను ఏదో తొందరపడ్డాను. నీ భార్యను నువ్వు రండా అనడంవల్ల, నాకు ఒళ్ళు తెలియ లేదు' అన్నాను.

'ఆ రాత్రికే రాజారావూ వచ్చాడు. నెమ్మదిగా అందరికీ తాపాలు, కోపాలు తగ్గాయి. బావమరది తన్ను కొట్టకుండా కాపాడింది తనభార్య ఆనుకున్నాడో, మరేమో తెలియదు. రాత్రి భార్యను బ్రతిమాలుకున్నాడు. భార్య వద్దంటున్నా లెంపకాయలు కొట్టుకున్నాడు. 'రాజారావు అక్కయ్యని పరీక్ష చేసి, 'ఈమె మనసు పాడయిపోయింది. మూర్ఛపట్టుకొని పిప్పిచేసి పిచ్చిలోకి దింపుతూంది. అప్పుడే గుండెజబ్బు, క్షయకు వచ్చేస్థితీ ఏర్పడ్డాయి. అందువల్ల ఈమె మనస్సు బాగుపడాలి. పనిచేయకుండా ఉండాలి. మంచి మందులు పుచ్చుకోవాలి' అని చెప్పాడు.

'అదంతా బావ వింటూనే ఉన్నాడే అమ్మా. ఆ మధ్యాహ్నం బావను రాజారావు చాటుకు తీసుకువెళ్ళి చెప్పాట్ట. 'ఏమండీ వీరభద్రరావుగారు! నాకు తెలుసును. మీకు తెలియదు. నాభార్య పరమ పతివ్రత. ఏడాది ఏడాది కాన్పు. పశువులా సంచరించి బంగారంవంటి భార్యను చంపుకున్నాను. అటువంటి దివ్యభామినిని ఎవరివ్వగలరు. మీభార్య పతివ్రత. మీరు యిలాగే సంచరిస్తే ఆమె ఒక ఏడాదికూడ బ్రతుకదు. నేను వైద్యుణ్ణి గనుక చెపుతున్నాను.

'రెండు, మీకు మీ భార్యపైన కోపం విపరీతంగా వస్తోంది. అంత కోపం తెప్పించుకోవడంవలన మెదడూ, గుండె పాడై పిచ్చో, గుండెజబ్బో తయారవుతుంది. మీ

రకంవాళ్ళ గతులు ఆ వైద్యశాలల్లో మేము చూస్తూ ఉంటాముగనుక చెపుతున్నాను. ఆలోచించుకోండి' అన్నాడు.

'బావమరిది కొడతాడన్న భయం, భార్యకు పిచ్చి, ప్రాణభయమో వస్తుందన్న భయము, తన కేదో ఆపత్తు కలుగుతుందన్న భయము – యీ మూడు హడలుకొట్టినాయి కాబోలు. బావ రెండునెలలు సెలవుపెట్టి తన ఊరు వెడతానంటే మన యింటికివచ్చి ఉండమనీ, అతను గూడా మందు తీసుకోవాలని రాజారావు చెప్పాడు. సరేనన్నాడు. ఓ వారము రోజులలో వస్తాడు.'

* * *

రాజారావు, నారాయణరావు, లక్ష్మీపతి పొలమువైపు ఉదయము వ్యాహ్యాళికి వెళ్ళినారు.

కోనసీమ సొబగు వేసవికాలములో వనలక్ష్మియే. ఆంధ్రదేశానికి కోనసీమ నాయకమణి. ఉభయ గోదావరీ మధ్యదేశము రత్నాలే పండుతుంది. ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణరాయుడు దక్షిణాదిసీమ యందాలు తనివోవ వర్ణించినాడు. కోనసీమ సొబగున కొక మహాగ్రంథమైన ఆంధ్రాన జనింపలేదేమో? కోనసీమయందు సర్వశాస్త్ర పారంగతులైన యుత్తములు ఎన్ని వేల సంవత్సరములనుండి నివాసము చేయుచుండిరో?

కోనసీమ ఆ తరువుల మంజూష, మందమలయపవనములు, పనసపండులు, కాడమల్లె, బొడ్డుమల్లెలు, నారింజపూవులు, అరటితోటలు, కొబ్బరిపూవులు, పోకయాకులు, మామిడిపూతలు, మధురాతిమధుర సౌరభముల సర్వత్ర కలయంపి చల్లుచుండును. రంగురంగుల శర్కరకేళులు, పనసపండులు, జామ, బత్తాయి, నారింజ, మామిడిఫలములు కోనసీమయంతయు మధురరసపూర్ణమును జేసినవి. అచట సూర్యరశ్మి చొరదు. వేడిగాలులు వీచవు. కొబ్బరియాకు చాపలు, పోకదొన్నెలు, పోకతోటలచలువ, పున్నాగముల సుగంధము, పచ్చనితోటలు, నీలపుంగోదావరి, నీలాకాశము, వివిధపుష్పాలు, ఫలరాజములు, బంగారమే పండు పసిమి కోనసీమ.

సీతాఫలములు, రామాఫలములు నోరూర చేయును. నీలపిల్లిగోవా, కొత్తపల్లి కొబ్బరి, పెద్దరసం, చెరుకురసం, బంగారుకలసి, సువర్ణ రేఖ, జహంగీర్, తీపిగుటక్, జొన్నలబారు మొదలగు మామిడి ఫలములు ఘుమ్ముఘుమ్మనును.

కొబ్బరితోటలు వేనకువేలు. ప్రతీతోటలో నీటిబొండాలు, గంగా ఫలాలు; కోనసీమ కొబ్బరిసీమ, గొనమలసీమ, క్రొన్ననసీమ.

మనవారు తిన్నగా నారాయణరావు తోటకడకు పోయిరి. మోములు కడిగికొని, స్నానము లాచరించి, పాలేరు కూడబట్టుకొనివచ్చిన బట్టలు ధరించి, యనతిదూరమున గూలివారు ఆకుమళ్ళకు నీరుపోయు వరిపొలముల వైపుకు బోయిరి.

ఆకుమళ్ల చెరువులోనుండి ఆకుమళ్ల పంపులలోనికి, కొన్ని కారెములు, కొన్ని గూడజంటలు నీరు తోడుచున్నవి. అందులో నొక బాలిక గొంతెత్తి పాటబాడ, నందరు పల్లవి నందుకొనుచుండిరి.

ఆకుమళ్ళాకు, నీ
రాకుమళ్ళాకు పోయి

లచ్చుమయ్యా, నీమచ్చుమాయా!

సోగా మీసాలయందం
సొంపూ తలపాగయందం
వూగేటీ వళ్ళుఅందం
రాగాల గొంతు కందం
లచ్చుమయ్యా, నీ మచ్చుమాయా!

దండాకడియాలు వెలుగు
కండాలు ముడిసుట్టు
సల్లాని నీయెదలో
ఒళ్ళూ ఝల్లనిపిస్తది.
లచ్చుమయ్యా, నీ మచ్చుమాయా!

జోడూజోడూ కలిసి
గూడెత్తి నీరేద్దం
నువ్వూ కొండలరాజ
నేనే గోదావరినదిని
లచ్చుమయ్యా, నీ మచ్చుమాయా!'

అందరూ గొల్లున నవ్వికొనిరి. ఆ బాలికతో జంటగా గూడవేయు బాలకుని, 'దానికి ఎదురుపద మాడరా! ఆడూ! లేకపోతే ఓడిపోయినట్టేరో' అన్నారు.

ఆ యువకుడు తలయూపి,

'ఎయ్యవే గూడా, నా పిల్లా!
తియ్యని పాటలు పాడేమే
పాటా పాటలో కలిపేస్తే
పరుగిడు నీరూ మళ్ళల్లో!
ఎయ్యవె గూడా నా పిల్లా'

అని పాడినాడు. 'బాగుందిరా నాగా! బంగారూ! నువ్వురా' అన్నారు.

బంగారు:

సెపుకుంట మనవీ యినవే
నా సొగసుపిల్ల, నాగోరువంక
సెపుకుంట మనవీ యినవే.

నాకోసం ఎదురుచూచి
నాగుండె తలుసుకోని
పిల్లా నేనొచ్చేయేళ
ఘల్లూమన్నయి మెళ్లోకాసులు
సెపుకుంట మనవీ యినవే...

నీరులేక దాగమేసి
నారు వాడిపోతోఉంది
నారాక, నామాట
నారుమడికి నీరౌతది
సెపుకుంట మనవీ యినవే...

నారు మొక్క నల్లనే
నాపిల్ల తెల్లనే
నీరొస్తే, నేనొస్తే
మొక్క పచ్చనౌతాది పిల్ల నల్లనౌతాది
సెపుకుంట మనవి యినవే,

౧౭
పరశురామప్రీతి

ఏమి వీరి ఆనందము! గంజికదా వారి తిండి, గడ్డిగదా వారి పడక, పూరిగుడిసెగదా వారి భవనము. ఆనంద మెక్కడ నున్నదీ? ఇచ్చటా, మనలోనా? పారలౌకికానందము పరమహంసలకు; లౌకికానందమో, ఈ భూమాత శిశువులకేనా! వీరు కవులు, గాయకులు, నర్తకులు. వారు పుట్టినది ప్రకృతి సౌందర్యములో, బ్రతుకునది ప్రకృతి మాధుర్యములో, లయించునది ప్రకృత్యానందములో.

తనబోటివారి నాగరికత, జ్ఞానసముపార్జన ఇవియెల్ల నెందులకు? తన చరిత్ర వారిలో నొక సామాన్యుని చరిత్రతో పోల్చి చూచినచో నపహాస్య భాజనమై కన్పట్టును అనుకొనుచు నారాయణరావు తన స్నేహితులతో నడచుచుండెను.

లక్ష్మీపతి తలయెత్తి 'వీళ్ళ కవిత్వం ఎంత అందముగా ఉందిరా! ఇదివరకు ఇది వినలేదు. ఒక్కొక్క యుగానికి, ఒక్కొక్కరి కవిత్వము పైకి రావాలిరా! మహారాజులపై కవిత్వము, పై జాతులపై కవిత్వమూ అయింది. ఇక జానపదుల కవిత్వము' అన్నాడు. ఎవరి భావాలల్లో వాళ్లు ఉన్నారు.

భోజనాలవేళ కింటికి చేరబోవుచు మనవారు ముగ్గురు దొడ్డిదారి వైపు వచ్చుచుండిరి.

సోమయ్య కూతురు, చల్లాలు ఇంటిదగ్గరకు వచ్చిరి. అక్కడ సోమయ్య కొమరుడు సత్తెయ్యయు, చల్లాలు మొగుడు సీతన్నయు హోరాహోరీగా కొట్టుకొనుచుండిరి. ఆడవాళ్ళందరు ఘొల్లుమనుచు వా రిరువురను విడదీయుటకు సర్వవిధముల బ్రయత్నము చేయుచు విఫలులగుచుండిరి.

నారాయణరావు గబగబ రెండడుగులు ముందునకువేసి, బలముగ నిరువురను విడదీసి, యీవలావలకు గెంటివేసెను. అతని కన్నులు విస్ఫులింగ పూరితములై వారిపై దీక్ష్ణములై ప్రసరించినవి. ఆతడు మేఘగర్జనమున,

'బుద్ధిలేదుట్రా మీకు? వీధిలోని కాట్లకుక్కలా! మిమ్ముల బడిత పట్టుకొని చావకొట్టాలా?' యనుచు మరియు రౌద్రమూర్తియై సింహ సమానుడై నిలువబడియుండ జూచి పంది, యెనుబోతులులవలె బలిసియున్న ఆ యిరువురు తలలు వాల్చుకొన్నారు.

సోమయ్య భార్య రామానుజమ్మ, 'బాబూ! రచ్చించండి. ఈళ్లిద్దరూ ఈవాళ ఒకళ్ళ నొకళ్లు కొట్టుకొని చంపేసుకొనే వోళ్లండి బాబూ, మీరు వచ్చారు దేవుళ్లులా' అని ఘొల్లుమని యేడువదొడంగినది. 'ఏమిటి కారణం? మాదొడ్డి కప్రతిష్ట తెచ్చారు' అని నారాయణరావు అడిగెను. 'సీతన్న పెళ్లాన్ని చావగొట్టున్నాడండి. సత్తెయ్యవచ్చి అక్కగారిని ఇడదీసి బావగారితో కలబడ్డాడండి' అని అక్కడ చేరిన తూర్పుకాపుచిన్నది పలికినది.

'ఒరే సీతన్నా, వీళ్లందరిదగ్గరా అంటున్నాను. నువ్వు చేసేపని ఎంత ద్రోహమో తెలియునా? ఆడదానిమీద చెయ్యిచేసుకుంటావు? దున్నపోతా! ఛీ! ఛీ! వట్టి నీచుడవు. సోమన్న కల్లుడవా నువ్వు? నీ చరిత్ర అంతా అసహ్యంగా ఉంచుకొని, ఇతరాడవాళ్ళ కాపురాలు చెడగొట్టుతూ పైగా భార్యని కొడ్తావు? బుద్ధి ఉందా? నీ దుష్టబుద్ధులు మానెయ్యి, లేకపోతే నడు ఈఊరు నుంచి. నిన్ను గురించి నాకు ఒక మాట వ్యతిరేకంగా రానీ, నేను స్వయంగావచ్చి నిన్ను ఈ కొత్తపేటలోకి రాకుండా తరిమి వేస్తాను.' అప్పటికి నారాయణరావు కోపము తగ్గినది. వైష్ణవముద్రలు చురచుర అంటినట్లు సీతన్న కుంగిపోవుట చూచి,

'ఒరే సీతన్నా! ఫలాని వారిదొడ్డిలో ఉన్నవాళ్లనిపించుకోవాలి. ఇంతటితో నేను మన్నిస్తాను. నా మనస్సు మెత్తన. నేను ఎవరి జోలికి వెళ్లనని తెలుసుకదా నీకు. మా నాన్నగారైతే నిన్ను తోళ్ళు ఊడేటట్టు కొట్టవలసిందేకదా? మా అన్నయ్య తత్ క్షణం వెళ్ళిపొమ్మంటాడుకద. వెనక ఓమాటుచూశాను నీ భార్య కుంగిపోవటం. నీ భార్య అందం ఈ దొడ్డిలో ఎవరికైనా ఉందా? దాని ప్రేమలో మెలుగు, పో!' అనినాడు.

'సీతన్న సిగ్గుతో చచ్చిపోయినాడు. 'అయ్యో చిట్టిబాబయ్యగారికి తెలిసిపోయిందే; తేలునన్నా చంపని ఆ దేవుడికి ఎంతకోపం తెప్పించాను!' అని మనస్సులో నెంతయు విచారించినాడు.

ఆరాత్రి పడకగదిలోనికి బోయి, చల్లాలు పండుకొనియుండ, పట్టి మంచము దాపున గూర్చుండి యామె పదములనంటి 'చెమించుపిల్లా! తెలవక చేశా! కలవపువ్వు దగ్గరుంచుకొని, కసింత పువ్వుకోసం పడరానిపాట్లు పడ్డాడంట. ఇక బుద్ధికలిగి ఉంటా, నీ పాదంఆన!' అని ఆమె పాదాలపై తలవంచినాడు. వెక్కి వెక్కి యేడ్చుచు చల్లాలు కాళ్ళు లాగికొని లేచికూర్చున్న ది. సీతన్న మంచముపై గూర్చుండి యామెను దగ్గరకు లాగికొని 'చందురుడుంటే చుక్కెందుకు పిల్లా!' అనుచు అనునయించెను. పశ్చాత్తాపతప్తుడగు భర్త మోము జూచి, నిట్టూర్పునించి, ప్రేమపూరితములగు నాతని బాహులతలలో నామె యిమిడిపోయినది.

రాజారావు వెళ్లిపోయినాడు. వీరభద్రరావువచ్చి యత్తవారింటనే యున్నాడు. రాజారావు తన కారుమీద గాని, సుబ్బారాయుడు గారి కారుమీద గాని వలయునప్పుడెల్ల కొత్తపేట వచ్చి సత్యవతిని జూచి వెళ్లుచుండెదనని చెప్పి మందుల విషయమై చేయవలసినదంతయు చెప్పి మందులిచ్చి వెళ్ళిపోయినాడు, వీరభద్రరావునకును, అతడు మందులు తెప్పించి యిచ్చుచున్నాడు. ఆ యేడు గాడ్పులు విపరీతముగ వీచుచున్నవి. కాన సామర్లకోటనుండి తెప్పించిన వట్టివేళ్ల తడికల గట్టించి నారాయణరావు తన యిల్లంతయు హిమగిరివలె నొనరించెను. రాజమహేంద్రవరముకన్న కొత్తపేట చాల చల్లగా నున్నది. జమీందారుగారు, వారి భార్యయు, కొమరుడును నీలగిరికి వెళ్ళినారు. శారద యత్తవారింటనే యున్నది.

ఆమె కొత్తపేట వచ్చినప్పటినుండియు భర్తకు కాళ్ళు కడుగుకొనుటకు నీ రొసగసాగెను.

నాగరత్నంతో 'తాళంచెవులు పట్టుకురా నాగరత్నం' అంటే సూరీడు గ్రహించి చిరునవ్వుతో 'నాగరత్నం, చిన్నమామయ్యవే!' అన్నది. 'నాకు తెలవదా యేమిటి పిన్నీ!' అని నాగరత్నం సుడిగాలిలా మాయమై నారాయణరావు బట్టలబీరువా తాళములు, 'చిన్నత్తయ్య యిమ్మంటున్న' దని తీసికొనివచ్చినది.

నారాయణరావు కాళ్ళు కడుగుకొని లోనికి వచ్చునప్పటికి పట్టుబట్టలు పట్టుకొని నాగరత్నం నిలిచియుండెను.

'నాగరత్నం! చిన్నత్తయ్య బీరువాతీసి నీకిచ్చిందా ఏమిటే?' యని ప్రశ్నించినాడు. నాగరత్నం అవునన్నది.

ఆ మరునాడు మధ్యాహ్నం కొత్తపేటలో యిళ్లంటుకొన్నవి. తనయింటి కడ నిప్పు నార్పు వాయుపదార్థ మొకటి యన్న గొట్టము పట్టించుకొని లక్ష్మీపతియు, వీరభద్రరావును గూడరా, నారాయణరావు అంటుకున్న ఇళ్ళవైపునకు బరుగెత్తెను.

జనముల కేకలు వేసి, నీళ్ళబిందెలను బట్టుకరండని అందరిని, కడవలు పట్టుకురండని కొందరిని పురమాయించి, యిళ్లనెక్కు వారిని యిళ్ళనెక్కించి, విప్పించి వేయుచు, అప్పుడే అంటుకొన్న యిళ్ళలోకి దాను జొరబడుచు, సామాను దీయుచు, యువకుల నాపనికి నియోగించుచు నారాయణరావు ఆగ్నేయాస్త్రమునకు వారుణాస్త్రమైనాడు.

గాలవేయుచున్నందున నూరంతయు దగులబడిపోవలసినదే. నారాయణరావు కట్టుదిట్టములచే కొలదియిండ్లుమాత్రమే తగులబడి యారిపోయినవి.

అందులో బెద్దకాపుగారి తాటాకుల నాలుగిళ్ళభవంతి యున్నది. ఆతడు భాగ్యవంతుడు. ధనము, సామాను, బట్టలు, పెట్టెలు మున్నగువానిని చాల వరకు నారాయణరావు మొదలగువారు యీవల బడవైచి రక్షించిరి. ఇంతలో బెద్దకాపు వెఱ్ఱియెత్తిన వానివలె నేడ్చుచు 'చిన్నబాబయ్య గారు, నా కొంప కూలిపోయింది. భోషాణం పట్టుకురాలేదు. బాబూ నా నోటులు, భూమి తనఖాపత్రాలు, క్రయములు అన్నీ అందులో ఉన్నాయి. ఇంక నాపని అయిపోయిందండయ్యో' అని ఏడ్చుచు కూలబడిపోయినాడు. ఇల్లు మహాగ్ని జ్వాలల విరజిమ్ముచు, ఎఱ్ఱటి పూలతోనిండిన తురాయివలె మండిపోవుచున్నది. ఫెళ ఫెళ, ధణ్ ధణ్ మను ధ్వనులు, పిడుగుబోలి దెసల నావరించుచున్నవి. జ్వాలలు మిన్నంటిపోవుచుండెను. ఆ వేడి భరింప వీలులేనిది.

నారాయణరావు ఒకసారి మహావైశ్వానరతాండవము పారజూచినాడు. పెద్దకాపు నిస్సహాయతను దిలకించినాడు.

'భోషాణం ఎక్కడుందంటావు?'

'సావిట్లో తండ్రీ!'

'నీళ్ళతో రెండు బిందెలట్టో' అని కేక పెట్టినాడు నారాయణుడు.

'నీళ్ళు కారుతూఉండే రెండు తడిగుడ్డలు నా నెత్తిమీద వెయ్యి బావా!" అని లక్ష్మీపతిని కేక వేసినా డాతడు.

లక్ష్మీపతియు, వీరభద్రరావును తడిగుడ్డలు నెత్తిమీద వేయుటయు, రెండు చేతులా రెండుబిందెలు పుచ్చుకొని నారాయణరావు లోని కురికినాడు.

అందరూ ఘొల్లుమన్నారు. ఆత డట్లు చేయునని ఎవరనుకొనినారు! 'వద్దండో' అని పెద్దకాపు.

'అదేమిటోయి బావా' అని పొలికేక వీరభద్రరావు.

'నారాయణరావు గారో, కొంపలు ముంచకండో' అని జనమంతయును.

వీరభద్రరావు స్తబ్ధుడై నిలువబడిపోయినాడు. లక్ష్మీపతి తన బావ వెన్నంటి వెళ్ళబోయినాడు. నారాయణు డాతనికి గుమ్మముకడ కనుపించ లేదు. మంట లాతని గుమ్మముకడనుండి తరిమివేసినవి. అందరూ ఆశ్చర్యముతో, భయముతో నిశ్చేష్టులైరి. మంటలును శబ్దముచేయుటకూడ మానినవా!

గుమ్మముకడ ఒక బిందెడు నీళ్లు తలపై ద్రిమ్మరించుకొని, ఆ బిందెను వెనుకకు విసరి వైచి, వంగి పోయినాడు మండువాలోనున్న భోషాణము దగ్గరకు ఆతని సాహ సౌదార్యాలకు మెచ్చి, వైశ్వానరుడు మిద్దెయున్న ఆసావిడి లోనికి తొంగిచూచుట మానినాడు. మండువాలోని మంటలు గుప్పుగుప్పున వచ్చుచున్నవి. అప్పుడే భోషాణము అంటుకొన్నది. రెండవబిందె నీరు నెత్తిపై కుమ్మరించుకొని, వంగి భోషాణం ముందుకాళ్ళు రెండునుబట్టి ఎత్తి దడదడ గుమ్మముకడకు లాగికొనివచ్చినాడు.

లోపల ఏమి చేయుచున్నాడో, సొమ్మసిల్లి పడిపోయినాడో యని కంఠ పూర్ణమగు దుఃఖముతో లక్ష్మీపతి నీళ్లబిందెలు దెప్పించుచు, చేటలతో గుమ్మము లోనికి బోయించుచు, దానును లోనికి దుముక సిద్ధముగా నున్నంతలో మంటలలో నుండి నారాయణుడు భోషాణము లాగికొనుచు వచ్చుట జూచినాడు. నారాయణుడు గుమ్మవరకు వెనుకకోళ్ళు వచ్చునట్లు లాగి, మహాసత్త్వమున హుంకరించి, భోషాణమును ఒక్కపెట్టు అటు అడ్డముగా తిప్పి ఆ వెనుక కాలును, ఇటు అడ్డముగా తిప్పి ఈ వెనుక కాలును ఈవలికి లాగి బరబర యీడ్చి లాగిపారవైచి, ఖాండవదహనము చేయు అర్జునునివలె, లంక దహించు ఆంజనేయునివలె నిలుచుండి, లక్ష్మీపతికడకు వచ్చి, అలసటపడి రొజుచు పడిపోయినాడు.

వేడిగాల్పులో, అగ్నిహోత్రుని వేడిలో జనమునకు గాడ్పు తగులకుండ నొనర్చుటకు వేడికాఫీ రెండు మూడు బిందెలు పంపించుమని తల్లితో నారాయణుడు ముందే చెప్పి వచ్చినాడు. ఆ వేడికాఫీ యెంతమంది ప్రాణములనో రక్షించినది. లక్ష్మీపతి గజగజ వణకుచు నారాయణరావు నదిమిపట్టుకొని తన ఒడిలో చేర్చి, కళ్లనీరు గారుచుండ, ఇంత కాఫీ బావమరది పెదవుల కందిచ్చి త్రావించినాడు. పదినిముషములలో నారాయణుడు తేరినాడు. ఇంటికి చరచర వచ్చినాడు. బండి వద్దన్నాడు, పట్టుకొనవద్దన్నాడు.

ఊరంతయు 'నారాయణరావుగారు, నారాయణరావుగారు' అని చెప్పుకొన్నారు. నిప్పంతయు నిశ్శేషముగ నార్పివేయుటకు జనము నియమింప వలయునని, పెద్దకాపుతో జెప్పి నారాయణరా వింటికి వచ్చెను.

వీరభద్రుని యాశ్చర్యమునకు మితి లేదు. 'ఇతడా నా బావమరది' యని యాత డాశ్చర్యచకితుడైనాడు. ఆతని ప్రేమంతయు నారాయణరావు నావరించిపోయినది.

జరిగినదెల్లయు బూసగ్రుచ్చినట్లు లక్ష్మీపతి యింటిల్లపాదికి చెప్పినాడు. శారదకు

గుండెలు దడదడ కొట్టుకొన్నవి. 'ఇల్లు కూలితే! నాతండ్రీ! అన్నీ యిల్లాంటిపనులే చేస్తావు నువ్వు అంటూ జానకమ్మ గారు కూర్చున్న కుమారుని తల నిమిరినది. ఇంతలో పెద్దకాపు, ఆతని కుమారులు వచ్చి సుబ్బారాయుడుగారికి నమస్కారము చేసి, నారాయణరావు పాదాలకు దండము పెట్టిరి. సుబ్బారాయుడుగారు రహస్యముగా దన కన్నుల నీరు తుడుచుకొనిరి. తక్కినవారందరు సంతోషబాష్పముల విడచిరి.

'తండ్రీ, నన్ను రక్షించారు. ఏమి ధైర్యం, ఏమి చొరవ, ఏమి బలం, నారాయణరావు బాబుది! సుబ్బారాయుడు అన్నగారూ, మీ బాబు మా వాళ్ళందరికీ బుద్ధి చెప్పారండీ!'

౧౮
పరీక్షాఫలితములు

ఆ రాత్రి నారాయణరావు తన పందిరిమంచముపై పండుకొని మాగన్ను వైచెను. శారదయూ నారాయణరావును వేఱువేఱుగ పండుకొందురు. శారదకు నింకొక మంచము వేయించుమని రహస్యముగ సూరీడుతో చెప్పినాడాతడు. శారదయు నా మంచముమీద పండుకొనునది. లోకమున కేమి తెలియును? భార్యాభర్తలు సిగ్గుచే మాట్లాడరనుకొన్నారు. ఎంతో సరదాగల నారాయణరావు తల దువ్వించుకొనడు, భార్యనేమియు నడుగడు. శారద భర్తకు నీళ్లు తోడించుటగాని, సబ్బు నిచ్చుటగాని, తువ్వాలిచ్చుటగాని లేదు. శారదకడ నుండి భర్తకుగాని, నారాయణరావుకడ నుండి భార్యకుగాని యుత్తరములు లేవు. ఇది యంతయు నొక విచిత్రదాంపత్య మనుకొనినారు. సూరీడుకూడ నిజము పూర్తిగ గ్రహింపలేదు. శకుంతలమాత్రము సంపూర్ణముగా గ్రహించినది.

ప్రథమదినములలో నారాయణుడు ఆవేదననందెను. అతని ప్రేమ విజృంభించి ఆతని దహించివేయునది. ఆతడు ధీరోదాత్తుడగుటచే, నిశ్చల చిత్తుడై భార్యను పొరపాటుననైన ముట్టుకొనువాడు కాడు.

శారద తన్ను భర్త ఏమికోరునో యని భయపడునది. అందుకనియే కాపురమునకు వచ్చిన ప్రథమదినములలో ఎంతసేపటివరకో నిద్రపోవక, చివరి కొడలుతెలియక నిదురబోవునది. రాను రాను భర్త సద్గుణసంపన్నుడనియు దయార్ద్రహృదయుడనియు సంపూర్ణముగా నవగతమైన దామెకు. అందుచే నిర్భయముగ నామె భర్తతో నొక్క గదిలోనే నిదురగూడునది.

తా నొక్కతియే పండుకొనుచున్నానన్న భావమే యామెకు పరీక్షలకు జదువు రోజులలో లేదు. అప్పుడామె సంపూర్ణముగ బాలికయే.

హిందూకుటుంబములలో భార్యాభర్తలకు పునస్సంధాన మహోత్సవము సలిపినప్పుడు పదుమూడు, పదునాలుగు, పదునైదేడుల యీడుండును. అప్పుడు బాలికలకు ప్రేమయుండుట యరిది. రాను రాను వారికి భర్తలయం దనురాగము వృద్ధియగును.

చెన్నపురిలో భర్తపాటలు, భర్తమాటలు విన నామె కుతూహలపడునది. ఫిడేలు వాయించుకొనుచు పరవశుడై గొంతెత్తి గంభీరమధురముగ బాటలు పాడు భర్తపాట నేపథ్యముననుండి వినుచు, శారద పారవశ్యత నందునది. రెండుమూడుసారు లామె తాను భర్తను బ్రేమించుచున్నానా యని సందియ మందినది. యేల ప్రేమింపకూడదు? భర్త సుందరుడని ప్రతివారును జెప్పెదరే? నిజముగా సుందరుడే! ఏమి తెలివితేటలు!

నేడు నారాయణరావు చేసిన యీ మహాద్భుతకార్యము ఎవరు జరుపగలరు? మహావీరుడు తనభర్త. గ్రీకుకథలలో జదివిన వీరాగ్రగణ్యుల కీయన యేల దీసిపోవును? ఆయన రూపము బొమ్మలలో వేయు వీరుల కెంతమాత్రమును దీసిపోదు. స్నానము చేయునప్పు డాయనమూర్తి ఎంత సుందరమయి కనుపించును?

ఆమె మనోనేత్రములకు నారాయణుని కమ్మెచ్చుల దండలు, పొంకమగు కంఠనరములు, తేజస్సును సూచించుచు మచ్చునకేని యొక యపశ్రుతిరేఖలేని సుందరమగు మోము, నల్లని ఒత్తయిన జుట్టు, విశాలమై ఎత్తయిన చాతీ, పొడు గగు నా రూపము జూచి ఈయన దేవతవలె నున్నాడని యామె భావించి సిగ్గుపడునది. తన అక్క శకుంతల మరిదిగారన్న నెంత గౌరవము చూపును! తన తండ్రికి అల్లునిపై బ్రేమ యింతంత గాదు.

కొంచెమయినచో నెంత ఆపత్తు కలిగియుండును? ఎలాగునైన కొంచెము జాగ్రత్తగ నుండవలయునని నాన్నగారితో చెప్పించవలెను. ఈయన ఎంత పరోపకారి!

ఆమె హృదయము పూర్ణమైనది. తలుపులు దరిగ వేసికొని, నిదురించు తన భర్తను జూచి పులకరించిపోయినది. సిగ్గుచే మొగము జేవురింప నెమ్మదిగ తన భర్త పర్యంకముసేరి, యాతని తనివోవ బరికించి యాతనితల నంటియంటన ట్లంటినది. ఒక్కసారి యామె హృదయము పున్నమనాటి సంద్రమై ఉత్తుంగతరంగయుతమై పొంగినది.

ఈయన కాళ్ళకడ నేల పండుకొనరాదు? ఇతడేనా తన నాథుడు? తండ్రిగా రిదియంతయు చూచియేనా తన్నీ మహాభాగున కిచ్చినారు? ఆమె యాతనికి నమస్కరించినది. చిరునవ్వులు నాట్యములాడునా యన్నట్లు, సహజముగ వంపు రేఖలున్న యాతని పెదవుల జూచి తన పెదవుల మెత్తదనము తలచికొని ఆ పెదవుల...? ఆమె మత్తిల్లినది. కనుల బరువు లావరించినవి.

వెలుగున్నదో లేదో యనిపించు పడకగది దీపపువెలుగులు, నిదుర నటించు భర్త నొక దివ్యపురుషునిగ గన్పింపజేయ, నామె యాతని పదములకడ నెమ్మదిగ జేరి పండుకొన్నది.

ఆతని పాదములు తనయొడలికి దగులుటచే నేదియో వర్ణింపరాని అద్భుత మాధుర్యము విద్యుల్లతవలె నామె శరీరమంతయు ప్రాకిపోయినది.

ఈ ఉత్తమ పురుషుడు, ఈ సౌందర్యనిధి, ఈ వీరసింహుడు, తనభర్త! తన్ను ప్రేమించి తన్ను వివాహమాడినాడు. తానెంతమూర్ఖురాలయి సంచరించినది. పెన్నిధిని పెంటప్రోవనుకున్నది. ఈయన తన్ను చేపట్టునా? తన్ను తీయని మాటల నాదరించునా? ఆ గంభీరదృష్టులతో తన్ను చూడనైన చూచునా? ఆ వెడదరొమ్మున బలములు తిరుగు బాహువులతో తన్నదిమి వేయునా? తా నెంత శిక్షకైన అర్హురాలు. ఆమెకు భయ మావహించినది. ఆయన పాదములంటి వేయి మ్రొక్కులు మొక్కినను, ఆయన మన్నించునా? మన్నించునా?

ఇది యంతయు నారాయణరావు జూచుచున్నాడు. ఆమె తనకడకు వచ్చినప్పుడు, తన తల నామె తాకినప్పుడు ఆతనియొడలు ఝల్లుమనిపోయినది. ఆతనిహృదయ ముప్పొంగిపోయినది. వేయితీపు లాతని నలమినట్లయినది. లేచి యా బాల నేల కౌగిలిలో నదిమివేయరాదు? రూపెత్తిన లాలిత్యము తన ప్రణయకాంత సౌందర్యము. సౌందర్యమునకు వన్నెలుదిద్దు సౌందర్యము. ఇన్నాళ్ళకు ఈమె తన్న నుగ్రహింపనున్నదా! జరిగిన దంతయు కల కానున్నదా? ఆమెను తన జీవితాశయమూర్తిగ నొనర్చుకొని, ఆమెతో

లోకాల నావరించి, ఆమెను పూజించి, ఆమె దివ్య గాంధర్వములో లయమై, ఆమె పవిత్ర సౌందర్యజ్యోత్స్నలో కిరణమై ఆమెయు తానును లయమై పోవుట ఎన్నడు?

ఇంకను ఆమె గాఢోత్కంఠయై ప్రేమ మహా ఝంఝానిలముల గదలిపోవలె!

అతడు కదలక యట్లే స్వప్నమధురాకాంక్షల దేలిపోవుచుండెను. రాత్రిఘడియలు గడచిపోవుచునే యున్నవి.

* * *

మరునాడు శారదాదేవి మొదటితరగతిలో గృతార్థురాలైనట్లును, సూర్యకాంతమున కన్నియు మంచిగుణములు వచ్చినట్లును జమిందారుగారు కూనూరునుండి తంతి నంపిరి.

నారాయణరావున కన్నియు శుభవార్తలే. రెండురోజుల క్రిందటనే రామచంద్రరావు నాలుగురోజులలో సింహళమందు దిగునని తంతి వచ్చినది.

ఇదివరకే చెన్నపురిలో రవ్వలు చెక్కిన గాజులజతలు రెండు, ఒక్కొక్కటి అయిదువందలకు నారాయణరావు కొన్నాడు. అవి పరీక్షలో నెగ్గబోవు నీ బాలల బహుమతులకే! సన్నని గాజులు, వానిపై నచ్చుటచ్చుట చక్కని చిన్న రవ్వలు. ఆ రెండుజతలు నారాయణరావు భార్యకొకటి, చెల్లెలికొకటి బహుమానము లిచ్చెను. వారెంతయు నుప్పొంగిరి.

ఆ రోజున సుబ్బారాయుడుగారు తన దొడ్డిలోని ఆడువారందరికీ ఖద్దరు రవికలగుడ్డలు, పండ్లు, బహుమతులు పంపించిరి.

శారద సంతోషము ద్విగుణీకృతమగునట్లు ప్రతివారు సూరీడును, శారదను బొగడువారే. సూర్యకాంతము శారదను కౌగలించుకొన్నది. ‘వదినా! మా అన్నగారు అమెరికా నుంచి నాలుగురోజుల్లో వస్తున్నారట గాదూ?’ అనినది శారద.

‘ఉండమ్మా వదినా! అన్నీ వేళాకోళాలు మొదలు పెట్టావు.’

సోమయ్య భార్య, జానకమ్మ గారితో తన యల్లునికి, తనకుమారునికి జరిగిన యుద్ధము, అల్లుని చెడునడవడి, చిన్న బాబయ్యగారు చేసిన యుపకారములన్నియు చెప్పినది. ‘ఆనాటినుంచి సీతన్న మారిపోయాడండి. నారాయణరావు గారు మంచి ప్రెబువు తల్లీ’ అని చెప్పుకొన్నది. శారద యా చిత్ర చరిత్ర వినుచు కన్నుల ఆనందపు వెలుగుల జిమ్మినది.

అందుకనా చల్లాలు త న్నతి గౌరవము చేయుచున్నది! తానన్న వెట్టి యాపేక్ష జూపుచున్నది. చల్లాలు, వెంకాయమ్మ ఒక్కయీడు, చిన్నతనమునుండి నారాయణుని ఆటలు పాటలు నన్నియు చల్లాలెఱుగును. ‘మీ ఆయనగోరు చిన్నతనంలో కుట్టమూర్తిలా ఉండేవోరు. తొనలు తొనలండీవొళ్లు. వంటినిండా నగలతో గంతులేస్తూంటే దిష్టి తగిలిపోతుందనకునేవోరు అమ్మగారు. అందరికీ ఎత్తుకోవాలని ఉండేది. ఎత్తుకోనిస్తేనా? ఆర్కి ఎంతబలం! ఓమాటు మా వంగోలావు గిత్తదూడను ఊరకుక్క ఒక్కటి కరవపోతుంటే దాన్ని తోకుచ్చుకొని బరబర లాగిపారేశారు. అప్పుడు మూడోయేడు. కుక్కపోతరించిన గేద్దూడలాంటిది. అడిలి కొంయ్యో కొంయ్యో అంటూ పారిపోయిందండి.

‘ఆయన సదుగులు పెద్దవి, బుద్ధులు గొప్పవి. ఎంత గొప్పవోరండీ!

‘చిన్నతనాన్నుంచి ఎలాంటివోళ్ళమీదా ప్రేమ. మాలోళ్ళంటే ఆళ్లకన్నీ యిస్తూ ఉండేవోరు. గాంధిగారిమాట రాకమునుపే ఇంటిలోవన్నీ తీసుకెళ్ళి మాలోళ్ళపిల్లలకీ మా పిల్లలకి పెట్టుండేవోరండి. ఎంత బకితి! మావోళ్ళంతా బజన చేస్తూఉంటే ఆ అందంవొలికే కన్నుల్తో చూస్తూ ఉండేవోరు. దయ ఇంతింత కాదుండి. మేం అప్పుడే అనుకునేవోళ్ళం. ఈయన పపంచంలో కల్లా తెలివైనవోరని.’

‘చదువులు అవీ ఎల్లాగుండేవి?’ శారద ఆ ప్రశ్న అప్రయత్నముగ వేసినది. తానేనా అడిగినది యని యాశ్చర్యముపడినది.

‘అమ్మయ్యో! ఆరి చదువేమిటి? అదుబుతం కాదమ్మా! నీ అదురుష్టం అమ్మా! మీ యిద్దరికీ యీడూజోడూ. తల్లీ మికీపాటికి చిన్నతనంలో నారాయణం గారివంటి బొజ్జనాన్నగోరు పుట్టాలండి. ముందుసంవత్సరం తప్పకుండా పుడ్తారులెండి.’

‘ఖైదుకు వెళ్ళారా?’

‘అవునండీ, ఇంతప్పటినుంచీ నెచ్చేరులే. అంతలో గాంధిగారొచ్చారు. ఒక్కటే నెచ్చేరులు నారాయణగోరు. తచ్చణం ఆయన్ని పట్టుకొని ఆరునెల్లు ఖైదులో యేశారు. ఎంతమందొచ్చారు బాబో ఆరు ఖైదుకు ఎళ్ళేటప్పుడు! ఈ సీమోళ్ళంతా వచ్చారండి.

‘ఖైదులో ఉన్నప్పుడు నిద్దరలేదు, తిండిలేదు మా జానకమ్మగోరికి. పెద్దయ్యగోరుమాత్రం ధైర్యంగా ఉన్నారుండి. జైలునుండి రాగానే మీ అత్తగోరు ఆరతి యిచ్చారుండి. పూజలు పురస్కారాలు జరిపారుండి.’

౧౯

బంధితుడు

వారంరోజులైన వెనుక మధురనుంచి రామచంద్రరావు తన్ను విప్లవకారులలో నొకనిగా నెంచి పోలీసువారు నిర్బంధించిరనియు, నారాయణుని తత్ క్షణము రమ్మనియు తంతివార్త నంపెను. నారాయణు డా వెంటనే బయలుదేరి మెయిలందుకొని చెన్నపురి వెళ్లినాడు. ఆ సాయంకాలము మెయిలులో మధురకు బోవచ్చుననియు పోలీసు ముఖ్యాధికారితో నీ విషయమై మాట్లాడుట మంచిదనియు తలచి, తన న్యాయవాది గురువు గారికడకు బోయి యంతయు జెప్పెను. వారును నారాయణరావును గలసి రాజధాని పోలీసు ముఖ్యాధికారి కార్యాలయమునకు జని యచ్చట విచారించగా, రామచంద్రరావు విషయమై యేదియో గూఢసమాచారమును, అందునకు సంబంధించిన కాగితములును ముఖ్యాధికారికి అందినట్లును, ఆయనే రామచంద్రరావును బంధింప నుత్తర్వులిచ్చినట్లు, ఇది యంతయు ప్రాణకాంతబోసు, గండారుసింగులపై ప్రభుత్వమువారు తెచ్చిన యభియోగమునకు సంబంధించినదనియు దెలిసినది.

దానితో నారాయణరావు తిన్నగ నీలగిరికి, కూనూరు పోయినాడు. మామగారితో మాట్లాడినాడు. మామగారిని దీసికొని ఉదకమండలము వెళ్ళినాడు. జమీందారుగారు ముఖ్యమంత్రిని పట్టుకొని ఆయనతో గలసి, పోలీసు ముఖ్యాధికారికడకు వెళ్ళినారు. మంత్రియు, జమీందారును రామచంద్రరావు కేసు విషయమై వచ్చినారని వినగనే యా యుద్యోగి యాశ్చర్యమునంది_

'మీకు చుట్టమాండి రాజాగారూ?' అని ప్రశ్నించి, 'ఇవిగో! ఇవి అతని కేసుకు సంబంధించిన కాగితాలు. మావాళ్లు పదిరోజులు రిమాండు పుచ్చుకొన్నారు. అనుమానాస్పదములైన కారణాలు చాలా ఉన్నవి' అని తెలియజెప్పెను.

జమీందారుగా రా కాగితములన్నియు బరీక్షజేసిరి. అమెరికాలో రహస్యశాఖా కర్మచారుడు వ్రాసిన సముజాయిషీలవి. అమెరికాలో తిలకు జన్మదిన మహోత్సవ సందర్భమున రామచంద్రరా వుపన్యాస మిచ్చినట్లు (ఆ యుపన్యాస భాగము కత్తిరించియున్నది) ఆ యుపన్యాసము విప్లవవాదపూరితమైయున్నట్లు, 'భారత సందేశ్' అను పత్రికలో రామచంద్రరావు తీవ్రవాదనలతో వ్యాసము వ్రాసినట్లు (ఆ పత్రిక ప్రతియు నున్నది) ప్రాణకాంతబోసు మొదలగువారితో గలిసి భరతదేశమున విప్లవము గలుగచేయ రహస్యాలోచనలు సలిపినట్లు ఈ మొదలగు వివరము లందున్నవి. ఇవి యన్నియు అప్రూవరుగామారిన ఒక ముద్దాయివలన గ్రహించిన విషయములు.

ఇన్‌స్పెక్టరుజనరల్ గారి యనుమతితో జమిందారుగారువెళ్ళి, ప్రభుత్వ న్యాయవాది (అడ్వకేటు జనరలు) గారిని తీసికొనివచ్చిరి.

వారందరు రామచంద్రరావుగారి కేసును గూర్చి సంపూర్ణముగా తమలో తాము చర్చించుకొనిరి. అడ్వకేటు జనరలుగారితోడను, ముఖ్యమంత్రిగారి తోడను, పోలీసు ముఖ్యన్యాయాధికారితోడను రామచంద్రరావు చాలా తెలివైన యువకుడనియు, నాతడు ప్రపంచమంతటా లెక్కలలో ప్రసిద్ధికెక్కిన కొద్దిమందిలో నొకడనియు, అతనికి ఆంధ్ర విశ్వవిద్యాలయ కళాశాలలో ఆచార్యపదవి సముపార్జింప గోరికయనియు, అతడు ఎమ్. ఎస్ సి. పట్టము నొందినాడనియు, ఆంధ్రులలో నట్టివా రితరు లెవ్వరు లేరనియు జెప్పి వాదించినారు జమీందారుగారు. అడ్వకేటు జనరలు గారు కాగితములన్నియు బరిశీలించి

'ఇందులో ఇంతవరకున్నది రెండే సాక్ష్యములు: ఒకటి అమెరికా రహస్యచారుడు, రెండు విప్లవకారులలో ప్రభుత్వపక్షానికి తిరిగినవాడు. వాళ్ళు ఏమి చెప్పగలరు? ఒకడు రామచంద్రరావు పత్రికలో వ్రాసినట్లు, ఉపన్యాసమిచ్చినట్లు చెప్పును. మరియొకడు ఒకరాత్రి వీరందరును కలిసినట్లు మోము కప్పబడియున్నట్టు చెప్పును. వార్తాపత్రికలు సాక్ష్యములుగా పనికిరావు. రాత్రివేళ ఒకరినొకరు గుర్తించుట యెట్లు?

ప్రాణకాంత బోసు, గండార్ సింగుల కేసులో సంగతివేరు. వారు హిందూదేశమువచ్చి బాంబులు తయారుచేయుట మొదలుపెట్టినారు. ఇంకను హిందూదేశములో నేవేవో చేసినారు. ఆ సాక్ష్యబలమున ఇది అంతా ప్రభుత్వముపై కుట్ర అని అర్థమయినది.

'ఆ కేసులో రామచంద్రునకు సంబంధము లేదు' అని ఆయన వాదించినాడు.

ముఖ్యమంత్రియు రామచంద్రుడు నిర్దోషియని చాలగట్టిగ చెప్పినాడు. సరేయని ఎట్టకేలకు పోలీసు ముఖ్యాధికారి యొప్పుకొనుచు, కేంద్రప్రభుత్వము వారికి జరిగిన విషయములు, రామచంద్రరావుపై కేసు లేదనియు, మదరాసు ప్రభుత్వము వారును తనతో నేకీభవించుచున్నారనియు మనవి చేయుచు వ్రాసెను.

శ్రీ మదరాసు గవర్నరుగారు ఇన్ స్పెక్టరుజనరలుగా రొనర్చినపని మంచిదని, అట్లు చేయవచ్చుననియు ననుమతినిచ్చిరి.

ప్రభుత్వపు తంతి రామచంద్రుని విడుదలచేయుమని రామనాడుజిల్లా పోలీసు సూపరింటెండెంటుకు పోయినది.

జమీందారు గారు సంతోషముతో ముఖ్యమంత్రికడ నుండియు, పోలీసు ముఖ్యాధికారినుండియు ముఖ్య న్యాయవాదికడ నుండియు సెలవు పుచ్చుకొని, నారాయణరావుకడకు వచ్చెను. వారిరువురు గలసి కూనూరు వెళ్ళిరి. నారాయణరావు అత్తగారికి, భార్య మేనత్తకు నమస్కరించి కేశవచంద్రుని కౌగిలించుకొని మామగారికడ సెలవుపుచ్చుకుని, మధుర ప్రయాణమయ్యెను. తాను వచ్చుచున్నాననియు, విడుదల చేసెదరనియు తన బావ కాతడు మధురకు తంతినంపెను.

ఇటలీలో బ్రిండిజీకడ నాయిటాలి యను మహానౌక నెక్కినప్పటి నుండియు రామచంద్రరాయనికి దన దేశముపై, తన ఇంటిపై, తనబంధుగులపై మనస్సు పరుగిడజొచ్చెను.

ఈ దేశములో నెంత యైశ్వర్యమున్న నేమి, ఎన్ని సౌకర్యములున్న నేమి, ఎంత నాగరికతయున్న నేమి తన దేశమున కీడువచ్చునా? 'సుజలాం సుఫలాం మలయజ శీతలాం, సస్యశ్యామలాం, మాతరం వందేమాతరం.'

ఆహా! తనతల్లి కెన్ని నదులు, ఎన్ని క్రీడాసరస్సులు, ముక్కారులు బండు కేదారములతో, ఒడలు మరపించు చల్లదనముతో తనతల్లి తన్ను చేరపిలుచుచున్నది.

'శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం మాతరం.'

అడవుల, కొండల, పట్టణాల, బయళ్ళ, పొలాల, తోటల, నదుల, సమ ద్రాల చల్లగా ధవళమై పుచ్చపూవువలె పడు వెన్నెలచేత పులకించిపోదువా తల్లీ. అందములై, ఆనంద

మనోహరములై, అపరమిత సువాసనాలహరీ పూరితములై వివిధ వర్ణాలంకారశోభితములై పూవులచే అలంకరింపబడిన దామాత. ఆమె శిరోజము లా హిమాలయములు! అందమగు కాశ్మీరము, తమతల్లికి ప్రఫుల్లమగు ముఖమా!

ఒహో మాతా! నీగతి దుర్భరము. కానిమ్ము పుత్రులు నిన్ను మరచెదరా! జగన్మాతా!

'త్రింశత్ కోటి కంఠ కలకల నినాదక రాశే
ద్వాత్రింశతో కోటి భుజై ధృతకరకర వాలే.'

తల్లిముఖాన వినవచ్చు భాషలన్ని విని ఎంత కాలమయినది.

ముద్దులుగులుకు తెలుగుభాష వినరాక చెవులు తుప్పులు పట్టినవి.

'ఆంధ్రదేశము మాకు అమరదైవతము'

తల్లీ! తెలుగుమాతా! నీ తీపిలో తానెప్పుడు లీనమగునో అమ్మా! గోదావరీ, పుణ్యస్రవంతీ, నీ గంభీరత, నీ ప్రేమ తాను మరువగలుగునా? ఎప్పుడు దూరాన నా పాపికొండలు, నీలోని లంకలు, నీ నీలజములు కన్నుల కరవుదీర చూడగలుగుదునోకదా?

కృష్ణా! పెన్నా! ఏ నాటికి మీ దర్శనము. రాజమహేంద్రనగరము, కాకినాడ పురము, కాకినాడయందలి వీధుల తాను నడచిపోవలయును.

ఆతని మనస్సు తళుక్కుమన్న ది. కొత్తపేట, అత్తవారిల్లు తన చిన్నారి భార్యయగు సూర్యకాంతము.

ఏమి తెలివైన దాబాల! ఎంత అందగత్తెయయినది. సంపూర్ణ ప్రౌఢవలె నెదిగినది. పదునేడేండ్ల బాలిక; ఆ భగవంతునిమాయ. లియొనారా తన లక్షల నెంచక, తన్ను సంపూర్ణముగ నర్పించుకొన్నదే! జాతికి జాతికి శ్రుతి కలియదా యేమి? తన సౌందర్యనిధి, సర్వకళాశోభిత సూర్యకాంత మేమిచేయు చుండునో! తన భర్త పరీక్షల జయమంది వచ్చుచున్నాడని లోన సంతోషించు చుండునో? పరీక్షలలో నెగ్గినదా? తప్పక నెగ్గును, నారాయణరావు బావ చెల్లెలు. ఆమె నెప్పుడు చేరకలుగునో? తన్ను చూడగానే యామె మోమున నెట్టిమార్పులు కలుగునో?

నారాయణరావుబావ గంభీరస్వనములు విని యెన్నాళ్లయినది!

తనతల్లి, ఆమె యెన్ని అశ్రువులు రాల్చినదో? ఎంత చిక్కినదో? భార్యనైన వదలవచ్చును, తల్లిని వదలలేము. తల్లీ! ఈ నిర్భాగ్యుడు ఎంత తెంపరియయి సుదూర దేశాలు పోయినాడు. ఎప్పుడు కాకినాడలో అడుగుపెట్టునో? తల్లి పాదాలపై మోము నుంచవలె. ఆమెయొడిలో ఒరిగిపోవునుగాక. ఆమె తన తల నిమురునా? పూజ్యులగు తండ్రిగారికి నమస్కారములు. తా నమెరికాలో చదువుకొన్నంత కాలము, ఎంత విచిత్రపు ప్రేమ నొలికించు నుత్తరములు వ్రాసినారు! వర్తకులగు తన స్నేహితులచే, తన కొమరుని స్నేహితులచే ననేకములగు వార్తల నంపినారు. మామగారు గంభీరులు. ఆయనకు భయములేదు. మానవ మహోత్కృష్టతయం దెంతయో నమ్మకము. ఆయన మేరువువలె నుండును. ఆయన యే యుగపు వీరుడో?

సూర్యకాంతము తనతో మాటలాడునా? తన పెళ్ళినాటి యామె రూపము, యీ నాటి

యామె రూపవిలాసము! ఎంత మారినది? ఎవరా యని ఒక్క నిమేషము తాను తెల్లబోయినాడు, ఆఖరి ఛాయాచిత్రము చూచినప్పుడు. శాంతి ఉన్నదన్నారు. తన బావ ముహూర్తముకూడ పెట్టినామని ఏడెనుకు తంతి నిచ్చినాడు. అతనికి తనపై నెంత ప్రేమయో! ఈ అందరి ప్రేమకు దాను బాత్రుడగుట కేమి చేసెనో?

సింహళము దరిసినది. కొలంబోలో నౌక ఆగినది. నౌకలో భరతదేశపు భోజనము పెట్టిరి. ఇటలీ దేశస్థులు భారతీయుల నెక్కువ గౌరవము చేసెదరు.

రామచంద్రరావు నౌక దిగుచు వెనుకటి తన నౌకా ప్రయాణము జ్ఞాపకము తెచ్చుకొన్నాడు.

లియోనారాకన్య యెంత ప్రేమార్ద్రహృదయ! అతని కా సాయంకాల దివ్యముహూర్త మీ జన్మమున మరపురాదు. ఏమి యానందమిచ్చినది! అతిపవిత్ర హృదయ. కాని ఆట్లు తన్నర్పించుకొన్నదే. ఎంత ప్రయత్నించినను తా నామె సౌందర్యమునకు, ప్రేమకు ముగ్ధుడైపోక తప్పినదికాదు.

ఆమె యేమన్నది–'నా ప్రియతమ స్నేహితుడా రామచందర్, నీ భార్యతోపోయి సుఖముగా కాపురము చేయుము. మమ్ముల మరచిపోకుము. మాకందరకు హిందూదేశముపై నున్న ప్రేమ ఏ దేశమునందు లేదు.

'ఏల మేము హిందూదేశ స్వాతంత్ర్యమునకు సాయము చేయుట లేదు? అని ప్రశ్నకదా? ఏ దేశమున కా దేశము ప్రయత్నించి విజయమందవలెను. నీవు భారతములోని పద్యము చదివి నాకు అర్థము చెప్పినావే. అటులే చివరకు మా దేశమువంటి దేశములు సాయము చేయును. 'మీ దేశ ముత్కృష్టమైనది. అట్టి పరమపూజ్యమగు దేశము స్వాతంత్ర్యమునకై పోరాడుచుండ ప్రపంచోద్ధారకమగు పరమశక్తి ఉద్భవిస్తుంది. యూదులు తమ దేశస్వాతంత్ర్యమునకై పోరాడుటవలననే అవతార పురుషుడగు క్రైస్తు జన్మించలేదా? ఆలాగు గాంధియో మరి యెవ్వరో ప్రపంచము తరింపజేయుటకు మీ దేశముననే యుద్భవించాలి.'

అని చెప్పినది. ఏమి యామె యుత్సాహము, ఆమె ప్రేమ! తప్పక హిందూదేశము వచ్చెదనన్నది. తనకు పునస్సంధానమహోత్సవము జరుగునాటి కామె బహుమతి వచ్చునట. తా నామెకు తన పునస్సంధానముహూర్తపు తారీకు తెలుపుచు తంతి నిచ్చినాడు. ఆత డిట్లాలోచించుకొనుచు అచటనున్న అరవల, తెలుగుల, ఔత్తరాహుల భాషల చెవులార వినుచు బులకించుచు రహస్యముగ దిరుగు కన్నీరు తుడుచుకొనుచు మంచి ఆంగ్లేయ హోటలులోనికి బోయి పూర్ణమగు భారతీయ భోజనము మాంసరహితమగుదానిని గొనిరమ్మని, గదిలోనికి బోయి భోజనపు దుస్తులు మార్చుకొని భోజనముచేసి రైలెక్కి పొలనారువా చేరుకొన్నాడు.

౨౦
రామచంద్రునిరాక

పొలనారువాలో (స్టీమరు) చిన్న పొగయోడ నెక్కి ధనుష్కోటిలో దిగి ఒళ్ళు పులకరించిపోవ భక్త్యావేశపూరితుడై, ఏరును చూడకుండ వంగి కొంత మన్ను తీసి ముద్దుగొని నోటిలో వేసికున్నాడు. అచ్చుటనేయున్న యొక జానపదుడు 'ఈ దొర మన్ను తిన్నాడేమి!' యని యనుకొన్నాడు. ఇంతలో ముప్పురు పోలీసువారు, ఒక

రక్షకభటాధికారియు, నిరువురు భటులు వచ్చి 'అయ్యా, మీ పేరేమి?' యని అడిగినాడు.

'నా పేరు రామచంద్రరావు.'

'ఇంటిపేరు?'

'బుద్ధవరపు.'

'అయ్యా! మిమ్ముల శ్రీ జార్జిసార్వభౌముని పేర నిర్బంధించుటకు నుత్తరు విదిగో. మిమ్ముల నిర్బంధించుచున్నాను' అని యా రక్షకభటాధికారి యాతని భుజముపై చేయి వైచెను.

'అలాగా అండి' అని రామచంద్రరావు తెల్లబోయి, యిదేమి యని మనస్సులో చకితుడైనాడు. మోమున నిర్భయముతో చిరునగ వలంకరింప 'ఇదేదో పొరపాటు. నన్నెందుకు మీరు నిర్బంధించుచున్నారో నాకు చెప్పగలరా?' యనెను.

'క్షమించండి. నాకు తెలియదు. మా పై అధికారులకు తెలియును.' 'నన్నెక్కడికి తీసుకొనిపోయెదరు?'

'మధుర. అక్కడ కారాగారమున నుంచెదము.'

'మా వారికి తంతి నీయవలయునే?'

'మధుర నుండి యిచ్చెదరు గాక.'

మరునాడు మధుర చేరినారు. మధుర నుండి బావమరదికి తంతినిచ్చినాడు. ఎందుకు తన్నిట్లు బంధించుట? తానేమియు చేయలేదే? నేను అసహాయవాదినికాదే! ఇక నెందుకు? విప్లవకారుడనా? అదియుకాదే. అమెరికాలో ఉపన్యాస మిచ్చిన సంగతి చటుక్కున జ్ఞాపకమునకు వచ్చినది. ఏమో యావేశమున నేదియో య న్నాడు. అంతమాత్రమునకే! బావమరది ఖైదుకు వెళ్ళలేదా! తానును కారాగారమునకు పోయిన దేశమాత సేవయే. 'తల్లీ, నీ పాదములకడ అడుగు పెట్టగనే భారతీయుడు బంధింపబడవలెనా?' యనుకొన్నాడు. తనకు విప్లవము, కుట్ర నచ్చదు. ఏదో దేశములో శాస్త్రజ్ఞానము వృద్ధినందింప బాటు పడవలెననియు భరతమాత కీర్తి సర్వదిశల ప్రకాశింపజేయవలయుననియు నాతని వాంఛ. ఏది ఎట్లయిన నంతయు భగవంతుని చేతిలో నున్నది.

నారాయణరావు, రామచంద్రరావును నిర్బంధించిన నాల్గవరోజున మధురకు జేరుకొన్నాడు. కూనూరునుండి యా యువకుడు మధుర జేరుకొను లోపలనే రామచంద్రరావును సగౌరవముగ విడుదల చేయవలెననియు, అయినను చెన్నపురివరకొక గూఢచారిని వెంటబంపవలయుననియు రహస్యపు వార్త చేరినది. జమీందారుగా రీ నిర్బంధమును రామచంద్రరావునకు గల్పించినందులకు ప్రభుత్వము వారిపై నాత డేచర్యయు తీసికొనకుండునట్లు వాగ్దానము చేసెను. రామచంద్రునికి తాను వచ్చుచున్నట్లు జిల్లా రక్షకభటాధికారి పేర నారాయణరావు తంతి నిచ్చెను.

మామగారికి మనస్సులో నానందముతో, గృతజ్ఞతాపూర్వకమగు వందనములు చేయుచు నారాయణరావు మధుర స్టేషనులో దిగి, జిల్లా పోలీసు అధికారికడకు

బోయినాడు. అచ్చట ఒక్క నిమేషము, ఎవరో తన బావమరదియో, రక్షకభటాధికారి యెవరో గుర్తింపలేకపోయినాడు. ఆ భటాధికారి యాంగ్లేయుడు. మరుసటిక్షణములో నానవాలుపట్టి రక్షకభటాధికారికి ముందు నమస్కరించి, వెనుక రామచంద్రరాయనికి నమస్కరించి అధికారిచూపిన యాసనముపై కూర్చుండెను. వారు మువ్వురు అనేక విషయముల గూర్చి మాటలాడుకొనిరి.

నారాయణరావు వచ్చినపుడే రామచంద్రరావు 'బావా, యీయన నాకు చూపిన గౌరవము అపరిమితము. వీరిని నేనెప్పుడును మరువను. ఈయనయు లెక్కలలో ఆక్సుఫర్డులో బి. ఏ. లో కృతార్థుడైనాడట. ఎన్ని విషయములు చర్చించుకొన్నాము' అని అన్నాడు. 'వారికి మేమెంతయు కృతజ్ఞులము' అని తాను కొనివచ్చిన పూవులమాలలు, నాలుగు వెండికప్పుల దొంతర ఆయనకు బహుమతి నిచ్చినాడు నారాయణరావు.

దారిలో వారిని జమీందారు గారి కుటుంబము కలిసినారు. వారంతయు సంతోషమున చెన్నపురి చేరినారు. చెన్నపురిలో జమీందారుగారి యింట నందరు మకాముచేసినారు. మధుర నుండియే విజయవార్తలు కాకినాడకు, కొత్తపేటకు, అమలాపురమునకు బంపబడినవి.

చెన్నపురిలో పరమేశ్వరుడును, నారాయణరావును, రామచంద్రరావును స్నేహితులందరి యిళ్ళకు వెళ్ళిరి. అచ్చట వారెంతయో సంతోషమున కాలము పుచ్చిరి.

మధ్యాహ్నము భోజనములయినవెనుక వారందరు శ్యామసుందరీదేవి గారి యింటికి వెళ్ళిరి. అక్కసెల్లెళ్ళందరు రామచంద్రరాయని నమితముగ గౌరవముచేసిరి. ఈతడా సూరీడు భర్తయని వారు సంతోషించిరి.

ఆ రాత్రియే బయలుదేరి కాకినాడకు వెళ్ళవలె ననుకొన్నారు. కాని నారాయణరావునకు నమితానందదాయక మును, మహత్తరమునగు నొకయాలోచన తట్టినది. అందుకై మరునాడుకూడ వారు చెన్నపురిలో నాగిపోయిరి.

రాజారావు ఉత్కృష్ట పురుషుడు; శ్యామసుందరి పవిత్రచరిత్ర. వీరిరువు రేల వివాహమాడరాదు? ఇరువురు వైద్యవృత్తియం దారితేరినారు. ఇరువురు సేవజేయుటయే జన్మకు పరమార్థమని సంకల్పించుకొన్నారు. శ్యామసుందరి యొప్పుకొనునా? అతనికి ఒక నాటిరాత్రి జరిగిన యుదంతమంతయు దృశ్యమువలె గోచరించినది. ఆమె హృదయములో నేమున్నదో? తనపై ప్రేమ సోదరుని ప్రేమయైయున్నది. ఆ సోదరప్రేమయే ఉత్కృష్టమైనదట. దివ్యకరుణావేశ యైనదట. అంతియ!

నారాయణరావు శ్యామసుందరిని మరునాడు కలిసికొన్నాడు. ఆమెతో తన కోరిక ప్రసంగించుట యెంతకష్టము! 'చెల్లీ, నా కొక దివ్యమగుస్వప్నము ఎప్పుడూ కనబడుతూ ఉంటుంది.'

'ఏమిటది అన్నా?' – ఆమెమాటలు చిరువెండి గంటలవలె మ్రోగినవి.

'నువ్వు దేశసేవ, మానవసేవయు చేసి తరింప సంకల్పించుకొన్నావు. తరిబీతు లన్నియు పూర్తియైనవెనుక సబర్మతీ యాశ్రమమునకు బోయి సేవచేయు నధికారము సంపాదించుకొంటా నన్నావు.'

'అవును అన్నయ్యా, ఆమహాత్ముని పాదాలకడ సేవచేయుట నేర్చుకొని నా జన్మము

సేవలో ఐక్యము సేయవలెనని నేను నిశ్చయించుకొన్నాను. నే నెంతవరకు తగుదునో? నే నందుకు తగుదునా అన్నా?'

'నీవు అన్యథా తలచనంటే నే నొక ప్రశ్న అడుగుతాను.' ''అన్నా! నువ్వేదన్నా నేను వేరభిప్రాయం పడగలనా?' ఏలనో యామెకు గుండెలు ఝల్లుమన్నవి. 'ఏమది? ఏమది?'

'నా కల చెప్పనీ తల్లీ! ఇన్ని దినాలూ నాకు అనేకములగు ఆలోచనలు పుట్టుతున్నవి, నశించిపోతున్నవి. అద్భుతములు, ఆనందదాయకములు. దేశసేవ చేయ కంకణము కట్టుకొన్న విద్యావతి, బ్రహ్మచారిణిగా ఈ కాలములో, ఇట్టి పరిస్థితులలో జన్మ మెట్లు గడపుట? ఎంతటి వైరాగ్యహృదయులైనా, వైరాగ్యకర్ములైనా మానవులు తమ కెదురువచ్చు సైతాను, కామదేవుని భయంకరమైన తంత్రాలకు పడిపోతారు. క్రీస్తు, బుద్ధుడు, గాంధి మొదలగు అవతారపురుషులే అనేకములగు ఇబ్బందులతో ఆ పిశాచాల్ని జయింపగలిగారు. భగవద్గీత అందుకనే కర్మమార్గ ముపదేశించింది తల్లీ.'

శ్యామసుందరి నిస్తబ్ధయై యూరకున్నది.

'నాస్వప్నం, నాఆశయం! ఇరువురు ఉత్తములు, దేశసేవ చేయదలచినవారు, ఏకపథ సంచారులు, విడివిడిగా వారి జీవితముల వేరుమార్గాల ప్రసరించనీక ఏకాశయ పూర్ణావేశులై భార్యాభర్తలై దేశసేవ ఏల చేయరాదు? అని. నువ్వు బ్రహ్మచారిణివిగా ఉండటం ఎంత కష్టముతల్లీ! మనము మానవులం. ఎంత ఉత్తములైనా ఏ దుష్టకాలములోనో ఈ దేహానికి దాసులు కావలసి వస్తుంది తల్లీ! అది దాటుటకు మార్గమే గృహస్థాశ్రమం అని చెప్పారు. నీబోటి ఉత్తమురాలికి సరియైన స్నేహితుడు చేదోడైయున్న నీ యాశయం మరింత సులభంగా పూర్తి అవుతుంది కాదూ?'

శ్యామసుందరి మాట్లాడలేదు. ఎట్టకేలకు, 'అన్నా, నీ ఉద్దేశం రెండు మాటల్లో చెప్పు' అన్నది.

'నువ్వున్ను, రాజారావున్నూ ఏల మీ జీవితనౌకలు జంటచేసి ఈ సంసార జలధిలో మీ ఆశయానంద ద్వీపం చేరరాదు? ఇరువురికీ ఒకే ఆశయము. ఒకేవిద్య. ఇరువురు ఉత్తములు. పారలౌకిక విషయములం దాపేక్ష, మిక్కుటముగా గలవారు. ఒకరికొకరు సహాయం. మీ యిద్దరు దేశానికి సేవచేయడం ఎంత ఉత్తమం! ఆ స్వప్నం నేను ఎన్నిసారులో నిర్మించుకొన్నాను. స్వప్నములో ఆనందం పొందాను. ఏమంటావు?'

శ్యామసుందరి నిర్ఘాంతయై ఆశ్చర్యమానసయై కొంతసేపటికి చిరునవ్వు నవ్వి,

'అన్నా! నువ్వు యింటికి వెళ్ళు. నేను ఆలోచించుకొని నీకు తంతినిస్తా. నీ ఉదారమగు మనస్సు నా కెప్పుడు అవగతమే అన్నా' అని యామె కన్నీరు విడిచినది. నారాయణరా వామె తలపై తన హస్తముంచి, యామెకు నమస్కరించి యందరికడ సెలవు తీసికొని వెడలిపోయినాడు.

గోదావరి స్టేషనులో రాజారావు, లక్ష్మీపతి, వీరభద్రరావు, భీమరాజుగారు, సుబ్బారాయుడుగారు, జానకమ్మగారు, రామచంద్రరావు తల్లిగారు, రామచంద్రరావు స్నేహితులు, ఊరిలోని పెద్దలు రామచంద్రరావును ఎదుర్కొన్నారు. పూలమాలలు వేసినారు. రామచంద్రరావుమోము ప్రఫుల్లమయి పోయినది. అచ్చటనుండి అందరు కాకినాడ వెళ్ళినారు. కాకినాడ స్నేహితులు, ప్రముఖులు సామర్లకోట స్టేషనులో నెదుర్కొన్నారు. ఊరేగించెదమన్నారు. వలదని రామచంద్రరా వెంత వారించినను, నారాయణరా వెంత

ప్రార్థించినను కాకినాడ పురవాసులు రామచంద్రరాయని నూరేగింపుచు, నాయన బసకడకు గొనిపోయిరి. కుమారుని నిర్బంధము, నారాయణరావు ప్రయత్నము, జమీందారుగారి సాయము భీమరాజుగారు, దుర్గమాంబగారు విని యెంతయు నానందించినారు. కుమారునకు ఖయిదు తప్పినదని యంతవరకు భీమరాజుగారు గాని దుర్గమాంబగారు గాని యెరుగరు. వారు సంతోషబాష్పములు విడుచుచునే యుండిరి.

దుర్గమాంబగారు కొడుకు విదేశములపా లయ్యెనను విచారమున కృశించి పోయినది. నేడామెకు వేయి యేనుగులబలము వచ్చినట్లయినది. భీమరాజుగారు, సుబ్బారాయుడుగారు సంతోషమున కాలముపుచ్చిరి. రామచంద్రరావునకు గార్యము చేయుటకు పురోహితుని రప్పించి శుభముహూర్తము మరల నిశ్చయింపవలసి వచ్చెను.

జానకమ్మగారు దుర్గమాంబగారిని కౌగిలించుకొని, తన ఆనందాశ్రువులు వియ్యపురాలి యశ్రువులలో గలిపివేసినది.

రామచంద్రరావు భార్య పరీక్షలో విజయమందిన సంగతి తెలిసి యెంతయు సంతసించినాడు. శాంతి యేమిటో? ఇంకను కొన్ని వెఱ్ఱియాచారముల మనవారు వదలలేదు. అయినను దేనిలో ఏమర్థ మున్నదో? ఈలోన సూరీడును చూడరాదే! ఇక నెన్నిదినాలు ఆమెతో మాట్లాడుటకు? పదిహేను దినము లెట్లు? ఛీ! తానెంత వెఱ్ఱివాడైనాడు!

మరచినాడు, రంగూనులో, జపానులో, అమెరికాలో, స్నేహితులందరికి గమ్మలు వ్రాయవలె. తా నెప్పుడును వారికి వ్రాయుచునేయున్నాడు. ఇంటికి జేరినట్లు వ్రాయవలె. లియోనారాకు సూరీడుచే నింగ్లీషున నుత్తరము వ్రాయించవలెను.

౨౧
సంబంధ నిశ్చయము

జగన్మోహనరావును సూర్‌చంద్–ప్రేమచందు కంపెనీవారు తమ అయిదువందల రూపాయల పైచిల్లర డిక్రీ బాకీకి చెన్నపురి వచ్చినప్పు డరెస్టుచేయించినారు. జగన్మోహనుడు అంతకంతకు అప్పులలో బడిపోయినాడు. ప్రతిచోటున బాకీలే. తన వివాహమునకై యనేకచోట్ల నప్పుచేసెను. సూర్‌చందు కంపెనీ వారికి వేయిరూపాయలు బాకీపడి, అయిదువందలు తీర్చినాడు. తక్కిన అయిదు వందలు ఎన్ని సార్లడిగినను తీర్చలేకపోయినాడు. వారాతని జమీసంగతులు కనుగొని ముందుగా మేల్కొనుట మంచిదని, యాతనిపై సిటీ స్మాల్ కాజ్ కోర్టు (చిన్న న్యాయస్థానము) లో నభియోగము దెచ్చి డిక్రీపొందినారు. అప్పటికి జగన్మోహనుడు లెక్క చేయలేదు. తన్ను నిర్బంధించగనే జగన్మోహనుడు తెల్లబోయినాడు. అప్పుడాతడు కారుమీద స్పెన్సరుహోటలునుండి జార్జిటవునులో విశాఖపట్నమునుంచి వచ్చిన డయానా యుండు మేడకు బోవుచుండెను. సూర్ చంద్ కంపెనీ వారి యుద్యోగి యొక్క మోటారు స్పెన్సరుహోటలు బయట న్యాయస్థానోద్యోగితో సిద్ధముగానుండెను. శ్రీ జగన్మోహనరాయ బహద్దరు జమీందారుడు అద్దెకారు నెక్కిపోవుచుండ, దారిలో రౌండుటానా దగ్గర కారాగినది. వెనుకనే వచ్చుచున్న కారులో న్యాయస్థానోద్యోగివచ్చి నిర్బంధపు టుత్తరువు చూపించుటయు, జగన్మోహనరావు తెల్లబోయినాడు. అతనికి వెఱ్ఱికోపము వచ్చినది. సిగ్గుచే ప్రాణము చచ్చిపోయినది. పదిమందియు చుట్టును మూగినారు. ఆ సమయముననే నారాయణరావు ట్రిప్లికేనులో శ్యామసుందరితో మాట్లాడి యాలోచించుకొనుచు కారుమీద పోవుచున్నాడు. ఆ క్షణముననే పోలీసువారును ఇతరులును రెండుకారులు చుట్టు మూగియుండుటజూచి, ‘ఒక

జమీందారుని బాకీకి అరెస్టు చేశారు' అని ప్రజలనుకొనుమాటలు విని, కారాపు చేసి తా నా జమీందారుడు జగన్మోహనుడై యుండనోపునని గ్రహించి, చటుక్కున నక్కడికేగి యేమి సమాచారమని యడిగినాడు.

సంగతులన్నియు విశదముగా, నా యుద్యోగితో తాను మాట్లాడి అప్పు ధనమెంతయో తెలిసికొని తనకడ నా ధనము లేనందున హిందూస్థానీ బ్యాంకికి చెక్కు నిచ్చెదనన్నాడు. సూర్ చంద్ కంపెనీ మనుష్యుడు నారాయణరావు గారి చెక్కు పుచ్చుకొని రశీదిచ్చెను.

ఎవరిదారినవారు వెడలిపోయిరి. జగన్మోహనుడు నిస్తబ్ధుడై, యేమి ఈ రాక్షసు డిట్లు చేసినాడు! అతనికడనే ధనమున్నదా? తనదగ్గర లేదా? తన్నవమానము చేయ నిట్లు చేసినాడు. తన కర్మము కాకపోయిన తనకీ నిర్బంధమును, నారాయణరావువలన నింత యవమానమును రానేల? నేడే ఆ ధన మెచ్చటనేని ప్రోగుచేసి నారాయణరావునకు పంపి వేయవలెను. వీడు వట్టి పంది. పంది గనుకనే భార్యయొక్క ప్రేమ చూరగొనలేకపోయినాడు. తనకెన్నో పనులుండి తీరుబడి లేకపోయినది కాని, శారద తన కౌగిలింతలకై యెదురుచూచు చుండవలసినదేకద యీపాటికి. సరే, వీడు తన్న వమానపరచినందులకు, వీని భార్యను పూర్తిగా వశముచేసికొనవలయును. తనకు వివాహమై నప్పటినుండియు ఆ విషయమున శ్రద్ధకలిగినదికాదు. తన మేనత్తగారి యింటికి కీలుపాకు వెళ్ళి, ఎవరెవ రెచ్చట నున్నారో తెలిసికొనవలయును. ఈమధ్య మేనత్తయు నామె భర్తయు కూనూరునుండి వచ్చెదరని తన తల్లికి తన మేనత్త వ్రాసినదికదా. అవును. శారద ఇక్కడనే యున్నదన్నారు. సరే తాను విశాఖపట్టణము వెళ్ళక పూర్వము శారదను గూర్చి కనుగొనవలయును. నారాయణరావు, రాజారావు, సుబ్బారాయుడుగారు, జానకమ్మగారు కొత్తపేట వెళ్ళినారు. దారిపొడవున నారాయణరావు ఏదియో యాలోచించుచునేయుండెను. రామచంద్రరావు ఇంటికి వచ్చినాడు. ముద్దుచెల్లెలగు సూర్యకాంతము భర్తను గలసికొనును. ఇక చెన్నపురిలో తానొక్కడు గాపురముండవలయును. కొత్తపేట వెళ్ళినపిమ్మట తన మదరాసు కాపురము సంగతి ఎట్లు తేల్చుకొనుట. శారదాదేవి తన ప్రియురాలై ప్రణయదేవతయగు సూచనలు ఎండమావులా? ఆమె హృదయము కరిగినదను సూచనలు తోచుచున్నవి. తన భావిస్థితి యెట్టిది? ఈ బ్రతుకుదారి ప్రయాణము 'ఒంటరిగా ఉయ్యాల లూగుట' యగునా? పూజించుటకైన, ఆ పరిమళము వహించని తన బ్రతుకుపూవు పరమ ప్రభున కంకితమియుటకైన తగునా?

ఒకసారి మనసార శారద దనతో మాటలాడినదా? కవోష్ణమును, పరిమళపూరితము, నద్భుతానంద పూర్ణమును, సర్వసౌందర్యనిధియు నగు నా బాలికామూర్తి తన మెడచుట్టు బిగియార బాహువులు బిగించి, స్వప్నాల నీదులాడు ఆ వెడద నయనాలతో తన కన్నులలోనికి తనివోవ చొచ్చిచూచి, మాధురీ సర్వస్వములు నుడివోవు గులాబి మొగ్గలు, ఉభయసంధ్యారుణాలైన ఆ పెదవులతో తమివోవ, జన్మలు కరిగిపోవ ముద్దిడి తన దివ్యప్రణయినియై తన్ను చేరుట ఈ జన్మమునందున్నదో లేదో?

ఆనాడు జరిగిన మహాపరాభవము తన్ను దహించివైవనీక, తన్ను దుర్గమ హిమాలయ శీత శిఖరాలకు తరుమనీక, తన ప్రాణాల చిదిమివేయనీక, యేదియో యాశ ఈ నాటక మాడించుచున్నది. ఎంత కాలము దేవీ! జన్మరజ్జువునకు ఆఖరి సూత్రములు తెగువరకు నీ విటులుండుట?

ఇంటికి వచ్చునప్పటికి శ్యామసుందరి యుత్తరము వచ్చినది.

'అన్నా! గంటలకొలది తరచి, తరచి యాలోచించితిని. ఇందులో అపారమైన ఈశుని

కరుణజూచాను. నీవా ఈశుని వాక్కువు. నేను నీ యాజ్ఞకు బద్ధురాలను. నేను మీ స్నేహితుని ప్రేమించి ఎరుగను. నిన్ను మాత్రము నా ప్రియ సహోదరునిగా ప్రేమించి ఎరుగుదును. అయినను డాక్టరుగారు పూజ్యతములగు మహాపురుషులు. వారి సేవచేయుచు నా సర్వము వారి కర్పించుటకు నేను సిద్ధపడియున్నాను.

నీ ప్రియమగు చెల్లెలు,
శ్యామ'

నారాయణరా వానందపరవశుడైనాడు. ఇంక రాజారావును ఒప్పింపవలయును.

ఆ సాయంకాలము ఒంటిగా రాజారావును తోటలోనికి తీసికొని పోయినాడు. 'రాజా! నీకు కొన్ని గంటలు ఉపన్యాసము లీయాలోయ్! నిన్ను సమూలముగా కదల్చివేసే సంగతులు మాట్లాడలోయ్!'

రాజారావు భార్య పోయినప్పటినుండియు శుద్ధ వైరాగ్యమూర్తియైనాడు. ఏదియో ధ్యానము, విరాగమూనిన నతడు, ఈ జన్మము వృథా, ఈ జన్మము పెద్ద ఓటమి అన్న నిట్టూర్పు. డాక్టరున కుండవలసిన శుచిత్వము మాయమయిపోయినది. ఎందరు చుట్టములు కోరినను, ఎందరు స్నేహితులు ప్రార్థించినను మరల వివాహము చేసికొనుట కొప్పకొనలేదు. తల్లిదండ్రులు దీనముగ వేడినారు. వారు కాకినాడనుండి వారి స్వగ్రామమునకు, నటు వెనుక కుమారుని దగ్గరకు బోయినారు. ఛాందసులు, పూర్వకాలపు వారు.

రాజారావుకు పట్టుదల మెండు; పూర్వాచారము లేమియు గిట్టవు. తన కుమార్తెలిరువురు పుట్టినప్పుడు బారసాల చేసికొనలేదు. రెండవకొమార్తె కలిగినప్పుడు శాంతియున్నను జరుపలేదు. పురిటిళ్ళలోనికి, మాలవాని యిళ్ళకు వెళ్ళినను బట్టలు విడుచువాడుకాడు. అదియంతయు తల్లిదండ్రులు భరించలేక పోవువారు. అయినను లోక మెరిగినవారు, ఎన్నియో యాచారములు మారిపోవుట కనుగొన్నవారును గాన పుత్రుని ఇష్టమువచ్చినట్లు పోనిచ్చినారు.

పుత్రుడు వివాహము చేసికొనననని ఖండితముగ జెప్పుటచే వారు కుమారుని పట్టుదల నెరిగినవారు గాన కార్యములేదని మిన్నకుండిరి.

నారాయణరా విది యంతయు నెరుగును. ప్రపంచములో రాజారావు హృదయము మార్చవలెనన్న మార్చుటకు శక్తిగలవాడొక్క నారాయణరావే, నారాయణరావన్న రాజారావు ఆనందమున మునిగి పోవును. రాజారావన్న నారాయణరావు పరవశుడగును. ఇరువురు పరమేశ్వరుడన్న ప్రాణమువిడిచెదరు. పరమేశ్వరునకు నీ ఇరువురు కుంభక రేచకములు.

'రాజా! నువ్వు యోగివా?'

'కాను.'

'ఈ ప్రపంచము, ప్రపంచ వాసనను నంతయు వదలివేసి సన్యాసివి. కావలెనని కోరికయున్నదా?'

'అదే పరమావధిగా పెట్టుకొన్నాను.'

'ముసలితనములోనా?'

'ఎప్పుడు అంతరాత్మ ఆజ్ఞాపించితే అప్పుడు సిద్ధముగా ఉంటాను.'

'అంతవరకు?'

'రోగి నారాయణ సేవ చేస్తూయుంటాను.'

అరవిందాది మహాయోగులు, రాధాకృష్ణాది తత్త్వవేత్తలు ఏమి చెప్పారురా సన్యాసమును గూర్చి?' 'సంపూర్ణముగా త్రికరణశుద్ధిగా వైరాగ్యము కలిగినగాని సన్యాసము పుచ్చుకొనవద్దని.'

'సన్యాసము పుచ్చుకొనునంతవరకు ఏమి చేసినచో నీకు నీ అంతరాత్మ ఆజ్ఞ వినబడుతుంది?'

'పరిశుద్ధమగు కర్మయోగ మాచరించినప్పుడు.'

'కర్మయోగ మాచరించినప్పుడు నీ హృదయము పరిశుద్ధముగా నుండవలెనుగదా! నీవు చేయు వైద్యసేవలో, నీవు తిరుగు ప్రపంచములో నీ హృదయము పంకిలం కాకుండా ఉండగలవా?'

'చెప్పలేను.'

'చెప్పలేవు సరే, ధర్మమార్గాన నడిచే గృహస్థుకు మనస్సు చంచలమవడానికి సావకాశం ఉన్నదా? నువ్వు, నీ భార్య జీవించి ఉన్నంతకాలం సంసారం అనుభవించేవాడివికదా! నీ మనస్సు చలించ లేదా?'

'చలించలేదని చెప్పలేను. ఇంద్రియాలకు తృప్తికలిగేది, అందుకని.'

'తృప్తికలిగినా హృదయం చలించే వారున్నారు. చాలాబాగాఉంటూ ఎప్పుడో ఒకప్పుడు జీవితం పంకిలం చేసుకున్న వాళ్ళున్నారు. వారి మాట అటుండనిచ్చి జ్ఞానియై మంచిమార్గాన నడచి చివరకు సంపూర్ణ వైరాగ్యం పొందుదామని ఆశయం ఉన్నప్పుడు, అలాంటి ఆలోచనలు, ధైర్యమూ, పట్టుదలా, ఆశయంఉన్న బాలిక చెట్టబట్టాలని ఉన్నప్పుడు ఆ పురుషుడేల ఒప్పుకోకూడదు? అట్టివాళ్ళిద్దరూ కలిసి జీవిత ప్రయాణం ఏల సాగించకూడదు?'

'అబ్బాయీ, నీ ఉద్దేశం స్పష్టంగా చెప్పు, కవిత్వం మాట్లాడకు.'

'సరే, శ్యామసుందరీదేవీ, నువ్వూ వైద్యులు. ఆమె సద్గుణగరిష్ఠ. గాంధీ మహాత్ముని ఆశ్రమానికిబోయి యచ్చట మానవసేవ చేయుటకు బూనుకొంది. రోగినారాయణసేవే ఆమెకీ పరమావధి. బ్రహ్మచారిణియై కాలము గడుపదలచుకొంది. నువ్వు తెలిసినవాడవు. మహాత్ముల కావ్యా లెన్నేని చదివినవాడవు, నువ్వు వివాహం చేసుకోకుండా రోగినారాయణ సేవ చేయలేవు. పరిపక్వదశ వచ్చిన గాని సన్యాసం పుచ్చుకోలేవు. ప్రతి నిముషముచాటున, ప్రతి యింటి లోను స్త్రీ వాంఛ పొంచి నిన్ను కూలదోయడానికి ప్రయత్నం చేస్తూఉంటుంది కదా! శ్యామను నువ్వు వివాహం ఏల చేసుకోరాదు? ఇది నా కెన్నిదినాల నుండియో స్వప్నానందము ఇస్తూ ఉంది. మీ యిద్దరి వివాహము ఆంధ్రదేశానికి ఆశయం అవుతుంది.

మీ వాళ్ళు నీ కడ్డం. అదొక్కటే నువ్వు ఆలోచిస్తావని నాకు తెలుసురా! అది నువ్వు నీ ధైర్యంచేత దాటాలి.'

'నారాయణా! నువ్వు నన్ను ఆకాశంలో ఉండే ఒక పరమపురుషుడని అనుకుంటున్నావు. నేను నీకన్న నీచుడను. నా మనస్సు పాము మెలికలు తిరుగుతూనే ఉన్నది. నేను బ్రహ్మాచర్యం చేద్దామని పెట్టుకున్న దెందుకంటే, నేను నా భార్యతో మోహావేశాన సంచరించే వాణ్ణి, అదే ఆమెను కొనిపోయిందని నా నమ్మకం. అబ్బా! ...... (అతని కన్నుల నీరు తిరుగుచున్నది) నేను పాపిని. ఇక అలాంటి పాపాలు చేయకుండా ఉందామని ... కాని నాలో నేను ఆలోచించుకొని, నా అంతరాత్మకు ఇష్టం అయితే, తప్పక నా తల్లి దండ్రుల ఒప్పిస్తాను....... నాకూ నీ ఆలోచనే తట్టింది, చెన్నపట్నంలో శ్యామసుందరిని చూచినప్పుడు. ఆమె నా బిడ్డలకు అద్భుతమైన తల్లి కాగలదు. దివ్యురాలైన సూరమ్మ తప్పక సంతోషిస్తుంది. నన్ను ఆలోచించనీ. నీ ఆత్మ నాఆత్మ ఇంత సామ్యమైనవి కాబట్టి ఒక ఓ ఆలోచన తట్టినది నారాయణా.' అతని కన్నులలో నీరు ప్రవాహమయ్యెను. నారాయణుని కన్నులు చెమర్చినవి.

ఇరువురు శోకమును దాటిన మహదానందమున నా చీకట్లలో, నా చెట్ల నీడలలో దిక్కులలో కలసిపోయిరి.

౨౨
దుస్తంత్రము

రాజమహేంద్రవరము వచ్చినప్పటినుండియు వరదకామేశ్వరీ దేవికి మలేరియా జ్వరము పట్టుకొన్నది. రెండురోజులలో తగ్గిపోవునని జమీందారుగారు ఎంచినారు గాని, నాలుగురోజులైనను నూటమూడు, నూటనాలుగు డిగ్రీల జ్వరము వచ్చుచున్నది.

కొమార్తెలతో రావలసినదని ఇరువురల్లుళ్లకు తంతి వార్త లంపినారు.

ఆ రోజుననే నారాయణరావు, శారదయు రాజమహేంద్రవరం ప్రయాణమైనారు. విశ్వేశ్వరరావుగారును, శకుంతలయు వచ్చినారు.

నారాయణరా వత్తగారికడకేగి, కుశలప్రశ్న చేసి, యామె నాడిజూచి, జ్వరము నూటనాలుగుండునని యంచనా వేసికొనెను. కొయినామందు గుప్పుచున్నారు. నారింజ, బత్తాయిరసము, బార్లీజావ యిచ్చుచున్నారు.

ఆమె ఏలనో నీరసించిపోయినది. రాజమహేంద్రవరములో జమీందారు గారి కొక పూర్వకాలపు వైద్యుడున్నాడు. ఆయన ఎం. బి. సి. ఎమ్. పరీక్ష నెగ్గి, యుద్యోగము చేసి, యుపకార వేతనము పుచ్చుకొనుచు రాజమహేంద్రవరములో వైద్యము ప్రారంభముజేసెను. ప్రప్రథమమున మంచి వేద్యము నేర్చినవాడే, పేరు పొందినవాడే. నేడు వృద్ధసింహమువలె కోరలులేకున్నాడు. క్రొత్త గ్రంథము లేమియు చదువడు. క్రొత్త పత్రికల పారజూడడు. కొత్త మందుల జోలికి బోడు.'

నారాయణరా వాతని వైద్యమునకు బలమాపాదింప సంకల్పించి మామగారితో మఱిమఱియు దెల్పి రాజారావును రప్పించినాడు.

రాజారావు నాలుగురోజులు మలేరియాతో కుస్తీపట్టి అటెబ్రన్ ప్లాస్మో క్వినీన్ ఇచ్చి, నీలరక్తధమనిలోనుండి క్వినయిను మందు పొడిచి ఇచ్చినాడు మూడుసార్లు. బలమునకు

వరదకామేశ్వరీదేవికి తెలియకుండ కోడిగుడ్లలోని తెల్లసొన చిలకరించి బత్తాయిరసములో ద్రాక్షరసము పంచదార కలిపి యిప్పించినాడు. నాలుగురోజులయిన వెనుక జ్వరము తగ్గిపోయినది. రాజారావు తగు సలహాలు, మందులు చెప్పి యమలాపురము వెళ్ళిపోవ సిద్ధమై, జబ్బు నిమ్మదించిన రెండురోజులకు పథ్యము పెట్టించి వెళ్ళిపోయినాడు.

పరిచారిక లెందరున్నను, బీదచుట్టములు చాకిరి చేయువా రెందరున్నను, రేయింబవళ్ళు అత్తగారి మంచముకడ కూర్చుండి మందులిచ్చియు, నాహార మిచ్చియు జ్వరాంశాలు చూచి వ్రాసికొనియు, శుశ్రూష చేసినాడు నారాయణరావు. అతని చేయి తనతలపై పడినప్పడు వరదకామేశ్వరికి ప్రాణము లేచివచ్చి హాయిగ నిద్దురపట్టినది. అతనిమాట ఆమెకు జోలపాట అయినది. అత డెదురుగ కూర్చుండియుండ పథ్యము వంటపట్టినది.

జ్వరతీవ్రతలో ఒడలు తెలియక పడియున్నప్పుడు వెనుకటి నారాయణరావును తిట్టినది. జగన్మోహనుని పొగడినది. శారద నెత్తుకొనిపోయిన రాక్షసుడని వచించినది. నారాయణరావు నవ్వుకొనుచు ‘ఇదియా రహస్య’ మనుకొని యాశ్చర్యపూరితుడగుచు, నెమ్మదిగ యూడికొలోనులో గుడ్డలు తడిపి నుదుటిపై వేయువాడు.

ఆనాటి అల్లుడు వేఱు, ఈ నాటీ అల్లుడు వేఱా! అని కనులు విప్పి వరదకామేశ్వరి ఆశ్చర్యమున మునిగి యల్లునిజూచి యానందించినది. అతడు దగ్గరలేనపుడు జ్వరపు నిద్దురలో నుండి మెలకువ వచ్చినచో ‘నారాయణరావు!’ అని నెమ్మదిగ బిలుచునది.

ఒకనాడు జమీందారు గారు భార్యకడ కూర్చున్నారు. ఆమెకు నూట అయిదంశముల జ్వరము వచ్చినది. ఒడలు పేలిపోవుచున్నది. జమీందారుగారు హృదయమున భయముతో భార్య మంచముపై గూర్చుండినారు. రాజారావు ‘ఏమి ఫరవాలేదండీ’ యన్నాడు. మామగారికి ధైర్యము చెప్పి నారాయణరావు భోజనమునకు బోయినాడు.

ఒడలు తెలియక పరుండియున్న వరదకామేశ్వరీదేవి కనులు తెరచి, భర్తను జూచి, ‘అల్లుణ్ణి పిలవండి’ అన్నది. జమీందారుగారు చకితులై, కన్నుల జలము స్రవింప నవనతవదను డయ్యెను.

ఇదివరకు నారాయణరావును అల్లుడని చెప్పుకొన్నది లేదు. ఈ నాటికి, ఈమె బాగుపడి పదిమందిలో మరల నడచునా?

రాజారా వది గ్రహించి ‘అయ్యా! ఇంతకన్న ఇక ఎక్కువరాదు. ఇంతకూడా ఇక రానేరాదు. ఇంక వారంరోజులలోపల ఆమెకు పూర్ణముగా నెమ్మదిస్తుందండి. మలేరియాయే. పోనీ రక్తము పరీక్ష చేద్దామంటే, ఇప్పుడు క్వయినా యిచ్చుటవల్ల వీల్లేదు.’ ‘చెమటలు పట్టడం, క్వినయిను ఇంజెక్షను ఇవ్వగానే జ్వరము తగ్గడం, దాని మొగముమీద కనబడుతూనేఉంది. మనం లోపలకు, అటెబ్రేను, ప్లాస్మోక్వీను కాంపౌండు ఇస్తూనే ఉన్నాము’ అన్నాడు.

ఇంతలో నారాయణరావు వచ్చి అత్తగారికడ కూర్చుండెను. ఆమె మరల కన్నులుతెరచి అల్లునిపై చేయివైచి నిదురబోయినది. పదినిముషములకు జెమటలుపట్టి జ్వరము నెమ్మదిగా నూటరెంటికి దిగిపోయింది.

కేశవచంద్రుడు భయమున బెదురు చూపుతో దల్లికడకు వచ్చువాడు.

'బావా! అమ్మకి బాగా నెమ్మదిస్తుందిలే. నువ్వేమి అధైర్యపడకు. ఎనిమిదేళ్ళ కుర్రాడివి ధైర్యంగా ఉండాలి' అని నారాయణరావనగనే యాతడు 'నువ్వుంటే మా అమ్మకు తప్పకుండా నెమ్మదిస్తుందండి బావగారూ' అనుచూ ఆ బాలుడు శకుంతలా శారదలు వారి మేనత్తయు, ఇతర స్త్రీలు కూర్చున్న చోటికి వెళ్ళి 'చిన్నక్కా! చిన్నబావ లేకపోతే అమ్మకు జబ్బు నెమ్మదించదు సుమా. బావను వెళ్ళిపోవద్దని చెప్పు' అనెను. శారద సిగ్గుపడినది. శకుంతల 'నిజము నాన్నా! యని యాతని జేరదీసి కౌగిలించుకొని ముద్దిడుకొన్నది. ముద్దిడినచోట తుడుచుకొన్నాడాతడు.

శకుంతలయు, పిల్లలును నారాయణరావుకడ అతిచనువైనారు, 'చిన్న బాబయ్యగారు' అని ఒకటేపాట.

జర్వమునుండి తేరినపిదప జమిందారిణి నారాయణరావును తనకు బూర్తిగా బలము పట్టువరకు నుండుమని కోరినది. మరి నాలుగురోజులు నారాయణరా వచ్చుటనుండి అత్తగారు లేచి తిరుగుచున్నప్పు డందరి సెలవునంది కొత్తపేట వెళ్ళిపోయినాడు.

జ్వరములోనే జగన్మోహనరావు మేనత్తను జూచుటకు వచ్చినాడు. జ్వరమురోజులలో నప్పుడప్పుడు వచ్చి యామె క్షేమ మరయుచుండువాడు. అతడు శారదను తన మోహపాశములలో నిమిడ్చి బంధించుట యెట్లని యెత్తులు వేయుచుండెను. శారదతో నాతడన్ని సమాచారములు మాటలాడుచుండెను. తన మేనత్త జబ్బుసంగతి మాట్లాడుచు శారదకు ధైర్యము చెప్పుచుండెను. శకుంతలయు, జమీందారుగారును ఉదాసీనభావముతో నాతనితో మాట్లాడువారు. లోన హృదయము కోపదగ్ధమగుచుండ నారాయణరావుతో జగన్మోహనరావు 'మీ లెక్క కొద్దిరోజులలో బంపెదను లెండి' అని యనెను.

'అదేమిటండీ అన్నగారూ! మీరు ఏమి పంపవద్దు. ఏదో మీకా సమయాన దగ్గరలేకపోవడంచేత, తుంటరులు అల్లా చేశారు. దానిమాట తలపెట్టకండి సుమా! పంపిస్తే తిరగకొట్టుతానండోయి!' యని నవ్వినాడు.

'నే నన్నగారిని, ఆ దున్నపోతు నాకు తమ్ముడు! ఓహో! మంచి హాస్యము (జోక్)' అని గొణుగుకొనుచు జగన్మోహనుడు శారద యేదో నవల చదువుకొనుచు తనగదిలో గూర్చుండ, నచటికి వెళ్ళినాడు.

'ఏమిటి చదువుచున్నావు శారదా?' 'లే మిజరబ్లే.'

'ఏమిటీ!'

'ఈమధ్యే హ్యూగో కవి రచించిన నవలలు చదువుట ప్రారంభించాను.'

'హ్యూగోకేమిగాని, అలెగ్జాండరు డ్యూమాసు, వెల్సు నావెల్సు చదివినవా?'

'డ్యూమాసు మాంటిక్రిష్టో చదివాను.'

అక్కడున్న నవలల నన్నియు నాతడు పరికించి చూచినాడు. అన్నియు మంచిరకమువి. బంగారు బైండు, మొరాకో తోలు, చక్కని కాగితములుగలిగి 'శారదకు – నారాయణరావు' అని వ్రాసియున్న గ్రంథములే.

ఏమిటి, నారాయణరావుకు టేస్టుగూడా ఉన్నది! అచ్చా! ఈ యపహాస్యమంతకన్న

నంతకన్న నెక్కువగుచున్నదే అని యాత డనుకొనెను.

నారాయణరావు వెళ్ళినవెనుక, జగన్మోహనుడు శారదహృదయము సంపూర్ణముగ లాగివేయ ప్రయత్నములు చేసెను. తంతిమీద నిరువదిరూకల ఖరీదుగల ఒమారుఖయ్యాం గ్రంథము తెప్పించి బహుమతియిచ్చెను. ఆమెతో నవలల గురించి, ఇంగ్లీషు కవిత్వమును గూర్చి చర్చ ప్రారంభించెను. ఇప్పు డింగ్లీషుభాషలో వెలువడు కవిత్వమే నిజమయిన కవిత్వము అని యొక గ్రంథమును చూపెను.

అందు స్త్రీ పురుష సంబంధ క్రియలన్నియు రహస్యములేక వర్ణింపబడి యున్నవి. శారద ఆశ్చర్యపడి ఇది నాకు వలదని తిరిగి ఇచ్చివేసినది. ఎంతయో అసహ్యించుకొన్నది.

వారమురోజులు శారదను బొగడినాడు. మెచ్చుకొన్నాడు. నీవు ఇంగ్లీషు భాషలో కవిత్వము వ్రాయుమన్నాడు. సంగీతము పాడుమన్నాడు. 'సరియైన ఉన్నత కుటుంబములవారు గాని సంగీత తత్వం గ్రహించలేరు శారదా. కంసాలి నగలు చేస్తాడు. ధరించేవాళ్ళం మనం. ఆడవాళ్ళు ఎవరైనా నేర్చుకోవచ్చు. మొగవాళ్ళలో తక్కువజాతి వాళ్ళు నేర్చుకోవాలి అంతే' అని యాతడన్నాడు.

శారద కొంచెము విసుగుపడినది.

వారిద్దరు వివిధవిషయములు చర్చించినారు. సంగీతము, చదువు, ఆంధ్రవిశ్వవిద్యాలయం; ఆ చర్చలలో నొకసారి జమీందారుగారు, విశ్వేశ్వరరావుగారుకూడ పాల్గొన్నారు.

జమీం: ఏది ఎట్లయితే ఏం, బెజవాడ వదలి విశాఖపట్టణం వెళుతోంది.

విశ్వేశ్వరరావు: తెలుగుదేశానికి ఎంతో దూరాన పెడితే ఎలాగండి? కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురం వాళ్లూ మా నెల్లూరి వాళ్లూ గోల.

జగ: విశాఖపట్టణం సముద్రతీరం, కొండలు ఉన్నాయి. విశాఖపట్టణం ముందు ముందు ఆంధ్రదేశానికి రాజధాని అవుతుంది. రేవు కట్టుట మొదలు పెట్టారు. అల్లాంటిచోట ఉండగూడదా ఏమిటి? విశ్వే: ఒక మారుమూలకు ఎల్లా వెడ్తారు?

జమీం: ఇప్పుడేం చేయగలము? మా రాజమండ్రి వాళ్ళు కొంచెం తగలేశారు. కాని చాలా బాగా వృద్ధిఅవుతోంది ఆంధ్ర విశ్వవిద్యాలయం.

మేనత్తకు జ్వరము నెమ్మదించిన పదిరోజులకు జగన్మోహనరావునకు వీలయిన కాలము దొరికినది. విశ్వేశ్వరరావుగారు, జమీందారు రెండురోజులై వెళ్ళిపోయినారు. శకుంతలకు నీరాడు ప్రొద్దులు వచ్చుచున్నవి.

శారద జగన్మోహనునితో జనవుగా దిరుగుచున్నది. చనవుగ మాట్లాడుచున్నది. ఆ సమయములో ఆమెకు హుషారు పుట్టించి, ఆమెను కౌగిలించుకొని ముద్దిడుకొనవలయును. మోమోటముచే, దనకున్న చనువుచే, ప్రథమమున నామె కొంత యడ్డము పెట్టినను తన మోహమున నామె కరిగిపోవలయును.

ఆహా! ఏమి యీ బాల యందము! నవమోహనాంగి. ఇంత అందకత్తె యైనదే! ఈ యందానికి సాటియే లేదు. ఆమె యవయవములన్నియు నేదోషము లేక గ్రీకు దేవత

వీనసువలె నున్నవి. ఈమెతో మోహానందపు లోతు నెరుంగని నాడు తన జన్మ వృథా!

ఆ సాయంకాలము శారదతో దాను భోజనమునకు ముందులేచి, తక్కిన యందరు భోజనము చేయుచున్నప్పుడే, మేడపై శారద గదిలో ... తాను పరిపూర్ణమగు సంతోషము ననుభవింపవలె.

ఆ రోజు జగన్మోహనుడు తనకున్న తెలివినంతయు జూపెను. హార్మోనియముపై ఇంగ్లీషు పాటల వాయించుచు పాటల బాడెను. నాట్యమాడుట చూపెను. శారద సమ్మోహనాస్త్రపీడితయైనట్లు, సర్పమునుజూచి చేష్టలుడిగిన మండూకమువలెని స్తబ్ధయై మెలంగినది. సాయంకాల మేడుగంటలకు నారాయణుడు కారులోనుండి దిగినాడు.

౨౩
చెంపపెట్టు

నారాయణరా వత్తవారింటినుండి వచ్చిన వెనుక నమలాపురం వెళ్ళి రాజారావును గలిసికొన్నాడు.

నారాయణా! నేనెంతో యాలోచించితిని. తల్లిదండ్రుల అయిష్టతకు లెక్కచేయను. పూర్ణముగ నాలో వాంఛ జనించినదేమోయని క్రుంగిపోవుచున్నానోయి!

'ఓయీ, వెఱ్ఱివాడా! వాంఛా? మన యీ అల్పజీవితములో సరియైన మార్గాన్ని నడచినట్లయితే వాంఛే ఉన్నతమైంది అవుతుంది. నీ భార్యకానున్న యామెను వాంఛించుట ఎలాటితప్పు? సరే యిష్టపడ్డావు. నీకు ప్రేమసంతోషం మాటలచేగాక చేతలచే చూపిస్తే సిగ్గు, అయినా నిన్ను కౌగిలించుకొంటున్నా!' యనెను. నారాయణరావు హృదయం వేయిపాలసముద్రముల మునిగినట్లయినది. తత్ క్షణమే యాతడు శ్యామసుందరీదేవికి బెద్దయుత్తరము వ్రాసినాడు. వా రిరువురు రాజారావు తల్లిదండ్రుల నొప్పించు మార్గ మాలోచించుకొనిరి. వేదోక్తప్రకారము వివాహము సలుపుట యుత్తమ మనుకొన్నారు. చెన్నపురిలో శ్యామసుందరీదేవి గారి కుటుంబమును నారాయణుని యింటిలో బెట్టి యచ్చట వివాహము సేయుట లెస్స యని నిర్ధారణ జేసికొన్నారు. కొన్నిదినము లాగి అనేక విధముల వాదనలు చేసి, అనునయించి రాజారావు తల్లిదండ్రులను, రాజారావు శ్యామసుందరీదేవుల వివాహానికి ఒప్పించినాడు నారాయణరావు.

నారాయణరావునకు దన లాయరువృత్తి యేమియు నచ్చలేదు. మొదటినుండియు నాతడం దేమాత్రము నిష్టములేకయే చేరినాడు. నేడు తండ్రి 'బాబూ! ఈ సంపాదనంతా ఎవరు తింటారు? నేను అవధ్యుడనైనాను. ఇంటి దగ్గర ఎవ్వరూ లేరు. నువ్వువచ్చి యిచ్చట ఉండవలసినదనిన్నీ, నీ చిత్తం వచ్చినట్లు జాగ్రత్తగా సంచరించవలసినదనిన్నీ నాకోరిక. పెద్దవాడు దగ్గరే ఉంటాడు. నేనింక కృష్ణా రామా అంటూ కాలక్షేపం చేస్తాను. పూర్తిగా వానప్రస్థుణ్ణేకద! మన దక్షిణపు తోటలో ఉన్న యింటిలో నీ తల్లీ, నేను తపస్సు చేసుకుంటూ ఉంటాము. బ్రతికి ఉన్నంతవరకూ నీకూ, అన్నయ్యకూ భగవంతుడు నాకు శక్తి యిచ్చినంతవరకు సహాయం చేస్తాను' అన్నాడు.

రామచంద్రరావు, సూరీడు పరమప్రణయములో ఆకాశపథాల విహరింపనున్నారు. తా నా చెన్నపురి నుండుట యెందులకు?

కొత్తపేటలో నొక విద్యాశ్రమము పెట్టినచో? తండ్రి దక్షిణపు తోటలో వానప్రస్తుడై

యుండెదనన్నాడు. తమకు వచ్చు రాబడిలో నెలకు నాలుగువందలిచ్చుట సులభము. తండ్రిగారి, అన్నగారి అనుమతి తప్పక లభించును.

బ్యాంకిలోనున్న నాలుగులక్షలలో, నేబది వేల రూకలు ఆశ్రమమునకని ఇచ్చి. అది రిజిష్టరు చేయించి, యందువలన వచ్చు నాదాయమున ఏల నా యాశ్రమము వృద్ధినొందింపరాదు? తండ్రిగారు సకలకళాసంపన్నులు, భాషా కోవిదులు. ఆయన ముఖ్యాచార్యులుగా నుందురు గాక.

అనుకొనుట తడవుగా నారాయణరావు రాజారావునకు, బరమేశ్వరమూర్తికి, శ్యామసుందరీ దేవికి, లక్ష్మీపతికి తంతుల నిచ్చెను. పరమేశ్వరమూర్తి భార్యతో, శ్యామసుందరీదేవితో మరునాడు భోజనము వేళకువచ్చెను. ఆ సాయంకాలము లక్ష్మీపతియు, రాజారావును కొత్త పేట వచ్చిరి.

రాజారావు 'ఏమి రా నీవల్ల నా పనికి భంగము వస్తూఉంది' అని అన్నాడు.

'ఓయి అబ్బాయి, నీపనికి పూర్తిగా అడ్డువచ్చేపని చేస్తూఉన్నాను కాసుకో. నేను ఇక్కడ మహా విద్యాదానం ఇచ్చే ఆశ్రమం పెట్టదలచుకొన్నాను. పరమాత్మారాధన, దేశారాధనముఖ్యాశయములు, పురుషోత్తమునిలో ఐక్యమందు ఉత్కృష్ట కర్మమార్గము మనము అనుసరిస్తాముగాక. నేను వృత్తి మానేస్తున్నాను. రాజారావు, శ్యామసుందరి, పరమేశ్వరమూర్తి, లక్ష్మీపతి, నేను ఆ ఆశ్రమంలో ఆచార్యులం. నాకు మనదేశంలో పూర్వకాలంనుంచీ వస్తూఉన్న ఆయుర్వేద వైద్యంలో మందులన్నీ పరీక్షించి, దానిలోని గుణ గణాల్ని నిర్ధారణ చేసే పని చేద్దామని యున్నది.

'ఆశ్రమానికి సంబంధించిన వ్యాపారాలన్నీ లక్ష్మీపతి చూస్తూఉంటాడు గాక. పరమేశ్వరుడే కవి, చిత్రకారుడు. ఇంకో కవిని, పండితుణ్ణి ఎవరినన్నా పట్టుకువద్దాము. నేను సంగీతము చెప్తాను. ఇంకో సంగీతపాఠకుణ్ణి తీసుకొనివస్తా. నాట్యం చెప్పే ప్రతిభావంతులైన ఆచార్యులను వెదకుదాం.

'మా నాన్నగారు సర్వవిద్యాదక్షులు. పారలౌకిక విషయాలయందు మన కందరికీ గురువు అవుతారు గాక! మీ అభిప్రాయాలు ఏమిటో చెప్పండి.'

అందరు చాల సంతోషించిరి. ఆశ్రమాన్ని గూర్చి కష్టనిష్ఠురము లాలోచించిరి.

ఇంతలో స్నేహితులతో రాజారావు శ్యామసుందరీదేవుల వివాహపు సంగతులు నారాయణరావు చెప్పినాడు. లక్ష్మీపతియు, పరమేశ్వరుడును సంతోషస్వాంతులై రాజారావును, శ్యామసుందరిని అభినందించిరి.

శ్యామసుందరీదేవి చిరుసిగ్గున తలవాల్చుకున్నది. పరమేశ్వరు డప్పుడు మంగళగీతముపాడి వారిపై పూవులు చల్లినాడు. వారందరు సారాయణరావుతో నింటికి పోయినారు.

శ్యామసుందరీదేవి కొత్తపేటలో కొలదిరోజులుండి, తర్వాత ప్రేమపూర్వకముగ సూరీడును కౌగిలించుకొని, 'నీవు భర్తను గలియు శుభముహూర్తాన నేనుండుటకు వీలులేదు, చెల్లీ' యన్నది.

అందరికడ సెలవుతీసికొని శ్యామసుందరి చెన్నపట్నము ప్రయాణమైనది.

పరమేశ్వరుడు, నారాయణరావు, రాజారావు, లక్ష్మీపతియు, శ్యామసుందరిని సాగనంపుటకు రాజమహేంద్రవరము వెళ్ళిరి. నారాయణరావు అత్తవారింటికి వెళ్ళి అత్తగారి ఆరోగ్యము సంగతి కనుగొనివచ్చెదనని చెప్పి యచ్చటకు బోయెను. తక్కిన వారందరు భోజనమునకు లక్ష్మీపతి గారియింటికి బోయిరి.

నారాయణరావు వచ్చుటయు జగన్మోహనునకు ఆపరానికోపము వచ్చినది. శారద తనతో భోజనము చేయుటకు వీలుండదు. శారద, జగన్మోహనుడును వెండియాకులలో ఒకేసారి భోజనమునకు గూర్చుండిరి. భర్తవచ్చినాడని విని శారద చిరునవ్వున లేచి మందహాసమున మొగమంతయు వెలిగిపోవ తన గదిలోనికి బోయినది.

అత్తగారు అల్లుడు వచ్చినాడను సంతోషమున, అల్లుని శారదకు వడ్డించినచోట గూర్చుండ నేర్పాటు చేసినది.

బ్రాహ్మణు డందిచ్చిన వేడినీటిచే స్నానమాచరించుచుండ శారద తువాలీయ నారాయణుని కడకు వచ్చినది. అతడా తువా లందిపుచ్చుకొనుచు, 'శారదా, భోజనమైనదా?' యని ప్రశ్నించినాడు. అట్లు ప్రశ్నించుట కాతనికి సిగ్గుపొడమినది. అత్యవసరమగు పనియున్న గాని శారద నాత డిదివరకు ప్రశ్నింపలేదు.

ఏదియో పరమానందము శారదను ముంచివేసినది. ఆ ఆనందమునకు కారణము భర్తరాకయని యామె గ్రహించినది. ఏమికోర్కె తోచినదో భర్తకడకు తువాలు పట్టుకొని పరతెంచినది. గొంతుకను హృదయము చిందరవందరచేయ,

'లేదు. మీతో కూర్చుండవచ్చునా?' యని జవాబిచ్చినది.

ఈ బాలిక శారదయేనా!

'తప్పక. మన యిద్దరికి వేరే వడ్డించే యేర్పాటుచేయి. శ్యామసుందరి వచ్చి వెళ్లిపోవుచున్నది. రాజారావుకూ, ఆమెకూ సంబంధం నిశ్చయంచేశాము. ఆమెను అభినందించడానికి వస్తావా భోజనాలైనాక, రైలుకు సాగనంపనూ వచ్చును?'

'శ్యామవదినకు పెళ్ళా! డాక్టరన్నగార్ని పెళ్ళి చేసుకుంటున్నదా? చాలాబాగుంది. దబ్బున భోజనంచేసి వెళ్ళి శ్యామవదినను కౌగిలించుకోవాలి.'

శారద లోనికి రెండంగలు వేసినది. ఆమె మోము ప్రఫుల్లమైపోయినది. నారాయణుడు దివ్యహాసము వెలుగ అక్కడకు నవ్వుచు వచ్చి శకుంతలందిచ్చు పట్టుబట్టను కైకొనినాడు.

'ఏమండీ మరదిగారూ! కొత్తపేటలో అందరూ క్షేమంగా ఉన్నారా?'

'ఉన్నారండీ! శారదకూ, నాకూ వేరే వడ్డించేఏర్పాటు చేయండి.'

ఇదేమిటి! చెల్లెలినిగూర్చి ఏ సందర్భముననను తనమరది ఇట్లు మాట్లాడుట తానెరుంగదు. శారదయు భర్తయన అంత అనురాగయుక్తయని యామె కెన్నడును దోచలేదు. కాని కుమారస్వామివలె నున్న ఈ ఉత్కృష్ట హృదయుని ప్రేమించని మానవుడుండగలడా? ఈయనవంటి వాడు భర్తయైనచో యే యమ అతని పాదములు కొలువక ఒక్క నిమేషము ఉండగలుగును?

శారదకు, నారాయణరావునకు వేరుగా నింకొక చోట వడ్డించినారు. శారదను సిగ్గును, కాంక్షయు ఒక్కసారే ముంచివేసినవి. తన భర్తకంచమున పెండ్లిలోనైన దాను తినలేదు. ఆయన ఎంగిలియే తా నెరుగదు. ఆయనతో గలసి ఒకేకంచాన భుజింప నామెకు గాఢవాంఛ కలిగినది. అది గ్రహించినాడో యనినట్లు నారాయణరావు ప్రాణము లుగ్గబట్టి, తన కెక్కువయినవని మామిడిపండుముక్కలు రెండు తన కంచముకడనున్న వెండి బాదము ఆకులలో నొక దానినుండి తీసి యామె వెండియాకులో వేసినాడు. ఆమె అతనివంక సాభిప్రాయియై చిరునవ్వు నవ్వుచు చూచి ఆ ముక్కలను మనసులో కళ్ళకద్దుకొని భుజించినది.

భోజనము లైనవి. శారద నిముషములో చక్కని వేషము వేసికొనినది. కారులో భర్తప్రక్కనే యధివసించి, ఏదియేని వ్యాజంబున నాతని నంటుచు గుండె దడదడలాడ ఆనందలహరీస్నాతయై తేలికొనిపోవుచున్నది. 'శ్యామవదిన ఎప్పుడువచ్చింది?'

'మొన్న కొత్తపేటవచ్చింది. అక్కడే సంబంధం నిశ్చయం చేశాము. సూరీడు గంతులు వేసింది. నువ్వు బి. ఏ. లో, ఆమె ఎఫ్. ఏ. లో ఒకేసారి చేరాలి శారదా!'

శారదను శ్యామసుందరి కౌగిలించుకొనినది. నారాయణుని చెల్లెలికడకుపోయి 'వదినగారూ, మాయింటికి ఎప్పుడూ రారేమండి' యని అడిగినది.

'నువ్వు మాయింటికి యింతవరకు వచ్చావా వదినా? దొంగమ్మాయివి.'

'రేపటినుంచీ రోజూ వస్తూఉంటానండీ.'

రెండుకార్లమీద అందరును బయలుదేరి రాజమహేంద్రవరం స్టేషనుకుబోయిరి.

'రాజారావు తాను కూడా చెన్నపట్నం వెళ్ళకూడదురా నారాయుడు? దగ్గిర ఉండి రాబోయే మరదళ్లను, అత్తగారిని, బావమరదినీ వాళ్ళనూ తీసుకు రావచ్చుగా' అన్నాడు పరమేశ్వరుడు.

'ఫస్టురా! పరం' అని నారాయణుడు.

'చాలా బాగుంది' లక్ష్మీపతి.

అందరును ఎంతయో మంచిదనిరి.

వారిద్దరికి రెండవతరగతి టిక్కెట్లు కొని జత సీటుల రెండవతరగతి పెట్టెలో నెక్కించినారు. శ్యామసుందరి శారదను హృదయాని కద్దుకొని 'తల్లీ, నీ భర్త భగవంతుని అనుగుచెలికాడు. దివ్యుడు. నీ అదృష్టం తల్లీ! ఆయన్ని సర్వవిధాలా పూజచేయి' అని యామె చెవిలో చెప్పి, శారదను చెక్కిళ్ళపై ముద్దులు గొనెను. శారద అప్రయత్నముగ శ్యామను మరల కౌగిలించి 'వదినా, నీభర్తా దివ్యుడేసుమా! నా దగ్గరకు వస్తున్నావు. ఎంతో సంతోషంగా ఉంది, త్వరగా రా! అందర్నీ అడిగాను.'

రైలు కదలినది. నారాయణుడు, పరమేశ్వరుడు, శారదయు జమీందారుని ఇంటికి వచ్చినారు. రెండవకారులో లక్ష్మీపతి తన ఇంటికి బోయినాడు. జగన్మోహనునకు మతిలేదు. శారద చేతికి చిక్కినటులే చిక్కి ఇంతలో నా పరమ చండాలుడు వచ్చుటవలన జారిపోయినది. ఆ పశువునకు రసగ్రహణశక్తి యెక్కడున్నది? అతనికి ఆవేశ

మెక్కువయైనది. రెండు మెతుకులు నోటిలో యెటులనో వేసికొని ఈవలకు వచ్చినాడు. అతని యొడలు వేడెక్కియున్నది. అతని తమస్సు సర్వాంగాలను సంపూర్ణముగ ఆవహించినది. అతనికి శారదాదేవి మోము, జవ్వనము, సౌందర్యముమాత్రమే ఆ చీకటిలో నుండి తళుక్కుమని మెఱయుచున్నవి.

ఇంతలో శారదయు, నారాయణరావును, పరమేశ్వరుడును కారునుండి దిగి లోనికి విచ్చేసిరి. భర్తను వెన్నంటివచ్చు శారదను చూచి జగన్మోహనుడు రౌద్రముచే కంపించిపోయినాడు.

శారద తిన్నగా లోనికిబోయి కాలిజోడులు విడిచి వంటింటిలో భోజ నముచేయు తండ్రిగారికడ కూర్చున్నది. ఆమెకు జగన్మోహనుని జూడగనే భయమువేసినది. తనదగ్గరకు జేరు పూజ్యపురుషుడగు భర్త నాతడు నెడముగా తరిమివేయడుగదా? ఆమె కుంచించుకొనిపోయి తండ్రికడనే ఒక పీటపై చతికిలపడియెను.

జమీందారుడు: (భార్యను జూచుచు) ఇందాక కాకినాడలో ఇద్దరు స్నేహితులు ఏవోసంగతులు నీ మేనల్లుణ్ణిగురించి చెప్పారు, ఎవరో కంపెనీ వారు ఇతన్ని బాకీకోసం అరెస్టు చేశారుట. ఆ సమయంలో నీ చిన్నల్లుడు బాకీడబ్బు ఇచ్చి నీ మేనల్లుణ్ణి వదిలించాట్ట!

'ఎప్పుడండీ?'

'మొన్న మనం వచ్చేటప్పుడే. ఆ రోజు మనం అక్కడే ఉన్నాము సుమా! నారాయణరావు అప్పటికీ ఇప్పటికీ ఎవరితోను చెప్పలేదు. ఏమి గొప్ప హృదయం అతనిది!'

'మా మోహనుడు ఇలాతయారయ్యాడేమిటి! అతిదుష్ట సావాసము చేస్తాడు.'

శారద ఈ మాటలన్నియు ఆశ్చర్యమునొందుచు విన్నది. భర్తను దలచుకొనుటయు నామె కన్నులు తళుక్కున కాంతిమంతములైనవి. ఆయనకు తీరని అవమాన మామె తెచ్చిపెట్టినది. ఎట్లు తాను ఆయనకు గల్పించిన బాధను నివారింప చేయగలదు? తన పాపానికి నివృత్తి ఉన్నదా?

భర్తను గురించిన యాలోచనలు తీపులై మధుర వేదనాకారణములై, ఆనందపూర్ణములై విషాదమిశ్రిత సంతోషయుతములై హృదయమును ఇట్టిటు ఊపివేయుచుండ పులకరించు హృదయముతో శారద తనగదిలోనికి బోవుచు మేడమెట్లకడ కేగ బయలుదేరినది.

అచ్చట పిల్లివలె, ఘూకమువలె, రాక్షసునివలె జగన్మోహనుడు పొంచియున్నాడు. లోని మేడమెట్లుండినహాలులోని విద్యుద్దీపములు ఆర్పినాడు. కాని పక్కహాలులోని దీపాల వెలుగుమాత్రమున్నది. అతిడక్కడనే పొంచియున్నాడు.

అత్తరువులతో ఆతడు ఘుమఘుమ లాడిపోవుచున్నాడు. ఉల్లిపొర పట్టు లాల్చీ, ఉల్లిపొరపట్టుపంచె ధరించి అతడు సర్వసౌందర్యములు సేకరించిననని పొంచియున్నాడు.

అతడు గోడపైనున్న తెల్లని బల్లివలె నున్నాడు.

అతడు మూలను వలపన్నుకొని అనేకములైన కన్నులతో జూచుచు పొంచియున్న

సాలీడువలె నున్నాడు.

ఆ సమయమున ఆ దారిని మేడమీదికి శారద తక్క నింకొక్కరు పోరని యాత డెరుగును.

దీపము లారియున్న వేమి యని గాని, ఏదియో ఘుమఘుమ సువాసనలు వెదజల్లుచున్న వేమి యనిగాని, ఎవరో యస్పష్టముగ మెట్లప్రక్క నిలుచుండి యున్నారని గాని శారదకు దెలియదు. ఆమెకు హృదయములో నారాయణరావు, బయట మోహవ్యాధుడు మోహనుడు.

ఆమె మెట్లు సమీపించినది. ఆత డామెను జేరినాడు.

'శారదా? అని వినబడని ధ్వని.

'ఎవరు!' అని చకితయై శారద.

'నేను, ప్రణయేశ్వరీ! నీ బావను.'

అత డామె భుజముపై చేయి వేసినాడు. ఆమె మూర్తిని ముట్టుటతోడనే యాతని ఒళ్ళు వేడెక్కినది. అతడు మోహావేశియైనాడు. శారదను గట్టిగా అదుముకొని కౌగిలించుకొన్నాడు.

ఆమె భయాశ్చర్యములకు లోనై మాటలాడలేకపోయినది. ఆత డామె మూర్తిని మరియు దన ఒడలికి అదుముకొన్నాడు.

ఆమె వ్యాఘ్రముకడ చేష్టలుడిగిన లేడియైపోయినది. జగన్మోహనుడు ఆమె మోము వెనుకకువంచి ఆమెను ముద్దుపెట్టుకొనబోయినాడు. ఆ చీకటిలో ప్రేతముఖమున అతని కన్నులు చింతనిప్పులవలె కణకణలాడుచున్నవి. ఆమె అతని ముఖము తన ముఖముకడకు రానీక చేతులుపెట్టి వెనుకకు నెట్టినది.

అత డామెచేతులు కుడిచేత బలవంతముగ నొత్తిగించి ఆమె పెదవుల కడకు తన పెదవులు జేర్చబోయినాడు. ఆతని నిట్టూర్పులు తన మోముపై బ్రసరించుటయు శారద మహాశక్తియైనది. ఒడలు కంపింప నొక్క ఊపున యాతని కౌగిలి సడలించి, యాతని రొమ్ముపై ఎడమచేయి వైచి నెట్టి, కుడిచేత జగన్మోహనుని చెంపపై ఫెళ్ళున నొక్క పెట్టు పెట్టినది.

అతడు తలతిరుగ తూలి, తెల్లబోయి, మేడ మెట్లకట్టిలనాని తన్ను నిలుపుకొన్నాడు.

శారద చరచర మేడమెట్లెక్కి తన గదిలోనికిబోయి పందిరమంచముపై మేనువాల్చి క్రోధము సడల అవమానము తలచుకొని వెక్కి వెక్కి యేడ్చినది.

శారద చెంపపెట్టు కొట్టు సమయముననే యచ్చటకువచ్చిన మషాల్చీపోతిగాడు ఆదిచూచి 'ఏమి ఈ వెధవయ్యే నాతల్లి శారదపై చేయి వేయుటయే! మంచి పరాభవము చేసింది నాతల్లి' అని కోపముతోపోయి దాటిచిట్టితో చెప్పినాడు.

దాదిచిట్టి పోయి శకుంతలతో నిది వర్ణించినది. ఆమె రౌద్రమూర్తియై చెల్లెలికడకు బోయి 'తల్లీ వాడేమిచేశాడే' యని యడిగినది. శారద దుఃఖ మాపుకొని కోపమురా లేచి యక్కతో

జరిగినది చెప్పినది. శకుంతల క్రిందకు దిగి తల్లితో నంతయు జెప్పి, తల్లిరా చరచరనడచి, తన గదిలోనికిబోయి సోఫాపై నధివసించియుండి చెంప సవరించుకొను చున్న జగన్మోహనుని చూచి 'ఏమోయి! నీ సంగతి బాగుండలేదు. నువ్వు ఇంక మా ఎవరిఇండ్లకు రావద్దు. పొద్దున్నే మెయిలుకువెళ్ళు. మాతో ఎవరితోను చెప్పనక్కరలేదు!' అనియన్నది.

జగన్మోహనుడు అవమాన రోషాలతో చటుక్కున లేచి సామాను సర్దించుకొని, కారుపై తత్ క్షణమే స్టేషనుకు వెడలిపోయినాడు.

౨౮
ప్రేమమహాతరంగిణి

సూర్యకాంతమునకు శుభముహూర్తము నిర్ణయించిన శుభదినమువచ్చినది.

సుబ్బారాయుడు గారి చుట్టములందరు విచ్చేసిరి. దొడ్డమ్మపేట నుండి తటవర్తి వారి జ్ఞాతులందరు వచ్చినారు. జమీందారుగారి కుటుంబము యావన్మందియు నరుదెంచినారు. సుబ్బారాయుడుగారి యిల్లు, మేడయు కిటకిటలాడిపోయినది.

దక్షిణపుతోట బంగాళా జమీందారుగారి కుటుంబమున కేర్పరచినారు. పగలంతయు నిచ్చటయుండి వారు రాత్రి యచ్చట విశ్రాంతితీసికొందురట.

పగలు శాంతి జరిగినది. రాత్రి శుభముహూర్తము జరిగినది.

సూర్యకాంతము మోము దివ్యజ్యోత్స్నల వెలిగిపోయినది. రామచంద్రుడు అనిరుద్ధమూర్తియైనాడు.

వారి ప్రేమ దిశల ప్రసరించినది. సర్వరాగాల మాధుర్య మేచికొన్నది. ఆ దంపతుల పొదివికొని, తన గర్భాన దాచికొన్నది.

సూర్యకాంతము సంజ్ఞాదేవివలె సర్వరాగరంజితయై, సూర్యునివలె వెలుగు రామచంద్రుని ఆవరించినది.

శారదా హృదయము నవనీతమై కరిగినది.

సూర్యకాంతమును తేల్చిపోవు ఆనంద శైవలిని యామెను సుడిచుట్టినది.

ప్రేమచే నుదయమున గుమ్మడిపండావుదూడ, బొమ్మవలె ముద్దులు గులుకుచు, స్ఫటికశిలా శిల్పాకారమై, వెండిగంటలు నననన ధ్వనులీన గంతు లిడుచుండ నారాయణరావా దూడ నెత్తుకొని మూర్ధము పుణికినాడు. గంగిగోవగు గుమ్మడిపండావు నారాయణరావుకడకు వెట్టి ప్రేమతో గంతులిడుచువచ్చినది.

'గోవు మాలచ్చిమికి కోటిదండాలు' అనుకొనుచున్నాడు నారాయణరావు.

ఆ ఆవు ఉప్పొంగుచు నారాయణరావును సమీపించుచున్న యపుడు శారద చూచినది. భర్త నా ధవళనందిని పొడు చునన్న భయముతో 'అయ్యో!' అనుచు భర్తకు, నా ధేనువునకు మధ్య వెళ్ళినది. ఆ ఆవు పక్కకు తప్పుకొన్నను శారదకు తగులుటవలన యామె పడిపోయినది.

నారాయణరావు భయమున నా దూడ నచ్చట వదలి వెనుకకుతిరిగి పడిపోయి లేవబోవు భార్యను పూలమాలవలె నెత్తుకున్నాడు. సుడిగాలివలె యామె నదిమి వేసినాడు. 'ఏమి దెబ్బతగల లేదుగద?' యని భయపూరిత స్వరాన నాతడు ప్రశ్నించెను. భర్త కౌగిలింతలో పారవశ్యమందిన శారద కనులు మూతపడ హాయియను ఆనంద మధురిమమునకు మధురిమమైనది.

'శారదా! శారదా,' అతని మాట విహ్వాలస్వరపూరిత మైనది. అది శారదకు పంచమస్వరమైనది.

ఆమె నవ్వుచు కన్నులుతెరచి, అతని కౌగిలిలోనుండి సిగ్గువచ్చు వ్యంజనమున కదలి 'దెబ్బ తగలలేదండి' యని అస్పష్ట మధురవాక్కుల బలికినది.

నారాయణుడామె నట్లనే లోనికిగొంపోయి మంచాన పరుండబెట్టెను. చల్లాలు నారాయణరావుతో 'మిమ్ము ఆవుపొడుస్తోందనుకొని శారదమ్మగోరు అడ్డమెళ్ళారండి' యన్నది.

నారాయణరావు కనులు చెమర్చినవి. అతని కంఠమున దీపులు డగ్గుత్తికయైనవి.

సాయంకాలము నారాయణరావు తన గదిలోనికి బోయినాడు. ఆ గది యతి మనోహరముగ నలంకరింపబడియుండుట చూచి ఇది ఏమియని యక్కజబడినాడు. ఇంతలో శారదయు, సూర్యకాంతమును అక్కడకు వచ్చినారు.

సూర్యకాంతమును, శారదను జూచి నారాయణుడు వేరొండు మార్గమున నంతర్హితుడైనాడు.

ఆ యోషామణు లిరువు రాగది నింకను రమ్యముగ నలంకరించినారు. నారాయణరావు సముపార్జించిన చిత్రములను, శిల్పములను, గంధపు బొమ్మల నచ్చటచ్చట నుంచినారు. చక్కని తెరలమర్చినారు. బల్లలపై తమలపాకులూ, పోకలు మొదలైనవియు, ఉపాహారములను, ఫలములను అందం దమర్చినారు.

సుబ్బారాయుడుగారు శారదను భోజనములవేళ జూచినారు. నేడామె మోమింత పూర్ణానందవికసితమైనదేమి? తన గర్భశుక్తి ముక్తాఫలము, సంధి పరిగ్రాహి, తనకు పేరుదిద్దు నారాయణుని హృదయ మీనాడు గనుగొన్నది యీ బాల! బిడ్డలారా సుఖింపుడు. సుబ్బారాయుడుగారి దీర్ఘబాహువు మనఃపథమున నాశీర్వాదపూర్వకముగ నెత్తబడినది.

జమీందారు గారు తనయను జూచినాడు. ఆమెలోని ప్రేమవాహిని తళుక్కుమని యాతని హృదయాన జొచ్చినది. "శారదా! నా ముద్దు తల్లీ! నీకై దేశాల గాలించి సేకరించిన నాయకమణిని నీ తల ధరించుకో! అది అతి పవిత్రమైనది. అదిగో నారాయణరావు తేరిచూడరాకున్నా డు."

నారాయణరావు రాత్రి పదునొకండు గంటలు దాటినవెనుక తన పడక గది చేరినాడు. శారద మంచముపై దివ్యరూపయై నిదురబోవుచున్నది.

రెండవమంచము లేదు. ఆ గది ఆకాశపథ గామియగు సుందరతర విమానమువలె నున్నది.

తల్పముపై శారద శయనించియున్నది. గంగానదీప్రవాహముల తేలియాడు శ్వేతహంసివోలె ఆమె పవళించియుండ, దుకూలాంబర రేఖిఖామూర్తిని అలలై తేల్చుచున్నవి ఆమె దివ్య సౌందర్య తేజఃపుంజము. ఒక ప్రక్కకుతిరిగి తలక్రింద లలిత లవంగీ సుందరమగు బాహువు నుపధానమొనర్చి ఆమె మోహన భంగిమారూపమై యందు బరుండియున్నది.